# SPECIAL STUDY : SREENADHA (DT23)

# (M.A. TELUGU)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

# ANDHRA PRADESH

పాఠం - 1

# శ్రీనాథుడు - ప్రత్యేకాధ్యయనం

# శ్రీనాథుడు

**ముఖ్యాంశాలు:-**


1.0 లక్ష్యం

1.1 శ్రీనాథుని కాలము - రచనలు

1.2 శ్రీనాథ మహాకవిలోని యుగకర్త లక్షణాలు

1.3 శ్రీనాథునికి సంబంధమగు రెడ్డి రాజులు - వారికి అంకితమిచ్చిన గ్రంథములు

1.4 సారాంశము

1.5 ప్రశ్నలు

1.6 ఆధార గ్రంథాలు


## 1.0 లక్ష్యం:-

శ్రీనాథుని కాల నిర్ణయానికి తోడ్పడే అంశాలను విశదీకరించి, శ్రీనాథుని రచనలకు సంబంధించి సంపూర్ణ అవగాహన కలిగించడం, శ్రీనాథుడు యుగకర్త అని నిరూపించడం, శ్రీనాథుని రెడ్డి రాజులతో ఉన్న సంబంధ బాంధవ్యాలను, వారు అంకితం పుచ్చుకొన్న గ్రంథాలను తెలపడం అనే మూడు అంశాల్ని విశదీకరించడం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 1.1 శ్రీనాథుని కాలం - రచనలు:-

ఒక కవి కాల నిర్ణయం చేయడానికి ఉపకరించే అంశాలలో మూడింటికి ప్రాధాన్యముంది. మొదటిది చారిత్రకాంశాలు, రెండవది సాహిత్యాంశాలు, మూడవది ఆ కవికి సంబంధించిన జన శ్రుతులు. ఈ అంశాలతో శ్రీనాథ కవి కాల నిర్ణయం చేయడం సబబు.

**చారిత్రకాంశాలు:** చారిత్రకాంశాలలో శాసనాధారం ప్రధానమయినది. శ్రీనాథుడు కొండవీటి సామ్రాజ్యాధిపతి పెదకోమటి వేమారెడ్డి ఆస్థాన కవి. అతని కాలం క్రీ॥శ॥ 1402 - 1420. వేమారెడ్డి కొలువు కూటంలో విద్యాధికారిగా శాసనాలు వ్రాయడం, పర్యవేక్షించడం, పండితుల వైదుష్య పాటవం సమీక్షించడం, రాజపోషణలోని విద్యాలయాల బాగోగులను పట్టించుకోవడం చేసేవాడని తెలుస్తున్నది. క్రీ॥శ॥ 1402-1420 దాకా విద్యాధికారిగా 12 శాసనాలు ప్రకటించినట్లు ఆధారాలున్నాయి. వాదోపవాదములకు ఆస్కారమిచ్చే మరి రెండు శాసనాలను కూడా జత చేస్తే 14 శాసనాలవుతాయి. వీటిలో మొదటిది క్రీ॥శ॥ 1404 నాటి కల్వపాయల తామ్ర శాసనం. చివరిది క్రీ॥శ॥ 1418 నాటి రుద్రవరం తామ్ర శాసనం.

**సాహిత్యాంశాలు:** శ్రీనాథుడు బహు గ్రంథకర్త. తెలుగు కవులలో విస్తృతంగా దేశాటనం చేసిన మహాకవి. వివిధ రాజన్యులను మెప్పించి గౌరవాదులందుకొన్న పండిత కవి. బంధువులకు, రాజోద్యోగులకు కావ్యాలను అంకితమిచ్చినవాడు. ఆయా కావ్యాలలోని అవతారికాభాగంలోని పద్యాల వల్ల శ్రీనాథుని రచనలను చెప్పడానికి వీలుంది. ఈ రచనలలో మరుత్తరాట్చరిత్ర,

శాలివాహన సప్తశతి, పండితారాధ్ర చరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, భీమేశ్వర పురాణం, కాశీఖండం, శివరాత్రి మహాత్మ్యం, పలనాటి వీర చరిత్రలు శ్రీనాథుని రచనలే. అలాగే శ్రీనాథుని రచనలుగా లక్షణ గ్రంథాలలో ఉదాహరింపబడినవి ధనంజయ విజయం, నంద నందన చరిత్ర, వల్లభాభ్యుదయం, వివాదగ్రస్తమయిన మరో రచన క్రీడాభిరామం. ఈ గ్రంథాల రచనాకాలాన్ని పరిశీలించడం సమంజసం.

**మరుత్తరాట్చరిత్ర:** చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాడు రచించిన కృతి మరుత్తరాట్చరిత్ర. ఈ గ్రంథం అనుపలబ్దం. కృతిభర్త ఎవరో తెలియదు. 'చిన్నారి పొన్నారి అనడం' వల్ల బాల్యదశ కావచ్చు. ఆ వయసులో రాజాశ్రయం దుర్లభం. అందువల్ల శ్రీనాథుడు 'అనుగుందాత' కమలనాభులకు అంకితం ఇచ్చి వుండవచ్చు అని పరిశోధకుల ఊహ. ఈ కృతి రచనాకాలం క్రీ॥శ॥ 1372 ప్రాంతమని ఆచార్య కొర్లపాటి వారి అభిప్రాయం.

**శాలివాహన గాథా సప్తశతి:** నూనూగు మీసాల నూత్న యౌవనంలో నుడివిన రచన. ఈ గ్రంథం అనుపలబ్ధం. అయితే లక్షణ గ్రంథాలయిన సర్వ లక్షణసారం, ప్రబంధ మణిభూషణాలలో ఉదాహృతం 'నూనూగు మీసాల' అనడం వల్ల ఈ కృతి రచనా కాలం క్రీ॥శ॥ 1376 నాటిది కావచ్చు.

**పండితారాధ్య చరిత్ర:** ఈ గ్రంథం అనుపలబ్దం. ఇది పద్య ప్రబంధం కావచ్చు లేదా పద్యగద్యోపేతం కావచ్చు. పాల్కురికి సోమన పండితారాధ్య పఠన ప్రభావంతో శ్రీనాథుడు ఈ రచన చేసి వుండవచ్చు. ఈ గ్రంథ ప్రస్తావన శృంగార నైషధంలో కనిపిస్తుంది.

జగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నా యనుంగు పెద్దనకు ఁగృతుల్
నిగమార్థ సారసంగ్రహ
మగు నా యారాధ్య చరిత మాదిగ పెక్కుల్ 1.41

అనడం వల్ల కృతి భర్త 'మామిది ప్రెగడయ్య'. ఈ గ్రంథ రచనా కాలం క్రీ॥శ॥ 1382.

**హర విలాసం:** ఈ రచనకు అవచి తిప్పయ్య సెట్టి కృతి భర్త. అతడు శ్రీనాథుని చెలికాడు. పైగా ప్రోలయ వేమారెడ్డి కాలంలో మహావ్యాపారి. అతనికి కుమారగిరి రెడ్డితో కూడా అనుబంధముంది. 'కుమారగిర్యధీశ్వరుని వసంత వైభవము నాక్కడ నిర్వహించు మా తిరుమలనాథ సెట్టికిని' అనడం వల్ల ఈ కృతి రచనా కాలం క్రీ॥శ॥ 1400.

**ధనుంజయ విజయం:** ఈ రచన అనుపలబ్దం. దంతలూరి మూర్తి త్రయోపాఖ్యానంలో ప్రస్తావితం. గన్నభూపాలుడు శ్రీనాథ సుకవీంద్రుచే ధనంజయ విజయ సత్కావ్యమందినాడని ఈ గ్రంథంలో ప్రస్తావితం. ఈ కృతి రచనా కాలం క్రీ॥శ॥ 1412.

**నందనందన చరిత్ర:** ఈ గ్రంథం అనుపలబ్దం. కృతిభర్త పేరు తెలియదు. ఈ గ్రంథంలోని పద్యాలు ఆంధ్ర ప్రయోగ రత్నాకరంలో ఆనంద రంగరాట్ ఛందంలో ఉదాహృతం. శ్రీనాథుడు మైలారు రెడ్డిని కొనియాడడం వల్ల ఈ కృతి అతనికి అంకితం కావచ్చని కొర్లపాటి వారి అభిప్రాయం. ఈ ఊహ ఆధారంగా ఈ కృతి కాలం క్రీ॥శ॥ 1426.

**వల్లభాభ్యుదయం:** ఈ గ్రంథం అనుపలబ్దం. పెదపాటి జగన్నాథ కవి ప్రబంధ రత్నాకరంలో ఉదాహృత పద్యం - 'రజనీవధూకర్ణ' అనే చంద్ర వర్ణన ఆధారంగా, అదే వర్ణన శృంగార నైషధం, భీమేశ్వర పురాణాలలో ఉదాహృతం కావడం వల్లను ఈ కృతి తెలుగు రాయలకు అంకితం కావచ్చు అని పరిశోధకుల అభిప్రాయం. 'రంభగ్రూదె తెనుంగు రాయ రాహుత్తుండు' అణే వాక్యం కూడా పై వాదానికి బలం. ఈ కృతి రచన క్రీ॥శ॥ 1428 కావచ్చు.

**భీమేశ్వర పురాణం:** ఈ కృతి భర్త బెండపూడి అన్నయామాత్యుడు. ఈ కృతి రచనా కాలం క్రీ॥శ॥ 1430.

**కాశీ ఖండం:** 'ప్రాయమింతకు మిగులకై వ్రాలకుండ' రచించిన ప్రబంధం కాశీఖండం. ఇది అల్లాడ వీరభద్రారెడ్డికి అంకితం. రచనాకాలం క్రీ॥శ॥ 1433.

**శివరాత్రి మహాత్మ్యం:** ఈ కృతి శ్రీనాథునిదే. శ్రీ శైల భిక్షా వృత్తి మఠాధిపతి ముక్తి శాంత భిక్షావృత్తి ముఖ్య ఉద్యోగి ముమ్మడి శాంతయ్యకు అంకితం. ఇతనికి సంబంధించిన శాసనం క్రీ॥శ॥ 1448 నాటిది కనిపిస్తున్నది. అంతేగాక కాశీ ఖండం గుణనిధి కథలోని 'అరుణగభస్తి బింబం' యథాతథంగా శివరాత్రి మహాత్మ్యంలో కనిపిస్తుంది. ఈ కారణాల వల్ల శివరాత్రి మహాత్మ్యం క్రీ॥శ॥ 1445 కావచ్చు అని కొర్లపాటి వారి అభిప్రాయం.

**పలనాటి వీర చరిత్ర:** శ్రీనాథుని రచనగా ప్రసిద్ధికెక్కిన చరిత్ర, శ్రీనాథుడు నారి కురుపుతో బాధ పడుతూ దుఃఖ భారంతో ఈ కృతి చెప్పాడని కథ. చెన్నకేశవ స్వామి కలలో సాక్షాత్కరించగా పల్నాటి వీరుల కథ గానం చేయవలసిందిగా కోరగా శ్రీనాథుడు ఈ కృతి రచించినట్లు మరో కథ. అయితే కొందరు ఈ గ్రంథం శ్రీనాథుని కృతి కాదని భావిస్తారు. గ్రంథస్థ నిదర్శనం, రాజాస్థాన పరిచయం, నాట్యశాస్త్ర ఉల్లేఖనం, శైలీ శబ్ద ప్రయోగం, పూర్వ కవితల అనుకరణాలు అనుసరణలు, కవికి గల ఆంధ్ర దేశాభిమానం లాంటి కారణాల వల్ల ఈ కృతి శ్రీనాథునిదే అని కొర్లపాటి వారు నిర్ధారించారు. ఈ అంశాలనే జోడిస్తూ ఆచార్య తంగిరాల సుబ్బారావు శ్రీనాథుని తెలుగుతనం, శ్రీనాథుని తనం అని పల్నాటి వీర చరిత్ర. శ్రీనాథుని కర్తృత్వం వ్యాసంలో విశ్లేషించారు. ఈ కృతి రచనాకాలం క్రీ॥శ॥ 1446 కావచ్చు.

**క్రీడాభిరామం:** ఈ కృతి కర్తృత్వంలో వివాదాంశాలున్నాయి. గ్రంథం లోని అవతారిక, అశ్వాసాంతగద్యలు ఈ కృతి కర్త వల్లభరాయడని స్పష్టం చేస్తున్నది. కాని శ్రీనాథుని వీధి నాటకము అనే పుస్తకము ఆధారంగా వీరేశలింగం, చిలుకూరి వీరభద్రరావులు ఈ కృతి కర్త శ్రీనాథుడని భావించారు. అప్పకవి, కూచి నుంచి తిమ్మ కవి లాక్షణికులు శ్రీనాథుని పద్యాలుగా క్రీడాభిరామంలోనివి ఉదహరించడం వల్ల, క్రీడాభిరామ శైలి శ్రీనాథ శైలిని పోలి వుండడం వల్ల క్రీ॥శ॥ 1435 ప్రాంతంలో శ్రీనాథుడు వల్లభరాయని దర్శించి అతనికి రచనలో సాహాయపడి వుండవచ్చని కొందరి తలంపు.

**శ్రీనాథ కవి చాటువులు:** శ్రీనాథుడు చెప్పిన చాటువులు అసంఖ్యాకం. వాటిలో ఏవి శ్రీనాథునివో ఏవి కావో చిలుకూరి వారు వేటూరి వారు పరిశీలించారు.వీటిలో 4 చాటువులు శ్రీనాథుని కాల నిర్ణయానికి సాయపడేవి. 'పంపావిరూపక్ష' అనే సీస పద్యంలోని 'ప్రౌఢ దేవేంద్రరాయ భూపాలవరుని సమ్ముఖమున దయ చూడు ముమ్మ సుకవి' పద్యం,

ప్రౌఢ దేవరాయలకు పంపిన విన్నపంలోని

'నన్ను పిలిపింపు మాస్థాన సన్నిధికిని

లక్షణోపేంద్ర ప్రౌఢరాయ క్షితీంద్ర' పద్యం, సింగ భూపాలుని దర్శించడానికి వెళుతూ శారదాదేవిని ప్రార్థిస్తూ చెప్పిన 'దీనార టంకాల' పద్యం, అవసాన కాలంలో చెప్పిన 'కవిరాజు కంఠంబు', కాశికా విశ్వేశుగలసె పద్యాలు అన్నీ పరిశీలించగా శ్రీనాథుని కాలం క్రీ॥శ॥ 1360......1450గా నిర్ధారించవచ్చు.

## రచనలు - విశేషాంశాలు:

**మరుత్తరాట్చరిత్ర:** ఈ కథ ఐతరేయ బ్రాహ్మణం, భారతం, బ్రహ్మ, బ్రహ్మాండ, భాగవత, మత్స్య, మార్కండేయ పురాణాలలో ఉంది. అయితే ఏకాకృతిగా లేదు. కాని మార్కండేయ పురాణం ఆధారంగా శ్రీనాథుడు ఈ రచన చేసి వుండవచ్చని కొర్లపాటి వారి అభిప్రాయం. 'నవ మరుత్తు చరిత్ర' అని భీమేశ్వర పురాణంలోని ప్రస్తావన బట్టి స్వతంత్ర అనువాదం కావచ్చు. గ్రంథం అలభ్యం కావడం వల్ల ఇతర విశేషాలు తెలియవు.

**శాలివాహన సప్తశతి:** హాలుని గాథాసప్తశతికి తెనుగ సేత 'శాలివాహన సప్తశతి' ఈ గ్రంథం అలభ్యమయినా లక్షణ గ్రంథాలలో ఉదాహృతం. కొన్ని పద్యాలు

వారణాసేయఁదావి గొనవా, నవ వారిజమందుఁదేఁటి క్రొ
వ్వారుచునుంట నీ వెఱుఁగవా, ప్రియ వాతెఱగంటిఁగంటి కె
వ్వారికిఁగెంపు రాదె, తగవా మగవారల దూఱ, నీ విభుం
దారసి నీ నిజం బెఱుఁగు నంతకు నంతకు నోర్వు నెచ్చెలీ
భాగ్యవరులు మున్ను ఁబ్రాణేశ్వరునిఁజూచి
వదఁకు వారు నూర్పు విడుచు వారుఁ
బులక లెత్తు వారుఁ బోలంగ ననుఁబోటి
తన్ను మఱచునదియు ఁదడవ ఁగలదె

వేణికా భార మందుండు వెదురుటాకు
కలికి కోరడ యెబ్బంగి కలిగె చెపుమ
పలికి పలికించు కొనుటయె ప్రాభవంబొ
అత్త నీ వీఁపు వెలిమిడి యంటు టేమి

**పండితారాధ్య చరిత్ర:** ఈ గ్రంథం అనుపలబ్దం. పాల్కురికి సోమన ద్విపదలో వ్రాయగా శ్రీనాథుడు పద్య ప్రబంధము చేసినాడని పిడుపర్తి సోమనాథుడు తన పద్య బసవ పురాణంలో చెప్పాడు.

**శృంగార నైషధం:** శ్రీనాథుని వైదుష్యానికి పతాక రచన శృంగార నైషధం. విద్వదౌషధమయిన నైషధాన్ని ఆంధ్ర విద్వాంసులు మెచ్చుకొనే రీతిలో నిండు జవ్వనంలో సంతరించిన కృతి. కృతిపతి మామిడి సింగన ఆదేశం ప్రకారం 'శబ్దం బనుసరించియు, నభిప్రాయంబు గుఱించియు భావం బుపలక్షించియు రసంబు పోషించియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబు పరిహరించియు మాతృకాను సారంబున' చెప్పిన ప్రౌఢ ప్రబంధం.

**హర విలాసం:** ఇది శైవ సంబంధమయిన 7 ఆశ్వాసాల ప్రబంధం. ఇందులో చిఱుతొండనంబి కథ. గౌరీ కళ్యాణం, దారుకావన విహారం, సముద్ర మథనం అర్జునాఖ్యానం అణే అయిదు కథలున్నాయి. ఈ కథలు విడివిడిగా వున్నా ఐక్యత కనిపిస్తుంది. మొదటి కథకు మల్లికార్జున పండితుని శివతత్త్వ సారం, పాల్కురికి సోమన బసవ పురాణం, తమిళంలోని పెరియ పురాణం ఆధారాలు. రెండవ కథకు కుమార సంభవం ఆకరప్రాయం. మూడవ కథకు బ్రహ్మాండ పురాణం మాతృక, నాల్గవ వృత్తాంతానికి భారత భాగవతాది పురాణాలు, ఐదవ కథకు భారత కిరాతార్జునీయాలు ఆధారం కావచ్చు. అన్ని కథలు హరుని విలాసాలను ఆవిష్కరించునవియే.

**ధనుంజయ విజయం:** ధనుంజయుడంటే అర్జునుడు. అతడు పాండవ మధ్యముడు. ధర్మరాజు ఆనతి మేరకు దిశ్విజయానికి వెడలి ధనం ప్రోగు చేసినవాడు. ఈ కావ్యం అర్జున విజయాన్ని కీర్తించేది కావచ్చు. బహుశః కిరాతార్జునీయాన్ని అనుసరించిన ప్రబంధం కావచ్చు. ఇది అనుపలబ్దం.

**నందనందన చరిత్ర:** నందనందనుడు కృష్ణుడు. బహుశః ఈ కృతి శ్రీ కృష్ణుని లోకోత్తర క్రీడల చరిత్ర కావచ్చు. శ్రీనాథుని కాలం నాటికి ఆంధ్రదేశంలో రాధా మాధవ సంప్రదాయం వ్యాప్తి అయినట్లు తెలుస్తున్నది. ఆ కారణం వల్లనే శ్రీనాథుడు

భీమేశ్వర పురాణంలో రాధా మాధవ స్తవం చేశాడు. బహుశః రాధామాధవ స్తవానికి సంబంధించిన ఈ పద్యం నంద నందన చరిత్రలోనిది కావచ్చు అని ఆచార్య కొర్లపాటి వారి అభిప్రాయం.

**వల్లభాభ్యుదయం:** ఈ గ్రంథం కూడా అలభ్యం. అయితే ఇది శ్రీకాకుళ స్వామికి సంబంధించిన ప్రబంధమని పండితుల విశ్వాసం. శ్రీనాథుని వల్లభాభ్యుదయంలోనిదని చెప్పబడే

'రజనీ వధూకర్ణ రజత తాటంకంబు
వలరాజు ధవళోష్ణ వారణంబు'

పద్య భావాలు శ్రీనాథుని ఇతర కృతులు. భీమేశ్వర పురాణం, శృంగార నైషధం, కాశీ ఖండంలలో కనిపిస్తున్నాయి.

**భీమేశ్వర పురాణం:** ఇది పురాణం కాదు. ఇదొక క్షేత్ర మహాత్మ్య కావ్యం. ఈ క్షేత్ర ప్రశస్తి స్కాందంలో గోదావరీ ఖండంలో ఉందని ప్రతీతి. కాని లభ్యమయిన స్కాందంలో లేదు. తరువాతి కవులెవరో సంస్కృతీకరించి స్కాందంలోనిదిగా ప్రచారం చేసి వుంటారని పండితుల అభిప్రాయం. ఈ పురాణంలో 6 ఆశ్వాసాలున్నాయి. ఈ కృతిలో దక్షారామ పుర వర్ణన వ్యాసలోపాముద్ర అగస్త్యుల దక్షారామ యాత్ర, అగస్త్య ప్రోక్త తీర్థ మహాత్మ్యం సప్త గోదావర వృత్తాంతం, దక్షారామ భీమేశ్వర స్వయం ప్రతిష్ట మొదలయినవి వర్ణితం. ఇది ఆంధ్ర దేశీయ మహాకావ్యం.

**కాశీ ఖండం:** 'కాశీ ఖండమయః పిండమ' అని ఆభాణకం. ఇది స్కాంద పురాణాంతర్గం. ఈ ప్రబంధంలో 7 ఆశ్వాసాలున్నాయి. ఈ కృతి లోని వింధ్య పర్వత గర్వ నిబర్హణం, గుణనిధి కథ, దివోదాసుని చరిత్రలు రమణీయములు.

**శివరాత్రి మహాత్మ్యం:** ఈ కృతికి మూలం ఈశాన సంహిత. ఈ కృతిలో 5 ఆశ్వాసాలున్నాయి. ఈ మహాత్మ్యంలోని ఉరులింగోద్భవం, సుకుమార చరిత్ర, యమ శంకర సంవాదాలు ప్రసిద్ధం. శ్రీనాథుని ఈ కృతి హర విలాసం కంటె స్వతంత్ర కావ్యమని పరిశోధకుల అభిప్రాయం.

**పలనాటి వీర చరిత్ర:** ఇది ద్విపద కావ్యం. తెలుగు వారి కావ్యం. ఇదొక వీర గాథ. ఈ గాథలో నాగమ్మ బ్రహ్మనాయుడు పాత్రలు ప్రధానములు. నాగమ్మ నీతిజ్ఞురాలయితే, బ్రహ్మనాయుడు మత ప్రవక్త. ఈ చరిత్రలోని కల్లు ప్రతిష్ఠ, భట్టు రాయబారం బాల చంద్రుని బొంగరాలాట, మాంచాల బాలచంద్రుని సమర రంగానికి పంపడం, కొమ్మరాజు హితోపదేశం, బాలచంద్ర కన్నమదాసుల సంవాదం, అనపోతు ఆత్మహత్య, బాలచంద్రుని యుద్ధం మొదలయినవి సముదాత్త ఘట్టాలు.

**వీటి నాటకం:** ఇది కావ్యం కాదు. చాటుపద్య సంకలనం. మదరాసు కాకినాడ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలోని ప్రతి. ఈ కృతి 1924, 1972లలో ముద్రితం. ఇందులో శ్రీనాథుని చాటు పద్యాలున్నాయి. దీనిని సంకలన గ్రంథంగా గ్రహించడం సబబు.

**క్రీడాభిరామం:** ఇది 'వీథి రూపక' ప్రక్రియకు సన్నిహిత కృతి. కౌసల్నాటి గోవింద మంచన శర్మ అనే శ్రోత్రియ యువకుడు, అతని స్నేహితుడయిన టిట్టిభసెట్టి అనే కోమటి యువకుడు ఒకనాడు వేకువ వేళ మొదలు రాత్రి దాకా ఏక శిలానగర వీథులలో విహరిస్తూ చూచిన దృశ్యాల వర్ణనలే ఈ కృతిలో ప్రధానాంశం. రెండవ ప్రతాపరుద్రుని కాలంనాటి ప్రజల జీవన విధానం, విశ్వాసాలు, సంఘ మర్యాదలు, వారి వినోదాలు, భోజన విధానాలు, కళాభిరుచి తెలుసుకోవడానికి ఈ కృతి దోహదం చేస్తుంది.

శ్రీనాథుని కృతులే గాక ఆ మహాకవి చెప్పిన చాటువులలో రస పుష్టి, భావ వైశద్యం, వినూతన శైలి, తెలుగు పదాల సొబగు కనిపిస్తాయి. తెలుగు సాహిత్య సౌష్ఠవానికి శ్రీనాథుని రచనలు జీవగఱ్ఱ.

## 1.2 శ్రీనాథుని మహాకవి లోని యుగకర్త లక్షణాలు:-

సాహిత్య చరిత్ర అధ్యయనంలో ప్రధానంగా ఐదు రకాలయిన పద్ధతులు కనిపిస్తున్నాయి. కవుల బట్టి యుగ విభజన, మార్గదర్శకులయిన మహాకవుల బట్టి యుగ విభజన, కవితా పోషకుల బట్టి యుగ విభజన, కావ్య ప్రక్రియలకు అనుగుణమైన యుగ విభజన, కావ్య భేదములు-రాజవంశాలు కలిపి చేసిన యుగ విభజనలున్నాయి. అయినా మార్గదర్శకులయిన మహాకవుల బట్టి చేసిన యుగ విభజన సాహిత్య ప్రియులకు ఆమోదయోగ్యం. మహాకవుల పేర్లతో వ్యవహరింపబడే యుగములలో నన్నయ యుగం, తిక్కన యుగం, ఎర్రన యుగం, శ్రీనాథ యుగం, కృష్ణరాయల యుగాలున్నాయి. ప్రస్తుతాంశం శ్రీనాథ యుగం.

ఎవరు తమ రచనల ద్వారా వర్తమాన కాలానికి గాక భవిష్యత్తరముల వారికి కూడా అభినవోత్తేజం కల్గిస్తారో, ఎవరు గతీను గతికమయిన ఘనీభవించిన భావ ప్రపంచంలో ఉద్దామయిన ఉద్దీపనం కలిగిస్తారో, ఎవరు తమ తరువాతి కవులకు అనుకరణీయులవుతారో వారిని సాహిత్య రంగంలో యుగకర్తలనడం పరిపాటి. ఈ యుగ కాలం క్రీ॥శ॥ 1350-1500 శ్రీనాథునిలో యుగ కర్త లక్షణాలున్నాయి. వాటిని క్రమంగా పరిశీలించడం సమంజసం.

**సంస్కృత కావ్యానువాద సరణి:** నన్నయాదులు భారత భాషాంతరీకరణం చేసినవారు. ఇతరులు చెదరుమదురుగా సంస్కృతంలోని ప్రసిద్ధ గ్రంథాలను అనువాదం చేసినవారు. శ్రీనాథ యుగం సంధి యుగం. నన్నయాదులది పురాణ కవితా మార్గం. పెద్దనాదులది ప్రబంధ మార్గం. పురాణేతిహాసాదుల అనువాదానికి ప్రబంధాల స్వతంత్రతకు నడిమి కాలం శ్రీనాథ యుగం. అందువల్ల శ్రీనాథుని రచనలలో మూల విధేయత, స్వతంత్రత రెండూ కలిసి వున్నాయి. ఈ విధానంలోనే పినవీరన, నంది మల్లయ్య, ఘంట సింగనలు రచనలు కొనసాగించినారు. ఇది ఈ యుగ లక్షణం. ఈ మార్గానికి మార్గదర్శి శ్రీనాథుడు.

**వస్తువు:** శ్రీనాథ యుగంలో వస్తు వైవిధ్యం కనిపిస్తుంది. శృంగార నైషధం, హరిశ్చంద్రోపాఖ్యానం పురాణప్రోక్తమయిన ప్రసిద్ధ ఇతి వృత్తాలు. భోజరాజీయం, విక్రమార్క చరితం, పంచ తంత్రం, సింహాసన ద్వాత్రింశిక, షోడశకుమార చరిత్రలు కల్పిత ఇతివృత్తాలు. భాగవత వరాహ పద్మ పురాణాలు. పురాణాలు, భీమేశ్వర పురాణం, కాశీఖండం, కాంచీ పుర మహాత్మ్య, శ్రీరంగ మహత్మ్యాలు క్షేత్ర మహాత్మ్యలు. శాలివాహన సప్త సతి ప్రసిద్ధ ఇతివృత్తం. వేమన పద్యాలు, వల్లభామాత్యుని క్రీడాభిరామం సాంఘికేతివృత్తాలు. మరి వీటిలో వేమనవి సంఘ సంస్కారోద్దిష్టం. క్రీడాభిరామంలో సంఘ స్పర్శ విటసంబంధానికి ఆధిక్యం. సప్తశతిలోని సంఘ స్పర్శ శృంగార పరం. ఇంతటి వస్తు వైవిధ్యం ఉన్న యుగంలో శ్రీనాథుడు క్షేత్రమహాత్మ్య, సాంఘికేతివృత్త, ప్రసిద్ధేతికృత్త రచనలు చేయడం వీటికి శ్రీనాథుడే సూత్రధారి కావడం విశేషం. తగిన వస్తువును ఎన్నుకోవడం ఈ యుగ లక్షణం. ఇది శ్రీనాథునిలో నిండుగా వుంది.

**ప్రక్రియా వైవిధ్యం:** క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వెలువడ్డ పురాణాంధ్రీకరణానికి మూల పురుషుడు శ్రీనాథుడు. ఈ ఆంధ్రీకరణ ఈ యుగ లక్షణం. శ్రీనాథుని రచనలు భీమ ఖండం, కాశీ ఖండం రెండూ స్కాంద పురాణాంతర్గతాలే. ఈ యుగంలోనివారే పోతన భాగవతాన్ని, నంది మల్లయ్య ఘంట సింగనలు షష్ఠస్కంధ భాగవతాన్ని, మణికి సింగన పద్మ పురాణ, వాసిష్ఠ రామాయణ, దశమస్కంధలను పిన వీరన జైమినీ భారతాన్ని, నంది మల్లన ఘంట సింగనలు వరాహ పురాణాన్ని, పిడుపర్తి సోమన బసవ పురాణాలను వ్రాశారు. ఇవన్నీ శ్రీనాథుని అడుగుజాడలలో సాగిన తెలుగు సేతలే. పశుపతి నాగనాథుని విష్ణు పురాణం, వెన్నెల కంటి సూరన విష్ణు పురాణాలు కూడా శ్రీనాథుని పురాణానువాద వేఖరిని అనుసరించినవే. అలాగే పురాణ కవితా మార్గంలో శ్రీనాథుడు శివరాత్రి మహత్మ్యం వ్రాయగా దగ్గుపల్లి దుగ్గన కాంచీపుర మహత్మ్యాన్ని, ఆంధ్రకవి రామయ్య విష్ణు కాంచీ మహత్మ్యం, పిల్లమర్రి పిన వీరన మాఘ మహత్మ్యం, భైరవకవి శ్రీరంగమహత్మ్యం, ప్రౌఢకవి మల్లన ఏకాదశీ మహత్మ్యం రచించారు.

కథా కావ్య రచనలో కూడా శ్రీనాథుడే ఈ యుగంలో ఆద్యుడు. కథాకావ్య రచన ఈ యుగ లక్షణం కావడం వల్ల తరువాతి కవులు జక్కన విక్రమార్క చరిత్ర, దూబగుంట నారాయణ కవి పంచ తంత్రం, కొరలి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక, అనంతామాత్యుడు భోజరాజీయం, కూచిరాజు ఎర్రన సకల నీతి కథా నిదానం, వెన్నెలకంటి అన్నయ షోడశ కుమార చరిత్రలు వ్రాశారు.

దృశ్య కావ్యాలను శ్రవ్య కావ్యాలుగా అనుసరించడం కూడా ఈ యుగ లక్షణం. క్రీడాభిరామ రచనలో శ్రీనాథుని భాగం విశ్వసించే పక్షంలో ఈ ప్రక్రియకు కూడా అతడే ఆద్యుడు. తరువాతి కవులు పినవీరన శృంగార శాకుంతలం, నంది మల్లయ ఘంట సింగనల ప్రబోధ చంద్రోదయములు ఆ బాటలో నడచినవే.

శివకవి యుగంలో వెల్లవిలిసిన ద్విపద కావ్య సంప్రదాయం కొనసాగడం ఈ యుగ లక్షణం. శ్రీనాథుడు పలనాటి వీర చరిత్రం మంజరీ ద్విపదలో వ్రాశాడు. ఈ యుగంలో గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం, మడికి సింగన ద్విపద భగవత, నాదెండ్ల ఉమాపతి మాయాచిదానంద మంజరి, కొలని గణపతి దేవుని మనోబోధ, పిడుపర్తి బసవన దీక్షాబోధ, పిడుపర్తి సోమన ప్రభు లింగ లీల, పోలిశెట్టి లింగన నవ చోళ చరిత్ర, అన్నమయ్య ద్విపద రామాయం, శృంగార మంజరి, తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కళ్యాణం పేర్కొనదగ్గవి. ద్విపద కావ్యం పద్య కావ్యంగా వ్రాయడం ఈ యుగ లక్షణం కావడం వల్ల శ్రీనాథుడు కూడా పండితారాధ్య చరిత్రను గద్య పద్యాలతో వ్రాసినట్లు స్పష్టమవుతుంది. ఈ బాటలోనే పిడుపర్తి సోమన బసవ పురాణాన్ని పిడుపర్తి బసవప్ప ప్రభు లింగలీలలను పద్య కావ్యాలుగా వ్రాశారు. శ్రీ గిరి పద్య కావ్యానికి ద్విపద రూపంగా గౌరన నవనాథ చరిత్రను వ్రాయడం మరొక విధానం. ప్రక్రియా వైవిధ్య రచన శ్రీనాథుని యుగకర్తగా రూఢి పరుస్తుంది.

**ప్రక్రియ:** శ్రీనాథ యుగంలో పూర్వ ప్రక్రియలున్నాయి. నూతన ప్రక్రియలు కూడా ఉన్నాయి. పైగా తరువాతి యుగం నాటి ప్రబంధ లక్షణాలు శ్రీనాథుని రచనలో కనిపిస్తాయి.

శ్రీనాథుడు ప్రబంధ కవితా మార్గానికి ఆచార్యుడు. విద్వదౌషధమయిన నైషధీయాన్ని 'శృంగార నైషధం'గా తీర్చినాడు. కాశీ ఖండంలో మయూరుని సూర్య శతక శ్లోకాలను అనువదించి కూర్చినాడు. సంస్కృత శ్లోకాలను తెనిగించడంలో పాటించవలసిన నియమాలకు మార్గదర్శకత్వం వహించాడు. ఈ యుగంలో సహజంగా కనిపించే బహు ముఖ ప్రజ్ఞా శాలిత్వం, లోకజ్ఞత, శాస్త్రజ్ఞతలు శ్రీనాథునిలో స్పష్టంగా కనిపిస్తాయి. మచ్చుకు కొన్నిటికి ఉదాహరణలు-

**పూర్వ కవితా చర్వణం:** కాళిదాసు, మురారి, రాజశేఖర, మయూరాదుల రచనలకు ముగ్ధుడై వారి రచనలలో ప్రసిద్ధములయిన వానిని తెనిగించి తన కావ్యాలలో భాగం చేసుకోవడం శ్రీనాథుని ప్రత్యేకత. ఈ ధర్మం తరువాతి కవులలో కనిపిస్తుంది.

"శుశ్రూషస్వగురూన్ కురు ప్రియ సఖీ వృత్తం సపత్నీజనే
భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మప్రతీపం గమః
భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే భాగ్యేష్వనుత్సేకినీ
యాంత్యేవం గృహిణీ పదం యువతయో వామాః కులస్యాధయః"

పాటించి కొలువుము భవన దైవతముల
సవతుల (గొనియాడు సఖుల(బోలి
యారాధనము సేయు మత్తమామల నెప్డు।
బరిజనంబుల మీఁద గరుణ గలుగు
మలుగకు కోపించినపుడు నాథుని తోడ

మదిలోన నుబ్బకు మన్ననలకు ।
దోడి కోడండ్రతో (శూది మాది చరింపు
దాసీ జనము(బ్రోవు తల్లి కరణి. ॥శృ॥నై॥ 7.9

"శాత శ్యామా లతాయాః పరశురివ తమో<sub></sub>రణ్యా వహ్నేరివార్చిః
ప్రాచ్యే వాగ్రే గ్రహీతుం గ్రహకుముదవనం ద్రాగుదస్తోగ్రహస్తః
ఐక్యం భిన్దన్ద్యు భూమ్యో రవధిరివ విధాతేవ విశ్వ ప్రబోధం
వాహానాం వో వినేతా వ్యపనయతు విపన్నా మధామధిపస్య"

చిఱు సాన(బట్టించి చికలి సేయించిన
గండ్ర గొడ్డలి నిశా గహన లతకు(
గార్కొన్న నిబిడాంధకార ధారాచ్ఛటా
సత్ర వాటికి వీతి హోత్రజిహ్వ
నక్షత్ర కుముద కాననము గిల్లెడు బో(టి
ప్రాచి యెత్తిన హస్తపల్ల వాగ్ర
మరసి మింటికి మంటి కైక్య సందేహంబు ।
బరిహరింపంగ (బాల్పడ్డ యవధి
సృష్టి కన్దెఱ తొలుసంజ చెలిమి కాఁడు
కుంటు వినతా మహాదేవి కొడుకు (గుట్టి
సవితృ సారధి కట్టెట్టి చాయ వేలు
వరుణు(డుదయించె (బ్రొగ్గి శాభ్యంతరమున ॥కాశీ॥ 1.121॥

**తరువాతి కవులకు మార్గదర్శకత్వం:** శ్రీనాథుడు నన్నయ సౌభాగ్యానికి ప్రబంధ శయ్యకు మెరుగులు దిద్దినవాడు. అనువాదంలో కొత్త రీతులు శైలిలో ఆలంకారికత, భావాలలో భక్తి శృంగార ఆర్ద్రత అనే గుణాలు తరువాతి కవులకు మార్గదర్శకమయ్యాయి. అలాగే పద సంవిధాన నైపుణ్యం, కారక ప్రయోగ వైచిత్రి, సీస పద్య రచనలో వైవిధ్యం పినవీర భద్రాదులకు డిబ్బ భుతి కాగలిగింది. ప్రబంధాలకు ప్రాధన లక్షణాలయిన రసోత్కర్ష, వర్ణనా బాహుళ్యం, అలంకార ప్రియత్వం మొదలయిన వాటికి ప్రాధాన్యమిచ్చి తరువాతి ప్రబంధ ప్రక్రియకు దారి తీయడం శ్రీనాథుని ప్రత్యేకత. మచ్చుకు - హాస్య రసోపేత వర్ణన.

హేరాళముగ (జల్లె నెల నా(గ యొక్కర్తు
కుంభోదరుని మీ(ద (గుసుమరజము(
గుటిల కుంతల భృంగిరిటి మోమునందోర్తు
తా(కించె నోల గంధంబు (బసుపు
వక్షంబు లక్షించి వైచె గందపు టుండ
వీరభద్రుని నొక్క నీరజాక్షి
చెవిలోన (బొడొంగ (జిమ్మె గొజ్జగ నీట(
గాల భైరవు నొక్క కలువ కంటి

కొమ్మ యొక్కతె యందంద ఁగొమర సామి
    యౌదలల యందు జవ్వాది యసలు గలిపెఁ
బునుగు మంశి కుంభమున నించి పోసె నొక్క
    పొలఁతి విష్ణ్వీశ్వరుని కుంత బొజ్జ మీద ॥భీమ॥ 5.115॥

**తత్త్వం:** శ్రీనాథ యుగంలో శైవం, వైష్ణవం అనే రెండు తత్త్వాలకు ప్రచారమున్నట్లు చెప్పవచ్చు. శైవంలోని ఆగమ శైవం ప్రాచీనం. రెడ్డి రాజులు, శ్రీనాథుడు అనుసరించినది ఈ శైవాన్నే. ఈ యుగంలో నాథ సంప్రదాయం కూడా వుంది. శ్రీనాథుడు ఈ శైవాన్ని కూడా గుర్తించాడు. కనుకనే భీమేశ్వర పురాణం, కాశీ ఖండంలో ఆ సంప్రదాయ సరళిని చూపాడు. తరువాతి కవులు ప్రత్యేకించి గౌరన, కొలను గణపతి దేవుడు, పిదుపర్తి సోమనాథుడు, గోపరాజు, జక్కనాదులు ఈ సంప్రదాయాన్ని తమ రచనలో కొనసాగించారు. ఆచార్య కొర్లపాటి వారి మతం ప్రకారం వేమన నాథయోగి. ఆలాగే ఈ యుగంలో వైష్ణవం ఉంది. తాళ్లపాక కవులు, పోతన, మొల్ల, కొరవి గోపరాజాదులు వైష్ణవాభిమానం ప్రదర్శించిన వారే. శ్రీనాథుడు శైవుడయినా అతడు పలుచోట్ల తనకు గల విష్ణు భక్తిని ప్రదర్శించాడు. శైవ వైష్ణవ తత్త్వానురక్తి ఈ యుగ లక్షణం. ఇది శ్రీనాథునిలో విస్తారం.

**భాష:** శ్రీనాథ యుగంలో సంస్కృతానురక్తి ఉంది. తెలుగు నుడికార ప్రీతి కూడా ఉంది. ఈ రెండింటిని అంగీకరించిన వాడు శ్రీనాథుడు. ఉభయ వాక్ప్రౌఢిని, ఉద్దండలీలను శ్రీనాథునిలాగా అభిమానించిన వారు పోతన, నిశ్శంక కొమ్మన, జక్కనాదులు, ఇక తెలుగునుడికారానికి ప్రాధాన్యమిచ్చిన వారు అనంతామాత్య, గౌరన, వేమనాదులు.

**ఛందస్సు:** శ్రీనాథ యుగంలోని 'ఛంగస్సు' చాల వరకు పూర్వ యుగం నాటివే. అయితే కావ్య భేదములయిన రగడలు, వచనాలు ఛందో భేదములయ్యాయి. శ్రీనాథ, పినవీరన, నంది మల్లయ ఘంట సింగనలు రగడలను కావ్యాలలో పొందుపరచినవారే. అలాగే 'రచన ప్రక్రియ' పూర్వ యుగంలో కృష్ణమాచార్య, ఎఱ్ఱనాదులు వచనాదులు వ్రాస్తే శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో అలాంటి రచనలు రెండు చేశాడు. అలాగే కాశీ ఖండం, శివరాత్రి మాహాత్మ్యంలో సంస్కృత గద్యాలున్నాయి. మొల్ల లాంటి కవయిత్రులు చూర్ణిక అనే పేరుతో బిరుదు గద్య వ్రాసింది. తాళ బంధం గాని, తాళ గంధం గాని లేని ఛందో విరహిత వచన రచనకు శ్రీనాథుడు మార్గదర్శకం వహించాడు. ఆచార్య కొర్లపాటి వారి మాటలలో చెప్పాలంటే "పద్య రచనకు పట్టాభిషేకము, గద్య రచనమునకు కనకాభిషేకము శ్రీనాథ యుగ విశేషములు".

నిస్సందేహముగా శ్రీనాథుడు యుగకర్త. ఆ కాలం నాటి సాహిత్య లక్షణాలన్నీ శ్రీనాథునిలో ప్రతిఫలించాయి.

## 1.3 శ్రీనాథునికి సంబంధమగు వివిధ రెడ్డి రాజులు - వారికి అంకితం ఇచ్చిన గ్రంథములు:

నన్నయను రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవిగా, తిక్కనను మనుమసిద్ధి ఆస్థాన కవిగా చెప్పడం సహజం. కారణం వారు జీవిత కాలమంతా ఒకరినే ఆశ్రయించి జీవించిన వారు కావడమే. కాని శ్రీనాథుని ఫలానా రాజు ఆస్థాన కవిగా నిర్ణయించుటలో ఇబ్బందులున్నాయి. కారణం శ్రీనాథ సుకవి ఎన్నో రాజాస్థానాలలో తన వైదుష్యం ప్రకటించారు. జీవిత కాలమంతా ఏకైక రాజాస్థానంలో గడపలేదు. కాని స్థూల దృష్టితో పరిశీలిస్తే శ్రీనాథుడు 'రెడ్డి రాజుల ఆస్థాన కవి' అనడం మాత్రం సత్యం. ఏ ఏ రెడ్డి రాజులతో శ్రీనాథునికి సంబంధమున్నదో తెలుసుకోవడం సమంజసం, వీటితోబాటు ఆయా రెడ్డి రాజుల ప్రాభవ ఔన్నత్యాలను అవలోకించడం సబబు.

**అనవేమా రెడ్డి:** ఇతని సామ్రాజ్యం 'కొండవీడు'. ఇతని కాలం క్రీ॥శ॥ 1364 - 1386. ఇతని అన్న అనపోతా రెడ్డి కొండవీటి సామ్రాజ్యాన్ని శ్రీశైల సింహాచలం దాకా విస్తరింప చేసిన పరాక్రమవంతుడు. అనవేమారెడ్డి నిరవద్య పురం, వానార సీమ,

కోనసీమ పాలకులు అనవేమా రెడ్డికి జోహరులన్న వారే. పైగా అనవేమారెడ్డి తమ సామ్రాజ్యంలో ఒకప్పుడు భాగమై తరువాత విజయనగర రాజులకు వశమయిన వినుకొండ దుర్గాన్ని మరల కైవసం చేసుకున్నాడు.

అనవేమా రెడ్డి ఎంతటి వీరుడో అంతటి శివభక్తుడు. "అరుణోదయ । తపనోగయ । సంగవ మధ్యాహ్న సాయమర్థ నిశాః"

'శివపూజా సమయా షట్ప్రతిదిన మనవేమ పార్థి వేంద్రస్య' అనే చాటు శ్లోకం కూడా దీనికి సాక్ష్యం. ఇతని కులదైవం త్రిపురాంతక దేవుడు. కుల దేవత మూల గూరమ్మ.

అనవేమా రెడ్డి కులదేవతకు అంగరంగ భోగాదుల్ని జరిపించడానికి వీలుగా 'పడిదరం, మూల గూరం, పలకలూరు' గ్రామాలను దానం చేశాడు. ధాన్య వాటిలోని 'అమృతేశ్వరుని' పునః ప్రతిష్ఠితుని చేశాడు. దాక్షారామంలోని భీమేశ్వరాలయంలో 'తిరుచుట్టు మాళిగలు, దివ్య లింగాల గుళ్ళు, వజ్రంపురాకోట, గోపురాలు, పాతాళ గేహాలు, సోపాన భాండాగార వివిధ ధాన్యాలయాలు, వంట శాలలు, చతుర్ద్వారక వాటాలు' నిర్మించాడు. ఇంతేకాక 'శ్రీశైల యాత్ర' చేసి అక్కడ 'వీర శిరో మంటపం' కట్టించాడు.

అనవేమా రెడ్డి పరాక్రమవంతుడే కాడు. భక్త శ్రేష్ఠుడు మాత్రమే కాడు. దాత కూడా. అతనికి 'ధర్మ వేమన్న' అని కూడా పేరు. దీనికి సంబంధించి ప్రసిద్ధ చాటువు

'పాతాళం । పరిపాలయ త్వ । హి । పతౌ । వాతాశినో । భోగినః
శక్రే । శాసతి । నాకలోక । మమరాస్య । త్రాసినో । జిజ్ఞిరే
భూమీశే । చిరమన్న వేమ నృపతౌ । భూయో । లభంతే । జనా
మృద్వన్నం । మృదులాంబరం । మృగమదం । చామీకరం । చామరమ్'

జనులకు మధురాన్నం, మృదులాంబరం, మృగమదం, చామీకరం, చామరాలను అనవేమా రెడ్డి గ్రహిస్తాడని ఈ శ్లోక తాత్పర్యం.

అనవేమా రెడ్డికి 'కర్పూర వసంత రాయుడని' కూడా పేరు. ప్రతి సంవత్సరం వసంతోత్సవం జరిపే రసికుడు. దీనికి దృజ్జ వరపు శాసనం, శ్రీశైల శాసనం, కుమార గిరి రాజీయం అవతారికా భాగ శ్లోకాలు సాక్ష్యాలు.

'స ప్రోల మాంబా తనయః । కృతార్థో । వసంత కాలీం । ప్రతివర్ష ముర్వ్యాం
కస్తూరికా । కుంకుమ । గంధసార । హిమాంబు । కూర్పర ముఖైః । చకార
వసంత రాయశ్చ । వసంత కేళౌ । కస్తూరికా రేణు దయాంబు వాహః
క్షిప్తం । హిమాంభో । ఘనవర్ష ధారాః । కర్పూర ఖండాః । కరకావి కీర్ణాః'

అని దృజ్జవరపు శాసనం. ఇతని వసంతోత్సవాల వైభవాన్ని స్పష్టం చేస్తున్నది.

'ఘనసార । కస్తూరి కాది । వస్తు । విస్తార । విరచితా పూర్వ । వసంత విహార'

సమాసం ఆ విలాసాన్ని కళ్ళ ముందర నిలుపుతున్నది. 'హేమాద్రి దాన నిరతే' అనడం ఆ రెడ్డి రాజు దాన వైభవాన్ని కీర్తిస్తున్నది.

శ్రీనాథుడు అనవేమా రెడ్డి కొలువులో ప్రవేశించి నట్లు 'కొండవీటి దండ కవితె' సాక్ష్యమిస్తున్నది. చారిత్రకులు రెడ్డి రాజులేయించిన "మూల గూరమ్మ" శాసనం శ్రీనాథుని రచనగా భావిస్తున్నారు. ఆ శాసన భాగం -

'శాకాబ్దములు । సహస్రమును । నిన్నూంట । తొంబది । యెనిమిదియగు । భవ్య సంఖ్య
గలిగి । యెప్పారెడు । నలవత్సరంబున । మాఘ మాసము । పూర్ణిమా । దినమున
విశ్వోత్తరుం । డన వేమ భూపాలుండు । దమ కుల స్వామిని । కమృత కిరణ
రేఖావతంసకు । శ్రీమూల గూరమ్మ । కఖిల జగన్మాత । కంగరంగ
భోగ సంసిద్ధికిని । ధారవోసి । యిచ్చె । గ్రామములు । మూడు । శ్రీ కోట భూమి యందు
పదిదరము । మూలగూరంబు । పలకలూరు । దానఖచరేంద్రుడా చుద్ర తారకముగ'

ఆనవేమా రెడ్డి కొలువు కవి పందిత మండితం. ఇతని ఆస్థానంలో బాల సరస్వతి, త్రిలోచనాచార్యుడు సంస్కృత కవులు. వీరిలో బాల సరస్వతి క్రీ॥శ॥ 1376 నాటి ఇప్పగల్లు శాసన కర్త. త్రిలోచనాచార్యుడు క్రీ॥శ॥ 1378 నాటి వాన పల్లి తామ్ర శాసన కర్త. ఈ కవికి శారదా వల్లభుడనే బిరుదం వున్నట్లు

'శివాగమ విశారదో । జయతి । శారదా వల్లభః'

అనే పంక్తి సాక్ష్యమిస్తున్నది. వీరే గాక 'ప్రకాశ భారతీ యోగి' అనే తెలుగు కవి ఉన్నట్లు అనవేముని దాక్షారామ శాసనం బట్టి తెలుస్తున్నది. కాని ఇతని గ్రంథాలు ఏవీ లభ్యం కాలేదు.

అనవేమా రెడ్డి చేసిన కవి పండిత దానాలు అనేకం. ఇతడు ప్రమథ కవి 'శ్రీ గిరి కవికి' భూదానం చేశాడు. ఇతని దాతృత్వానికి

భువి సత్యన వేమ పార్థి వేంద్రే । విదుషాం । జీవన మేవ । జీవనమ్
దివి సత్యన వేమ భూపతీంద్రే । విదుషాం । జీవన మేవ । జీవనమ్

అనే శ్లోకం సాక్ష్యం. శ్రీనాథుడు తన కృతిని 'మామిడి సింగనకు' అంకితం ఇచ్చినా అనవేమా రెడ్డిని

అనతారాతి । వసుంధరా రమణా । సప్తాంగ । హారక్రియా
ఘన సంరంభ । విజృంభమాణ । పటుదోఃఖర్జూ ద్వితీయార్జునుం
డన । వేమాధిపు'

అని కీర్తించడం గమనించదగ్గది. పైగా రాయని భాస్కరుడు కూడా 'అనవేమ । మహీశ । దత్తాగ్రహార । మదకరాందోళికాశ్వసన్మంశి విశేష । భూషణా దృష్ట భూతిని భూషి తుదని' తెలుస్తున్నది.

**పెదకోమటి వేమారెడ్డి:** పెదకోమటి కుమారుడు వేమారెడ్డి పెదకోమటి వేమారెడ్డి. పెదకోమటి వేమారెడ్డికి 'అనవేమా రెడ్డి' పిన తండ్రి. ఇతనిది చందవోలు సింహాసనం. కాని భుజ బల పరాక్రమం చేత ఇతడు కొండవీటి సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు. ఇతని రాజ్య కాలం క్రీ॥శ॥ 1402 - 1420. ఇతని గురువు శంకర మౌళి. మామిడి సింగన మంత్రి. ఇతని ఆస్థానంలోని శ్రీనాథుడు విద్యాధికారి.

పెదకోమటి వేమారెడ్డి పండితుడు. కవి పండిత పోషకుడు. ఇతడు సాహిత్య చింతామణి సప్తశతీ సారం, సంగీత చింతామణి అను గ్రంథాలను అమరుక శతకానికి 'శృంగార దీపిక' అనే వ్యాఖ్యానాలను రచించాడు. వీటిలో మొదటిది అలంకార శాస్త్ర గ్రంథాలలో 'కావ్య ప్రకాశము' వంటిదని వేటూరి ప్రభాకర శాస్త్రి గారు భావించారు. 'గాథా సప్తశతి'కి సంక్షిప్త రూపమే సప్తశతీ సారం. ఈ గ్రంథం గురించి దిగుమర్తి సీతారామ స్వామి గారు "సారమును గ్రహించుటలో వేమారెడ్డి తన నాటి ఆంధ్ర దేశ పరిసరములకు అనువైన గాథలనే ఏరికొనెను........." సప్తశతి నాటికి అలంకార శాస్త్రములు లేవు. తరువాత పుట్టిన వారికి

సప్తశతియే లక్ష్య దీపి అయినది అని తెలియజేశారు. వేమ భూపాల చరిత్రను బట్టి పెదకోమటి వేమారెడ్డి సరస కావ్య సమాకర్ణన పరాయణుడని చెప్పవచ్చును అని అన్నారు. ఇతడే వీరనారాయణ చరితమనే పేరుతో ఒక భాణ కావ్యాన్ని రచించినట్లు తెలుస్తున్నది.

పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో 'వామన భట్టబాలుడనే' కవి వున్నట్లు ఆధారాలున్నాయి. ఇతడు నలాభ్యుదయము, రఘునాధాభ్యుదయము అనే పద్య కావ్యాలు వేమ భూపాల చరితమనే పద్య కావ్యం, పార్వతీ పరిణయం, శృంగార భూషణం అను దృశ్య కావ్యాలు, శబ్ద చంద్రిక, శబ్ద రత్నాకరము అనే నిఘంటువులు రచించాడు.

పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి శ్రీనాథుడు. వివిధ పండిత విద్యా పరీక్షణము, విద్యాలయ నిర్వహణము, మహారాజులు ఆయా కవులకు పండితులకు ప్రసాదించే దాన శాసనాల లేఖన పర్యవేక్షణము మొదలయినవి విద్యాధికారి ధర్మములు. క్రీ॥శ॥ **1404** నుండి **1419** వరకు ఇతడు విద్యాధికారి అని పరిశోధకులు భావిస్తున్నారు.

పెదకోమటి వేమారెడ్డి చేసిన దాన ధర్మాదులు అంఖ్యాకము. క్రీ॥శ॥ **1404**లో జ్యోతిష్కుడైన పెద్ది యజ్వకు 'కల్వపాముల' అగ్రహారాన్ని, భూలోక ధన్వంతరి అయిన 'భాస్కర ఆర్యునకు' పొండుపల్లి అనే గ్రామాన్ని, 'ఎల్లేపెద్ది లక్ష్మణ దీక్షితులకు షడ్దర్శనాల వల్లభ సోమయాజికి 'పెదపూడి' గ్రామాన్ని దానం ఇచ్చాడు. **1408** సం॥లో షడ్కర్మ నిరతుడైన 'పిశిపాటి రామభద్ర సోమయాజికి' పొట్లపాడు గ్రామాన్ని అలాగే సింగనార్యునికి పొండుపల్లి గ్రామాన్ని దానం ఇచ్చాడు. **1409** సం॥లో మరల పెద్ది యజ్వకు నందలూరు గ్రామాన్ని దానం చేశాడు. **1413** సం॥లో విశ్వేశ్వర విద్వాంసునికి 'ఆలపాడు' గ్రామాన్ని, **1415** సం॥లో పెద్ది యజ్వ కుమారుడైన రామచంద్ర జ్యోతిష్కునికి 'రుద్రవర' గ్రామాన్ని దానం చేశాడు. ఈ దాన శాసనాదులన్నీ కూడా శ్రీనాథుని రచనలే. పెదకోమటి వేమారెడ్డి తన గురువైన శంకర మౌళికి **1405**లో పినపాడు గ్రామాన్ని దానం చేశాడు.

పెదకోమటి వేమారెడ్డి కవి పండిత పోషకుడు గాక దైవ భక్తి పరాయణుడు. పెదకోమటి వేమారెడ్డి ధర్మ కీర్తి లత శ్రీశైలంలో వేర్లు ఊరి, త్రిపురాంతకంలో తీగసాగి, పంచారామములు అణే పందిర్ల పై ప్రాకి, సింహాచలం శ్రీ కూర్మం మొదలయిన క్షేత్రాలలో పుష్పించి, కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో ఫలించినట్లు

'శ్రీశైలే । స్థిర మూలతా । ముపగతా । వృద్ధిం । కుమారాచలే
పంచారామతలే । ప్రతానసుషమా । సింహాచలేంద్రే । తతః ।
శ్రీకూర్మే । పురుషోత్తమే కుసుమితా । యద్ధర్మ కీర్త్యోర్లతా
కాశ్యాం । విశ్వపతేః । ఫలవతే । నిత్యోపహారోచితమ్'

ఈ శ్లోకం వల్ల తెలుస్తుంది.

**రాచ వేమారెడ్డి:** ఇతడు పెదకోమటి వేమారెడ్డి కుమారుడు. ఇతని రాజ్య కాలం క్రీ॥శ॥ **1420 - 1424**. ఇతని కాలంలోనే విజయ నగర ప్రభువులు గజపతులు కొండవీటిని ఆక్రమించడానికి ప్రయత్నం చేశారు. ఇతడు సంతాన సాగర తటాకానికి జగనొబ్బ గండకాలువ త్రవ్వించాడు. ఇతని కాలంలో కూడా శ్రీనాథుడు విద్యాధికారియే.

**పంట మైలారు రెడ్డి:** ఇతడు రెండవ ప్రౌఢ దేవరాయల సామంతుడు. క్రీ॥శ॥ **1424 - 1429** నాటి వాడు. శ్రీనాథుడు తన అవసాన దశలో

"కైలాసగిరి పంటమైలారు విభుడేగె
దినవెచ్చ మేరాజు దీర్ప (గలడు"        అని స్మరించాడు.

**అల్లాడ వేమారెడ్డి, వీరభద్రా రెడ్డి:** :వీరు రాజ మహేంద్ర వర రాజ్యాధిపతులు. వీరి ఆస్థానంలో శ్రీనాథుడు క్రీ॥శ॥ **1428** నుండి క్రీ॥శ॥ **1446** దాకా రాణించినట్లు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి అభిప్రాయం.

అల్లాడ వేమారెడ్డి పరాక్రమవంతుడు. ఇతడు 'సప్తమాడి'య రాజులను కళింగాధిపతులను జయించి సింహాచలంలో, తరువాత కటకంలో విజయ స్తంభములను నాటినాడు. అతడు భక్తుడు కూడా. శివార్చన చేసే వేళ అల్లాడ వేమారెడ్డి 'రెండవ శంభువుగా' కనిపించేవాడని శ్రీనాథుడు కాశీ ఖండంలో విశదీకరించాడు. అతని భార్య జియ్య అల్లసానమ్మ కూడా శివ భక్తురాలే. ఈవిడ చళుక్య భీమవరంలోని చాళుక్య భీమేశ్వరునికి కొంత భూమి దానం చేసింది. అల్లాడరెడ్డి వేమారెడ్డి గోదావరీ మండలంలో తుల్య భాగా నదీ తీరంలో వెద్రిపాక పిన మహేంద్రాడ గ్రామాలను ఏకం చేసి 'అల్లాడ రెడ్డి వేమ వరం' అనే పేర మహా విద్వాంసులకు దానం చేశాడు. **1434** లో కలువపల్లి, బడ్డాది, కొట్టూరు గ్రామాలకు సంబంధించిన దేవ బ్రాహ్మణులకు యథా పూర్వ అగ్రహారాలు నిలిపే లాగా చేశాడు.

అల్లాడ వేమారెడ్డి ఆస్థానంలో సరస్వతీ భట్టు ప్రసిద్దుడు. అతడు పద వాక్య ప్రమాణ విదుడు. అతడే వేమ వర సాసన కర్త. అతని గూర్చి ఒక ప్రశస్తి

"శ్రీవత్సః కవితా బ్రహ్మ పద వాక్య ప్రమాణ విత్
సరస్వతీభట్ట బుధః శాసనం కృతవానిదమ్"

**వీరభద్రా రెడ్డి:** ఇతని భార్య 'అనితల్లి' ఆమె కాటయ వేమారెడ్డి కూతురు. ఇతడు రాజమహేంద్ర వరం రాజ్యాధిపతి. 'అనితల్లి'వలననే వీరభద్రా రెడ్డికి రాజమహేంద్రవరం సింహాసనం దక్కినదని చరిత్ర చెబుతుంది.

వీరభద్రా రెడ్డి దాన శాసనాలు ఏవీ కనబడడం లేదు. ఇతని భార్య క్రీ॥శ॥ **1423** వ సం॥లో మార్కండేయ స్వామి ఆలయంలోని వైద్యులకు కలువ చేరు అను గ్రామం క్రీ॥శ॥ **1423** వ సం॥ ఇచ్చినట్లు ఆధారాలున్నాయి. అలాగే క్రీ॥శ॥ **1435** లో మార్కండేశ్వర స్వామి సన్నిధిలోని బ్రాహ్మణులకు సర్వమాన్య అగ్రహారాన్నిచ్చినట్లు స్పష్టమవుతుంది.

వీరభద్రా రెడ్డి అల్లాడ వేమారెడ్డి ఇద్దరూ రాజ్యాధిపతులుగా సోదర భక్తితో రాణించినట్లుగా చరిత్ర బట్టి స్పష్టం అగుచున్నది. భీమ ఖండం బట్టి వీరభద్రా రెడ్డి మార్కండేశ్వర స్వామికి అగ్రహారములు ఇచ్చినట్లుగా ఈ క్రింది పద్యం వల్ల తెలుస్తున్నది.

"ధర్మ శాసన ఘన శాలాస్తంభ మెత్తె
శ్రీమృకండుాద్భవస్వామి శివుని మ్రోల
వీరభద్రేశుఁడా చంద్ర తారక ముగ
నగ్రహారాళి నఖిల మాన్యంబు లొసఁగి" **1.42**

వీరభద్రా రెడ్డి సంగీత సాహిత్య విద్యావేత్త. పాండిత్య నిధి. శ్రీనాథుని కాశీ ఖండానికి కృతికర్త. కర్పూర వసంతరాయలను బిరుదం కలవాడు. కుమార గిరి రెడ్డి లాగే వీరభద్రా రెడ్డి వసంతోత్సవాలు చేసేవాడని నిశ్శంక కొమ్మన కూడా శివలీలా విలాసంలో

"ప్రతి వత్సర । వసంత । మహోత్సవ । నిర్భర । విహార । సందర్భ । సముచిత
వసంతరాయ । రథ్యా ప్రదాన । వివిధ । వీధికాధిగత । తత్తత్పదార్థ । విశేషం
బును........ నగుచు తేజరిల్లు । నా రాజమహేంద్ర వరంబున । కధీశ్వరుండు ...........
అల్లనృప వీరభద్ర విభుఁడు" 50,60

శ్రీనాథుడు తన రచనలలో ఎందరో రెడ్డి రాజులను ప్రస్తావించినా అతనితో ప్రగాఢ సంబంధము కలవారు నలుగురే.

## 1.4 సారాంశము:-

శ్రీనాథుని కాల నిర్ణయాన్ని (1360 - 1450) రచనల్లో లభ్య, అలభ్య గ్రంథాలను స్పష్టపరచడం, అనువాద పద్ధతిలో స్వతంత్ర పద్ధతిని అవలంబించి స్వతంత్ర కావ్య రచనకు మార్గదర్శకుడు కావటం, అనవేమా రెడ్డి, పెదకోమటి వేమారెడ్డి, పంట మైలారురెడ్డి, వీరభద్రా రెడ్లతో శ్రీనాథునికి అనుబంధం ఎక్కువ అని నిరూపించడం మొదలైన అంశాలు ఈ పాఠంలో సోపపత్తికంగా నిరూపించబడ్డాయి.

## 1.5 ప్రశ్నలు :-

1. శ్రీనాథుని కాల నిర్ణయం చేసి, రచనల కాలాన్ని విస్పష్టం చేసి ఆ రచనల గురించి సంక్షిప్తంగా వ్రాయండి.
2. శ్రీనాథునిలో కనిపించే యుగకర్త లక్షణాలను వివరించండి.
3. శ్రీనాథునితో అనుబంధం గల రెడ్డి రాజులను పరిచయం చేయండి.
4. శ్రీనాథుని కృతులను, కృతి పతులను తెలియజేయండి.

## 1.6 ఆధార గ్రంథాలు:-


1. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. తెలుగు సాహిత్య చరిత్ర (2వ భాగం)- కొర్లపాటి శ్రీరామమూర్తి



రచయిత
ఆచార్య కె. సర్వోత్తమ రావు,
విశ్రాంతాంధ్రాచార్యులు,
శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం,
తిరుపతి.

పాఠం - 2

# శృంగార నైషధము

**ముఖ్యాంశాలు:-**

2.0 లక్ష్యం
2.1 కావ్యనామౌచిత్యము
2.2 శ్రీనాథుని అనువాద విధానము
2.3 నైషధాంధ్రీకరణ పద్ధతి
2.4 సారాంశము
2.5 ప్రశ్నలు
2.6 ఆధారగ్రంథాలు

## 2.0 లక్ష్యం:-

శ్రీనాథుని కావ్యములలో నాలుగవదైన శృంగార నైషధ కావ్యనామౌచిత్యమును పరామర్శించి, శ్రీనాథుని నైషధాంధ్రీకరణ పద్ధతిని సోదాహరణముగా వివరించుటే రెండవ పాఠము యొక్క లక్ష్యము.

## 2.1 కావ్యనామౌచిత్యము:-

శ్రీనాథుని జీవితమున - కాదు - ఆంధ్ర సాహిత్య ప్రపంచమున - నైషధాంధ్రీకరణము మహా ఘట్టము. దానినతడు నిండు జవ్వనమున సంతరించెను. శ్రీనాథుడు నిత్యము స్మరించిన గ్రంథము శృంగార నైషధము. అతడు తన్ను హరవిలాసములో "ఆంధ్ర భాషా నైషధాబ్జభవుని" అని వర్ణించుకొనెను. హరవిలాస, భీమేశ్వర పురాణ, కాశీ ఖండముల యందు నైషధమును గూర్చి ప్రస్తావించుటయే కాక సర్వజ్ఞసింగభూపాలుని దర్శించినప్పుడు కూడ తాను గావించిన శారదాస్తవము నందు

"పలుకు తోడైతాంధ్ర భాషా మహా కావ్య
నైషధ గ్రంథ సందర్భమునకు"

అని చెప్పెను. తుదకు శోచనీయమైన తన యవసాన కాలము నందును

"ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మంబునఁ
దగిలి యుండెను గదా నిగళ యుగము" అని వాపోయెను.

భీమేశ్వర పురాణములో కృతిపతి యగు బెండపూడి అన్నయామాత్యుడు

"కల్పించి నాడవు గాఢ పాకంబైన
హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష" అని అన్నట్లు కలదు.

సంస్కృత సారస్వతములో శ్రీహర్షుడు రచించిన 'నైషధీయ చరిత' మొక ప్రౌఢ కావ్యము. దానిలో ఇరువది రెండు సర్గలు కలవు. అది శ్రీహర్షుని ప్రతిభా పాండిత్యములకు దర్పణము. " నైషధం విద్వదౌషధమ్ " అను ఆభాణకము గీర్వాణముననే కలదు.

' ఆ విద్వదౌషధమును శ్రీనాథుడు తన ఆంధ్రీకరణమున విద్వదమృత మొనర్చినాడ'ని వేదము వేంకటరాయ శాస్త్రి గారు ప్రశంసించిరి. శ్రీహర్షుని నైషధమునకు 46 వ్యాఖ్యానములున్నవి. అందు చాందు పండితుని వ్యాఖ్యానము ప్రాచీనమైనది. నారాయణ పండితుని వ్యాఖ్యానము, మల్లినాథసూరి వ్యాఖ్యానము ప్రసిద్ధములు. నైషధ వ్యాఖ్యాతలలో శ్రీనాథుడొకడు గలడు. అతడే కవి సార్వభౌముడగు శ్రీనాథుడని కొందరు ఆంధ్ర విమర్శకులు భావించిరి. కాని నైషధ వ్యాఖ్యాత శ్రీనాథాచార్యుడు. అతని తండ్రి శ్రీకరాచార్యుడు. "శ్రీకరా చార్య పుత్రేణ శ్రీమచ్ఛ్రీనాథశర్మణా'' అని తద్వ్యాఖ్యానమున కలదు. కాబట్టి నైషధ వ్యాఖ్యాత శ్రీనాథాచార్యుడే కాని కవి సార్వభౌముడగు శ్రీనాథుడు కాడని స్పష్టము.

నలువదియారు వ్యాఖ్యానములు గల 'నైషధీయ చరితము' గాఢ పాకముననున్న ప్రౌఢ కావ్యము. శ్రీహర్షుడు బుద్ధి పూర్వకముగానే నైషధీయ చరిత మందక్కడక్కడ గ్రంథ గ్రంథులు నిలిపితిననియు, గురుముఖతః వానిని విప్పికొని రసోర్మికలలో మునిగి తేలవలెననియు కావ్యాంతమున వక్కాణించెను.

శా॥ గ్రంథ గ్రంథి రిహ క్వచిత్ క్వచిదపి న్యాసి ప్రయత్నాన్ మయా
ప్రాజ్ఞమ్మన్య మనాహఠేన పఠతీ మాస్మిన్ ఖలః ఖేలతు
శ్రద్ధారాద్ధ గురు శ్లథీకృత దృఢగ్రంథిః సమాసాదయ
త్వేతత్కావ్య రసోర్మి మజ్జన సుఖ వ్యాసజ్జనం సజ్జనః

**తాత్పర్యము:** "తన్ను ప్రాజ్ఞునిగా భావించుకొనువాడును, తన ప్రజ్ఞా బలము చేతనే కావ్యమును పఠించు వాడునగు ఖలుడు దర్పముతో కేరింతలిడకుండును గాక అని నేనీ కావ్యము నందచ్చటచ్చట బుద్ధి పూర్వకముగా గ్రంథ గ్రంథులను నిలిపితిని. దేవునిగా నారాధింపబడెడి గురుని చేత వ్యాఖ్యానింపబడి, సహజముగా దుర్బోధ్యమైన దైనప్పటికిని తరువాత వివరించి చెప్పుట వలన సుబోధకమై తెలిసి గర్వహీనుడైన సజ్జనుడీ కావ్య రసామృత తరంగములందు మున్కలిడి యానందము ననుభవించును గాక.''

తన కావ్యము గర్వాంధులగు ఖలులకు దుర్బోధకముగా నుండగలదనియు, అచ్చటచ్చట మాత్రమే ఇట్టి గ్రంథ గ్రంథులను సృజించుటచే దీనికి కావ్యత్వహాని చేకూరలేదనియు, గురు పరంపర చేతనే తప్ప ఇందు ఒక్క శ్లోకము కూడ ఎవ్వరికి సుబోధకము కాదనియు శ్రీహర్షుని అభిప్రాయము.

మరియు శ్రీహర్షుడు కావ్యాంతమున ఇట్లు చెప్పెను -

శ్లో॥ "యథా యూనస్తద్వత్ పరమ రమణీయాపి రమణీ
కుమారాణా మంతఃకరణ హరణం నైవ కురుతే
మదుక్తి శ్చేదంతర్మదయతి సుధీభూయస్సుధియః
కిమస్యా నామస్యా దరసపురుషా నాదర భరైః ॥''

**తాత్పర్యము:** "ఏ విధముగా పరమ రమణీయమైన సుందరి తరుణ వయస్కుడైన కామవంతుని యంతఃకరణమును హరించి వేయుచున్నదో, ఆ విధముగా ఆమె క్షీరముచే సంతుష్టి నొందెడి బాలుర చిత్తము కామా యత్తమున హరించుట జరుగనేరదు. అట్లే నాయీ కావ్య రచనా రూపమైన పరమ రమణీయమైన యుక్తి వైచిత్రి కూడ సకల దర్శన రహస్య వేత్తయగు సరస పండితుని చిత్తము నైనచో నానందింపజేయ గలదు. పండితాదరణీయములైన నాపలుకులు రస హీనులును, శబ్దార్థ పరిజ్ఞాన రహితులును, పశు ప్రాయులునైన వారి యొక్క అనాదర పరంపరల చేతనేమి వినియోగము పొందును. వారేమియు నీ కావ్యమున కపకారము చేయలేరు.''

శ్రీ హర్షుని ఈ భావమునే శ్రీనాథుడు శృంగార నైషధ కావ్యావతారిక యందు ఈ క్రింది విధముగా అనువదించెను.

చ. "పనివడి నారికేళ ఫల పాకమునన్ జవియైన భట్ట హ
ర్షుని కవితానుగుంభములు సోమరిపోతులు కొందరయ్యు లొ
నని కొనియాడనేర, రదియట్టిద, లే జవరాలు చెక్కు గీ
టిన వసవల్చు బాలకుఁడు డెందమునన్ గల గంగ నేర్చునే."

శ్రీనాథుడు ఆంధ్రీకరించిన శ్రీహర్షుని నైషధీయ చరితము 2800 శ్లోకముల బృహత్కావ్యము. దానిలో ఇరువది రెండు సర్గలు కలవు. శ్రీనాథుని శృంగార నైషధము ఎనిమిది ఆశ్వాసములతో, 1280 గద్య పద్యములతో ఒప్పుచున్నది. దీనిని బట్టి శృంగార నైషధము శ్రీహర్ష నైషధమునకు పరిమాణమున సగమైనదని భావింపరాదు. నైషధీయచరితమున వృత్త శ్లోకములు బహు స్వల్పము. అనుష్టుప్పు శ్లోకములే అధికము. శృంగార నైషధమున వృత్తము లెక్కువ. అంతేగాక అయిదారు అనుష్టుప్పులను మ్రింగివేయు సీస పద్యములును, గద్యములును గలవు.

శ్రీహర్షుని గ్రంథము నైషధీయ చరితము గదా. దానికి ఆంధ్రీకరణముగ శ్రీనాథుడు శృంగార నైషధమని పేరిడెను. ఇట్టి పేరిడుట శ్రీనాథుని శృంగార శీలమును వెల్లడించుచున్నదని విమర్శకులు కొందరు ఒకానొకప్పుడు భావించిరి. అట్లు భావించుట తగదు. శ్రీహర్షుడే సర్గాంత శ్లోకములందు తన కావ్యము శృంగార రస భరితమని వక్కాణించెను. నైషధీయ చరితము నందతడు ప్రథమ సర్గాంతమున ఈ క్రింది శ్లోకమును రచించెను.

శ్లో॥ "శ్రీహర్షం కవిరాజరాజి మకుటాలంకార హీర స్సుతం
శ్రీహీరస్సుషువే జితేంద్రియ చయం మామల్ల దేవీచ, యం
తచ్చింతామణి మంత్ర చింతన ఫలే శృంగార భంగ్యా మహా
కావ్యే చారుణి నైషధీయ చరితే సర్గోఽయ మాదిర్గతః ॥"

**తాత్పర్యము:** "కవిరాజశ్రేణి మకుటములలో అలంకారమైన వజ్రమణియగు శ్రీహీరుడును, మామల్లదేవియు జితేంద్రియుడైన శ్రీహర్షుని కనిరి. ఆ శ్రీహర్షుని చింతామణి మంత్రోపాసనకు ఫలముగా రచింపబడిన, శృంగార రస బంధురమైన నైషధీయ చరితము నందు ప్రథమ సర్గ సమాప్తము."

దీనిని బట్టి శ్రీహర్షుని వాక్యములను పురస్కరించుకొనియే శ్రీనాథుడు తన కావ్యమునకు శృంగార నైషధమను వ్యపదేశము కల్పించెనని అంగీకరించుట సమంజసము.

## 2.2 శ్రీనాథుని అనువాద విధానము:-

శ్రీనాథుడు నైషధీయ చరితమును యథాతథముగా తెలిగింపలేదు. ప్రాచీనాంధ్ర సాహిత్యమునందలి కథానువాద, భావానువాద, యథాతథానువాద పద్ధతులు మూడింటిలో శ్రీనాథుడు భావానువాద విధానమునే అవలంబించెను. ఈ అనువాద విధానము అత్యంత స్వతంత్రమును కాదు, అత్యంత మూల విధేయమును కాదు. ఇందు మూలానుసరణమును, అనువాద ప్రతిభయు లెస్సగ గోచరించుచుండును.

శ్రీహర్షుని నైషధమున వ్యుత్పత్తి ప్రదర్శనము మెండు. వ్యాకరణము, తర్క శాస్త్రము, వైశేషికము, ఉత్తర మీమాంస, పురాణములు మున్నగు వానికి సంబంధించిన వ్యుత్పత్తి ప్రదర్శనము ఆ కావ్యమున అధికము. శ్రీనాథుడు కథాగతికి, పాత్ర పోషణమునకు భంగము కలుగకుండ యథా మాతృకముగా నైషధీయ చరితము నాంధ్రీకరించెను.

శ్రీనాథుడు ఆంధ్రీకరణము నందు మాతృక యందలి శ్లోక క్రమమును పాటింపలేదు. నల మహారాజు వర్ణనమున శ్లోక క్రమము కంటె వస్తు క్రమము కలదు. అది పాత్ర చిత్రణమున శిల్ప సంబంధమైన క్రమ వికాసమునకు చిహ్నము. శ్రీనాథుడు కథాగమనమునకు భంగము కలిగించు వర్ణనములను సంగ్రహించెను. నలుడు వాహ్యాళికి వెడలుట నైషధీయ చరితములో ఇరువది యొక్క శ్లోకములందు వర్ణింపబడియున్నది. ఇది అతి వేలమైన వర్ణనము. కావున దానిని శ్రీనాథుడు సంగ్రహపరచెను.

ఇట్లే నల దమయంతులు పరస్పరానురక్తులైనట్లు కథా ప్రారంభమైన తరువాత దాదాపు డెబ్బది శ్లోకముల వర్ణనము నైషధీయ చరితమున గలదు. ఈ సుదీర్ఘ వర్ణనము కథాగతికి భంగకరము. అట్టి వర్ణనమును శ్రీనాథుడు 13 గద్య పద్యములలో సంతరించెను.

మూలము నందలి కొన్ని పట్టులను శ్రీనాథుడు తెలిగింప లేదు. నారద పర్వతులు నాకలోకమున కేగి ఇంద్రాదులకు దమయంతీ స్వయంవర వార్తను తెలిపిరి. ఈ ఘట్టమున నారదుడు దేవేంద్రుని స్తుతించినట్లు మాతృకలో మూడు శ్లోకములు కలవు. శ్రీనాథుడు వానిని తెలిగింపలేదు. కలిభటులు వైదిక మతమును ఖండించు సందర్భమున, కలి పురుషుడు నాస్తిక మార్గమున వర్తించు సందర్భమున నైషధీయ చరితము నందు బౌద్ధ జైన చార్వాక పాశుపత కాపాలికాది మత సిద్ధాంతములు కుప్పతిప్పలుగా నున్నవి. శ్రీనాథుడు కథాగతికి భంగము కలుగకుండునట్లు వానిని సంక్షిప్తముగా తెలిగించెను.

సంస్కృత నైషధమును విద్యదౌషధము చేసిన మరియొక విశేషము శ్రీహర్షుని శ్లేష కవిత్వము. సంస్కృత భాషలో సహజముగా శ్లేషకు కావలసినంత అవకాశముండును. కావుననే నైషధీయ చరితము శ్లేష బంధురమైనది. ఆ శ్లేష సంస్కృత భాషలో మాత్రమే సాధ్యము. దానిని తెలుగునకు తెచ్చుట అశక్యము. శ్రీనాథుడు సంస్కృత భాషా మాత్ర సాధ్యమైన శ్లేష గల పెక్కు శ్లోకములను పరిత్యజించెను.

శ్రీనాథుడు వదిలిన మరియొక ప్రముఖ ఘట్టము పంచనైషధి. దమయంతీ స్వయంవర సందర్భమున నల రూపమును ధరించిన ఇంద్రాది దిక్పాలకులు నలువురను సరస్వతీ దేవి దమయంతికి చూపి వర్ణించునపుడు శ్రీహర్షుడు ఆమె నోట నలపరముగా ఇంద్రాది దిక్పాల పరముగా గాఢ గూఢ శ్లేషను ప్రయోగించెను. దానిని ఆంధ్రభాషలో అవతరింపజేయుట అశక్యము. కావుననే శ్రీనాథుడు దానిని వదలెను.

రసపోషణమున శ్రీనాథుడు మిక్కిలి శ్రద్ధ వహించెను. నలుడు హంసను పట్టుకొనిన ఘట్టము దీనికి తార్కాణము. ఈ ఘట్టమున శ్రీనాథుని స్వతంత్రత అత్యధికము. ఈ స్వాతంత్ర్యము శ్రీహర్షుని శ్లోకములను విడచుట యందు, స్వతంత్ర కల్పనములు చేయుట యందు గోచరించును. మాతృకలో ఈ ఘట్టమెట్లు కరుణరస బంధురమో - అట్లే - శృంగార నైషధ కావ్యము నందు కరుణ రస బంధురమే. ఇట్టిదే మరియొక ఘట్టము దమయంతీ కళ్యాణయాత్ర. ఆ ఘట్టమున శ్రీనాథుని రసపోషణము అభిజ్ఞాన శాకుంతలము నందలి శకుంతలా నిర్గమన సన్నివేశమును గుర్తునకు తెచ్చును. దమయంతి సోదరులైన దమదమనులు తండ్రి యానతి చొప్పున దమయంతికి వస్తువులిచ్చుటయే కాక "పసుపు కుంకుమ, మాన్యము" లిచ్చినట్లు శ్రీనాథుడు వర్ణించెను. ఇది అచ్చముగా తెలుగు నాటి ఆచారము.

పాత్ర పోషణము నందు సైతము శ్రీనాథుడు స్వాతంత్ర్యమును చూపెను. హర్ష నైషధము నందలి నలుని రాయబార ఘట్టమే దీనికి తార్కాణము. ఈ ఘట్టము రసవంతము. నైషధీయ చరితమున ఇది మొత్తము 227 శ్లోకములకు విషయముగా నున్నది. అది శ్రీనాథుని ఆంధ్రీకరణము 118 గద్య పద్యము లైనది. ఇప్పట్టున శ్రీహర్షుని దమయంతీ పాత్ర చిత్రణమునకు, శ్రీనాథుని దమయంతీ పాత్ర చిత్రణమునకు ఎంతో వ్యత్యాసము కలదు. శ్రీహర్షుని దమయంతి సామాన్య. శ్రీనాథుని దమయంతి ధీరోదాత్త. ఈ భేదము దూత్య ఘట్టము నందంతట కలదు.

మొత్తం మీద శ్రీనాథుడు నైషధీయచరితమును సంస్కరించుట, సంక్షిప్త మొనర్చుట సర్వత్ర కలదు. ప్రధానముగా శ్రుతి మించిన శృంగార కల్పనలు, అతి వేలములైన వర్ణనములు పంత్యక్తములైనవి. అనేక శ్లోకములను పరిత్యజించుటయే కాక, సంగ్రహించిన శ్లోకములను సైతము ఏకదేశముగనే శ్రీనాథుడు తెలిగించెను. కథాగమనము పట్ల, పాత్ర చిత్రణము పట్ల శ్రీనాథుని చూపు ప్రశంసార్హము. అంగిరసమైన శృంగారము నందు కంటే, అంగ రసమైన కరుణము నందు శ్రీనాథునకు అభిమానమెక్కువ. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు “ ఒక్క మాటలో శ్రీహర్షుని నైషధీయ చరిత మొక నైమిశారణ్యము. శ్రీనాథుని శృంగార నైషధ మొక నందనోద్యాన వనము'' అని కవి సార్వభౌముని ఆంధ్రీకరణమును గూర్చి పలికిరి.

## 2.3 నైషధాంధ్రీకరణ పద్ధతి:-

మామల్లదేవీ నందనుడు, శ్రీహీర రోహణాచల రత్న ప్రరోహము, చింతామణి మంత్ర చింతన ఫలంబు, కన్యాకుబ్జ రాజాస్థాన రంగ మంగళాభరణంబు, గౌడ విజయ కావ్యకర్త, కవిచక్రవర్తి, ఖండన గ్రంథకారుఁడు, వైతండిక కమల షండ వేదండమునకు భట్ట హర్ష మహాకవీశ్వరుఁడు, కవి కులా దృష్టాధ్వపాంధుఁడు నైషధీయ చరితమును మహా కావ్యముగా నిర్మించెను. ఆ ప్రౌఢ మహాకావ్యమును శ్రీనాథుడు నిండు జవ్వనమున యందు తెలిగించెను. నైషధీయ చరితమును తానెట్లు తెలిగించెనో శ్రీనాథుడే శృంగార నైషధమున కావ్యోపసంహారము నందు వక్కాణించెను.

“.................... నైషధ శృంగార కావ్య ప్రబంధ విశేషంబున, నశేష మనీషి హృదయంగమంబుగ, శబ్దంబనుసరించియు, నభిప్రాయంబు గుఱించియు, భావంబు పలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యంబాదరించియు, ననౌచిత్యంబు పరిహరించియు, మాతృకానుసారంబున చెప్పంబడిన యీ భాషా నైషధ కావ్యంబు ..................'' నైషధాంధ్రీకరణ సమయమునందు శ్రీనాథుడు గావించిన ప్రతిజ్ఞ యిది. ఈ ప్రతిజ్ఞ యందలి ప్రతి పదము సార్థకము.

భట్ట హర్షుడొనర్చిన నైషధీయ చరితమే శృంగార కావ్యమని శ్రీనాథుడే స్పష్టముగా ప్రతిపాదించెను. ‘ఆంధ్ర భాషా విశేషంబున’ అనగా కేవలమాంధ్ర భాషలోనని యర్థము కాదు. ఆంధ్ర భాషానుసారమైన ఆంధ్రీకరణమని అర్థము. ఆంధ్ర భాషా స్వభావమునకు తగినట్లుగా శ్రీనాథుడు నైషధమును తెలిగించెనని అర్థము. కాబట్టియే నైషధీయ చరితమున గల శ్లేషను పంచ నైషధి ఘట్టము మున్నగు వానిని శ్రీనాథుడు వదలెను. సంస్కృత భాషా సాధ్యములైన, ఆంధ్ర భాషా సాధ్యము కాని సందర్భములను విడిచి, మాతృక ననుసరించుచునే ఆంధ్ర భాషా సహజములైన సందర్భము లాంధ్రీకరించెనని మనము ఆంధ్ర భాషా విశేషంబున అనుదాని కర్థము చెప్పవలెను. ‘అశేష మనీషి హృదయంగమంబుగా’ అనుట కూడా అర్థవంతమే. శ్రీహర్షుని నైషధీయ చరితమెంత హృదయంగమమో అంతకంటే వేయింతలు మేధా బోధకము. దానికి హేతువు శ్రీహర్షుని వ్యుత్పత్తి ప్రదర్శనమే. కేవల బుద్ధి గమ్యములైన వ్యుత్పత్తి విశేషములు వదలి నైషధీయ చరితము నందలి హృదయంగమములైన ఘట్టములనే శ్రీనాథుడాంధ్రీకరించెనని మనము భావింపవలయును. సారాంశమేమనగా శ్రీనాథుడు ఆంధ్ర భాషా స్వభావము ననుసరించి నైషధీయ చరితము నందలి హృదయంగమములగు ఘట్టములను తెలిగించెను. ఇక కవి సార్వభౌముడు తాను గావించిన ప్రతిజ్ఞ నెట్లు చెల్లించుకొనెనో పరిశీలింపవలయును.

1. **శబ్దానుసరణము:-** ‘శబ్దంబనుసరించి’ అనగా నైషధీయ చరిత మందలి శబ్దములను యథాతథముగా అనుసరించుట అని యర్థము. శ్రీనాథుని శబ్దానుసరణము బహు విధములుగా నున్నది. అతడు మాతృక యందలి పారిభాషిక పదములను, ప్రౌఢ పదగుంఫనములైన పద బంధములను, రీతి మనోహరములైన సమాసములను తన ఆంధ్రీకరణమున స్వేచ్ఛగా ఉపయోగించుకొనెను. ఒక్కొక్కసారి శ్రీనాథుడు మాతృక యందలి శ్లోకమును గద్య రూపమున గాని, పద్య రూపమున గాని సంతరించుట కలదు.

   “అవశ్యశంకా వ్యభిచారహేతుః'', “రామణీయక గుణాద్వయవాదం మూర్తమ్'' అను సందర్భములలో ఆయా శాస్త్రముల పారిభాషిక పదములు కలవు. వానిని శ్రీనాథుడు యథాతథముగ ఉపయోగింప నిశ్చయించి

"అవశ్యశంక వ్యభిచారి హేతువన", "మూర్తంబైన
రామణీయక గుణాద్వయ వాదంబు" అని ప్రయోగించెను.
మాతృకలో "ఆనంద మృద్వీక మత్తః",

"కనీనికా నీలమణేః" అని యుండగా శ్రీనాథుడా పదబంధములనే తెలుగులో "ఆనంద మృద్వీక మత్తుండయి", "కనీనికా నీలమణులకు" అని ప్రయోగించెను. ఇట్లే శ్రీనాథుడు మాతృక యందలి సమాసములను ఉన్నవానినున్నట్లుగా ఆంధ్రీకరణమున ఉపయోగించుకొనెను.

మాతృకలో

శ్లో॥ " సువర్ణ దండైక సితాత పత్రిత జ్వలత్ప్రతా పావళి కీర్తిమండలః" అని యుండగా శృంగార నైషధములో

సీ॥ "తపనీయదండైక ధవళాత పత్రితో
ద్దండ తేజః కీర్తి మండలుండు" అని కలదు. మాతృక యందలి

"నిస్త్రింశత్రుటి తారి వారణ ఘటా కుంభాస్థి కూట స్థల" అనునది అనువాదమున
"క్రూరాసి త్రుటి తారి వారణ ఘటా కుంభాస్థి కూటస్థలీ" అనియు
"విచిత్ర వాక్చిత్ర శిఖండి నందనః" అనునది
"విచిత్ర వాక్చిత్ర శిఖండి నందనుఁడు" అనియు తెలిగింపులో అవతరించినవి.

ఇట్టి తెలిగింపు వలననే శ్రీనాథుఁడు నైషధీయ చరితమునకు డు ము వు లు చేర్చి శృంగార నైషధమును రచించెనని సమకాలిక విద్వాంసులు పరిహాసమొనర్చినట్లు కింవదంతి కలదు.

ఇంతేకాక మూల సంస్కృత శ్లోకములందలి సమాసములలో నున్న ఒకటి, రెండు మాటలను మార్చి ఆంధ్ర భాషానుకూలముగా శ్రీనాథుడు తెలిగించెను. మాతృకలో

శా॥ "అశ్రాంత శ్రుతి పాఠపూత రసనావిర్భూత భూరిస్తవా
జిహ్మ బ్రహ్మముఖౌఘ విఘ్నిత నవ స్వర్గ క్రియాకేలినా"

అని కలదు. అది శృంగార నైషధమున ఆంధ్ర భాషా పద్య స్వభావమును బట్టి

శా॥ "వేదా భ్యాస విశేష పూత రసనా విర్భూత భూరిస్తవా
సాద బ్రహ్మము ఖౌఘ విఘ్నిత నవ స్వర్గ క్రియాకేలిచే"

అని రూపొందినది.

మాతృక యందలి "అస్తి వామ్యభర మస్తి కౌతుకమ్" అను శ్లోకము యథాతథముగా తెలుగులోనిట్లు రూపొందెను.

తే॥ "అస్తి వామ్య భార, మస్తి కౌతూహలం,
బస్తి ఘర్మ సలిల, మస్తి కంప,
మస్తి భీతి, యస్తి హర్ష, మస్తి వ్యథం,
బస్తి వాంఛమయ్యె నపుడు రతము."

2. **అభిప్రాయము గూర్చి:-** "అభిప్రాయమును గుఱించి" అనగా అభిప్రాయమును గుర్తించి అని యర్థము. శ్రీనాథుడు

బహు వారములు నైషధీయ చరితమును సమ్యక్ పరిశీలనము కావించి శ్రీహర్షుని ప్రధానమైన అభిప్రాయములు గుర్తించి కూర్చిన సందర్భములనేకములు కలవు. హంస దూత్యమున దమయంతి నలపరమైన విరహమున మునిగి ప్రబంధనాయిక వలె చంద్రుని, మన్మథుని దూషించి చివరకు మూర్ఛిల్లినది. ఆమెకు సఖులు శిశిరోపచారములు చేయు సందర్భమున వారి కలకలము వినిన భీమభూపాలుని ప్రవర్తనమును శ్రీహర్షుడు 5 శ్లోకములలో వర్ణించెను. భీమ భూపాలుడు దమయంతి చెలికత్తెల కలకలము విని భీతి చెంది అంతఃపురమునకు వచ్చినపుడు అంతఃపురాధికారులైన మంత్రి, వైద్యుడు ఒక్క వాక్యమునే రెండు విధములుగా చెప్పినట్లు శ్రీహర్షుడు శ్లేష సహాయమున వర్ణించెను. ఆ శ్లేష భీమభూపాలుడు గ్రహించెనో లేదో ఎవరికిని తెలియదు. దీని మూలమున శ్రీహర్షుని శ్లేషాలంకార ఘటనా నైపుణ్యము, వైద్యశాస్త్ర పాండిత్యమును వెల్లడియగుచున్నవి. ఆ శ్లేష ఆంధ్ర భాషా సాధ్యము కాదు. ఇంతకునా సందర్భమున ఆ శ్లేషకు ఉపయోగము లేదు. ఈ సందర్భమున కథకావశ్యకమైన 'అభిప్రాయమును గుర్తించి' దానినే శృంగార నైషధమున శ్రీనాథుడు సంఘటించెను.

"సఖీ జనంబుల కలకలంబాలించి, యిది యేమి కోలాహలంబని,
భీమభూపాలుండు దేవీ సహితుండై యడుగ ........................"

ఇట దమయంతి అంతఃపురమునందలి కోలాహలము విని భీమరాజు సపరివారముగా కాక దేవీ సహితుడై వచ్చెనని శ్రీనాథుడు వర్ణించుట విశేషము. పుత్రికలకు సంబంధించిన వ్యవహారములందు పితృమూర్తి కంటే మాతృమూర్తికి ప్రాముఖ్యముండును. దమయంతి మాతృమూర్తి ఈ సందర్భమున వచ్చినట్లు సంస్కృత నైషధమున లేనేలేదు. మంత్రి, వైద్యుల కంటే మాతృమూర్తి ప్రసక్తి ప్రకరణోచితము గదా!

ఇంద్రాదులు నల రూపధారణము చేయుట నైషధీయ చరితమున 7 శ్లోకములందు కలదు. ఈ సందర్భమున దేవతలు నల రూపమును ధరించిరనుటయే ప్రధానమైన అభిప్రాయము. ఆయభిప్రాయము మాత్రమే శ్రీనాథుని ఆంధ్రీకరణమున కలదు.

తే॥ "కదిసి పరిపాటి మణి మంచకముల మీఁద,
రాకుమారకులై యున్న నాక విభులు
నలుని యమకంబులై యున్కిఁదెలియఁజూచి,
తారు నవ్వేళ నల రూపధారులైరి."

ఇక దమయంతి ఇంద్రాదుల దేవతా చిహ్నములను గుర్తించుట సంస్కృత నైషధమున 7 శ్లోకములందు కలదు. అట ప్రధానాభిప్రాయమును గుర్తించిన శ్రీనాథుడు ఆ 7 శ్లోకములకును ఒక పద్యమును మాత్రమే వ్రాసెను.

మ॥ "ధరణింబొందని కోమలాంఘ్రి కమల ద్వంద్వంబులున్, ఘర్మశీ
కర యుక్తంబులు గాని ఫాలములు, వక్షః క్షోణులన్, బత్రకే
సరముల్ గందని పూవుదండలు, నిమేష వ్యాఖ్యగైకోనిదృ
క్సరసీ జంబులు నల్వురందుఁగని యెన్ గాంతాలలామంబొగిన్."

ఈ విధముగా శ్రీనాథుడు సందర్భోచితములుగాని వర్ణనముల నెల్ల సంక్షిప్తములుగా చేసెను. ఈ సంక్షిప్తత శ్రీనాథుని సీస పద్య రూపాంధ్రీకరణము నందు స్పష్టముగా వెల్లడియగును. మొత్తము మీద శ్రీహర్షుడు తన వ్యుత్పత్తిని ప్రదర్శించిన పట్టులలో, శ్లేష సన్నివేశములలో, అతి వేల వర్ణనములలో శ్రీనాథుడు ప్రధానమైన అభిప్రాయమును గుర్తించియే ఆంధ్రీకరణమును కొనసాగించెను.

3. **భావోప లక్షణము:-** ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు నైషధాంధ్రీకరణమును గురించి వ్రాయుచు "నైషధాంధ్రీకరణము అతి సాహసము. కీర్తియే ప్రాణమనుకొనెడి యీనాటి కవి యెవ్వడును సాహసింపడు. నేటికిని నైషధమును తెనిగింపగల కవి

మఱియొకడు కానరాడు'' అని వక్కాణించిరి. విద్వదౌషధమైన నైషధమును "న భూతో న భవిష్యతి'' అనునట్లుగా శ్రీనాథుడు తెలిగించెను. అతని యాంధ్రీకరణమున ప్రముఖ లక్షణము భావోపలక్షణమని చెప్పవచ్చును. శ్రీనాథుడు ప్రకటించిన ఆంధ్రీకరణ ప్రణాళికలో "భావంబుపలక్షించియు'' నన్నది మూడవ విషయము. ఇదియే శృంగార నైషధమున కెల్ల జీవలక్షణము. ఇందే ఆతని స్వతంత్రాంధ్రీకరణము సహస్ర ముఖముల వెల్లడి యగుచున్నది. ఈ భావోపలక్షణము శ్రీనాథుని స్వాతంత్ర్యమునకు మాత్రమే కాక మరి కవితా ప్రాభవమునకును మణి దర్పణము.

లక్ష్మీకాంతము గారనినట్లు "మూల శ్లోకమును బీజ ప్రాయముగా గైకొని దానినొక పుష్పిత వల్లి వోలె స్వకపోలకల్పనతో పెంచుటయే'' భావోప లక్షణము. అనగా మూల శ్లోకము నందలి భావము నుపలక్షించి స్వతంత్ర కల్పనముతో తెలిగించుట అని అర్థము. అట్టిచో నిది "అభిప్రాయము గుఱించి'' అనుదానికి వ్యతిరేకము. మొదటి దాని యందు సంక్షిప్తీకరణముండగా భావోప లక్షణము నందు ప్రపంచీకరణము (పెంపు) గోచరించును. సంక్షిప్తీకరణము నందు కవికి గల సంయమనము కానవచ్చును. ప్రపంచీకరణము నందు కవికి గల భావనా శక్తి భాసించును. ఈ గుణము వలననే శ్రీనాథుడు హరవిలాసమున తన్ను "ఆంధ్ర భాషా నైషధాబ్జభవుని'' నని వర్ణించుకొనెను. అబ్జ భవుడనగా బ్రహ్మ. ఆతడు సృష్టికర్త. అట్లే శ్రీనాథుడును నైషధాంధ్రీకరణమున స్వతంత్ర సృష్టికర్త యయ్యెను. ఆ సృష్టికర్త లక్షణము అమూలకములైన స్వతంత్ర కల్పనములందు కానవుచ్చును.

హంస నలుని చేత చిక్కినప్పుడు

శ్లో॥ " పదే పదే సంతి భటా రణోద్భటా
నతేషు హింసా రస ఏష పూర్యతే
ధిగీదృశం తే నృపతేః కు విక్రమం
కృపాశ్రయే యః కృపణే పతత్రిణి''

అని యనును. "రణ సమర్థులైన భటులు సర్వత్రనున్నారు. ఈ హింసా చర్యలు వారి మీద ప్రయోగింపరాదా? మహారాజవైన నీ దుష్ట పరాక్రమము దయ చూపవలసినదియు, దీనమైనదియునైన యీ హంసము మీదనా చూపించుట? ఎంత నీచము!'' అనునది ఈ శ్లోక తాత్పర్యము. హంస వాక్యములు తీవ్ర పద్ధతిలో నిందా రూపముగా కొనసాగినవి. అది నలుని తూర్పారబట్టినట్లున్నది.

ఇప్పుట్టున శ్రీనాథుడిట్లు తెలిగించెను.

ఉ॥ "హింసయ నీకు వేడ్క యగునేని కృపాశ్రయమైన యీ సరో
హంసముఁ జంప నేల? కఱవా? తరువాత వసుంధరాధిపో
త్తంస! విజృంభమాణ భుజదర్ప నిరంకుశ సాహసక్రియా
మాంసల చిత్త వృత్తులయి మత్తిలి యుండు నరాతి భూపతుల్''

ఈ యాంధ్రానువాదము నందు హంసము "ఓ మహారాజా! నీకు హింసయందాసక్తి యున్నచో దయదలప దగిన ఈ హంసయా నీకు దొరికినది? అతిశయించిన భుజ గర్వముతో కన్నుమిన్ను గానక బలసియున్న శత్రురాజులు లోకములో కఱవైరా'' అని పలుకుచున్నట్లున్నది.

భావ మొక్కటియే యైనను మాతృకానువాదముల మధ్య బ్రహ్మాండమైన వ్యత్యాసము కలదు. అనువాదమున హంస నలునకు సలహా చెప్పుచు వేడుకొనుచున్నట్లున్నది. అనువాదము నందలి సుదీర్ఘమైన సమాసము శ్రీనాథుని స్వతంత్ర సృష్టి. అది అరాతిభూపతుల మదమును ధ్వనించుచున్నది.

మాతృక శ్లోకముల యందలి కొన్ని పదములు లోభ పెట్టుటచే వానిని విడువక ప్రయోగింపవలెనని యెంచి స్వతంత్ర కల్పనములతో శ్రీనాథుడు భావములను పెంచి వ్రాయుచుండును.

శ్లో॥ "సరసీః పరిశీలితుం మయా
గమి కర్మీకృత నైక నీ వృతా
అతిథిత్వమనాయి సాదృశో
సదసత్సంశయ గోచరోదరీ"

"లోకములో నున్న సరస్సులను పరిశీలించుటకు నా చేత అనేక జన పదములు గమ్ ధాతువునకు లక్ష్యములుగా చేయబడినవి - అనగా అనేక జన పదముల యందలి పట్టణములు, పల్లియలు మొదలగు వానిని చూచుటకు వెళ్ళితినని యర్థము. అట్టిచో ఉన్నదియా, లేదా అను సందేహము కలిగించు నడుము కలిగిన దమయంతి నా కనువిందుగా గోచరించినది."

శ్రీనాథుడు ఈ శ్లోక భావమును రెండు పద్యములలో పెంచి వ్రాసెను.

మ. "మృదురీతిన్ బ్రతివాసరంబు గమికర్మీభూత నానా నదీ
నద కాంతార పురీ శిలోచ్చయుఁడనై నైకాద్భుత శ్రీజిత
త్రిదివంబైన విదర్భ దేశమున నారీ రత్నమున్ గాంచితిన్
సదసత్సంశయ గోచరోదరి శరత్సంపూర్ణ చంద్రాననన్."

మ. "కమలేందీవర షండ మండిత లసత్కాసార సేవారతిన్
గమికర్మీకృతనైక నీవృతుఁడనై కంటిన్ విదర్భంబునన్
రమణిం బల్లవ పాణిఁ బద్మనయనన్ రాకేందు బింబాననన్
సమపీనస్తని, నస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్."

మాతృక శ్లోకము నందు రెండు విశేషములు గలవు. ఒకటి "గమికర్మీకృత" శబ్ద ప్రయోగము. రెండు "సదసత్సంశయ గోచరోదరీ" యను సమాస ప్రయోగము. మొదటిది వ్యాకరణ విశిష్టము. రెండవది మనోహరమైన సమాసము. ఆ రెంటిని యథాతథముగ నుపయోగించి శ్రీనాథుడు రెండు పద్యములు వ్రాసెను. మొదటి పద్యమున సమాసము కలదు. రెండవ పద్యమున వ్యాకరణ విశిష్ట ప్రయోగము కలదు. అంతేకాక శ్రీహర్షుని వలెనే తాను గూడ సమాస సృష్టి నిపుణుడనే యని ప్రకటించుకొనుటకా యన్నట్లు కవి సార్వభౌముడు "అస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరి" యను నూత్న సమాసమును సృష్టించెను. ఈ సమాసమునే పెదకోమటి వేమారెడ్డి ఆస్థానముననున్న వామన భట్ట బాణుడు తాను రచించిన 'పార్వతీ పరిణయము' అను నాటకమున ప్రయోగించెను.

పై రెండు పద్యములలో శ్రీనాథుని స్వతంత్ర దృష్టి ఎంతయో కలదు. "సరసీః పరిశీలితుమ్" అనుదానిని అనువాదమున రెండు రకములుగా శ్రీనాథుడు వ్రాసెను. "గమికర్మీభూత నానానదీనద కాంతారపురీ శిలోచ్చయుడనై" అను సమాసమున సరస్సుల ప్రస్తావమే లేదు. నదీనద పర్వతాదుల కంటే సరోవరములు హంసములకు కరము హర్షదాయకము. ఈ రహస్యము శ్రీనాథునకును తెలియును. కావుననే రెండవ పద్యమున "కమలేందీ వర షండ మండిత లసత్కాసారసేవారతిన్" అని ప్రయోదించెను. సాధారణ సరోవరముల కంటే కమలేందీ వరములు కలిగిన సరోవరములు హంసల కిష్టము గదా. మాతృక శ్లోకము నందలి 'సరసీః' అనుదానికి అనువాదమున విశేషణము కల్పింపబడినది.

ప్రథమ పద్యమున "నైకాద్భుత శ్రీజిత త్రిదివంబయిన విదర్భ దేశమున'' అని కలదు. ఇది ఆమూలకమైన పెంపు. ఇట శ్రీనాథుని శిల్ప దృష్టి వెల్లడియగుచున్నది. విదర్భ దేశము అనేకాద్భుత శోభలచే స్వర్గము కంటే మిన్నయైనది. అట్టి విదర్భ దేశమున దమయంతి కేవల స్త్రీ మాత్రము కాక 'నారీ రత్నము'. అనగా స్వర్గము కంటే తక్కువయగు ఇతర దేశ స్త్రీల కంటే, స్వర్గము కంటే మిన్నయగు విదర్భ దేశ స్త్రీల కంటే దమయంతి సుందరియని సారాంశము. ఆమె యట్టి సుందరి కానిచో నలుడామె యందనురక్తుడగుట, హంసను దూతగా పంపుట మొదలైన ఉత్తర కథలకు కారణములే యుండవు.

ఈ సమాసము కథా పోషకమగుచున్నది.

4. **రస పోషణము:-** నైషధీయ చరితము నందలి రసము శృంగార నైషధమున పోషింపబడుట రస పోషణ మనబడును. శబ్దానుసరణము మొదలగునవన్నియు దీనికి సహకారులే. కావ్యము నందు నవరసములుండవచ్చును. కాని ప్రధాన రసమొక్కటియే. దానికే అంగిరసమని పేరు. తదితరములు అంగరసములు. అవి ప్రధాన రసమునకు పోషకములు. అంగిరసము కంటే అంగరసములు అతిశయముగ నుండరాదని అలంకారిక నియమము.

నైషధీయ చరితమును గూర్చి శ్రీహర్షుడే "శృంగార భంగ్యా మహా కావ్యే చారుణి నైషధీయ చరితే'' అని వక్కాణించెను. దీనిని బట్టి శ్రీనాథుడు నైషధీయ చరితమును శృంగార నైషధమను పేరుతో తెలిగించెను. పేరును బట్టియే ఈ కావ్యమున శృంగారము ప్రధాన రసమని తెలియును. అంగరసముగా కరుణము రెండు స్థలములందు గలదు. అందు మొదటిది హంస నలునకు పట్టువడిన సన్నివేశము, రెండవది భీమభూపాలుడు నల దమయంతులను నిషధ రాజధానికి పంపునట్టి సందర్భము. నల దౌత్య ఘట్టము నందు అంగరసము దాన వీరము. కలి పురుష ఘట్టము శాంత రస సంబంధి. కాని, యందు శాంతము రసస్థాయి నందు కొనలేకపోయినది. కావున అది భావముగనే మిగిలిపోయినది. నల మహారాజు గావించిన పూజాదులందు భక్తి భావము లెస్సగా వర్ణింపబడినది. మొత్తము మీద శృంగార నైషధమున శృంగారము అంగిరసమని, కరుణ, దాన, వీరములు అంగ రసములని వక్కాణింపదగును.

శృంగార రసమునకు స్థాయి రతి. రతి యనగా సంభోగ విషయ సంబంధమైన ఇచ్ఛా విశేషము. ఈ రతి మొట్టమొదట నాయికకు, తదుపరి నాయకునకు జనించినట్లు కావ్యము నందు వర్ణింపబడవలెనని ఆలంకారిక నియమము. ఆ నియమానుసారము నైషధీయ చరితము నల వర్ణనముతో ప్రారంభమయ్యెను. దమయంతి నలుని యందనురక్తయను విషయమే మొట్టమొదట కలదు. అనగా రతి ప్రథమతః నాయికకు జనించినట్లు వర్ణించుటయే. ఈ నియమ పాలనము శృంగార నైషధమునందును కలదు. శృంగార రసానుకూలముగా ఉద్దీపన విభావములు చక్కగా వర్ణింపబడినవి. భావ హావ హేలాదులు పదునెనిమిది శృంగార చేష్టలనబడును. నైషధీయ చరితము నందు దమయంతి పరిచయ ఘట్టములోనే ఆమె శృంగార చేష్టలు వర్ణింపబడినవి. అవి యన్నియు శృంగార నైషధమున సంఘటింపబడినవి. నిర్వికారమైన చిత్తమున ప్రప్రథమమున కలిగిన వికారము 'భావ'మను శృంగార చేష్ట.

మ. "జనకుంగొల్వఁగ వచ్చినప్పుడు తదా స్థానంబులో ఁబాఠకుల్
వినుత ప్రౌఢి వసుంధరాధిపతులన్ వేర్వేఱఁగీర్తించుచో
వనితా రత్నము వీర సేన తనయున్ వర్ణింపఁగా నున్నత
స్తన భారంబు కెలంకులన్ నిమచుఁజంచల్లీల రోమాంచముల్.''

ఇందు భావమును శృంగార చేష్ట వర్ణితము. రోమాంచమను సాత్త్విక భావమును కలదు. ఇక భావము కొంచెము వ్యక్తమైనచో హావమగును.

సీ. "నలనామధేయమైన తృణంబు వినఁబడ్డ
నధిపతి పేర్విన్నయట్ల యలరు"

ఇట హావము కలదు. భావము చక్కగా వ్యక్తమైనచో హేల. ఈ హేలాదులు మాతృక ననుసరించి అనువాదమునందును లెస్సగా వర్ణితములైనవి.

కరుణ రసము నలునకు హంస పట్టువడిన సందర్భమున బహుముఖముగా వర్ణింపబడినది. నైషధీయ చరితమున హంస నలునితో ఇట్లనినది.

శ్లో॥ "మదేక పుత్రా జననీ జరాతురా
నవ ప్రసూతి ర్వరటా తపస్వినీ
గతిస్తయో రేష జనస్తమర్దయ
న్నహో విధేత్వాం కరుణా రుణద్ధి॥"

దీనిని నిమిత్త మాత్రముగా చేసికొని స్వతంత్ర కల్పనముతో కరుణ రస స్థాయి యగు శ్లోకమును శ్రీనాథుడిట్లు తెలిగించెను.

సీ. "తల్లి మదేక పుత్రక, పెద్ద, కన్నులు
గానదిప్పుడు; మూడు కాళ్ల ముసలి;
యిల్లాలు గడు సాధ్వి యేమియు నెఱుఁగదు,
పరమ పాతివ్రత్య భవ్యచరిత;
వెనుక ముందర లేరు నెనరైన చుట్టాలు,
లేవడి యెంతేని జీవనంబు;
గానక కన్న సంతానంబు శిశువులు,
జీవన స్థితికేన తావలంబు;"

తే. "కృపఁదలంపఁగదయ్య యో నృపవరేణ్య!
యభయమీవయ్య! యోతుహినాంశువంశ!
కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి,
నిగ్రహింపకుమయ్య యోనిషధరాజ!"

ఈ హంస పరివేదనము నలునకే కాక సహృదయునకు సహితము హృదయస్పందనము కలిగించి కరుణ రస తన్మయత్వము కలిగించుట తథ్యము. ఇట మూలమున హంస ఇంకను తన వారిని స్మరించి తల్లడిల్లుట కలదు. అది సంక్షిప్తముగా శ్రీనాథుని ఆంధ్రీకరణము నందును గలదు. మొత్తము మీద నీ ఘట్టము "ఏకోరసః కరుణ ఏవ" అను భవభూతి శ్లోకమునకు లక్ష్యముగా నున్నది.

ఇట్టిదే భీమభూపాలుడు వివాహానంతరము నల దమయంతులను సాగనంపు సన్నివేశము. అదియును హృదయమును స్పందింపజేయును. దమయంతి నంపుటకు, నలుని పంపుటకు సమానమైన దుఃఖము భీమభూపాలునకు కలిగినదని శ్రీహర్షుడు చిత్రించెను. కాని దమయంతిని పంపుట కంటె నలుని పంపుటకే భీమభూపాలుడధిక దుఃఖము ననుభవించెనని శ్రీనాథుడు చిత్రించెను.

అయినప్పటికి దమయంతినంపునెడ సహితము భీమభూపాలుని దుఃఖము మూలాతిశాయిగా శృంగార నైషధమున కలదు. పుత్రికారత్నమును అత్తవారి యింటికంపునపుడు కన్నతండ్రి కంట తడిపెట్టి అప్పగింతలు పలుకు సన్నివేశము కరుణరసభరితమగును. కవి కుల గురువగు కాళిదాసుని రూపకములందుత్తమమైన అభిజ్ఞాన శాకుంతలమున మహోత్తమమైన శ్లోక చతుష్టయము కణ్వ మహర్షి శకుంతలను అత్తవారి యింటికి పంపు సందర్భమునందలిదే. నైషధీయ చరితములో ఈ సన్నివేశమున ఒక్క శ్లోకము కలదు. శ్రీనాథుడు ఆ శ్లోకమును సవిస్తరముగా తెలిగించుటయే కాక శాకుంతల శ్లోక చతుష్టయము నందలి యొక శ్లోకమును తెలిగించుట అతని రస పోషణమునకు ప్రబల తార్కాణము. నైషధీయ చరితము నందలి శ్లోకమునకు తాత్పర్యమిట్లుండును.

"ఓ పుత్రీ! నీకు సుకృతమే జనకుడు. ఓర్పు గలిగి యుండుటయే ఆపదల నుండి రక్షించును. మనస్సంతోషము కలిగియుండుటయే ధనము. ఈ చెప్పినదియు, చెప్పక మిగిలినదియు సమస్తము నీకు నలుడే యగుచున్నాడు. ఆతని కంటె పరమైనది లేదు. నాతో గూడ కలిపి ఎవరి సంబంధమును నీకు లేదు."

ఈ భావము శ్రీనాథుని ఆంధ్రీకరణమున ఇట్లు రూపొందినది.

మ. "గురువన్నన్, ధనమన్నఁ, బుణ్యమనిన్, గోత్రోదయంబన్న, దే
వరయన్నన్, మనమన్నఁ, దుష్టియనినన్, వాత్సల్యమన్నన్, నిజే
శ్వరుడన్నన్, బరమోపకారమనిన్, సర్వంబునన్నన్, దలో
దరి! నీకున్ నిషధాధినాథుఁడె సుమీ తథ్యంబుగా (జెప్పితిన్"

ఈ పద్యమున "నాతో కూడ కలిపి యెవరి సంబంధము నీకు లేదు" అను మూలము నందలి విషయము కానరాదు. అది ఉండనక్కర లేదు. నీకు సర్వము నలుడే అని యనుటలో అంతరార్థమదియే గదా! ఈ విధముగా నైషధీయ చరితము నందలి ప్రధాన రసములకు, అప్రధాన రసములకు గల ప్రాధాన్యమే శృంగార నైషధమున సహితము కలదు.

రసపోషణము నందు అంగాంగి భావము సంగతమగుట ఒక ముఖ్య విశేషము. అనగా అంగరసములు అంగిరసము నతిశయించి యుండరాదను విషయమిది. ముఖ్యములైన అంగ రసములు నైషధీయ చరితమందును ప్రధాన రసము కంటె నతిశయముగ లేవు. కాని మాతృక యందు అంగరసమగు శాంతము రసస్థితి నందకపోయినను అపరిమితముగా వర్ణింపబడినది. ఇది ప్రధానమైన శృంగారమునకు అంత ప్రయోజనకారి కాదు. కలి పురుష వృత్తాంతమున ఈ శాంత భావము భాసించుచున్నది. అట్టి వృత్తాంతమున శ్రీనాథుడు స్వతంత్ర కల్పనలు చేసియు మూలమునందలి విస్తృతి నెంతయో తగ్గించి ప్రధాన రసమును పరిపోషించుట ప్రశంసనీయము.

5. **అలంకార భూషణము:-** నైషధీయ చరితాంధ్రీకరణ ప్రణాళికలో "రసంబు పోషించియు" తరువాత "అలంకారంబు భూషించియు" అని కలదు. ఇదియే అలంకార భూషణము.

కావ్యమునకు అలంకారములే ఆత్మయని భామహుని మతము. కాని ఆనందవర్ధనుడు అలంకారములు కావ్యాత్మ ధర్మములు కాక కావ్య శరీర ధర్మములని వక్కాణించెను. నైషధీయ చరితము అలంకారమయము. శృంగార నైషధము కూడ అట్టిదే. శ్రీనాథుడు బహు విధములుగా అలంకారమును భూషించెను.

నైషధీయ చరితము నందలి అలంకారములను మార్చుట, నూతనాలంకారములను చేర్చుట, అమూలకములైన అలంకారములను కల్పించుట శ్రీనాథుని అలంకార భూషణము నందలి విశేషము. నైషధీయ చరితమున నల దమయంతుల వివాహ సమయము నందు శ్రీహర్షుడు ఈ క్రింది విధముగా వర్ణించెను.

"దమయంతి లాజలు వేల్చునెడ నవి యామె కరములందు పల్లవముల వలె, దేవతల ముఖమైన అగ్ని యందు దంతావళుల వలె భాసించినవి." ఇందలి అలంకారము తద్గుణము. ఈ భావమును శ్రీనాథుడిట్లు తెలిగించెను.

ఉ. "కంకణ నిక్వణంబు మొగ కట్టగఁ, గౌనసియాడ, రత్నతా
టంక విభూషణంబులు వడంకఁ, గుచంబులు రాయిడింపగాఁ
బంకజ నేత్ర! గౌతముని పంపున లాజలు దోయిలించి, ధూ
మాంకుని యందు వ్రేల్చె దరహాసము ఱెప్పలలోన దాచుచున్"

ఇందు మూల శ్లోకము నందలి అలంకార సామాగ్రి యేమియు లేదు. కేవలము స్వభావోక్తి కలదు.

సందర్భము వచ్చినప్పుడు నూతనాలంకారములను సృష్టించుటకు శ్రీనాథుడు వెనుకంజ వేయలేదు. నలుడు దమయంతి యందనురక్తుడైనట్లు వర్ణించిన సందర్భములో శ్రీహర్షుడు " దమయంతి గుణము నలుని శ్రవణముల కతిధియయ్యెను. నలుని మహా ధైర్యమును సడలించుటకై మన్మథుడు బాణములు సంధించిన శరాసనము కూడ శ్రవణాతిధియయ్యెను" అని వర్ణించెను. అనగా మన్మథుని విల్లు ఆకర్ణాంతము లాగబడినదని యర్థము. ఈ భావమును శ్రీనాథుడిట్లు తెలిగించెను.

కం. "శ్రవణావతంసమయ్యెను
ధవళాయత నేత్ర గుణము ధరణీ పతికిన్
శ్రవణావతంసమయ్యెను
బువు వింటి గుణంబునపుడ పుష్పాస్త్రునకున్"

ఈ పద్యమున మూల శ్లోకము నందలి కావ్య లింగాలంకారము కలదు. మరియు "శ్రవణావతంసమయ్యెను" అను శబ్ద సమూహమే కాక దమయంతి గుణము నలుని శ్రవణములకు, పువు వింటి గుణము మన్మథుని శ్రవణములకు అవతంసములయ్యెనను నర్థము కూడ ఆవృత్తమైనది. కావున నిది పదార్థో భయావృత్తి దీపకాలంకారము. ఇదియే శ్రీనాథుని స్వతంత్ర సృష్టి.

అమూలకాలంకారములను కూడ శ్రీనాథుడు సృష్టింపక పోలేదు. నలుడు దేవదూతయై దమయంతి సన్నిధికి బయలుదేరిన సన్నివేశములో మాతృక యందు "ఇంద్రాదులకు రాయబారము నడుపుటకు శత్రు సంహారియైన నలుడు భీమభూమీపతి రాజధానిని తన రథమునకు లక్ష్యము చేసెను" అను భావము కలదు. దీనిని శ్రీనాథుడు

ఉ. "ఆ పరమోపకార నిధి యప్పుడు వేల్పుల రాయబారమన్
మోపు వహించి, యాదివిజముఖ్యుల వీడ్కొని, చిత్తవృత్తికిన్
జూపునకున్, శతాంగరయ శుద్ధికి లక్ష్యముఁజేసె భూతధా
త్రీ పతి రాజధాని జగతీ రమణీ మణిహార వల్లరిన్"

'రాయబారమన్ మోపు' అను చోట రూపకాలంకారము కలదు. అట్లే 'జగతీ రమణీ' యను చోటను రూపకము కలదు. ఇవి రెండును అమూలకములే.

ఇట్టివి గాక ఇంకను అర్థాంతర న్యాసాలంకారమునకు సంబంధించిన సామాన్య విషయములను, ఉపమాలంకారములకు సంబంధించిన ఉపమానములను శ్రీనాథుడు స్వతంత్రముగా సృష్టించెను. "ఆర్జవంహి కుటిలేషు న నీతిః" అను మూలము నందలి యంశమునకే శ్రీనాథుడు

తే. "కుటిల బుద్ధుల గెలువంగఁ గుటిల మతియ
యర్హమగు గాని, నీతి గాదార్జవంబు"

అను స్వతంత్ర కల్పనము చేసెను. "బాలా హృది లోలశీలే" అను సామాన్యమునకు "బాలికల చిత్తము లంబు తరంగ లోలములో" అని శ్రీనాథుడు తెలిగింపు చేసెను. ఇట్లే "అన్నపూర్ణా దరహాస చంద్రికలఁబోలెడు పాయసాన్నములో" అనుచోట నూతనోపమానమును సృష్టించెను.

6. **ఔచిత్య పోషణము:-** శ్రీనాథుని ఆంధ్రీకరణ ప్రణాళికలో అలంకార భూషణము తరువాత "ఔచిత్యంబాదరించియు" అని కలదు. ఔచిత్య సమాదరమని దీని యర్థము. దీని తరువాత వెంటనే " అనౌచిత్యంబు పరిహరించియు" అని కలదు. అనగా ఔచిత్య పోషణము, అనౌచిత్య పరిహారము రెండును భిన్నములని శ్రీనాథుని అభిప్రాయము. ఆలంకారికముగా కూడ పైరెండును భిన్నములే. వికసించిన విరుల నలంకరించుకొనుట, వాడిన పువ్వులు వర్జించుట రెండును వేరు గదా.

"ఔచిత్యం రస సిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్" అని క్షేమేంద్రుడు పేర్కొనెను. దేనికేది యుచితమో అదియే ఔచిత్యము. ఉచిత పదమొక్కటి యున్నచో శ్లోకము లేక పద్యము కస్తూరి తిలకమును తీర్చిదిద్దుకొనిన కామిని వలె, చందన తిలకము పెట్టుకొనిన శ్యామ వలె శోభాయమానముగా నుండును. రసవంతమైన కావ్యమునకు జీవిత భూతమైన ఔచిత్యము బహు విధములుగా నుండును. పదౌచిత్యము మొదలు ఆశీర్వచనౌచిత్యము వరకు మొత్తము 26 విధముల ఔచిత్యము కలదని క్షేమేంద్రుడు వక్కాణించెను. దూతగా వచ్చిన నలుడు గోచరింపగా దమయంతి మదన వికారము నొంది సిగ్గుపడలేదని శ్రీహర్షుడు వర్ణించెను. అప్పట్టున శ్రీనాథుడీ క్రింది పద్యము వ్రాసెను.

తే. "అతివ మిథ్యావలోకనాభ్యాస కలన
నిజముగా రాజుఁజూచియు నెమ్మనమునఁ
దాల్పదయ్యెను శాలీనతా భరంబు
తథ్య మిథ్యా వివిక్తి ముగ్ధలకుఁగలదె"

ఇట ముగ్ధ అను పదము ఔచిత్య విలసితమై ఒప్పుచున్నది. దీనిని పదౌచిత్యమందురు.

ప్రస్తుతార్థమునకు నుచితమైన ప్రసాద మాధుర్యాది గుణములు సంతరించుట గుణౌచిత్యము. ఇది రసోచితమైన రచనా విధానము. శాంత శృంగారములందు ప్రసాద గుణము, వీరరౌద్ర భీభత్స రసములందు ఓజోగుణము ఉచితము. ప్రసిద్ధ పదములు ప్రయోగించుట ప్రసాద గుణము. ద్విత్వ సంయుక్త పరుషాక్షర పద బంధములతోడి దీర్ఘ సమా సఘటనము ఓజోగుణము. దమయంతీ స్వయంవరము నందు అయోధ్యాపతిని గూర్చి సరస్వతీ దేవి దమయంతికి చెప్పునప్పుడు ఈ క్రింది పద్యములు శ్రీనాథుడు రచించెను.

తే. "ఇతని తాత భగీరథుండతుల మహిమ
నవనిఁబ్రవహింపగాఁజేసె నభ్రగంగ
నితడు త్రైలోక్యమునఁబ్రవహింపఁజేసెఁ
గీరభాషిణి! వరధర్మ కీర్తి గంగ"

శా. "తాదృక్ దీర్ఘ విరించి వాసర కరత్వంబున్ బ్రతిష్ఠించుచున్
యాదోధిన్ దన నీడ బాడబముగా నాకాశ సంవ్యాప్యరి

క్ష్మాదార స్థిర కీర్తి తారకములన్ మాయించు చేత త్రృతా

పాదిత్యుండు వెలుంగుఁబద్మముఖి వాచాగోచర ప్రక్రియన్''

ఇందు మొదటి పద్యము నందలి పదములెల్ల ప్రసిద్ధములు. రెండవ పద్యమున ద్విత్వ సంయుక్త పరుషాక్షర పద బంధముల ధర్మము, రెండవ పద్యమున ప్రతాపము వర్ణింపబడినవి. మొదటి పద్యము శాంతరస విషయము. రెండవది వీరరస విషయము. శాంత రసమున ప్రసాదగుణము, వీర రసమున ఓజోగుణము నుచితములు గదా!

క్లేశరహితమైన అభిప్రాయము నభివ్యక్తీకరించుట అభిప్రాయౌచిత్యము అనగా సంబోధకమైన అభిప్రాయము కల వచనమభిప్రాయౌచిత్యమని తాత్పర్యము.

స్వయంవర సభలో సరస్వతి కాళింగుని గూర్చి దమయంతికి వివరించు సందర్భమున మూలానుగుణముగ శ్రీనాథుడీ క్రింది పద్యమును రచించెను.

తే. వీని రిపుకాంత పతిఁబాసి కానలోనఁ

జెంచుఁబూఁబోఁడులును దానుఁజెలిమి చేసి

చెప్పుఁదమ దేశ వార్తలు చెప్పుచోటఁ

'జల్లనైయుండు మాభూమి చంద్రుఁ'డనుచు

కళింగాధిపతి శత్రువు భార్య పతిని వదలి కానకేగినది. ఆమె పతిని వదలుటకు హేతువు ఆమె భర్త కళింగాధిపతికి భయపడి పలాయితుడగుటయే. కానకేగిన ఆమె చెంచు స్త్రీలతో చెలిమి చేసినది. వారితో ప్రసంగవశమున తన దేశమును గురించి తెలుపునప్పుడు " మా దేశములో చంద్రుడు చల్లనై యుండు '' నని యన్నదట. అనగా ప్రస్తుతము తానున్న కాననములో చంద్రుడు వేడిగా నున్నాడని కలింగాధిపతి శత్రువు భార్య అభిప్రాయము. ఆమె విరహాతిశయమిచ్చట సూచితము. అది ఆమె మాటలలో క్లేశరహితముగా అవగతమగుచున్నది. కావుననిది యభిప్రాయౌచిత్యము. ఈ విధముగా శృంగార నైషధమున రస, ప్రబంధార్థ, పాత్రౌచిత్యములకు ఉదాహరణములు కలవు.

7. **అనౌచిత్య పరిహారము:-** ఔచిత్యము కానిది అనౌచిత్యము. పదౌచిత్యము లేనిచో పదానౌచిత్యము. వాక్యౌచిత్యము లేనిచో వాక్యానౌచిత్యము. ఈ చూపుతో చూచిన శ్రీహర్షుని నైషధీయ చరితమున పెక్కు అనౌచిత్యములు కలవు. శ్రీనాథుని అనౌచిత్య పరిహారము మనోహరము. మూలము నందలి అనౌచిత్యములను వదలి కవి సార్వభౌముడు ఔచిత్య శోభితమగునట్లు తెలిగించెను.

హంస దమయంతితో నలునకు తనకు గల గాఢ మైత్రిని గూర్చి చెప్పుచూ

శ్లో. " సువర్ణ శైలాత్ అవతీర్య తూర్ణం

స్వర్వాహినీ వారి కణావకీర్ణైః

తం వీజయామః స్మరకేళి కాలే

పక్షైః నృపం చామర బద్ధ సఖ్యైః ''

'కనక శైలము నుండి శీఘ్రముగా దిగివచ్చు ఆకాశ గంగా నదీ తోయములలో తడుపబడిన వింజామరముల వలెనున్న నాయీ రెక్కలతో ఆ నలమహారాజు సురతా యాసమును పోగొట్టుటకు వీచుచుందును' అని శ్లోక తాత్పర్యము.

ఇందు పరమానౌచిత్యము కలదు. హంస దమయంతికి నలుని పై అనురాగము కలిగింపనెంచెను. కావున హంస ఆమెకప్రియమైన మాట చెప్పదు. ఇంతకు పూర్వమే నలమహారాజునకు అన్య స్త్రీ సురత పరిచయమున్నట్లు శ్లోకము వలన తెలియుచున్నది. "రాజానో బహు వల్లభాః" అను వచనము దమయంతికి తెలిసిన తెలియును గాక. కాని తన భర్త పరస్త్రీవశుడని ఏ నారీమణియు ఎరిగి సహింపదు. ఇప్పట్టున హంస నల మహారాజునకు గల అన్యస్త్రీ సంబంధము నెత్తకుండుట సహజము. అపుడు గాని దమయంతికి నలుని పై అనురాగము నెలకొనదు.

ఈ రహస్యము గుర్తించిన శ్రీనాథుడు పై శ్లోకమును ఈ క్రింది విధముగా తెలిగించెను.

తే. "కనక శైలంబు డిగ్గి యాకాస సింధు
సలిలములఁదోగి మిగులంగఁజల్లనైన
చారు హాటకమయ గరుచ్చామరముల
వీతునతనికి వైశాఖ వేళలందు"

మాతృకలో సురతా యాసము పోగొట్టుటకు అని కలదు గదా. దానిని శ్రీనాథుడు గ్రీష్మాతపాయాసమును పోగొట్టుటకని మార్చెను. శ్రీనాథుని ఔచిత్య నిర్వహణమున కిది ప్రబల తార్కాణము.

నైషధీయ చరితమున నల సౌందర్య వర్ణన ఘట్టములో శచీదేవియు, త్రిమూర్తుల భార్యలును, రంభాద్యప్సరసలును నల సౌందర్యమును గూర్చి విని చిత్త విభ్రమము కలవారైనట్లు శ్రీహర్షుడు వర్ణించెను. శచీ దేవి మహా పతివ్రత. శ్రీ వాణీ గిరిజలు త్రిజగన్మాతలు. అట్టివారు నలుని గూర్చి చిత్త విభ్రమము పొందిరనుట హేయము. విచిత్రమేమనగా మల్లినాథ సూరి వంటి మహా వ్యాఖ్యాత ఈ భావములను సమర్థించెను. మల్లినాథుని సమర్ధన మెట్లున్నను శ్రీనాథుని వంటి ఈశ్వరార్చన కళాశీలునకు ఈ ఘట్టము ఏవగింపు కలిగించి యుండును. కావుననే ఆతడు శ్రీ వాణీ గిరిజా శచీ దేవులకు సంబంధించిన శ్లోకములను వదలి ఒక్క రంభను గూర్చియే వ్రాసెను. రంభ స్వర్వేశ్య. చిత్త విభ్రమమామెకు సహజము.

ఈ విధముగా ఆంధ్రీకరణ ప్రణాళికను సముచితముగా నిర్ణయించుకొని శ్రీనాథుడు తదనుగుణముగా సర్వతో ముఖ కవితా కళా చాతుర్యముతో శృంగార నైషధమును రచించెను.

## 2.4 సారాంశము:-

నైషధీయ చరితమును శృంగార నైషధమని వ్యవహరించుటలోను, సప్త విధములైన ఆంధ్రీకరణ ప్రణాళిక నేర్పరచుకొని దానిని సముచితముగా తీర్చిదిద్దుట లోను శ్రీనాథుని నైపుణ్యమీ పాఠమున ప్రకటితమైనది.

## 2.5 ప్రశ్నలు :-

1. 'శృంగార నైషధ' మాధారముగా శ్రీనాథుని ఆంధ్రీకరణ ప్రణాళిక ఎట్టిదో సోదాహరణముగా నిరూపింపుడు.
2. విద్వదౌషధమైన నైషధమును శ్రీనాథుడు తన ఆంధ్రీకరణమున విద్వదమృతము గావించిన తీరును వివరించండి.
3. శృంగార నైషధ కావ్య నామౌచిత్యమును వెల్లడించండి.

## 2.6 ఆధార గ్రంథములు :-

1. నైషధీయ చరితము - శ్రీహర్షుడు
2. శృంగార నైషధము - శ్రీనాథుడు
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
4. శృంగార శ్రీనాథము - వేటూరి ప్రభాకర శాస్త్రి
5. శ్రీనాథుడు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
6. శ్రీనాథ భారతి - జోశ్యుల సూర్యనారాయణ మూర్తి

**డా॥ గోగినేని యోగ ప్రభావతీ దేవి**
ఎం.ఏ (తెలుగు), ఎం.ఏ (సంస్కృతం), ఎం.ఫిల్.పి.హెచ్.డి.
**శాఖాధ్యక్షురాలు, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం**
**ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్.**

పాఠం - 3

# శృంగార నైషధము

**ముఖ్యాంశాలు:-**

3.0 లక్ష్యం
3.1 నల దౌత్యము
3.2 హంస దూత్యము
3.3 ఆంధ్ర సాహిత్యములో శృంగార నైషధ స్థానము
3.4 సారాంశము
3.5 ప్రశ్నలు
3.6 ఆధారగ్రంథాలు

## 3.0 లక్ష్యం:-

శృంగార నైషధ కావ్యము నందలి రసవత్తర ఘట్టములైన నల దౌత్య, హంస దౌత్యము లందలి ఔచిత్యమును పరామర్శించుచు, ఆంధ్ర సాహిత్య ప్రపంచమున శృంగార నైషధ కావ్య వైశిష్ట్యమును వెల్లడించుటే ఈ మూడవ పాఠము యొక్క లక్ష్యము.

## 3.1 నల దౌత్యము:-

అభిజ్ఞాన శాకుంతలములో చతుర్థాంకమెట్లు ప్రధానమో, శృంగార నైషధము నందును చతుర్థాశ్వాసము ప్రముఖము. శృంగార నైషధమే ఆంధ్ర సాహిత్యమున అనర్ఘ మణిభూషణముగా ఒప్పారుచున్నది. ఈ కావ్యమున చతుర్థాశ్వాసము నందలి నల దౌత్యము రసవత్తర ఘట్టము. నలదమయంతులిరువురు వినుకలి ప్రణయమూర్తులు. వారిరువురు హంస దౌత్యము వలన వివాహ నిశ్చయమతులైరి.

నలదౌత్య ఘట్టమున నలుడు దేవతల పనుపున రాయబారియై దమయంతి అంతఃపురమునకు వచ్చెను. ఈ ఘట్టము నందే నల దమయంతులిరువురు ప్రప్రథమముగా పరస్పరము సంభాషింతురు. సంభాషణము నడుచునపుడు మాత్రము దమయంతికి ఆ దేవదూత నలుడని తెలియదు. అట్లు తెలియక పోవుటచేతనే ఆమె సంభాషణము మిక్కిలి విచిత్రముగను ప్రౌఢముగను సాగినది. ఇందు నల దౌత్యమునకే ప్రాధాన్యము. అందుచే నలుని ఉపన్యాసము ప్రముఖమైనప్పటికి సందర్భోచితమైన దమయంతి వాక్చాతుర్యము కూడ మిన్ను ముట్టినదని చెప్పవలయును. కావుననే కవి సార్వభౌముడామెను "నానావిధ చిత్ర వాక్య రచనాచణ" అని ముందుగనే పరిచయము చేసెను.

నల దౌత్య ఘట్టమున శ్రీహర్షుడు, శ్రీనాథుడు చిత్రించిన దమయంతి పాత్రల నడుమ తారతమ్యము కలదు. దమయంతి ధీరోదాత్తయని శ్రీనాథుని పలుకు, మాతృక యందు దమయంతి నలుని గాంచిన వెంటనే మోహపరవశయగును. కాని శ్రీనాథుని దమయంతి ధీరోదాత్తవలె వ్యవహరించినది. "ధీరాచసా ఉదాత్తా - ధీరోదాత్తా" అని విగ్రహము. ధీరాత్వము, ఉదాత్తాత్వము కలది ధీరోదాత్త. ధీరోదాత్తయగు నాయిక మహాసత్త్వము కలిగియుండును. దమయంతి అట్టిదని చెప్పవలయును.

దమయంతి ఇంతవరకు నల మహారాజును ప్రత్యక్షముగా చూడలేదు. హంస చేసిన వర్ణనమును బట్టియు, బిసినీ పత్రము పై చరణనఖాగ్రముతో లిఖియించి చూపిన చిత్రమును బట్టియు ఆమెకు నలుని రూపురేఖలు తెలియును. ఆ సూక్ష్మ జ్ఞానముతోనే ఆమె నిరంతర ధ్యానమొనర్చుచు నలుని మిథ్యావలో కనము చేయుచునేయున్నది. దేవతలు ప్రసాదించిన శాంబరితో నలుడంతః - పురమున ప్రవేశించి, శాంబరిని పరిత్యజించి దమయంతికి దర్శన మిచ్చెను. దమయంతి చెలికత్తెలు భయ లజ్జా సంభ్రమములతో హఠాత్తుగ లేచిరి. అంతఃపురమునకొక పురుషుడు వచ్చుటచే భయము. ఆ విచ్చన వ్యక్తి పరపురుషుడు కాన లజ్జ. పరపురుషాంతః పుర ప్రవేశము ప్రమాద జనకము కనుక సంభ్రమము. ఇట్లు కవి సార్వభౌముడు చెలికత్తెల స్థితిని వర్ణించెను. ఇక దమయంతియో దృగ్గోచరుడైన ఆగంతకుని వెఱ్ఱి చూపులలో ముంచియెత్తలేదు. దమయంతి ఆదిగర్భేశ్వరి యని శ్రీనాథుని ప్రతిపాదనము. ఆదిగర్భేశ్వరి యనగా ఆగర్భ శ్రీమంతురాలని యర్థము. ఆగర్భ శ్రీమంతులకొకానొక ఠీవి యుండుట సహజము. ఇప్పట్టున దమయంతి ఠీవిగా నలుని చూచియు "సమున్నత కనకాసనంబున మున్నున్న యునికిన యుండి"నది. అనగా మానసికముగా గాని, శారీరకముగా గాని ఎట్టి వికారమును పొందలేదు. కాని నలుని చూచుటతోడనే ఆతడు కంతుడా! జయంతుడా! అనుకొన్నది. నిషధరాజేమోయని కూడ అనుమానించినది. ఐన ఆ నలుడీ శుద్ధాంతమున కెట్లు రాగలడు? అని సాద్భుతముగను, సకౌతుకముగను, సానురాగముగను తిలకించుచు ధీరోదాత్తతనే ప్రకటించినది.

ఆమె చెలికత్తెలు పర పురుషుడన్న భీతితో మాటాడక ఊరకుండిరి. నానా విధ చిత్ర వాక్య రచనాచణయైన దమయంతి మాత్రము ముఖ పద్మమొకించుక వాల్చుకొని ధీరోదాత్తతతో అతిథి సంభావనా విధానము నుగ్గడించి ఇట్లన్నది.

తే॥ అనఘ! యిదె హేమరత్న సింహాసనంబు
ఇచ్చగలదేని కూర్చుండు మిందు వచ్చి
కాక, కార్యాంతరాసక్తి కారణముగ
నేగఁదలచిన వాఁడవో యెచటికైన

ఈ పద్యమున 'అనఘ' అను సంబోధనము సార్థకము. నలుడు అనఘుడై మనసున ఎట్టి దుశ్చింతలకు తావీయక ఇక్కడ మెలగవలెననియు, లేకున్న ప్రమాదమనియు దమయంతి ఆ సంబోధనముతో వ్యంగ్యముగా వక్కాణించినది.

తరువాత దమయంతి "నీ వెక్కడి నుండి యెక్కడికి పోవుచున్నావు? పేరేమి? ఈ శుద్ధాంతములో ప్రవేశింపనెట్లు వీలయ్యెను. ఇంత సాహసమొనర్చుటకు మమ్ము ధన్యులను చేయుటయే ఫలమా? నీ వంటి వానిని చూచుటచే మేము కృతార్థలమైతిమి. మా జన్మములు ధన్యములైనవి. మా కన్నుల భాగ్యమే భాగ్యము. చెవులు మీ యుదంతము వినవలెనని కుతూహలపడుచున్నవి. వానికింత వాగమృతము ప్రసాదింపు" మని యొక మధురోపన్యాస మొసగినది. ఇందలి ప్రత్యక్షరము దమయంతి వాక్యరచనా నైపుణ్యమునకు శ్రీనాథుని అర్థగాంభీర్య నిబంధనమునకు తార్కాణము. ఈ దమయంతీ వాక్యములు మన్మథుని బాణములై నలుని మనస్సున నాటుకొన్నవి.

అతడు సింహాసనము నలంకరించి "నేను దిక్పాలుర దూతను. నీకు అతిథిని. నా పని నెరవేర్చినచో అదియే నాపాలిటికతిథి సత్కారము" అని యనుచు.

తే॥ ఉల్లమిప్పుడే కాగ్రమై యున్నయదియె?
యవసరం బౌనె దేవరహస్యమునకు?
వింతవారలు లేరుగా యింతనంత?
నువిద, మనవారలే కదా యున్నవారు?

అని యనెను. అతడు దమయంతిని తీయతీయ మాటలతో సుముఖురాలిని చేసికొనుటకు ప్రయత్నించెను. ఇప్పట్టున వింతవారలు

లేరుగా యని, ఉన్నవారందరు మనవారలే కదా యని ఆమెను తన ఆప్తకోటికి చేర్చెను. దీనిని బట్టి అతడు చెప్పుచున్న దంతయు తన మేలుకొరకే చెప్పుచున్నాడని దమయంతి భావింపవలయునన్న మాట. కావుననే మనవారలే కదాయని కలుపుగోలు తనము చూపెను. తరువాత ఇంద్రాదులు దమయంతిని పెండ్లాడ గోరుచున్నారని వక్కాణించి నలుడు వారి విరహావస్థను సవిస్తరముగా వర్ణించెను. చివరకు దేవతలలో నొకరిని వరింపుమని కోరెను.

దమయంతికి ఈ అనావశ్యకోపన్యాసము విసుగు పుట్టించెను. అక్షిభ్రూవిక్షేపముతో తమ అనాదర భావమును సూచించి ఆ దిక్పాలక సందేశమును అలక్ష్యముగా నాకర్ణించి ఇట్లనెను.

తే॥ ప్రశ్నమొక్కటి, యొక్కటి ప్రతివచనము
యుక్తి యనుకూలమై యుండదుభయమునకు
నేను నీ వంశనామంబు లెవ్వియనిన
నెవ్వరినొ ప్రస్తుతించితి వింత తడవు

తే॥ అధిక తరులైనఁగాని దిశాధిపతులు
కౌతుకము నాకు నీ వంశ కథల యందె
దప్పిగొన్నట్టి వారికా దప్పిదీఱ
సలిలపూరంబు హితవొ? యాజ్యంబు హితవొ?

మరియు నామె "భవాదృశంబైన నాయక రత్నంబు నే వంశంబు భరించె? ఏ వర్ణంబులు నీ పుణ్యానామంబునకుం బ్రకాశకంబులైనయవి?" అని పరమ నాగరకముగా మాటాడినది.

నలుడు కూడ "చెలువా! నా వంశ వృత్తాంతమునటుంచుము. ఏలయన నా వంశము గొప్పదే అయినచో నేను నీచమైన దూతకృత్యము నిర్వహించుటచే దానిని గూర్చి చెప్పుకొనుట ఉచితము కాదు. నిజముగా నా వంశము హీనమే అయినచో దానిని గూర్చి చెప్పుకొనుట ఏమంత గౌరవము. అయినను నీవు రాజపుత్రివి. మాననీయురాలవు. కనుక మైత్రికి వెనుకంజ వేయరాదని ఈ మాత్రము చెప్పుచున్నాను. గ్రహింపుము. నేను మనుజవిభుడనే. ఎవ్వరైనను తమ పేరు తాము చెప్పుకొనుట ఆచార విరుద్ధము, దోషము కావున నా పేరెరుంగవలయునని ప్రయత్నింపకుము. మనమిప్పుడెదుటబడి మాటాడుకొనుచున్నారము. ఈ సమక్ష వ్యవహారమునకు యుష్మదస్మత్ పదములే చాలును గదా" అని ప్రౌఢముగా మాటాడెను.

ఈ మాటలు దమయంతికి కష్టము కలిగించెను. అయినను సమయోచితముగా, సరసముగా నామె యిట్లనెను. "కులము పేరు చెప్పి నీ పేరు చెప్పకపోవుట మమ్మాదరించినట్లా యేమి? నీవు మమ్ము వంచింపదలచినచో మేము నిన్ను వంచింపలేమా? పేరు చెప్పుటయే నీకనాచారమైనచో నీతోమాటాడుట మాకు ధర్మమా యేమి?" అనియనెను. పిమ్మట స్పష్టముగా మోమోటము లేక యింక నిట్లనెను.

తే॥ అన్యపురుషుల తోడ నెయ్యంపు గోష్ఠి
అధిప! మము బోఁటి రాజకన్యకలకగునె
అది కులా బలాచార సహాసనాస
హాతి సాహస కౌతూహలావసథము

కం॥ తగవే కులకన్యలకును
మగవారలతోడ రూప మహనీయులతో

మిగులంగఁదడవు లోపలి

నగళులలో మాటలాడ నయతత్త్వ నిధీ!

నలుడు పేరు చెప్పుట శాస్త్రాచార విరుద్ధమనెను. దానికి ప్రతిగా దమయంతి రాజకన్యలు పరపురుషులతో గోష్ఠి చేయుట - అది నెయ్యపు గోష్ఠియే యగుగాక - కులస్త్రీల ఆచారమునకు విరుద్ధమన్నది. కులకన్యలు మగవారితో మాటలాడుట తప్పు. అందును ఆ మగవారు రూప మహనీయులైనచో మాటలాడుట మరియు తప్పు. ఒకవేళ అనివార్యముగా మాటాడ వలసి వచ్చినను ఎక్కువ సేపు మాటాడుట ఇంకను పెద్ద తప్పు. అదియు లోపలి నగళులలో మాటలాడుట ఏ మాత్రము క్షమింపరాని తప్పు. ఈ విధముగా కుల కన్యలకు - మగవారలతో - రూప మహనీయులతో - మిగులంగ తడవు - లోపలి నగళులు - అన్న పదములు ఒక దాని కంటెను మరియొకటి బలవత్తరములై నలుని సంభాషణము నందలి అనౌచిత్యము నధికముగా నిరూపించుచున్నవి. ఈ పదములకన్నిటికి మకుటముగా నిలిచినది 'నయతత్వనిధీ' అను సంబోధనము. నీవు నీతి నెరిగిన వాడవు కనుక దీనికి వ్యాఖ్యానమవసరము లేదని కూడ ఇందలి సారాంశము. చాలాసేపు మాటాడరాదు కాన ఏదో ఇంతవరకు మాటాడితిని, చెప్పినవి వింటిని, ఇక చాలును. నీవు సెలవు పుచ్చుకొనవచ్చుననియు ధ్వని.

దమయంతి ఈ వాక్యములకు నలుడాశ్చర్యపడెను. ఇంతవరకు ఆమె "త్రిజగన్మోహమహౌషధీతిలక" అని మాత్రమే అతడెరుగును. ఇప్పుడు లోకోత్తర వాక్చాతుర్యము, తార్కికశక్తి కలదియని అతడు గుర్తించెను. కనుకనే ఆమె యొక్క ప్రతి బంధి రచనా చాతుర్యమును మనస్సున అభినందించెను. అతడు ప్రత్యుత్తరము కొరకు ఎంత వెదికినను మనస్సున కేమియు పాలుపోలేదు. ఆలోచనము తట్టనేలేదు. కాని సమాధానము చెప్పక తప్పదు. నేత్రాంచలముల యందు నలంతి నవ్వు తొలుకాడ

"వెలది! నా మీదఁ గడుఁ గృపా విలసనంబు

నాటి చూచిన చూపు మన్ననయ చాలు

నాకుగా నుద్ధరింపుము నాక విభుల

హస్తములు మోడ్చివేడెద నాదరమున"

అని యనెను. సకారణముగా వాదింపలేనప్పుడు నమస్కారమే తగిన మందు. దమయంతి మాటలకు సమాధానము చెప్పలేక నలుడోడిపోయినాడనుట సుస్పష్టము. ఇంతగా లోపడి వేడుచుండగా దమయంతి మాత్రమెట్లు తిరస్కరింపగలదు. కావుననే

తే॥ అలతి నవ్వు ప్రగల్భతాహంకరణము

కాదు కాదంట వాచా విగర్వణంబు

పలుక కుంట తిరస్కార కలన ముద్ర

కాన ప్రత్యుత్తరంబిచ్చు దాన నీకు

అని ముచ్చటగా మూడు కారణములు చూపి ప్రత్యుత్తరమిచ్చినది. దేవతలను వరింపనే వరింపనన్నది. నేను నల పతివ్రతనన్నది. తుదకు తన ప్రతిజ్ఞనిట్లు వినిపించినది.

మ॥ వినుమీ నాదు ప్రతిజ్ఞ తత్పరత నుర్వీనాథ! యే నైషధేం

ద్రునవశ్యంబు వరింతు, నాధరణి నాథుండాత్మ నన్నొల్లడే

ననుమానింపక యిత్తు నవ్విభునకున్ బ్రాణంబు సద్భక్తిమై

ననలోద్బంధన వారి మజ్జన విధా వ్యాపార పారీణతన్

దమయంతి ఇట్లు తన ఆత్మ నిశ్చయమును ప్రతిజ్ఞా పూర్వకముగా వెల్లడించిన నలుడూరకుండలేదు. ఇంకను

ప్రయత్నింపజూచుచునే యున్నాడు. నలుడు తాను గూడ దమయంతిని వలచినాడు గాబట్టి దేవతలు తన్నెక్కడ శంకితురోయని గట్టి ప్రయత్నము చేయుచున్నాడు. అతడు

కం॥ నిఱుపేద యింటికేటికిఁ
బఱతెంచు నిధాన, మట్లు పఱతెంచిన యే
నిఱుపేద యభాగ్యతఁదలు
పిఱియఁగ నిడుఁగాక చొరఁగనిచ్చునె దానిన్

అని ఇంక నెన్నియో విధములుగా చెప్పిజూచెను. నలుడు తన్ను వివాహమాడక పోయిన నేరీతిచే నైన మరణింతునని దమయంతి యన్నది గదా. దానికి సమాధానముగా నలుడు "నీవురి బెట్టుకొనదలంచినచో నంతరిక్షము నేలు నింద్రునకు దక్కెదవు. అగ్నికాహుతి యగుచో నాతని రొట్టె విరిగి నేతిలోపడును. నీటబడి మరణించిన యెడల వరుణునకు చిక్కుదువు. ఏ రీతిగా ప్రాణ పరిత్యాగము చేసినను యమదర్శనము తప్పదు. గావున అప్పుడాతని యదృష్టమే ఫలించును. కనుక వారి నలుగురిలో నెవ్వరినో యొక్కరిని వరించి నా మాట దక్కింపుము. దివ్యభోగములు పొందుము" అని వేడెను. మరియు చమత్కారముగా నాతడు

తే॥ ఒల్లనను మాటకర్థమో యుత్పలాక్షి
వలతునను మాట గాదుగా వక్రరీతి
విధి నిషేధ రూపంబు భావించియున్న
విధియయగు వ్యంగ్య వాసనా విలసనమున

అని యనెను. నలుని ఈ వాక్యములు దమయంతి ఒక రీతి వినియెను. ఒక భంగి విననిదయ్యెను. ఆమె చింతాక్రాంతయై యొక్కింత తడవు తల వంచుకొని, విచారించి, నిట్టూర్పు నిగిడించి సవిషాదముగా నిట్లనెను.

ఉ॥ నీ చరితంబు చూడ నతి నిష్ఠురమయ్యెడు, లోకపాల దు
ర్వాచిక సూచికాంకుర పరంపరఁ దూర్చెదు మాటిమాటికిన్
నా చెవులందు, నీకుఁదగునా యిటు చేయగ, దప్పనంటి, బా
ధా చరణంబు నైజము కదా తలపోయ కృతాంత దూతకున్

కనుక దేవతలలో నొక్కరిని వరింపుము. ఎవ్వరిని వరింపక దేవతలకాగ్రహము కల్గించినచో ముఖ్య కార్యములకు ముప్పు వాటిల్లును సుమా" అని యనెను. చివరి మాటతో రేపు జరుగబోవు స్వయంవరము సహితము విఘ్నము కావచ్చుననియు, అందు నల వరణము జరుగకపోవచ్చుననియు, నలుడు దమయంతిని భయపెట్టును. ఈ నల దౌత్య ఘట్టమున నలుడు కూడ నెంతయో వాక్చాతుర్యముతో మాటాడెను.

తాను చచ్చినను బ్రతికినను దేవతలు వదలి పెట్టరని దేవదూత పలుకుచున్నాడు. దమయంతికి గత్యంతర మేమియు గోచరింపలేదు. "అప్రతి విధానంబైన ప్రియా వాప్తి విఘాతంబున హృదయంబు కలంగిన" దమయంతి యేడ్చినది. ఇప్పట్టున శృంగార నైషధమున శ్రీనాథుడిట్లు దమయంతీ శోకమును వర్ణించెను.

సీ॥ ప్రవిమలాక్షి నభో నభ స్యాంబుదములకు
నవ వృష్టి ధారలై యవతరిల్లి
యాకర్ణ దీర్ఘ నేత్రాంభోరుహములకుఁ
కమనీయ నాళ భావము భజించి

కలితకజ్జలత ముక్తాహారలతలలో
హరినీల రత్న నాయకత (దాల్చి
లలిత వక్షోజ కుట్మల చుంబనంబున
మధుప దంపతుల సామ్యంబు వడసి

నలుడు యమునకు దూతగా వచ్చెను. గనుక యముని వలె బాధించుచున్నాడట. ఇది సందోర్భోచితమైన తిట్టు. తిట్టు అనుకొనుటకును వీలుగాని నిజమైన తిట్టు. అంతటితో పోవక దమయంతి ఇట్లనెను. "ఇదిగో రేపు కళ్యాణము జరుగబోవుచున్నది. ఇప్పుడీ అవాచిక వార్తలు మానుము. శక్తి యుక్తులున్నచో నల మహారాజును వర్ణింపుము. లోకపాల వార్తలు తెచ్చిన దోషము పోవును. నేడు, రేపు నీవిచ్చటనే కుడిచి కూర్చుండుము. నీ యందు నలుని రూపము కలదు. హంస చూపిన చిత్ర మిదివరకే చూచితిని. ఓయీ! హస్తములు మోడ్చి నిన్ను ప్రార్థించుచున్నాను. నాపట్ల నీకు పూజ్య భావము కలదేని దేవేంద్రాదులను వివాహమాడుమనుమాట వదలిపెట్టుము." అవాచిక వార్తలు మానుమన్న మాట అవాచ్య ప్రసంగములు మానుమన్నట్లున్నది. నైషధుని వర్ణింపుమనుటచే దమయంతికి గల నలవర్ణన కుతూహలము వ్యక్తమగుచున్నది. హస్తములు మోడ్చి వేడుట స్వయముగా నలుడు నేర్పిన విద్యయే. అతడు ఇతః పూర్వమే కార్యసిద్ధికి నమస్కార ప్రయోగము చేసెను గదా. తాను గూడ ఆ పని చేయవలదా మరి. కవి సార్వభౌముడిప్పట్టున

"మైత్రియుఁ బ్రేమయున్ మనసు మచ్చికయున్ మెఱయన్ వరాటరాట్ పుత్రిక" పై పలుకులు పలికెనని అనెను.

ఇంతగా ప్రార్థించినను నలుడు వదలిపెట్టలేదు. అతడు "ఇంద్రునకు కల్పవృక్షమున్నది. అతడు దానిని యాచించి నిన్ను పొందగలడు. అగ్నిహోత్రుడు యజ్ఞము చేసి దానికి ఫలముగా నిన్ను పొందవచ్చును. యముడు తన కడనున్న అగస్త్యుని వలన వరముగా నిన్ను సంపాదించుకొనవచ్చును. వరుణుడు కామధేనువు నడిగి నిన్ను రప్పించుకొనవచ్చును.

తే॥ వేడి యశ్రులు నిగుడంగ వెక్కివెక్కి
యేడ్వఁదొడగె లతాంగి పృథ్వీశుమ్రోల
మృదుల పరివేదనాక్షరోన్మిశ్ర మధుర
కంఠకాకు వికార కాకలిక యలర

ఈ ఘట్టము మూలమునకు విరుద్ధముగా నున్నది. ప్రతి విధానము లేని నలుని ప్రతిపాదనకు దమయంతి దుర్బల వనిత వలె మాతృక యందు మాదిరిగా బోరున నేడ్వలేదు. అట్లు రోధించుట ధీరోదాత్తతకు భంగము. శ్రీనాథుని దమయంతి ధీరోదాత్త. కావుననే మాటలేమియు లేక వెక్కివెక్కి యేడ్చినది. ఈ యేడ్పునకు నలుడు తలక్రిందులయ్యెను. అతడు తన్ను, దేవతలను, దేవ కార్యమును మరచిపోయి యిట్లనెను -

కం॥ ఏమిటి కేడ్చెద, వానన
తామరసంబెత్తిచూడు, తరుణీ నన్నున్
గోమల కటాక్ష వీక్షా
దామకమున వీరసేన తనయుని నలునిన్

ఇంతదనుక దాచిదాచి యుంచిన గుట్టు బట్టబయలయ్యెను. అది యట్లగుటకు నలుడు కారణము కాడు. దానినే అతడిట్లు సమర్థించుకొనెను.

తే॥ వగవ నేటికి, నేమన వచ్చునిపుడు
చేతనా హానిఁగార్యంబు చిన్నవోయెఁ
జేతనా హాని దైవంబు చేతవచ్చె
దైవగతి దాటవచ్చునె దేవతలకు

ఇంతవరకు స్పష్టా స్పష్టముగా నున్న విషయము తేటతెల్లమైనది. తాను కామించిన నలుడే తన యెదుట నిలబడి యింతసేపు మాటాడెను. ఇంతకన్న దమయంతి కేమి కావలయును. ఆమె సింహాసనము దిగి తెరచాటునకు పోయినది. నలుడని తెలిసిన పిదప దమయంతి ఎట్టయెదుట నిలబడి నలునితో మాటాడుట సమంజసము కాదు కదా. ఆమె తెర మరుంగున నుండియు లజ్జావశంబున పలుక నేరదయ్యెను. ఆమె తన చిత్ర వాక్య రచనా చణత్వము తేటపడునట్లు సమయోచితంబులగు భాషణంబులు చెలికత్తెకు చెప్పి ఆమెచే నిట్లనిపించినది.

తే॥ ఆర్థి సాధారణమునకు నభయమిత్తు
వజ్రపాతంబు ఘోరమై వచ్చినపుడు
నతను పూఁదూపులకు భయంబంది యున్న
నాకు నభయంబు గృప సేయ నీకు బరువె?

ఈ విధముగా ముగ్ధయగు దమయంతి వయస్సులో ముగ్ధత్వమును, వాక్కులో ప్రౌఢత్వమును ప్రకటించి యొక అసాధారణ కావ్యనాయికగా పేరు గాంచినది. నలుడు కూడ లోకోత్తరమైన మనశ్శుద్ధి కలవాడని నిరూపించుకోగలిగెను. దమయంతి వెక్కివెక్కి యేడ్చువరకు కూడ నామెకు దిక్పాల సందేశమును నొక్కి వక్కాణించుచున్నాడన్నచో నాతని నిస్వార్థ దేవకార్యదీక్ష యెట్టిదనవచ్చును? నల దూత్యాంతమున వారికి సంధాతయైన దివ్యహంస వచ్చి సత్యదూతగాని నలుని సమ్ముఖమున కానిమాట లేమి యంటినో యని పరితపించుచున్న దమయంతిని, దేవకార్య మారడియై పోయినదని చింతిల్లుచున్న నలుని నోదార్చినది.

ఈ విధముగా శ్రీనాథుడు తన నైషధాంధ్రీకరణ ప్రణాళిక కనుకూలముగా దమయంతిని ధీరోదాత్తనుగా, నలుని మనశ్శుద్ధి పరాయణునిగా చిత్రించెను.

## 3.2 హంస దూత్యము :-

శృంగార నైషధమున హంస ప్రధానమైన పాత్రము. నల దమయంతుల యనురాగము అంకురితమై, పల్లవితమై, ఫలవంతమగుటకు హంసయే కారణము. శ్రీనాథుడు సమయోచిత వాక్చాతుర్యము, కార్య సంధాన నైపుణ్యము కలిగినట్లుగా హంసమును తీర్చిదిద్దెను. ప్రబంధ యుగములో వెలువడిన ప్రభావతీ ప్రద్యుమ్నము నందలి శుచి ముఖి వంటి రాజహంస పాత్ర సృష్టికి శృంగార నైషధ రాజహంసము మూల కారణమనవచ్చును. రెండింటను నాయికా నాయకుల యనురాగము వివాహముతో ముగియుటకు విహగ శ్రేష్ఠములే కారణము.

శృంగార నైషధ ప్రథమాశ్వాసమున హంసము ప్రవేశించును. నలుడు ఉపవన విహారార్థము వెడలి మహాతటాక తీర ప్రదేశమున "వరుణరాజున కిడిన చామరము వోలె, పొడవు మిగిలిన పొందమ్మి పూవు వోలె, నిబిడ నిద్రాభి ముద్రిత నేత్రమైన రాజ హంసంబు"ను చూచెను. కాంచన పక్షమగు నా హంసమును నలుడు దైవ ఘటనమున కనుకూలముగా వంచించి పట్టుకొనియెదనని తలంచెను. ఇట దైవ ఘటనమను మాట ప్రధానము. నల దమయంతుల వివాహము దైవ నిశ్చితము. అది నెరవేరుట రాజహంస ముఖమున జరుగవలయును. నలుడు రాజహంసమును పట్టుకొననిచో తత్కార్య ప్రారంభమునకు శ్రీకారము చుట్టుటయే జరుగదు. కావున రాజహంసము దైవ నిర్ణయానుకూలముగా భూమండలమున ప్రవర్తిల్లు దేవదూతయని చెప్పవచ్చును.

వామనుని వలె నభినయించుచు నలుడు రాజహంసమును పట్టుకొనెను. హంసము కరుణ రస భరితముగా మొఱపెట్టెను. అంతట హృదయము కరిగిన నలుడు దానిని వదలెను. హంసము చచ్చి క్రమ్మర పుట్టిన చందమున తలంచి, చుట్టములతో, చెలులతో కొంతసేపు ఇచ్ఛా విహారముల తేలియాడి, తిరిగి నిషధ రాజు హస్తంబున కరుగుదెంచెను. దైవచోదితమై హంసము దమయంతీ సౌందర్యమును వర్ణించెను. అది దమయంతిని చూచి "విధాత చిత్తంబున నీ మత్త కాశిని కిందగిన యుత్తముడగు వరుండెవ్వండు కలిగియున్నవాడొకో" అని చింతించినదట. తరువాత అనురూప లావణ్య రూప సంపన్నుడైన పిన్న వయసు రాకొమరు నవ లోకింతునని లోకాలోక పర్యంతంబుగ భూమండలమున సంచరించినదట. రాజకుమారకుల నెల్ల పూర్వ పక్షంబు గావించుచు వచ్చి విచ్చ నలుని చూచి దమయంతికి తగిన వరుడని సిద్ధాంతీకరించినదట. తుదకు నలునితో రాజహంస మిట్లనెను.

తే॥ సౌరభము లేని యట్టి పుష్పంబు వోలె
గండుఁగోయిల వెలియైన కానవోలె
నధిప! దమయంతి తోడి సఖ్యంబులేని
నీదు సౌందర్య విభవంబు నిష్ఫలంబు

ఇట్లు చెప్పి నల దమయంతులను కూర్చ గల నేర్పు తనకు గలదనియు దమయంతి నలుని తప్ప తక్కొరుని పరిగ్రహింపకుండునట్లుగా నతని గుణములు ప్రశంసింప వలయుననియు ననెను. ధర్మాధర్మవేత్త యగుచు చివరకు "కార్యంబున నార్యులు నిజ ప్రయోజనంబు నెరిగింతురు కాని మాటలంబ్రకటింపరు" అని పరిస్ఫుటముగా పలికెను.

నలుడు నిధి లభించిన నిరుపేద వలె నయ్యెను. అతడు రాజహంస సౌందర్యమును వర్ణించి తన విరహతాపమును వెల్లడించెను. విరహ భారపారావారంబున మునిగి పోవుచున్న తనకు విరించి తెప్పగా హంసమును సృష్టించెనని భావించెను. పిదప నలుడు "పొమ్ము కార్యంబు సాధింపుము. పునస్సమా గమంబయ్యెడు. నీవు వచ్చునంతకు నిచ్చోటనే యుండుదుంజుమీ. చూతంబు గదా నీ గమన వేగంబు" అని రాజహంసమును వీడ్కొల్పెను. అంతటనది కుండిన పురమును చేరవచ్చెను.

రాజహంస వచ్చునప్పటికి దమయంతి సఖీజన పరివృతయై శృంగార వనంబులో తారకా మధ్యంబున శీతాంశు రేఖ యుంబోలె నున్నది. రాజహంస పక్షనాదము దుందుభి వాద్య స్వరముతో తులతూగుచు వినబడెను. రాజాంగన లెల్లరు రాజహంసమును జూచిరి. దమయంతి రాజహంసంబును పట్టుకొన ప్రయత్నించెను. కాని యది చిక్కలేదు. దమయంతిని దూరముగా నెలయించుకొని పోయెను. దీనికి కారణము కలదు. రాజహంసము నమ మహారాజును గూర్చి దమయంతికి చెప్పవలయును. సఖీజన పరివేష్టితయగు నామెకు చెప్పుట సాధ్యము కాదు గదా. కావున నది దమయంతి నేకాంత ప్రదేశమునకు కొనివిచ్చునది. ఇక్కడి నుండియే రాజహంస వాక్చాతుర్యము వెల్లడియగుచున్నది. చెప్పబోవు మాటలకు ముందుగా అది పునాది వైచినది.

దమయంతికి రాజహంసము పట్ల విశ్వాసము కలుగవలయును. అది కలిగించుటకే హంసము ప్రయత్నించినది. తన యాభిజాత్యమును గూర్చి అది యిట్లు వక్కాణించెను.

సీ॥ నలిన సంభవు సాహిణము వారు వంబులు
కులము సాములు మాకుఁ గువలయాక్షి
చదలేటి బంగారు జలరూహంబుల తూండ్లు
భోజనంబులు మాకుఁబువ్వు బోడి
సత్యలోకము దాక సకల లోకంబులు
నాటపుట్టలు మాకు నబ్జవదన
మధురాక్షరములైన మా మాటలు వినంగ
నమృతాంధసులె యోగ్యులనుపమాంగి

తే॥ భారతీదేవి ముంజేతి పలుకుఁజిలుక
సమద గజయాన సబ్రహ్మచారి మాకు
వేదశాస్త్ర పురాణాది విద్యలెల్లఁ
దరుణి నీయాన ఘంటా పథంబు మాకు

ఒక పర్యాయము విధాత వినోదార్థంబు వాహ్యాళి వెడలి మరలి వచ్చునపుడు ఈ రాజహంసము కులము స్వాములు బ్రహ్మరథంబు నీడ్చుచు శ్రమమున డీలుపడినవట. అప్పుడీ రాజహంసము విమానదండము కంఠమున ధరియించి విరించి చేత పారితోషకము పొందినదట. రాజహంసము పలికిన యీ వాక్యము లన్నియు నెట్టి వారికినైన దాని శక్తి యుక్తి మహిమల పట్ల విశ్వాసమును కలిగింపక మానవు. ఇక దమయంతి నమ్ముటలో నాశ్చర్యమేమి.

రాజహంస మింతటితో నాగలేదు. "నేను దివ్య తిర్యగ్జాతిని. మముబోంట్లు పాశాదికంబులం గట్టు వడుదురే, గుణపాంశబులం గాక? భూలోకంబునందు రాజ బృందారకులు కొందఱు గలరు. వారితోఁ జెలికారంబు వాటించి యుండుదు. విశేషించి యందు నిషధ దేశాధీశ్వరుండగు నలుండను రాజు మీద మిగులం బక్షపాతంబు గలిగియుందు" నని యనెను. తనకు నలునకు గల ఆత్మీయత ఎట్టిదో ఈ క్రింది విధముగా వర్ణించెను.

తే॥ కనక శైలంబు డిగ్గి యాకాశ సింధు
సలిలములఁదోగి మిగులంగఁజెల్లనైన
చారు హాటక మయ గరుచ్చామరముల
వీతునతనికి వైశాఖ వేళలందు

అంతేగాక నలుని ప్రతాపమును వర్ణించినది. తన సామర్థ్యమును గూర్చియు నలునితో తనకు గల పరిచయమును గూర్చియు హంస మింతవరకు చెప్పినది. దమయంతికింకనుత్కంఠ కలుగుటకై "నిషధ రాజు దక్క వేఱొక్కండు నిన్ను వరియింపంబాత్రుండు గాడు" అని యనుటతో నాగక

చ॥ అడిగితి నొక్కనాడు కమలాసను తేరికి వారువంబనై
నడుచుచు "నుర్విలో నిషధనాథుని కెవ్వతె యొక్కొ భార్యయ
య్యెడు" నని, చక్రఘోషమున నించుక యించుక గాని, యంతయే
ర్పడ విననైతి, నీవనుచుఁబల్కిన చందము దోఁచె మానినీ

అని అన్నది. బ్రహ్మ నల దమయంతుల వివాహమును తప్పక జరిపించునని రాజహంసము స్పష్టముగా పలికినది. ఈ హంసోపన్యాసమంతయు దమయంతికి తన పట్ల విశ్వాసమును నలుని పట్ల ననురక్తిని కల్పించుటకే. ఈ ప్రసంగము దమయంతి చిత్తమును లోగొన్నది.

దమయంతి హంసము నాయాస పెట్టి నందులకు దయచూపుమని కోరెను. నలుని వలెనే ఆమెయు హంస సౌందర్యమును వర్ణించినది. దానిపట్ల నామెకు విశ్వాసము కలిగినప్పటికి నామె హృదయము విప్పి మాటాడలేకపోయినది. కావుననే యామె "నా మనోరథంబు కంఠపదంబున వర్తించుచున్నయది.........................అందని మ్రాఁకుల పండ్లు గోయందలంచెద. రాజుఁ బాణి గ్రహణంబున వశీకరింపంగోరెద; బాల్య చాపలంబున బేలనైయున్నదాన" నని సాభిప్రాయముగా మందాక్ష మందాక్షరముగా పరిమితోక్తులతో పలికెను.

దమయంతి నలుని పట్ల ననురాగము కలిగియున్నదో లేదో యని హంస సంశయపడుచున్నది. దమయంతి మాటలు

దాని కర్థము కాలేదు. వైదర్భికి నిషధేశ్వరుని పట్ల వలపు లేనినాడు తన ప్రయత్నమంతయు విఫలమగు నేమో యని హంస భయము. కావుననే అది దమయంతి ఇంగితము నెరుంగగోరి "రాజవదన! రాజపాణిగ్రహణంబు దృష్టాంతీకరించి నీ పలికిన సుభాషితంబులకు నర్థం బెయ్యది?" అని ప్రశ్నించినది. తిర్యగ్జాతినై యుండియు జన్మించినదాదిగా అసత్యములు పలుకలేదనియు, పలికిన ప్రయోజనంబు సాధింతుననియు నిష్కల్మష హృదయముతో పలికినది.

మరియు "ఆ నలుడు నీకు పాణిగ్రహణార్హుడు. నేనతనిని గూర్చనేర్తును. నీవేమో పిన్నపాపవు. పితృపరాధీనవు. స్వతంత్రించి కార్యనిర్ణయము చేయు శక్తి నీకులేదు. ఆవల లోకేశ్వరుడైన నిషధరాజు. ఈవల పరమేష్ఠి హితుడనైన నేను. ఇప్పట్టున సందేహాస్పదమైన ప్రసంగము నేనెట్లొనర్తును. మొదట చక్కనైన కార్యము పిదప విఘటించినచో నాయాత్మ గౌరవము పోవుటయే కాక నా ప్రాణమై, నన్ను నాత్మీయతతో రమ్ము, పొమ్మను మహారాజు నెదుట నెట్లు తలయెత్తుకొని తిరుగగలను. అదియును గాక ఇప్పుడు నీవు నలుని చెట్టపట్టవలయునని నిశ్చయించుకొని యుండవచ్చును. ఇక మీదట నీ యభిప్రాయ మేవిధముగా మారునో తెలియదు గదా! బాలికల చిత్తములు అంబు తరంగ లోలములు. సందేహాస్పదమైన విషయము నందు ప్రామాణికుడనై యేను వర్తించుట కంగీకరింపను. నన్ను వేరొక కార్యమునకు నియోగింపుము. అది దుర్ఘటంబయినను సంఘటించెదను" అని యనెను. దమయంతి హృదయము నెరుగవలయుననియే హంస ఈ యుపన్యాసము గావించెను.

దమయంతికి స్పష్టముగా మాటాడవలసిన యక్కర కలిగినది. ఆమె తనకు నలుని పట్ల గల యనురాగమును గూర్చి హంసకు గల సంశయములను నివారించినది. ఆమె యిట్లనెను.

తే॥ నిషధ భూపాలునొల్లకే నృపతి నొరుని
నభిలషించెద నేని హంసాగ్రగణ్య
యామవతి చంద్రునొల్లక యన్యునొకని
నభిలషింపంగ నోంకార మాచరించు

తే॥ అబ్జినీ మానసానురాగాభివృద్ధి
యర్క సంపర్కమునఁదక్కనగునె యొంట
నలునిఁదక్కంగ నొరుని నేఁదలతునెట్లు
విడువు సందేహ మోహంబు విహగరాజ!

తే॥ తండ్రి నిషధాధిపతి కేక తక్కియొరున
కేఁదలంచెనయే, విహగేంద్ర వినుము
దేహమనలంబునకు నాహుతిగనొనర్చి
యతనిఁబొందంగఁగందు జన్మాంతరమున

ఇంతటితో నాగక దమయంతి "నలుని సేవకురాలినై కృతార్థురాలనయ్యెదను. ఆయనకు పాదసేవ గావింతును. ఆయన దాక్షిణ్యమపేక్షింతును. ఆతని గూర్చి నీవు నా ప్రాణమును రక్షింపుము. అంతయు నీ చేతిలో నున్నది. వృధా సందేహము వలదు. ఆలస్యము చేయకుము. అనురాగ జలధి నిర్మగ్నినై యున్న నన్ను తెప్పవై తీరమునకు చేర్పుము. ధర్మపరులు గ్రుడ్డిగవ్వ నిచ్చినను సంతసింతురు. నీవు ప్రాణనాథుని దానము చేయుచున్నదానవు. నిర్మలాత్మ! నిన్ను నేమని మెత్తును" అని పలికెను. తన యనురాగమును గూర్చి నలునకు నేయే సందర్భములలో తెలుపవలయునో దమయంతి హంసకుపదేశించెను.

ఇప్పటికి దమయంతి నలవశంవద మానసయని హంసము గుర్తించినది. హంస తొలుత దమయంతికి ప్రలోభము కలిగించుటకై నలుని గుణములను మాత్రమే వర్ణించినది. ఇప్పుడు దమయంతి యతని యందు బద్ధానురాగయని యెరింగినది.

ఆయనురాగము నభేద్యముగ ధృఢపరుచుటకును, ఆమెకు సంతృప్తి చేయుటకును ఆమె యందు నలునకు అత్యంత ప్రేమ కలదని యిప్పుడు వచించినది. ఆమె యొల్లనిచో నలుని కవమానంబగునని ముందే యతని ప్రేమ నామెతో చెప్పలేదు. ఇది రాయబార మందు హంసకు గల నిపుణతా విశేషంబును సూచించుచున్నది. నలుడు దమయంతిని పొందుటకై దాస్యంబునకైన లజ్జింపడని హంస వక్కాణించినది. అతడు పంపుట చేతనే నీ సమ్ముఖంబునకు వచ్చితిననియు నీ చిత్తములోని భావము నెరింగితిననియు పలికి యిట్లనెను -

తే॥ తరుణి వైదర్భి నీ వెట్టి ధన్యవొక్కొ
భావ హావ విలాస విభ్రమనిరూఢిఁ
గౌముదీ లక్ష్మి యప్పాల కడలిఁబోలె
నలరఁజేసితి నైషధునంతవాని

మరియు రాజహంసము చంద్రుడును చంద్రికయు బోలే, పువ్వుతావియుబోలె, రసంబును భావంబును బోలె అవినాభావ సంబంధంబున నల దమయంతు లిరువురు నన్యోన్య ప్రేమానుబంధముచే ధన్యత్వంబు నొందునట్లు దీవించినది.

ఈ విధముగా పలికి హంసము "వీరె సఖులు వచ్చుచున్నవారు. మంత్ర రహస్యంబులు బయలుపడకుండ వలయు. నన్ను వీడుకొల్పు. పోయివచ్చెద" నని దమయంతి యనుమతి వడసి గగన మార్గంబున నిషధాధిప రాజధానికి నభిముఖుడై చనియెను. కుండిన పురంబు నుండి తిరిగి వచ్చిన హంసముతో నలుడు మాటాడిన మాటల యందు రాజహంస శీలము తెలియుచున్నది. నలుడు హంసను వర్ణించుచు ఇట్లనెను.

మ॥ సరసత్వంబు, నిగూఢ కార్యఘటనా చాతుర్య సంపత్తియున్
బురుషార్థైక పరాయణత్వమును, నభ్యుత్థాన లీలాధురం
ధరతా ప్రౌఢియునుం, గృతజ్ఞతయు, వాత్సల్యంబు, సద్భావమున్
సరసీజానస వాహనాన్వయ వతంసా! హంస! నీకందముల్

నలుడు పట్టికొని విడుచుటచే హంస కృతజ్ఞత చూపినది. దమయంతితో నేకాంతమున ప్రసగించి రహస్య కార్య ఘటనా చాతుర్యమును నిరూపించుకొనినది. అది యెక్కడి కైనను నింతలో బోయి యంతలో కార్యమును సాధించుకొని రాగలదు.

వారిజాక్షులందు, వైవాహికములందు బొంకియును మానవుడు పాపము పొందడని శుక్రనీతి. ఈ నీతి తెలియు నేమో రాజహంసము కార్య ఘటనకు సందర్భోచితముగా బొంకగలదు. నిదాఘ కాలమున నల మహారాజున కుపచారము గావింతుననియు, నల దమయంతుల వివాహ విషయమును గూర్చి బ్రహ్మ నడిగితిననియు హంసము చెప్పినది. కాని యివి అయదార్థములు, కార్యఘటనానుకూలములు.

## 3.3 ఆంధ్ర సాహిత్యములో శృంగార నైషధ స్థానము:-

శ్రీనాథుడు నిండు జవ్వనమున యందు సంతరించిన గ్రంథము శృంగార నైషధము. ఇది శ్రీహర్షుడు సంస్కృతమున రచించిన నైషధీయ చరితమునకు ననువాదము. అనువాద ప్రణాళికను శ్రీనాథుడే గ్రంథాంతమున నిరూపించెను. సంస్కృత నైషధము వ్యుత్పత్తి ప్రదర్శనమునకు పేరువడిన గ్రంథము. అందు శ్రీహర్షుని బహుముఖ పాండిత్యము నానా విధములుగా వెల్లడి యగుచుండును. కావుననే "నైషధం విద్వదౌషధ" మ్మను నాభాణక మేర్పడినది. ఇట్టి ప్రౌఢ గ్రంథమును తెలిగించి శ్రీనాథుడు తన సాహిత్య వ్యవసాయము నందే గాక ప్రాచీన సాహిత్య ప్రపంచము నందే నూతన శకమును స్థాపించెను.ఈ నైషధమన్న శ్రీనాథునకు

ప్రీతి మెండు. సందర్భము వచ్చినప్పుడెల్ల ఆతడు దానిని పేర్కొనుచునే యుండును. రావు సింగమహీపాలు నాస్థానమునందున్న సరస్వతినుద్దేశించి

సీ॥ పలుకుతో డై తాంధ్ర భాషా మహా కావ్య
నైషధ గ్రంథ సందర్భమునకు

అని చాటెను. బెండపూడి అన్నయామాత్యుడు శ్రీనాథునితో

సీ॥ కల్పించి నాడవు గాఢపాకంబైన
హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష

అని శ్రీనాథునితోననెను. తుదకు అవసాన కాలమునందును శ్రీనాథుడు నైషధమును మరువలేదు. ఆతడు తన శోచనీయ స్థితికి వగచుచు

సీ॥ ఆంధ్ర నైషధ కర్త యంఘ్రి యుగ్మంబునఁ
దగిలి యుండెను గదా నిగళయుగము

అని చాటుకొనెను. ఇంత పరమ ప్రీతిని శ్రీనాథుని హృదయము నైషధము పట్ల కలిగియున్నది. అట్టి గ్రంథము ఆంధ్ర సాహిత్యము మీద నిరంకుశ ప్రభావము చూపుటలో వింత లేదు.

ప్రాచీనాంధ్ర సాహిత్యము సంస్కృతేతిహాసానువాదముతో ప్రారంభమగుచున్నది. లభించిన గ్రంథములను బట్టి నన్నయ మహాభారతము ప్రథమ గ్రంథమని వక్కాణింపవచ్చును. అది వ్యాస భారతమునకు ననువాదము. కేవలము వైదిక మత వ్యాపనార్థము నన్నయ దానిని సృష్టించెను. నన్నయ తరువాత కలిరాజ శిఖామణి యగు నన్నెచోడుడు మహా ప్రబంధ లక్షణములతో కుమార సంభవమును స్వతంత్ర కావ్యమును సృష్టించెను. తరువాత సాహితీ భీషణ మూర్తియగు పాల్కురికి సోమనాథుడు రంగమునకు వచ్చెను. ఈ శివకవి యవతరణముతో సాహిత్య గతియే మారినది. అతడు భాష, ఇతివృత్తము, ఛందస్సు అను మూడిటి యందు దేశీయతనే పాటించెను. సాహిత్యమును మతప్రచార సాధనముగా గ్రహించినవాడు పాల్కురికి సోమనాథుడు. అతడు ద్విపద కవిత్వమునకు ప్రథమాచార్యుడు. ఆ మార్గముననే పోయి కోనబుద్ధ భూపాలుడు రామాయణమును సృష్టించెను. ఈ ద్విపద కావ్యమున సోమనాథుని కృతులయందు మాదిరిగా కావ్యకళ మొక్కవోలేదు.

అఖిల భారత చరిత్రకే అలంకార భూతుడైన తిక్కన తరువాత నవతరించెను. తిక్కన వైదిక మార్గ నిష్ఠమగు వర్తనము నిర్వహించుచు కావ్య రసమును కొనియాడు చుండెడివాడు. విరాట పర్వాదిగా స్వర్గారోహణ పర్వాంతము దనుక ప్రబంధ మండలిని రచించిన వాడా కవిబ్రహ్మ. యౌవన కాలమున దర్పద్యోతకముగ నిర్వచనోత్తర రామాయణమును సృష్టించెను. ఆతని కాలముననే పురాణ వాఙ్మయము, కథా వాఙ్మయము తెలిగింపబడెను. తిక్కన తరువాత నంతటి వాడనని భావించిన నాచన సోముఁడు ఉత్తర హరి వంశమును రచించెను. అతడు నవీన గుణసనాథుడు. వస్తు కళకు, రచనా కళకు శ్రీకారము చుట్టినవాడాతడు. అతనికొక కొంచెము పూర్వుడగు ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱన భారతమునకు ఖిల పురాణమనదగు హరివంశమును తెలిగించెను. ఆరణ్య పర్వ శేషమును పూరించెను. లక్ష్మీ నరసింహావతారమను క్షేత్ర మహాత్మ్యమును ప్రబంధోచిత వర్ణనములతో రచించెను.

ఈ విధముగా శ్రీనాథునకు ముందు పురానేతిహాస వాఙ్మయమే తెలిగింపబడినది. ఇక్కడ మనము గమనింపదగిన అంశములు రెండు మూడు గలవు. కాకతీయ సామ్రాజ్యనాశానంతరము సుమారొక శతాబ్ది వరకును తెలుగులో చెప్పుకొనదగిన సాహిత్యమే రాలేదు. కొన్ని శతకములు మాత్రమే వచ్చినవి. వానిలో నాటి ప్రజల కడ కన్నులకు కట్టినట్లు వర్ణింపబడినవి. ఇంతలో కుంతలమున కర్ణాట సామ్రాజ్య నిర్మాణ భేరి మ్రోగినది. రెడ్డి రాజుల స్థిర ప్రభుత్వము నెలకొన్నది. మెల్లగా శ్రీనాథుడు తన కవితా

ద్విగిజయముతో ప్రవేశించెను. శ్రీనాథునకు పూర్వము వీర శైవము, వైష్ణవము, అద్వైతము తెనుగునాట వ్యాపించినవి. శైవ వైష్ణవములు లోక ధర్మాలుగను, అద్వైతము మతాతీతమైన సత్యముగను నుండినవని చెప్పవచ్చును. దీనినే కొంత మార్చి చెప్పినచో శైవ వైష్ణములు నాటి సాంఘిక ధర్మములు. అద్వైతము వ్యక్తిగత మోక్ష మార్గము. కాని నాడాంధ్ర దేశమున మహమ్మదీయుల మూలమున సంఘ వ్యవస్థ ఛిన్నాభిన్నమైనది. బ్రతుకు బండలైనది. దీనితో ప్రజల మనస్తత్వమున మార్పేర్పడినది. మహ్మదీయుల దాడులకే మతమును అడ్డుపడలేకపోయినది. ఏ దేవుడును ప్రజలను రక్షింపలేకపోయెను. ఈ బాధలైహికములు గాబట్టి క్షణికములని భక్తులనిరి. ఇవి లౌకికములు గనుక జ్ఞానులు మిధ్యలనిరి. దీనితో నిత్యజీవితమున మత నియమములకు కట్టుబడుచున్నట్లు కనబడినను ప్రజలకు మతము పై వ్యక్తముగా కొంత యుపేక్షాభావమును, అవ్యక్తముగా కొంత అవిశ్వాసమును కలిగినవి. సుఖశాంతులు లేకపోవుట, బాధలు దుర్భరమగుట దీనితో ప్రజలకు జీవితము పై ఉత్సాహము నశించినది. మతమునకు, ప్రజలకు నిట్టి సంబంధమున్న కాలములో రాజులు కూడ వైయక్తికముగ నేదోయొక మతము నాదరించినను రాజకీయముగ మత ప్రసక్తము లేని రాజ్యమునే చేసిరి. మొత్తము మీద మధ్య యుగము నందలి ఆంధ్ర సమాజ ప్రవృత్తు మతాతీతముగా నున్నది.

ఈ మతాతీత ప్రవృత్తియే సాహిత్యమున ప్రతిఫలించినది. శ్రీనాథునకు పూర్వము సాహిత్యమునకు, మతమునకు విడరాని సంబంధమున్నది. తిక్కనామాత్యుని భారతమున మత సమన్వయమేర్పడి కవిత్వము కొంతకు కొంత మతాతీతమైన కళగా స్థిరపడినది. ఈ కారణములతో కవిత్వ చరిత్రలో రావలసిన పరిణామములు శ్రీనాథుని రచనలలో రానే వచ్చినవి. కవిత్వము స్వతంత్ర కళ గనుగ వస్తువు కంటె శిల్పము ప్రధానమైనది. మతాతీతమైనది కనుక ప్రజలనుత్తేజపరచి ప్రబోధము చేయు కర్తవ్యమును వదలి ప్రభువుల వినోదమే కవిత్వమునకు పరమార్ధమైనది. రస నిష్పత్తి యప్రధానమై వక్రోక్తి, శబ్దాడంబరము ముందునకు వచ్చినవి. కవిత్వము అంతఃపురములోని కర్పూర చందన తాంబూలాదుల వలె నొక విలాస వస్తువైనది. ఈ కవితా పరిణామమునకు దర్పణముగా శృంగార నైషధము నిలిచినది. శృంగార నైషధము నందలి యీ పరిణామమే ప్రబంధ సాహిత్యమున మూడు పూవులారుకాయలుగా విజృంభించినది.

సంస్కృత వాఙ్మయము ఆంధ్రమునకు అవతరించిన దశలలో శ్రీనాథుని ఆంధ్రీకరణ పద్ధతి రెండవది. మొదటిది కవిత్రయము వారు చేసిన భారతాంధ్రీకరణ పద్ధతి. వారి పద్ధతిని భాషాంతరీకరణమనియే పిలువరాదు. అది మూలమును నిమిత్త మాత్రముగానే గైకొని సాగించిన స్వతంత్ర రచన. ఇక శ్రీనాథుడు ప్రారంభించినది ప్రబంధానువాదము. కనుక భారత కవుల అనువాదమునకును, శ్రీనాథుని యనువాదమునకును బేధముండక తీరదు. భారతము వలె గాక నైషధమున ప్రతి శ్లోకమును గణనీయముగానే యుండును. ప్రతి శబ్దము అపరిహార్యముగానే కనపడును. భారతము నందు వలె నైషధము నందు కథా ప్రాధాన్యము పనికిరాదు. పరిగణనీయము గదాయని ప్రతి శ్లోకము నాంధ్రీకరించినచో కావ్యము యొక్క సొంపు చెడును. ఈ సంకటము నుండి తొలగుటకు శ్రీనాథుడొక మధ్యమ మార్గము అవలంబించెను. మూలము ననుసరించినట్లే కనిపించును గాని దానికి దాస్యము చేయుచున్నట్లు మాత్రమతడు కనబడడు. మూల శ్లోకముచే తన నోటిని, చేతిని బంధించుకొనక ఆ శ్లోకార్థమునే తమ పద్య గర్భమున ఇముడునట్లు చేయును. అనుచితము, అనావశ్యకము నని తోచినతో నెంత గొప్ప శ్లోకము నైనను త్యజించుటకు వెనుదీయడు. ఆవశ్యకమని తోచినచో శ్లోకము నెల్ల యథాతథముగా యథాక్షరముగా ననువదించుటకు జంకడు. నైషధానువాదమంతయు ఈ ఫక్కినే నడచినది. శ్రీనాథ యుగము నందలి పినవీరభద్రుడు, నందిమల్లయ, ఘంట సింగయ మున్నగు కవులందరు నైషధాంధ్రీకరణ మార్గమునే నడచిరి.

అనువాద పద్ధతికి మాదిరిగా ప్రబంధ రచనమునకును శ్రీనాథుడే మార్గదర్శకుడయ్యెను. పురాణేతిహాసముల నుండి ఆంధ్ర రసికుల దృష్టిని ప్రబంధముల దెసకు మరల్చినది శృంగార నైషధము. ఆ ప్రబంధములకు తగిన శైలిని, శయ్యా సౌభాగ్యమును శృంగార నైషధముఖమున నొసగిన గురువు శ్రీనాథుడే. మరి యాంధ్రమున తొల్లిటి నుండియు కేవలమక్షర రమ్యత సాధించిన కవి వర్గమొకటియు, కేవలము అర్ధ గౌరవము పాటించిన కవి వర్గమింకొకటియు రెండు విధములుగా నుండగా, ఆ రెండు విధములను

సమ్మేళన మొనర్చి శబ్దార్థములు రెండింటికి సమప్రాధాన్యము నొసంగిన శిల్పియు శ్రీనాథుడే. శృంగార నైషధమే దానికి ప్రబల తార్కాణము.

ఆంధ్ర సాహిత్యము మీద శృంగార నైషధ ప్రభావము రెండు విధములుగా గోచరించుచున్నది. 1. కథావస్తు విధానము, 2. రచనా పద్ధతి. శృంగార నైషధము నైషధీయ చరితమునకు ననువాదమేయయ్యు పై రెండు విధములుగా తదనంతర సాహిత్యమునకు మార్గదర్శకమైనది.

శృంగార నైషధ ప్రారంభమున నల మహారాజ వర్ణనము కలదు. నలుడొకనాడుద్యానవనమున కేగి రాజ హంసమును పుట్టకొనును. అది పిదప రాజు నుండి విముక్తి పొంది దమయంతి కడకేగి దౌత్యము నెఱపును. హంస దౌత్య కారణముగా నల దమయంతులిరువురు విరహము పాలైరి. దమయంతి మూర్ఛపోవగా చెలులు శిశిరోపచారములు చేసిరి. ఈ సందర్భమున శ్రీనాథుడు సాయంకాల, అంధకార, నక్షత్ర, చంద్రోదయ వర్ణనములు గావించెను. దమయంతి విరహ వేదనకు తాళజాలక చంద్రాదుల నుపాలంభించును. నల దౌత్యమునకు పిదప దమయంతి స్వయంవరము జరుగును. నల దమయంతుల వివాహము శాస్త్రోక్తముగా జరుగును. వివాహ సమయమున పురస్త్రీలు నలుని జూచి యానందించిరి. అత్తవారి యింటికి పంపునప్పుడు భీమ భూపతి కుమార్తెకు బుద్ధులు చెప్పును. నిషధ పురమున కేతెంచిన నల దమయంతులు గృహప్రవేశము గావించిరి. దమయంతి కేళీ గృహము ప్రవేశించును. పిదప కవి నల దమయంతుల విహారములను, రత్యుపరతులను వర్ణించెను.

శృంగార నైషధము నందలి ఈ కథా వస్తు సంవిధానమే తదనంతరం ప్రబంధ సాహిత్యమునందును గోచరించును. ప్రబంధ కవులు పురాణేతిహాసముల యందలి నాతివిస్తృతమైన కథను స్వీకరించి అష్టాదశ వర్ణనములతో, అలంకారిక శైలితో శృంగార రస ప్రధానములగు కావ్యములు సృష్టించిరి. అయినను ఆ నాతివిస్తృతమైన ఇతివృత్తమును శృంగార నైషధ కథా వస్తువు ననుసరించి మలచిరి. శృంగార నైషధము నందు నలుడు ఉద్యాన వనమున కేగినట్లే వసుచరిత్రమునందును, ప్రభావతీప్రద్యుమ్నము నందును కథానాయకులు ఉద్యానవనమున కేగుదురు. అటనే వారికి నాయికా వృత్తాంతము శ్రవణ గోచరమగును. హంస వలెనే ప్రభావతీ ప్రద్యుమ్నము నందు శుచిముఖి, రాజకీరము రాయబారములు నడుపుదురు. ఇక దమయంతి వలెనే ప్రతి ప్రబంధ నాయికయు విరహమునకు తాళజాలక చంద్రాదులనుపాలంభించును. ఇట్ట సందర్భములలో ప్రబంధ కవులు శ్రీనాథుని వలెనే చంద్ర సూర్యోదయాస్తమయ తమో నక్షత్ర వర్ణనములు గావించిరి. వివాహమున కేతెంచు నలుని చూచి పుర స్త్రీలు ప్రీతి పొందినట్లు మను చరిత్రమునందును స్వరోచిని చూచి పురస్త్రీలు మైమఱచిరి. ప్రబంధముల యందలి వివాహ వర్ణనము సర్వ విధముల శృంగార నైషధ వివాహ వర్ణనమునే పోలుచున్నది. నాయికా నాయకుల సంభోగ వర్ణనము శృంగార నైషధము నందు వలె మను చరిత్రము, కళా పూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము మున్నగు వాని యందు కలదు. కట్టమంచి రామలింగా రెడ్డి గారు చెప్పినట్లుగా విప్పట్టున చెలికత్తెలు కేళీ గృహమున నాయికను వదలి వెళ్ళినను కవి మాత్రము నాయికా నాయకులను వదలడు.

శ్రీనాథుని తరువాతి కవులు పద్య రచనా నిర్మాణము లందును నతని ననుసరించిరి. శృంగార సాకుంతలము, మను చరిత్రము, వసు చరిత్రము మున్నగు వాని యందలి పద్యములు, సమాస ఘటనములు నందులుక తార్కాణములు. ముఖ్యముగా మను వసు చరిత్రముల యందు శృంగార నైషధ ప్రభావమధికముగా గోచరించుచున్నది. హంస దమయంతితో తన యాభిజాత్య విద్యా వైభవములను గూర్చి యిట్లు చెప్పును.

సీ॥ నలిన సంభవు సాహిణము వారు వంబులు
        కులము సాములు మాకుఁగువల యాక్షి
    చదలేటి బంగారు జల రుహంబుల తూండ్లు
        భోజనంబులు మాకుఁబువ్వుబోడి
    సత్యలోకముదాక సకలలోకంబులు

నాటపట్టులు మాకు నబ్జవదన
మధురాక్షరములైన మా మాటలు వినంగ
నమృతాంధసులు యోగ్యులనుపమాంగి
తే॥ భారతీదేవి ముంజేతి పలుకుఁజిలుక
సముదగజయాన సబ్రహ్మచారి మాకు
వేదశాస్త్ర పురాణాది విద్యలెల్లఁ
దరుణి! నీయాన ఘంటా పథంబుమాకు

"ఎవ్వతెవీవు" అని ప్రవరుడడిగిన ప్రశ్నమునకు సమాధానముగా వరూధిని భాషించిన పద్ధతిని ఆంధ్ర కవితా పితామహుడగు పెద్దన శ్రీనాథుననుసరించియే వర్ణించెను.

సీ॥ చిన్ని వెన్నల కందు వెన్నుదన్ని సుధాబ్ధిఁ
బొడమిన చెలువ తోబుట్టు మాకు
రహివుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు
విమల గాంధర్వంబు విద్య మాకు
ననవిల్తు శాస్త్రంపు మినుకు లావర్తించు
పని వెన్నతోడఁబెట్టినది మాకు
హయమేధ రాజసూయములనఁబేర్వడ్డ
సవన తంత్రంబులుంకువలు మాకు
తే॥ కనకనగసీమఁగల్ప వృక్షముల నీడఁ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకు
పద్మసంభవ వైకుంఠ భర్గ సభలు
సాము గరిడీలు మాకు గోత్రామ రేంద్ర

శ్రీనాథుడు "బండి కందెనతోడఁబ్రతి వచ్చుమైచాయ" అని యనగా పెద్దన "బండి కందెన చాయ బైసి మాలిన మేన" నని యనెను. శ్రీనాథుడు "ఓ మిహిరాంశువంశ కలశోదధి కౌస్తుభరత్న" అని యనగా పెద్దన "ఓ చతురాస్య వంశ కలశోదధి పూర్ణ శశాంక"అని యనెను. శృంగార నైషధము నందలి భాషా భావములను పెద్దన యిట్లు బహు ముఖీనముగా ననుసరించెను.

హంస దమయంతిని గూర్చి నలునకు చెప్పుచు నీ క్రింది విధముగా నను -

మ॥ కమలేందీవర షండ మండిత లసత్కాసార సేవారతిన్
గమి కీర్మకృతనైక నీవృతుడనై కంటిన్ విదర్భంబునన్
రమణిన్ బల్లవ పాణిఁబద్మనయనన్ రాకేందు బింబాననన్
సమపీనస్తని, నస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్

ఈ రచనా విధానమే శృంగార శాకుంతలము నందు, మను చరిత్రము నందు, వసు చరిత్రము నందు నిట్లు కనబడుచున్నది-

శా॥ చంచత్ పల్లవ కోమలాంగుళికరన్ సంపూర్ణ చంద్రాననన్
న్యంచచ్చందన గంధి, గంధ గజయానన్, జక్రవాకస్తనిన్
గించిన్మధ్యఁ, దటిల్లతా విలసితాంగిన్, బద్మపత్రాక్షి, వీ
క్షించెన్ రాజు శకుంతలన్ మధుకర శ్రేణీల సత్కుంతలన్ - శృంగార శాకుంతలము

మ॥ అతడావాత పరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనా
న్వితమిచ్చోటని చేరఁబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్
శతపత్రేక్షణఁ జంచరీక చికురన్, జంద్రాస్యఁ, జక్రస్తనిన్
నతనాభిన్, నవలా, నొకానొక మరున్నారీ శిరోరత్నమున్ - మను చరిత్రము

చం॥ తరువుల పొంతఁబొంచి వసుధా వర మిత్రుఁడు గాంచెనచ్చటన్
దరుణిఁ, దమో వినీల కచఁ, దామరసోదర సోదర ప్రభన్,
దరళ విలోచనన్, దతనితంబఁ దటిన్నిభగాత్ర వల్లరిన్
దరుణ శశాంక ఫాల, నొకతన్విఁదరంగవళిన్ దలోదరిన్ - వసు చరిత్రము

అసాధారణ ప్రబంధమగు వసు చరిత్రము నందు శృంగార నైషధానుకరణములు పెక్కులు కలవు. శృంగార నైషధ కావ్యమున దమయంతిని జూచు నలుని చూపులు వర్ణింపబడినవి. వసు చరిత్రము నందును తచ్ఛాయల ననుసరించి గిరికావసురాజుల పరస్పరాలోకనములును వర్ణింపబడినవి. శృంగార నైషధము నందు హంస దమయంతితో నిట్లనును -

ఉ॥ నిర్ణయమా నృపాలునకు నీకును సంగతి, యెల్లి నేటిలోఁ
దూర్ణము సేయగా గలడు తోయజసూతి, తదన్యథా వృథా
దుర్ణయ వృత్తికిన్ మనసు దూర్చిన యేని జగజ్జనాపవా
దార్ణవముత్తరించుటకు నాతని కెయ్యది తెప్ప చెప్పుమా

వసు చరిత్రము నందు మాయామౌని మంజువాణితో

“తమ్మికంటీ! యకుంఠిత భువన నిర్మాణ చాతురీ ధురీణుండగు పితామహుండేతాదృశ వస్తు యోజనంబునన్ బొగడువడసి, యపార పరీవాద పారావార భంగంబులన్ మునంగడు సుమీ'' అని యనును.

శృంగార నైషధమున దమయంతికి నాశీర్వచనములు పలుకు పట్టున శ్రీనాథుడీ క్రింది పద్యమును రచించెను.

ఉ॥ ఆదిమశక్తియైన తుహినా చలరాజ తనూజ వోలెము
త్తైదువవై నిజేశ్వరుని యర్థ శరీరము పాలుగొమ్ము, నీ
పాద సరోరుహంబులతిభక్తి భజింతురు గాక యెప్డుబ్ర
హ్మాదిక దేవతా సదృశులైన మహామహి మండలేశ్వరుల్

ఈ శ్రీనాథుని పద్యము ప్రౌఢ కల్పనముతో కూడి వసు చరిత్రమున నీ క్రింది విధముగా రూపొందెను.

మ॥ చరణాగ్రా నమితా చలేశ్వరునిగా, సన్మార్గ సంచారిగా
స్థిర కళ్యాణ సమాఖ్యగా హరికృపన్ శ్రీఘ్రుంబ చేపట్టి యో
గిరి కన్యాయర లేక నీవతడు నేకీభావమున్ జెందుమా
గిరి కన్యామణి కన్న ధన్యవయి యక్షీణానుమోదంబునన్

నలుడు వన విహారమున కేగిన సందర్భమున ఉద్యానవనమును వర్ణించుచు కవి సార్వభౌముడీ క్రింది పద్యమును రచించెను.

మ॥ దమయంతీ స్తన కుంభ విభ్రమముఁబొందంగోరుటన్ ధూమపా
నముఁగావించు చథోముఖంబులగు నానా కుంభముల్ వోలెధూ
పములన్ దోహదమాచరింపగఁగ డున్ బక్వంబులైయున్నదా
డిమముల్ సూచి నృపాలకుండు మదిఁబాటించెన్ మహౌత్సుక్యమున్

వసు చరిత్ర తృతీయాశ్వాసములో విరహ బాధననుభవించు గిరికకు ప్రియ సఖులు కేళి కాంతార వైభవమును నిరూపించు సందర్భమున పై శ్రీనాథుని పద్యమే రూపాంతరము పొందినది.

మ॥ అలినీలాలక! కంటె చిల్క భవదీయాలాప లీలాప్తి నిం
పలరన్ గోరి విపక్వ దాడిమ తరువ్యాలంబి శాఖా ఫల
జ్వలనా వాఙ్ముఖమై తపంబు నవరింపన్ సాగె, నేలబ్బెడిన్
దలక్రిందైన ననూన వాగ్గ్రహణ మేధాశక్తి బంబాశికిన్

ఈ విధముగా శృంగార నైషధము తదనంతర కవులకు శబ్దార్థ భావ స్వీకార సందర్భముననను పాదేయమైనది.

## 3.4 సారాంశము:-

నలదౌత్య సన్నివేశమున దమయంతి ధీరోదాత్తత, నలుని మనశ్శుద్ధి పరాయణత వ్యక్తమైనవి. హంస దౌత్యమున రాజహంసము యొక్క కార్య సంధాన నైపుణ్యము వెల్లడియైనది. మరియు శృంగార నైషధ ప్రభావము తదనంతర కవుల పై ప్రసరించిన తీరు విశదీకరింపబడినది.

## 3.5 ప్రశ్నలు :-

1. నలదౌత్యమున వ్యక్తమగు దమయంతి వ్యక్తిత్వమును వివేచింపుడు.
2. శృంగార నైషధ మందలి నల దౌత్య ఘట్టమును వివరింపుడు.
3. శృంగార నైషధమున వ్యక్తమగు హంస రాయబార నైపుణ్యము.
4. ఆంధ్ర సాహిత్యమున సృంగార నైషధ ప్రభావమెట్టిది?
5. రాజహంస దూత్యమాధారముగా శ్రీనాథుని అనువాద విధానమును వివరించునది.

## 3.6 ఆధార గ్రంథములు :-


1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. శ్రీనాథుడు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
3. శ్రీనాథ భారతి - జోశ్యుల సూర్యనారాయణ మూర్తి



**డా॥ గోగినేని యోగ ప్రభావతీ దేవి**
ఎం.ఏ (తెలుగు), ఎం.ఏ (సంస్కృతం), ఎం.ఫిల్,పి.హెచ్.డి.
**శాఖాధ్యక్షురాలు , తెలుగు & ప్రాచ్య భాషా విభాగం**
**ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్.**

పాఠం - 4

# శ్రీనాథుని హర విలాస విలాసము

**ముఖ్యాంశాలు:-**


4.0 లక్ష్యం
4.1 ఉపోద్ఘాతము
4.2 హర విలాస రచనా కాలం
4.3 ఇతివృత్త నిర్వహణ
4.3.1 చిఱుతొండనంబి కథ
4.3.2 గౌరీ కళ్యాణం
4.3.3 దారుకా వన విహారం
4.3.4 సముద్ర మథన వృత్తాంతం
4.3.5 అర్జుని తపస్సు
4.4 హర విలాస కవితా వైభవము - స్వతంత్ర కావ్యము
4.5 హర విలాసము - శైలి
4.6 శ్రీనాథుని కాలపు ఆచార వ్యవహారాలు
4.7 హర విలాసము - రస ప్రస్థానము
4.8 హర విలాసము - అలంకార సమన్వయము
4.9 హర విలాసము - వర్ణనా వైచిత్రి
4.10 ప్రశ్నలు
4.11 ఆధార గ్రంథాలు


## 4.0 లక్ష్యం:-

శ్రీనాథుని శ్రీనాథత్వం హర విలాసంలో విశదం కాగలదు. ఇందు ఏడు ఆశ్వాసాలున్నాయి. ఈ ఏడు ఆశ్వాసాల్లో అంతట ఒకే కథ లేదు. సర్వ వస్తువులకు సమైక్యం కనబడుతుంది. శివునకు (హర) సంబంధించిన నానా విలాసాలు ఇందు ఉన్నాయి. హరుని విలాసాలను ఉద్దేశించి రచింపబడ్డ గ్రంథం కాబట్టి దీనికి హర విలాసమనే పేరు వచ్చింది. ఇందులో శివభక్తి పరాయణత్వంతో కూడిన విశేషాలెన్నో కలవు. వాటినన్నింటిని తెలుసుకోవడమే ఈ వ్యాస పరమ లక్ష్యం.

## 4.1 ఉపోద్ఘాతము:-

కవి సార్వభౌముడైన శ్రీనాథుడు పుంభావ సరస్వతి. ఆంధ్ర గీర్వాణ భాషలు ఆయన కన్నుల మెలగినవి. సకల విద్యాసనాథుడు. తెలుగుతనము మూర్తీభవించిన మహాకవి శ్రీనాథుడు. శ్రీనాథునకు ఇష్ట సఖుడైన అవచి తిప్పయ్య విశిష్టమాహేశ్వరాచార్యుడు. శ్రీనాథుని అవచి తిప్పయ్య ఆగమజ్ఞాన నిధివి, తత్వార్ధ ఖనివి, బహుపురాణజ్ఞుడవు అని ప్రశంసించాడు.

భారతీయ సంస్కృత వాఙ్మయంలో శివ విలాసాలు సూచించు ప్రబంధ గ్రంథాలు అనేకం ఉన్నాయి. పురాణాలు, ఆగమాలు, త్రిపుర రహస్యము, వేద వేదాంతాలు, హర విజయము, హరి చరిత చింతామణి, కుమార సంభవము ఇత్యాది గ్రంథాలు హర

విలాసాన్ని సూచించుచునే ఉన్నాయి. శివ పార్వతుల ప్రభావ సుతకములు అంతటా ఏక విధంగా లేనే లేవు. శ్రీనాథుడు అసాధారణ వ్యక్తి. ప్రతి మానవునిలోను శివ దేవుడు శివ పీఠంలో ఉంటాడు. ఆ భవ మహా లింగప్రాప్తికై సాధకులు చేయదగు సాధనాలు విశిష్టంగా ఉంటాయి. ఈ గ్రంథంలో ఏడు ఆశ్వాసాలుండటం యిట్టి సాధన పరిపాకమునకు నిదర్శనం. 1. ప్రభావ సూచనము, 2. పాప నివారణము, 3. అనర్థ నివారణము, 4. అహంకార దూరకరణము అనేవి పరమ విలాస సూచకములు. ఇట్టివి ఇందు యధానుగతంగా ఉన్నవి. కాబట్టి వానిని పరిశీలిద్దాం.

## 4.2 హర విలాస రచనా కాలం:-

శృంగార నైషధ రచనకు కొండవీటి రాజ్యపతనానికి మధ్య కాలము నందు శ్రీనాథుడు ఎవరి ఆస్థానంలో మరియే గ్రంథాలు రచించినాడో తెలియదు. రచించిన జాడయు కన్పించదు. కాని శ్రీనాథుడు శాసనకర్తగా కొన్ని శాసనాలు రచించాడు. ఆ కాలంలో శాసన రచనలు కూడా గ్రంథ రచనలు గానే గౌరవింపబడేవి. హర విలాస గ్రంథాన్ని శ్రీనాథుడు ఏ వయస్సులో రచించెనో ఆధారాలు లేవు. కాని హర విలాస కృత్యవతారికను బట్టి రచనాకాలాన్ని నిర్ణయించటానికి ఇతర గ్రంథాలు పెక్కింటి వలె ఇందు సాధన సంపత్తి కలదు. కాని హర విలాస రచనాకాలం కూడా వివాదగ్రస్తమైంది.

'ఆంధ్ర భాషా నైషధాబ్జభవుని' అని శ్రీనాథుడు తనను గురించి హర విలాసంలో చెప్పుకోవడంతో ఇది శృంగార నైషధాంతర రచనయే యని ఋజువు చేయటానికి పాటుపడనక్కరలేదు. ప్రోలయ వేమారెడ్డి రాజ్యం శత్రు హస్తగతమగుటతోడనే శ్రీనాథుడు నిరాశ్రయుడై కీర్తి సముపార్జనార్థమో, ధన సంపాదనార్థమో, ఆశ్రయాంతరములను వెదుక్కుంటూ దేశ సంచారం చేసి ఉంటాడు. అతని జీవిత కాలంలో దేశ సంచారాలు మూడు జరిగి ఉంటాయని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఊహించారు.

1. కొండవీటి నుండి నిష్క్రమించటానికీ, భీమఖండాన్ని రచించటానికి గల మధ్య కాలం.
2. భీమఖండ రచనకు కాశీఖండ రచనకు గల మధ్య కాలము.
3. రాజమహేంద్రరెడ్డి రాజాశ్రయం కూడా తొలగిన అనంతరం.

ఈ మూడు సంచారాల్లో మొదటి దానియందు కాంచీ నగరానికి వెళ్ళి చిరపరిచితుడైన అవతి తిప్పయ్య సెట్టికి హర విలాసాన్ని కృతి ఇచ్చి ఉంటాడు. రెండవ దానియందు వల్లభామాత్యుని దర్శించి అతని పేర క్రీడాభిరామాన్ని రచించి ధన సముపార్జనం చేసి తదనంతరం విజయనగరానికి వెళ్ళి ప్రౌఢ దేవరాయల ముత్యాలశాలలో దీనారటంకాల తీర్థమాడి ఉంటాడు. మూడవ సంచారంలో శివరాత్రి మహాత్మ్యం మొదలుగా గల చిల్లర రచనలు చేసి ఉంటాడు. పలనాటి వీర చరిత్ర కవి సార్వభౌమ బిరుద ప్రాప్తి అనంతరం వ్రాయబడింది. కాబట్టి పలనాటి వీర చరిత్ర బహుశః కాశీఖండ రచనానంతరం తుది సంచారంలోనిదై ఉంటుంది. అందువల్ల హర విలాస గ్రంథ రచనానుక్రమాన్ని నిష్కర్షగా ఋజువు చేయటానికి వీలు లేని ఊహ ఐనప్పటికీ నిరుపపత్తికం కాదు. కాబట్టి శృంగార నైషధానికి తరువాత హర విలాస రచన చేయబడింది. అది **1420 - 25** మధ్య కాలమై ఉండవచ్చు.

'చిన్నారి పొన్నారి చిఱుతకూకటి నాడు' అనే పద్యంలో హర విలాసాన్ని పేర్కొనలేదు. కొందరి దృష్టిలో ఈ గ్రంథం కాశీ ఖండ రచన తరువాతది అనే వాదానికి బలం లేదు. ఎట్లంటే 'చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాడు' అనే పద్యం శ్రీనాథుని గ్రంథాలన్నింటిని పేర్కొన్నది కాదు. ఈ పద్యం కవి వయో దశలు తత్కాల రచనలను ఉదహరించటానికి మాత్రమే ఉపకరిస్తుంది. ఒక వయోదశలో రెండు మూడు గ్రంథాలను రచించినా వానినన్నింటిని పేర్కొనవలసిన ఆవశ్యకం లేదు. వానిలో ప్రధానమైంది ఒకటి ఉదాహృతమైన చాలును. శివరాత్రి మహాత్మ్యం కాని, హర విలాసం కాని, తదితర గ్రంథాల్లాగా శ్రీనాథుని కావ్యకళా ప్రాగల్భ్యానికి లక్ష్య భూతములు కాదగిన గ్రంథాలు కాకపోవటం చేత వానిని ఆదరంగా కొండాడు కొనుతలంపు లేకపోవచ్చును. ఇంకను హర విలాసము శృంగార నైషధానికి పూర్వంగానీ, కాశీ ఖండానికి తరువాత గాని రచింపబడి ఉండుట పొసగదు.

శృంగార నైషధ రచనా కాలము **1395**వ సంవత్సరమని నిర్ణయింపబడింది. దీనిని బట్టి హర విలాస రచనా కాలము **1400**వ సంవత్సరమవటంలో ఎట్టి బాధ లేదు. హర విలాసం ఈ కాలంలో రచింపకపోతే కుమార గిరిరెడ్డి, హరిహర రాయలు,

ఫిరోజ సహాల విషయం కాక పెదకోమటి వేమారెడ్డి, దేవరాయలు ఫిరోజ సహాల విషయముండుట సహజం. అవటి తిప్పయ కుమార గిరి అనంతరం బ్రతికి ఉంటే వ్యాపారము చేయుట మానే వ్యక్తి కాదు. కుమార గిరి రెడ్డి తర్వాత పెదకోమటి వేమారెడ్డి వసంతోత్సవాలు జరుప లేదనుట అసంగతం కాదు. అనవేమారెడ్డి ప్రారంభించిన వసంతోత్సవం అనమారెడ్డి యడల గల ప్రేమానుబంధము కల పెదకోమటి వేమారెడ్డి కొనసాగించుట సహజం. ఎన్ని విధాల చూచినా హర విలాస రచన కుమార గిరి రెడ్డి రాజ్యకాలమందే రచింపబడుట స్పష్టమౌతున్నది.

## 4.3 ఇతివృత్త నిర్వహణ:-

ఈ గ్రంథమునందు ఏడాశ్వాసాలు కలవు. మొదటి రెండు అశ్వాసాలలో చిఱుతొండని కథకలదు. తిక్కన ఆశ్వాసాలలోనివి పూర్వ కథలే. మొదటి కథ చాల క్రొత్త కథ.

### 4.3.1 చిఱుతొండ నంబి కథ:-

(i) అరవ దేశ మందలి అనేకములైన శిక కథలలో ఒకటి ఈ కథ యొక ఆశ్చర్యము. ఈ కథలోని శ్రీనాథుని రచన మరియు ఆశ్చర్యము. ఇంత అందమైన కథ యింత అందంగా శ్రీనాథుడు మరెక్కడా చెప్పలేదు.

ఈ చిఱు తొండని కథలో శ్రీనాథుని భాషయే వేఱు. ఆతని మాటలే వేఱు. చిఱు తొండడు తిప్పయ్య వంశమువాడు. శైవాచార నిష్ఠ కలవాడు. శివానుగ్రహము పొందినవాడు. తిప్పయ్య దద్వంశము వాడు. ఆశ్వాసద్వయము నంబి సంకేతముతో నున్నది. మధ్యమము వుస్త భావైక్యము కలది. కావ్యశోభా సంపాదకముగానున్నది. శ్రీనాథుని భావంలో ఇది ప్రబంధముఖ తిలకాయితము.

చిఱు తొండ నంబి తమిళ దేశమందలి శివ భక్తులగు నాయనార్లలో ప్రఖ్యాతమైన చరిత్ర కలవాడు. చిఱు తొండడు చాల గొప్ప భక్తుడుగా పేరు పొందాడు. తమిళ చరిత్ర యందు ఇతడు పాండ్య రాజునకు సేనానిగా ఉండేవాడని తెలుస్తున్నది. క్రమంగా ఇతడు భగవద్భక్తికే జీవితాన్ని అంకితం చేసినట్లు కలదు. శ్రీనాథుడు చిఱు తొండ నంబిని వైశ్యకులజునిగా చిత్రించాడు. అతని భార్య పేరు కూడా మార్చి వ్రాశాడు. ఈ కవ్య మందలి భేదాలను గమనిద్దాం.

దుర్వాస మహాముని బదరికా వనంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఒకనాడు ఆయన జపతపాలు పూర్తి చేసి దేవతలకిచ్చిన నైవేద్యాన్ని హోమం చేయగా మిగిలిన పదార్థాన్ని లేడి పిల్లలకు తినిపిస్తున్నాడు. ఆ సమయంలో తుంబురుడు అనే ప్రమథుడు, వాని భార్యయు విమానంలో ఆకాశంలో తిరుగుతూ దుర్వాసుడు లేడి పిల్లలను మేపుచుండటాన్ని చూచిన తుంబురునకు సంతోషం కలిగింది. ఆయన ఒక చిటికె వేశాడు. ఆ చిటికె ఖంగున మ్రోగింది. లేడి పిల్లలు బెదిరిపోయాయి. దుర్వాసుడు ఆకాశం వంక చూచాడు. ఆయనకు కోపం వచ్చింది. అంత దుర్వాసుడు తుంబురుని కోపించాడు. "ఓరీ నీవు పోయి మనుష్య లోకంలో జన్మించు" అని. అతనికి భయం వేసింది. దిగివచ్చి దుర్వాసుని కాళ్ళ మీద పడి "స్వామి! నేను దురుద్దేశంతో చేయలేదు. తమకు గల భూత దయకు సంతోషించి నేను చిటికె వేశాను. నీవన్న మాట తప్పక నెరవేరుతుంది. నేను పోయి మనుష్య జన్మ ఎత్తుతాను. కాని శివ భక్తుల ఇంట్లో నేను పుట్టునట్టు అనుగ్రహింపుము. అన్నాళ్ళును నా భార్యను నీ ఆశ్రమంలో నీ కోడలి వలె ఉండనిమ్ము" అని ప్రార్థిస్తాడు. అంత దుర్వాసుడు దయ కలిగి "ఓరి, నాయనా! ప్రొద్దున్నే లేచి ఎవరి మొగం చూచితివోయీ! నాచేత ఇంత మాట పడితివి" అన్నాడు.

అంత తుంబురుడు శాప వశం చేత భారతదేశంలోని కంచి పట్టణము నందు గొప్ప వైశ్య కులంలో పుట్టాడు. అతని భార్యయు భర్త వెంటనే భూలోకానికి వచ్చి చిరుతొండని భార్యగా జన్మించింది. అప్పుడామె పేరు తిరు వెంగనాంచి.

వారికొక కుమారుడు కలిగాడు, అతని పేరు సిరియాళుడు.

(ii) **చిఱు తొండని బాస:** ఈ చిఱు తొండడు మహా ధనవంతుడు. ఆ కంచిలో ఏడు వాడలున్నవి. అందఱు వైశ్యులు. ఈ చిఱు తొండడొక వ్రతాన్ని పట్టాడు. ఆవ్రతమేమంటే వీర శైవులైన జంగములు వచ్చి తన్నేమి అడిగినా తానిస్తాడు. ఈయకపోతే అది 'తిరుబాస' అవుతుంది. అంటే మాట తప్పిన వాడవుతాడు.

వీర శైవం దేశము నందు ముదిరి ఉన్నప్పుడు వారిలో మిండ జంగములని కొందరుండేవారు. భోగము వాంఛ వంటి వారు స్త్రీలుండేవారు. ఈ మిండ జంగములు వారి యిండ్లకు వెళ్ళుండేవారు. వారి మతంలో జంగమునకు శివునకు భేదం లేదు. ఒకనాడు మిండ జంగముడొకడు చిఱుతొండని ఇంటికి వచ్చి తూమెడు చెఱకు రసం కావాలని అడిగాడు. దానితో నేను శివునకు అభిషేకిస్తానన్నాడు. చిఱు తొండడు, వంద ముదురు ఛెఱకుగడలను కొని లెక్క పెట్టి వానినొక కట్టగా కట్టాడు. లావైన వంద చెఱకుల మోపు మోయుటయే కష్టమైంది. ఒక్కడేరీతిగా ఎత్తుకుంటాడు? అతడు మిఇక్కలి కష్టపడుతున్నాడు. వళ్ళంతా చెమట పట్టింది. అచట ఎత్తెడు వారు ఇంకొకరు లేరు. చిఱు తొండని వ్రతము యొక్క బలమెట్టిదంటే శివుడు దక్కిస్తూ తానే రావలసి వచ్చింది. శివుడు వచ్చాడు అది అంత పెద్ద మోపాయెను. ఆయనకు కూడా ఒడలంతా చెమట పోసింది.

(iii) **భర్త పై పార్వతి కోపం:** సరే! చిఱు తొండడు వచ్చాడు. ఆ రసము జంగమునకు ఇచ్చాడు. అతడు శివాభిషేకము చేశాడు. అది ఇట్లుండగా శివుడు వచ్చి మోపెత్తెను గదా! అప్పుడు శివుడేమి చేస్తున్నాడు? వెండి కొండ మీద అప్సర స్త్రీలు నాట్యం చేస్తుండగా, తక్కిన దేవతలు చూస్తుండగా శివ పార్వతులు కూడా వారి నాట్యం చూస్తున్నారు. పార్వతి చూచింది. అక్కడున్న శివుడక్కడే ఉన్నాడు. ఒడలంతా చెమట పోసింది. ఆమె అనుకొన్నది కదా! ఈ అప్సర స్త్రీలలో ఎవ్వతినో చూచి ఈ శివుడు ప్రేమించి ఉన్నాడు. ఈ చెమట కది కారణమని. అప్పుడు పార్వతి తన చేతిలోని తామర పువ్వుతో శివుని బొమ్మ మీద కొట్టింది. ఆ పుప్పొడి శివుని కన్నుల్లో పడింది. ఆమెకు కోపం వచ్చిందని శివుడు తెలుసుకొన్నాడు. ఆ సభలో విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు అందరున్నారు. శివుడు నవ్వి పార్వతితో ఇట్లా అన్నాడు. "ఏమమ్మా! గౌరమ్మా! మన ఇద్దరి గుండెలు దగ్గరగా ఉన్నవి కదా! ఒకటే శరీరం కదా! నీ గుండెకు తెలియకుండా నా గుండెలో ఒక ఊహ కలుగుతుందా! నా ఒడలు చెమర్చటానికి కారణం చెప్తాను విను" అని శివుడు చిఱు తొండని కథ చెప్తాడు. "పాపమా చిఱు తొండడు మోపెత్తుకొనలేకున్నాడు, నేనెత్తాను. నా చెమటకు కారణమది" అని అనెను.

పార్వతి విని "అయితే నేను తిరువెంగనాంచిని చిఱు తొండని చూచి తీరాలి" అని పట్టు పట్టింది. అప్పుడు శివుడు దేవేంద్రుని వంక చూచి ఇట్లన్నాడు "ఓయీ! కంచిలో ఇరువది యొక దినాలు తెఱపి లేకుండా వాన కురిపింపుము. కంచి చుట్టూ మూడు యోజనాల మేర వాన కురియ వలయును" అన్నాడు.

(iv) **మూడు వారముల ముసురు:** ఇంద్రుడు మేఘాలకధిపతి. ఆ మేఘాల్లో గొప్ప మేఘాలున్నాయి. వాని పేరు పుష్కలా వర్తకము. అవి మెరిస్తే లోకమంతా మునిగి పోవడమే. ఇంద్రుడు వానికాజ్ఞ ఇచ్చాడు. అవి కురియటం ఆరంభించింది. పిడుగులు పడుతున్నాయి. జనులు "అర్జున, ఫల్గునః, పార్థః........" మొదలైన అర్జునుని పది పేర్లను చదువజొచ్చిరి. అయినా వాన ఒకటే పనిగా కురుస్తున్నది. దేశమంతా మునిగి పోయింది. కంచిలో జనులు తెప్పల మీద పోతున్నారు. కంచిలో కామాక్షి దేవాలయముంది. నీరు ఆ దేవాలయాన్ని చుట్టు ముట్టింది. ఏకామ్రనాథుని దేవాలయముంది. తెరిపి ఇస్తే చాలు ఆ ఊరిలో నుంచి లేచి పోదామని జనులు కూర్చున్నారు. ఇరువది రెండవ రోజు తెఱపి ఇచ్చింది.

చిఱు తొండ నంబి వాకిట్లో ఎప్పుడూ జంగములు వేచి ఉంటారు. వందల కొలది ఉంటారు. వారిని పూజించకుండా చిఱు తొండ నంబి భోజనం చేయడు. ఈ వానలు కురిసెడి యిరువది యొక్క నాళ్ళు చిఱు తొండడు వేలాది

జంగములకు భోజనాలు పెట్టాడు.

(v) **ముక్కాలి ముదుసలి జంగము - గ్రుడ్డి భార్య:** ఈ చిఱు తొండ నంబికి కొడుకు సిరియాలుడు. వారి ఇంట్లో ఒక సేవకురాలుంది ఆమె పేరు చందనిక. వీరిద్దరూ రాత్రింబవళ్ళు జంగములకు అన్నం పెట్టటమే పనిగా ఉన్నారు. కట్టెపుల్లలు దొరకవు, మోపుల కొలది యున్న వస్త్రాలను నూనెలో ముంచి నిప్పు ముట్టించి దాని పై వండి భక్తులకు పెడుతున్నారు.

వాన వెలిసింది. చిఱు తొండడు జపతపాదులు పూర్తి చేసికొని స్వామికి నైవేద్యమివ్వటానికి మొదట జంగములను ఆరగింపించవలయును. వాకిటిలోనికి వచ్చాడు. వాకిట్లో ఒక్క జంగముడు లేడు. ఇది యేమి ఆశ్చర్యం? ఇంట్లోకి పోయి తిరువెంగనాంచితో ఇట్లా చెప్పాడు. "గుంపులు గుంపులుగా జంగములుండెడి మన వాకిట్లో నేడొకండును లేడు. ఒక్క శివ భక్తునికైనా పెట్టకుండా మనమెట్లా భోజనం చేస్తాం? నేను ఊరిలోకి వెళ్ళి వెదకివస్తాను. నీవీలోపున వంట చేయు'' మని చెప్పి బయలుదేరాడు.

ఊరంతా వెతికాడు. ఒక్క జంగముడు కూడా లేడు. నీళ్ళలో ఈదుకుంటూ మళ్ళా వెళ్ళిన చోటికే వెళ్ళాడు. ఊళ్ళో లాభం లేదని ఊరి బయట వెదకటం ఆరంభించాడు. ఒక పాడు బడ్డ దేవాలయంలో ఒక వృద్ధ జంగముడు కనిపించాడు. ఆయనకు ఎనుబదేండ్లు. మిక్కిలి ముసలి. ఆయనకు భార్య ఉంది. ఆవిడ గ్రుడ్డిది. చిఱు తొండడు ఆయన దగ్గరకు వెళ్ళి "అయ్యా మీరిద్దరు నేడు మాయింటికి శివార్చనకు రావలయును'' అన్నాడు.

(vi) **జంగముని దారుణ నియమము:** అతడు ముసలి కనుబొమ్మలు కన్నుల మీద వ్రాలుతున్నాయి. తలవణుకుతున్నది. కంఠస్వరం సరిగా లేదు. చేతితో కనుబొమలెత్తికొని "ఏమి! ఏమి! మరల చెప్పు'' మని చెప్పించుకొని, అతని కుల గోత్రాలడిగి, "అవి అన్నియు ఎందుకులే! నేనువత్తును, కాని నే నేడాది నుండి నిరాహార దీక్షలో ఉన్నాను. నేడా వ్రతానికి ఉద్యాపన చేయాలి. నీవు చేయించగలుగుదువా? ఆ ఉద్యాపన నర మాంసాదులతో చేయాలి. వాడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఒక్కడై ఉండాలి. వానికి ఏ రోగం ఉండకూడదు. అందగాడు కావాలి. వాని తల్లి, తండ్రి వానిని చంపి వాని మాంసాన్ని నాకు వండి పెట్టాలి. నీవును నీ కొడుకును నా పంక్తిలో కూర్చొని భోజనం చేయాలి అంటే దానికి చిఱు తొండ నంబి "మహాప్రసాద''మని తన కులము, తన పేరు చెప్పి తాను తిరుక్కచ్చి నంబికి చుట్టమని చెప్పి తన వ్రతాన్ని చెప్పి 'నేను నీ వ్రతానికి ఉద్యాపన చేయిస్తాను. మా యింటికి రమ్ము'' అన్నాడు. దానికి వృద్ధ జంగము "ఓయీ! ఆలోచించుకొని చెప్పు. తొమ్మిది నెలలు మోసి కన్న తల్లి ఉన్నది. ఆమె యిష్టపడదు. తన్ను చంపి వండి శివ యోగికి అన్నము పెట్టుదుననగా లోకంలో ఏ కుఱ్ఱ వాడంగీకరిస్తాడు? పూర్వం నీవిట్టి మహా వ్రతం చేసిన వాడవు కావు'' అన్నాడు.

(vii) **సిరియాళుని శివ భక్తి:** చిఱు తొండ నంబి, తన భార్యయు, కుమారుడు తన యాజ్ఞ దాటరని తెలిసికొని యింటికి వచ్చి వారితో చెప్పి చందనికతో చెప్పి మరలపోయి ఆ శివ యోగిని రమ్మని చెప్పెను.

ఈ విషయాన్ని చిఱు తొండ నంబి తన భార్యతో చెప్పటానికి ఇంటికి రాగా, ఆ ముసలి వేషంలో ఉన్న శివుడు, సిరియాళుడు చదువుకొను పాఠశాలకు మరియొక వేషంలో వెళ్ళాడు. సిరియాలుని పిలిచాడు. "ఓరీ నాయనా! నీవే నా చిఱు తొండ నంబి కొడుకువు? వాడొక పాపాత్ముడు. వాడు నిన్ను చంపి యొక శివ యోగి కన్నము పెట్టునట! నా మాట విని నీవు ఎక్కడికైనా పారిపొమ్ము'' అనగా సిరియాళుడు "హర! హర!'' అని చెవులు మూసికొని "అంత కంటె కావలసినది యేమయ్యా! ఈ మలభూయిష్టమైన దేహం దేనికి? శివ ప్రీతి కంటే కావల్సిందేమి?'' అన్నాడు.

శివుడేమి చేయును? వీడు తండ్రి కంటే మూడాకులెక్కువ చదివిన వాడని వెడలిపోవుచు, ఈ కుఱ్ఱవానికి

మూర్ఛ తెచ్చెను. సిరియాళుడు మూర్ఛ పోయెను. ఆ చదువు చెప్పు పంతులు వానికి విభూతి పెట్టెను. అతడు లేచి కూర్చున్నాడు.

అక్కడ చిఱు తొండడు ముసలి వానిని వీపు మీద ఎక్కించుకొన్నాడు. ముసలవ్వ బూది బొక్కణము మొదలైనవి తీసికొని వస్తున్నది. శివ స్మరణ చేస్తూ వారు ముప్వురు చిఱు తొండ నంబి యింటికి వచ్చారు. ముసలవ్వకు, తాతకు తలంట్లు పోశారు. అప్పుడు సిరియాళుని మేనమామలు బోలెడన్ని తినుబండారాలు సిరియాళునకు పంపించుట జరిగింది. అవి పొరుగూరి నుంచి వచ్చెను. కంచిలోనిన్నాళ్ళు వాన కురియటం చేత అక్కడ తినుబండారాలు కొరతగా ఉన్నాయని మేనమామలు పంపించారు.

ఇది ఇట్లుండగా, పదునారేండ్ల పచ్చి బాలెంతరాలొకర్తుక తన పసిపిల్లవానిని తీసికొని వచ్చి తీరువెంగనాంచిని పాలు పోయింపుమని అడిగింది. ఇట్లాకల్పిస్తే తిరువెంగనాంచికి కొడుకు మీద ఎక్కువ ప్రేమ కలుగుతుందని పార్వతీ దేవి ఎత్తిన ఎత్తు. ఏమియూ లేనట్లే తిరువెంగనాంచి ఆమెకు పాలు పోసి పంపింది. అప్పుడు లోకములకు తల్లియైన పార్వతీ దేవికి పాలు చేపు వచ్చెను. ఆమె చేతులతో ఒత్తుకొనెను.

(viii) **తిరువెంగ నాంచి పాతివ్రత్యం:** పార్వతి ఇక్కడ ముసలి అవ్వగా ఉంది అక్కడ పదునారెండ్ల పచ్చి బాలెంతగా వచ్చింది. ఆ బాలెంతరాలు తిరువెంగ నాంచితో అన్నది కదా! "అది ఏమమ్మా! ఊరందరు చెప్పికొనుచున్నారు. మీరెవరరో శివయోగికి మీ బిడ్డ సిరియాళుని చంపి వండి పెట్టబోవుచున్నారట కదా! ఈ శివ యోగులు వట్టి దొంగలు

"ఆవగింజంత భూతి మైనలదుకొనిన

వెలఁది! గుమ్మడి కాయంత వెఱ్ఱి పుట్టు" అని ఆ దొంగ పార్వతి చెప్పగా తిరువెంగ నాంచి, "అది యేమమ్మా! శివునకు శివయోగికి భేదమున్నదా?" అంది. వారు పాఠశాల నుండి సిరియాళుని తీసికొని వచ్చారు. వానికి తలంటిరి. వాని కన్నము పెట్టిరి. వాని నలకంరించిరి. కొడుకుతో ఈ సంగతి చెప్పారు వాడు తనకు "సంసార భ్రమ మించు కేనియు లేదు" అన్నాడు.

(ix) **కొడుకు మాంసంతో వంటకాలు:** తిరువెంగ నాంచి కొడుకును తొడల మీద పండుకొన బెట్టుకున్నది. చందనిక తలను చేతితో పట్టుకొంది. సిరియాళుడు చిరునవ్వుతో చేతులు జోడించాడు. చిఱు తొండ నంబి కత్తితో మెడ కోశాడు. అతడు 'నమశ్శివాయ' మంత్రాన్ని జపిస్తున్నాడు. సిరియాళుని మొగంలో చిరునవ్వు తప్ప మరేమియు లేదు. కొడుకును చూచి చిఱు తొండ నంబి పందెంలో గెలిచినట్లు, ప్రాత యప్పు తీరినట్లు సంతోషించాడు.

అతని మాంసాన్ని మిరియము, ఉల్లి, పసుపు, మెంతి, ఇంగువ, జీలకఱ్ఱ, నేయి, పెరుగు, పంచదార - మొదలైనవానితో కలిపి నంజుళ్ల పాయసము, చారు, ఒడియాలు రకరకాలుగా వండారు. నిగనిగలాడు తోమిన పళ్ళాలలో దొంతులుగా పేర్చారు. శివ యోగిని పిలిచారు. పూజ చేశారు. చివురును ముదురు గాని, నిడుపు వెడల్పు గల అరటి ఆకు వెనుక నీనెతీసి పరచి, నీళ్ళు చల్లి వడ్డించి వానిని నారగింపుమన్నారు.

(x) **తలలోని మాంసము కావాలని శివయోగి కోరుట:** ఆ ముసలి జంగము వడ్డించిన వానిని పరిశీలించి, "ఇందులో తలకాయలోని మాంసమేదయ్యా! దాచుకొన్నావా? నా వ్రతం భంగమైంది" అన్నాడు. చిఱు తొండ నంబి తిరు వెంగ నాంచి వంక చూచాడు. అది చూచిన చందనిక "నాకీ దొంగ జోగుల ఎత్తులు తెలియును. ఆ మాంసము వేరే ఉంచితిని" అని దానిని తెచ్చి వడ్డించింది. అపుడు ముసలి జంగముడేమి చేయును? ఇట్లన్నాడు "అది సరే! నీవు నా పంక్తిని గూర్చిండి భోజనం చేయాలి, మరియు నీ కొడుకు నా పక్కన కూర్చుండాలి. మగ బిడ్డలేని నిర్భాగ్యునింట నేను భోజనం చేయను?" "అయ్యా! నాకొకకొడుకున్నాడు. వాడెచటికి వెళ్ళెనో తెలియదు. ఇంతలో వంటకము చల్లారిపోతుంది"

అన్నాడు. అప్పుడు శివయోగి "సరే పిలువుము వాడు రానిచో తిందము" అనెను.

అప్పుడు తిరువెంగ నాంచి - అన్ని దిక్కులకు తిరిగ 'ఓరి! నా వన్నెవడుగా!, హరి సరియాళా!, ఓరి నాకుట్టా!, ఓరి నాజియ్యా!" అని పలు విధములుగా కొడుకును పిలిచెను. అట్లు పది దిక్కుల యందామె పిలవగా సిరియాళుడు వచ్చాడు. అతని అవయవాలు ఇంగువ కొత్తి మేర, మిరయము, జీలకఱ్ఱ, పెరుగు వాసనలు వేస్తున్నాయి. అంతట ముసలి జోగి శివుడయ్యాడు మెడలో పాము, తలమీద చంద్రుడు, నొసట కన్ను.

(xi) **చిఱు తొండనికి శాప విమోచనము:** అందఱు పరమేశ్వరుని స్తుతించారు. శివుడిట్లా అన్నాడు. 'ఓయీ! నీవు తుంబురుడవు. సిరియాలుడు కుమారస్వామి. తిరువెంగ నాంచి అప్సరః స్త్రీ. మీరు కైలాసానికి రండు. పూర్వం వలె నన్ను సేవింతురు గాని" అనగా చిఱు తొండ నంబి "స్వామి! మేము వైశ్యులం. వేయి గోత్రముల వారమున్నాం వారిని వదలి పెట్టి వచ్చుటకు మనసాడదు. ఈ యేడు వాడల వైశ్యులను తీసుకొని పోదువా కైలాసానికి తీసుకొని పొమ్ము లేదా నీవు నీ కైలాసానికి పొమ్ము. మేము పూర్వం వలెనే సేవిస్తాము" అంత పరమేశ్వరుడు దయతో కంచి యేడు వాడలలోని వేయి గోత్రముల వైశ్యులందరిని కైలాసానికి తీసికొనిపోయాడు.

ఈ చిఱు తొండ నంబి కావేరీ వల్లభులు. ఉభయ ద్రావిడుడట. కిష్కింధాచల వాసులు, అయోధ్యా నివాసులైన సర్వ వైశ్య కులమ్ముల వారికి కుంటస్థుడు. ఈ అవచి తిప్పయ్యకు చిఱు తొండ నంబి మూల పురుషుడు. ఈ తిప్పయ్యను త్రిపురారి అని కూడా అంటారు. ఈ తిప్పయ్య సెట్టి కొండవీటి నగరాధిపతులైన రెడ్డి రాజులలో ఒకడైన కొమర గిరి రెడ్డికి సుగంధ ద్రవ్య భాండాగారాధిపతి.

(xii) **శ్రీనాథుని అసదృశ సృష్టి:** ఈ హర విలాసంలోని తిక్కన ఆశ్వాసాల్లోని కథలు అన్నియు ఒక ఎత్తు. ఈ చిఱు తొండ నంబి కథ యొక ఎత్తు. ఈ కథలో మరి ఇంకొక మహాశ్చర్యమున్నది. అది వేద వేదాంతాలలోని పరమ రహస్యం. మనుష్యులున్నారు. కొందరు వట్టిమానవమాత్రులు. కొందరు దేవతోపాసకులు. కొందరు మహా యోగులు.

వేదములలో చావునకు ఉత్క్రాంతి అని పేరు. ఉత్క్రాంతి సామాన్య మానవులకు ఉపాసకులకు సమానమే! కాని ఉపాసకులు చనిపోయిన తరువాత ఆ జీవుని ప్రయాణాన్ని గురించి వేదాల్లో ఒక విలక్షణంగా చెప్పబడింది. సామాన్య మానవుల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఉపాసకుని ప్రాణాలు జీవశక్తి భరితములై ఆ దేవతా భావనతో నిండి నాలుగు దిక్కులు యందు తిరుగుతుంటాయి. సిరియాళుని ప్రాణాలు అట్లా తిరుగుతున్నాయి. శివుని యాజ్ఞ చేత తిఱువెంగ నాంచి పిలవగా నాల్గు దిక్కుల నుండి ఆ ప్రాణాలు మరల వచ్చినవి. ఇది వేదాల్లోని ఒక మహా రహస్యం. శ్రీనాథుడు ఆ విషయాన్ని ఇందులో వ్రాశాడు. అతని రచన ఒక ఎత్తు. ఈ కథలో ఇట్లా ఇమిడించటం ఒక ఎత్తు. ఇట్లా వేదాలలోని పరమ రహస్యాలు ధ్వనించేట్లు చేసిన రచన పరమోత్తమమైన రచన అనటంలో సందేహం లేదు. అట్లా చేసిన వాడే మహాకవి.

**4.3.2 గౌరీ కళ్యాణం:-** రెండవ విలాసంగా శ్రీనాథుడు గౌరి యొక్క పెండ్లిని తీసికొన్నాడు.

తారకాసురుడు బ్రహ్మ వల్ల పొందిన వరాల చేత దుర్జనుడై స్వర్గం మీదికి దాడి వెళ్ళి స్వర్గానికి ఉపద్రవాన్ని కలిగించాడు. దేవతలందరూ బ్రహ్మ వద్దకు వెళ్ళి "స్వామి! ఈ తారకుని వల్ల మేముపడరాని పాట్లు పడుతున్నాం" అని మొత్తుకున్నారు. దానికి బ్రహ్మ "విష వృక్షాన్నైనా మనమే పెంచి మనమే నరుకుతామా? వీన్ని చంపేవాడు కుమార స్వామి. ఆయన పుట్టవలెను. దక్ష ప్రజాపతియైన దాక్షాయని శివుని భార్య. తండ్రి మీద కోపంతో ఆమె తానే తగులబడిపోయింది. ఆమె హిమవత్పర్వతమునకు కూతురై పుడుతుంది. శివుడు తపస్సు చేస్తున్నాడు. వారిద్దరకును మరల పెండ్లి కావాలి. వారికి కుమార స్వామి పుట్టగలడు. మీరు పోయి ఆ పెండ్లి జరిగేటట్లు చూడండి" అని చెప్పి వారిని పంపించాడు.

(i) **శివుని తపస్సు - పార్వతి పరిచర్య:-** ఆ పార్వతి హిమవంతునకు కూతురుగా జన్మించి పెరుగుతున్నది. ఒకనాడు నారదుడు వచ్చి ఈమెకు శివుడు భర్త అవుతాడని చెప్పిపోయాడు.

శివుడు సర్వ సంగ పరిత్యాగుడై ఈ మంచు కొండలో ఒక చోట తపస్సు చేసుకొంటున్నాడు. ప్రమథులందరు అక్కడే ఉన్నారు. నందీశ్వరుడు అక్కడే కాపుగా నిలిచి ఉన్నాడు. ఆయన తపస్సు చేసేది తన కొండలో ఒక చోట అంటే శివుడు తనకతిథి. హిమవంతుడు శివుని వద్దకు పోయి అర్చన చేసి తన కూతురైన పార్వతిని శివునకు పరిచర్యకై నియమించివచ్చాడు. ఇదియొక ఎత్తు. ఎప్పుడో శివునకు ఆ పిల్లమీద అనురాగము పుట్టకపోవునా? నారదుడు చెప్పినాడు కదాయన్న ఊహ.

ఇక్కడ ఇట్లుండగా దేవతలు తమ ప్రయత్నాలు తాము చేయవలెను గదా! ఇంద్రుడు ఆస్థానంలో కూర్చున్నాడు. స్త్రీ, పురుషులకు ప్రేమ కలిగించేవాడు మన్మథుడు. ఆ మన్మథుడు ఇంద్రుని బంటు. అతడు మన్మథునకు వార్త పంపాడు. ఆ మన్మథుడు వచ్చి దేవేంద్రునితో "నేనది చేయుదును, ఇది చేయుదును అని ప్రగల్భాలు పలికాడు. ఇంద్రుడు శివపార్వతులకు పెండ్లి కావలయును. వారికి కుమారుడు పుట్టవలెను." అని కథ చెప్పి, "జాగ్రత్త, నీవు వసంత కాలాన్ని వెంట బెట్టుకొని పొమ్ము" అన్నాడు.

మన్మథుడు వసంతుడు తోడు రాగా శివుడు తపస్సు చేసే చోటికి వెళ్ళాడు. వీరిద్దరు వెళ్ళినంతనే ఆ వనమంతా శృంగారానికి స్థానము కాబోవుచున్నట్లుండెను.

(ii) **మన్మథ దాహము:-** శివునకు ప్రక్కగా తియ్యని విల్లు మోపెట్టి మన్మథుడు నిలుచున్నాడు. పార్వతీదేవి స్వామికి పరిచర్య చేస్తున్నది. ఆమె స్వామికి పూల దండ అర్పించింది. మన్మథుడు బాణాన్ని సంధించాడు. శివుని చూపు పార్వతి మొగమున నిలిచింది. ఆమె సిగ్గు పొందింది. శివుని మనసులో ఒక వికారం కలిగింది. శివునకు తన మనస్సు చెదరటానికి కారణం తెలియలేదు. అటు ఇటు చూచాడు. మన్మథుడు కన్పించాడు. శివుని మూడవ కన్ను నుండి ఒక మహాగ్ని ఉద్భవించి మన్మథుడు భస్మీ భూతుడైనాడు. శివుడంతర్ధానం పొందాడు. చెలికాడైన వసంతుడు ఏడ్చాడు. పార్వతి బిక్క మొగం వేసింది. ఆమెను ఆమె తండ్రి హిమవంతుడు వచ్చి తీసికొనిపోయాడు. అప్పుడు మన్మథుని భార్య అయిన రతీదేవి మగని బూడిదను చూసి తెగ ఏడ్చింది.

కాళిదాసు ఈ కథ సంస్కృతంలో కుమార సంభవమను పేరుతో మహాకావ్యాన్ని రచించాడు. శ్రీనాథుడు చాలా భాగం కాళిదాసు వ్రాసిన దాన్ని ఆంధ్రీకరించాడు.

అంతట రతీదేవి భర్తతో సహ అగ్ని ప్రవేశం చేయబోతుండగా ఆకాశవాణి, "వలదు వలదు! నీ మగడిట్లగుటకు కారణముంది. బ్రహ్మ దేవునకు తన కూతురైన సర్వస్వతి యందు నీ మగడైన మన్మథుడు కోరిక పుట్టించెను. ఆ బ్రహ్మ ఇతన్ని శపించాడు. ఆ కారణంగా నీ భర్త చనిపోయాడు. కొద్దిలో పార్వతి పరమేశ్వరులకు పెండ్లి అవుతుంది. అప్పుడు నీ మగడు బ్రతుకును" అని చెప్పెను. ఆ రతీదేవి ఆ మంచి రోజు కోసం ఎదురు చూస్తూ బక్కచిక్కి అట్లే బ్రతుకు గడుపుకొనుచున్నది.

ఇక్కడ పార్వతి ఇంటికి వచ్చింది. ఆమె దిగులు పడింది. తన సౌందర్యాన్ని నిందించుకొన్నది. ఈ శివుడు తన సౌందర్యానికి లొంగడు. దేనికి లొంగును అతడు తపస్సునకు లొంగును. అందుచేత పార్వతి శివుని కొరకు తపస్సు చేయటానికి నిశ్చయించుకొంది. తల్లి వారించింది. కూతురు వినలేదు. తపస్సుకు వెళ్ళింది.

(iii) **పార్వతి తపస్సు:-** ఆమె తపస్సు చేస్తుండగా శత వృద్ధులైన ఋషులు వచ్చి ఆమెకు నమస్కరిస్తారు. భవిష్యత్తులో ఆమె జగమ్ములకు తల్లి కాబోతున్నది కదా! ఆమె ఘోరమైన తపస్సు చేసింది. అన్ని ఋతువుల యందు ఎట్లెట్లు

చేయాలో అట్లు చేసింది. అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆమె తపస్సు పండింది. ఒకనాడచటికి ఒక బ్రహ్మచారి వచ్చాడు. పార్వతిని ఆశీర్వదించాడు. పార్వతి అతనికి ఆతిథ్యమిచ్చింది. ఆ బ్రహ్మచారి ఆమెను "తపస్సు సాగుచున్నదా!' అని కొంత పరామర్శ చేశాడు. నీ ఎఱ్ఱని క్రింద పెదవి మీద నవ్వు పుట్టినట్లు నీ పెంచిన పూల తీగె మొగ్గ తొడగదు కదా! అని ఒక విసరు విసిరాడు. మరియు ఇట్లన్నాడు. "నీ తండ్రి హిమవంతుడు రత్నాలకు స్థానం. నీకు లోపం లేదు. నీకీతపమెందుకు? నీవెవనినైన ప్రేమించి తపస్సు చేస్తున్నావా? అట్లయితే నేను బ్రహ్మచారిని, నా తపస్సులో నీకు సగమిస్తాను నన్ను పెండ్లి యాడుమని" కోరాడు.

(iv) **పార్వతితో బ్రహ్మచారి పరాచికము:-** పార్వతి వద్ద ఒక చెలికత్తె ఉంది. పార్వతి ఆ చెలికత్తె చేత ఈమె శివుని కొరకు తపస్సు చేస్తున్నదని చెప్పించింది. అప్పుడు బ్రహ్మచారి నవ్వి శివుని నిందింప మొదలుపెట్టాడు. పెండ్లి నాడు శివుని చేయి పట్టుకుంటే చేతియందున్న పాము బుస్సు మంటుంది. అతడు తోలును ధరిస్తాడు. బూడిద రాసుకుంటాడు. శ్మశాసనంలో ఉంటాడు. అతడు నింద్యుడు. నీవును నింద్యురాలవగుదువు. అతనికి తల్లి దండ్రులు లేరు. మొగాన మూడవ కన్ను. ఏమి అందగాడు! అందరిని చంపును. ఎవరినో చంపుటకు కోఱ్ఱను పాతగా అది యజ్ఞ స్తంభమగునా?"

అంత పార్వతికి కోపం వచ్చి, తన చెలికత్తెతో వానిని మెడ పెట్టి గెంటండనును. అప్పుడు శివుడు తన నిజ రూపాన్ని చూపించాడు. శివుడు పార్వతిని బతిమాలాడు, ఆమెను గ్రహింపబోయెను. పార్వతి తాను తండ్రి అదుపు ఆజ్ఞలలోని దానని చెప్పి తన కొరకు తన తండ్రిని అడగవలయునని శివునితో విన్నవించింది. ఆమె తండ్రి ఇంటికి వెడలిపోయింది.

ఇంక ఇక్కడ పెండ్లి వార్తలు పంపించాలి. మీ అమ్మాయిని మా అబ్బాయికిమ్మని శివుని పక్షాన పోయి అడిగెడు వాడు కావాలి.

(v) **పెండ్లి పెద్దలు:-** చుట్టాలు లేని శివుడెవరిని పంపిస్తాడు? తండ్రియా? పిన తండ్రియా? పిన తండ్రి కొడుకులా? మేనమామలా? ఎవ్వరును లేని ఏకాకి కదా శివుడు. కాని పరమేశ్వరుడు కదా! అందుచేత అరుంధతిని, సప్తర్షులను పిలిపించాడు. వారిని గౌరవించాడు. వారు భగవంతుని స్తోత్రములు చేసి "స్వామి! మా వల్ల ఏమి పని ఉన్నదని" అడిగారు. స్వామి "తారకాసురుడు మొదలుగా గల ఈ కథ అంతా చెప్పి నాకు పిల్లను మీరు కుదిర్చి పెట్టవలయు"నన్నాడు. పాపము శివుడు తన సిగ్గు వదలి పెట్టి చెప్పవలసి వచ్చింది.

వారు స్వామి ఆజ్ఞను శిరసావహించి హిమవంతుని వద్దకు వెళ్ళారు. పెండ్లి మాటలు మాట్లాడారు. పార్వతిని పిలిపించి చెప్పారు. అరుంధతి పార్వతిదేవిని తన తొడల మీద కూర్చుండ బెట్టుకుంది. పెండ్లి నిశ్చయమైంది. లగ్నం పెట్టారు. మూడు దినాలు పోయిన తర్వాత లగ్నం.

హిమవంతునికి ఒక రాజధాని కలదు. ఆ నగరం పేరు 'ఓషధీప్రస్థ పురము', ఆ ఊరంతా అలంకరింపబడింది. ముహూర్తం మైత్రి ముహూర్తం. ఉత్తర ఫల్గునీ నక్షత్రం. యోగం చంద్ర యోగం. పార్వతిని పెండ్లి కూతుర్ని చేశారు.

ఇక్కడిట్లుండగా అక్కడ శివుని యొద్ద వేల కొలది ప్రమథులు ఉన్నారు. భృంగిరిటుడు, నికుంభధరుడు, భద్రకాళుడు, ముప్పది మూడు కోట్ల దేవతలు, భూత భేతాళ శాకినీ ఢాకినీ గ్రహాలు, సప్త మాతృకలు.

(vi) **పార్వతి పరమేశ్వర కళ్యాణం:-** శివునిని పెండ్లి కొడుకును చేశారు. ఆయన పెండ్లికి బ్రహ్మాండంగా కదలి వచ్చారు. పెండ్లి అయింది తలంబ్రాలు పోసుకున్నారు. అగ్నిహోత్రానికి ప్రదక్షిణలు చేశారు. బ్రహ్మకు నమస్కరించారు. రంభ, ఊర్వశి మొదలగువారు నాట్యం చేశారు. శివుడు మన్మథుని పూర్వము నందు కంటె గొప్ప వానిని చేశాడు. రతీదేవి హృదయ దుఃఖాన్ని తీర్చివేశాడు. తర్వాత పార్వతీదేవితో విహరిస్తున్నాడు.

(vii) **ఇల్లరికపుటల్లుడు:-** చివరకు శివుడు మామయైన హిమవంతునింట ఇల్లరికమున్నట్లయ్యెను. అక్కడి నుండి కదలడు. మొదటి భార్య చనిపోయి 'అబ్బో! ఎన్ని ఏండ్లయిందో! మరల భార్య దొరికింది. శివుని విలాసమే విలాసం''.

పాములను తీసివేశాడు. బంగారు జందెములను వేసికొన్నాడు. తోలు పారవేసినాడు. పట్టు పచ్చడం కట్టాడు. బూడిద మాని వేశాడు. కస్తూరియు, మంచి గంధాన్ని పూసుకొన్నాడు. బొమికల దండ పారవేశాడు. ముత్యాల హారాన్ని ధరించాడు. ఇప్పుడు తన చీకిరిబాకిరి జుట్టు దువ్వి నూనె రాచి, ముడివైచి పైన చంద్రుని సవరించాడు. ఓషధీ ప్రస్థ పురంలో షికార్లు పోతున్నాడు. ఇట్లా కాలం గడుస్తుండగా శివుని ప్రమథ గణం ఉన్నారు కదా! వారికెదురు లేదు. వారేమి చేయవలయును? వారు వేలకు వేలున్నారు. ఆ ఓషధ ప్రస్థ పురంలో అనేక దేవతా స్త్రీలున్నారు. రంభాద్యప్సర స్త్రీలు ఉన్నారు. వారు ఊరిలో పడి ఆగడాలు చేయటం మొదలు పెట్టారు. ఆకతాయిలైనారు. వీరితో ఓషధప్రస్థ పురమంతా అట్లుడికినట్లుడికి పోతున్నది. సృష్టిలో వారికి ఎదురులేదు.

ఈ విషయం హిమవంతునకు తెలిసింది. తానను, తన భార్యయైన మేనకయు, కూతురిని పిలిచి యిట్లన్నారు "ఏవమ్మా! నీమగడిట్లు చేస్తున్నాడు. అతని పరివారమంతా భూతములు, ప్రేతములు, పిశాచములును, వారు పట్టణమంతా బగ్గంపాడుగా చేస్తున్నారు. నీ మగడు వారినదుపులో పెట్టడాయెను. అయినా పునుకకంచము పూని బిచ్చ మెత్తు నీ మగనికి ఈ భోగములు నచ్చునా? తల మీద గంగలో కొంగలు గొంగొంగరను చుండును. పునుకలు బొణుబొణుగురనును. ఆబోతు చిఱ్ఱుబుఱ్ఱులాడును. పాములు బుస్సలు కొట్టును!

(vii) **అల్లుడలిగి పోవును:-** ఇట్లు తండ్రి కూతురుతో చెప్పటం శివునకు తెలిసింది. తన ప్రమథులు చేయు దుండగాలు తెలిసికొన్నాడు. అత్తవారింట్లో ఇన్ని రోజులు ఉండకూడదనుకున్నాడు.

**4.3.3 దారుకా వన విహారం:-** దారుకా వనమని ఒక అడవి ఉంది. ఆయన అత్తమామలతో చెప్పకుండ నంది నెక్కి తన ప్రమథులను తీసికొని ఆకాస మార్గంలో దారుకావనానికి వెళ్ళిపోయాడు. అదియు హిమవత్పర్వతములో ఒక భాగమే.

ఆ కొండలో దక్షిణ దిక్కు నందు దాక్షాయణీ వనమని యొక వనమున్నది. అక్కడ మహర్షులు తపస్సు చేస్తుంటారు. ఆ ఋషుల భార్యలుంటారు. వారందరు సౌందర్యవంతులు. అచ్చటి భోగాలు చెప్పటానికి వీలు లేదు. అచట మునుల కూతుంద్రుకలరు. వారెన్నియో భాగాలు అనుభవిస్తారు. అన్నిటికన్నా ఆ వనంలో ఒక విశేషమున్నది. అచటి మునుల తపస్సులు భంగపరచటానికి దేవేంద్రుడు అనేకములైన అప్సరః స్త్రీలను పంపించాడు. వారు పదినాలుగు జాతుల వారు. వారి యిండ్లన్నియు భోగ స్థానాలు. ఆ యిండ్లలో పూర్వము నందు జరిగిన శృంగార కథలన్నియు బొమ్మలు చెక్కి ఉంటాయి.

(i) **శివుని స్వైర విహారం:-** ఈ శివుడు తన నందిని, ప్రమథులను, సప్త మాతృకలను వదిలి పెట్టి తాను ఎముకల హారాన్ని ధరించి భిక్షాటనమాచరింపజొచ్చెను. రంభ మొదలైన దేవతా స్త్రీలు స్వామికి భిక్ష పెడ్తారు. ఎన్నో పిండి వంటలతో భోజనాలు పెడ్తారు. రంభ పెట్టింది ఊర్వశి పెట్టదు. ఊర్వశి పెట్టింది తిలోత్తమ పెట్టదు. విశ్వాచి, చిత్రరేఖ మొదలైన అప్సరః స్త్రీలు వంతులు పోయి స్వామికి క్రొత్త క్రొత్త పిండి వంటలు చేసి పెడ్తారు.

ఇవి చాలక శివుడు మునుల ఇండ్లకు పోయి 'భవతి భిక్షాం దేహి'' అని అడుగుతాడు. వారితో సరసాలాడుతాడు. వారి అందరి పాతివ్రత్యాలను చెఱచాడు. ఆ ఋషులకు తెలియకుండా వారు సమిధలకు పోయినప్పుడు, వారు తపస్సులోనున్నప్పుడు తాను పోయి ఆ మునుల భార్యలతో దొంగగా రమిస్తున్నాడు.

తాను మరల నిజంగా భిక్షుకుడైనట్లు నడి బజారులో నిలుచుండి భిక్ష అడుగుతాడు.

కథ యిట్లు ఘోరంగా ఉంది. 'కంచెయే చేను మేసిన కలదె దిక్కు' పాపమా ఋషులేమి చేస్తారు? గుసగుసపోతారు. దుఃఖాన్ని లోన లోన అణచుకుంటారు.

ఒకనాడందఱు కలిసి శివుని చుట్టుముట్టారు. పరమేశ్వరుడు ఏమి చేసి ఉంటాడు. జగన్మిథ్యాత్వముపదేశించి ఉంటాడు. అంతయు శివమయమని చెప్పి ఉంటాడు. వారి మోహాలు, వారి మాయ నివారించి ఉంటాడు. ఇదంతా తన విలాసం వట్టి మిథ్యం. వారికి జ్ఞానోదయం కలిగించి ఉంటాడు. ఇది రెండవ విలాసం. ఈ రెండవ విలాసం మూడు నాలుగైదాశ్వాసాల్లో ఉంది.

శ్రీనాథుడు ఈ హర విలాసంలోను, భీమ ఖండంలోను శివుని యొక్క ఈ శృంగారాన్ని వర్ణించాడు.

**4.3.4 సముద్ర మథన వృత్తాంతం:-** హర విలాసంలోని ఆరవ ఆశ్వాస మందలి కథ.

**(i) శివుని కంఠమున నీలిమ:-** పార్వతి తెల్లని శరీరం కల శివుని మెడ నల్లగా ఉందనీ, అది అందంగా ఉందనీ అట్లా ఎందుకుందనీ అడుగుతుంది. దానికి ఆయన ఈ విధంగా సమాధానం చెప్తాడు.

పూర్వం ఇంద్రుడు జంభుడన్న రాక్షసుని సంహరించి తన ఏనుగును ఎక్కి గంధర్వులు పొగుడుతుంటే అమరావతికి తిరిగి వచ్చాడు. అప్పుడు దుర్వాస మహర్షి ప్రమ్లోచ అన్న అప్సరస తనకు కానుకగా ఇస్తే ఒక పారిజాతపు పూల దండను ఇంద్రునకు కానుకగా ఇచ్చాడు. ఇంద్రుడు గర్వం చేత దానిని తన ఏనుగైన ఐరావతము యొక్క కుంభ స్థలమున పడవైచెను. ఆ ఏనుగు దాన్ని తుండంతో లాగికొని చీల్చి కాళ్ళ క్రింద వేసి మట్టగించింది. దుర్వాసునకు కోపం వచ్చింది. ఏమిరా! నీకింత మదమా! నన్ను తిరస్కరించావు. నీ సంపద అంతా సముద్రంలో పడుగాక! అని శపించాడు.

అంత కొన్నాళ్ళకు అప్సరసలు, పారిజాత వృక్షము, ఐరావతము, చింతామణి, కామధేనువు, అమృత కుంభము - అన్నియు సముద్రంలో పడిపోయాయి. స్వర్గము దరిద్రపు దేశమయింది. తిన తిండి లేదు. కట్ట గుడ్డ లేదు.

ఈ కథను శివుడు పార్వతితో చెప్తున్నాడు. కొంత సేపు 'తాను' అని చెప్పును మరికొంత సేపు 'శివుడ'ని చెప్పును. ఇచట ఒక రహస్యమున్నది. తరువాత చెప్పబడును.

**(ii) సముద్ర మథనము:-** దేవతలు బ్రహ్మతో కలసి శివుని యొద్దకు పోయి మొరపెట్టుకున్నారు. శివుడు వారికి సముద్రాన్ని మథింపవలయునని చెప్తాడు. మంథర పర్వతము కవ్వము, వాసుకి త్రాడు, మొదటి తాబేలు మట్టము అని చెప్పగా విష్ణుమూర్తి మొదలైన అందరు బయలుదేరారు. విష్ణువు మందరాన్ని పెల్లగించి తెచ్చాడు. దేవాసురులు విఘ్నేశ్వరుని పూజించి, సముద్రాన్ని చిలుక నారంభించారు. అంత సముద్రము నుండి గరళం పుట్టింది. మరల దేవతలు శివుని స్తోత్రం చేశారు. శివుడు దాన్ని త్రాగాడు.

తరువగా, తరువగా మరల అన్నీ పుట్టుకొని వచ్చాయి. పూర్వం పోయినవన్నీ మరల పుట్టాయి. చివరకు అమృతం పుట్టింది. రాక్షసులా అమృతాన్ని అపహరించి పారిపోయారు. అప్పుడు విష్ణువు మోహినీ రూపంలో వచ్చి రాక్షసులను మోహ పెట్టి తాను దేవతలకు, రాక్షసులకు సమానంగా అమృతం పంచి పెట్టునట్లు నటించి, దేవతలకు అమృతం పోసి, రాక్షసులకు అమృతం కాని దానిని అమృతముగా పోసి, సూర్య చంద్రుల వెనుక దాగి యున్న రాహుకేతువులను సూర్య చంద్రులు కనుగిలుపుట చేత గ్రహించి చక్రాయుధంతో వారి శిరస్సులు ఖండించాడు.

సముద్ర మథన కథ అన్ని పురాణాల్లో ఉన్నదియే! అట్లు శివునకు హాలాహలం త్రాగటం చేత కంఠము నందు నల్లని మచ్చ ఏర్పడింది. ఈ కథను శివుడు పార్వతితో చెప్తాడు. ఇందులో ఒక్క విశేషముంది.

ఈ పారిజాతము, కామధేనువు, చింతామణి, దేవతల ఏనుగు, గుఱ్ఱము - పూర్వమున్నవే. దుర్వాసుడు శపించాడు. అవి సముద్రంలో మునిగిపోయినాయి. అప్పుడు సముద్ర మథనం జరిగింది. మరల హాలాహలం పుట్టింది. శివుడు మరల దాన్ని త్రాగాడు. సముద్ర మథనమెప్పుడు జరిగింది? ఈ ప్రశ్నకి సమాధానం ప్రతి కల్పము నందు జరుగుచునే ఉన్నది. సృష్టి లక్షణమే యిది. ఈ జగత్తు యొక్క రహస్యమేయిది. ఈ సంసారము అనాది. దీనికి మొదలు లేదు. చివర లేదు. జరిగిందే జరుగుతుంటుంది. నాశమైపోయిందే మరల పుట్టుంటుంది. మరల అదే పద్ధతిగా పుట్టుంటుంది. అదే పద్ధతిగా జరుగుతుంటుంది.

4.3.5 **అర్జునుని తపస్సు:-** విలాసము అంటే పరమేశ్వరుడు ఒక భక్తుని రక్షించుట. ఆ రక్షించటంలో అలౌకికమైన తన దయను చూపించటం. ఇక్కడ అర్జునుడు తపస్సు చేయటం, శివుడు అతనికి పాశుపతాన్నివ్వటం కనిపిస్తుంది. ఈ ఏడవ ఆశ్వాసంలోని అర్జుని కథకు తక్కిన శివకథకు సంబంధం లేదు.

అర్జునుడింద్రకీలాద్రి యందు తపస్సు చేస్తున్నాడు. అతడు గాండివమును, యోగ దండాన్ని కలిపి పట్టుకొంటాడు. అస్త్రాలనుగా, దర్భాంకురాలను కలిపి పట్టుకొంటాడు. అది యొక విరుద్ధపు తపము.

(i) **మూమాభిల్లునితో అర్జుని యుద్ధము:-** ఒక ముసలి బ్రాహ్మణుడు వచ్చి "ఈ తపమేమిటయ్యా! ఎగుడు దిగుడుగా ఉంది" అంటే అర్జునుడు "ఇంద్రుని గూర్చి తపస్సు చేస్తున్నా"నన్నాడు. ఆ బ్రాహ్మణుడు "ఎక్కడైనా బ్రహ్మ విష్ణు మహేశ్వరులను గూర్చి తపస్సు చేస్తారు కాని ఇంద్రుని గూర్చి తపమేమి?" అని వెక్కిరించాడు. అర్జునుడు వినలేదు. ఆ బ్రాహ్మణుడు ఇంద్రుడే. అతడు తన నిజ రూపాన్ని చూపి 'శివుని గూర్చి తపస్సు చేయమని చెప్పి' వెళ్ళాడు. అర్జునుడు శివుని గూర్చి తపస్సు చేయ మొదలు పెట్టాడు. కొన్నాళ్ళకు శివుడు వచ్చాడు. ఆ శివుడు బోయవాని వలె వచ్చాడు. శివుడు బోయవాడుగా మారుట బహు సులభం కదా! పార్వతి బోయెత! వేదాలు కుక్కలు, శివుని యొక్క ప్రేరణ చేత సూకరుడన్న రాక్షసుడు పందివోలె వచ్చాడు. దాన్ని శివుడటు వైపు నుండి కొట్టాడు. అర్జునుడిటు వైపు నుండి కొట్టాడు. ఇద్దరి బాణాలు తగిలి అది చచ్చింది. శివుడు అర్జునుని నిందించాడు. ఇద్దరు యుద్ధం చేశారు. అర్జునుని అమ్ముల పొదిలో బాణాలు అయిపోయినాయి. అతడు గాండీవంతో శివుని తలమీద మోదాడు.

మరి కొంత సేపటికి ఇద్దరును మల్ల యుద్ధం చేసారు. ఈ మల్ల యుద్ధంలో ఉపతాయి, తోరహత్తము, సీసము మొదలైన పేచీలు తిక్కన గారు వ్రాసినవి శ్రీనాథుడు ఉపయోగించాడు.

(ii) **శివుడు అర్జునునికి పాశుపతమిచ్చుట:-** శివుడు ప్రత్యక్షమయ్యెను. అర్జునుడు పాశుపత అస్త్రాన్ని అడిగాడు. ఆయన ఇచ్చాడు. అంత అర్జునుడు తన తండ్రి దేవేంద్రుని వద్దకు వస్తాడు. అచ్చట నుండి శివపూజ చేయుచున్నాడు. ఇంద్రుని యొక్క రథమెక్కి మాతలి రథం తోలుచుండగా ఆకాశము నందుపోయెను. మేఘమండలము, శింశుమార చక్రము, ఒక వాయు స్కంధము, సప్తర్షులు, చంద్రుడు, ఇల్వలమను చుక్కలు, వీనినన్నింటిని మాతలి చూపించాడు. ఇక్కడ శ్రీనాథుడు భగోళములోని అనేక విషయాల్ని తెలిపాడు. ఆకాశమునందలి అనేక గ్రహాల సంపుటికి 'భగోళమని' పేరు.

(iii) **అర్జునునకు ఊర్వశి శాపము:-** తిరిగి అర్జునుడు స్వర్గలోకానికి వచ్చాడు. ఇక్కడొక విషయం జరిగింది.

ఊర్వశి అర్జునుని వలచి వచ్చింది. అర్జునుడు ఆమెను నిరాకరించాడు. "ఊర్వశి అతనిని ఒక యేడాది నపుంసకుడు కమ్మని శపించింది".

శ్రీనాథుడీ కథను కొంత చమత్కారముగా వ్రాశాడు. ఆ ఊర్వశి సామాన్యురాలు కాదు. విష్ణుమూర్తి తొడ యందు పుట్టిన స్త్రీ. అగస్త్య మహర్షియు, వశిష్ట మహర్షియు ఆమె బిడ్డలు. పురూరవశ్చక్రవర్తికి ఆమె కొన్నాళ్ళు

ప్రియురాలుగా ఉంది. దేవతాప్సరసలు పదునాలుగు జాతులని మరల చెప్పాడు. ఇందులో ఒక చమత్కార పద్యమున్నది. తెల్లవాఱు చుండెను. ఈ యప్సరః స్త్రీల యిండ్ల దగ్గర కోళ్ళు కూశాయి. అప్పుడు శృంగార రసాంతమున అప్సరః స్త్రీల కదలిక వర్ణన చమత్కారంగా ఉంది.

(iv) **అర్జునుని భక్తి శీల సంపద:-** అప్పుడు ప్రొద్దు పొడిచింది. అదియును సీస పద్యమే. కఱకఱ పొడిచింది. అదియునొక సొగసైన పద్యం.

ఈ విధంగా ఊర్వశిని తిరస్కరించి శాపాన్ని పొందిన అర్జునుడు ఇంద్రుని ఆజ్ఞచేత సముద్ర గర్భంలో ఉన్న కాలకేయాది రాక్షసులను చంపుటయు, అచ్చటి నుండి తిరిగి వస్తూ దారిలో నివాతకవచులను వధించుటయు వర్ణింపబడ్డవి. ఈ నివాతకవచులు బ్రహ్మకు కూడ సాధ్యులు కారు. అర్జునుడు వారిని పాశుపతాస్త్రంతో దహించాడు.

ఇదియొక చమత్కారం. అర్జునుడు మహా భారత .యుద్ధంలో ఎవ్వరిని చంపటానికి పాశుపతాస్త్రాన్ని ఉపయోగించలేదు. తన ప్రాణం మీదికి వచ్చినపుడు కూడా చేయలేదు. తనకు శివుడిచ్చిన ఈ పాశుపత మహాస్త్రాన్ని అర్జునుడు ఒక్కసారియే ఉపయోగించాడు. అది నివాతకవచులను సంహరించటానికి ఉపయోగించాడు. అర్జునుడు ఊర్వశిని నిరాకరించాడు. ఈ అశ్వాసం అర్జునుని మహా శీలమును, మహా భక్తిని చెప్తున్నది. శివుడు అర్జునునికిట్లు ప్రసాదించాడు. ఏ యుగము నందు ఎన్నడును ఎవ్వరికి ఈయని పాశుపతము అతనికిచ్చాడు. అతడు ఆ అస్త్రాన్ని గ్రహించటానికి యోగ్యుడు. ఆయన ఒక మహర్షి.

(v) **శ్రీనాథుని పద ప్రసిద్ధ ధారా శుద్ధి:-** చిఱు తొండని కథలోని శివ విలాస మందరికి తెలియుచునే ఉంది. ఈ అర్జునుని కథలోని శివ విలాసం గాఢంగా ఆలోచిస్తే గాని తెలియదు.

స్వామి మొదట చిఱు తొండని దయతో చూచాడు. వాడెవ్వడు? ఒక ప్రమథుడు. రెండవసారి అర్జునుని దయతో చూచాడు. ఇతడెవ్వడు? ఒక ఋషి. ఈ కావ్యమంతయు శివ రహస్య దీపనము. శ్రీనాథుని పద్య రచనను గూర్చి చెప్పనక్కర లేదు.

## 4.4 హర విలాస కవితా వైభవము - స్వతంత్ర కావ్యము:-

శ్రీనాథుని ఇతర కృతులతో దీన్ని పోల్చి చూచినపుడు ఈ హర విలాస శైలి, ఆ గ్రంథ వర్గమునకు అంతటికీవెలిగా, ప్రత్యేకంగా కన్పిస్తుంది. మిగిలిన గ్రంథములలోని సమాస భూయిష్ఠతా జన్యమైన శబ్ద గాంభీర్యము ఇందు లేదు. దానిలో ప్రదర్శింపబడ్డ శ్రీనాథుని నానాశాస్త్ర పరిజ్ఞానమును ఇందు లేదు. కాని దానికంటె సమ సంస్కృతాంధ్ర పదమయి, ప్రసన్నమయి, సుబోధమయి, హర విలాసము శ్రీనాథ పండితుడు కాక శ్రీనాథ కవి వ్రాసినట్లుండును. ఈ కావ్యమున ఏ విధంగాను రసవత్తతకు మాత్రము లోటు రాలేదు. ఇది దేనికిని అనువాదం కాకపోవుటచే స్వతంత్ర గ్రంథానికి హర విలాసమను పేరు సముచితము. హర దేవునకు సంబంధించిన నానా విలాసములు ఇందు కలవు.

ఇది పురాణమును కాదు. కావ్యమును కాదు. ఎందుకంటే కావ్యమునకుండదగు వస్త్వైక్యమిందు లేదు. కథలన్నీ శివ సంబంధము కల్గి యుండుటయే వీని యందు గల ఐక్యము. వానిని వస్త్వైకము అనలేము. ఈ కథలన్నీ ఒక దారముతో విడివిడిగా ముడి వేయబడిన పూల హారము వలె ఉన్నవి కాని అను స్యూతముగా లేవు.

1. సిరియాళుని కథ
2. గౌరీ కళ్యాణము
3. ద్వారకా వన విహారము
4. హాలాహల భక్షణము
5. కిరాతార్జునీయము ఇందలి కథలు.

1. **సిరియాళుని కథ:-** <u>సిరియాళుని కథ</u> బసవ పురాణములో ఉంది. కాని పురాణాగమములో ఇట్టిది లేదు. కాని పాత్ర నామములలో రెండింటికిని కొంత బేధము కలదు. బసవ పురాణమున గల సిరాల గర్వ భంగము కథకు అంత్యానుబంధంగా ఉన్నది. దానికి మారుగా ఇందు చిఱు తొండని పూర్వ కథనము, కథకు ఉపోద్ఘాతముగా నున్నది. కథా నాయకుడైన చిరు తొండ నంబి పూర్వ జన్మలో తుంబురుడను పేరు గల ప్రమథుడు. అతడొక కారణాన దుర్వాసుని కోపానికి పాత్రమై మానవ జన్మ ఎత్తునట్లుగా శపింపబడి, ఆ ఋషి అనుగ్రహం చేతనే పరమ మహేశ్వరుల ఇంట చిఱు తొండ నంబిగా పుట్టెనట.

చిఱు తొండ నంబి - అల్లాడనాథుడు - కంచి నంబి - పాపాణి సెట్టి - అవచి వంశమణులుగా భివంపవచ్చును. అవచి కోరికగా శివ కథా మహాత్మ్యాన్ని శైవ ప్రబంధంగా అర్థింప శివ దేవ విలాసము నిరూపించుట శ్రీనాథునకు సమ్మతమైనంది. కాబట్టి మొదటి రెండా శ్వాసాల్లో హర విలాసాంకమున చిఱు తొండ నంబి చరిత్రను ఉగ్గడించాడు. చిఱు తొండడు తిప్పయ్య వంశము వాడు. శైవాచార నిష్ఠ కలవాడు. శివానుగ్రహం పొందిన వాడు. హర విలాసములు నిరూపించటానికి నానా విధములయిన పురాణములు, శైవాగమములు సమర్థములు.

ఈ కథకు ఆయువు పట్టు అనదగిన ఘట్టము <u>బాలవధావసరము.</u> ఈ ఘట్టము కరుణ రసమయము. ఆ రస ప్లుతి శ్రీనాథుని చేతిలో అప్రయత్నంగా ఆరు పద్యాల్లో వెల్లి విరిసింది.

శివుడు చిఱు తొండ నంబి శివ భక్తిని పరీక్షించాడు. మహా వర్షపాతంలో కూడ అన్నదానం చేశాడు. మిండడు కన్పడలేదు. పాడు బడ్డ గుడిలో నంబి వెదికాడు. శివయోగి కపట యోగి. కుమారుని చంపి పెట్టుట కావలయును. ఇది శివుని భోగ కాంక్ష. భక్తుడు నంబి అంగీకరిస్తాడు. పుత్రుడు అంగీకరిస్తాడు. భక్తియు భావ పరీక్షితమయినవి. శిశువు శిరో మాంసం వడ్డించింది. జంగముడు భోజన సమయంలో కుమారున్నిరమ్మన్నాడు. పుత్రుడు సిరియాళుడు వచ్చాడు. శివయోగి రోగ పీడితుడు. నంబి వానిని సేవించాడు. చిఱు తొండ నంబి శివారాధన మొనరించేటప్పుడు పుత్ర ప్రేమ కాని, జుగుప్సనీయాంశం గాని, బాధా వ్యథలు గాని ఏమియు కన్పించలేదు. చిఱు తొండ నంబి భక్తిలో సముత్తీర్ణుడు. శివుడే కారకుడు. ఇది హర విలాసము.

బసవ పురాణంలో ఆ ఘట్టము వీర శైవతనే దాల్చింది. అంటే సోమనాథుడు దీక్షాపరుడైన వీర శైవుని వలెనే పిల్లవానిని వధింపించెను గాని, మానవ సహజమైన హృదయద్రవీకరణము కల్గింపలేదు. అతడు పట్టున వీర శైవుడే కాని కవి కాడు. అనతి విస్తృతమైన ఆ చిన్న ఘట్టమున శ్రీనాథుడు మాతృ భావ, పితృ భావ, బాల భావములను, నిశ్చల భక్తిని వైరుధ్యం లేని సామరస్యాన్ని వ్యక్తం చేశాడు.

మాయ శివుడు పిల్లవాడు చదువుకుంటున్న గురుకులానికి వెళ్ళి వానికి రానున్న ఆపద నెరిగించి, మనసు విరవటానికి ప్రయత్నించినపుడు ఆ పసివాడు ప్రత్యుత్తరంగా పలికిన వేదాంత వాక్యాలును, ఐతిహ్యములును, అతని వయసుకు మించిన పెద్ద మాటలుగా గోచరిస్తాయి. అది సందర్భ శుద్ధిలేని అతి ప్రసంగమనక తప్పదు.

ఏతాదృశ శివభక్తి పరములు, శివభక్తి విలాసములు సంస్కృత కావ్యాల్లో గోచరిస్తాయి. సాంఘికాచార ధార్మికాచారాలకు దూరంగా ఉన్న మిండ జంగముని వృత్తాంతము, శివయోగి కాంక్షా విశేషాలు, తత్కాలీన శైవాచార విశేష సూచకాలు ఇందు కానవస్తాయి. శప్తుడు పరీక్షితుడై యిష్ట సిద్దిని పొందుట ఇందు భావింప తగింది. వీర శైవ మతంలో అష్ట విధులు కలవు. వీనిని అష్టావరణము అంటారు. 1. గురుభక్తి, 2. లింగ పూజ, 3. జంగమ సేవ, 4. భూతిధారణము, 5. రుద్రాక్ష ధారణము, 6. పాదోదక గ్రహణము, 7. ప్రసాదము (ఇచట గురువునకు ఆహారము నైవేద్యం చేసి తాను గ్రహించుట), 8. పంచాక్షరి. ఈ అష్టావరణముల యొక్క నిర్వహణము చిఱు తొండ నంబి కథ

యందు చూడవచ్చు.

2. **గౌరీ కళ్యాణం:-** కాళిదాసు కుమార సంభవము ననుసరించి వ్రాసిందిది. ఈ అనుసరణము కథానుసరణమే కాదు. నాలుగింట మూడు పాళ్ళు శ్లోకములు తెలిగింపే. హర విలాసంలో గౌరీ కళ్యాణము ద్వితీయమైనను అద్వితీయము. ఇందు కాళిదాస కవితా వికాసము శోభా సుందరమై కన్పిస్తుంది.

కాళిదాస భారతి శ్రీనాథ భారతియై ఇందు సాక్షాత్కరిస్తుంది. కాని పార్వతి మాయా బ్రహ్మచారుల సంవాద ఘట్టంలో చాల వెలితి కలదు. ఒకటి రెండు పద్యాలు తప్ప రతి విలాప ఘట్టమును అంతే, ఏమైనను ఆంధ్రీకరణంలో శ్రీనాథుడు నైషధాన్ని కైవసం చేసుకొన్నట్లు కుమార సంభవాన్ని చేసికొనజాలడు. యదార్థానువాదమే అనిపించుకొన్న కొన్ని పద్యాలలో అతి సుకుమారమును, సుకరమును అయిన తెనిగింపు కావచ్చును.

3. **దారుకా వన విహారం:-** దారుకా వన విహారమనేది గౌరీ కళ్యాణ కథకు పరిపుష్ట భాగమే. వివాహనంతరం శివుడు ప్రమథ పరివార సహితుడై అత్తింట్లోనే ఇల్లరికమున్నాడు. హిమవంతుడు సమకూర్చిన రాజభోగోపచారాల వల్ల శివ భటులు బలిసి కాబోలు ఓషధీ ప్రస్థ పురంలో విశృంఖలమైన అవిధేయ ప్రవర్తన సాగించారు. హిమవంతునకు అల్లుని మీదను, అతని భృత్య వర్గము మీదను రోత పుట్టింది. పరమ శివుడు మామగారి హృదయాన్ని గ్రహించి గణాలను వెంట పెట్టుకొని పోయి దారుకా వనమున విడచి భిక్షాటనమే సాగించాడు. అచ్చట ప్రమథులే కాక శివుడు సైతము స్వేచ్ఛావర్తనుడై ఋషులకును, దేవతలకును వెగటుదనము కలిగించాడు. ఈ కథ అనుచితాలంబన రసాభాసమునకు ప్రబలమైన ఉదాహరణము.

ఈశ్వరుని దారుకా వన విహారమొక పరమార్థాన్ని తెల్పే ఘట్టం. ఇది విశృంఖల శృంగారమని తొందరపాటు విమర్శకులు మాత్రమే భావిస్తారు. ఈ సందర్భంగా వేటూరి ప్రభాకర శాస్త్రి గారు సంస్కృత కవి ఉత్ప్రేక్షా వ్లలభుని భిక్షాటన కావ్యాన్ని స్మరించారు. ఇందలి శృంగారము స్వర్గ లోకానికి సంబంధించింది. అమరావతి నగరం దీనికి రంగస్థలం. శ్రీనాథుడు చిత్రించిన భవ్య శివ శృంగారానికి రంగస్థలము పరమ సంయములకు, మహాపతివ్రతలకును ఆవాసమైన దారుకా వనము. శ్రీనాథుని దారుకా వన విహార వర్ణన యందు లౌకిక శృంగార ఛాయలు తొంగి చూస్తున్నా అది మొత్తం మీద దివ్య శృంగార విలసితంగానే భాసిస్తున్నది. పరమ పతివ్రతలగు ముని పత్నులను పరమ శివుడే ప్రలోభ పెట్టటం ధూర్త చరిత్రగా అజ్ఞులకు తోస్తుంది. తత్త్వ నిధులు దానిని పశు - పశుపతి, అభేద - సాధనలో ఉజ్జ్వల శ్రేణిగా తిలకిస్తారు. అయినప్పటికీ ఈ పరీక్ష చాల సున్నితమైనదై తీక్ష ఖడ్గ ధారవలె ప్రమాద భూయిష్టమైనదనుట నిర్వివాదం.

4. **సముద్ర మథన వృత్తాంతం:-** షష్ఠా శ్వాసము నందలి సముద్ర మథన వృత్తాంతం శివుని జగత్కళ్యాణ రీతిని చక్కగా ప్రదర్శించును. ఈ వృత్తాంతం భీమేశ్వర పురాణంలో కూడా ఉంది. దుర్వాసుని శాపంచే ఇంద్రుని సమస్తైశ్వర్యాలు సముద్రంలో పడి నశించాయి. వానిని పునరుద్ధరించటానికై వార్థి మథనానికి దేవదానవులు పూనుకున్నారు.

శ్రీనాథుడు రచించిన సముద్ర మథన వృత్తాంతం యాదృచ్ఛికంగా ఉన్నదే కాని, అంత రసవంతంగా లేదు. మహా భాగవతము అష్టమ స్కంధంలో పోతన వ్రాసిన క్షీర సాగర మథన క్రమము దీని కంటె విస్తృతమై, ప్రశస్త రస భావాలతో కూడి ఉంది. దేవాసురులు స్పర్ధచే సముద్రాన్ని తరచటానికి కారణమైనట్లు భాగవతంలో ఉంది. దుర్వాసుని శాప ప్రశంస లేకపోలేదు.

వాసుకి కవ్వపు త్రాడుగా ఉండటానికి బుజ్జగించి, ఫల భాగాన్ని ఇవ్వటానికి ఒడంబడుటయు సుద్దుగా ఉంది. అన్నింటిని మించి హరుడు హాలాహల భక్షణ చేయు ఘట్టము మిక్కిలి ఉదాత్తంగాను, కరుణమయంగాను ఉంది. ఈ

కథనానికి మూలము పార్వతీ దేవి వేసిన ప్రశ్న. "అభవా! నీ కంఠ మూలము నందు కప్పుకొనవయ్యెడి దానికి కారణమేమి" (6.5) అని ఆమె ప్రశ్నించింది. ఇందు వక్తృ వాచకం ఉత్తమ పురుషలో ప్రారంభింపబడినది. కాని కథ కొంత నడుస్తున్నప్పటికీ కథకుడు శివుడన్న మాట మరచిపోయి ఆ వక్తృ వాచకాన్ని శ్రీనాథుడు ప్రథమ పురుషలోకి మార్చాడు.

ఇందు దేవతలు సముద్ర మథనం ప్రారంభించే ముందు విఘ్నేశ్వర వర పూజ చేశారు. ఉండ్రాళ్లనూ పింజి పెడతారు. ఒక దండకం (6.51.58) చదువుతారు. ఇంత చేసినా హాలాహలం పుట్టింది. ఇక విఘ్నమే. అందుచేత భీమ ఖండంలో శ్రీనాథుడు కథ మార్చాడు. సముద్ర మథనం ప్రారంభించే ముందు సురాసురులు వినాయక పూజ మరచిపోతారు. ఉపక్రమించి శ్రమించగానే హాలాహలం పుట్టింది. దేవదానవులు పంచబంగాళమై పారిపోయారు. చివరకు శివుడు హాలాహలాన్ని మ్రింగి "మనం వినాయకుణ్ణి పూజించటం మరచిపోయాం" అందుకే ఈ విఘ్నం వచ్చింది అని చెప్పాడు. అప్పుడు సురాసురలు తాండవ విఘ్ను నాయకునికి పూజలు చేసి సముద్ర మథనం తిరిగి ప్రాంభిస్తారు. ఈ సారి అమృతం వగైరాలు లభిస్తాయి. ఇది హర విలాస కథకు భీమఖండ కథకు గల బేధం. ఇది శ్రీనాథుని స్వతంత్రత.

5. **కిరాతార్జునీయం:-** సప్తమాశ్వాసంలోని కిరాతార్జునీయ కథ సముద్ర మథన వృత్తాంతం కన్నా రసవంతంగా ఉంది. మృదుహాస్య పూరితమును, సమయోచితమును అగు సంభాషణా శైలిని నిర్వహించటంలో శ్రీనాథునికి గల నైపుణ్యం దీనిలో స్పష్టపడుతుంది.

ఇంద్రార్జునుల సంభాషణలు, కిరాతార్జునుల వివాదం, మిక్కిలి సమంజసంగా ఉంది. ఈ కథ మహాభారతంలో ఉంది. భారవి కిరాతార్జునీయ కావ్యం నందు ఇదే ఇతివృత్తముంది. అర్జునుని తపో భంగం చేయటానికై ఇంద్రుడు దేవ సుందరులను పంపినట్లు భారవిక కల్పించాడు. అట్లే కిరాతార్జునుల యుద్ధ వర్ణనము సుదీర్ఘమై కొన్ని సర్గలను ఆక్రమించింది. శ్రీనాథుడీ త్రోవన పోవక అరణ్య పర్వ ప్రథమాశ్వాసము నందు నన్నయభట్టు నడిపినట్లే కథను సంగ్రహంగా అవాంతర వ్యాప్తి లేకుండగా నడిపాడు.

అర్జునుడు మహాదేవుని ఒక దండకంలో స్తుతించినట్లు నన్నయ రచించాడు. ఈ సందర్భంలో శ్రీనాథుడొక సార్వ విభక్తిక స్తవాన్ని కూర్చాడు. ఇట్టి రచన ఉదాహరణ కావ్యాల యందు ప్రస్తావించబడుతుంది. శ్రీనాథుని స్తవము నందు (7.93.99) శివుడు షట్కాల పూజా ప్రియుడుగా చెప్పబడింది కాబట్టే ఈ స్తవము ఆరు పద్యాలలో శ్రీనాథుడు ముగించినట్లు భావించవచ్చు. అర్జునుడు షట్కాల పూజచే శివుని ఆరాధించిన విషయం 7.30.35 పద్యాల్లో రసవంతంగాను, శ్రద్ధా సమన్వితంగా వర్ణింపబడింది. మచ్చుకు ఒక పద్యం

"పంచ బ్రహ్మోషడంగ బీజ సహిత ప్రాసాద పంచాక్షరీ
చంచన్మంత్ర పరంపరా పరమ నిష్ఠా తత్పరత్వంబునన్
మంచుంగొండ యనుంగు పెండ్లి కొడుకున్ మధ్యాహ్న కాలంబుసే
వించున్ నిర్జర రాజ సూనుడు మనోవీథీ సదాధ్యానితన్" (7.33)

మహేశ్వరుని 'మంచుగొండయనుంగు పెండ్లి కొడుకు' అని వర్ణించుట శ్రీనాథునకు మిక్కలి ప్రీతి. భీమేశ్వర పురాణంలో కూడా ఇట్టి ప్రయోగాన్ని చేశాడు.

కిరాతార్జునీయ కథ (7.103) పద్యంతో ముగిసింది. హర విలాస కావ్యం అంతటితో ముగియవలసి ఉంది. భారవి కిరాతార్జునీయము నందు పాశుపతాస్త్ర ప్రధానంతో కావ్యం ముగిసింది. అర్జునుడు అమరావతికి పోవుట, ఊర్వశీ ప్రలోభనము, ఇత్యాది కథాంశములు హర విలాసంతో సంబంధం లేనివి అయినప్పటికీ రసోత్పత్తికి తావలమైనదను లోభంచే కాబోలు అప్రస్తుతమైనను శ్రీనాథుడే గ్రంథ భాగంలో పెంచి వ్రాశాడు. రసాభాస శృంగారమైనను లభించిన

అవకాశాన్ని రసలోలుపుడైన కవీంద్రుడు విడువలేదు.

## 4.5 హర విలాసము - శైలి:-

శైలీ సంపద యందీ కావ్యం మార్గదేసీ విధానాలకు సేతువుగా నిలిచింది. ఇందలి ఇతివృత్తంలో ప్రఖ్యాతములైన పురాణ కథలును, దేశీయమైన చిఱు తొండ నంబి వృత్తాంతము వంటిదియు పడుగు పేకవలె కలిసిపోయింది.

(i) సంస్కృత సమాస జటిలమైన ప్రౌఢ శైలి కొన్ని పద్యాల్లో కన్పిస్తుంది. ఉదాహరణకు

"మౌళిం గోహళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్న వేళన్ మహా
కాళంబైన నభో విభాగమున వీఁకంగాసె బీరెండయా
ప్రాలేయాహిత సంప్రదీప్తకిరణ ప్రక్రీడ దర్కోపల
జ్వాలా జాల జటాల జాంగల తటీ వాచాల కోయష్టియై" (7.109)

(ii) సమ సంస్కృత శైలి కొన్నిట కానవచ్చును. రతీ విలాప ఘట్టము నందీ పోకడను గమనించవచ్చు.

(iii) దేశ్యమైన పద్యపు నడక మాయా కిరాతుని మొఱకు మాటల్లో అచ్చొత్తినట్లు కన్పడుతుంది.

(iv) ఇది గాక శ్రీనాథుడీ కావ్యంలో పెక్కు దేశీయములైన పలుకుబళ్ళను, సామెతలను సమయోచితంగా వాడి యున్నాడు. ఉదాహరణ:

1. తేవయ్యా తూమెడిక్షురసము (2.7)
2. పాడయినట్టి చిత్తము (2.64)
3. ఆలుమగలు నొక కుత్తుకైనగాక (2.61)

అనాదరార్థంలో శ్రీనాథునకు 'పాడయిన' అను ప్రయోగాన్ని వాడటం ఇష్టము.

4. బహుదా విప్రతిపత్తి విషయముల్ పాడైన శాస్త్రార్థముల్ (కాశీ 3.99)
5. కుట్టియా చూడగ దోసకాయలె (2.64)
6. అవంచి యే కంచి నీకు నడుగు వాడయే? (2.65)
7. మహాకఠినాత్మలు వోమృగేక్షణల్ (3.85)
8. చంక దుడ్డుశరణార్థి (7.17) ఇట్టివి పెక్కులున్నవి

ఇందలి కొన్ని దేశ్య పదముల అర్థములు, రూపములు విస్పష్టంగా లేవు.

1. బసువర (2.6) - ఇది బసవేశ్వర శబ్ద భవము కావచ్చు.
2. సంకిలియలు (2.15) - సంకెళ్ళు అను అర్థంలో వాడి ఉండవచ్చు.
3. వామి (2.31) - గడ్డివామి వంటి వాడుక నేడు కలదు.
4. చల్ల జంపులు (2.52) - కాలక్షేపపు మాటలు కావచ్చును.

(v) కవి ఒకానొక చోట ఒకే అర్థాన్ని ప్రకటించటానికి అన్నియు క్రియలనే వాడతాడు.

ఉదాహరణ: అనువు దప్పిరి, నొచ్చి, రలసి, రుపద నొంది,

రదవదవైరి, చీకాకుపడిరి,

యంగలార్చిరి, విచ్చిరాఅడిఁబొందిరి,

బ్రమసిరి, పాటిరి, పల్లటిలిరి,

బెగ్గడిల్లిరి, పికాపికలైరి, సొలసిరి,

కులకుల గ్రూసిరి, కుతిలపడిరి,

గ్రగ్గుల కాగ్రైరి, కలఁగి, రోటాటిరి,

వెలవెల్లనైరి, నివ్వెఱఁగుపడిరి,

యసవుసవులైరి, గుజగుజమైరి, డస్సి,

రొల్లఁబోయిరి, వెగ్గిరి, తల్లడిలిరి,

సిగ్గుపడి, రొచ్చువడిరి, యిస్సిస్సి యైరి,

తారకుని చేత మునులు బృందారకులును (3.10)

ఇది యొక శిల్పము. అట్లే ఒకే భావాన్ని పెక్కు పదాలతో వ్యక్తీకరిస్తాడు.

(vi) ఓషధీప్రస్థ పురంలో మహేశ్వరుని బంట్లు చేయు ఆగడాలను శ్రీనాథుడు చమత్కారంగా వర్ణించాడు.

"ఆగడీలు, మహాధూర్త, లగడుఁగాకు,

బద్ధతులు, గొంట్లు, పలుగాకు, బదురమిడుకు,

లాకతాయులు, శఠులు, గయ్యాళులగుచు

నోషధి ప్రస్థ మిల్లిల్లనుడు కుచుండ" (5.10)

దుడుకు వారు అని చెప్పటానికి ఒక పదమాలను శ్రీనాథుడిక్కడ సంధించాడు.

(vii) అరటాకు భోజనం కవికి మిక్కిలి యిష్టం. "అనంతరంబ చిగురుముదురునుం

గాని నిడుపు వెడల్పుం గల కదళీ పలాశంబునడిమి యీనియుఁబుచ్చివఱచె" (2.126)

భీమేశ్వర పురాణము నందును వ్యాస మహర్షి మున్నగు వారి భోజన సందర్భము నందును ఈ అరటి ఆకుల ప్రశంస కలదు.

(viii) శ్రీనాథునకు పసి పిల్లల యందును, లేగ దూడల యందును మక్కువ అధికం. దేవదారు వన వర్ణనము నందలి ఈ క్రింది పద్యం స్వభావోక్తికి పరాకాష్ఠ.

"ఆనందంబునఁ ద్రుళ్లు ( బుచ్చములు పెల్లల్లార్చుచున్ లేఁగల
క్కానన్ గోకుల గోష్ఠ దేశముల జంఘా లాఘవంబొప్ప, హో
మానష్ఠాన విధి ప్రకార పరతంత్రాత్మ ప్రసూ కా మధు
గ్ధే నూధ్గస్య సుధా ప్రవాహాల హరీ తృప్తాంతరంగంబులై" (5.34)

కడుపు నిండా పాలుత్రావి తోక మట్టులెత్తుకొని చెంగు చెంగున గంతులు వేస్తున్న ఆ లేగలను శ్రీనాథుడు ఇతర గ్రంథాల్లోను చిత్రించాడు.

## 4.6 శ్రీనాథుని కాలపు ఆచార వ్యవహారాలు:-

శ్రీనాథుని కాలపు ఆచార వ్యవహారాలు కొన్ని హర విలాసంలో ప్రతి ఫలించాయి.

1. రాజులు భోగ పరాయణులై ఉన్నారు. ప్రభువులు కూడా వేడుకల్లో పాల్గొను అవకాశముండేది. వసంతోత్సవ వేడుకలే దీనికి నిదర్శనము.
2. శైవ మతం రెడ్డిరాజ్యంలో విస్తారంగా ప్రాచుర్యాన్ని పొందినట్లు కనబడుతున్నది.
3. బౌద్ధ, జైన, పాషండ, లోకాయతిక, చార్వాక, కాపాలికాహి, తుండిక, వానప్రస్థ, పాశుపత, జంగమయోగి ప్రముఖులు (2.28) కాంచీ నగరంలో నివసించిన వివిధ మతానుయాయులు. వీరిలో జంగమయోగులకే ఎక్కువ గౌరవాదరాలుండేవి.
4. ఆ కాలపు వర్తకం సాధారణంగా వైశ్య ప్రముఖుల చేతుల్లో ఉండేది.
5. ఆ కాలంలో నూటికి ఒక రూక వీడ్డ పుచ్చుకొనుచుండిరి.
6. లావాదేవీల యందు బేరమాడటం, కొసరడం ఆనాడున్నది (2.20).
7. కొన్ని ధాన్యపు రకాలను శ్రీనాథుడీ విధంగా పేర్కొన్నాడు.

   "కంపా తరంగిణీ ప్రవాహ నదీ మాతృకాయమాన విశ్వంభరాభరితకలమశాలి, శిరాముఖ షష్ఠిక, పతంగ హాయన ప్రముఖ బహు విధ వ్రీహి భేద సంపత్సంపన్నంబును" (1.10)
8. నదీ గర్భము నుండి నీటిని ఏతాములతో ఎత్తి చెఱకు తోటలకు పంపించే వారు.
9. చెఱకు రసం తీయడానికి చే గానుగ ఉండేది. (1.20) ఇవి కొలది పరిమాణంలో రసాన్ని తీయటానికి ఉపయోగించేవారు. పెద్ద ఎత్తున చెఱకు పిండటానికి భారీగా గానుగ బండి ఉండి ఉండేది.
10. చదువుల విషయములో కలవారి బిడ్డలు, బజ్జల యింటికి పోయి చదువు కొనెడివారని తెలుస్తుంది. (2.71) చిన్ని సిరియాళుడు, గురువునింట చదువు కొనుట జరిగింది. బాలురకు చిన్న పుస్తకాలుండేవి. వానిలో నీల కంఠస్తవమును గురువు వ్రాసి యివ్వగా బాలురు పఠించేవారు.
11. వైశ్య వంశీయులకు గల బిరుదావళులు ఇవి - కావేరీ వల్లభులు, ఉభయ ద్రావిడులు, కిష్కింధాచల క్రీడా వినోదులు, అయోధ్యా పురాధీశ్వరులు మొ॥వి.

**సాంఘికాచారాల్లో:-**

1. వివాహానికి సంబంధించిన వివరాలు గౌరీ కళ్యాణంలో కొన్ని లభిస్తున్నాయి. ప్రాచీన కాలంలో వరుని వైపు వారు వధువు తల్లిదండ్రుల కడకు పోయి కన్యనిచ్చుటకు అడుగుటయే సదాచారము. శివుడడుగకయే కుమార్తెనిచ్చు టెట్లని హిమవంతుడు వెనుకాడు చుండెను.
2. పెండ్లి విషయంలో పురుషుల కంటే స్త్రీలకు ప్రమేయం ఎక్కువయని శ్రీనాథుడు భావించెను. "కన్యకాదాన వేళల గలదు చనవు క్షితి గృహస్థుల కంటె సద్గేహినులకు" (4.68).
3. నగరంలో వార కాంతల సందడి అధికంగా ఉన్నట్లు తోస్తున్నది. ఓషధీ ప్రస్థ పురమందలి దివ్య వేశ్యలను, వారి గృహముల వైభవములను గోడల పై చిత్రింపబడ్డ శృంగార దృశ్యాలను శ్రీనాథుడు వర్ణించాడు. ముని పత్నుల ఇండ్లలో పడు శ్రమను కన్యకా జనుల ఆటపాటలను వేషధారణలను కూడ శ్రీనాథుడు పొందుపరచాడు.

## 4.7 హర విలాసము - రస ప్రస్థానము:-

**1. సంభోగ శృంగారము:-**

'దేసికగాన మార్గములు దిన్నని రీతులఁబాడి పాడియా
శ్వాసమునొందు సోలి యరవాడిన యంగన మోముఁదమ్మిఁబు
ష్పాసవ ఘూర్ణి తీక్షణము లల్లనఁజుంబన మాచరించి యు
ల్లాస మొనర్చెఁగిన్నర విలాసి హిమాచలకంధరంబునన్' (హర 3.62)

హిమాద్రి వర్ణనములోని పద్యమిది. హిమనగము పై ఎందరెందరో తపోధనులు, దివ్య పురుషులు, నివసిస్తుంటారు. ఆ హిమాచల కంధరమున దేసికగాన మార్గాల్లో వివిధ భంగుల పాడిపాడి అలసి సొమ్మసిల్లి సోలిపోయిన ప్రియ తరుణి ముఖ పద్మాన్ని మధుపానంచే తిరుగు చున్న చూపులు గల నేత్రాలను మెల్లమెల్లగా చుంబించి కిన్నెర విలాసి ఆమెను ఉల్లాసపరచింది.

ఇచట కిన్నరునిలోని రతికి కిన్నరుంగన ఆలంబన విభావము. గేయాలాపనము, అరవాడిన అంగన మోముదమ్మి ఉద్దీపన విభావాలు పుష్పాసన ఘూర్ణి తీక్షణాలు అనుభావాలు. మోమరవాడుట వైవర్ణ్యమను సాత్త్విక భావము. అవహిత్థ, అపస్మారము, ఆవేగము, గ్లాని, శ్రమము, మదము అనునవి ఇందలి వ్యభిచారి భావాలు. కిన్నర హృదయ స్థితమైన రతి యను స్థాయి భావము ఉపర్యుక్తములైన వివిద భావాలచే శృంగారంగా మారింది.

**2. హాస్య రసము:-** వికృతములైన వేష భాషా చేష్టాదులను దర్శించటంచే కలుగు మనో వికారము హాసము.

ఆ సహస్రాక్షుని ఆత్మ సంశుద్ధికి
బరమ సంయమి యింటి పంచసాక్షి
యానిర్జరేంద్రు బాహా విక్రమమునకు
భుజ గాంతకుని యీకపోక సాక్షి
యా సునాసీరు నహంకార గరిమకు
నిషధా చలము మీది నెలవు సాక్షి
యా శచీవల్ల భునౌ చిత్య కలనకు
దాపసు చేతి పూదండ సాక్షి
యిట్టి దేవేంద్రు వలన నీవేమి ఫలము

వడసెదవు చాలు నీ వాంఛ పాడుగాను
వాడు నీకంటెనేమిట వాసిగలడు
తగదు చాలింపు మీ విరుద్ధంపుందపము (7.22)

విపక్ష విజయాన్ని ఆకాంక్షించిన అర్జునుడు ఇంద్రకీలాద్రి కేగి అచ్చట ఇంద్రుని గూర్చి తపస్సు ప్రారంభించాడు. పార్థుని పట్టుదలను పరీక్షించటానికై వచ్చిన సహస్రాక్షుడు తనితో ఇట్లన్నాడు.

"నాయనా! తపస్సు చాలింపుము. ఆ ఇంద్రుడు నీ కంటె గొప్పవాడు కాదు. అతడు నీకేమి ఫలమివ్వగలడు? వాని మనశ్శుద్ధికి గౌతమునింటి పంచయే సాక్షి (కోడియై కూసినాడు). వాని పరాక్రమానికి గరుత్మంతుని ఈకయే సాక్షి (దాని ముందు వజ్రాయుధం నిష్ఫలమైంది) వాని అహంకారానికి మీది నెలవు సాక్షి (అక్కడకొన్నాళ్ళు దాక్కున్నాడు). వాని వివేకానికి దుర్వాసుని చేతి పుష్ప మాలిక సాక్షి (ఏనుగు కుంభ స్థలము పై వేసి శాపగ్రస్తుడైనాడు)."

ఇచట ఇంద్రుడు ఆలంబనము. ఇంటి పంచ, పూదండ మొదలైనవి ఉద్దీపనములు, స్మృతి, అవహిత్థ మున్నగునవి వ్యభిచారులు.

ఇందు నాలుగు పాదాల యందును ఇంద్రునకు సహస్రాక్షుడు, నిర్జరేంద్రుడు, సునాశీరుడు, శచీ వల్లభుడు అను సాభిప్రాయములైన విశేషణాలు వాడబడ్డవి. ఈ పద్యంలో ఇంద్రుని గురించిన చిక్కని వెక్కిరింతలు చక్కని హాస్యాన్ని కలిగిస్తున్నాయి.

3. **కరుణ రసము:-** ఇష్ట జన వియోగము మున్నగు వాని వల్ల మనస్సుకు ప్రాప్తించదు దుఃఖాతిశయము శోకము.

క్రొమ్ముడి కైపెక్కి కుసుమంబు లుమియు
నవటు ప్రదేశంబునందు బొరల
జేవురించిన లేఁత చెక్కు టద్దంబులఁ
దాటంక యుగళంబు తన్నియాడ
నాక్రోశ పరిదేవనాక్షర వ్రాతంబు
కంఠ గద్గదికటే గ్రక్కువడఁగ
హరి నీలము ల చాయ నక్షి గోళమ్ముల
సొబగుగాఁగన్నీటి సోన గురియ
ముత్తియంబుల పేరాలు ముఱిసి పడగ
హస్తముల వీఁగు జనుదోయి యుడచుకోనుచు
సంబరంబిచ్చె రతిదేవి శంబరారి
కప్పుడు వసంతునెదుట దుఃఖార్తయగుచు (హర 3.92)

ఫాలనేత్రుని క్రోధాగ్ని జ్వాలలో మన్మథుడు భగ్గుమని భస్మమైనాడు. అతని ప్రియసతి రతి తన శోచనీయ స్థితికి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ మన్మథునకు తర్పణము నిచ్చిన సందర్భంలోనిదీ పద్యం.

ఇందు భస్మమైన మన్మథుడు ఆలంబనము. రతిదేవి విరబోసికొన్న జుట్టు, జేవురించిన చెక్కిళ్ళు అనుభవాలు. మోహము, దైన్యము, గ్లాని, చింత, విషాదము మున్నగునవి సంచారి భావాలు. గద్గ స్వరము, కన్నీటి సోనలు సాత్త్విక భావాలు. వీని సాహచర్యంచే రతి హృదయగతమైన శోకము కరుణ రసంగా పరిణతినొందింది.

**4. రౌద్ర రసము:-** శత్రువులు మొదలగు వారు చేసిన చెడు కార్యాల వల్ల కలిగిన మనః ప్రజ్వలనము క్రోధము.

"హుంకారంబొనరించి తుంబురునితో నోరీ! దురాచార! నా
జింకల్ భుక్తి గొనంగ నేమిటికిరా చేచిట్ట మ్రోయించి యా
తంకంబున్ ఘటియించి తిట్టియపరాధం బేను సైరింతువే?
యింకన్ మర్త్యుఁడవై జనింపు మహిలో నింకంగ నీ గర్వమున్
క్రోధ సంవర్ధమా తపోధనుండైన" (1.4)

దుర్వాసుడొకనాడు "నీ వారపాయ సాన్నంబల్లనల్లన లేడి పిల్లలకు మేపు చుండగా, తుంబురుడను ప్రమథుడు విమానంలో పోతూ అంగుళి స్ఫోటనము చరించాడు. ఆ చిటిక చప్పుడు విని లేళ్ళన్నీ చెల్లా చెదరుగ పారిపోయినాయి. ఆ దుండగానికి దుర్వాసుడు మండిపడ్డాడు. ఆ సందర్భంలోని పద్యమిది."

ఇందు దుర్వాసుని క్రోధానికి తుంబురుడు ఆలంబనము. వాడు చిటిక వేయుట, లేడి పిల్లలు చెదరిపోవుట ఉద్దీపనము. దుర్వాసుని హుంకారము, వికట భ్రుకుటి అనుభావాలు. ఉగ్రత ఆమర్షము. ఆవేగము సంచారులు. ఇందు దుర్వాసుని క్రోధము ఉద్రిక్తమై రౌద్రముద్ర చేకొన్నది.

**5. వీర రసము - ధర్మ వీరము:-**

"కట్టించె నొక తాత కంచి హర్మ్యంబులు
హరిణాంకమౌళి కీకామ్రపతికి
బాలార్కమని యెడు పద్మరాగముఁదాఁచె
నొక తాత కంచి నాయకుని నాభి
నొక తాత గట్టించె యోజన త్రయ దీర్ఘ
తరతటాకాంభోధి తిరువళూరఁ
గావేరిఁగట్టించెఁగార్పా సరాసుల
నుచ్చి చోడఁడు మెచ్చనొక తాత
ప్రతి దినమ్ముఁ గపురపు దీపములు వేయు
వ్రతముగా నొక్క తాతయీశ్వరున కొసఁగె
నిఖిల లోక ప్రసిద్ధి వాణిజ్య వంశ
ధరులు మాతాత లుభయ గోత్రముల యందు" (1.10)

హర విలాస కృతి భర్త అవచి తిప్పయ సెట్టి తన తాతలు చేసిన ధర్మ కార్యాలను శ్రీనాథ మహాకవితో చెప్తున్నాడు.

ఒక తాత కాంచీ నగరములో ఏకామ్రమ నాథునకు గుడి గోపురాలు కట్టించాడు. ఒక తాత వరద స్వామి నాభిలో బాలార్కమణిని అలంకరించాడు. ఒక తాత తిరువళ్లూరు నందు మూడు మడల పొడవు గల తటాకాన్ని త్రవ్వించాడు. ఒక తాత కావేరికి ఆనకట్ట కట్టించాడు. ఇంకొక తాత శివుని గుడిలో అహరహము సహస్ర కర్పూర దీపాలు వెలిగించు వ్రతాన్ని సాగించాడు.

పైన చెప్పినవన్నియు భక్త్యుత్సాహంతో చేసిన ధర్మ కార్యాలు. ఇచ్చట ధర్మకృత్యములందలి ఉత్సాహము స్థాయి భావము. ఇది ధర్మ వీరముగ రూపొందింది.

6. **భయానక రసము:-** రౌద్రములైన స్వరూపాలను చూడటం వల్ల భీకరములైన శబ్దాలను వినటం వల్ల కీడు కల్గునేమో యని శంకించటాన్ని భయమంటారు.

"అనువు దప్పిరి నొచ్చి రలసి రాపదనొంది
రద వదలైరి చీకాకు పడిరి
యాంగ లార్చిరి విచ్చిరాఅడిఁబొందిరి
బ్రమసిరి పాఱిరి పల్లటిరి
బెగ్గ డిల్లరి పికాపిక లైరి సొలసిరి
గ్రగ్గులకాఱైరి కలఁగిరోటాఱిరి
వెలవెల్లనైరి నివ్వెఱఁగుపడిరి
యసవు సవులైరి గుజగుజయైరిడస్సి
రొల్లఁబోయిరి వెగ్గిరి తల్లడిలిరి
సిగ్గువడి రొచ్చవడిరి యిస్సియిసి యైరి
తారకుని చేతమునులు బందారకులును'. (3.10)

ముని బృందారక బృందములు భువన మారకుడైన తారకుని దుండగాలచే బెదరి, చెదరి, బెగ్గడిల్లిన సందర్భంలోనిదీ పద్యం.

నానావిధ క్రియా సముచ్చయంతో కూడిన పై సీసపద్యము సురముని బృందముల డెందములలోని భయాన్ని చక్కగా నిరూపింపబడింది.

7. **భీభత్స రసము:-** రక్తము, వమనము మున్నగు కదర్య వస్తువులను దర్శించటంతో ఎదలో ఉదయించు ఏవగింపు జుగుప్స.

'పులి కళాసంబు గప్పుదురు పాఱఁగ మీఁద
విద్యాధరాంగ నా విటగణంబు
గంధర్వ కామినీ కాముక వ్రాతంబు
లాతులఁగొని మోఁది లజ్జఁగొంద్రు
కకపాల వెలిది ( గన్నులలోఁ బ్రామి
బాధింతు రప్సరః పల్లవులను
గరుడ భామా భుజంగ ప్రతనముఁ బట్టి
బంధింతురురు యోగ పట్టకముల
నాగడీలు మహాధూర్తులగడుఁగాకు
లుద్ధతులు గొంట్లు పలుగాకులుదురుమిడుకు
లాక తాయలుశఠులు గయ్యాళులగుచు
నోషధి ప్రస్థ మిల్లిల్లునుడు కుచుండ'' (5.10)

గౌరీ కళ్యాణం జరిగింది. శివుడు భవానితో మామ గారింట్లో మనుగుడుపునకు వచ్చినాడు. వెంట వచ్చిన తుంటరి ప్రమథులు ఓషధి ప్రస్థ నగరంలో కొంటె చేష్టలు సాగించారు. ఆ సందర్భంలోని పద్యమిది. ఇందు ప్రమథులు చేయు దుండగములు జుగుప్సను కలిగిస్తున్నాయి.

8. **అద్భుత రసము:-** అసాధారణములైన వస్తువులను అవలోకించుటచే కలుగు ఆశ్చర్యము విస్మయము.

"అత్తన్వంగి సమస్త దిక్కులను పర్యాయక్రమం బొప్పగా
నొత్తెం 'జిన్ని కుమార! రార!' యని యత్యు చ్చైశ్రుతింజీరి సం
జిత్తంబుబ్బగ వచ్చె బాలుండు మహా శీఘ్ర ప్రచారంబునన్
దత్తద్వ్యంజన పాక గంధ్యవయవ స్థాన ప్రతానంబుతోన్" (2.135)

చిఱు తొండ నంబి శివయోగికి కన్న కుమారుని వండి వడించినాడు. ఆ మాయ శివయోగి "పిన్నవాడు పంక్తిలో లేనిదే నేను భోజనము చేయ" నన్నాడు.

"ఇంక కన్నకొడుకెక్కడున్నాడు. శాక పాకములు చల్లారిపోవును. భుజింపు" డన్నాడు గృహస్థు. "నీయుత్తమాంగన ఎలుగెత్తి పిలిచిన నీ కుమారుడు వచ్చు" నన్నాడు యోగి. కన్నతల్లి గళమెత్తి పిలిచింది. చిన్ని సిరియాళుడు పరుగెత్తుకొని వచ్చినాడు. వాని తను వంతయు తాలింపువాసనలు గుప్పుమనుచున్నవి. ఎంత అద్భుత సన్నివేశము.

9. **శాంత రసము:-** వైరాగ్యము, భక్తి మొదలగు వానిచే కలుగు నిర్వికారమైన చిత్త వృత్తి విశేషముశయము.

"సంసార భ్రమ మించుకేనియును మత్స్వాంతంబునన్ లేదు మీ
వంశం బీ పరిపాటి దేయుడు గుడీ వైక్లబ్య సంభావనల్
మాంసాహారము నయ్యెదన్ శివునకున్ మాయా మహా యోగికిన్
హింసాక్లేశము మానుఁడేగురులు మీరే మిమ్ము ప్రార్థించెదన్" (2.112)

జననీ జనకులు కుమారు సిరియాళుని పలల పాకము చేసి శివయోగికి నమస్కరింప సంకల్పించారు. ఆ సంగతి తమ కుమారునికెరిగించారు. అప్పుడు కుమార సిరియాళుడు తల్లి దండ్రులకు ధైర్యము గరపుచు పల్కిన పద్యమిది.

ఇందు బాల సిరియాళుని సంసార సుఖ పరాఙ్ముఖత్వము, ధీరత్వ స్థిరత్వములు, నిర్భయత్వము, పితృభక్తి, మహేశ్వర భక్తి వ్యక్తములైమనచూపును. శాంత రస సోపానముల వైపు నడిపిస్తున్నవి.

## 4.8 హర విలాసము - అలంకార సమన్వయము:-

1. **ఉపమాలంకారము:-** ఉపమానోపమేయములకు చక్కని సాదృశ్య సంపద ఎక్కడ ప్రకాశించునో అచ్చట ఉపమాలంకారము

'మగువా! నీ పెంచినలత
చిగురునముకుళంబులుల్ల సిల్లునె చెపుమా!
పగడపుఁగెమ్మో విపయిన్
నగవుదయించిన విధంబునం బ్రస్ఫుటమై' (4.19)

తేగ చిగురున్ మొగ్గలు ఉపమేయము. పార్వతి పగడాలకెమ్మోవి మీది చిరునవ్వు ఉపమానము. విధంబున వాచకము. ఉల్లసిల్లుట సమాన ధర్మము.

2. **విభావనాలంకారము:-** కారణం లేకుండగనే కార్యం కలిగినట్లు వర్ణిస్తే విభావనాలంకారమందురు. సమర్థమైన కారణము లేకున్నను, కార్యోత్పత్తిని వర్ణించటాన్ని కూడా విభావనమే అవుతుంది.

"నీ వజ్రము సుఖముండుం
గావు తదివ్యాస్త్ర శాలికా మధ్యమునన్
దేవేంద్ర! చెఱకు వింటం
బూవులు శరములు గనేరిపూల నిర్జింతున్" (3.47)

సంకల్ప మాత్రాన సహస్రాక్షుని సన్నిధిలో సాక్షాత్కరించిన పంచబాణుని ప్రగల్భోక్తులివి.

దేవేంద్రా! నీ వజ్రము ఆయుధ శాలలో హాయిగా విశ్రాంతి తీసుకొను గావుత! నీ వజ్రాయుధము చేయవలసిన శత్రు సంహారమును నేను నా చెరకు వింటితోను, విరుల శరముల తోను సాధింతును" శాత్రవ విజయానికి కారణములైన చెరకు విల్లు పూల బాణములు దుర్బలములు. సమర్థములగు సాధనాలు లేకుండా శత్రు విజయ రూపమైన కార్యోత్పత్తిని కాంక్షించటం చేత ఇది విభావన అయింది.

3. **అల్పాలంకారము:-** సూక్ష్మమగు ఆధేయమున కంటె ఆధారానికి అత్యంత సూక్ష్మత వర్ణిస్తే అల్పాలంకారమవుతుంది.

"జలధరమంతయై కరటి చందము గైకొని, సుకరాకృతిన్
నిలిచి, పికంబుతో దొరసి, నేరెడు పండును బోలె నుండయై
కలశ పయోధి మంధనముఖంబునఁబుట్టిన యమ్మహాహాలా
హలము క్రమంబునన్ శివుని హస్త సరోరుహమెక్కి ఁజుక్కగన్" (6.69)

సురాసురులు అమృతాన్ని ఆశించి సముద్రాన్ని మథించారు. అట్లు "శరువంతరువ సముద్ర మధ్యమున" కరాళ కాలకూటము ఆవిర్భవించింది. ఆ కాలకూట విషానలానికి ముల్లోకాలు తల్లడిల్లాయి. భీత చిత్తులై వేల్పులు పలాయన పరాయణులైనారు. అప్పుడు సుస్థిరుడై విరూపాక్షుడు హుంకారమొనరించి త్రైలోక్య రక్షా దక్షమగు తన దక్షిణ హస్తాన్ని ముందుకు చాచాడు. ఆ సందర్భంలోని పద్యమిది.

భూ నంభోంతరములు వ్యాపించి యున్న మహా హాలాహలము క్రమముగా మేఘమంతయై తర్వాత గజమంతయై తర్వాత వరాహమంతయై తర్వాత కోకిలయంతయై, తర్వాత జంబూ ఫలమంత ఉండమైనట్లు చెప్పబడింది. హాలాహలానికి క్రమంగా అల్పత్వాన్ని అభివర్ణించటం చేత అల్పాలంకారమయింది.

4. **సారాలంకారము:-** ఉత్తరోత్తరములకు ఉత్కర్షము వర్ణించుట సారాలంకారము.

"దీవులందెల్ల నేరేటి దీవి లెస్స
భరత ఖండంబు మేల్ తదంతరము నందు
ద్రవిడ దేశంబు కడు నొప్పు దాని యందు
గాంచి దామ మా భూమికిఁ గాంచి పురము" (2.3)

పరమ శివుడు పర్వత రాజ పుత్రితో చిఱు తొండ నంబి చరితము చెప్పు సందర్భములోని పద్యమిది.

ద్వీపాలలో జంబూ ద్వీపము లెస్స. జంబూ ద్వీపములో భరత ఖండము మేల్తరము. భరత ఖండములో ద్రవిడ దేశము శ్రేష్ఠము. ద్రవిడ దేశానికి కాంచీ నగరము కాంచన కాంచీ కలాపము. ఇందు ఉత్తరోత్తరములకు ఉత్కర్షము వర్ణితమైనది. కనుక సారాలంకారము.

5. **సమధ్య అలంకారము:-** మరొక కారణం వల్ల కార్య సౌకర్యమొనగూడినట్లు వర్ణించుటను సమధ్యలంకారమందురు.

"అఖిల లక్షణ సంపూర్ణయైన యట్టి
యాలతాతన్విఁ జూచి పుష్పాయుధుండు
రమణిఁ దాఁ బూను దేవతారాధనంబు
సఫలతం జెందెననిమది సంతనిల్లె" (3.72)

సమాధిస్థుడైన శివుని తపస్సు భంగం చేయటానికై మన్మథుడు హిమాలయానికరుదెంచాడు. అంతలో పర్వత రాజ కుమారి బాలేందు మౌళి సన్నిధికి వచ్చి నిలిచింది. పార్వతిని చూడగానే పంచ బాణునకు ప్రాణాలు లేచి వచ్చాయి. తన ప్రయత్నము సఫలమగునని సంతసించాడు. ఆ సందర్భంలోని పద్యమిది.

ఇటు శివ తపో భంగము మదనుని ప్రధాన కార్యము. ఆ కార్యము సాధింపవలసినది తన పూల బాణాలు. ఇప్పుడు అద్వితీయ సౌందర్య రాశియైన 'గౌరి' యను మరియొక కారణం లభించటంచే కార్య సౌకర్యమొనగూడినది. కాబట్టి సమధ్యలంకారము.

6. **అర్థాంతరన్యాసాలంకారము:-** సామాన్యమును, విశేషము చేతకాని, విశేషమును సామాన్యము చేత గాని సమర్థిస్తే అది అర్థాంతరన్యాసాలంకారము.

"అచ్చరలు పాడు హిందోళ మాలకించి
యిందు మౌళి ప్రసంఖ్యాన మెడలఁడయ్యె
నిర్జితేంద్రియులైనట్టి నియమ పరుల
నంతరాయంబు లేమి సేయంగఁగలవు?" (3.63)

మహేశ్వర తపో భంగానికై మన్మథుడు వసంత సహితుడై వచ్చాడు. శివ తపో వనమంతా నవ నవోన్మేషమైంది. ప్రకృతి పులకించింది. సృష్టి శృంగారమయమైంది. కాని శివుని తపో నిష్ఠ చెక్కు చెదర లేదు. ఆ సందర్భములోని పద్యమిది.

"అప్సరోంగన లాలపించు హిందోళరాగం చే పరమ శివుని ఏకాగ్రత భంగం కాలేదు." అనునది విశేషం. "జితేంద్రియులైన యతీంద్రులను అంతరాయములేమియు చేయలేవు" అనునది సామాన్యం. ఇందు సామాన్యంచే విశేషము సమర్థింపబడింది కనుక అర్థాంతరన్యాసము.

7. **ప్రహర్షణాలంకారము:-** ప్రయత్నము లేకయే అభిమతార్థము సిద్ధించినట్లు చెప్పితిమేని ప్రహర్షణాలంకారము.

"ఆడఁగఁబోవు తీర్థ మెదురైన విధంబున నెల్లియేనురే
పాడియ చంద్ర శేఖరును పాస్తి యొనర్చి యుపాయనంబుతోఁ
జూడఁగ వచ్చువాఁడనయి చూచుచునుండగ నీవ వచ్చితో
చేడివా! యెట్టి పుణ్యములు చేసిన వాఁడనో ప్రాగ్భవంబునన్" (7.124)

నందన వనంలో మందార వాటికా మధ్యమున ఏకాంత మందిరంలో ఉన్న పాండు నందనుని సన్నిధికి సుర సుందరి ఊర్వశి అరుదెంచింది. ఒంటరిగా వచ్చిన ఆ వాల్గంటితో అర్జునుడు పలుకు సందర్భమిది.

"రేపు ఉదయము నేనే నీ దర్శనానికి రావాలనుకొనుచున్నాను. ఆడబోవు తీర్థమెదురైనట్లు నీవే వచ్చితివి. నేనెంతటి పుణ్యం చేసితినో"

తాను ఎవరి కొరకు వెళ్ళవలెననుకొనుచున్నాడో ఆమెయే ఆడబోయిన తీర్థము వలె తన చెంత కేతెంచినదని చెప్పుటచే ప్రహర్షణము.

8. **వృత్త్యను ప్రాసము:-** ఒక వర్ణము గాని, రెండు మూడు వర్ణములు గాని పునరుక్తములైనచో వృత్త్యను ప్రాసము.

"పాండు నందన ఘన భుజాదండకలిత
చండగాండీవ తాడిత ఖండ పరశు
పృథు జటా మండలంబున బిండు గట్టి
తాండవంబాడె మిన్నేటి తరగ దండు" (7.80)

వరాహానికై కిరీటి కిరాతుల నడుమ పోరు ఘోరమైంది. అర్జునుడు తన వింటితో ముక్కంటి శిరస్సు పై గట్టిగా కొట్టిన ఘట్టమిది. ఇట పునఃపునరావృత్తమైన పూర్ణ బిందు పూర్వక 'డ' వర్ణము. గాండీవి గాండీవ ప్రచండతను ప్రకటించుచు విజయుని వీర విజృంభణమున కనుగుణముగ అలరారుచున్నది.

9. **ఛేకాను ప్రాసము:-** అవ్య వహితములైన రెండు వ్యంజనముల పౌన రుక్త్యము ఛేకాను ప్రాసము.

"ప్రబలి మున్నీటినడు నీటఁ పాండు వికచ
కమల కాంచన కర్ణి కాగ్రంబు నందు
బ్రహ్మాదిక్పాల వందిత పాదపద్మ
పద్మయుదయించెఁ గన్నుల పండువగుచు" (6.78)

శ్రీమహాలక్ష్మి క్షీరరాశిలో జన్మించు సందర్భములోనిదీపద్యము. ఇచ్చట 'పాదపద్మ పద్మ' అనుచో ప్రవర్తిల్లినద్కి ఛేకాను ప్రాసము. ఛేకులనగా విదగ్ధులు. వారిచే ప్రవర్తితమైన అను ప్రాసము ఛేకాను ప్రాసము అవుతుంది.

## 4.9 హర విలాసము - వర్ణనా వైచిత్రి:-

1. **దుర్వాసుని స్వరూప వర్ణన:-**

'వికట భ్రూకుటి ఫాల భాగుడును బ్రస్వేదాంబు పూర్ణాఖిలాం
గకుడుం బాటల గండ మండలుఁడునై కల్పాంత సంహార రు
ద్రకదోరాకృతి దుర్నిరీక్షుడగుచున్ ధట్టించి దుర్వాసుడు
గ్రకటాక్షంబున నిఁద్రు జూచి పలికెన్ గాఢాగ్రహవ్యగ్రతన్' (6.17)

ఇందులో దుర్వాస మహర్షి భయంకరంగా చిట్లించిన కను బొమ్మలతో కూడిన నెన్నుదురు కలవాడై అత్యధికమైన స్వేద జలముతో నిండిన దేహము కలవాడై, ఎఱ్ఱబడిన కపోలములు కలవాడై ప్రళయకాల మహా రుద్రుని వలె కన్నెత్తి చూడరానివాడై కాలనేల ధట్టించి రోష కషాయిత వీక్షణాలతో దేవేంద్రుని చూచి ఆగ్రహోతుగ్రుడై మండి పడుతున్నట్లు శ్రీనాథుడు వర్ణించాడు. రౌద్ర మూర్తియైన దుర్వాసుని స్వరూప వర్ణనమిది. వికట భ్రూకుటి ఫాల భాగుడు, ప్రస్వేదాంబు పూర్ణాఖాలాంగకుడు, పాటల గండ మండలుడు, కల్పాంత సలహార రుద్ర కఠోరా కృతి అన్న సమాసముల యందలి పదాలు ఓజోగుణాన్ని ప్రకటిస్తున్నవి. వికట భ్రూకుటి, గండమండలుడు, గాఢాగ్రహవ్యగ్రత - అన్న పదాల యందలి వర్ణ వైచిత్రి, జౌజ్జ్వల్య సంధాయకమై కాంతిని ప్రసరింప చేసింది.

**2. ప్రభాత సమయంలో అప్సరః స్త్రీలు నిద్ర మేల్కొన్న పరిస్థితిని శ్రీనాథుడీ విధంగా వర్ణించాడు:-**

'మాటుగా వైచిన మాంజిష్ఠ తెర యెత్తి
పంజు మంచ ముడిగ్గె మంజుఘోష
మొకరి మట్టెల మ్రోత ముద్దు చూపగ రంభ
కనకంపు గొడుగు పాగాలు దొడిగె
నొకట వేనలి ముడ్చి యొక్క కేల ఘృతాచి
గాజు ఱెక్కల తల్పు గడియపుచ్చె
నలసభావము తొడ నలవోక ప్రమ్లోత
నిల్వుటద్దంబులో నీడ చూచె
హరిణి గీలించె నలిన పట్టాంశుకంబు
మేనక ధరించె ఁబాలిండ్ల మీఁద అవిక
యప్సర స్త్రీ నికేతనాభ్యంతరముల
"గొక్కురో వో" యటంచు గోళ్లు గూసె' (7.137)

అప్సరః కాంతలు అంతఃపురంలోని అభ్యంతరము లందు కోళ్లు కుక్కరోకో అని కూసినవి. అప్పుడు మంజుఘోష పసుపు రంగు, తెరను ప్రక్కల కొత్తిగించి మణి తల్పము దిగినది. రంభ కాలి మట్టెలు 'ఖంగు ఖంగున' మ్రోగగా పాదాలకు పసిడి గుబ్బల పావు కోళ్లు తొడిగికొంది. ఘృతాచి బలుక చేతితో ఊడిన కేశపాసాన్ని ముడి వేసికొంటూ మరొక చేతితో గాజు రెక్కల కవాటము గడియ తీసింది. ప్రమ్లోచ నిద్దుర బద్దకంతో నిలువుటద్దంలో నీడచూచుకొన్నది. హరిణి తామర పూల పట్టు చీర కట్టుకొన్నది. మేనక స్తనాంశుకాన్ని ధరించింది. ఈ విధంగా స్వర్గమున అల్లనల్లన తెల్లవారింది. ఇందు పొందు పరచిన రీతిని చూస్తుంటే సుర సుందరుల శృంగార లీలా విశేషాలను శ్రీనాథుడు లింగడించి వర్ణించాడు.

**3. వర్ష వర్ణన:-**

"తటిదభి ఘాతవేగమున ధారలు జోరున జాఱు చుండగాఁ
బిటిలు పిటిల్లనం బ్రిదిలి ప్రేలి పడం దీడఁగెం జతుర్దిశా
తటముల మండు చుంబిడుగు తండము కాంచి పురీ జనంబు హ్రా
త్పుటములు జల్లనన్ మఘవ పుత్రుని పేళ్ళు పదింజపింపగన్" (2.22)

వర్షము ధారాపాతంగా కురుస్తున్న సందర్భం. తారాపథము నుండి జల ధారలు జోరున కారుచున్నవి. తటిత్తుల తళత్తళలకు కన్నులు మిరుమిట్లు గొల్పుచున్నవి. ఫెటేల్ ఫెటేల్ మని పిడుగులు పడుతున్నవి. కాంచీ వాసుల గుండెలు ఝల్లుమనుచున్నవి. వారు అర్జునుని పది నామములను పదింబదిగ జపింప సాగినారు. ఇంద్రహేతుకమైన వర్షపాతానికి ఇంద్ర నందనుని నామాలను జపించటంలో ఉన్న ఔచిత్యాన్ని ఈ వర్ష వర్ణన ద్వారా గమనించవచ్చు.

**4. ముని శ్రేష్ఠుల వర్ణన:-**

'కాముంజీరికిఁగోక క్రోధము నహంకారంబు లోభంబు నీ
ర్ష్యా మాత్సర్యమదావ లేప కుహనా రాగంబులం జేరనీ
కాముష్యాయణులై ప్రశాంతమతులై యయ్యు శ్రమాంతంబులన్
నేమంబొప్పఁగ సంచరింతురు మునుల్ నీ వార ముష్టింపచుల్' (5.33)

హిమ గిరి దక్షిణ భాగాన దాక్షాయణీ వనమున్నది. దాని కల్లంత దూరాన నున్నది దేవదారు వనము. పరమ పావనమైన ఆ వన మందలి ఆశ్రమాలలో నివసించు జితేంద్రియులై, ప్రశాంతమతులై, తపో నిష్ఠా గరిష్ఠులై ముని శ్రేష్ఠుల వర్ణనమిది.

వారు కాముని జీరి కింగొనరు. క్రోధము రాదు. అహంకారము లేదు. మద మాత్సర్యాదులు దరి చేరవు. నిర్మల హృదయులు. నీ వార ముష్టింపచులు. ఆభిజాత్య సంపన్నులు. ఈ విధంగా ఈ పద్యంలో మునుల శమదమాది గుణ సంపత్తి చక్కగా వర్ణింపబడింది. ప్రశాంతమైన వారి నిత్య జీవితము శాంత రసోన్ముఖంగా చిత్రితమైంది.

**5. మాధవుడు మంధర పర్వతాన్ని ఎత్తినప్పటి పరిస్థితిని శ్రీనాథుడిట్ల వర్ణించాడు:-**

"గోలాంగూలకులంబు లాకుల పడెన్, ఘోషించె శార్దూలముల్,
జాలింబొందె లులాయముల్, సుడి గొనెన్ సారంగముల్, విచ్చిలెన్
గోలంబుల్, బెదరెంజమూరు గణ, మాక్రోశించెఁబంచాస్యముల్
తాలాం కావరజుండు మందర మహా ధాత్రీ ధరంబెత్తినన్" (6.47)

ఈ పద్యం క్షీర సాగర మథన సమయంబున ముకుందుడు ముందడుగు వైచి మందర మహీధరాన్ని ఎత్తిన సందర్భంలోనిది.

ఇందు గోలాంగులకులములు (కొండ ముచ్చుల గుంపులు) ఆకుల పడుట, శార్దూలములు (పులులు) ఘోషించుట, లులాయములు (అడవి దున్నలు) జాలి చెందుట, సారంగములు (లేళ్లు) సుడిగొనుట, కోలములు (వరాహములు) గగ్గోలు పడుట, చమూరుద్రలు (డల బత్తెలు) బెదురుట, పంచాస్యములు (సింహములు) ఆక్రోశించుట మొదలుగా గల జంతు సమూహం ఏ విధంగా భయ భ్రాంతులయినవో ఇందు వర్ణించాడు.

**6. పార్వతి వర్ణన:-**

"తరుణి యందందు గే సరదుమ కాంచి
జఘన పులినంబునందుండి జాటి పడగ
మాటి మాటికి హస్త పద్మముల నెత్తు
చంచల భావంబుతో నుండెనభవు మ్రోల" (3.70)

పరమ శివుని పరిచర్యకై వెళ్ళిన పార్వతి వర్ణనమిది. గౌరి కాంచీ కలాపముగా నడుమున ధరించిన పొన్న పూవుల దండ మాటి మాటికి నున్నని కటి ప్రదేశము నుండి క్రిందకు జారుచున్నది. ఆమె దానిని మరల మరల పై కెత్తి లాగి కొనుచున్నది. అట్లు జారుట గిరి కన్య జఘన స్నైగ్ధ్యమును సూచించుచున్నది.

**7. మంధర పర్వత వర్ణనము:-**

"కాంచెన్ మందర శైలమున్ మృదుతటీ గండోపల శ్రేణికా........................ హింతాలమున్" (6.42)

**8. శివార్జునుల ద్వంద్వ యుద్ధ వర్ణన:-**

" శితి కంఠుడే యుశ రములు, ........... బహుళ బాహా ప్రౌఢిన్" (7.70)

"కపికేతు వృషభకేతను ........................ ముసలాస్త్రముగన్" (7.82)

**9. అర్జునుడు నివతకవచ కాలకేయులతో యుద్ధము చేసిన విధము:-**

"జంభారి ప్రభవ ప్రయుక్త .................... ఘోరంబుగా రక్తముల్" (7.167)

"శరభ తరక్షు సింహకిటి సైరిభ ................ సురారి వీరులన్" (7.188)

**10. ఇంద్రుని వృద్ధ బ్రాహ్మణ వేష వర్ణన:-**

"తెల్లని గడ్డంబు తెల్లని మీసముల్నరసిన ..............నొయ్యొయ్య పార్థుకడకు" (7.12)

స్వభావోక్తితో కూడిన వర్ణనమెంతో మనోహరంగా శ్రీనాథుడు చిత్రించినాడు.

## 4.10 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని కవితా వైభవాన్ని వివరింపుము.
2. శ్రీనాథుని కాలపు ఆచార వ్యవహారాలను తెల్పుడు.

## 4.11 ఆధార గ్రంథాలు:-

1. శ్రీనాథుడు - హరవిలాసము
2. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - డా॥ జె.జె. బాపూజి

**ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 5

# శ్రీనాథుడు - భీమేశ్వర పురాణము - కావ్యత్వము

**ముఖ్యాంశాలు:-**


5.0 లక్ష్యం
5.1 ఉపోద్ఘాతము
5.2 భీమ ఖండము - కథా వస్తువు
5.3 భీమేశ్వర పురాణము - ఆంధ్ర దేశమందలి కొన్ని స్థల విశేషాలు
5.3.1 భీమ మండలము
5.3.2 పీఠికా పురము
5.3.3 కుమారారామము
5.3.4 సర్ప పురము
5.3.5 దాక్షారామం
5.4 భీమేశ్వర పురాణము కావ్యత్వము
5.4.1 వ్యాస నిష్కాసనము
5.4.2 హాలాహల భక్షణము
5.4.3 త్రిపురాసుర సంహారము
5.5 భీమేశ్వర పురాణము - రస ప్రస్థానము
5.5.1 కరుణ రసము
5.5.2 రౌద్ర రసము
5.5.3 క్షమా వీరము
5.5.4 భయానక రసము
5.5.5 భీభత్స రసము
5.5.6 శాంత రసము
5.5.7 ఉపసంహారము
5.6 భీమేశ్వర పురాణము - అలంకార ప్రియత్వము
5.6.1 ఉపమాలంకారము
5.6.2 భ్రాంతి మదలంకారము
5.6.3 అతిశయోక్తి
5.6.4 పర్యాయోక్తాలంకారం

5.6.5 వ్యాజస్తుత్యలంకారము

5.6.6 కావ్యార్థాపత్యలంకారము

5.6.7 అతద్గుణాలంకారము

5.6.8 విశేషకాలంకారము

5.6.9 అత్యుక్త్యలంకారము

5.7 భీమేశ్వర పురాణము - వర్ణనలు

5.7.1 ప్రకృతి వర్ణనలు

5.7.2 ఋతు వర్ణనలు

5.7.3 మంత్ర వర్ణనము

5.7.4 యాత్రా వర్ణన

5.7.5 యుద్ధ వర్ణన

5.7.6 వసంతోత్సవ వర్ణన

5.7.7 నగర వర్ణన

5.8 ఉపసంహారము

5.9 ప్రశ్నలు

5.10 ఆధార గ్రంథాలు


## 5.0 లక్ష్యం:-

శ్రీనాథుని కృతుల్లో ఏ అల్ప విషయమైనా విశేష మహత్వాన్ని కలిగి ఉంటుంది. అతని రచనలో ప్రాచీన సంప్రదాయిక విషయాలు, శాస్త్ర పరిపాటులు, ఉదాత్త భావాలు, మధుర కల్పనలు, రమణీయ శిల్పములు ప్రతి పదము నందు ఆంధ్రత్వం పొడకట్టుచున్నట్లు గోచరిస్తుంది. ప్రాచీనాంధ్ర కవుల్లో ఆంధ్రదేశ చరిత్రను గురించి సమగ్రమైన రేఖా చిత్రాన్ని గ్రంథస్థం చేసింది శ్రీనాథుడొక్కడే. అవన్నీ భీమేశ్వర పురాణంలోని దివ్య స్థలాల మహత్మ్యాన్ని శ్రీనాథుడెంతో భక్తి భావంతో ప్రాకృతిక సౌందర్య భావనా సౌష్ఠవంతో చిత్రించాడు. కాబట్టి వాటి విశేషాలతో భీమేశ్వర పురాణంలోని కావ్యత్వాన్ని దర్శించడమే ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

## 5.1 ఉపోద్ఘాతము:-

భీమేశ్వర పురాణాన్ని శ్రీనాథుడు ప్రౌఢ నిర్భర వయః పరిపాకాన వ్రాసిన గ్రంథం. అంటే దాదాపు డెబ్బది సంవత్సరాల వయస్సు. ఇది ఆరు ఆశ్వాసాల గ్రంథము. రాజమహేంద్ర వర ప్రభువైన వీర భద్రారెడ్డి మంత్రియైన బెండపూడి అన్నయ్యకు అంకితం. ఈ అన్న మంత్రి శ్రీనాథునకు బంధువు కూడ. శ్రీనాథుని గ్రంథాల్లో కుకవి నిరాకరణము ప్రప్రథమంగా ఈ గ్రంథంలోనే కన్పడుతుంది. అట్లే శ్రీనాథుని ఏ యితర గ్రంథాల్లోనూ కనబడని రాధామాధవ ప్రసక్తి ఈ గ్రంథంలో కనబడటం విశేషం.

వ్యాస మహర్షి భిక్ష దొరకక ఆకలి బాధతో కాశిని శపింపబూనగా, కాశీనాథుడు కోపంతో కాశి నుండి వెడల గొడ్తాడు. వ్యాసుడు శిష్యసమేతుడై పార్వతి పలుకుల వల్ల దాక్షారామానికి బయలు దేరతాడు. త్రోవలో కారణాంతరాల వల్ల దక్షిణ దేశంలో

ఉన్న అగస్త్యుని దర్శిస్తాడు. వీరిరువురు దాక్షారామానికి వచ్చి భీమేశ్వరుని దర్శిస్తారు. వ్యాసుడు భీమేశ్వరుని అనుగ్రహాన్ని పొందుతాడు. ఇది భీమేశ్వర పురాణ మందలి సూత్ర కథ. ఈ స్వల్ప కథాంశాన్ని ఆధారంగా చేసికొని శ్రీనాథుడు ఇంచు మించు తూర్పు గోదావరీ మండలాన్ని తనివి తీర వర్ణించి తన మాతృ దేశాభిమానాన్ని ప్రదర్శించాడు.

తెలుగులో ఎఱ్ఱన రచించిన నృసింహ పురాణం మొదటి క్షేత్ర మహాత్మ్యమయితే శ్రీనాథుని భీమేశ్వర పురాణం రెండవ క్షేత్ర మహాత్మ్యం. నృసింహ పురాణంలో లేని స్థానిక విశేష కథనములు, స్థానిక ప్రకృతి చిత్రణములు, ఆంధ్ర దేశ పూర్వ స్వరూపాన్ని చాటి చెప్పిన ప్రకటన పత్రాలు భీమేశ్వర పురాణంలో చోటు చేసుకున్నాయి. ఈ గ్రంథంలో కథ కన్నా వర్ణనము లెక్కువ. క్షేత్ర మహాత్మ్య ప్రదర్శకములైన అనేక వర్ణనలేకాక సందర్భోచితంగా వాయువులు, భోజన పదార్థాలు, సూర్యాస్తమయం, చంద్రోదయము, వసంత ఋతువు మొదలగు వర్ణనలు చక్కని ఊహలతో కూడి ఎన్నో ఉన్నాయి.

ఈ భీమేశ్వర పురాణము ధరించింది పురాణ వేషం. కాని పలుకుల తీరు కావ్య పద్ధతి. ఇందులో పలువురు గీర్వాణ కవుల భావాలు కన్పడటం వల్ల ఆంధ్రీకరణం కాదేమోననిపిస్తున్నది. ఆంధ్రీకరణం కాకపోతే ఈ భీమేశ్వర పురాణం తెలుగు సాహిత్యంలో తెవుగుదేశ భౌగోళిక వర్ణనలతో కూడిన ప్రథమ స్వతంత్ర కావ్యమౌతుంది.

ఈ గ్రంథ మూలాన్ని గురించి భీమేశ్వర పురాణంలో శ్రీనాథుడు చెప్పిన మాటలు

(i) శ్రీ మహాస్కందంబును నాది పురాణమందు గోదావరీ ఖండంబు
శ్రీ మద్దక్షారమ భీమేశ్వర మహాత్మ్య సంయుతంబు గుటజేసి
భీమేశ్వర పురాణంబనంబరగు అది ఆంధ్ర భాషా ప్రబంధంబుగ

చెప్పందొడంగితి..............'' అని గ్రంథ ప్రారంభంలో (భీమ 1.30) కలదు. దీని ప్రకారం భీమేశ్వర పురాణం స్కాంద పురాణమందలి గోదావరీ ఖండమునకు ఆంధ్రీకరణము.

(ii) "స్కాంద పురాణంబు నందు గోదావరీ ఖండము నందు జెప్పంబడిన భీమ ఖండంబు భీమేశ్వర మహాత్మ్యంబును భీమేశ్వర పురాణం బనంబరగు .................. '' అని గ్రంథాంతంబు నందు (భీమ 6.107) కలదు. దీని ప్రకారము భీమేశ్వర పురాణము గోదావరీ ఖండమునందలి భీమ ఖండానికి ఆంధ్రీకరణము.

(iii) "కృతిభర్తయైన బెండపూడి అన్నయామాత్యుడు (భీమ 1.27) అన్న మాటలు
"అరవిందాప్తకృత ప్రతిష్ఠుఁడగు దక్షారామ భీమేశ్వరే
శ్వరు మహాత్మ్యము తోడఁగూడి భావన శ్లాఘా స్పదం బైయభం
గురమై స్కాంద పురాణ సారమగు శ్రీ గోదావరీ ఖండమున్
బరిపాటి న్న చియింపు మంధ్ర జగతీ భాషా ప్రబంధంబుగన్''

కృతి భర్త యొక్క ఈ మాటల ప్రకారం భీమేశ్వర పురాణము స్కాంద పురాణ సారమైన గోదావరీ ఖండమునకు ఆంధ్రీకరణము అన్నది స్పష్టం. కాని శ్రీనాథుని మాటల వల్ల భీమేశ్వర పురాణానికి మూలం స్కాంద పురాణమందలి గోదావరీ ఖండమా? లేక గోదావరి ఖండమందలి భీమ ఖండమా? అనేది మాత్రం అస్పష్టము.

స్కంధ పురాణ ఖండములలో గోదావరీ ఖండమనేది ఎక్కడా కన్పడకపోవుట వల్లను శ్రీనాథుని భీమ ఖండానికి సంస్కృత భీమఖండము సంస్కృతీకరణమని కవితా సాక్ష్యాలను బట్టి కరతలామలకము మరి శ్రీనాథుని భీమ ఖండము - సంస్కృత భీమ ఖండము సమకాలిక గ్రంథాలని చారిత్రిక సాక్ష్యాన్ని బట్టి స్పష్టమవుతున్నది. కాబట్టి శ్రీనాథుని భీమ ఖండము స్వతంత్ర కావ్యమనియు, సంస్కృత భీమ ఖండము శ్రీనాథుని భీమ ఖండానికి సంస్కృతీకరణమనుట స్పష్టము.

## 5.2 భీమ ఖండము - కథా వస్తువు:-

ఈ భీమేశ్వర పురాణ మందలి కథా వస్తువు కేవలం భీమ మండలమందలి తీర్థ క్షేత్ర మహత్మ్యాన్ని తెలియజేస్తుంది. ఈ రచనలో భీమ మండలానికంతటికీ ఒక భౌగోళిక రేఖా చిత్రాన్ని తీర్చిదిద్దాడు. ఆఱు ఆశ్వాసాల్లోని కథా వస్తువిట్లున్నది.

1. **ప్రథమాశ్వాసము:-** ఈ ఆశ్వాసంలోని విషయమంతా స్వకపోల కల్పితము. కృత్యాదిని నిర్వర్తించిన తరువాత ఈ ప్రబంధానికి కథా నాయకుడైన భీమేశ్వర స్వామికి ప్రియధామమైన దాక్షారామ పుర వర్ణనతో దీన్ని ప్రారంభించాడు. ఇందు దాక్షారామ విలాసినీ వతుల సౌందర్యాన్ని తదుత్తమకుల సంభూతియు విశేషంగా నిరూపింపబడింది. క్రమంగా అచటి ఆరామాలు, సరోవర సంపద, మంద మారుత ప్రసారం చిత్రింపబడింది. ఆ వెనుక మాణిక్యాంబికాదేవి, సానికూతుల నాట్య భంగిమలు సప్త గోదావరము అను వీని వైభవాన్ని వర్ణించాడు. పిమ్మట ఒక గద్యంలో దాక్షారామము నందలి వివిధ విభవములు, తీర్థ కుండములు, గోదావరీ నదీ శాఖలు పురోపవనములు నాల్గుజాతుల జనులు, వారి వారి నడతలు మున్నగునవి వర్ణింపబడినవి. తుదిని కృతి భర్తయైన బెండపూడి అన్న మంత్రి భీమేశ్వర స్వామి ఆలయంలో కట్టించిన మహోత్సవ మండపంలో చేసేటువంటి ఉత్సవము, అభినయ కళా ప్రదర్శనమును కలవు. ఈ ఆశ్వాసమంతా, చాలా వరకు కృతి భర్త అభిరుచులను వివరిస్తూ, ఆతనికిని తనకు దక్షారామ భీమేశ్వరుడనెడ గల భక్తి భావాన్ని వివరించునదైయున్నది.

2. **ద్వితీయాశ్వాసము:-** ప్రబంధానికి ప్రధానమైన యితివృత్త విస్తృతి ఈ ఆశ్వాసము నందే కానవచ్చును. మొదటిది దక్షాధ్వరధ్వంసము. అది దాక్షారామము భోగ మోక్ష నివాసమవటానికి గల కారణాన్ని తెలుపుతుంది. పిమ్మట వ్యాసుడు కాశిని వదలి దాక్షారామానికి రావటానికి గల ప్రధాన కారణాన్ని వివరింపదలచి, కాశీ వైభావన్ని కొంత వర్ణించి, సూర్యాస్తమయ, చంద్రోదయ సూర్యోదయ వర్ణనలను చేసి ఉన్నాడు. ఈ వర్ణనము మూలంలో లేనిదయినను ప్రబంధముద్ర ఆపాదించటానికై కూర్చబడింది. ఇది స్వకపోల కల్పితమై కవికి గల కల్పనా పాటవాన్ని వ్యక్తీకరించేదిగా ఉంది. పిమ్మట కాశి నుండి బయలుదేరిన వ్యాసుడు శిష్య సమేతుడై నడుమనుండెడి జగన్నాథము, శ్రీకూర్మము, సింహాచలము దర్శిస్తూ తుల్య భాగా తీరాన ముక్తీశ్వరుని దర్శించి, దాక్షారామానికి పయనిస్తుంటే అక్కడ లోపాముద్రా సహితుడయిన అగస్త్యుడ్ని చూస్తాడు. పీఠికాపుర సర్పవరకు వర్ణనములు నడుమ విశిష్టంగా చేయబడ్డవి. అగస్త్యుడు కుశల ప్రశ్నానంతరం వ్యాసుడు కాశి వదలి రావటానికి గల కారణమేమిటని అడుగుతాడు. అతడు కాశిలో తాను పొందిన భంగపాటుని తెల్పి విశ్వేశ్వరుని ఆగ్రహానికి అన్నపూర్ణ అనుగ్రహానికి పాత్రుడెట్లయ్యెనో అగస్త్యునితో చెప్తాడు. వివిధ రస భావ భరితమైన కథా వస్తు సన్నివేశమీ ఆశ్వాసముననే మనకు కానవచ్చును.

3. **తృతీయాశ్వాసము:-** వ్యాసుడు లోపాముద్రా సహితుడైన అగస్త్యుడును ఆకాశాన నిలిచి భీమ మండలిని పరికించుట, అగస్త్యుడు వ్యాసునకు ఈ మండలము నందలి ప్రసిద్ధ తీర్థ క్షేత్రాలను తెలియజేయుట. దాక్షారామ తీర్థ క్షేత్ర మహత్మ్య విశేషాలను తెలుపుట, వ్యాసుడు పంచ తీర్థములాడి భీమేశ్వరుని దర్శించి స్తుతించుట అనే విషయాలు కలవు. ఈ ఆశ్వాసంలో భీమమండలిలోని పవిత్ర శివ క్షేత్రాలు, పవిత్ర తీర్థములు, తత్తన్మత్త్యములు పేర్కొనబడ్డవి. వీనిని వర్ణించునప్పుడు శ్రీనాథుడు ప్రత్యక్షంగా కన్గొనిన విశేషాలలో తననాట నిలిచియున్న వానిని పాఠకుల ఎదుట పెట్టినాడు. ప్రధానంగా ఈ ఆశ్వాసంలో భీమమండలి భీమనాథుల ప్రశస్తి వర్ణింపబడింది.

4. **చతుర్థాశ్వాసము:-** పరమేశ్వర భక్తులు శివుని మహిమలు వర్ణించేటప్పుడు కాలకూట భక్షణమును, త్రిపురాసుర సంహారాన్ని ప్రధానంగా వర్ణిస్తారు. ఈ మహత్తర కృత్యాలు రెండును, సకలలోక రక్షణార్థము, ప్రధానంగా దేవతా సముద్ధరణమునకై పరమేశ్వరుడు కావించి యున్నాడు. ఈ రెండింటికి కార్యకారణ భావాన్ని కల్పించి పరమేశ్వర విరచితములైన ఈ అపదానములు రెండింటిని విపులంగా వర్ణించి త్రిపురాసుర సంహారానంతరం, పరమేశ్వరుడు దాక్షారామ భీమేశ్వర లింగము ప్రతిష్ఠితుడైన విధానాన్ని తెలియజేశాడు. భీమనాథుడ్ని అభిషేకించటానికి సప్తర్షులు గోదావరి నదిని గొని తెచ్చును. సప్త గోదావరావతరణము,

తుల్య భాగోత్పత్తి ప్రకారం, సప్తర్షులు భీమేశ్వరుని స్తుతించుటయనేవి యిందు వర్ణితాలు. వీనిలో కాలకూట కబళనము దాక్షారామ వాసికి భీమేశ్వర నామధేయ ప్రాదుర్భావానికి మూలమైంది. త్రిపురాసుర సంహారం పంచారామ ప్రాదుర్భావానికి నిదానమైంది. సప్త గోదావరావిర్భావము, గోదావరీ నదీ విభవ వర్ణమునకు, శ్రీనాథునకు గోదావరి పై గల భక్తి భావాన్ని వ్యక్తీకరించటానికి మూలమైంది. సప్తర్షికృత భీమనాథ స్తోత్రము తన్మహత్త్వ ప్రతిపాదకమైంది.

5. **పంచమాశ్వాసము:-**

1. శంకరుడు పార్వతితో కూడి, తన పరివారాన్నంతా వెంట పెట్టుకొని, కైలాసం నుండి దాక్షారామానికి వచ్చి, భీమ లింగము నందైక్యతనొందుట.
2. బృహస్పతి ప్రేరణమున దేవేంద్రుడు భీమనాథునకు భీమమండలి ధారవోసి, దాన శాసనాన్ని ప్రకటించటం.
3. వసంతాగమం.
4. పరమేశ్వరుడు, సకల దేవాతా వర్గం, దేవతా జాతులకు చెందిన స్త్రీ, పురుషులు యుత్సవంలో వినోదించుట.
5. పరమేశ్వరుని పార్వతి ప్రశ్నింపగా, ఈశ్వరుడు గౌరికి భక్తి, జ్ఞాన వైరాగ్యాలను ఉపదేశించుట అనేవి ఈ యాశ్వాసము నందలి విషయాలు. వీనిలో వంసతోదయ వసంతోత్సవ వర్ణములలో శ్రీనాథుని నాటి వసంతోత్సవ చ్ఛాయలు చాల వరకు ప్రతిఫలించాయి. ఈ ఆశ్వాసమందు వసంతర్తువర్ణనము ప్రబంధ రచనమున కెంతయో ఉపకారిగా జతకూడింది. ఈ ఆశ్వాసము తుదిని గూర్చిన ప్రకరణం శివభక్తి స్వరూపు సమున్మేషకం.

6. **షష్ఠాశ్వాసము:-** ఇది దాక్షారామ మహత్మ్యాన్ని భీమనాథుని మహత్మ్యాన్ని ప్రత్యేకంగా పేర్కొనటం జరిగింది. దక్షాధ్వర ధ్వంసమున సుదర్శనాయుధుడు కోలుపోయిన చక్రాన్ని మరల పొందగోరి అను దినము సహస్రకమలాలతో శివుని పూజించుట, ఒకనాడొక కమలం కొరవడగా తన నేత్రమును గొనగోరదీసి యర్పించుట, పరమేశ్వరుడాతని భక్తికి సంతసించి తిరిగి చక్రాన్ని ఇచ్చుటయు చిత్రితమైంది. ఇది ఇందలి ప్రధాన కథా వస్తువు. వెనుకటి ఆశ్వాసాలలో వర్ణింపబడని మరికొన్ని దాక్షారామ తీర్థ దైవతముల ప్రశస్తి ఉగ్గడింపబడింది.

ఇట్లు ఈ ఆరు ఆశ్వాసాలు సముచిత కథా వస్తు సముపేతములై సంస్కృత మూలము ననుసరిస్తూ అక్కడక్కడ మధుర భావ సంభార సముపేతములై ప్రబంధ లక్షణ లక్షితములై, కవితా ప్రౌఢతకు తార్కాణములై ఎసలారినవి.

## 5.3 భీమేశ్వర పురాణం - ఆంధ్రదేశమందలి కొన్ని స్థల విశేషాలు:-

5.3.1 **భీమ మండలము:-** భీమేశ్వర పురాణంలో దాక్షారామ భీమేశ్వరుడీతనికి కథా నాయకుడు. దాక్షారామము పంచారామాల్లో ఒకటి. దక్షిణకాశి యగు దాక్షారామమునకు అన్ని దిక్కులందును మూడుయోజనంబుల మేరకు ఉండిన భూమి భీమ మండలము. దీనికి తూర్పు సరిహద్దు సముద్రం. ఇది గౌతమీ నది సముద్రమున కలిసిన సంగమ ప్రదేశం. దీన్ని భైరవపాలెము సముద్రమంటారు. అచటి ఈశ్వరుడు భైరవేశ్వరుడు. దక్షిణమునకు సముద్రమే సీమ. అది వశిష్ఠా సాగర సంగమ స్థలమైన అంతర్వేది క్షేత్రము. అచటి తీర్థాధిదైవతములు నీలకంఠేశ్వరుడు, నృసింహస్వామి. పశ్చిమానకు అఖండ గౌతమి (రాజమహేంద్ర వరము) సీమ, మార్కండేయ స్వామి తదధి దైవతము. ఉత్తర దిక్కునకు మేర మూడు యోజనాలు ఈ మేర పిఠాపురానికి చేరుతుంది. నడుమ నుండెడి కుమారారామ భీమేశ్వరుడును ఈ అవధిలో చేరతాడు.

భీమ మండలములో ఎక్కడ చూచినా తటాకమే. ఎక్క చూచినా దేవాలయమే. ఎక్కడ చూచినను ఏరే. ఎక్కుడ చూచినను పూల తోటయే. ఎక్కుడ చూచినను నదియే. ఈ సమస్త భూవలయములో ధ్యానించి చూస్తే భీమమండలమెక్కడ? ఇతర మండలములెక్కడ? భీమ మండలముతో ఏ మండలములు సాటి రావనుట శ్రీనాథుని ఆంధ్ర దేశాభిమానము భీమ ఖండములోని ఈ క్రింది పద్యము నందెంతగా ప్రతిబింబించుచున్నదో పరికింపుడు.

ఆంధ్ర భూ భువన మధ్యము పుండరీకంబు,
సప్త గోదావర జలము తేనె,
బ్రహ్మ సంవేద్యాది బహు తీర్థములు రేకు
లకరులు చారు దివ్య స్థలములు,
నాళంబు లవణాబ్ధి వేలా విభాగంబు,
కల్యాణ భోగ మోక్షములు తావి,
దక్షవాటీ మహా స్థానంబు కర్ణిక,
హంసంబు భీమనాయకుడు శివుడు
గౌతమీ సింధు కౌంతేయ కణ్వ నదులు,
దుల్య భాగమునే లేరు దుమ్మి కానలు
భువన సంభావ్యమైన యీ పుణ్యభూమి
యనఘ! సంసార తాప శాంత్యౌషధంబు (3.50)

ఆర్యా! ఆంధ్ర భూమండల మధ్యము తెల్లని శత పత్ర పద్మము. సప్త గోదావర సరస్సులోగల జలము ఆ పద్మములోని మకరందము. బ్రహ్మ సంవేద్యము మున్నగు ననేక తీర్థములు ఆ పద్మానికున్న రేకులు. పవిత్రమైన పుణ్య క్షేత్రాలు కింజల్కములు. లవణ సముద్రము తామరకాడ. మంగళ కరములగు భోగ మోక్షాలే అందలి సుంగధము. దాక్షారామమే దాని మధ్యన గల దాద్దు. భమేశ్వర స్వామి వారే రాజహంస, గోదావరి, కౌంతేయ, కణ్వనది, తుల్యభాగ, ఏలేరు అను నదులు ఆ పద్మంబు చుట్టు గల శైవాలలతా సముదాయము సర్వ లోకముల చే పూజింపదగిన ఈ దేశము జనన మరణాది రూపమగు సంసారమున కలుగు ఆధ్యాత్మికము. ఆధి దైవికము, ఆధి భౌతికము అను తాపత్రయము ఉప శాంతమగుటకు ఔషధము వంటిది. ఆంధ్ర దేశాభిమాన ప్రదర్శనమునకు ఊహా వైదగ్ధ్యమునకు ఈ పద్యం ప్రథమోదాహరణం.

భీమ మండలంలో నాల్గు దిక్కుల యందున్న జల సమృద్ధ నదులెట్లున్నవో ఇందు వర్ణించాడు.

ఒక చోటఁగోటి ఫల్గుడు రాజకోటీర
విభ్రాజితోత్సంగ <u>వృద్ధ గంగ,</u>
యొక చోట ఁబీదాంబికోన్నత స్తన భరు
స్ఫాల జరిత కల్లోల <u>యేల,</u>
యొక చోటఁ జటుల నక్రకుళీర పాఠీన
తోయ గర్భాభోగ <u>తుల్యభాగ,</u>
యొక చోట నప్సరో నికర సంసేవి తాం
తరము శ్రీ <u>సప్త గోదావరంబు</u>
నమరు నాగర ఖండ సిద్ధాంత జాతి
నాగవల్లీ సమాక్రాంత పూగ ఖండ
మండితోద్యాన వాటికా ఖండ విభవ
పాత్రమగు భీమ మండలీ క్షేత్రమునకు (3.20)

నారింజ చెట్లతో, చెఱకు తోటలతో, పవిత్ర సుందరములగు జాజులతో, తమలపాకుల తేవెలు చుట్టుకొన్న పోక చెట్లతో నలంకృతములైన తోటలు చుట్టూ ఉండటం చేత భీమ మండల క్షేత్రము సర్వోన్నతమై విరాజిల్లుచున్నది. ఆ పుణ్య క్షేత్రానికి దక్షిణ దిక్కునందు కోటిపల్లి అను క్షేత్రంలో ఉన్న సోమేశ్వర స్వామి ఆలయ సమీపము నందు వృద్ధ గంగ ప్రవహిస్తున్నది. మరియొక చోట ఉత్తర దిక్కు నందు పిఠాపురంలో గల పీఠికా దేవి మహోన్నత స్తన భారాన్ని ఒరసికొని ప్రవహించటం చేత ఏలానదీ మహోత్తుంగతరంగములు శిథిలములగుచుండును. మరియొక చోట తీవ్ర వేగంతో సంచరించు మొసళ్ళు, ఎండ్రకాయలు, సొరచేపలు, నీటి లోపల ఉండటంచే పరిపూర్ణమైన తుల్యభాగయును, ఇంకొక వైపు స్నానాదులతో అప్సరసలు సేవించు జలము గల సప్త గోదావరము అమరి ఉన్నది.

ఈ భీమ మండలాన్ని భోగ మోక్ష నిలయమును చేసినది మంగళోత్సంగ యగు గౌతమీ గంగ. ఆ నదీ ప్రవాహ ప్రసారము

ఈ ప్రబంధమునందిట్లు చిత్రించినాడు.

"త్ర్యంబకాచల శిఖాగ్రంబునందు దయించి
పొదలి యార్యావర్తభూమిఁదఱిసి,
మలఁగి దండ కవనీ మధ్య భాగమున నా
ప్రస్రవణా చల ప్రస్థ మొఱసి,
పట్టిస శ్రీ వీర భద్రేశు సేవించి
తిలసోమనాథు మందిరము డాసి
యేచి యనంత భోగేశ్వర స్థానంబు
రుద్ర పాదముల పై ఁద్రోవగాఁగ
గోటి పల్లీశు కోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖ తీర్థంబు గుస్తరించి
భీమ మండలి డాపలఁబెట్టి కొనుచు
గౌతమీ గంగ లవణాబ్ధి గౌఁగలించె (3.21)

గోదావరీ నది జననము మొదలు సాగరంలో కలిసేంత వరకు గల విశేషాలు పైన వివరింపబడ్డవి.

గోదావరీ నది త్ర్యంబకాచల శిఖరాగ్ర మందు జన్మించింది. క్రమంగా అభివృద్ధి చెంది ఆర్యావర్తము సమీపించింది. అటు నుండి తిరిగి దండకారణ్య మధ్య భాగము నందు గల పాపి కొండలను ఒరసికొంటూ ప్రవహించింది. తరువాత పత్తి సీమలో పర్వతముపైన గల శ్రీ వీరభద్రస్వామిని సేవించింది. అనంతరం తిల సోమనాథ స్వామి వారి ఆలయాన్ని సమీపించింది. అనంత భోగేశ్వర స్వామి దేవళము కడకు విజృంభించి వచ్చింది. అక్కడి నుండి రుద్ర పాదాల సమీపము తరువాత త్రోవగా ప్రవహించి కోటిపల్లి శివదేవుని మృదు పాదాలకు మ్రొక్కింది. కుండలాముఖ తీర్థములో గల కుండలేశ్వరుని సేవించింది. తుదకు భీమ మండలము ప్రక్కగా వెళ్ళి సముద్రాన్ని కౌగలించుకొన్నది.

గౌతమీ నది సప్త శాఖలు కలదై సముద్ర గామియైంది.

"తుల్యాత్రేయీ భరద్వాజీ గౌతమీ వృద్ధ గౌతమీ
కౌశికీచవసిష్ఠా చ సప్త శాఖాః ప్రకీర్తితాః"

1. తుల్య, 2. ఆత్రేయ, 3. భరద్వాజ, 4. గౌతమి, 5. వృద్ధ గౌతమీ, 6. కౌశికి, 7. వసిష్ఠ.

ఈ సప్త గోదావరీ శాఖా మధ్యప్రదేశమెల్లప్పుడూ సకల కళ్యాణ సమృద్ధమై వెలయుచుండును.

అగస్త్యుడు వ్యాసునకు భీమ మండలిలోని ప్రసిద్ధమైన పుణ్య క్షేత్రాలను ఆకాశమున నుండి కాన్పింప చేయు ప్రకరణంలో తత్తన్మహాత్యము ఎట్టిదో ఈ విధంగా తెల్పాడు.

మునీంద్రా! అదే పట్టిసమను పుణ్య క్షేత్రం. ఆ ప్రదేశంలో శశిరేఖ శిరస్సునందు గల వీర భద్రేశ్వర స్వామి ఉన్నాడు. అదియే పద్మాద్రి. దాని పైన మార్కండేయ మహర్షికి ఇలవేల్పగు శివుడు పూర్వము వెలసెను. అదిగో అదే కుమారారామము. ఆ భవన సముదాయమే చాళుక్య భీమేశ్వరస్వామి ఆలయము. అదియే కుక్కుటేశ్వరము. దానికి సమీపమందలి భవనమే హుంకారిణీ దేవి సభా భవనము. పల్వెల పట్టణంలోని కొప్పు లింగ రూపుడగు ఆ పరమేశ్వరుడే మా కుల దైవము. సప్త గోదావరీ సాగర సంగంలో గల సంగమేశ్వర స్వామి ఆయనయే. అదియే కుండలా ముఖము.

"అదెసంవేద్యము, కోటిపల్లి యదె, దక్షారామమన్పట్టణం
బదె, యభ్రంకష సౌధ కూట ఘనహేలావాస, ముచ్ఛ్రాయసం
పద, సొంపారెడు భీమ లింగము, మహా ప్రసాద భూమీ ధరం
బిదె, సప్తర్షినదీ ప్రవాహమిదె, సంవీక్షింపుమేకాగ్రతన్" (3.54)

వ్యాస మహర్షీ అటు చూడుము. అదియే గౌతమీ సాగర సంగము సమీపాన గల <u>బ్రహ్మ సంవేద్యమను</u> క్షేత్రం. మరియొక దెస చూడుము అదియే <u>సోమేశ్వర</u> నిలయమగు <u>కోటిపల్లి</u>. అదిగో అదియే <u>దాక్షారామమను</u> పట్టణము. అచ్చటి ఆలయాల్లో మిక్కిలి ఎత్తైన భీమేశ్వర లింగము విలసిల్లుచున్నది. ఆ దేవాలయము గల పర్వతము ఇదిగో! ఇదియే <u>సప్త గోదావరీ</u> ప్రవాహము.

5.3.2 **పీఠికాపురము:-** ఈ భీమ మండలికి ఉత్తర దిక్కున ఏలానది ఉన్నది. దీనినిప్పుడు 'ఏలేరు' అంటారు. వింధ్య పర్వతానికి దక్షిణంగా ఉండి, మరి వరి పంటలతో కొబ్బరి తోటలతో, అరటి తోటలతో కళ కళ లాడేది, కుంతీ మాధవ స్వామికి, హుంకారిణీ దేవికి, పీఠాంబికకు, హేలా దేవికి నిలయమైనదియునైనది పిఠాపురము. వ్యాస మహర్షి పిఠాపుర శృంగాటకము నందు బంగారు మధుపాత్ర, మాదీ ఫలము, డాలు, ఇనుప దండము చేతుల యందు కల విష్ణుపత్నియైన పీఠికాంబికకు నమస్కరించాడు.

ఈ పీఠికాపురమొక దివ్య క్షేత్రము. ఇక్కడ కుక్కుటేశ్వరుడు, కుంతీ మాధవ స్వామి ప్రధాన దేవతలు. కుక్కుటేశ్వరుని ఆలయానికి ఎదుట నున్న కొలనికి 'పాదగయ' అని పేరు. గంగా తీరముననుండిన గయను గయా శీర్షమనియు, దీనిని పాదగయ అనియు అంటారు. ఇతి హుంకారిణీ శక్తి పీఠము. హుంకారిణీ శక్తి పీఠము ఈనాడు కానరాదు. కాని పీఠికాపురాన్ని గూర్చి శ్రీనాథుడిట్లు వర్ణించాడు.

అదె <u>కుక్కుటేశ్వరం</u>బయ్యు పొంతము మేడ
    <u>హుంకారిణీ</u> దేవి యోల గంబు
ఏ పట్టణము మ్రోల <u>నేలేరు</u> ప్రవహించు
    బృథవికి ముత్యాల పేరువోలె
మున్నూట యఱు వది మూర్తి భేదములతో
    విహరించునే వీట వేల్పు పిండు

<u>పీఠాంబ</u> చెలి యోగ పీఠి హ్రాంకృతి దుర్గ

నవిచి కాపుండు నేనగరి కెలన

<u>కుంతీ</u> మహాదేవి కూర్మి మేనల్లుడు

<u>మాథవుం</u>డే వీట మరగినాడు

పెద్ద గవనులనే పుట భేదనమున్

నెలమి నిలుచుండు క్రీడా విహీన జఘను ।

డట్టి పిఠాపురముఁజేర నరుగుతెంచె

బరమ శైవుడు శ్రీ పరుశర సుతుండు ॥

పీఠికా పుర సమీప ప్రాంతాన ఏలేటి కాల్వల సొబగునుచూస్తే నిజానికవి పుడమికి ముత్యాల హారంలాగా ఉంటుంది. ఆ పట్టణ పరిసరాలు అనేక వృక్ష వాటికా సముపేతమై చూచు వారికి విరాళి గొలుపు చుంటుంది. ఆ పట్టణంలోని కుక్కుటేశ్వరాలయంలోని కాల భైరవ విగ్రహం చూచే వారికి అది సిగ్గును కలిగిస్తున్నది. ఆ విగ్రహరూపాన్ని శ్రీనాథుడు పై విధంగా వర్ణించెను.

5.3.3 **కుమారారామము:-** పిఠాపురం తరువాత నాలుగు క్రోశముల దూరంలో కుమారారామము ఉంది. అచటి ప్రధాన దైవతము కుమారారామ భీమేశ్వరుడు. విష్ణువు రాజ నారాయణ స్వామి. ఈ ఆలయాలు రెండూ సామర్లకోట రైలు స్టేషనునకు వెనుక భాగమునందున్నవి. ఇవి పురాతనములైనవి.

ఈ కుమారా రామమునందలి భీమేశ్వరాలయానికి దాక్షారామ భీమేశ్వరాలయానికి ప్రాకారాదులను నిర్మింప చేసినవాడు చాళుక్య భీముడు. కాబట్టి ఈ ఆలయాలు రెండూ ప్రాకారావరణాది నిర్మాణము లన్నింటి యందును సర్వ విషయములందును సరిపోలి యున్నవి. ఆలయములకుపయోగించిన శిలలు, శిల్పులు, శిల్పములు అన్నియు ఒకటే. భేదమించుకయు కానరాదు. ఈ కుమారారామమును గురించి శ్రీనాథుడు అచట వీచిన వాయువులు కూడా వింతగా ఉంటవని అచటి వాయువుల చల్లదనాన్ని గూర్చి ఇట్లు వర్ణించాడు.

కొమరేటి కల్యాణ కమల షండంబుల

సౌరభ్య భారంబు సంతరించి

నారికేళాటవీ నవ పుష్పకు హాళికా

వితతి కన్నె టీకంబు వీడు కొలిపి

యప్సరః కాంతా విహార హాటక హర్మ్య

శశికాంతమణి గవాక్షముల దూటి

భీమనాయక దేవు పేరురంబున గ్రాలు

భుజగ హారములకు భుక్తి వెట్టి

రాజ నారాయణ స్వామి రమ్య భవన

తారక్య కేతన పతికి నర్తనము గఱపి

పొలసె నధ్వ పరిశ్రాంతి పొడవడంగ

మౌని వరుపైఁ గుమారవనా నిలములు (2.62)

వ్యాసుడు కుమార రామాన్ని చేరేటప్పటికి అక్కడ వీచిన గాలులు అతని మార్గాయాసాన్ని పోగొట్టాయి. అంతేగాక అక్కడ ఆ గాలులు ఎంతో మందికి ఆహ్లాదాన్ని కలిగించాయి. ఏ విధంగానంటే కొమరేటి పద్మాల వాసనలను పోగు చేసికొని, కొబ్బరి పోక తోటల క్రొత్తపూల కన్నెటికాన్ని వీడ్కోలు చెప్పి, దేవదాసీ గృహముల కిటికీల యందు దూరి, భీమేశ్వరుని రొమ్ము పై కల సర్పాలకు ఆహారం పెట్టి, రాజనారాయణ స్వామి ఆలయ ధ్వజ స్తంభము పై నున్న గరుడునకు నాట్యం నేర్పి దారి బడలికపోయేటట్లుగా వ్యాసుని పై గాలులు వీచాయి.

కుమారారామానికి స్కందారామమను పేరు కూడా ఉంది. చాళుక్య భీమునిచే అభివృద్ధి చేయబడటం చేత చాళుక్య భీమవరము అను పేరు కూడా ఏర్పడింది. కుమారారామము పంచారామాలలో ఒకటి.

**పంచారామములు:-**

1. **అమరారామము:-** గుంటూరు జిల్లాలో గుంటూరునకు 35 కి.మీ. దూరంలో ఉన్న అమరావతి అనే పట్టణంలో ఉంది. దైవము పేరు అమరేశ్వరుడు. ఇక్కడ లింగము 15 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇది ఆరామాలలో మొదటిది. అందుకే ఆదిమారామము, ప్రథమారామము అని కూడా అంటారు.
2. **దాక్షారామము:-** తూర్పు గోదావరి జిల్లాలో రామచంద్రా పురానికి 5 కి.మీ. దూరంలో నున్నది. దైవము పేరు భీమేశ్వరుడు. లింగము మూల పీఠము మీద 8 అడుగుల ఎత్తు ఉంటుంది.
3. **కుమారారామము:-** తూర్పు గోదావరి జిల్లాలోని సామర్లకోటలో ఉన్నది. దైవము పేరు భీమేశ్వరుడు. లింగము 18 అడుగుల ఎత్తు ఉంటుంది.
4. **క్షీరారామము:-** పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురమునకు 8 కి.మీ. దూరంలో ఉన్న పాలకొల్లు అను ఊరి యందున్నది. దైవము పేరు క్షీరా రామ లింగేశ్వరుడు. లింగము ఎత్తు పీఠము నుండి 2 అడుగులు ఉంటుంది.
5. **సోమారామము:-** పశ్చిమ గోదావరి జిల్లాలోని గునుపూడి భీమవరము నందున్నది. భీమవరము ఇప్పుడు పట్టణమైంది. దైవము పేరు సోమేశ్వరుడు. లింగము 2 అడుగుల ఎత్తు ఉండును. ఈ ఆరామానికి ప్రాచ్యారామము అనే పేరు కూడా కలదు.

ఈ ఆరామాల ఉత్పత్తి భీమేశ్వర పురాణంలో నిరూపింపబడింది. ఇవన్నీ ప్రఖ్యాతములైన ఈశ్వర క్షేత్రాలు.

5.3.4 **సర్పపురము:-** కుమారారామానికి రెండు క్రోసుల దూరంలో సర్పవరం ఉంది. అది కేవలం విష్ణు క్షేత్రం. అచటి దేవత 'భావనారాయణ స్వామి'. తీర్థము నారద కుండము, దాన్ని త్రిలింగ భూమి వైకుంఠమును చేసి శ్రీనాథుడిట్లు వర్ణించాడు.

కాంచెన్ సర్ప పురాభి ధానముఃద్రిలింగ క్షోణి వైకుంఠమున్
ముంచెన్ నారద కుండి కాజలములన్ మోదం బుతో దేహమున్
జించెన్ గాశివియోగ దుఃఖము మహా క్షేత్రంబువీక్షించి ద
ర్శించెన్ సన్ముని లోచనోత్సవముగా శ్రీ భావనారాయణున్ (2.65)

వ్యాసుడు తెలుగు దేశమందలి వైకుంఠమైన సర్పవరాన్ని చూచాడు. నారద కుండము నందు స్నానము చేశాడు. ఈ క్షేత్రాన్ని చూచి కాశీ వియోగ దుఃఖాన్ని పోగొట్టుకున్నాడు. శ్రీ భావనారాయణ స్వామిని కనుల పండువుగా దర్శించాడు. సర్ప పురము అనేది ప్రాచీనమైన పేరు. ప్రస్తుతము దీని పేరు సర్పవరము. ఇది తూర్పు గోదావరి జిల్లా యందలి కాకినాడకు 5 కి.మీ. దూరమునందున్నది. సర్పవరమునకు సర్పనగరము అని కూడా నామాంతరం ఉంది. ఈ భావ నారాయణ స్వామి ఆలయమునకు ఎదురుగనున్న కొలనికి 'నారద కుండము' అని పేరు. ఇచటి వైష్ణవులు పెక్కు రాస్వామి నాశ్రయించిన వారు నేటికిని కలరు. ఈ క్షేత్రాన్ని వ్యాసుడు దర్శించి ఆ స్వామికి వివిధ భక్ష్య భోజ్యములతో

శనివారోత్సవము నెఱపెనట. శనివారోత్సవములో శ్రీనాథుడు తనకు ప్రియమైన పిండి వంటలను, వ్యాసునిచే భావనారాయణునకు పెట్టించాడు. ఈనాడు ఈ ప్రాంతాన్ని కోనసీమయని వ్యవహరిస్తారు.

**తుల్యభాగా నదీ తీర దేవతలు:-** సర్వ వరం నుండి బయలుదేరిన వ్యాసుడు తుల్య భాగా తీర సంస్థితులై జ్యోతిర్లింగ స్వరూపులయిన వాతాపీశ్వరుని, ఇల్వలేశ్వరుని, సంగమేశ్వరుని చూచారు. రామచంద్రపురము తాలూకాలోని తాపేశ్వరము ఏడిద, మండ పేట అను గ్రామాల నడుమ నున్న శివుడు సంగమేశ్వరుడు. తాపేశ్వరము నందలి శివ లింగము వాతాపీశ్వరుడు, ఇప్పనపాడు నందలి శివుడు ఇల్వలేశ్వరుడు. గౌతమి నదియు, తల్య భాగా నదియు సంగమించిన చోట నెలకొనినవాడు కావున సంగమేశ్వరుడయినాడు. ఈయనయే గౌతమి నదీ వాస్సంగమేశానుడు. తుల్య భాగా తీరమున సాంపరాయణ గ్రామము చెంత కల ముక్తేశ్వరుని వ్యాసుడు దర్శించాడు. ఈ గ్రామామునకు ప్రస్తుత నామము 'సంపర'. ఇది తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడకు సమీపమునందున్నది. వ్యాస మహర్షి ప్రాతః కాలమున దాక్షారామానికి బయలుదేరి వెళ్తూ ఓంక్రియా నగర మార్గ మధ్యంలో అగస్త్యున్ని ఆయన భార్యయైన లోపాముద్రను దూరంగా చూస్తాడు. ఓంక్రియా నగరము అన్నది పాత పేరు. దీని ప్రస్తుత నామము ఓదూరు. ఇది తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురానికి సమీపంలో ఉంది. తరువాత వ్యాసుడు అగస్త్యుడు తుల్యభాగ తీరంలో మారేడు తోటలో చల్లని రాళ్ళ పై కూర్చుండి కొంచెం సేపు ఇష్టములైన విషయ సంభాషణములతో కాలం గడిపారు.

5.3.5 **దక్షారామము:-** భీమేశ్వర పురాణంలో శ్రీనాథుడు ప్రధానంగా కొనియాడింది భీమ నాయకుని మహిమను గురించి. ఆ భీమ నాయకుడు నెలకొనిన దాక్షారామము మహిమను కూడా సవిశేషంగానే చిత్రించాడు.

దక్షారామ నగరము నందు ఏ వైపు చూచినా దేవతలు, మునులు, ఇంద్రాది దిక్పాలకులు, కొంగ్రొత్త శివ లింగ మూర్తులు, నికుంభుడు, కుంభోదరుడు, తండువు, భృగిరిటి మొదలగు శంకర కింకరులైన ప్రమథ గణ నాయకులును, హూహూ, హాహాయను గంధర్వులును ప్రకాశిస్తూ కన్పిస్తున్నారు. దక్షారామము పశ్చిమ దిక్కున గోగులమ్మ, ఉత్తరాన మండతల్లి, తూర్పు దిక్కున నూకాంబ, దక్షిణపు సీమలో ఘట్టాంబికయు ఉన్నట్లు శ్రీనాథుడు వర్ణించాడు. పేరులు సరిగా తెలియరాకున్నా, నేటికిని నాలుగ దిక్కులందు గ్రామ దేవతలు నిలిచి ఉన్నారు.

భారతదేశమందలి అష్టాదశ యోగ పీఠాల్లో మాణిక్యాంబికా శక్తి పీఠమొకటి. ఆ మాణిక్యాంబిక దక్షారామ భీమేశ్వరుని సన్నిధిని సర్వ శృంగార యుతయై ప్రేమతో వెలసి యుండి సకల కళ్యాణ ధాత్రియై ఉండెను. ఈ మాణిక్యాంబిక భీమేశ్వరుని యొద్ద వెలసిన విషయాన్ని గూర్చిన ఐతిహ్య మొకటి మాణిక్యాంబా దండకమనే పేరుతో ఆ ప్రాంతాన నెలకొని ఉన్నది.

దక్షారామ భీమేశ్వరుని సన్నిధిని వెలయునట్టి తీర్థము సప్త గోదావరము. త్రిపురాసుర సంహారానంతరం పరమేశ్వరుడు దక్షారామంలో శివ సన్నిధానము సేయుటచే భీమేశ్వరుడు ఉత్తమ దైవతముగను, తత్సన్నధిచే సప్త గోదావరముత్తమ తీర్థరాజంగాను వన్నెకెక్కింది. ఈ రెండిటిచే దక్షారామము దక్షిణ కాశియైంది. భీమేశ్వరుని కన్న గొప్ప దైవం, దక్షారామము కంటె గొప్ప క్షేత్రం, సప్త గోదావరము కంటె గొప్ప తీర్థం లోకంలోనే లేదు.

పంద్రెండు క్షేత్రములనెడి వికసించిన రేకులతో కూడిన దక్షారామమే ఎఱ్ఱని తామర పూవు. సప్త గోదావర ప్రవాహమే అందలి మకరందము. దాని మధ్యనున్న శ్రీ భీమ నాయక స్వామి వారే రాజహంస. ఈ క్షేత్రమున్న తావులందెల్ల ఒక్కొక్క తీర్థముండేది. నేటికిని కొన్ని తీర్థాలు కలవు. కొన్ని లోపించినవి.

1. **ఇంద్రేశ తీర్థము:-** ఇది భీమనాథుని ఆలయానికి ఎదురుగా తూర్పు దిక్కునందున్న సప్త గోదావర తీర్థంలో కలిసి ఉంది. ఒడ్డున ఇంద్రేశ్వరుడు కలడు. ఈ ఇంద్రేశ్వరునకు ఆలయం కూడా కలదు.

2. **సిద్ధేశ్వర తీర్థము:-** ఈ తీర్థమున సప్త గోదావరాంతర్భూతం. తీర్థాధిదేవత సిద్ధేశ్వరుడు. దక్షుడు యజ్ఞం చేయునపుడిది ప్రాగ్వంశమున్న చోటు.

3. **యోగీశ్వరము:-** ఈశ్వరుడు యోగీశ్వరుడు.

4. **యమేశ్వర తీర్థము:-** ఇచటి లింగం యమేశ్వర లింగం. ఇది దక్షిణ దిక్కునందున్నది. లింగము తీర్థము రెండును కలవు. దీనికే యజ్ఞ కుండము అని పేరు.

5. **కాళేశ్వర తీర్థము:-** ఇచటి ఈశ్వరుడు కాళేశ్వరుడు.

6. **వీరభద్రేశ తీర్థము:-** ఈశ్వరుడు వీర భద్రుడు.

7. **బ్రహ్మేశ తీర్థము:-** ఈశ్వరుడు బ్రహ్మేశ్వరుడు.

8. **కుక్కుటేశ తీర్థము:-** లింగము కుక్కటేశ్వరము.

9. **కపాలేశ్వర తీర్థము:-** కపాలేశ్వరు డధిదేవత.

10. **సోమనాథేశ్వర తీర్థము:-** ఈశ్వరుడు సోమనాథుడు.

11. **మహేశ్వర తీర్థము:-** ఈశ్వరుడు మహేశ్వరుడు.

12. **రామేశ్వర తీర్థము:-** లింగము రామేశ్వర లింగము.

ఈ తీర్థములు కొన్ని సాగుబడి భూములుగా మారినాయి. లింగములు మాత్రమన్నియు నిలిచి ఉన్నాయి. నేటికిని దక్షారామము నాలుగు వైపులా కొన్ని కొలంకులు కలవు. అవి స్వచ్ఛమైన నీటి తోడను, బంగారు కమలములతోనూ చూడ ముచ్చటగా ఉన్నాయి. దక్షారామ నగరమునానుకొని సప్త గోదావరము ప్రవహిస్తున్నది. ఈ సప్త గోదావరము తీర్థ ప్రభావమున గంగానది కంటె మిన్నగా ఉన్నది.

కేవలం భగీరథుని తపస్సు వల్ల వచ్చింది గంగానది. ఒక వ్యక్తి తపస్సు మాత్రమే అందులకు కారణం. ఏడుగురు మహర్షుల తపో విశేషం వల్ల వచ్చింది సప్త గోదావరము. అనగా వారి వెంట దక్షారామమునకు వచ్చినది. అంతే కాదు సత్త్వ గుణ ప్రధానులు సప్తర్షులు. రజోగుణ ప్రధానమగు రాజ వంశ జాతుడు భగీరథుడు. ఈ కారణాల వల్ల భాగీరథి గంగ కన్న సప్తర్షి సమానీత సప్త గోదావరము సర్వోన్నతమని సారాంశము.

దక్షారామంలో భీమేశ్వర స్వామిని ప్రతిష్ఠ చేయటానికి పుణ్య గౌతమీ ప్రవాహాన్ని తీసికొని రావటానికి సప్తర్షులు గౌతమీ తీరానికి వెళ్ళారు. ఇంతలో ముహుర్తం ఆసన్నమవటం చేత భీమేశ్వరుడు స్వయం ప్రతిష్ఠితుడగు చుండుటను చూచి, సూర్యుడు ఆకాశాన్నుండి దీన్ని చూచి తాను ఆ స్వామిని ప్రతిష్ఠ చేశాడు. ఈ రీతిగా భీమనాథుడు సూర్యునిచే ప్రతిష్ఠితుడైనాడు. తర్వాత సప్తర్షులు సప్త గోదావరాన్ని తీసుకొని వచ్చి తత్పుణ్య సలిలాలచే పరమేశ్వరుని పునః ప్రతిష్ఠితుని చేశారు. సూర్య ప్రతిష్ఠితమైన లింగమునకు చుట్టునూ నాల్గు దిక్కుల సోమ ప్రతిష్ఠిత లింగాలు నెలకొని ఉండటం ఒక పరిపాటి. ఇక్కడ భీమేశ్వర లింగానికి దిక్కుల యందే కాక విదిక్కుల యందు సైతము సోమేశ్వర లింగాలు వెలసి ఉన్నాయి.

1. **దక్షా రామమునకు తూర్పున:-** కోలంక గ్రామమున సోమేశ్వరుడు ఈ గ్రామమాత్రేయీ నదీ తీరాన్ని అంటి ఉన్నది.

2. **ఆగ్నేయమున:-** దంగేరు గ్రామమున - కణ్వనదీ తీరమున

3. **దక్షిణాన:-** కోటిపల్లి సోమేశ్వరుడు - గౌతమీ తీరాన

4. **నైరృతిని:-** కోరుమిల్లి సోమేశ్వరుడు - గౌతమీ తీరాన

5. **పశ్చిమాన:-** సోమేశ్వరము సోమేశ్వరుడు. ఈతడే పులుగుర్త సోమేశ్వరుడు. తుల్య భాగా సమీపాన
6. **వాయవ్యాన:-** వెల్ల గ్రామమున సోమేశ్వరుడు
7. **ఉత్తరాన:-** చొల్లంగి సోమేశ్వరుడు. తుల్యా సాగర సంగమ స్థలమున
8. **ఈశాన్యమున:-** పటవల సోమేశ్వరుడు. ఆత్రేయా సాగర సంగమ స్థల సమీపాన

ఈ సోమేశ్వర లింగాలన్నియు దక్షా రామానికి ఒక యోజనము మేరలో ఉన్నవి.

దక్షా రామ క్షేత్రాన్ని ఆనికొని ఉన్న సప్త గోదావరమను నదిలో అఘమర్షణ స్నానం చేసి, త్ర్యాయుష మంత్రాలతో పవిత్రీకృతము చేయబడ్డ విబూదితో ఫాల భాగాన త్రిపుండ్రమును దిద్ది తీర్చుకొని ముఖ ద్వారాన్ని దాటి దిగువనున్న నందీశ్వరాలయాన్ని పిమ్మట ఆ పై నున్న విష్ణుమూర్తి ఆలయాన్ని చూచి జేగురు రాళ్ళ మెట్ల వరుస మధ్యగా కన్పించే త్రోవన ఎత్తైన మేడను ఎక్కి శుభంకరుడు పాతాళము నుండి ఉద్భవించిన వాడునైన శ్రీ భీమేశ్వర స్వామిని సేవించిన పరమ శివ భక్తునకు ముక్తి కలుగుట విశేషము.

భీమేశ్వర స్వామిని తత్పరివార దేవతలను దర్శించే క్రమాన్ని శ్రీనాథుడిట్లా పేర్కొన్నాడు.

అగస్త్య వ్యాసులు హిమవంతుని ప్రియ పుత్రికయు, భీమేశ్వర స్వామి అంతఃపుర స్త్రీ యగు పరమేశ్వరిని సేవించారు. తరువాత కుమార స్వామి అన్నయు, గజముఖుడగు వినాయకుని సేవించారు. మోక్ష స్థానమును, సర్వ మంగళయునగు దుర్గాదేవికి నమస్కారం చేశారు. దిగంబరుడు అభీష్ట ప్రదాతయగు వటుక భైరవ స్వామిని దర్శించారు. బ్రహ్మను పూజించారు. విష్ణువును దర్శించారు. ఇతర పరివార దేవతా సమూహానికి నమస్కారాలర్పించారు. క్రింది భాగాన రెండవ ప్రాకారం లోపల నెలకొని యున్న పరివార దేవతలు వీరు.

తూర్పు ద్వారం నుండి తొలుతటి ప్రాకారాన్ని ప్రవేశించేటప్పుడు ఉత్తరాన కొంత దూరంలో కాల భైరవాలయముంది. దానికి వెనుక ఒక బావి కలదు. దీనికి రుద్ర గంగ యని పేరు. అదే విధంగా దక్షిణాన కూడా ఒక బావి ఉండాలి. అది కొంత కాలం లోపించింది. దానికి శివ గంగ అని పేరు. దీన్ని తరువాతి కాలంలో పునరుద్ధాటనం చేసినట్లు ఐతిహ్యముంది. వాని మాహాత్మ్యమీ విధంగా వర్ణింపబడింది.

"ఘనతి శివ గంగయును రుద్ర గంగ యనగ\
గూపములు రెండు దక్ష వాటీ పురమున\
మొదలియది పాపముల నెల్ల నుదుక జాలు\
నొకటి పితృ దేవతలఁ దృప్తి మనుపనోపు" (6.17)

దక్షారామంలో శివ గంగ - రుద్ర గంగ అనే పేర్లతో రెండు గొప్ప బావులు కలవని, అందు శివ గంగ సమస్త పాపాలను పోగొడితే, రుద్ర గంగ పితృ దేవతలను తృప్తి పరచగలదట.

దక్షారామంలో భీమేశ్వరుని సాక్షాత్కారంతో పాటు, సకల దేవతా బృందము, మహర్షి వర్గము, వివిధ తీర్థకదంబము సమకూడి ఉండటంచే దీని మహాత్మ్యము ఇతర తీర్థాల కంటె గొనియాడదగిందని శ్రీనాథుడు పేర్కొన్నాడు.

కార్తీక శుద్ధ పౌర్ణమి నాడు భీమనాథుని ఆలయము ఎదుట వెలిగెడి జ్వాలా తోరణము క్రింది నుండి ఒకమారు దూఱితే అతనికి ప్రాణ సమయంలో యమపురి ద్వారాన్ని ప్రవేశించే పని లేదని చెప్పబడింది.

"కార్తికిక వేళ భీమ శంకరుని నగర\
దూఱు నెవ్వాడు చిచ్చుఱ తోరణంబు

నతడు దూఱడు ప్రాణ నిర్యాణ వేళ
ఘోర యమ పట్టణ ద్వార తోరణంబు" (3.25)

భీమేశ్వర పురాణంలో గల ముఖ్యమైన స్థల విశేషాలను పేర్కొనటం జరిగింది. మిగిలిన విశేషాల కొరకు భీమ ఖండాన్ని చదవండి.

## 5.4 భీమేశ్వర పురాణం - కావ్యత్వము:-

5.4.1 **వ్యాస నిష్కాసనము:-** ఒక దృశ్యాన్ని పాఠకులకు కన్నుల ఎదుట సాక్షాత్కరించేటట్లు చిత్రించటం కవితా శిల్పానికి ఒక పరాకాష్ఠ. శ్రీనాథుడొక్కకచో అట్టి శిల్పాన్ని అద్భుతంగా చిత్రించగల దిట్ట.

వ్యాస భట్టారకుని మూర్తి దర్శనాన్ని శ్రీనాథుడిట్లా చెప్తాడు.

వ్యాసుడు మూడు రేకలు తేరునట్లు నుదుట భస్మాన్ని ధరించినవాడు. మెడలో రుద్రాక్ష మాలికలు తాల్చినాడు. దేహమున యజ్ఞోపవీత, కృష్ణా జినములు అమరించినాడు. శిరమున చిగురుటాకులను పోలిన జడలు ధరించాడు. చేతిలో ఒక తామ్ర పాత్రను, వ్రేళ్లయందొక దర్భ పవిత్రాన్ని మూపు నందు నైష్ఠిక బ్రహ్మ చర్య సూచకమగు పాలాశ దండాన్ని శరీరం వర్షాకాల మేఘాన్ని పోలిన నీలిమతో కూడి సాల వృక్షం లాగా ఎత్తుగా ఉన్నాడు. ఆతని ఆకారమే అతడు పరమ భాగవతుడనియు, మహేశ్వరాచార పరాయణుడనియు, మౌనులలో అగ్రగణ్యుడనీ తెలుపుచున్నది. ఇక్కడ వ్యాసుణ్ణి మన కళ్ళ ఎదుట సాక్షాత్కరిస్తున్నట్లుగా కవి వర్ణించాడు.

ఇక్కడ అగస్త్య, వ్యాసులు కలిసికొని కుశల ప్రశ్నలు వేసుకొని ఒకరి పై ఒకరు చూపుకొను అవ్యాజమైన ప్రేమ, సంభాషణా చాతుర్యము ఎంతో ముచ్చట గొల్పుచున్నది. వ్యాసునకు కాశి పై కోపం కలగడానికి గల కారణాన్ని వర్ణించినప్పటి గద్యము రసానుగుణమైన శైలిలో నడిచింది. శైలిలోని వేగమే కోపానికి కూడ ఒక వేగాన్ని కూర్చునదిగా సిద్ధమైంది. శిష్యులు భయభీతులగు నటుల అతి వేగంతో చేతితో దాల్చిన భిక్షా పాత్రాన్ని నూఱు వ్రక్కలగునట్లు రాతి మీద నడి వీధిలో చితుక కొట్టెనట. వ్యాసునిరౌద్రోద్రేకము తదనుగుణమైన బంధంలో నడిచింది.

శా॥ "కుక్షిప్రోద్భవ నిష్ఠు రక్షు ధిత దుష్కోధాంధకారంబునన్
జక్షుల్ రెండును జిమ్మ చీకటులుగా సరంభశాంభ ద్గతిం
బ్రేక్షచ్ఛాత్రులు భీతిఁబొందఁగడు నుద్రేకించి హట్టంబునన్
భిక్షాపాత్రము ఱాతి మీఁద శతధా భిన్నంబుగా వైచితిన్" (2.102)

రౌద్ర రస స్ఫూర్తికి సరిపడ్డ వృత్తము, ఆరభటీ వృత్తి, ఓజో గుణము, తదనుగుణమైన ద్వితీయ చతుర్థ వర్ణ సంయోజనముతో కూడిన సమాసాలు క్షకార ప్రాసము ఈ పద్యంలో అమరి ఉన్నవి. పద్యం పూర్తయ్యే సరికి వ్యాసుడు భిక్షా పాత్రను నిశ్చయంగా పగుల కొట్టినాడనిపించుచున్నది.

ఆ సమయంలో ప్రత్యక్షమైన విశాలాక్షిని శ్రీనాథుడు వచన శైలిలో అతి విచిత్రంగా చిత్రించాడు. ఆమెను చూచేటప్పటికి వ్యాసునికే కాక పాఠకులకు సైతం భయ సంభ్రమములు కలిగాయి. విశాలాక్షి యొక్క వేణీ భరమును, ఉరోజాల తీరును, కంకణ క్వాణము, అందియల రవళి, మట్టెల మ్రోతను శ్రీనాథుడు రామణీయకముగా అందంగా చిత్రించాడు.

అన్నపూర్ణాదేవి వ్యాసుడ్ని భిక్ష తీసుకోవటానికి రమ్మనమని ఆహ్వానించగా ఆమె దాక్షిణ్యానికి వ్యాసుని హృదయం కరిగిపోయింది. విశాలాక్షికి మరింత జాలి కలిగేటట్లు వ్యాసుడు ప్రసంగించాడు.

"తల్లీ! యిన్ని దినాలకేనియు సుధా ధారా రసస్యందియై
యుల్లంబున్ సుఖి యింపఁజేయు పలుకెట్లో వింటి మిప్పీటిలో
బెల్లా కొన్నకతాన నేనొకఁడనే భిక్షానకు న్వఉత్తనో
యెల్లన్ శిష్యులఁ గొంచువత్తునో నిజం బేర్పాటుగా జెప్పుమా!" (2.120)

అన్న మాటలకు ఆ జగన్మాత హృదయం ద్రవించింది. శిష్యుల నందరను తీసుకొని రమ్మని చెప్పింది. ఇక్కడ భోజన ప్రకరణానంతా శ్రీనాథుడు చాల వింతగను సంప్రదాయానుగతంగా నడిపించాడు.

అరటి ఆకులలో భోజనం వడ్డించింది. ఆ అరటి ఆకులు ఎట్టివో తెలుగుదనముట్టిపడేటట్లు వర్ణించాడు శ్రీనాథుడు.

"మొగి విరిసి కఱకు గూడక
పగులక వెడలుపును నిడుపు బసిమియుఁగల లేఁ
జిగుర రటాకులు పెట్టిరి
దిగది గనద్దేవి యాజ్ఞ దివ్య పురంధ్రుల్" (2.129)

పదార్థముల కంటె ఆకులెంతయు ఆకర్షకంగా ఉన్నవి. ఇట్టి అరటియాకు నందు భుజించుట తృప్తికరమనెడి కవి ఊహను మనకీ పద్యం చెప్తున్నది. ఇందు శ్రీనాథునకు గల భోజన ప్రియత్వమును, ఆతనినాడు ఆంధ్ర దేశంలో ఉత్తమ భోజనావసరములందు ఉపయోగించు పదార్థాలు మనకు తెలుస్తున్నవి.

"పప్పును బిండి వంటలును బాయ సముల్" (2.140) అను పద్యంలో తెలుగు నాటి పిండి వంటలను తెలుగు నుడికారంతో తెల్పినాడు. అట్లే "ద్రాక్షా పానక ఖండ శర్కలతో రంభా ఫలశ్రేణితో" (2.142) అను పద్యంలో సంస్కృత శైలిలో నడచిన పదార్థ వర్ణన చేయబడింది.

పిమ్మట విశాలాక్షీ విశ్వేశ్వరులు వ్యాసుని ఎదుట సాక్షాత్కరించినప్పటి మూర్తి వైభవము అందరి చిత్తాన్ని ఆకర్షించింది. ఇరువురకు సమానమైన భూషణాదికములను, గుణ సంపదను కల్పించి మిక్కిలి ఒయ్యారంగా రంగస్థలం మీదికి శ్రీనాథుడు ప్రవేశ పెట్టాడు. అన్నపూర్ణా దేవి పాదనూపుర ఝుళంఝుళ నాదములు ఎంతో మనోహరంగా ఉన్నవి. వారు కనబడగానే వీరి మనస్సుల్లో సంతోషం, భయము ఒక్కుమ్మడిగా కలిగాయి. కాశీ పట్టణము శివునకు భార్య కాబట్టి దాని పై అలిగి నేను శివునకు కోపపాత్రుడనైనాను. కాశి గౌరికి సపత్ని కాబట్టి దాని పై అలిగి పార్వతికి ప్రేమ పాత్రుడునయ్యానని వ్యాసుడు భావించాడు. ఇంతలో శంభుడు అకారణంగా కాశిని శపించదలచిన నన్ను శిష్యులతో వెంటనే కాశీని విడిచి వెళ్ళిపొమ్మని ఆదేశించాడు. ఇంతలో అన్నపూర్ణయే నన్ను కురణా కటాక్షంతో వీక్షించి భీమనాథుని కొలిచి మోక్షాన్ని పొందమని ఉపదేశించింది.

"వెఱవకు మోకుమార! పదివేల విధంబులనైన నిన్ను నే
మఱవ, మఱేడకుంజనుటమాని, సుఖంబున దక్షవాటికిన్
దుఱగలి, గొన్న సమ్మదముతో గమనింపుము, భీమనాయకూ
డఱ గొఱలేని వేల్పునిఖిలాభ్యుదయంబులు నీకునయ్యెడున్" (2.155)

ఈ ప్రకారం ఇతివృత్తం, కథా కథన సౌష్ఠవము, రచనలో పరిపాకము భీమేశ్వర పురాణానికి కావ్యత్వం సమకూర్చినవి.

5.4.2 **హాలాహల భక్షణము:-** భీమేశ్వర పురాణానికి కథానాయకుడు శ్రీ భీమేశ్వరమహాదేవుడు. దేవతల హితార్థం సకల లోక రక్షణార్థం అతడు గావించిన మహత్తర కృత్యాల్లో ముఖ్యంగా పేర్కొనదగినవి ఆశ్చర్యకరములైనవి రెండు కలవు. అందులో 1. హాలాహల భక్షణము, 2. త్రిపురాసుర సంహారం. వేదాల యందు కూడా ఈ ఇతివృత్తాలు వర్ణింపబడి ఉన్నాయి.

హాలాహల భక్షణానికి పూర్వము క్షీరాబ్ధి మథనము నందు కొంత వరకు విష్ణువునకు ప్రాధాన్యత కలదు. కాని త్రిపురాసుర సంహారం మాత్రం కేవలం శివుని యపదానమే. కాబట్టి శివ భక్తులందరు పరమేశ్వరుని మహిమను చెప్పేటప్పుడు ముఖ్యంగా త్రిపురాసుర సంహారాన్ని పేర్కొంటారు. త్రిపురాసుర సంహారము చేయవలసిన అవసరం ఏర్పడటానికి కారణంగా క్షీరసాగర మథనము జతకూడింది. ఆ మథన వేళ కలిగిన హాలాహలాన్ని భక్షించటము చేత పరమేశ్వరుని మహత్త్వము పరిపుష్టమై, భీమనాథునకు భీమేశ్వర నామధేయం సార్థకమైంది. ఈ విధంగా కార్యకారణ భావన సమన్వితములై ఈ రెండు కథలును చతుర్థాశ్వాసమందుండి యీ పురాణానికి కావ్యత్వాన్ని ఆపాదించి పెట్టింది.

కావ్యము నందు తప్పక ఉండాల్సినవి 1. నాయకుడు, 2. ఇతివృత్తము, 3. రసము అను ఈ మూడును. ఈ మూడిటికి సమపుష్టి జరిగినపుడే యది ఉత్తమ కావ్యమవుతుంది. ఈ మూడింటి నిర్వహణము నందే కవికి గల ప్రతిభ వ్యక్తమౌతుంది. ఈ కావ్యానికి నాయకుడు భీమనాథుడు. అతని మహిమను వ్యక్తము చేయు ఇతివృత్తములో రసవత్తరమైనది త్రిపుర విజయము. ఇచటి రసము వీరము. దానికి పుష్టిని తెచ్చినది హాలాహల భక్షణము. అప్పటి అద్భుత రసమును ఈ ప్రకారం ఇందలి చతర్థాశ్వాసం రసబంధురమై తీర్థ క్షేత్ర మహాత్మ్యముల నడుమ అవతరించి, కావ్య వస్తు విస్తారకమై విలసిల్లింది.

హాలాహల భక్షణ ఇతివృత్తాన్ని చెప్పమని మంకణ ముని కోరగా అగస్త్యుని ఆనతితో వశిష్ఠుడు మంకణ మునికి ఇట్లా చెప్పాడు.

భూమ్యాకాశాల యందు, దిక్కులన్నిటను నిండి మిక్కిలి భయాన్ని కలిగించే కాలకూట విషాన్ని భయంకరమైన రీతిలో మ్రింగాడు కాబట్టి దక్షారామ వాసి యగు పరమేశ్వరునకు భీమేశ్వరుడనే పేరు వచ్చింది. దేవతలను అమరులను చేయటానికై అమృతాన్ని ఉత్పాదించే ప్రయత్నంలో శివ కేశవులకిరువురకును సమ ప్రాధాన్య మేర్పడింది. ఇరువురి తోడ్పాటు లేకపోతే అమృతం దేవతలకు లభించేది కాదు. కాబట్టి ఈ క్షీర సాగర మథన వృత్తాంతం శివ విష్ణు మహిమలను తెలుపు వృత్తాంతము లందు రెండిటను కూడ ప్రసక్తమే అవుతుంది.

దేవేంద్రుడు ఒంటరిగా వచ్చి, దేవతల కార్య సిద్ధి కోసం శ్రీహరితో మంతనం చేసి ఇంద్రుడు సిద్ధ సంకల్పుడై తన పని రెండొవ వానికి తెలియకుండా తన శిబిరానికి వెళ్ళాడు. తరువాత శ్రీమన్నారాయణుడు దేవ దానవుల నడుమ సంధి చేయదలచి వారికిట్లా చెప్పాడు.

"<u>కుడిచి కూర్చుండి</u> మీరేల కొఱతయైన
కుమ్ములాడెదరో యన్నదమ్ములార!
గొఱ్ఱె క్రొవ్వి యు సెలగట్టెగొఱికి నట్లు
కటకటా! మీ వివేకంబు గాడుపడగ" (4.53)

ఇక్కడ 'కుడిచి కూర్చుండి' అను పద బంధము తెలుగు నుడికారము. గొఱ్ఱె క్రొవ్వి సెలగట్టె (బాణమును) గొఱికి నట్లున్న దనుట మరింత చక్కగా చెప్పబడింది. సంస్కృత సమాసాడంబరంతో నింపెడి శ్రీనాథుడు అచ్చ తెలుగు పదాల కూర్పుతో రచన సాగించటానికిది ఉదాహరణము.

క్షీర సాగర మథనం వల్లనే అమృతం సంభవిస్తుంది. ఆ మథనానికి ఆది కచ్ఛపం మూలాధారంగా, మంధర పర్వతం కవ్వంగా, శేషుడు కవ్వపు త్రాడుగా క్షీర సముద్రాన్ని చిలకవలెనని చెప్పి వీరిని ఒప్పించినాడు. మందర పర్వతంతో మధించిన సముద్ర మథన పద్ధతిని, మధించటానికి కావల్సిన సామాగ్రిని శ్రీనాథుడొక్క సీసపద్యంలో చక్కగా ప్రదర్శించినాడు. ఈ మథనము నుండి ముందుగా పుట్ట వలసింది సర్వలోక భయంకరమైన కాలకూట విషము. దాని ఆటోపము తోడనే హాలాహల ఉత్పత్తి ప్రకారం వర్ణించిన వచన రచన కొనసాగింది. ఈ వచనము అనుప్రాస బహుళమై భీభత్సరసానికి అనువైన శైలిలో సాగింది. ఈ రచనలో శబ్ద చిత్రము అధికమే ఐనప్పటికి అర్థ సౌష్ఠవపు కొఱత మాత్రం లేదు. ఆ విషాన్ని చూచి విష్ణువుతో సైతము దేవతలందరూ భయభీతులై పరమేశ్వరుని శరణుజొచ్చారు. పరమేశ్వరుడు వారికభయాన్నిచ్చాడు.

"పటుహుంకార మహాట్టహాసకలనం బాతాళ భూ స్వర్గసం
కట సన్నాహ సముద్భవంబయిన యాకాకోల కాలాగ్ని ధూ
ర్జటి హస్తాబ్జము నందు గైకొనియె నాజ్వాలాకుల క్ష్వేళమ
ప్పటి వేళన్ మద భృంగమయ్యె శశి భృత్పాణ్యబ్జ మధ్యంబునన్" (4.65)

ఆ హాలాహలం ఆవిర్భవించినపుడు మొదట భృంగాకృతిలో బయలుదేఱి క్రమంగా బ్రహ్మాండమంతా నిండిన కాలాగ్ని సన్నిభమైంది. కాని ఈశ్వరుని హుంకారంతోకూడిన అట్టహాసంతో మళ్ళా మద భృంగాకారానికే వచ్చింది.

"కటుకమగు విషము విషధర
కటకం బగునేకేలఁబూని కౌతూహలియై
ఘటికా సంసిద్ధుడు రస
ఘటిక యునుంబోలె శివుడు గుటుకున మ్రింగెన్" (4.66)

రససిద్ధిని సాధించిన యోగులు, ద్రవ రూపమయిన పాదరసాన్ని ముద్దగా చేసి, దానిని మ్రింగి జరామరణ వర్జితులవుతారు.

హాలాహలము పరమేశ్వరుని కంఠము నందే నిలిచిపోవటానికి ఈ సందర్భంలో ఒక వింత సన్నివేశం జతయైంది. కాలకూట విషం కంఠ సీమను చేరే సరికి పార్వతి శివుని కౌగిలించుకొనునెపంతో తన బాహువులను చుట్టి ఇట్లా అంటుంది.

"చుట్టి బిగించి పట్టి, పుర సూదన యీగరళాగ్ని గంధరా
ఘట్టము నంది నిల్పు, మదిగాక దిగంబడనిచ్చితేని లోఁ
బట్టున నున్న లోకముల భస్మము సేయు, వెలార్చితేని, వె
ల్పట్టున నున్న లోకముల భస్మము సేయు, నిజంబు చెప్పితిన్" (4.68)

లోకానుగ్రహార్థం మ్రింగనుద్యమించి నాడు ఈశ్వరుడు. అది గొంతు దిగితే కుక్షిలోని భువనాలన్నీ భస్మమవుతాయి. బయటికి వెడలగ్రక్కితే బాహ్య ప్రపంచం భస్మమవుతుంది. కాబట్టి రెండు విధాల భువన నాశనం తప్పదు. అందులకై గరళాన్ని గళ సీమ యందే నిలిపివేయమని సర్వలోక జనని ప్రార్థించింది. ఆమె ప్రార్థనను అంగీకరించి ఆ విషాన్ని తన గళసీమ యందే నిలిపాడు. నాటి నుండి పరమేశ్వరుడు నీలగ్రీవుడైనాడు. పిమ్మట కల్పవృక్షం, కామధేనువు, కౌస్తుభము, ఉచ్చైశ్శ్రవము, పద్మాలయ ఉత్పత్తికి ఆధారమైన పద్మము, పూర్ణ చంద్రుడు, ఆ పద్మం నుండి లక్ష్మీదేవి ఉద్భవించాయి. ఈ విషయాలనన్నింటిని శ్రీనాథుడు

"సంపూర్ణపూర్ణిమా చంద్ర బింబంబుతో" (4.95) ఒకే సీస పద్యంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. శ్రీమన్నారాయణుడు జగన్మోహినీ రూపంలో రాక్షసులను వంచించి దేవతలకు అమృతాన్ని పంచిపెట్టుట అనే విషయాల్ని,
"అంతులు మీటి మిక్కిలిగ ఔాగ తనంబున దొమ్మి చేసి" (4.96)
"నారాయణుండు మాయా నారీ రూపమున" (4.98) అను రెండు పద్యాల్లో సూక్ష్మంగా నిరూపించాడు.

ఈ ప్రకారం జగన్మోహినీ రూపాన్ని రూపాన్ని దాల్చి అమృతాన్ని హరించి, దేవతలకు పంచి పెట్టిన విష్ణు మాయను సూచన ప్రాయంగా తెలిపి దానవులు ఈ విధంగా అమృతాన్ని కోలుపోవుట త్రిపురాసుర సంహారానికి నాందిగా చిత్రించాడు.

5.4.3 **త్రిపురాసుర సంహారము:-** శంకరుడు లోక కంటకులయిన త్రిపురాసురులను పరిమార్చటానికి మహత్తర సంరంభంతో ప్రయత్నించినపుడు భూమి రథంగాను, సూర్య చంద్రులు చక్రాలు గాను, బ్రహ్మ సారధిగాను, నాలుగు వేదాలు గుఱ్ఱాలుగాను, ఓంకారం కొరడా కర్రగాను, నక్షత్ర పంక్తి జండా గాను, మేరు పర్వతం ధనస్సు గాను, ఆదిశేషుడు నారి గాను, వాయువులు బాణానికి ఱెక్కలు గాను, ప్రళయ కాలాగ్ని ములికి గాను, విష్ణువు బాణము గాను జతకూడగా, పట్టణములతో పాటు త్రిపురాసురులను సంహరించి, వారలకు ఉపాస్యమైన లింగమును, పంచ విధాలుగా విభజించి పంచారామాల యందు వెలయించుటే యీ త్రిపురాసుర సంహార మందలి ప్రధానమైన ఇతివృత్తము.

త్రిపురాసుర సంహారానికి పరమేశ్వరుడా యత్త పడటానికి కారణం త్రిపురాసురు లుద్రేకించి లోకాలకు ఉపద్రవాన్ని కలిగించటం. అట్టి ఉద్రేకం వారికి కలగటానికి మూలం నారదుడు. వారిని పరమేశ్వరుని ఆరాధింపుమని ప్రోత్సహించటం.

దేవాసురులు సముద్రాన్ని మధింపగా వెలువడ్డ అమృతాన్ని విష్ణువు దేవతలకే పంచి పెట్టి వెళ్ళిపోయిన తురవాత నారదుడు రాక్షసుల దగ్గరకు వెళ్లి వారితో

"రక్షోనాయకులార! నిర్జర వర వ్రాతంబుచేతన్ సుధా
భిక్షా పాత్రము వోయనంచు మదిలో బెగ్గిల్ల గా నేటికిన్
రక్షార్థంబు భజింప రాదె య భవున్ ద్రైలోక్య కుక్షింభరున్
దక్షారామపురాధి నాధుని సుధా ధామార్థ చూడామణిన్" (4.100)

అని ఉపదేశం చేశాడు. నారదుని మాటలను రాక్షస నాయకులంతా విన్నారు. దక్షారామాన్ని చేరారు. భక్తి తత్పరులై శ్రీ భీమేశ్వరుని సేవించారు. వారి బలాన్ని వృద్ధి చేసుకున్నారు. రాక్షసులు త్రిపురాసురులతో కలసి పట్టుదలతో, చెదరని దీక్షతో పాశుపత మతములోని నియమాలను నేర్పుతో పాటించారు. వారి మనసులు పవిత్రములైనవి. శ్రీ భీమేశ్వర స్వామిని సేవిస్తూ తపస్సు చేస్తున్నారు. లోకాలు తపిస్తున్నాయి. ఇంకా ఆ రాక్షస నాయకులు శంకరుని పంచ బ్రహ్మ షడంగ ప్రాసాద పంచాక్షరీ మంత్రాలు పఠిస్తూ మారేడు దళాలతో పూజించారు. స్థిరమైన పూనికతో వేద పురాణాల యందలి మంత్రాలతో కీర్తించారు. ఈ విధంగా భీమేశ్వర స్వామిని సేవించి ఆ దేవుని అనుగ్రహం చేత నాశం లేనిది, మిక్కిలి వృద్ధి కలది, అసాధారణమైన సంపదను పొందారు. అంతేగాక పరమేశ్వరుని ఆరాధించి వరాల్ని పొంది ఉద్రేకించి, దేవతలను హింసింప మొదలు పెట్టగా వారు భీమనాథుని రక్షింపుమని వేడుకొనే విషయంలో వారు చేసిన స్తుతి వేదాంత సారము, భక్తి రసభరితమైంది. ఇక్కడ శ్రీనాథునకు వేదాంత శాస్త్రము నందు గల పాండిత్య విశేషాలు వ్యక్తమవుతున్నాయి.

దేవతల మొర విన్న పరమేశ్వరుడు దివ్య రూపంలో ఆవిర్భవించిన రీతిని పరిశీలిస్తే భక్తి భావ భరితమైందిగా కన్పిస్తుంది. పరమేశ్వరుని యొక్క సర్వాంగ శృంగార భావాలతో కూడిన విస్తృతమైన వచనం ఇందు చిత్రింపబడింది.

తరువాత భీమనాథుడు త్రిపురాసుర సంహారానికి సిద్ధపడ్డప్పుడు స్మరణ మాత్రం చేతనే సమకూరిన సన్నాహాన్ని ఇట్లా వివరించాడు.

"జలరాశి మేఖలావల యంబు రథమయ్యె
రవియుఁ జందురుఁడుఁ జక్రంబు లైరి
శారదా జీవితేశ్వరుఁడు సారథియయ్యె
శ్రుతులు నాలుగును వారువములయ్యె
బ్రణవ మంత్రై కాక్షరము ప్రతోదంబయ్యె
దారకావీధి పతాకయయ్యె
రత్నసాను ధరాధరము ధనుర్లతయయ్యె
నాగ ప్రధానుండు నారియయ్యె
గంధవాహకంబు లేడునుగఱులు గాఁగ
వాయ కాలానల జ్వాల ములికి గాఁగ
లచ్చిచనుదోయి కుంకుమ బచ్చన యుఁగ
బాలమున్నీటి యుల్లుండు బాణమయ్యె" (4.127)

త్రిపుర సంహార సమయంలో ఇట్టి సామాగ్రి సమకూడుటను మహిమ్న స్తవము నందును పుష్పదంతుడు ఈ క్రింది శ్లోకాన్ని తెలిపినాడు.

శ్లో॥ "రథః క్షోణీయంతా శతధృతి రగేంద్రో ధనురథో
రథాంగే చంద్రార్కౌ రథ చరణ పాణిః శర ఇతి,
దిధక్షోస్తే కోఽయం త్రిపుర తృణ మాడంబర విధి
ర్విధేయైః క్రీడన్త్యో నఖలు పర తంత్రాః ప్రభాధిమః"

త్రిపురాసుర సంహారంలో విష్ణువు బాణమగుట వేదాల యందును పురాణాల యందును, శివ భక్తుల స్తవములందును అన్నిటా ఒకే విధంగా ఉంది. శ్రీనాథుడు వర్ణించే విషయంలో మాత్రం "లక్ష్మీకుచకుంకుమా లిప్తుడైన క్షీర సముద్ర జామాత యల్లుడు బాణమగుట" విశేషం.

భీమనాథుడు త్రిపురా సుర సంహారాన్ని చేయటానికై దివ్య స్యందనాన్ని ఎక్కి బయలుదేరునపుడు యాత్రా సన్నాహము రాజ వీదిలో నడిచింది. ముత్తైదువులు సేసలుచల్లుట, వేత్ర హస్తులు బరాబరి సేయుట, అంతరిక్షం నుండి దుందుభి ధ్వనులతో పుష్పవృష్టి కురియుట, ముని బృందము జయజయ ధ్వనులు చేయుట మున్నగునవి వీర రస సన్నాహానికి సరిపడునట్లు నడిచింది.

భూమి రథంగాను మేరువు ధనస్సుగాను ధరించి యుద్ధం చేసినట్లు శ్రీనాథుడు వర్ణించాడు. పర్వత రూపమైన ధనస్సుల పరమేశ్వరుడు ఎట్లా ఎక్కు పెట్టాడనే సందేహం ఎవ్వరికైనా కలుగుతుంది. వారి సంశయాన్ని తీర్చటానికి కవి ఇట్లా చెప్తున్నాడు.

ముక్కంటి అయిన శంకరుడు పార్వతీ దేవి చన్నులను అదిమేటు వంటి చేత్తో మేరు పర్వతమనేటు వంటి ధనస్సును వంచి, ఆది శేషుడను అల్లె తాటిని సాగదీసి వింటికి తగిలించి సారించాడు. కాబట్టి ఈ ప్రకారం బంగారు

కొండను వంచటంలో శ్రమ అంతగా ఉండదనుట ఎంతగానో పొసగి ఉన్నది. ఈ కల్పనలో కావ్యత్వ ముట్టిపడుచున్నది. అట్టి ధనస్సునకు నారియయిన శేషుని ఎక్కు పెట్టటంలో కూడ సున్నితమైన భావ సంపద కల్పనా సమృద్ధి ఏర్పడింది.

కాల కంఠుడు మేరు ధనుర్ధం డానికి సరిపడ్డ పన్నగాధీశుని నారిగాను, వింటిబద్దను వంచి అల్లెత్రాటిని ధనుర్దండానికి ఎక్కు పెట్టినపుడు వాసుకి శరీరం కమ్మచ్చులాగిన కొత్త బంగారు శరీరమందలి ముడతలు వీడింది. మధ్యలో ఎముకలు పెళపెళ విరిగాయి. కుబుసంబీటలు వారి వెల్లుల్లి రేకలు వలె పొరలు రేగింది. వెడదమైన పడగలు లేత చిగుళ్ళ వలె ఎట్టబడ్డాయి. ఈ వర్ణనమెంతయో సహజంగా సాగింది. దృశ్యము సాక్షాత్కరించునట్టి తీరు, దానితోపాటు కాలకంఠుని బాహావలేపము పాఠకులకు ప్రత్యక్షమైనట్టులున్నవి.

పరమేశ్వరుడు ధనుష్టంకురం చేసినప్పటి ఆటోపం వీరరసోత్తేజకమై వెలసింది.

ఆ విధంగా నారాయణున్ని బాణం చేసి, పాశుపతాస్త్రంబు సమంత్రకంబుగా నభిమంత్రించి, ఫాలలో చనాగ్ని శిఖలతో జోడించి వేయగా అమ్మహాస్త్ర ప్రభావంతో లోహమయమైన త్రిపురాసురుల మూడు నగరాలు కరిగిపోయి మూడు ముద్దలుగా తయారైనవి. పురములలోని భోగోపకరణములన్నీ భస్మమైపోయాయి. ప్రాసాదాలు కేళీ దీర్ఘికలు బాహ్యాంభ్యంతర కక్ష్యలు ఉపవనాలు అన్నీ దగ్ధములై పోయాయి. కాని అచటి కాలాంతక లింగము ఒక్కడు మాత్రము చెక్కు చెదరక ఉంది. ఆ త్రిపురాసురుల సర్వస్వము భస్మమై పోయినపుడు వారలకు ఉపాస్యమైన పరమేశ్వర లింగము చెడకుండుట వింత కదా! ఈ విధంగా అద్భుతాలు కలగ్గా కాలకంఠడు త్రిపురాసుర సంహారం చేసి జయలక్ష్మీని పొంది యుద్ధ సాధనాలన్నింటిని యథా స్థానానికి పంపాడు. సంతోషాతిరేకాన శివుడీ విధంగా తాండవం చేశాడు.

"ఆడెందాండవ మార్భటీ పటహ లీలాటోప విస్ఫూర్జిత
క్రీడాడంబర ముల్లసిల్ల గరళ గ్రీవుండు జూటాటవీ
క్రోడా ఘూట కరోటి కోటర కోటీలు రత్సింధువీ
చీడోలా పటలీ పరిస్ఫుటతర స్ఫీత ధ్వని ప్రౌఢిమన్" (4.148)

ఈ శివ తాండవంలో శ్రీనాథుని కావ్య రచనయు మహార్భటితో తాండవించింది.

## 5.5 భీమేశ్వర పురాణము - రస ప్రస్థానము:-

### 5.5.1 కరుణ రసము:-

అవ్విధంబున బాష్ప ధారాకులాక్షు
డుగుచు సత్యవతీ సూనుఁడడలుటయును
నెలఁతయును దాను గన్నులనీరునించె
కరుణ చిత్తంబులో నుబ్బఁ గలశభవుడు (3.3)

వేదవ్యాసుడు అగస్త్యునితో తన కాశీ వియోగ విషాద గాథను తెలిపినాడు. అగస్త్యుడు కూడ అంతకుముందే దేవ కార్యార్థమై ప్రాణాధికమగు కాశిని విడిచి రావలసి వచ్చింది. వ్యాసాగస్త్యు లిరువురకు వారణాసీ వియోగ దుఃఖమనుభూతమైంది. అట్టి సందర్భంలో వ్యాసుని శోక గాథను ఆకర్ణించిన అగస్త్యుడును ఆయన పత్ని లోపాముద్రయు కన్నుల నీరు నింపుకొన్నారు.

ఇక్కడ కాశీ నగర వియోగ వేదనాదోమాయమానసుడైన వేద వ్యాసుడు ఆలంబనము. అతని బాష్ప ధారలతో నిండిన నేత్రములు ఉద్దీపనములు. ఆతని మాటలు అనుభవాలు. కన్నుల నీరు నించుట సాత్త్విక భావము. వీనిచే అగస్త్య దంపతుల అంతరంగంలోని శోకము కరుణమైంది.

**5.5.2 రౌద్ర రసము:-**

శిఖలు వీడఁగ ముఖములు జేగుఱింపఁ
గటముల దరంగ నురవడిఁగాటులాడి
యొండొరుల మీఁద శాపంబులు గ్గడింప
హస్తముల యందు సలిలంబు లందు కొనిరి (4.184)

దేవ ఋషులు గోదావరిని దాక్షారామ క్షేత్రానికి తీసుకొని వస్తున్నారు. మధ్యే మార్గంలో దైత్య ఋషుల ఆశ్రమాలను గౌతమీ తరంగాలు ముంచివేశాయి. ఉభయ ఋషుల నడుమ వివాదం చెలరేగింది. ఆ సందర్భంలోనిదీ పద్యం.

ఇందు ఒండొరుల క్రోధమునకు ఒండొరుల ఋషులు ఆలంబనము. ఒండొరుల చేష్టలు ఉద్దీపనములు. శిఖలు వీడుట ముఖములు జేవురించుట, కటములదురుట, అసూయ, ఉగ్రత అనేవి సంచారి భావాలు. ఋషుల హృదయాల్లోని క్రోధము స్థాయి భావము.

**5.5.3 క్షమా వీరము:-**

దక్ష ప్రజాపతి తప్పులోఁగొని యాత్మ ।
గృప పుట్టిమి గుల రక్షించె గాన
హరి విరించి పురందరాది, దైవత కోటి
మించి క్రమ్మఱ గారవించెఁగాన
నరిగి యంతర్ధాన మందిన తనదేవి
నెడమి మేనఁ బరిగ్రహించెఁగానఁ
గోపాగ్ని ఁగడు బరితాపంబు నొందెడు
రుసులకు నభయంబు లొసగెగాన
నఱ్ఱు రెగవేసి జన్నపుటిట్టి శిరము
గరిమ చెడకుండ దివి వ్రేలఁగట్టెఁగాన
నయము గల వేల్పు శ్రీ భీమ నాయకుండు
దక్ష వాటంబు తీర్థంబు ధరణి యందు (2.12)

దక్షుడు శివుని పిలువకుండ యజ్ఞం చేశాడు. ఇంద్రోపేంద్ర చతుర్ముఖాదులా యజ్ఞానికి వెళ్ళారు. సతీ దేవి పతి వలదన్నను జనకుని యజ్ఞంలో పాల్గొన్నది. ఋషులు ఋత్విక్కులై దక్షుని ప్రోత్సహించారు. పై వారందరు కష్ట నష్టాలకు గురియైనారు.

సాపరాధులైన వీరందరినీ మహా దేవుడు మన్నించాడు. కనుక ఇది క్షమా వీరము. ఏవంవిధక్షమాభావంలో రూపొందిన ఉత్సాహం దీనికి స్థాయి భావము.

**5.5.4 భయానక రసము:-**

పంకజ ప్రభవుఁడ బ్రహ్మణ్య మొనరించెఁ

దాలసన్ని భభుజా స్తంభమెత్తి

తరిత్రాడు విడిచి బృందారక సురకోటి

పంచ బంగాళమై పాటిపోయె

హాహానినాద కోలాహలోత్తాలమై

త్రైలోక్యమును భీతిఁదల్లడిల్లెఁ

గనక వర్ణుండైన కైట భాసుర వైరి

పొగచూరి నల్లనై బొగ్గు పడియెఁ

బెటిలె బ్రహ్మాండ భాండంబు చిటిలెదిక్కు

లురలె పాతాళ భువనంబులు దిలెనభము

మేటిధాటీ జనిత కాలకూట విషము

చిచ్చు విడివడి యంతంత పెచ్చుపెరుఁగ (4.61)

పాల సముద్రంలో హాలాహలం ఉద్భవించింది. కరాళ కాలకూటానల జ్వాలామాలలో త్రైలోక్యం తల్లడిల్లిన సందర్భంలోని పద్యమిది.

బ్రహ్మ దేవుడు చేయెత్తి అబ్రహ్మణ్యము నుచ్చరించుట, దేవతలు తరిత్రాడు వీడి పారిపోవుట, ముల్లోకములు కల్లోలమందుట, బ్రహ్మాండ భాండము పెట్లుట, దిక్కులు చిట్లుట, పాతాళము బ్రద్దలగుట, గగనము పగులుట మున్నగునవి భయానక స్ఫోరకాలు.

**5.5.5 భీభత్స రసము:-**

తెగువ దక్షుని కంఠంబు ద్రెవ్య నేసి

వ్రేల్చెఁదలన ధృగ్నిని వీరభద్రు

డా ప్రజాపతి మెడ మీద నాక్షణంబ

నగుచుఁబొట్టేలితలఁదెచ్చినాటు కొలిపె (భీమ 6.60)

వీర భద్రుడు సాహసంతో దక్షుని కుత్తుకను త్రెంచి తలను యాగాగ్నిలో హోమం చేశాడు. ఆ క్షణమే నవ్వుతూ ఒక పొట్టేలి తలను తెచ్చి ఆ దక్షుని మెడ పై నిలిపాడు.

పరమ భీభత్స పరిపూర్ణమైన దక్ష యజ్ఞ విధ్వంసన కార్యక్రమంలో ఇది యొక ప్రధాన ఘట్టము. దక్షుని తలనరికి యజ్ఞ గుండంలో వ్రేల్చుట, పొట్టేలి తల పెట్టుట - జుగుప్సాకరమైన విషయాల వల్ల భీభత్సరస స్ఫోరకాలు ద్యోతకమౌతున్నాయి.

### 5.5.6 శాంత రసము:-

ఆనందంబున నర్థ రాత్రములఁజంద్రాలోకముల్ కాయఁగా
నానా సైకత వేదికా స్థలములన్ నల్దిక్కులన్ శంభుఁగా
శ్రీనాథున్ దరుణేందుశేఖరు శివున్ శ్రీ కంఠునిన్ బాడుదుర్
మేనెల్లం బుల కాంకు రప్రకరముల్ నిండార మిన్నేటిలోన్ (2.91)

అగస్త్య మహర్షి వేద వ్యాస మహర్షితో ఆనంద కాననము (కాశి) లో తాను గడిపిన ఆనందమయ జీవితము వెల్లడించు సందర్భములోనిదీ పద్యం.

అర్థరాత్రమున వెన్నెలలు కాస్తుండగా ఆనందంతో శరీరము గగుర్పాటు చెందునట్లుగా గంగానదిలో కాశీ విశ్వనాథుని స్తోత్రం చేస్తుంటే ఉన్న అనుభూతిని అగస్త్యుడు భావన చేయటంలో శాంత రస స్ఫూర్తి కన్పిస్తుంది.

ఇందు పరమ శివుడు ఆలంబనము. అర్థరాత్రము చంద్రాయికములు, గంగానది, సైకత వేదికలు ఉద్దీపనములు. శ్రీ కంఠ సంకీర్తనము అనుభావాలు. పులకాంకురములు సాత్త్విక భావము. తత్త్వ జ్ఞాన రూపమైన అగస్త్యుని శివభక్తి స్థాయి భావము. అది పరిపుష్టమై మహా శాంత రస స్ఫూర్తిని మూర్తీభవింప జేసింది.

**5.5.7 ఉప సంహారం:-** భీమేశ్వర పురాణ ప్రబంధాన్నంతా దృష్టిలో ఉంచుకుంటే శాంత రసమే ప్రధాన రసము. మోక్షము పరమ శాంతి స్వరూపము. మోక్షోప లబ్ధియే పరమ ప్రయోజనంగా విలసిల్లేవి క్షేత్ర పురాణాలు. వీని యందలి రసములన్నియు ఆరూఢమైన భక్తి భావానికి అంగములవుతాయి. శాంత రసము నందు విలీనం చెందుతాయి. క్షేత్ర మహాత్మ్య పఠనం చేత చదువరి హృదయము నందు శాంత రసమునకు స్థాయి భావమైన శమయు నెలకొంటుంది. హాలాహల ఘట్టమందలి రౌద్రం కాని, త్రిపురాసుర సంహారమందలి వీరం గాని అంగ రసాలే అవుతాయి. సర్వ రసావతార స్వరూపుడగు పరమేశ్వరుని యందు ఈ రసాలన్నీ లీనమవుతాయి. స్థల పురాణం కావ్య నిర్మితిని పొందినపుడు శాంత రసం ప్రధానమై ఉన్నది.

## 5.6 భీమేశ్వర పురాణము - అలంకార ప్రియత్వము:-

### 5.6.1 ఉపమాలంకారము:-

"ప్రబలమై యంధకారంబు బలిసి యుండ
దారకంబులు కాంతి నెంతయు బెరసె
నీలిపుట్టంబుఁబఱచి పైనిలిపినట్టి
వలుద ముక్తా ఫలముల తావళములట్ల" (2.36)

అంధకారములో నక్షత్రములు ఉపమేయము. నీలి పుట్టము మీది ముత్యాలతావళములు ఉపమానము. అట్ల అనునది వాచకము. కాంతులు విరజిమ్ముట సమాన ధర్మము.

**5.6.2 భ్రాంతి మదలంకారము:-** భ్రాంతి చేత ఒక వస్తువును తత్సదృశమగు వేరొక వస్తువుగా భావించుటను భ్రాంతి మదలంకారమందురు.

గిరినికుంజములఁగు గుంజరపుంజమనుశంక

గంఠీరవంబు లుత్కంఠనెగయ

బల్వలంబులఁగటి ప్రకరంబులను శంక

నెఱకు రాజులు విండు లెక్క పెట్టఁ

గడలి మధ్యంబున ఁగాకోలమనుశంక

జల దేవతలు భీతి సంభ్రమింప

నదములఁగువల కానన వాటి యను శంక

నాదిందిర శ్రేణులెదురు కొనఁగ

రజితగిరియందు దుండ నారంభరభస

భంగిపతిత పరశ్వథపాణి నికట

కంధ రారుద్ధగ జకృత్తి కంధ శంక

ప్రమథులకుఁదోఁప నంధకారంబు ప్రబలె (2.35)

వ్యాసుడు వారణాసిని వదలి దక్షవాటికకు వస్తున్నాడు. మధ్యే మార్గంలో సూర్యాస్తమయ సంధ్యా వర్ణనములు చేసి వ్యాసుని కాశీ వియోగ దురంత దుఃఖాంధకారమునకు అనురూపంగా అంధకారాన్ని అభివర్ణించాడు కవి. ఆ సందర్భములోని పద్యమిది.

అఖిల దిక్కులనంధకారము వరించింది. ఆ కారు చీకట్లతో గిరినికుంజములను కుంజర పుంజమను కొని సింహాలు చెంగుమని దూకాయి. నీటి మడుగులను వనవరాహములను కొని భిల్లులు విల్లెక్కు పెట్టినారు. ఈ విధంగా పద్యమంతా భ్రాంతి వర్ణింపబడింది. కాబట్టి ఇది భ్రాంతి మంతము.

**5.6.3 అతిశయోక్తి:-** ఉన్నదాని కంటె అతిశయముగా చెప్పటాన్ని అతిశయోక్తి అలంకారము.

తమ్ముని వీరభద్ర వసుధాధిపు విక్రమ వీర భద్రునిన్

సమ్మద లీల రాజ్యభరణ స్థితిఁబట్టముగట్టి బాహుద

ర్పమ్మున వేమ భూవరుఁడు వ్రాసె జగద్విజయ ప్రశస్తి వ

ర్ణమ్ములు దిగ్ధురంధర సుర ద్విపకుంభ విషాణ మండలిన్ (1.34)

ఈ పద్యంలో అల్లాడ వేమారెడ్డి యశోభి వర్ణనము చెప్పబడింది. వేమభూపాలుడు తన తమ్ముడైన వీర భద్రా రెడ్డిని రాజమహేంద్ర వర సింహాసనమెక్కించి ఆంధ్ర భూమండలాన్ని పరిపాలింప చేశాడు. తన అవక్ర పరాక్రమ సంపదచే దిగ్గజాల దంతముల యందు దిగ్విజయ గీతికలు వ్రాయించాడు.

దిగంత దంతావళముల దంతముల యందు దిగ్విజయ గీతికలు వ్రాయుట అసంబద్ధము. సంబంధము లేని విషయము సంబంధమున్నట్లు అతిశయించి వర్ణించుటచే సంబంధాతిశయోక్తి. వీర భద్రుని విజయయాత్రలు దిగంత వ్యాప్తములైనవని పరమార్థము.

**5.6.4 పర్యాయోక్తాలంకారం:-** చెప్పదలచిన దాన్ని సూటిగా చెప్పకుండా భంగ్యంతరంగా చెప్తే పర్యాయోక్తమవుతుంది.

హిమవద్భూధర సార్వభౌమ వర విశ్వేశోపహార క్రియా
క్రమ సంతాడి తఘంటి కా ఘణ ఘణ త్కారంబు విన్నట్టి యు
త్తమ పుణ్యుండు వినండు ప్రాణ పవనోత్క్రాంతివ్య ధా వేళ దు
ర్దమ వైవ స్వత వాహ్య ఘోర మహిష గ్రై వేయ ఘంటాధ్వనుల్ (3.167)

వేద వ్యాసునకు అగస్త్య మహర్షి దక్షారామ మందలి పంచ తీర్థాల మహాత్మ్యాన్ని ఎరింగిస్తున్నాడు. ఆ సందర్భములోనిదీ పద్యం.

భూధరేశ్వర తీర్థ మందలి విశ్వేశ్వర పూజా సమయంలో గణగణమ్రోగే ఘంటా ధ్వనులను ఆలకించి పుణ్యాత్ముడు అవసాన కాలంలో యమమహిష ఘంటా ధ్వనులను ఆలకింపడు.

ఈ గంటల చప్పుళ్ళు వినే వానికి ఆ గంటల చప్పుళ్ళు వినిపించవు. మహిషా గమనము యమాగమనమునకు సూచకము. నరకలోక ప్రాప్తికి సూచకము. శివుని గుడిలోని గంటలు విన్న వారికి నరలోకము ప్రాప్తింపదను పరమార్థం సిద్ధిస్తున్నది. ఈ విషయాన్ని సూటిగా చెప్పక భంగ్యంతరంగా చెప్పాడు. కాబట్టి ఇది పర్యాయోక్తము.

5.6.5 **వ్యాజస్తుత్యలంకారము:-** నింద చేత స్తుతి కాని, స్తుతి చేత నింద కాని స్ఫురించునట్లు చెప్పిన వ్యాజ స్తుతి అలంకారమనబడును.

మమ్ముఁ రక్షించి తని మేల మాటిమాటి
కభినుతింపంగ దక్ష వాటాధినాథ!
తల్లిదండ్రులు రక్షింప దలఁప కుండ్రె
ప్రజలభీమేశ! బహు విధో పద్రవముల (4.79)

దేవదానవులు అమృత సంపాదనకై పాల సముద్రాన్ని మధించారు. అతి భయంకర హాలాహలం ఆవిర్భవించింది. సమస్త విశ్వాన్ని కోలాహల మొనర్చు ఆ హాలాహలాన్ని దేవతల ప్రార్థనను ఆలించి, పరమేశ్వరుడు హరించి కంఠాన్ని ధరించాడు. 'అఖిల జగము' సురక్షితమైంది. ఆ సమయంలో దేవతలు పరమ శివునితో పల్కుతున్నారు.

మమ్ములను రక్షించావని మాటి మాటికి నిన్ను సన్నుతించుటెందులకు స్వామి? ప్రమాదములు వచ్చినపుడు తల్లిదండ్రులు తమ పిల్లలను రక్షింపకుందురా?

ఇందు 'నిన్ను సన్నుతించుటెందులకు?' అనునిందచే 'స్వామి' నీవు జగజ్జనకుడవు. మేము నీబిడ్డలము అన్న స్తుతి స్ఫురిస్తున్నది కనుక వ్యాజస్తుతి.

5.6.6 **కావ్యార్థాపత్యలంకారము:-** కైముత్యము చేత అర్థ సంసిద్ధి వర్ణితమైతే కావ్యార్థాపత్యలంకారమవుతుంది.

వేయు ముఖములు గల కాద్ర వేయ విచుడు
నెఱయశక్తుండు గాఁడఁట నిన్నుఁబొగడ
నేకము ఖమున బొగడంగనెట్లు నేర్తు
నిన్ను శ్రీదక్ష వాటికా నీల కంఠ (5.126)

సప్త మహర్షులు ఒక్కొక్కరే దక్షారామ నిలయుడైన భీమేశ్వర స్వామిని స్తోత్రమొనర్చు సందర్భంలోని పద్యమిది.

"సహస్ర ముఖములు గల ఆది శేషుడే నిన్ను సంస్తుతింప సమర్థుడు కానప్పుడు ఒక్కముఖము గల నేను నిన్నెట్ల కొనియాడ గలను? ఇచ్చటకైముత్యముచే "భీమేశ్వరుని ప్రభావము వాచామగోచర''మను అర్థము సిద్ధించింది కనుక కావ్యార్థాపతి.

**5.6.7 అతద్గుణాలంకారము:-** సమీపంలో ఉన్నా అన్య గుణాన్ని గ్రహింపకుండటం అతద్గుణాలంకారము.

ఫాలేక్షణా స్త్రవహ్ని
జ్వాలా జాలముల న సురవర నగరంబుల్
కాలినప్పుడు కాలక
కాలాంతక లింగమొకటి కడునొప్పారెన్ **(4.144)**

త్రినేత్రుడు జగత్కంటుకులైన త్రిపురాసురుల పై దండెత్తి మేరు ధనస్సు నందు నారాయణాస్త్రము సంధించి త్రిపురాలను భస్మమొనర్చిన సందర్భమిది.

ఫాలాక్షుడు ప్రయోగించిన నారాయణాస్త్ర జ్వలన జ్వాలా జాలములచే త్రిపురాసురుల పట్టణములు భస్మీభూతములైనవి. కాని ఒకానొక శివ లింగము మాత్రం కాలిపోక ఎప్పటి యట్ల అలరారు చుండెను. ఇందు జ్వలన జ్వాలా మాలికల దాహ గుణాన్ని గ్రహించక శివ లింగం చెక్కు చెదరకున్నట్లు చెప్పినాడు కవి. అందుచే అతద్గుణము.

**5.6.8 విశేషకాలంకారము:-** విశేషము కన్పట్టు చుండెనేని విశేషకాలంకారం.

మర్త్య భామలు విబుధ భామలును గలిసి
యుత్సవములందు విర్తించుచున్నయపుడు
దక్షవాటంబు వీట భేదంబు దెలియు
దృజ్నిమేషానికుష్రదీప్తి వలన **(3.92)**

అగస్త్యుడు వ్యాసునకు దక్షారామ వైభవము చెప్పు సందర్భంలోనిదీ పద్యం.

మహా వైభవోపేతములగు భీమేశ్వర స్వామి మహోత్సవములు సందర్శించుటకై బృందారక సుందరీమణులు స్వర్లోకము నుండి మర్త్యలోకానికి వస్తారు. ఆ సమయంలో ఎవరు మర్త్య కాంతలో, ఎవరు అమర్త్య కాంతలో భేదం తెలుసుకోవడం చాలా కష్టం. అందులకొకేయొక ఉపాయం ఉంది.

అని మేషనయనలైనవారు సుర లోక సుందరులు. ననిమేషనయనలైన వారు నరలోక సుందరులు.

దక్షారామ రమణీలలామలు అంతటి సౌందర్యవంతులని పరమార్థం. అనిమేషత్వంచే విశేషం గుర్తింపబడింది కనుక విశేషకం.

**5.6.9 అత్యుక్త్యలంకారము:-** అద్భుతము, అయదార్థమును నైక, శౌర్యోదార్యాది వర్ణనము అత్యుక్త్యలంకారము.

తారగిరి మందిరముల బృందారకాది
తారకా రాజ వదనలు తారుతార
తారధారాశ్రుతి స్వరోదారలీలఁ
బాడుదురు బెండ పూడన్న భవ్యకీర్తి **(1.79)**

భీమేశ్వర పురాణకృతి భర్తయైన బెండపూడి అన్నమయ్య యశో వైభవాన్ని వర్ణించు పద్యమిది.

కైలాస గుహా మందిరాల్లో చందమామ వంటి వదనాలు కల బృందారక సుందరీ బృందములు తమంత తాము తార స్థాయితో ఉదార స్వర సంపదతో బెండపూడి అన్నమంత్రి యశో గీతాలను గానం చేస్తారు.

ఇందు అన్నామాత్యుని యశో లక్ష్మి ఎంత అనన్య సామాన్యమైనదయినను వేల్పు చెలువలు వెండి కొండ పై గానం చేస్తున్నారనటం అత్యుక్తి.

## 5.7 భీమేశ్వర పురాణము - వర్ణనలు:-

**5.7.1 ప్రకృతి వర్ణనలు:-** శ్రీనాథ కవి వర్ణనాత్మక కవి. సమంచితమైన వర్ణనలతో పాటు సంభాషణ చణమైన ఈతని పాత్ర పోషణ కావ్య సమగ్రతను చేకూర్చింది.

విశ్వ సృష్టిలో తరులతా సంపత్తికి ప్రత్యేమకైన హోదా ఉంది. నిశ్శబ్దమై ఏకాంతమైన స్థావర ప్రకృతి సంపద సృష్టించిన వారి హృదయోద్గమమునకు దారి తీస్తుంది. కవి మనస్సునకు హార్దమైన ఊహలను అందజేస్తుంది. స్వభావగతంగా కొందరు కవులు ప్రకృతికి మిగుల సన్నిహితులు. మరికొంతమంది పరిమితమైన పరిచయం కలవారుగా ఉంటారు. ప్రకృతి విచారణ యందు కవి వేదనను అనుభవిస్తాడు. ప్రకృతి యెడ వారి స్నేహము, బాంధవ్యము, మర్యాద, ప్రేమ, ఉపాసనము మొదలైన హృదయ ధర్మాలు ఇందు విలక్షణతను ఆపాదించాయి.

శ్రీనాథుని ప్రకృతి రచన యందలి స్వభావ సౌహార్ద్రాలను పరిశీలిద్దాం.

(i) ''అనంతరంబ కుంభ సంభవ పులిన సంభవులు సంబవులందొడిగికొని కదలి, కదళికారామంబుల రామణీయకంబును, నుల్లసితబిల్వ చిరి బిల్వ విటపంబుల పొల్పును, ద్రాక్షా రుద్రాక్ష ఖర్జూర, కేసర సరళ పున్నాగ నారంగంబుల రంగంబును, లవంగ లుంగల వలీ మల్లీవల్లీమ తల్లీ వేల్లనంబుల యుల్లాసంబును ................ బ్రాసంబగు మిసిమియుఁ జెంగల్వ తావిదేవయు ................ కందియందంబును, మినుము నలుపును ............. నువ్వు మవ్వంబును ప్రత్తి సంపత్తియు'' (3.57)

శ్రీనాథుని ప్రకృతి వర్ణనము నందు సహజత్వం ఉంది. శబ్దాల ఆడంబరము ఉంది. అనన్యత (identification) ఈ కవి కాంచినట్లు కన్పించదు. శ్రీనాథుని ప్రకృతి దర్శనము ఆంతరికము కాదు. ఈ వచనంలో అనుప్రాసలతో కూడిన సమాసాలు, ఆనురూప్యము కల్గిన పదమున కానవస్తవి. ప్రకృతి వర్ణనలకు ఉపయోగించు పదాల కూర్పు, శబ్ద శక్తి పని చేయాలి. శబ్దాడంబరం ఉపయోగిస్తే ప్రకృతి యొక్క యథార్థ స్థితికి భంగం కల్గి ఆపద ప్రయోగం ఆస్థాన పతితమవుతుంది.

(ii) భీమేశ్వర పురాణ మందలి పంచారామాల వర్ణనలు ప్రకృతి సంపదనకు పట్టుకొమ్మలై ఉన్నవి. 'Truth is beauty, beauty is truth' అనే సౌందర్య సత్యాల సంయోజనం కవి వర్ణనమునకు ఉపాదేయము

"నారికేళం పుమట్టనెన్నడెమిచాయ దళములందును బోలె
సంతతము బ్రాఱు'' (భీమ 2.53)

"చతుర హవికుండు జల్లు పరువపు మరువంపు మొలకల చెఱవునన్'' (భీమ 5.123)

(iii) శ్రీనాథుని వస్తు కవిత యందు అనేక వస్తువుల చిద్విలాసములు ఒక చోట సన్నివేశ పరచినపుడు సమంచితమైన స్ఫూర్తి కలుగుతుంది.

"ఏటేట విరినీట నిరుగారునుంబండుఁ
బ్రాసంగు వరి చేలఁబసిఁడి చాయఁ
బరిపాకమున వేరు పనస పండుల తావి
యిందిందిరములకు విందు సేయ
వేఁబోఁకఁబొలు పారు వింధ్యాద్రి పవనంబు
పోఁకపువ్వుల తావిఁబుక్కిలించు
వేశ్య వాటికలందు విహరించు వలరాజు
ననయంబుఁజెఱకు విల్లును ధరించు
నారదంబుల వలపు పొన్నలఁబెనంగి
విచికిలా మోదముల తోడ వియ్యమంది
పాటలీ పుష్ప కేతకీ పరిమళములు
పొరల విలస్లిల్లు (బీఠికా పురము నందు" (2.54)

ఈ పద్యమునందంతయూ పిఠాపురమునందు కల ప్రకృతి సంపద యొక్క పరస్పరాను వర్తిత్వము తెలియజేస్తుంది. పద్యమందలి అనేక వస్తువుల విలసనమునకు కేంద్రమైంది. ఇది వస్తుగతమైన స్వభావోక్తి.

(iv) కుమారా రామమందలి <u>సమీర</u> వర్ణనము నిందు (2.62) శ్రీనాథుడు సంస్కృత కవులను అనుకరించినాడు. శ్రీనాథుని వర్ణనములందు అచేతన వస్తువులలో ప్రాణి ధర్మాన్ని ఆరోపించటం ఒక విశేషం.

(v) భీమ ఖండాన్ని ప్రబంధంగా రూపొందించటానికే శ్రీనాథుడు మూలంలో లేని సూర్య చంద్ర వర్ణనలను చేర్చాడు. సూర్యోదయాది వర్ణనములందు శ్రీనాథుడు క్రమ పరిణామమైన బింబము యొక్క వికాస అస్తమయ విషయాల్ని గూర్చి చెప్పాడు.

**5.7.2 ఋతు వర్ణనలు:-** భీమ ఖండము నందలి వసంత ఋతు వర్ణనము

"సకల దైవత మండల సార్వభౌము
దక్షిణాపథ కాశికాధవుని గొల్వఁ
గుసుమ విసరంబుఁగానుకఁగొంచు వచ్చె
నఖిల ఋతు చక్రవర్తి మధ్వాగమంబు" (5.93)

అన్ని ఋతువుల యందును శ్రేష్టమైన వసంత ఋతువు పూల సమూహాలను కానుక ధరించి సర్వ దేవతా సార్వభౌముడును దక్షిణ కాశికా నాథుడను ఐన దక్షారామ భీమేశ్వర స్వామిని సేవించటానికి ప్రవేశించింది.

కమిచె సురపొన్న వనలక్ష్మి కబరి మీఁద
సంతరించిన ముత్యాల జల్లిబోలెఁ
బూచె సంపెంగ లారామ భూమి యందు
గుసుమ నారాచు చిచ్చుల కోలవోలె (5.94)

ఆ దాక్షారామంలో సుర పొన్నలు వన మనెడి లక్ష్మీదేవి యొక్క కొప్పు పైన ముత్యాల వల వలె విరిసి ప్రకాశిస్తున్నది. మన్మథుని నిప్పుకల బాణంలాగా సంపెంగలు పూచినవి.

భీమ ఖండము నందలి వసంత ఋతువర్ణనము మూలాతిశయమైన శోభనందినది.

**5.7.3 మంత్ర వర్ణనము:-** మంత్రమనగా రాజకీయ సమాలోచనము.

<u>ఒంటిగేతెంచి</u> మంతనం బుండి నిలిచి
చక్రధరుతోడహిత కార్య చర్చ చేసి
యేగెదేవింద్రుడిరు <u>చెవి నెఱుఁగ</u> కుండ
సిద్ధ సంకల్పుడైయాత్మ శిబిరమునకు (4.50)

రాజకీయ మంతనములందలి మెలకువలను శ్రీనాథుడు 'ఒంటినేతెంచి' 'ఇఱు చెవి నెఱుగకుండ' మున్నగు పదాలను ఉద్దేశించాడు. రాజ్యాంగానికి గుప్త మంత్రత అవసరము. గుప్త మంత్రతను, గూఢచార పరిరక్షయు చేసిన రాజు ................ చతుస్సముద్ర ముద్రిత నిఖిలోర్వినంతయు అతి స్థిరతన్ భజించువాడగున్.

త్రిపురాసురులను జయించే సందర్భంలో (4.124) బ్రహ్మాది దేవతలతో భీమేశ్వరుడు చేసిన మంతనమిది.

**5.7.4 యాత్రా వర్ణనము:-** ఈశ్వరుడు త్రిపురాసురుల పై దండెత్తి పోయేటప్పుడు అందలి యాత్రా విశేషాలను (4.127) వివరించాడు. ఈ పద్యంలో సాధన సన్నాహం తర్వాత పరమేశ్వరుడు స్యందనాన్ని అధిరోహించినపుడు జరిగిన మంగళ లాంఛనాలను (4.129) వర్ణించాడు.

**5.7.5 యుద్ధ వర్ణనము:-** త్రిపురాసుర సంహారము నందలి భీమనాయక నారాయణాస్త్ర ప్రయోగాదులను (4.140) ఇందు ఉదహరించాడు. నారాయణాస్త్రము త్రిపుర దైతేయ శుద్ధాంత కాంతల యెడ శృంగార భావాన్ని వహించింది.

**5.7.6 వసంతోత్సవ వర్ణనము:-**

"జాదర జాద రంచు మృదు చర్చరి గీతులు వారుణీ రసా
స్వాదమదాతి రేకమునఁజంద్రికకాయఁగ దక్షవాటికన్
వేదుల మీఁదటన్ గనక వీణలు మీటుచుఁబాడి రచ్చరల్
మోదమెలర్పఁగా భావన మోహన విగ్రహు భీమనాథునిన్" (5.103)

వెన్నెల వేళల యందు దక్షారామ నగరమందలి అరుగుల పైన అప్సరసలు మద్యాన్ని సేవించి అనిత సంతోషంతోనూ, అత్యుత్సాహంతోనూ బంగారు వీణలను వాయిస్తూ భువన మోహనమైన రూపం గల శ్రీ భీమేశ్వర స్వామిని గూర్చి జాదర అనెడి పల్లవి తోడ మధురమైన చర్చరీ గీతాలను ఆలపించారు.

**5.7.7 నగర వర్ణనము:-** దాక్షారామ పుర వర్ణనను ప్రథమాశ్వాసంలో శ్రీనాథుడు చేశాడు (1.88). ఈ వర్ణనమంతా అలంకారముల గని. నగరంలో నాలుగు వర్ణాల వారు, వప్రములు, పరిధులు, చతురంగ బలములుమున్నగు అంశాలుండగా శ్రీనాథుడు అప్సరల అందచందాలను గూర్చి వారి నృత్య భంగిమలను గూర్చి ఎక్కువగా ప్రశంసించాడు.

పర్యంతమందార పారిజాతకవనీ

రమమాణ నిర్జరీ సముదయంబు

సరస రసా సిద్ధ వరవారి సంపూర్ణ

గంభీర తపరిఖా పయోధి

ప్రబల చింతారత్న పాషాణ సంఘాత

వప్రరేఖా చక్ర వలయితంబు

కామధేను సహస్ర కఠిన రింఖాటంక

దళనదం తురిత రథ్యాముఖంబు

భద్రపాతాళ భైరవ పాలితంబు

సహ వినాయక రక్షణా కుంఠితంబు

సప్త మాతృక పరిహార సంకులంబు

వసుమతీ నూపురము దక్ష వాటి పురము (1.88)

"సాని యీశాని యై మహోత్సవమునందు

గేల నవ చంద్ర కాంతంపు గిన్నె పూని

వీధి భిక్షాటన మొనర్చు వేళ జేయు

మరుల నృత్యంబు జగములమరులు గొలుపు" (1.105)

పరమేశ్వర విలాసము, సానుల హొయలు ఈ రెండే భీమేశ్వర పురాణంలోని ప్రథమాశ్వాసంలో కన్పిస్తాయి. శ్రీనాథుని ఉద్దేశంలో నగర వర్ణన అంటే ఏమిటి? సానుల + విలాస విస్తరణమే పుర వర్ణనమౌతుందా? ముఖ్యంగా దక్షారామ పుర వర్ణన పై శ్రీనాథుని ఆత్మీయతా ముద్ర కలదు. శ్రీనాథుని కాముకత్వం దక్షారామ పుర చిత్రణంలో పఋచినట్లైనది.

కుమారరామ, సర్వవర నగర వర్ణనల యందు ఈ వేశ్యా శృంగారం కానరాదు.

కాశికా పట్టణ మందలి ఆ ముష్కిమ మహిమతో పాటు శ్రీనాథుడు దక్షారామము నందు ఐహికమైన భోగములను మేళవించాడు.

(1) మోక్షము భోగంబు బ్రాంతె ముజ్జగములకున్ (2.16)

(2) భోగ మోక్షములకు జన్మ భూమి యైన దక్షవాటంబురావు తీర్థముల కెల్ల (2.17)

(3) మోక్ష శ్రీ భోగ విభవ మూలంబునకున్ దక్షారామమునకు సదృక్షంబగునట్టి పుణ్య తీర్థము కలదే (2.20)

(4) కాశి కన్నను నెక్కుడు గారవమున మోక్ష భోగ నివాసంబు దక్షవాటి (2.5) అని ప్రశంస చేశాడు. శ్రీనాథుని మనః ప్రవృత్తి ఇక్కడ స్పష్టపడుతున్నది.

(5) ధాత్రీ వలయములో భోగదములు కొన్ని మోక్షదంబులు గొన్ని పరీక్షసేయ (2.17)

దాక్షారామము భోగ మోక్షాలకు నిదానమగుటచే శ్రీనాథుని ప్రత్యేకాభిమానము. శ్రీణాథుడు ఎంత భోగియో అంత ముముక్షువు. వార్థక్యం లోను, అవసాన సమయము నందైనను భోగ విముఖత కలగలేదని చెప్పవచ్చు. దక్షారామ పుర వర్ణన మందలి అప్సరః పక్షపాతము శ్రీనాథుని మనస్తత్వాన్ని చెప్పక చెప్పుచున్నది.

## 5.8 ఉపసంహారము:-

కవి తన యొక్క పనితనాన్ని బట్టి ప్రతి చిన్న వస్తువును ప్రత్యగ్ర వర్ణనంచే ప్రకాశవంతము చేసి సహృదయుల ఎదుట పెట్టాడు. దండి పేర్కొన్నట్లుగా జాతి ద్రవ్య గుణ క్రియాత్మకమైన స్వభావాన్ని ప్రత్యక్షరీకరించి శ్రీనాథుడు వర్ణనల యందు కృతార్థుడైనాడు.

## 5.9 ప్రశ్నలు:-

1. భీమేశ్వర పురాణ మాధారంగా ఆంధ్ర దేశాభిమానాన్ని శ్రీనాథుడు ఎట్లు పేర్కొనెనో విశదీకరింపుడు?
2. శ్రీనాథుని వర్ణనా వైచిత్రి ఎట్టిదో తెల్పుడు?

## 5.10 ఆధార గ్రంథాలు:-


1. శ్రీనాథకృతి సమీక్ష - చిలుకూరి పాపయ్య శాస్త్రి
2. భీమేశ్వర పురాణం (దక్షిణ కాశి కావ్యాఖ్య) - డా॥ గుండవరపు లక్ష్మీ నారాయణ


**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 6

# శ్రీనాథుడు - కాశీ ఖండము - కావ్యత్వము

ముఖ్యాంశాలు:-


6.0 లక్ష్యం

6.1 ఉపోద్ఘాతము

6.2 సంస్కృత కాశీ ఖండము - శ్రీనాథుని అనువాద విధానము

6.2.1 యథా మూలము

6.2.2 మూల కుంచనము

6.2.3 మూల ప్రవచనము

6.2.4 అన్యథాకరణములు

6.2.5 అమూలకములు

6.3 క్షేత్రమాహాత్మ్య గ్రంథాలు - కాశీ ఖండ ప్రాధాన్యము

6.4 కాశీ ఖండము - ఇతివృత్త నిర్వహణము

6.5 పాత్ర చిత్రణము

6.6 కాశీ ఖండము - రస సారస్యము

6.7 కాశీ ఖండము - అలంకార ప్రాముఖ్యము

6.8 కాశీ ఖండము - వర్ణనా వైశిష్ట్యము

6.9 ఉపసంహారము

6.10 ప్రశ్నలు

6.11 ఆధార గ్రంథాలు


## 6.0 లక్ష్యం:-

శ్రీనాథుడు 'ప్రాయమింతకు మిగులఁగ్రైవాలకుండ' రచించిన ప్రౌఢ కావ్యం కాశీ ఖండము. దీనిని ఇతడు రాజమహేంద్ర రెడ్డి రాజగు వీర భద్రారెడ్డికి అంకితమిచ్చాడు. స్కాంద పురాణాంతర్గతమగు కాశీ ఖండానికిది అనువాదం. ద్వాదశ సహస్ర శ్లోక పరిమితి గల సంస్కృత కాశీ ఖండాన్ని శ్రీనాథుడు ఏడాశ్వాసాల కావ్యంగా కూర్చినాడు. తెలుగు కాశీ ఖండంలో 1777 గద్య పద్యాలున్నాయి. ఇందలి కావ్యత్వాన్ని ,రసాలంకార వర్ణనలను సమీక్షించడమే ఈ వ్యాస పరమార్థం.

## 6.1 ఉపోద్ఘాతము:-

నాలుగు పురుషార్థాలకు స్థానమై, ప్రధానంగా బ్రహ్మ విద్యకు ఆది కారణమై, అపవర్గ ప్రాప్తికి హేతువైన కాశీ క్షేత్ర మహిమానుభావ కథనం వస్తువైనందు వల్ల స్కాందము నందలి మిగిలిన ఖండముల కంటే కాశీ ఖండం ప్రఖ్యాతి నొందింది.

ఈ కథా ప్రవర్తనమునకు మూల భూతమైన పాత్ర అగస్త్యుడు. ఆ ఋషి లోకహితార్థం దేవతల అభ్యర్థనపై కాశిని వదిలి,

దక్షిణా పథానికి వచ్చి కల్హాపురాది క్షేత్రాలను దర్శించటం ఈ గ్రంథంలోని ప్రధానాంశం. మేరు పర్వతం మీది మత్సరంలో వింధ్యాద్రి విజృంభించి సూర్య సంచారాన్ని అరికట్టుట అగస్త్యుని కాశీ నిర్గమనానికి కారణమైంది. కాబట్టి వింధ్య పర్వత నిరోధమే ఈ గ్రంథానికి ప్రస్తావనాప్రాయమైంది. లోపాముద్రా సహితుడై అగస్త్యుడు నానా తీర్థాలు సేవిస్తూ స్వామిమల తీర్థంలో కుమార స్వామిని దర్శింపగా కుమార స్వామి అగస్త్యునకు కాశీ క్షేత్రంలోని నానా తీర్థ ఘట్టాలను, దేవతలకు వివరించి చెప్పే భాగం అవటం వల్లనే ఈ గ్రంథానికి కాశీ ఖండమనే పేరు సార్థకమైంది. ఆ కథనంలోని భాగమే వ్యాసుడు కాశిని విడిచిపెట్టటం అనే ఉపకథ. ఇందులో

1. వింధ్య పర్వత విజృంభణం
2. అగస్త్యుడు కాశీని విడిచిపెట్టుట
3. అగస్త్యుని దక్షిణాపథ తీర్థ సేవనం
4. కుమారస్వామి కాశీ మహాత్మ్యాన్ని వర్ణించటం
5. వ్యాసుడు కాశీని పాయుట

అను ఐదు శీర్షికలు కలవు. అంతేగాక మధ్య మధ్య రెండు మూడు ఉపాఖ్యానాలున్నాయి. అందులో కుబేర వృత్తాంతమనే పేరు గల గుణనిధి చరిత్ర మిక్కిలి రమణీయమైంది.

సంస్కృత కాశీ ఖండం పురాణైక దేశము. సులభ గ్రాహ్యమైంది. శ్రీనాథుడు ప్రౌఢతరమగు శౌవ్య శైలిలో జాతి వార్తా చమత్కార విలసితమున శైవతత్త్వ ప్రతిపాదకంగా, సాముద్రిక, పాతంజల యోగ శాస్త్ర, మంత్ర శాస్త్రములను పొందుపరుస్తూ ఆంధ్రతాముద్రను అచ్చొత్తించి శ్రీనాథుడు కాశీ ఖండాన్ని రచించాడు. <u>'కాశీ ఖండమయః పిండమ్'</u> అను ఆభాణకము తెలుగు కాశీ ఖండమును బట్టి ఏర్పడిందని శ్రీ నిడదవోలు వేంకటరావు గారి అభిప్రాయం. కాని 'శ్రీనాథుని కాశీ ఖండమిట్టి నానుడికి గురికాదగినంత కఠిన శైలి లేదనుట నిక్కువము' అని బండారు తమ్మయ్య గారు తెల్పియున్నారు. ఇందలి శైలి కావ్య శైలి కాబట్టి సంస్కృతాంధ్ర పారంగతుడగు శ్రీనాథుడు పూర్వ కవుల రచనా రీతులను ఎట్లు జీర్ణించుకొన్నదియు తెలిసికోవటానికి యీ గ్రంథమెంతేని ఉపయోగపడుతుంది.

## 6.2 సంస్కృత కాశీ ఖండము - శ్రీనాథుని అనువాద విధానము:-

మూల కాశీ ఖండం 100 అధ్యాయాల గ్రంథం. అది రెండు భాగాలుగా ఉంది. పూర్వఖండం ఏబది అధ్యాయాలు. ఉత్తరఖండం 50 అధ్యాయాలు. శ్రీనాథుని గ్రంథం ఏడు ఆశ్వాసాలు. మొదటి ఐదు ఆశ్వాసాలు పూర్వఖండానికి అనువాదం. చివరి రెండు ఆశ్వాసాలు ఉత్తరఖండానికి అనువాదం. దీన్నిబట్టి అనువాదము సమ విభక్తంగా సాగి ఉండలేదని తేటపడుచున్నది. శ్రీనాథుడు స్వేచ్ఛానుసారంగా అనువదించుకుంటూ పోయాడు. మూలం సాహిత్య వైభవసనాథమేయైనను తన కావ్య శోభకై శ్రీనాథుడు మూలము నందలి వర్ణనల మీద గాని, అలంకారముల మీద గాని ఆధారపడియుండ లేదు. మూలము నందు సంక్షిప్తములుగా, తనకు తృప్తికరములుగా లేని సన్నివేశాలను మనసార తనివి తీరునట్లుగా విస్తరించి వ్రాశాడు. ఈ కాశీ ఖండము యొక్క అనువాదము నందు 1. యథా మూలము, 2. ప్రపంచనము, 3. కుంచనము, 4. అన్యథాకరణము, 5. మూల త్యాగము, 6. అమూలక సృష్టి మొదలగు పద్ధతులను శ్రీనాథుడు అనుసరించాడు. వానిని పరిశీలిద్దాం.

**6.2.1 యథా మూలము:-** 1. కుమార స్వామి అగస్త్యునకు సదాచారాన్ని గుఱించి తెలిపే సందర్భంలో మూలంలో

"హంతః షోడశభిః గ్రాసైః చతుర్భిః పుష్కలంస్మృతః ।
గ్రాసమాత్రా భవేద్భిక్షా గృహస్థ సుకృత ప్రదా" ॥ (కాశీ 35-204)

అని ఉంది. అగ్ని కార్యాన్ని గురించి తెలిపి తరువాత హంతకారమును నిష్ఠతో చేయాలనీ ఆహంతకారం వల్ల దేవతలందరూ తృప్తి చెందుతారని చెప్తూ 'హంతకారము'ను వివరిస్తున్నాడు. దీనికనురణమైన పద్యం తెలుగులో

"హంత కారంబనంగ బదాఱు గళ్లా

కలశభవ! నాల్గు గళ్ల పుష్కలమనంగ

గ్రాస మాత్రంబు భిక్ష యక్షయ్య మంద్రు

మౌని బృందారక తదన్న దాన ఫలము" అనునది (1-218)

పదునాఱు ముద్దల అన్నానికి హంతకారమని పేరు. నాలుగు ముద్దల అన్నానికి పుష్కలమని పేరు. ఏకకబళమునకు భిక్ష అని పేరు. హవ్య సదృశ్యములైన ఈ హంతకార, పుష్కల, భిక్షా రూపములైన అన్నదాన ఫలము బ్రహ్మాది సకల దేవతలను, ఆప్యాయితులను చేస్తుంది. కాబట్టి క్షయింప చేయుట కశక్యమైనదంటారు.

2. శివశర్మ భూమి మీద నున్న పుణ్య క్షేత్రాలనన్నింటిని సేవిస్తూ ఉజ్జయినికి చేర్తాడు. ఇచ్చట మహా కాళేశ్వరుని గూర్చి సంస్కృతంలో ఇట్లా ఉంది.

"హాటకేశో మహాకాల స్తారకేశస్తథైవచ ।

ఏక లింగ స్త్రిధా భూత్వాత్రిలోకీం వ్యాప్య సంస్థితః" ॥ (7అ-95శ్లో॥)

ఒకే మహా లింగానికి స్వర్గంలో తారకేశ్వరుడనియు, భూలోకంలో మహా కాళేశ్వరుడనియు, పాతాళంలో హాటకేశ్వరుడనియు వ్యవహారం.

ఈ శ్లోకందేనికదిగానిట్లే తెలుగులోకి అనువదింపబడింది.

"హాటకేశ్వరుడు మహా కాళనాథుఁడు

తారకేశ్వరుడు తలిరుఁబోడి

ఉబ్బు లింగములయి యున్నారు పాతాళ

మర్త్యనాక భువన మండలముల" (3-105)

ఇవి యథా మూలానువాదానికి ఉదాహరణలు.

### 6.2.2 మూల కుంచనము:-

1. శివశర్మోపాఖ్యానంలో ధ్రువలోక వృత్తాంతం మిక్కిలి విస్తరించి ఉంది.

"మనో స్వా యం భువస్యాసీత్ ఉత్తాన చరణఃసుతః ।

తస్యక్షితిపతే ర్విప్ర! ద్వౌ సుతౌ సంబ భూపత్యు ॥" (19అ-5శ్లో॥)

అని 19వ అధ్యాయం లోని 5వ శ్లోకం నుండి 21వ అధ్యాయంలోని 131వ శ్లోకమైన

"నరో ధ్రువస్య చరితం ప్రసంగేన స్మరన్నపి ।

న పాపై రభి భూమేత మహత్పుణ్య మవాప్నుయాత్ ॥" (21అ-131శ్లో॥)

అని దాదాపు మూడధ్యాయాల్లోను కలిపి మొత్తం 351 శ్లోకాల్లో ఈ ధ్రువ కథ విస్తరించి ఉంది. తెలుగులో ఈ కథ

"త్రైలోక్య మంటప స్తంభ సంభారంబు

గగన లక్ష్మీ కంద కనక భూష" (4-279)

అను తతుర్థాశ్వాసంలోని రెండు వందల డెబ్బది తొమ్మిదవ పద్యంతో మొదలై

"అని చెప్పిరంత నవ్విమానంబు ధ్రువలోకంబు కడచి క్రమంబున

మహర్లోక, జనోలోక తపోలోకంబులనతిక్రమించి సత్యలోకంబు

గదిసె" - అనెడి 288వ వచనంతో అనగా దాదాపు 10 పద్యాల్లో ముగుస్తున్నది. మూలంలో ధ్రువుడు చేసిన విష్ణు స్తోత్రమే 72 శ్లోకాలకు పైబడి ఉంది. దాని పేరు ధ్రువ స్తుతి. ఇది మిక్కిలి మహిమాన్వితమైనది.

"త్యక్త్వా సర్వాణి కార్యాణి త్యక్త్వా జప్యాన్యనేకశః ।

ధ్రువ స్తుతిరియం జప్యా సర్వకామ ప్రదాయినీ ॥" (21అ-95శ్లో॥)

చతుర్థాశ్వాసంలోని ఈ ధ్రువకథ నుండి శ్రీనాథుని ఆంధ్రీకరణము మిక్కిలి సంక్షిప్తముకాజొచ్చింది. ఈ ప్రకరణంలోనే మూలంలో ఉన్న మహర్లోక, జనోలోక, తపోలోకముల వర్ణనములన్నింటిని శ్రీనాథుడు విడిచి పెట్టినాడు.

2. సంస్కృతంలో అకారాది క్రమంగా గంగా సహస్ర నామాలు ఉన్నాయి. మరియు వాహీకుని ఉపాఖ్యానం కలదు. వీనినన్నింటిని ఆంధ్రీకర్త పూర్తిగా విడిచినాడు.

3. మూలంలో సదాచార ప్రకరణం రెండధ్యాయాల్లో ఉంది. చతుర్వర్ణ సదాచారం, చతురాశ్రమ సదాచారం, గృహస్థాశ్రమ సదాచారం మొదలైన విషయాలతో దాదాపు మూడు వందల ముప్పది తొమ్మిది శ్లోకాల్లో ఉంది. తెలుగులో "బ్రాహ్మాముహూర్తంబున మేల్కాంచి కృతాచమనుండయి వివిక్త ప్రదేశంబున భస్మోద్ధూళనంబును" అను 191వ గద్యతో ప్రారంభమై "అప్రక్షాళిత దక్షిణ హస్తాం గుష్ఠమూలంబున నిష్ఠ్యూతంబైన

ఆసవిలంబు అపుణ్య నిలయంబైన రౌరవంబునంబద్మార్బుద నివాసులైన పితరులకు తృప్తి నావహరించు" (5-224 వ) అని తెలుగున ఈ సదాచార ప్రకరణము 33 పద్యాలతో పూర్తి అగుచున్నది. ఈ అనువాదం మిక్కిలి సంగ్రహంగా ఉండటమే కాక ఉన్నంతలో యిష్టము వచ్చినట్లు సాగింది.

### 6.2.3 మూలప్రపంచనము:-

వింధ్య పర్వతం సూర్య రథ నిరోధము గావించునపుడు తెలుగులో నున్న సూర్యోదయ వర్ణన మంతయు శ్రీనాథుడు మయూరుని సూర్యశతక శ్లోకములననుసరించి ప్రవచించినాడు.

మూలమున కేవలం

1. భాసమానోన్నతో వింధ్యో నిరుధ్య గగనం స్థితః ।

స్పర్థతే మేరుణా ప్రేప్యుస్తద్దత్తాంతు ప్రదక్షిణామ్॥ (2-14)

అని ద్వితీయాధ్యాయములోని పదునాల్గవ శ్లోకము నుండి

2. "ఇతి వ్యాకులితే లోకే సురాసుర నరోరగే

అఃకిమేత దకాండేఽభూత్ రురుదుర్ద్రుమః ప్రజాః" (2-28)

28వ శ్లోకం వరకు గల విషయమంతా శ్రీనాథుడునిచే ప్రపంచింపబడింది.

మూలంలో అగస్త్య మహర్షి కాశిని విడిచిపెట్టుట తెలుగులో శ్రీనాథుడు వ్రాసిన దాని కంటే మిక్కిలి సంగ్రహంగా ఉంది. ఈ ప్రకరణం తెలుగులో నున్నంత రసవత్తరంగా సంస్కృతంలో లేదు. పురాణాన్ని కావ్యంగా ఒనర్చటం అంటే ఇదే. స్కాందము నందలి ఇతర సంహితల నుండి తెచ్చిన శాస్త్ర విషయాల్ని బట్టి చూచినా, అగస్త్యుడు ఆలంబనంగా కాశీ వియోగజమైన శోకం స్థాయిగా కరుణ రసాన్ని సమృద్ధిగా ఆవిష్కరించిన సంవిధానాన్ని బట్టి చూస్తే కాశీ ఖండమందలి ద్వితీయాశ్వాసమంతా దాదాపుగా శ్రీనాథుని ఉపజ్ఞయే. శ్రీనాథుడు ఈ ప్రకరణాన్ని ఇంత విస్తరించి మిగిలిన ప్రకరణాల్ని సంగ్రహించాడు. తృతీయాశ్వాసంలో

"స్ఫటిక భూముల యందు ప్రతిబింబములు చూచి
యితరాశ్వబుద్ధి హేషిత మొనర్చు" (కాశీ 3-10)

"ఆకాశ వాహినీ సైకతంబుల ఖురాంచల
టంకములు క్రుంగి జడనువడిన" (కాశీ 3-12)

అను ఈ రెండు పద్యాలకు కూడా మూలం లేదు. ఇవి మయూరుని సూర్య శతక శ్లోకాలననుసరించి వ్రాసినవి.

"ఇవ్విధంబున భవనోపద్రవంబు ప్రశాంతింబొందించి

దక్షిణ కాశీ సందర్శనంబును గాని కాశీ వియోగ వేదనా భారంబు డిందుపడదని" - అనెడి ఈ 13వ వచనము నుండి కొల్హాపురీ మహాలక్ష్మిని సందర్శించినంత వరకు అంటే 41వ పద్యం వరకు వర్ణింపబడ్డ అగస్త్యుని ఆంధ్రదేశ సంచారానికి మూలం సంస్కృత కాశీ ఖండమునందు లేదు. ఈ గ్రంథ భాగము శ్రీనాథుని స్వస్థాన వేష భాషాభిమానానికి దృష్టాంతము.

4. శివశర్మో పాఖ్యానంలో తన జీవితమంతా వ్యర్థమైనందులకు నిర్వేదాన్ని పొందిన శివశర్మ ఇట్లనుకొన్నాడు.

"యావత్స్వస్థో౽స్తి మేదేహో యావన్నేంద్రియా విక్లబః ।
తావత్స్వ శ్రేయసాం హేతుం తీర్థ యాత్రాం కరోమ్యహమ్ ॥" - (7-38)

తెలుగులో శ్రీనాథుడు దీనినెంతో పెంచి

"పొడిదగ్గు కంఠంబు బొరిపుచ్చక యమున్న
తల ప్రకంపంబు బోందకయమున్న
బొమలు కన్నుల మీదఁబొదివి వ్రాలకమున్న
పర నేత్రముల కడ్డుపడకమున్న
శ్రుతి పుటంబుల శక్తి సురిగి పోవకమున్న
వళులాలననమున పర్వయకమున్న
హృదయంబులో జేగ పదను తప్పకమున్న
గాత్రంబు శిథిలంబు కాకమున్న
పండ్లు వేర్వాసికదలు చూపకయమున్న
కాకి కడకంటి చూపు పైరాకమున్న
కాలు సేయాడు కాలంబె కదలవలయు
తీర్థ సేవకుడే హమ స్థిరము కాన"

ఈ ముదిమి వర్ణనము మూలంలో ఇన్ని వివరాలతో లేదు. ఇదంతా శ్రీనాథుని ప్రపంచనము.

6.2.4 **అన్యథాకరణములు:-** మూలంలో ఉన్న అనేక విషయాలు శ్రీనాథుని చేత తెలుగులో అన్యథాకరింపబడినవియు కలవు.

1. మణికర్ణికా మహాత్మ్యాన్ని గురించి తెల్పునపుడు మొదట కాశీ నగరాన్ని పాలిస్తున్న శివుడు ఈ కుటుంబ భారానంతా వహించటానికి దక్షుడైన వాడొకడు కావాలని తన సవ్యాంగను నందు దృష్టిని ప్రసరించినట్లు మూలంలో ఉంది.

"సంప్రధార్యేతి సవిభ్యు సర్వతశ్చిత్ స్వరూపయా ।
తయార సహజ గద్ధ్యాత్ర్యా జగద్ధాతుఽథ ధూర్జటిః ॥
సవ్యే వ్యాపారయాం చక్రే దృశమంగే సుధాము చం ।
తతః పుమునావి రాశీదేక స్త్రైలోక్య సుందరః" ॥(26-42,43)

ఇది తెనుగున కొంత భిన్నముగా ఇట్లున్నది.

"అనివి చారంబు చేసి కాలాంతకుండు
చూచె నఱకంట గిరిరాజ సుత ముఖంబు
ప్రభవమందె నాచూపునఁబ్రావృషేణ్య
ముదిర నీలాంగుఁడగు నొక్కముద్దు కొడుకా"

కాని పరమేశ్వరుని సవ్యాంగము దేవియే. విష్ణువు సివుని వామాంగం నుండి ప్రభవించెనన్న విషయము బహు పురాణ ప్రసిద్ధం.

2. కళా వత్యుపాఖ్యానంలో కూడా శ్రీనాథుడు కొంత మార్చినాడు. సుశీల కొఱకు విద్యాధరుడు రాక్షసుడు కలిసి పోరాడుచున్నప్పుడు

"అప్సర స్త్రీ తిలోత్తమ, యసురవరులు
తనకు నై పోరఁజూచు చందంబు దోపఁ"     (5-152)

అని ఒక ఉపమానాన్ని వాడాడు. మూలంలో ఇలాంటిదేమీ లేదు. ఈ ఉపమానం కూడా ప్రకరణానికి సరిపోలేదు. తిలోత్తమ సుందోప । సుందుల మరణార్థమై బ్రహ్మ నిదేశమున విశ్వ కర్మ చేత సృష్టింపబడిన అప్సరస! సుందోపసుందులు ఆమె సర్వ దక్షిణకరములు పట్టుకొని

"సుందరి మా యిద్దరిలో
నందెవ్వరి వలతు సెప్పుమా! యనవుడు బూ
ర్ణేందు ముఖి వారి కనుమీ
యందెవ్వడు వొడిచె యొడుచున తనిన వలతున్"     (భావ. ఆది 8-110)

అని పణమును నిర్ణయించింది. ఇచ్చట సుశీల విద్యాధరున్నే పతిగా వరించి సహగమనము చేసినది. ఏక స్త్రీని వినిహితకాములై ఇరువురు పురుషులు తమలో తాను పోరి మరణించుట వరకే సామ్యము. ఈ ఉపమానమిక్కడ సరిపడుటలేదు.

విద్యాధర, రాక్షసులు తన కొఱకై పరస్పరము పోరాడి యిరువురును మరణించిరి. అప్పుడు మరణించిన విద్యాధరుడే తనకు భర్తయని నిర్ణయించుకొని సుశీల యతనితో సహగమనము చేసినది. ఇక్కడ తెలుగులో

"వెండియునక్కన్యక కర్పూర కదళి కాద్రుదు నిర్వన్నిర్యాస ధారాద్రవ

వాసనా సుగంధంబులగు.........యగు శిలా ఘట్టంబు మెట్టి

నిలిచి ..........'' (5-169)

అని ఒక పెద్ద వచనమున్నది. ఇదేమియు మూలంలో లేదు. "విరహాగ్నౌ విస్పష్టామః' అని మాత్రమున్నది. సహగమనము చేసినట్లుగా కూడా కంఠోక్తిగా లేదు. ఇది యంతయు శ్రీనాథుని అన్యధాకరణము.

**6.2.5 అమూలకములు:-** శ్రీనాథుడు సందర్భోచితంగా అమూలకములైన భావాలను కూడా కొన్నింటిని తన కాశీఖండంలో ప్రవేశపెట్టాడు.

1. అగస్త్యుడు కాశీ వియోగానికి పరితపించుట (2-104)
2. ద్రాక్షారామ వేశ్య వర్ణనము (3-23)
3. అగస్త్యుడు కొల్హాపురానికి వెళ్తూ మార్గంలో వీర భద్రేశ్వరుని వర్ణించుట (3-28-35)
4. కంచి ద్రవిడ స్త్రీ వర్ణనము (3-109)
5. కాశీలో విశ్వేశ్వర శంభు లింగము నడుమ దివ్య బాలకుడుద్భవించుట (3-244)
6. బుధలోక వృత్తాంతము నందు బుధుని వర్ణనము (4-191) ఇత్యాదులు శ్రీనాథుడు కూర్చిన అమూలకములలో ముఖ్యమైనవి.
7. శివ శర్మో పాఖ్యానంలో విష్ణు భటులు శివ కర్మకు లోకాలను వివరించి చెప్తున్నప్పుడు

   "బ్రహ్మచర్యం బొక్క రాత్రి దైవికమున
   మఱచి తప్పిన యట్టి మాచకమ్మ'. (3-172)

   అను పద్యము, ఇంకను

   "మాంత్రికుండైన యొక సిద్ధమౌని నొండె'' (3-173)

   అను ఈ రెండు పద్యములకు సంస్కృత మూలము లేదు.

8. కళావత్యుపాఖ్యానంలో విద్యాధరుడు మరణించిన పిమ్మట సుశీల సహగమనము చేసే సందర్భంలో-

   'వెగ్గలమైన కూర్మి నరవింద దళాయుత నేత్ర (5.159)' అను పద్యం నుండి
   "ఏఁబ్రభాతాంబుల నీశాన వాపిక
   న నిశంబు తీర్థమాడిన ఫలంబు'' (5-170)

అను పద్యం వరకు గల కరుణ రస తరంగితమగు నీ ఘట్టమంతయును శ్రీనాథోపజ్ఞమే. దీనికి మూలము లేదు.

9. వ్యాస నిష్కాన ఘట్టంలో

"ముంగిట గోమయంబున గోముఖము దీర్చి

కడలు నాల్గుగ ముగ్గు కజ్జపెట్టి" (7-142) అను పద్యంలో

కాశీ నగర పురంధ్రుల - అతిధ్య ప్రకారమును వర్ణించినాడు. ఈ ఆతిధ్య వైభవమంతయు ఆంధ్రకవి ప్రతిభా సముల్లసితమే. దీనికాధారము చెప్పదగిన ఒక్క శ్లోకము కూడా మూలమున కానరాదు.

శ్రీనాథుడు పురాణమును పురాణ రూపంగా అనువదించి ఉండలేదు. భాషాంతరీకరణమను స్ఫురణను కలుగనీయక స్వతంత్ర కావ్యమనిపించు రీతిని చేయుటను తెలుగు చేయుట అంటారు. పురాణమును కావ్యీకరించటంలో శ్రీనాథుడు కృతకృత్యుడయ్యెను. ఈ విధమైన శ్రీనాథుని తెనిగింపు మూలానికి సర్వత్ర విధేయమై యుండక ఒక చోట ప్రపంచించి, ఒక చోట కుదించి మరియొక చోట అన్యధాకరించి, ఒక చోట మూలములోలేని దానిని ఇతర సంహితుల నుండి చేర్చి గచ్ఛ ద్వ్యాఖ్యాప్రాయంగా స్వచ్ఛంధ వాహినియై అవిముక్త క్షేత్ర మహిమార్ణవము నందు కలియుచున్నది.

## 6.3 క్షేత్ర మహాత్మ్య గ్రంథాలు - కాశీ ఖండ ప్రాధాన్యము:-

తెలుగులో క్షేత్ర మహాత్మ్య కావ్యాలు ఒక సాహిత్య ప్రక్రియగా పరిగణింపబడుచున్నవి. స్థల పురాణాలనే క్షేత్ర మహాత్మ్యములంటారు. పురాణేతిహాసాల్లోని మాహాత్మ్య వృత్తాంతాన్ని ఆధారంగా చేసుకొని తెలుగులో స్వతంత్ర ప్రక్రియగా ఇది అవతరించింది. క్షేత్ర మహాత్మ్య గ్రంథాలలో మొట్ట మొదటిది ఎఱ్ఱన రచించిన నృసింహ పురాణం. పిమ్మట శ్రీనాథుని భీమేశ్వర పురాణ, కాశీ ఖండ, శివరాత్రి మహాత్మ్యములు ఈ కోవలేనివే. అట్లే భైరవ కవి రచించిన శ్రీరంగ మహాత్మ్యము, ధూర్జటి శ్రీకాళహస్తి మహాత్మ్యం, తెనాలి రామకృష్ణుని ఘటికాచల మహాత్మ్యం, పాండురంగ మహాత్మ్యము మున్నగునవి క్షేత్ర మహాత్మ్య గ్రంథాల్లో పేర్కొనదగినవి.

రస భావ నిర్భరమైన భక్తి, స్వభావోక్తి సుభగములైన ఆయా క్షేత్రాలకు సంబంధించిన వర్ణనలు, ఆయా క్షేత్రాల్లో వెలసిన దేవతల మహాత్మ్యాలు వాటికి సంబంధించిన ఉపాఖ్యానాలు మొదలైనవి క్షేత్ర మహాత్మ్య గ్రంథాల్లో విశిష్టంగా గోచరిస్తున్నాయి. ఈ క్షేత్ర మహాత్మ్య గ్రంథాలందు ఫలసిద్ది విరహితంగా ఉంటాయి. వీట్ని రచించిన కవులు మహా భక్తులు. వారి భక్తి ప్రవత్తులు ఆత్మీయత ఆయా గ్రంథాల్లో ప్రతిబింబితమై ఉంటాయి.

క్షేత్ర తీర్థ దైవ మహాత్మ్యాలు చాల వరకు బ్రహ్మాండ, స్కాందాది పురాణాల నుండే పుట్టాయి. బాహ్య దృష్టి కవి పురాణాల్లాగా భాసిస్తుంటాయి. కాని పురాణ ధర్మమిందు గౌణము. "పురాణాలు కథ కొరకు పుట్టినట్లుండును. కాని స్థల పురాణాలు కవి కొరకు పుట్టినట్లుండును. క్షేత్ర మహాత్మ్య గ్రంథాలలోని ఉపాఖ్యానాలు ప్రధాన కథకు పోషకాలై కథా కధన చాతుర్యంతో శిల్ప వైదగ్ధ్యంతో ఒప్పారుతుంటాయి. ఈ ఉపాఖ్యానాలు కథా శ్రవణ ప్రవణమైన జనాభి రుచిని కొంతవరకు సంరక్షించుటచే ఇవి ప్రబంధాల కంటే మిన్నయనదగు గౌరవాన్ని పొందాయి. కాశీ ఖండంలో పేర్కొన్న క్షేత్రాలు వాటి మహాత్మ్యమెట్టిదో పరిశీలిద్దాం.

వింధ్య నారద సంవాదం మొదలుకోని శ్రీ విశ్వేశ్వరావిర్భావం వరకూ 101 ఉపాఖ్యానాలు కాశీ ఖండంలో ఉన్నాయి. ఈ ఉపాఖ్యానాలన్నీ క్షేత్ర మహిమ సంకీర్తనమనేటువంటి ఏక సూత్రమునందు మణుల వలె కూర్చబడి ఉన్నాయి. శ్రీ విశ్వేశ్వర స్వామి, వారణాసీ మహా క్షేత్రం, గంగానది, కాలభైరవ స్వామి, డుంఠి విఘ్నేశ్వర స్వామి. ఈ ఐదుగురు చుట్టూ ఈ కథా సూత్రం తిరుగుతుంది. ఈ సూత్రానికి కూర్చబడ్డ అద్భుత కథలన్నీ కాశీ క్షేత్ర మహిమ యందే పర్యవసిస్తాయి.

క్షేత్ర మహిమ ప్రధాన వస్తువైన యీ కావ్యమునందనేక తీర్థాలు, అసంఖ్యాక లింగాలు, వాని ఆవిర్భావం, పురుషార్థ స్వరూప నిరూపణము, జప, తపో, దాన, ధ్యాన, యోగ యజ్ఞ యోగాదులకు దుర్లభమైన అపవర్గలక్ష్మి, అవిముక్త క్షేత్రము నందు శరీర త్యాగ

మాత్రాననే జీవునకు కైవసమై శివ సారూప్యాన్ని ప్రసాదించే విశేషాలు ఈ కాశీ ఖండము నందు రాశీ భూతమై ఉన్నాయి. కుమారాగస్త్య సంవాదం ప్రత్యక్షంగా కాశీ క్షేత్ర మహిమను తెల్పుతున్నది. అంతక పూర్వం సముద్రాన్ని గురించి విని అది ఎట్లా ఉంటుందో ఎన్నడునూ చూచి ఎరగని వానికి ఎట్ట ఎదుట ఆకస్మికంగా ఆ మహా సముద్రం కనిపించినప్పుడు వాని భావాలు ఏ విధంగా తరంగితములవుతాయో కాశి ప్రథమ సందర్శన వేళ యందు దేవతల భావాలు ఆ విధంగా తరంగితములైన తీరు యీ క్రింది పద్యంలో గోచరిస్తుంది.

"ధర్మంబు కాశి కాస్థాన మధ్యంబున
నాల్గుపాదంబుల నడచియాడు
నర్థంబు కాశీ పురాంగణంబున యందు
నానా ప్రకారమైనటున మిగులు ।
గామంబు కాశి కాకటక ఘంటా వీధి
గర్వించు రాజలోకంబు తేవ
మోక్ష సంపదలు కాశీ క్షేత్రమున యందు
ద్రవ్వి తండంబులై నివ్వటిల్లుఁ
కాశికళ్యాణముల కాది కారణంబు
కాశి యణి మాది సిద్ధుల కాటపట్టు
కాశి జనలోక సంకల్ప కల్పకంబు
కలుష పిశితంబు మెసవు రాకాసికాశి" (2-50)

ఈ విధంగా అభయ స్థితిని సకల జీవరాశులకు ప్రసాదించటానికి బద్ధకంకణమై ఉన్న కాశీ వైభవము దేవతల బహిరంతః కరణముల యందు నిండి పోయింది.

క్షేత్రములు బాహ్యములని, అంతరములని రెండు విధాలు. వారణాసి మొదలైన మహాక్షేత్రాలు బాహ్యములే కాని అంతరములుగా కూడా ఉంటాయి. కాశి యందు శ్రీ విశ్వేశ్వర లింగము కాక ప్రసిద్ధములైన లింగములు 14 ఉన్నాయి. ఓంకారేశ్వరుడు, త్రివిష్టపేశ్వరుడు, వీరేశ్వరుడు, కృత్తివాసేశ్వరుడు, కేదారేశ్వరుడు, విశ్వకర్మేశ్వరుడు మొదలగు వారు. నిగూఢలింగాలు మరికొన్ని ఉన్నాయి. రత్నేశ్వరుడు, శైలేశ్వరుడు, సతీశ్వరుడు, నర్మదీశ్వరుడు మొదలైనవారు. ఇవిగాక కోటానకోట్ల శివలింగాలు ఉన్నాయి. నూవు గింజంత మేరయైనను శివలింగం లేని ప్రదేశం కాశిలో లేదు. కాశీయే మహా లింగ స్వరూపం. కాశి క్షేత్రమే జ్యోతిర్లింగాత్మకము. కల్పాంత వేళల యందు కూడా ప్రకాశిస్తుంది. ఆది వరహ రూపంతో విష్ణువు ప్రళయ సముద్ర జలాల నుండి తన దంష్ట్రాగ్రంతో భూమిని పైకెత్తినపుడు భూమితో సంబంధంలేక జలోపరిభాగం పై ఛత్రాకృతితో కాశి ప్రకాశిస్తున్నది. త్రిశూలాగ్రం పై శివుడు కాశిని ధరించి యుండెనని పురాణ ప్రసిద్ధి. అదికృత యుగంలో త్రిశూలాకృతి. త్రేతా యుగంలో వర్తులాకృతి, ద్వాపర యుగంలో రథాకృతి, కలియుగంలో శంఖాకృతి.

కాశి నగర సన్నివేశాన్ని ఒకే రేఖా చిత్రంగా శ్రీనాథుడిట్లా వర్ణించాడు.

"కాశి నగరి ధనుర్వల్లి గంగానారి
కోటి యుగ్మంబులోలార్క కుధరధరులు
వృషము బాణంబు లక్ష్యంబు వృజనరాశి
విశ్వనాథుండు ధన్వియుర్వీ కళత్ర!" (2-76)

జప, తపో, దాన, ధ్యాన, యోగ, యాగాదులకు అలభ్యమైన కైవల్యం శరీర త్యాగ మాత్రానే సమస్త జీవరాశులకు అనుగ్రహించి కాశీ క్షేత్రం శివసారూప్యాన్ని ప్రసాదిస్తుంది. శివ మహిమకన్నా క్షేత్ర మహిమే గొప్పది. కాశి సాక్షాత్తుగా కైవల్య ప్రదాత్రి. ఇతర క్షేత్రాలు కాశీ ప్రాప్తి కరములై పరంపరా సంబంధం చేత కైవల్యాన్ని ఇచ్చేవి.

'కాశి శివ లింగ కోటులఁగన తల్లి
కాశి కైవల్య ఫలదాన కల్పవల్లి
గంగ గారాబు నెచ్చెలి కత్తె కాశి
సుర నరోరగ దైత్య సంస్తుత్య కాశి!' (2-209)

అని కాశీ క్షేత్ర మహత్మ్యాన్ని గురించి చెప్పబడింది.

## 6.4 కాశీ ఖండము - ఇతివృత్త నిర్వహణము:-

కాశీ ఖండము స్కాంధ పురాణంలోనిది. పురాణం 14 విద్యాస్థానాల్లో 13వ స్థానాన్ని అలంకరిస్తున్నది. వేదార్థాలను పురాణ ఇతిహాసాలు ఉపాఖ్యాన రూపంగా ప్రపంచిస్తున్నవి. వేదార్థాన్ని యథాతథంగా తెలుసుకోవడానికి పురాణ ఇతిహాసాలే శరణ్యములు. వేదార్థాన్ని స్మరించేవి అవటంచేత, ఋషి ప్రోక్తాలవటం చేత, క్వాచిత్కంగా వీనికి కూడా 'స్మృతు'లని వ్యవహారం కలదు. పురాణ విజ్ఞానవేత్తలను 'బహుశ్రుతులు' అని అంటారు. కాశీ ఖండ ప్రారంభంలో శ్రీనాథుడు పురాణ విద్యా స్వరూపాన్ని సంగ్రహంగా ప్రతిపాదించాడు.

4 లక్షల గ్రంథ పరిమితి గల తొలి పురాణాల నుండి ఉప పురాణాలుద్భవించాయి. ఆద్యములైన పురాణాల్లో స్కాందము పదునొకండవది. దాని గ్రంథ పరిమితి ఒక లక్ష. స్కాంద పురాణానికి అవయవ భూతములైన సంహితలు ఆరు. వానిలో 1. సనతులమార సంహిత ఏబదియైదు వేల గ్రంథ పరిమితి కలది. 2. సూత సంహిత ఆరువేలు. 3. శాంకర సంహిత ముప్పది వేలు. 4. వైష్ణవ సంహిత ఐదువేలు. 5. బ్రహ్మ సంహిత మూడు వేలు. 6. సౌర సంహిత ఒక వేయి. ఈ సంహితల్లోనే ఏబది ఖండాలున్నాయి. అవి నాగర ఖండము మొదలైనవి. వానిలో కాశీ ఖండం ఒకటి. దీని గ్రంథ సంఖ్య పంద్రెండు వేలు.

కాశీ ఖండమందలి ఇతివృత్త స్వరూపాన్ని స్థూలంగా శ్రీనాథుడు ఇట్లా నిర్దేశించాడు.

"ప్రాశస్త్యంబు వహించు ద్వాదశ సహస్ర గ్రంథ సంక్షిప్తి వి
శ్వేశ క్షేత్ర వియన్నదీ వటుకడుంఠీ శాస సంకీర్తనో
ద్దేశ ప్రక్రమ శోభితాద్భుత్ కథా ధిష్ఠానమై శ్రేష్ఠమై
కాశీ ఖండ మఖండ వైభవమునన్ స్కాందుబ్ధి మధ్యంబునన్" (1-81)

ఇందులో సాంఖ్య యోగాలు, మంత్రతంత్రాలు, అనేక స్మృతి విషయాలు, సదాచార స్వరూపం, కృత్యాకృత్య నిరూపణము, కాల జ్ఞానము, స్త్రీ, పురుష సాముద్రిక లక్షణాలు. తత్తదుపాఖ్యాన గర్భితంగా ఒక విజ్ఞాన సర్వస్వమీ గ్రంథంలో పొందుపరచబడి ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే చతుర్దశ భువనాత్మకమైన సమస్త బ్రహ్మాండ సారం ఈ కాశీ ఖండంలో రాశీకరింపబడింది.

అవి ముక్త క్షేత్ర మహిమాభి వర్ణనమే ప్రధానంగా గల కాశీ ఖండంలోని ఇతి వృత్తానికి స్తంభ భూతములైన కథాంశాలు నాలుగు. ఇదియొక మహా మంటపం. ఈ నాలుగు కథాంశాలును ప్రత్యక్ష పరోక్ష రూపంగా కాశీ మహిమనే నిరూపిస్తున్నవి.

1. వింధ్య గర్వ సంస్తభనము, 2. శివశర్మో పాఖ్యానము, 3. కుమారాగస్త్య సంవాదము, 4. దివోదాస చరిత్రము.

కాశీ ఖండారంభంలో అగస్త్యకృతమైన వింధ్య గర్వ స్తంభనం ముముక్షువు కాబోవు జీవుని యొక్క గర్వ నిరుపసరూపమైన ప్రథమాధికార భూమికను సూచిస్తుంది. కాశీ ఖండ మందలి శివశర్మ కథ ద్వితీయ భూమికను సూచిస్తున్నది.

మధురా నగర నివాసియైన శివశర్మ వేదాలను చదివాడు. వాని అర్థాలను మనసుకు పట్టించుకున్నాడు. ధర్మశాస్త్రాలు పఠించాడు. పురాణాలను అధిగమించాడు. వేదాంగాలను అభ్యసించాడు. తర్కమీమాంసాదులను పర్యాలోచించాడు. భోగాలనుభవించాడు. ప్రత్రులనుత్పాదించాడు. వారికి సంపదలు పంచిపెట్టాడు. ఇంతలో యౌవనం కరిగిపోయింది. ముసలితనం రావడంతో వివేకియై అతని హృదయం వ్యాకులమైంది.

"<u>గౌరీనాథున్ భజియింప నేరనయితిన్ శ్రీ కాశికావల్లభున్</u>" (3.81) అని భావించి ఇల్లు వదలి వెళ్లి ఒకమఱ్ఱి చెట్టునీడలో విశ్రమించి ఇట్లా అనుకున్నాడు.

"ఉజ్జయిని కాశి మాయ యయోధ్య కాంచి
మధుర ద్వారక అనెడి నామములు కలిగి
పట్టణములేఁడు గీర్తి సంపద వహించు
మహిత కైవల్య లక్ష్మికి మందిరములు" (3-88)

అతడు సప్తపురీ యాత్రకు సంకల్పించాడు. అతని హృదయం ప్రయాగ వెళ్లటానికి మిక్కిలి ఆకర్షించింది. కాని కాశిని విడవలేదు.

"కాశి కేతెంచు మఱిఁబ్రయాగమున కేగుఁ
గాశి కేతెంచు మఱిఁబ్రయాగమున కేగు
మునుగు మణికర్ణికా తీర్థమునను మఱియు
మునుగు మణికర్ణికా తీర్థమునను మఱియు" (3-95)

అతని మనసునకు నిలకడలేదయ్యెను. అతడు కాశీ ప్రయాగములను కూడ విడిచి దూర భూముల్లో ఉన్న ముక్తి క్షేత్రాలకు వెళ్ల దలచినాడు. పాండిత్యం ఏకాగ్రతకు పరిసంధి!

"<u>బహుధా విప్రతిపత్తి ధీ విషయముల్ పాడైన శాస్త్రార్థముల్</u>" (3-101)

అతని శాస్త్ర జ్ఞానమే అతన్ని చెఱిచింది. తుదకత '<u>ఉదకమున్నత భూమి యుందుండ లేక పల్లమున కోడిగిల్లినట్లుగా</u>' కాశి విడిచి తీర్థాంతరాలకు కదలిపోయాడు. తాను సంకల్పించిన సప్తపురీ యాత్ర చేశాడు. తుదకతడు మాయాపురంలో కాల ధర్మం పొందాడు. అతన్ని తీసుకొని పోవడానికి దివ్య విమానంలో విష్ణు కింకరులు వచ్చారు. వారు శివశర్మకు ఇంద్రాది లోకాలను, నవగ్రహ లోకాలను చూపించి ఆ లోకాలకు సంబంధించిన వివిధములైన ఉపాఖ్యానాలను వ్యాఖ్యానించారు. ఆయా లోకాధిపతులు అవిముక్తి క్షేత్రము నందు చేసిన వివిధ తపస్సులు, లింగ ప్రతిష్ఠలు, పొందిన సిద్ధులు వివరించి చెప్పారు. చివరికతనియాత్ర ధ్రువ పదము మీదగా సత్య లోకమును స్పృశించి వైకుంఠం చేరాడు. కైవల్యాన్ని గురించి అతని సంశయము సంశయంగానే మిగిలిపోయింది. తుదకు శివశర్మ నోరువిడిచి బ్రహ్మనడిగాడు. ఆయన విష్ణు కింకరులే నీ సంశయాన్ని తీర్చగలరని దాటబెట్టెను. అతడొక బ్రహ్మ సంవత్సరము వైకుంఠంలో ఉండి తిరిగి భూమి పై వృద్ధ కాలుడను రాజుగా పుట్టి అవిముక్తి భూమికి వెళ్లి తన పేరిటనచ్చట వృద్ధ కాలేశ్వరమును శివలింగాన్ని ప్రతిష్ఠించి కైవల్యాన్ని పొందాడు. సమస్త లోకాలను పర్యటించిన శివ శర్మ కథ కైవల్య ప్రాప్తికి అవిముక్త క్షేత్రం కంటె శరణ్యం లేదనే విషయానికి దృష్టాంత భూతముగా ఇందు నిబంధింపబడింది. ఈ విధంగా వింధ్య గర్వ స్తంభన రూప కథాంశము, శివ శర్మ కథాంశం పరోక్షంగా కాశీ క్షేత్ర మహిమను ప్రతిపాదిస్తున్నవి.

తృతీయ కథాంశమైన కుమారాగస్త్య సంవాదం ప్రత్యక్షంగా కాశీ క్షేత్రమహిమను తెల్పుతున్నది.

ఒక విధంగా పంచమాశ్వాసం నుండే కాశీ ఖండం మొదలగుతున్నదని చెప్పాలి. ద్వితీయాశ్వాసంలో దేవతలు కార్యార్థులై అగస్త్య సందర్శనానికి వచ్చినపుడు ఆనుషంగికంగా వారికి కాశీ సందర్శన భాగ్యం లభించింది. కాశీ ఖండము నందలి ఇతి వృత్త లతలకన్నింటికీ ఆలంబన స్తంభమై ఆగస్త్య మహాముని యొక్క సమగ్రమైన మూర్తిమత్వము ప్రప్రథమంగా దేవతలకు సాక్షాత్కరించింది. లోకోపద్రవ శమనార్థమైన దేవతా సంప్రార్థనాన్ని మన్నించవలసి ఉన్నందు వల్ల మోక్ష క్షేఅరతమైన కాశీ నగరంతో అగస్త్యునకు వియోగం సంభవించింది. అగస్త్య ముని యొక్క అతి ముక్త స్థలాను బంధము ప్రాకృతము కాదు. ఆయన కాశీ వియోగ దుఃఖము

"పరమ కల్యాణి! యోభాగీరథీ గంగ

వార్థి భూమిని పోయి వత్తునమ్మ"! (2-139)

"కలహంసి రారాదె! కదలినాతోఁగూడి

నీవేలవత్తమ్మ నెమ్మి నుండి" (2-140)

ఈ మొదలైన అనులాపాలతో రస స్థితిని పొంది ద్వితీయ శ్వాసము సమాప్తమౌతుంది.

కాశీ వియోగ దుఃఖవహ్నితో అగస్త్య మహర్షి వింధ్య గర్వ స్తంభ మొనర్చి లోపాముద్రతో దక్షిణ దిగభిముఖుడై వస్తాడు. త్రోవలో కొల్హాపురీ మహాలక్ష్మిని సందర్శిస్తాడు. ఆ దేవి అగస్త్య మహర్షిని ఓదార్చి భవిష్యత్తులో 28వ ద్వాపర యుగంలో వేద వ్యాసుడవై జన్మించినపుడు నీకు మరలన విముక్త క్షేత్ర ప్రాప్తి లభించగలదని ఆదేశించి స్వామిమల పై వేంచేసి యున్న కుమార స్వామిని సందర్శించి ఆయన వల్ల వారణాసీతత్త్వాన్ని ఆకలించుకొని దుఃఖోపశమనాన్ని పొందగలవని చెప్పి పంపింది. కుమార స్వామి అగస్త్యుని ఆదరించి వారణాసీ తత్త్వ సర్వస్వాన్ని ఉపదేశించాడు.

ఆనంద కాననము, అవి ముక్తము, మహాస్మశానము, రుద్రవాసము, వారణాశి, కాశి మొదలగు పదాల యొక్క ప్రవృత్తి నిమిత్తములను వ్యుత్పత్త్యర్థాలను కుమార స్వామి అగస్త్యునకు ఉపాఖ్యానముఖంగా వ్యాఖ్యానించి చెప్పాడు. దివోదాస చరిత్ర ద్వారా బ్రహ్మాదులైన సమస్త దేవతలు కాశీ క్షేత్రము నందు చేసిన వివిధ లింగ ప్రతిష్ఠలను విడివిడిగా ఉపాఖ్యానాలతో వివరించి చెప్పాడు. గంగ, మణికర్ణిక, పంచనదము, జ్ఞాన వాపిక మొదలగు తీర్థముల ఆవిర్భావాన్ని ప్రశస్తిని మహిమలను విశదీకరించాడు. కాశీ ప్రాప్తి హేతువులుగా సదాచారమును, యోగ విషయమును, కాల జ్ఞానము మొదలైన ఆవశ్యక విషయములను విపులీకరించాడు.

కాశీ ఖండములో ప్రధానములైన పెద్ద ఉపాఖ్యానాలు రెండు. 1. శివశర్మోపాఖ్యానం, 2. దివోదాసోపాఖ్యానం. మొదటిది పరోక్షంగా కాశీ క్షేత్ర వైభవాన్ని ప్రతిపాదిస్తుంటే, రెండవది ప్రత్యక్షంగా కాశితో అవినాభావ సంబంధం కలది. ఈ రెండింటిలో మరల అనేకములైన ఉపాఖ్యానాలు అంతర్భూతములై ఉన్నాయి.

ఒకే విధంగా దివోదాసు కథతో కాని కాశీ క్షేత్రము యొక్క స్వరూపం సమగ్రంగా అభివ్యక్తం కాదు.

ఇక్ష్వాకు వంశ ప్రభువైన రిపుంజయుడను రాజు శివయోగియై కాశీ క్షేత్రము నందు తపస్సు చేస్తున్న కాలంలో భూలోకంలో భయంకరమైన క్షామం సంభవించింది. మనుష్యులను మనుష్యులే తినివేస్తున్నారు. ఆకలితో వేల కొలది ప్రాణులు మరణిస్తున్నారు. కారుణికుడైన బ్రహ్మయీ ఉపద్రవాన్ని నివారించటానికి ఉపాయాన్ని విచారించి రిపుంజయుని పిలిచి భూమిని పాలింపుమని ఆదేశించాడు. ఆ రాజు ఒక వ్యవస్థను కోరాడు. అదేమంటే 'భూమి పై నున్న దేవతలందరును భూమిని విడిచి స్వస్థానానికి పోవాలి. నాగులందరూ పాతాళానికి పోవాలి. ఆ పక్షమునే నేను భూమిని పాలించటానికి అంగీకరింపగలను' లేనిచో లేదు. ఎందుకంటే బహు నాయకమైన రాజ్యం పదిలపడదు''.

దివోదాసు పెట్టిన ఈ 'షరతు' వల్ల ముందుగా విశ్వేశ్వరుడే కాశీ నగరాన్ని విడిచి పెట్టి పార్వతితో ప్రమథులతో సహా మందర పర్వతానికి వలస పోవలసి వచ్చింది. ఇక మిగిలిన దేవతల సంగతియేమని చెప్పాలి. శివ స్థలములు, శక్తి స్థలములు, విష్ణు స్థలములు మొదలైనవన్నియు మూల విగ్రహములంతర్ధానములై శూన్యాలయములు మాత్రమే మిగిలాయి.

శ్రీనాథుడీకథను మిక్కిలి స్వాభావికంగా చిత్రించాడు. వలస పోవలసి వచ్చినపుడు మనుష్యులు పడే అవస్థలే దేవతలునూ పడినట్లు చమత్కరించాడు.

ఇంద్రాది దేవతలంతా బృహస్పతి మధ్య నుంచుకొని కార్యాలోచన సభ పెట్టుకొన్నారు. మనుష్య మాత్రుడైన ఈ రాజున కింతటి అహంకారమా? ఈ రాజుకు బుద్ధి చెప్పాలని ఆలోచించి దేవతలు ఆ రాజు రాజ్యంలో అగ్నిదేవుడు నిజ స్వరూపాన్ని ఉపసంహరించునట్లు చేశారు. యజ్ఞ యాగాలు నిలిచి పోవటంతో పాటు గృహస్థుల ఇండ్లలో పొయ్యిలో పిల్లి లేవలేదు. రాజుకు రెండు ఝాములు దాటిపోయినా భోజనశాల నుండి పిలుపు రాలేదు. వంట బ్రాహ్మణులెట్లో ప్రయాసపడి నాటికి భోజనాన్ని సౌరపాకంతో ఆయత్తపరచారు. మొగసాలలో ఆకలితో అల్లాడిపోతున్న ప్రజలు గుంపులు కట్టి రాజుతో తమ గోడు చెప్పుకోవటానికి వచ్చారు. రాజు వారికి అభయాన్నిచ్చి పంపి, తానే అగ్ని దేవతా స్వరూపాన్ని ధరించి ప్రజల యజ్ఞపాక క్రియాదులను పరిపాలించాడు. దేవతలు ఆ రాజు రాజ్యంలో 'వరుణ దేవత' తన స్వరూపాన్ని ఉపసంహరించునట్లు చేశారు. రాజు తన యోగ శక్తి చేత వరుణదేవతా స్వరూపాన్ని దాల్చి వానలు కురియించి పంటలు పండించాడు. దేవతలు వాయు దేవతను ఉపసంహరింపజేశారు. రాజు వాయుదేవతా స్వరూపాన్ని దాల్చి దేవతలకు దుర్నిరీక్షుడయ్యాడు. ఆ రాజు రాజ్యంలో ఎచ్చటా ధర్మ లోపం లేదు.

ఈ విధంగా రాజు 80 వేల సంవత్సరాలు కాశీ నగరం రాజధానిగా భూలోకాన్ని పరిపాలించాడు. మందర పర్వతం మీదికి వలసపోయి ఉన్న విశ్వేశ్వర స్వామికి కాశీ క్షేత్ర విరహము దుర్భరమై క్షణమొక యుగంగా గడుపుతున్నాడు. ధార్మికుడైన ఆ రాజును ఏమనటానికి వీలు లేదు. ఆయన యందు దోషాన్ని నిరూపించి కాని కాశి నుండి ఆయన్ను వెడలనడుచుటకు వీలులేదు. అంతవరకును తాను తిరిగి కాశీ క్షేత్రము నందు ప్రవేశించటానికి అవకాశం లేదు.

అందువల్ల ఆ రాజు నందు ఆ రాజ ప్రజల యందు దోషాన్ని పట్టటానికై శివుడు ముందుగా చతుష్షష్టి యోగినీ గణాన్ని పంపాడు. వారు వివిధ రూపాల్లో కాశీ నగర శృంగాట కాల యందు సంచరిస్తూ దోషాలను కనుక్కోవటానికి జల్లెడ పట్టుతున్నారు. దోషము పట్టటం వారికి సాధ్యం కాలేదు. తమ పేరిట శివ లింగాలను ప్రతిష్ఠించి వారు కాశీ యందే నిలిచి పోయారు. శివుడు కర్మసాక్షియైన సూర్యుడ్ని పంపించాడు. ఆయన వివిధ రూపాలను ధరించి శోధించి, శోధించి విఫల ప్రయత్నుడై కాశీ క్షేత్రాన్ని విడిచి తిరిగి మందర పర్వతానికి పోలేక లోలారుచు మొదలైన ద్వాదశ రూపాలతో ద్వాదశ లింగాలను ప్రతిష్ఠించి అక్కడే ఉండిపోయాడు. ఈ రీతిగా నీటిని వెదుకబోయిన తామరలాగా దేవతలందరునూ కాశీ క్షేత్రమందే స్థిర నివాసమేర్పరచుకొని తాము వచ్చిన పనిని విస్మరించారు. కాశీలో నున్న తమ పై విశ్వేశ్వరునకు కోపం రాదని వారందరికీ తెలుసు. విశ్వేశ్వర స్వామి కూడా ఒక విధంగా సమాధానపరుచుకొన్నాడు. తన పరివారమంతా ఒక్కొక్కరుగా కాశికి చేరుకొనుచున్నారు కదా! ఏనాటికో ఒక నాటికి తాను పోవచ్చుననుకున్నాడు. చివరకు తన ముద్దు కొడుకును, కాశి యువరాజును విఘ్నేశ్వరుని పంపాడు. ఆయన పొట్టివాడు. ఆయన డుంఠి నామాన్ని ధరించి, పలుపోకలు పోతూ తన ప్రజ్ఞలను రాజధాని యందలి ప్రజలందరునూ చెప్పుకొనునట్లు చేసి క్రమంగా రాజాంతఃపురానికి వార్తను ప్రాకించి అంతఃపుర ప్రవేశం సంపాదించి రాణివాసానికి గురువై కోటలో పాగా వేశాడు.

కాశీ నగరం యొక్క సప్తా వరణాలలో ఆవరణమొన్కొక్క దాని యందు ఎనిమిదేసి రూపాలుగా ఏడావరణములందును ఏబది యారు రూపాలతో స్థావరమేర్పరచుకొన్నారు. వినాయకునికి తోడుగా శివుడు విష్ణువుని పంపాడు. ఆయన లక్ష్మీ దేవితో, గరుడాళు వారుతో బౌద్ధ రూపాలను ధరించి వచ్చి కాశీ క్షేత్రంలో నాస్తిక మత ప్రచారం చేసి రాజు మనస్సు నందు విరక్తి పుట్టించి స్వయంగానే రాజు రాజ్యాన్ని వదిలేటట్లు చేశాడు. కాశీ మహా క్షేత్రం పంచాయతనంగా రూపొందటం దివోదాసు కాలంలోనే జరిగింది.

ఆదిత్యుడు, గణపతి, విష్ణువు, అంబిక, శివుడు - ఇది శివ పంచాయతనము. మంధర పర్వతం నుండి తిరిగి వచ్చి పార్వతీ పరమేశ్వరులు కాశీ క్షేత్రమందు ప్రవేశించటంతో కాశి యొక్క యీ పంచాయతన స్వరూపం పరిపూర్తినొందింది.

దుర్వాసుడు, దధీచి, గౌతముడు మొదలైన అసంఖ్యాకులైన మహర్షులు తమ పేర్లతో ప్రతిష్టించిన లింగములు కలవు. దుర్గ మొదలైన శక్తులు కోట్ల కొలది ఉన్నారు. శక్తి ప్రకరణము నందు దుర్గా సుర సంహార మొనరించి అమ్మవారు దుర్గానామాన్ని ధరించుట, దక్షా ధ్వర ధ్వంసం వ్యాస భుజావాక్ స్తంభనము, వ్యాస నిష్కాసనము, తీర్థ లింగ కదంబ కీర్తనము కుక్కుట మంటప వృత్తాంతము మొదలగు పెక్కు విషయాలు షష్ఠ సప్తమాశ్వాసాలలో మిక్కిలి సంక్షేపింపబడ్డాయి. అనేకములు విడవబడ్డాయి.

తాను సంకల్పించిన కావ్య స్వరూపము పురాణ స్వరూపంగా పరిణమించునేమోనన్న సంశయము వల్ల కావచ్చు శ్రీనాథుడు కాశీ ఖండము యొక్క ఉత్తర భాగాన్నంతయు చివరి రెండాశ్వాసాల్లో సంగ్రహించాడు.

సూతముని సంవాదాత్మకంగా మొదలైన ఇతివృత్తము దశాక్రమంగా లోపాముద్రాగస్త్య సంవాదంగా, కుమారాగస్త్య సంవాదంగా, పార్వతీ పరమేశ్వర సంవాదంగా విస్తరించి ప్రతి పద్య విషయమై కాశీ క్షేత్ర మహిమను క్రమోన్మీలిత మొనరించాడు.

## 6.5 పాత్ర చిత్రణము:-

కాశీ ఖండము నందు 1. వింధ్య - నారదులు, 2. అగస్త్యుడు, 3. శివశర్మ, 4. గుణనిధి, 5. కళావతి, 6. దివోదాసు, 7. ధనంజయుడు, 8. పారావత మిధునము, 9. మహానందుడు, 10. వ్యాసుడు మొదలగు పాత్రలు కన్పించెదరు. ఇందలి కొన్ని ముఖ్యమైన పాత్రలను శ్రీనాథుడు తీర్చిదిద్దిన విషయాన్ని పరిశీలిద్దాం.

1. **వింధ్య పర్వత రాజు:-** వింధ్య పర్వత రాజుకు మొదటగా ఎదురైన పాత్ర నారదుడు. అతడు రాగానే వింధ్య అతిథి మర్యాదలు చేసి త్రిలోక సంచారి రావటం తన అదృష్టంగా భావిస్తుంది. క్రమంగా వింధ్య వినయం ఆత్మోత్కర్షకు లోనయింది. అంతేగాక పరనిందకు దారి తీసింది. మేరు పర్వతం ఒక్కటే తనతో సరిపోలినదని, మిగిలినవేవియు తనకు సరిపోలవని అధిక్షేపించింది. మేరు వంటే తనకు ఈర్ష్యగా ఉన్నదంటూ పలికింది. కాబట్టి తామిద్దరిలో ఎవరు గొప్పో మొగమాటం లేకుండా చెప్పాల్సిందిగా నారదుడ్ని అడిగితే 'ఆత్మ గర్హించి' నారదుడు లోలోపల ఎంతో అసహ్యించుకొని, ఏమీ మాట్లాడకుండా ఒక నిట్టూర్పు విడిచాడు. వింధ్యుని గర్వాన్ని ఏ విధంగా అణచాలో నారదునికి తెలుసు. అతనిలోని స్పర్థ అహంకారం మరింత పెరిగేట్టుగా మేరువునకు వింధ్యమునకు సమానత్వాన్ని అంగీకరించినట్లే అంగీకరించి, శ్రీశైలము, వెంకటాచలము మీ ఇద్దరి కంటె అధికమైనవని నారదుడు చెప్పి వెళ్లిపోతాడు. నారదుడు వెళ్లిన తరువాత వింధ్యుని స్థితిని, అతని మానసిక స్థితిని శ్రీనాథుడిట్లా వివరిస్తున్నాడు. బాధలో వింధ్యమనుకొనుచున్న స్థితి ఇది.

"శాస్త్రమాచార్య సన్నిధి చదువడేని
నిద్దబోధంబు మది సంగ్రహింపడేని
తెగువ మీఱి ప్రతిజ్ఞ సాధింపడేని
జ్ఞాతి జయమందడేని తజ్జనుడు జనుడె?" (1.106)

వస్తుతః మేరువు తనకు జ్ఞాతి కాడు. శైలవత్వమను సామ్య ధర్మాన్ని బట్టి ఈ జ్ఞాతిత్వము అటువంటి జ్ఞాతిని జయించలేని తన జన్మము వ్యర్థము. మరియునిట్లను కొనుచున్నాడు.

"కంటికి నిద్ర వచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మించునే? యితర వైభవముల్ పది వేలు మానసం

బంటునె? మానుషంబు గల యట్టి మనుష్యున కెట్టి వానికిన్
కంటకుడైన శాత్రవుఁడొకండు తన తటి వాడు గల్గినన్'' (1.108)

తనతో సమానుడగు శత్రువొకడున్నచో ఎన్న వైభవాలున్నప్పటికీ అవి ఏమియు మనకు సంతోషాన్ని ఈయజాలవు అంటూ

"ఎవ్వనితోనెచ్చోటం
జివ్వకుఁజే సాఁపవలదు చేసాఁచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వక యుండగ ఁబగసనం దీర్పదగున్'' (1-109)

నిశ్శేషంగా అతడు తన పగను తీర్చుకోవటానికి సంసిద్ధుడగుచున్నాడు. అతన్ని ఒక విచిత్రమైన జ్వరం పట్టుకొన్నది. అది వైద్యం వల్ల తగ్గేది కాదు. ఇట్టి స్థితిలో అతడేమి చేస్తాడు? ఈ విధంగా చింతాక్రాంతుడైన వింధ్యుని ఆలోచనలో హఠాత్తుగా మార్పు వచ్చింది. ఏదియో ఒకటి చేసి తీరవలెనన్న తహతహ పెరిగింది. గ్రహ రాజైన సూర్యుని రథాన్ని నిలపగల్గితే తన పగ కొంత చల్లారుతుందని భావించాడు. అంతేగాక మేరువు వైభవం కూడా కొంతవరకైనా తగ్గుతుందనుకున్నాడు. అదియే తనకు కావల్సింది. లోకంలో కొంత కలకలం పుట్టుంది. అదికూడా వింధ్యునికి సంతోషకరమైన విషయము, అని భావన చేస్తూ పెరిగిపోయి వింధ్యుడు నిర్నిమేష దృష్టితో సూర్యోదయాన్ని ప్రతీక్షించాడు. ఈ విధంగా సూర్య రథాన్ని నిలిపేటప్పటికి జగత్తంతా అంధకారబంధురమైంది. లోకాలన్నీ నిష్క్రియములైనవి. దేవతల్లో సంచలనం పుట్టింది. అగస్త్యుడంతటి వాడు తనకు ప్రాణ ప్రదమైన కాశీ నగరాన్ని విడిచి దక్షిణా పథానికి కదలి రావలసి వచ్చింది. అంత వింధ్యము "మహాత్మా! చరాచరంబైన జగంబు నందు నీ యజ్ఞజేయని వారునుం గలరె? నీవు మరవి విచ్చేయునంత దాఁకను నిట్లయిండెద'' (2.164) అంటూ నేల కొరిగిపోయాడు. మేరువుతో బలీయమైన యాస్పర్థ ఏమైపోయెనో? అగస్త్యుని ప్రత్యాగమనానికై ప్రతీక్షిస్తూ వింధ్యము అట్లే నిలిచిపోయాడు. రాసికుడైన వింధ్యుని అహంకార గర్వములు మిన్ను ముట్టి తుదకేవిధంగా నేలపాలైనవి అనే నీతి ఈ వింధ్యము ద్వారా తెలుస్తున్నది.

2. **అగస్త్యుడు:-** అగస్త్యులవారన్నంతనేః

"ఎవ్వాడు వింధ్యాద్రి నిట్టింకు లింకించె
గంభీర హుంకార గర్జనమున
ప్రణవ పంచా క్షరోపనిషత్ప్రపంచంబు
లెవ్వాడు శివుని చేనెఱి గికొనియె
గడసిల్లు ధర యొడ్డ గెడవైన నెవ్వాడు
త్రాసుపై గట్ల చందమున వంచె
నంభోధు లేడింటి నాపోశనం బెత్తి
కలిగించె నెవ్వాడు గ్రమ్మఱంగ'' (భీమ 2-77)

అని ఏ నాటివో, ఎక్కడెక్కడి విషయాలు జ్ఞాపకానికి వస్తాయి. వారిని గురించి చెప్పాలంటే ఆయన పరమ మహేశ్వరుడు, మహా శివ భక్తుడు, మహాతపశ్శక్తి సంపన్నుడు. అవసరమైతే ఆయన తపశ్శక్తినంతటిని లోకహితం కోసం ధారపోసే గొప్ప ఔదార్య గుణం కలవాడు. ఈ గుణం పెక్కురకుండదు. మిగిలిన వారికి అగస్త్యునకు గల భేదమిదే. లోకంలో ఎంతో మంది గొప్ప తపశ్శక్తి సంపన్నులైన ఋషులు లేరా? వారందరు ఈ లోకోపద్రవములను

పట్టించుకొంటున్నారా? వారి మట్టుకు వారు తపస్సు చేసికొంటున్నారు కాని అగస్త్యులట్లాకాదు. లోక స్థితి సుఖంగా సాగటం కోసం నిరంతరం జాగరూకులై ఉంటారు. ఈయన ఉన్నాడన్న ధైర్యంతోనే త్రిమూర్తులు నిశ్చింతగా ఉంటారట.

దేవతలు వచ్చి వింధ్యుని వల్ల కల్గిన లోకోపద్రవాన్ని వివరించి కాపాడమని అడిగిన వెంటనే

"యత్నమొనరింతు నీ కార్యమనువు పడఁగఁ
జనుడు మీమీ నివాస దేశములకర్థి
నున్నవాడు గదా! వీఁడెయు మయుఁదాను
గాశికాభర్త మన పాలి కల్పతరువు" (2-101)

అని వెంటనే అంగీకరిస్తాడు. ఇది ఆయన ఔదార్య గుణానికి ఉదాహరణము. అడిగిన వెంటనే సమ్మతించాడు కాని, ఆ పని ఎంత దుష్కరమైందో, దాని వలన తాను దేన్ని వదలుకోవాల్సి వచ్చిందో, తానెంత నష్టపోయాడో తరువాత గాని తెలిసిరాలేదు. రెండాబోతులు పోట్లాడుకొంటుంటే మధ్యలో నలిగిన లేగదూడవలె అయిందని భావించాడు. ఋషుల పాలిటివా యింతలేసి పనులు అని అనుకున్నాడు. లోకంలో మనుష్యులు "తామొకటి తలచిన దైవమొకటి తలచును" అను మాట ఎంతో నిజమైందట. తానేమో కాశీలో స్థిరంగా ఉండాలనుకొంటుంటే దైవమతన్ని కాశి నుండి వెడలకొట్టున్నది. ఆలోచిస్తున్న కొద్దీ ఆయనకు దేవతల పన్నాగమేమిటో తెలుస్తున్నది. జాగ్రత్తగా పరిశీలిస్తే అగస్త్యునిలో రెండు లక్షణాలు కన్పిస్తున్నాయి. కాశీ నగరాన్ని విడిచి పెట్టటానికి ఎంత బాధ పడుతున్నాడో ఆ బాధనంతటినీ తన జ్ఞానం చేత త్రిప్పుకొనుచున్నాడు. కాశీ విరహం వల్ల బాధపడతాడు. దీన్ని బట్టి అగస్త్యుడెంతటి ఆర్ద్ర హృదయుడో అంతటి జ్ఞాని అని తెలుస్తున్నది. ఆయనలో భక్తులకుండెడి హృదయ ధర్మము, జ్ఞానులకుండెడి మనీషా ధర్మము రెండూ సమాన స్థాయిలో ఉన్నవి. విజ్ఞాన లక్షణం చేత యీ హృదయ ధర్మం చేత శబలితమైన మనస్థితిలో పూర్ణమానార్ణవము వలె ఉన్నాడు. అగస్త్యుడు వశిష్టుని లాగా నిస్తరంగ సముద్రము కాడు.

3. **శివశర్మ:-** శివశర్మ పేరు వినగానే

"నానా శాస్త్రము లభ్యసింపగ ఁననంత ద్రవ్య మార్జింప సం
తానంబుం బడయంగఁబుత్రులకు నర్థంబు ల్విభాగించి యీఁ
తానఃపుణ్యమునన్ సుఖంబనుభ వింపంబోయెఁగా లంబు గౌ
రీ నాథున్ భజియింప నేరనయితిన్ శ్రీకాశికా వల్లభాన్" (3.81)

అనే పద్యం గుర్తుకు వచ్చి మనస్సంతా చింతాక్రాంతమై పోతుంది. వార్థక్యం రాగానే 'పౌనఃపున్యమునన్ సుఖంబును వింపంబోయె గాలంబు, గౌరీ నాథున్ భజియింప నేరనయితిన్ శ్రీకాశికా వల్లభున్' అని చింత నొందాడు. సమగ్రమైన మానవ జీవితానుభవానికి చక్కని ప్రతీక శివశర్మ కనిపిస్తాడు. ఆయన జీవితంలో ఏ చీఁకు చింతా లేదు. కాని ఆయనెందుకో విచారపడుతున్నాడు.

ఆయన గోపాలకృష్ణుని అర్చించలేదట! విఘ్నేశ్వరుని పూజింపలేదట! ముని జనులకు మ్రొక్కలేదట. శ్రీ సూక్త, పురుష సూక్తాలు, పంచాక్షరీ, శతరుద్రీయము మొదలైనవేవీ ఇతడు జపించలేదట. అందువల్ల తానేమియు నష్టపడలేదు. అయితే ఈ బాధ ఎందులకు? తాను చేసిన పుణ్యకర్మ తప్ప, మిగిలిన వేమియు తనతో రావనుచున్నాడు. అందుకే

"కాలుసేయాడు కాలంబెకదలవలయు
దీర్ఘ సేవకు దేహ మస్థిరము గాన" (కాశీ 3-85)

అని తీర్థ యాత్రలకు బయలుదేరాడు. కాశిలో గంగామణి కర్ణికాది పుణ్య తీర్థాల యందు స్నానం చేసి సమస్త దేవతలను కొలిచి శ్రీ విశ్వేశ్వర స్వామిని సేవించాడు. కాశీ ప్రయాగల చుట్టూ తిరుగుతూ అమృత క్షేత్రమైన వారణాశి నగరమును, ప్రయాగను విడిచి దూర క్షేత్రాలకు వెళ్లాడు. చివరకు చనిపోతాడు.

మనుష్య జీవితం యొక్క చారితార్థ్యము కర్మ ఫలానుభవంలో లేదు. కైవల్యంలోనే ఉంది. కైవల్య వైశిష్ట్యాన్ని ఆ కైవల్యాన్నిచ్చు కాశీ నగర వైశిష్ట్యాన్ని ఈ కథ పరోక్షంగా నిరూపిస్తున్నది. అంతేగాక మానవత్వంతో పరిమితమైన వ్యక్తి జీవితము బ్రహ్మాండ స్వరూపంగా ఎట్లు పరిణమించునో యీ కథ ఆలంబనంగా వివరించాడు. కవి కర్మ ఫలములైన మిగిలిన లోకాలకు, కైవల్య ప్రదమైన కాశీ నగరానికి గల వ్యత్యాసం దీనిలో స్పష్టంగా తెలియజేయబడింది. కైవల్య ప్రాధాన్యాన్ని వ్యతిరేక మార్గంగా నిరూపిస్తూ ఆ కైవల్య ప్రాధాన్యము నందే ఈ కథ పర్యవసిస్తున్నది.

4. **గుణనిధి:-** ఇది మూడు జన్మల కథ. అనేక జన్మల్లో జీవుడు చేసిన తపస్సు వల్ల సుకృత విశేషాల వల్ల లోకాధిపతి అవుతాడు. ఈ లోకాధిపత్య మొక పదవి వంటిది. అర్హతను బట్టి ఎవరైనా దాన్ని సాధించుకోవచ్చు. గుణనిధి మూడు జన్మల్లో ఈ అర్హతను సంపాదించుకొని లోకాధిపతి అయ్యాడు.

కాంపిల్య నగరంలో యజ్ఞ దత్తుడనే బ్రాహ్మణుని కొడుకు గుణనిధి. తండ్రి వేదాంగాలను తెలిసిన వాడు. యజ్ఞ విద్యా విశారదుడు. నిరంతరం విద్యా వ్యసనియై కుమారుడ్ని నిర్లక్ష్యం చేశాడు. అతన్ని గురించి ఏమీ పట్టించుకోలేదు. గుణనిధి రాత్రింబవళ్ళు జూదమందు మునిగి తేలుతూ నిజకులాచారాలనన్నింటిని విడిచి పెట్టి తిరుగుచున్నాడు. దానినే 'ఆపేత నిజాచారాడగుచు' అనుచున్నాడు కవి.

"బ్రాహ్మణాచారంబు పరిహాసకము చేయు
నగ్నిహోత్ర విధానమన్ననబగు
సంధ్యాభివందన శ్రద్ధ యుజ్జన చేయు
గీతవాద్య వినోదకేళిఁదగులుఁ
భాషండభండ దుర్భాష లా వర్తించు
ద్యూత కారుల తోడి యుద్దివడయు
ధాతువాదుల మీదఁదా త్పర్యమొనరించుఁ
జెలిమి పాటించు నాస్తికుల తోడ
నటులమన్నించి హర్షించు విటులఁజూచి
పీఠమర్థుల కొనరించు బెద్ద ఊకము
కొలటేయులఁబాటించు గారవించు
శిష్టకుల దీక్షితుని పట్టి సిగ్గు విడిచి" **(4-81)**

మరియు నాతడు

"సజీవ నిర్జీవ ద్యూతంబులనోడిన ధనంబులు కితువుల కుందల్లి మేని రవణంబుల నమ్మి పెట్టుచుండు" **(4-82)**

ఇది అతని సమగ్రమైన స్వరూపము. తండ్రి చేత అలక్ష్యము చేయబడ్డ కుమారుడిట్లు గాక మరొక విధంగా ఎట్లా ఉంటాడు? ఆలోచిస్తే ఇందులో ఎవరికైనా తప్పంతా తండ్రిదేనని తెలియ వస్తున్నది. తల్లి ప్రతి దినం హితవు చెప్పేది.

తల్లి కుమారుని దుశ్చర్యలను తండ్రికి తెలియనిచ్చుట లేదను విషయం ఇక్కడ తెలుస్తున్నది. చివరికొకనాడు హఠాత్తుగా విషయాన్నంతటిని తెలిసి కొన్న తండ్రి ఆమెను నిలదీస్తాడు.

"కల్లలాడంగ ఫలమేమి కలిగె నీకు?
మాటిమాటికి నేను నీ మాట నమ్మి
యరసి రక్షింపనేరక యనుగు గొడుకు
భ్రష్టుఁ జేసితి నేమి చెప్పంగఁ గలదు?" (కాశీ 4-107)

అసత్యములైన ఆమె మాటలు నిజమేనని మాటి మాటికి నమ్మి కొడుకును పాడు చేసుకొని నాడుట. ఆమె, ఆమె యొక్క ఏకపుత్రుడు కలసి ఇల్లు గుల్ల చేశారు. ఈ విధంగా బాధపడి అతడు బ్రతికి ఉన్న కొడుకునకు తిలోదకములిచ్చి యజ్ఞదత్తుడు తన భార్యను విడిచి తిరిగి వివాహం చేసుకొన్నాడు. తండ్రి కోపం తెలిసిన కొడుకు మరి యింటికి రాలేదు. ఇల్లు విడిచి పెట్టిన గుణనిధి ఇట్లనుకొనుచున్నాడు.

"ఏమి సేయుదు? నెక్కడి కేగు వాఁడ?
ధనము నిప్పచ్చరంబు విద్యయు హుళిక్కి
పెట్ట సాగెడు నా చేయి భిక్షసేయ
నెట్ట నేరుచు? దైవంబయెఱుఁగు నింక" (4-111)

అప్పుడు గుణనిధికి జీవితం యొక్క యథార్థ స్వరూపం, తన నిస్సహాయత, అసమర్థత అతనికవగతమగుచున్నవి. అతనిలోని వ్యక్తిత్వమింకను రూపుదిద్దుకోలేదు. అసలింకను అతనిలోని పసితనమే పోలేదు. అతడొక విరిసీ విరియని మొగ్గ వంటి వాడు.

పగలంతా అతనికి భోజనం దొరక లేదు. చీకటి పడింది. ఊరి వెలుపల శివాలయంలో ఒక శైవుడు నాలుగు జాములలోను శివునకు నైవేద్యము పెట్టవలసిన భోజన పదార్థాలన్నీ సమకూర్చుకొనినాడు. దానిని గుణనిధి చూచాడు. రాత్రి బాగుగా ప్రొద్దుపోయి కార్యక్రమాలన్నీ ముగిసి జనమంతా సద్దుమణిగిన తరువాత నెమ్మదిగా గుణనిధి అక్కడకు చేరుకొన్నాడు. ఆలయ దీపము నందలి వత్తి యంతయు కాలిపోయి చీకటిలో భోజన పదార్థాలున్న పాత్రలు కనిపించకపోయే సరికి ఆరి పోవుచున్న ఆ దీపమున నేయి పోసి తన వస్త్రాన్నే చించి వత్తిగా చేసి వెలిగించాడు. ఆ పాత్రను తీసికొని వెలుపలికి వస్తుంటే అలికిడికి జనం లేచి అతన్ని వెంబడించి బాణాల్తో కొట్టి చంపేశారు. దైవికంగా ఆ రోజు శివరాత్రియైంది. అతడు తన వస్త్రాన్ని చింపి వత్తిగా చేసిన ఆ 'దీపము' ఒక సంస్కారంగా మిగిలిపోయింది. జన్మ జన్మలకు అది వ్యాపించింది. అతడ్ని లోక పాలకునిగా చేసింది. చనిపోయిన గుణనిధి ప్రదీప తేజస్సంధు క్షణాదికమై పుణ్య విశేషం చేత కళింగ దేశాధీశ్వరుడుగా జన్మించాడు.

తన దేశంలో ప్రతి శివాలయంలోనూ దీపకళికా చోటులుండాలని ఆ రాజు శాసించాడు. ఆ విధంగా శివాలయంలో దీపకళిక నిలుపని వారి తల తెగవ్రేయుడని రాజు తలవరులనాజ్ఞాపించాడు. ఈ కళింగాధిపతియే జన్మాంతరంలో కుబేరుడై ఈశ్వరునకు సఖుడగును. కాశీ నగరమందు శివుని ప్రతిష్ఠించి లోకపాలకుడైనాడు. వెనుకటి జన్మలలోని ఆ సంస్కార విశేషం చేత ఇతడు శివుని యొక్క అఖండమైన దీపంగా భావించాడు. అమ్మవారు ఆ దీపానికి ఆలంబన స్తంభం. తన భక్తి, విశ్వాసాలే ఆ దీపమందలి చమురు. కామము, క్రోధము మొదలైన వానినన్నింటిని ఆ దీపమందు శలభములుగా మాడ్చివేయుచున్నాడు. ఈ విధమైన భావనతో ఒక నివాత నిష్కలాప దీపం వలె శివుని గూర్చి ఎంతో కాలం తపస్సు చేశాడు. చివరకు శివుడాతనికి అఖండమైన తేజో రూపంతోనే ప్రత్యక్షమైనాడు. అతనికి దివ్యదృష్టినిచ్చి

సాకారంగా అర్ధనారీశ్వరుడుగా అతనికి కనిపించాడు. ఒక్కసారిగా అఖండమైన ఆ తేజో విశేషాన్ని, దానిలో తరువాత నెమ్మదిగా సాకారమైన శివుని మూర్తి విశేషమును చూచి విస్మయంలో నున్న కుబేరుడు అమ్మవారిని చూచి ఆమె యెవ్వరో తెలియక తికమకపడతాడు. శివుని యందు ఆమెకున్న వాల్లభ్యమును చూచి యీమె తన కంటె శివునకు ఎక్కువయా అన్న భావంతో సవతి వంక చూచు ప్రౌఢ స్త్రీ వలె పార్వతి వంక చూచినాడట! దానికి కోపగించి ఆ జగజ్జనని అతన్ని శపించింది. శివుని మీద ఉండే నిర్నిరోధమైన యారాధనా విశేషమే అతన్నిట్లు చేసింది. అది యీర్ష్యయని కొందరనవచ్చును. అతనిలో ఈర్ష్య, అసూయ మొదలగు భావాలేవియు చావలేదని కూడా కొందరనవచ్చును. ఏది ఏమైనప్పటికి శివుని మీద అతనికుండెడియా భక్తిలో అన్నియు క్షాళితములైనవి. అమ్మవారి శాపం వల్ల అతడు 'కుబేరు'డైనప్పటికి శివుని వరం వల్ల ఉత్తర దిక్పాలకుడైనాడు. అనేక జన్మల్లో జీవుడు చేసిన తపస్సు వల్ల సుకృత విశేషాల వల్ల లోకాధిపతి కాగలడు అనటానికి ఈ గుణనిధి కథ ఉదాహరణ భూతమైంది.

5. **కళావతి:-** కాశీ ఖండము నందు మిగిలిన కథలకు భిన్నమైన రీతిలో సాగింది కళావత్యుపాఖ్యానం. నిజానికిది యొక్క కళావతి కథ కాదు. మరి సుశీల కథ అనుకొంటే ఆమె ఎవ్వరు? కళావతియైనను, సుశీలయైనను ఒకే జీవి యొక్క రెండు జన్మముల ఉపాధులు. పేర్లు వేరైనను వారు పుట్టి పెరిగిన ప్రదేశాలు, కాలం ఒకటే. కాకపోతే వారి ఆత్మ లక్షణ మొక్కటే. ఇది రెండు జన్మల కథ.

చీకటి ఇంకా తొలగకముందే స్నానం చేసి స్నేహితురాండ్రతో కలిసి విశ్వనాథుని వాకిలి ముందు ముగ్గులు పెడుతూ ఒక కన్య మనకు కన్పిస్తుంది. ఆ కన్య కంటే యింకా ముందుగా 'కంకణమ్ములతో సూడిగములు' రాయగా నాగాజుల చప్పుడు విన్పిస్తుంది. ఆమె త్రిలోక సౌందర్యవతి. ఇంకొక రహస్యమేమంటే ఆమె ఉదరంలో మూడు శివలింగాలున్నాయట! మరి, ఆమె జ్ఞాన వాహికా తీర్థాన్ని సేవించేది కదా! ఆమె ఉదరంలో శివలింగాలు ఉన్నవి అంటే బహిరంతముల యందు ఆమె శివున్నే దర్శిస్తున్నదన్న విషయం స్పష్టము. ఇంతకు ఆమె ఎవరు?

కాశి నగరము నందలి హరిస్వామి అను విప్రుని కుమార్తె. ఆమె పేరు సుశీల. ఆమె గంగానదిలో స్నానం చేసి, జ్ఞాన వాపికా జలాన్ని సేవిస్తూ విశ్వనాథుని వాకిలి ముందు ముగ్గులు పెడుతుండగా రోజులు సుఖంగా గడిచిపోతున్నాయి. కాని విధి చాలా క్రూరమైంది. అది రోజులను ఇంత సుఖంగా ఎందుకు సాగనిస్తుంది. ఒక పున్నమి రోజు రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న ఆమె రూప సౌందర్యాలను చూచి మోహితుడై ఒకానొక విద్యాధరుడు ఆమెను ఎత్తుకొని మలయ పర్వతం మీదికి తీసికొనిపోతాడు. ఆ సమయంలో ఆ పరిసర ప్రాంతాల యందు సంచరిస్తున్న విద్యున్మాలి అనే రాక్షసుడు కూడా ఆమె సౌందర్యాన్ని చూచి మోహితుడై విద్యాధరునితో యుద్ధం చేస్తాడు. చివరికా యుద్ధంలో ఇద్దరు మరణిస్తారు. ఇప్పుడిక సుశీల సంగతి ఏమయినది? ఎక్కడ వారణాసి? ఎక్కడ మలయ పర్వతము? ఆమె ఎక్కడి నుండి ఎక్కడకు వచ్చింది? ఎందులకిట్లుయినదామె జీవితము? ఇప్పుడు కర్తవ్యమేమి?

ప్రాణం పోయే సమయంలో విద్యాధరుడామెను చూచి 'కటకటా నిన్ను' అంటూ ఇక మిగిలిన మాటల పలకలేక అంతిమ శ్వాస విడిచాడు. గాఢ నిద్రలో ఉన్న ఆమెను తీసుకొని వచ్చాడు. ఇది పైశాచిక వివాహం. రాక్షసునితో పోరాడి అతన్ని చంపి యీమెనిట్లు నిస్సహాయ స్థితిలో వదిలి తాను కూడా మరణించాడు. అప్పుడు సుశీల ఈ విధంగా అనుకుంటున్నది.

"ఆలింగనమ్ము సేసెం
తాలిండ్లను ముట్టె వదన పద్మము తావుల్
గ్రోలె మగఁడనఁగ నెవ్వం
డాలనఁగా నెద్ది? భర్తయాతఁడే నాలన్" (5.156)

చివరికతడే తన భర్తయను నిర్ణయానికి వచ్చింది. వెంటనే విద్యాధరునితో సహగమనం చెయ్యాలని నిశ్చయించుకుంది. చితిని పేర్చుకొని మెడలో సురభి కుసుమ మాలను ధరించి సహగమనానికి కావలసిన నేపద్యాన్నంతటిని సంతరించుకొంది. విశ్వేశ్వరుని, తల్లిదండ్రులను తలచుకొన్నది. నా స్వామి విశ్వేశ్వరునకు నేనేమి తప్పు చేశానో? వారణాశిలో అందరు తమతమ ఇండ్లలో క్షేమంగా ఉండగా నాకీ దశ సంభవించిందేమిటని వాపోతుంది. తన పూర్వ జ్ఞాపకాలను, చేష్టలన్నింటిని స్మరించుకొంటూ బాధ పడుతుంది. ఇదంతా విధి విలాసమనుకుంటుంది. తన చేత సేవలు చేయించుకోవటానికి శ్రీ కాశీ విశ్వేశ్వరునకు ఇష్టం లేకపోయిందని శంకిస్తుంది. వైధవ్యం స్త్రీకి భరించలేని వేదన్ను కలుగజేస్తుంది కాబట్టే అతని తోడిదే లోకంగా చితిమంటలో పడి తాను వెళ్లిపోదలచుకుంది. దైవము తన నొసట వ్రాసిన యీ యవనాగ్ని కంటె ఈ చితి మంటలు తనకెక్కువ బాధాకరమైనవేమి కాదు. అంతేకాక తానెంతయో ప్రేమతో తీసుకొని వచ్చినాడా విద్యాధరుడు. తన కోసం ప్రాణాలను సైతం విడిచి తనకన్నుల ఎదుట నిర్జీవంగా నేల మీద పడియున్నాడు. ఒక విధంగా ఆలోచిస్తే అతడ్ని ఈ స్థితికి తీసికొని వచ్చింది తన సౌందర్యమే. అటువంటి పరిస్థితిలో నాతనిని విడిచిపెట్టి తానెట్లు జీవితాన్ని కొనసాగిస్తుంది. పాపము ఇప్పటి వరకు ఆమె దుఃఖాన్నంతటినీ ఎట్లో దిగమ్రింగుకొంది. ఇక ఆమెకు సాధ్యం కాలేదు. వెంటనే లేచి మండుచున్న చితికి ప్రదక్షిణంగా వచ్చి నిసర్గ కాతరములైన తన చూపులనే పుష్పాంజలులుగా చేసి చితిని ఆరోహించింది. నెల వంక సూర్యునిలో కలసిపోయినట్లుగా ఆమె అగ్నిలో కలిసిపోయింది. తరువాతి జన్మలో ఈమె కళావతిగాను, ఆ విద్యాదరుడు మలయకేతుడను రాకుమారునిగాను జన్మించి వధూవరులై సంతానవంతులైనారు. ఆమెలో వెనుకటి జన్మపు సంస్కారమేమియు పోలేదు. కాలాంతరమున ఆమె భర్తతో కలిసి కాశీ నగరానికి వచ్చి జ్ఞానవాపికా తీరంలో తపస్సు చేసి ముక్తి పొందింది.

విధి దేనికైనా, ఎటులైనను మార్చగలదు. కాని, సుశీల తన సుకృత ఫలం చేత సంకల్ప శక్తి చేత ప్రతికూలమైన యావిధి యౌదల మీద పాదన్యాసం చేసింది. చేసి గెలిచింది. కాబట్టే ఆమె మరుసటి జన్మలో ఆ విద్యాధరుడ్నే భర్తగా పొంది అతనితో కలిసి కైవల్యాన్ని పొందింది. మొత్తము పై ఈ 'సుశీల' కథ కాశీ ఖండానికి కావ్యదీధితిని కల్పించింది. ఆ వెలుగు ఆద్యంతముల యందు వ్యాపించి ఉంది.

6. **దివోదాసు:-**

"బడలు పడితి రాజ్య భారంబు భరియించి
పొడమె మది విరక్తి భూసుపర్వ!
ఏమిసేయు వాడ! నెక్కడ కేగుచు?
నేమిదిక్కు? మాకు నెఱుఁగఁజెప్పు" (కాశీ 6-88)

ఎనుబది వేల సంవత్సరాలు ప్రజారంజకంగా రాజ్యం చేసి సర్వ భోగాలను అనుభవించాడు దివోదాసు. ఇట్లనుకొంటున్నాడు, తాను తలచుకొంటే ఇంకొక ఎనుబది వేల సంవత్సరాలు రాజ్యం చేయగలడు. అంత సమర్థుడతడు. కాని ఏమిటి ఈ నిర్వేదము? ఎందులకీ చింత? మనిషియైన ప్రతివాడూ ఏ నాటికో యొకనాటికీ స్థితికి రాక తప్పదేమో! అసలు ఈ సంసార లక్షణమే అంత! జీవునిగా ఈ దివోదాసు శాశ్వతుడు. ఏ జీవియైనా అంతే కదా! మరణం శరీరానికే గాని జీవునకు లేదు. జీవుడు శాశ్వతుడు. కాని ఆ శాశ్వతత్వమే దివోదాసు కిష్టం లేదు. తన యోగశక్తి చేత పర్జన్యాగ్న్యాని లాత్మకులైనారు అంటే నీరు, నిప్పు, గాలి కూడా తానే యైనాడన్నమాట. ఏమయిననేమి? అఖండమైన ఆ శివ చైతన్యంలో తాను కూడా కలిసిపోవలెనని అనుకొంటున్నారు. దాని కోసం దారులన్నీ తెరచుకొని కూర్చుని ఉన్నాడు. ఇది శివునకు, దివోదాసునకు గల ఆంతరంగిక విషయం. ఈ రహస్యము మీద మొత్తమీ కథ అంతా ఆధారపడి ఉంది. ఈ కథ ఆలంబనంగా త్రైగుణ్యామైన ప్రకృతి యొక్క ఖేలనమంతయు ప్రదర్శింపబడింది. ఇందు దేవతలు మనుష్యుల వలె కనిపిస్తారు. మనుష్యుల వలెనే ఆలోచిస్తారు, ప్రవర్తిస్తారు. అంత మాత్రం చేత వారి దేవత్వమునకేమియు భంగం

రాదు. లేకపోతే పరమ శివుడు దివోదాసుని ఆజ్ఞకు లోబడి తన కత్యంత ప్రియమైన కాశీ నగరాన్ని కూడా విడిచి పెట్టి ఎక్కడో కుశ ద్వీపంలోని మందరము మీద తల దాచుకోవడమేమిటి? తిరిగి కాశీ నగరాన్ని చేరటానికి అన్ని అవస్తలు పడటమేమిటి? పరమేశ్వరుడెప్పుడు ఎవ్వరికి భయపడడు. ఎవ్వరికి లోబడడు. కాని, దివోదాసుని ఆజ్ఞను శిరసావహించాడు. ఎందుకు? భక్తుడు కాబట్టి. మరి పరమేశ్వరుడు భక్తపరాధీనుడు కదా! అనేక మహా కల్పముల యందు ఎన్నో సంఘటనలకు కూటస్థ సాక్షియై సర్వేశ్వరుడు సర్వ నియామకుడు, భక్త పరాధీనుడునైన యా పరమ శివుడు తన భక్తుని ఉత్కర్షను నిరూపించటం కోసమే చేసిన లీలా విశేషమే యీ దివోదాసుని కథ. ఈ కాశీ నగర వాసమెంతటి కష్ట సాధ్యమైన విషయమో, ఇందుకొరకు సాక్షాత్తు పరమ శివుడు కూడా ఎంతటి ప్రయత్నం చేయవలసి వచ్చిందో అను దానిని పరోక్షంగా నిరూపిస్తున్నదీ దివోదాసోపాఖ్యానము.

7. **ధనుంజయుడు:-** ఈశ్వరానుగ్రహం వల్ల కాని, కాశీ నగర ప్రవేశం సాధ్యం కాదు. అనటానికి ఉదాహరణ ప్రాయంగా కుమార స్వామిచే అగస్త్యునికీ కథ చెప్పబడింది. ఈ కథను చదివిన వెంటనే పాఠకునికి గల్గు మన స్థితి జాలి. అతి ప్రయాసతో, తన పురుష ప్రయత్నానంతటిని ఉపయోగించినప్పటికీ తల్లి అస్థికలను గంగలో కలపలేకపోయాడు ధనుంజయుడు. అతని మాతృభక్తి, కార్యదీక్ష, ఎదుర్కొన్న కష్ట నష్టాలు అన్నింటిని చదువుతున్న పాఠకునిలో చివరికతడు ఫలితం పొందలేక పోయేసరికి , ఒక విధమైన నిరాశ, దైవం పట్ల అనాసక్తి, నాస్తికత మొదలైన భావాలు మొలకెత్తే ప్రమాదం కూడా లేకపోలేదు. ఆ అవకాశాన్ని చేజేతులా శ్రీనాథుడు కల్పించాడు. ధనంజయుడెంత ప్రయత్నించినప్పటికీనీ తల్లి అస్థికలను గంగలో కలపలేక పోవుటకు గల కారణమా తల్లి చేసిన ఘోర పాపాలే! ధనంజయుని తల్లి బ్రతికి ఉండగా కాశీ నగరాన్ని చూడలేకపోవడమే కాక ఆమె మరణించిన తరువాత ఆమె అస్థికలను కూడా కాశీ నగర ప్రవేశము లేదన్నమాట. అంతటి పాపము ఆమె ఏమి చేసిందో? ఈ విషయాన్ని కవి మనకు తెలుపలేదు.

8. **పారావతమిథానులు:-** కుమార స్వామి అగస్త్యునకు త్రివేష్టపేశ్వర మహాత్మ్యాన్ని గూర్చి చెప్తూ అక్కడ ముక్తి పొందిన ఒక పారావత మిథునాన్ని గూర్చి చెప్తాడు. ఇట్లా ముక్తిని పొందిన వారు ఈ గ్రంథంలో ఒక ఎలుక, చీపురు కట్టతో కూడా లింగైక్యాన్ని పొందిన ఒక పరిచారికయు కలరు.

9. **మహానందుడు:-** మహానందుడు బ్రాహ్మణ యువకుడు. చిన్నప్పుడే తల్లి దండ్రులను కోల్పోయి అవినయ విధానమైన యౌవనంలో విషయాసక్తుడై స్నేహితుని భార్యనపహరించి దుశ్చర్స్వృత్తుడై చేయకూడని పనులు చేస్తున్నాడు. అతని అర్థ కాంక్షకు మితం లేదు. అతడొకనాడు విభూతీ రుద్రాక్షలు ధరించి శైవుడై , మరొకనాడు మూడు నామాలతో భగవద్గీతను పఠిస్తూ పరమ భాగవతుడౌతాడు. ఈ విధంగా వివిధ ఆకారాలెత్తుతుంటాడు. భగవంతుడు భాగవతుల్లో ఉంటాడనే జనులు నమ్మకాన్ని అతడీ విధంగా సొమ్ము చేసుకుంటాడు. బ్రతుకు తెరువు క్షుణ్ణంగా తెలిసిన వాడు మహానందుడు. ఏ ఎండకాగొడుగు పట్టే లక్షణమతనికి బాగా తెలుసు. చండాలునిచే దానాన్ని పరిగ్రహించుటతో భరించలేక మహానందుని వెలివేశారు. చివరకు మహానందుడక్కడ ఉండలేక ఇతర పుణ్య ప్రదేశాలను ప్రవేశించటానికి అనుజ్ఞ లేక కుటుంబ సహితుడై కీకట దేశానికి పోతూ మార్గ మధ్య అరణ్యంలో దొంగలచే దోచుకోబడి వారిచే సంహరింపబడ్డాడు. అతనిలో పశ్చాత్తాపం మొదలైంది. ఎంతటి దుర్మార్గులకైనా, మరెంతటి వంచకులకైనా జీవితపు చిట్ట చివరి ఘడియల్లో మరి ఈ చింతన, విచారణ రాక తప్పదు. ఇది మనుష్య లక్షణం. మరుసటి జన్మలో ఇతడు, ఇతని సంతానము, భార్య కుక్కట జన్మలెత్తి సార్థవాహుల చే కాశీ నగరానికి తీసికొని రాబడ్డారు.

10. **వ్యాసుడు:-**

> "వికార హేతౌ నతి విక్రియంతే ।
> యేషాం నచే తాంసిత ఏవధీరాః ॥"

వికార హేతువున్నప్పటికీ ఎవరి మనసు వికృతి చెందదో వారే ధీరులు. పరమేశ్వరుడట్టి ధీరుడు. ఆయన ఒక్కడే యీ సృష్టిలో నిర్వికారుడు. ఎంతటి మహర్షులైనా, మరెంతటి గొప్ప తపస్సంపన్నులైనా ఏనాటికో యొక నాటికి, ఎప్పుడో ఒకప్పుడు మనస్సు వికృతిని చెందక మానదు. అసలు - ఉపాధి యొక్క లక్షణమే యంత. అంత మాత్రము చేతనదియే వ్యక్తి లక్షణమనరాదు. ఆకలి, దప్పిక, శోకము, మోహము, ముసలి తనము, మరణము అను ఈ ఆరును షడూర్ములు. జీవియైన ప్రతి వానికి నివితప్పవు. ఇవి ఉపాధి లక్షణాలే కాని జీవ లక్షణములెంత మాత్రము కావు. జీవుడుపాధినాశ్రయించి ఉంటాడు. ఉపాధి యొక్క హద్దులు జీవునకు కూడా ఉంటాయి. తప్పదు, కాని మహర్షులైన వారికి, గొప్ప తపస్సంపన్నులకు నిజంగా ఇది యొక అగ్ని పరీక్ష.

ప్రతి దినము ప్రాతః కాలములో గంగా స్నానం చేసి శిష్యులకు వ్యాసుడు శివ ధర్మాలను చెప్తూ పంచాక్షరిని జపిస్తూ, విశ్వేశ్వరుని అర్చిస్తూ, మాధుకర వృత్తితో ఉదర పోషణం చేసుకుంటూ సుఖంగా కాలం గడుపుతున్నాడు. హఠాత్తుగా ఒకనాడు విశ్వేశ్వరునికీ వ్యాసుని పరీక్షించాలనే బుద్ధి పుడుతుంది. శివుడు పెట్టిన పరీక్షలో వ్యాసుడు నెగ్గినను నెగ్గకపోయినా ఆయన చేత పరీక్షింపబడుటలోనే ఉన్నది వ్యాసుని గొప్పతనము! నిజానిది పరీక్ష! లేక అనుగ్రహమా? ఈశ్వరుడు చేసిందేమిటి? జీవుల - అంతశ్చైతన్యంలో ప్రవేశించి నియమనము చేయు స్వభావం కలవాడు ఈశ్వరుడు.

ఎప్పటిలాగానే మిట్టమధ్యాహ్నపు మండుటెండలో భిక్ష కోసం కాశీ నగర వీధుల్లో వ్యాసుడు తిరుగుచున్నాడు. చిత్రమేమిటో గానీ ఎక్కడను భిక్ష దొరకటం లేదు. తిరిగి తిరిగి ఆయన చాల అలసిపోయాడు. శిష్యులెవ్వరికి కూడ భిక్ష దొరకలేదు. వెనుకటి జన్మల్లో చేసికొన్న ప్రారబ్దం వల్లనే నేడిక్కడ భిక్ష లభింపలేదు. ఈ ప్రారబ్ద కర్మ ఫలము బ్రహ్మకు కూడ దాట శక్యము కాదని బాదరాయణుని శిష్యులు కాశీ నగర వైభవాన్ని పేర్కొన్నారు. మరునాడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. వ్యాసునకు కోపం వచ్చి భిక్షా పాత్రను నడి వీధిలో పగులకొట్టాడు. ఆకలి ఆయన విచక్షణా జ్ఞానాన్ని పోగొట్టింది. ఇది ఉపాధి యొక్క లక్షణం. కాశీ నగర బ్రాహ్మణులు తనకు భిక్ష వేయకపోవుటకు వారి ధన, విద్యా, మోక్ష మదములే కారణమని కాశీ నగరం పై కోపించి శపించ ప్రయత్నిస్తాడు. అప్పుడు అన్నపూర్ణ షడ్రసోపేతంగా కడుపునిండా భోజనం పెట్టి నెమ్మదిగా మందలిస్తుంది. అందుకు విశ్వేశ్వరుడు వీడు కాశి నుండగ అర్హుడుకాడని పంపివేశాడు. ఇది వేద వ్యాస కథ. గ్రంథారంభంలో అగస్త్యుని కథ, గ్రంథాంతమున వేద వ్యాసుని కథ. వీరిద్దరూ ఒకటే అనడానికి కూడా అంతః ప్రమాణముంది.

## 6.6 కాశీ ఖండము - రస సారస్యము:-

కాశీ ఖండములో అనేకములైన ఉపాఖ్యానాలున్నాయి. కాబట్టి ఆ ఉపాఖ్యాన కథల్లో యధాసంభవంగా ఆయా రసాల పరపోషణానికి కావలసిన విభావాది పరికరాలకు లోటు లేదు. కాశీ ఖండమందలి వస్తువు లింగములు, తీర్థములు ఋషులు మొదలైన విషయాలతో నిండి ఉంది. సామాన్యంగా స్థల పురాణాలు భక్తి భావ బోధకాలైనవి. ఆ స్థలముల యొక్క మహిమను వేనోళ్ల ప్రకటించటమే దీని లక్ష్యం. ఆ స్థలంలో అధివసించిన దేవతను సర్వ సమర్థునిగాను, అనంత శక్తియుక్తుని గాను, అవి చిత్రిస్తాయి. క్షేత్ర మహత్మ్యము నందు ఇది రసమని ప్రకటించుట దుర్ఘటమైన విషయము. ఇటువంటి కావ్యాల యందు ఎక్కడ చూచినా నిండినిబిడీకృతమైన భక్తి భావం వెల్లివిరుస్తుంది. ఏ రసమైనా అంతిమమైన భక్తి భావంలో పర్యవసిస్తుంది. క్షేత్ర కావ్యంలో భక్తికి ఏక సూత్రత ఘటింపవచ్చును.

1. శివశర్మ యొక్క భక్తిని తీర్థయాత్రాత్మకమైన భక్తి అనియు,
2. అగస్త్యుడు వ్యాసునికి పరమేశ్వరతత్త్వాన్ని వ్యాఖ్యానించి చెప్పుట బోధన కైంకర్య భక్తి భావమనియు,
3. పరివార దేవతలను అర్చించుట అర్చనా కైంకర్య భక్తి అనియు,

4. భక్తి యందలి తరగతులను ఏర్పరుప వచ్చును. భక్తి భావానికి దగ్గరగానున్న శాంత రసము అంగి రసంగా కాశీ ఖండంలో అంగీకరింపవచ్చును.

1. కాశీ విప్రలంభమునకు అగస్త్యుని ఆలంబన విభావంగా కరుణ రసం పోషించబడింది.

2. కాల భైరవ దేవుడాలంబనంగా రౌద్ర భయానక భీభత్సములు పోషింపబడినవి.

3. శక్తి ప్రకరణము నందు దేవి ఆలంబనంగా, దక్షాధ్వర ధ్వంసము నందు, వీరభద్రాడాలంబనంగా వీర రసము, కళావతి ఆలంబనంగా శృంగార, కరుణములు పోషింపబడినవి. స్థూలంగా వాటిలో కొన్నింటిని ఇట్లు వివరిస్తాను.

**1. శృంగార రసము:-**

'ఆచార్య ప్రియభామ' యమి కొన్ని దివశంబు
విచ్చగింపడు ఱెప్పలెత్తి చూడ
నుల్ల ముప్పిళ్లూర నొక కొన్ని దినములు
వీక్షించు ఁజూడని వేళల యందు
నొక కొన్ని తిథులు గర్భోక్తి చాతుర్యంబు
మెఱయ నేకాంతంబ మేలమాడు
నొక కొన్ని ఘస్రంబు లొక్కొక్క నెపమున
నంగాంగ సంస్పర్శ మాచరించు
వలచిపై ఁబడు నొక కొన్ని వాసరములు
హృదయమున రాగ సంపద లిగురు కొలిపి
కవయఁదొడఁగిన యది యాదిగాఁగనునిచెఁ
జందురుడు తార శుద్ధాంత సదన భూమి" (కాశీ 4-198)

ఇక్కడ చంద్రుని లోని రతికి ఆలంబన భావము తార. శుద్ధాంత సదనము ఉద్దీపన విభావము. రెప్పలెత్తి చూచుటకు ఇచ్చగింపకుండుట చూడని వేళలో చూచుట, ఏకాంతమున వేలమాడుట, అంగాంగ స్పర్శన మాచరించుట, వలచి పైబడుట మున్నగునవి అనుభవాలు, వ్యభిచారి భావములు, ఆలస్యము, చపలత, ఉన్మాదము మొదలగునవి. చంద్రునిలోని తారా విషయకమగు రతి స్థాయి భావము. ఇది విభామను భావాదులచే పరిపోషితమై శృంగార రసంగా పరిణతినందింది.

**2. హాస్య రసము:-**

"నీ వెఱుంగు దు నీలావు నిక్క వముగ
నెఱుఁగుఁదన లావు తానమ్మ హీధరంబు
తప్పకుండ మీ బద్దయి తారతమ్య
మెంత వారును దెలియంగ నెంతవాడు" (కాశీ 1-104)

ఈ పద్యం నారదుడు వింధ్య గిరీంద్రునితో సంభాషించు సందర్భంలోనిది. నారదుడు వింధ్యుని ఆత్మాభిమానాన్ని బాగుగా రెచ్చగొట్టాడు. ఇక్కడ మేరు పర్వతం కన్న తానే గొప్పవాడనని గప్పములు కొట్ట వింధ్యము ఆలంబన

విభావము. దాని ప్రగల్భ వాక్యాలు అనుభావాలు. కలహ భోజనుని పలుకులు ఉద్దీపనములు. గర్వము, అసూయ, అమర్షము మొదలగునవి వ్యభిచారి భావాలు. ఇవన్నియు కలిసి గంభీరమగు హాస్యము ఆవిర్భవింపచేసినవి.

**3. కరుణ రసము:-**

(i) 'జ్ఞాన వాపీపయస్స్నాన క్రియా వేళ
జెలికత్తెయలు నన్నుఁదలిఁతురొక్కొ!
మది లోననే భంగిమ ఉుఁగు చుండుదురొక్కొ
తల్లిదండ్రులు సంతతంబు నాకు! .................... కానవచ్చె మిమ్ము
ముంగలి భవమున' (5-161)

(ii) భూ ధర రాజ సన్నిభుడు పుష్ప శరాసనుతోడి జోడు వి
ద్యాధర చక్రవర్తి ........................................ జీవిత మేను ధరించాదానవే? (5.164)

(iii) కొసరి వసంత కాలమునఁగోయిల గ్రోల్చిన భంగి నేడ్చె న
బ్జస రుహనేత్ర కొండ చటి బెద్ద యెలుంగున వెక్కివెక్కివె
క్క సమగు మన్యు వేగమున ఁగాటుక కన్నుల నీరు సోనలై
యు సిరిక కాయలంతలు పయోధరముల్ దిగువారునట్లుగన్ (5.167)

హరి స్వామి కూతురు సుశీల తన్ను ప్రేమించి తెచ్చిన విద్యాధరుడు విధి వశమున విద్యున్మాలియను రాక్షసునితో హోరాహోరి పోరి నిహతుడు కాగా పతితో సహగమనము చేయగోరి చితినెక్కబోవు సందర్భమిది.

ఇందు మొదటి పద్యంలో సుశీల తన చెలికత్తెలను, తల్లిదండ్రులను, పెంపుడు లేడిని, నిత్యము పూజించు ఇష్టదేవతలను తలచుకొని కన్నీరునించింది. రెండవ పద్యంలో తన మనోనాథుడైన విద్యాధర చక్రవర్తిని, కాశీ విశ్వనాథుని స్మరించింది. మూడవ పద్యంలో కాటుక కన్నీరు చిన్నారి పొన్నారి చందోయి పై చిందిపడగా కలకంఠ కంఠముతో వెక్కి వెక్కి ఏడ్చింది.

ఇందు సుశీల శోకానికి మృతపతి ఆలంబనము. మండుచున్న చితి ఉద్దీపనము. ఆమె విషాద వాక్కులు అనుభావములు. స్మృతి, దైన్యము, గ్లాని సంబావి భావాలు, కన్నీరు, డగ్గుత్తిక సాత్త్విక భావాలు. ఈ దృశ విభావాను భావ సంచారి సంయోగంచే స్థాయి భావమైన సుశీల శోకము కరుణ రస స్వరూపము ధరించింది.

**4. రౌద్ర రసము:-**

"పాదంబు విరుచేతఁబట్టి గుంజుండు జ
ర్జరితంబుగా వీనిఁజట్టు ఊత
మెడమెట్టి గోర్గొండి మెటికి పుచ్చుఁడు వీని
గ్రుడ్లు చెక్కుల నెత్తురులు స్రవింపఁ
గడికండలుగ వీని కంఠంబు వ్రేయుండు
గరసానఁబట్టిన ఖడ్గధార
బలు త్రాళ్ల బంధించి తల క్రిందుగా వ్రేలఁ
గట్టుఁడు వీని వృక్షంబు కొమ్మ

అంపమున వీని కంఠంబు ద్రెంపి విడుడు
మడమతుపుల వీని మర్మముల నొంపుఁ
డెఱ్ఱఁగా నగ్నిఁగాఁగిన యినుప యిసుకఁ
గురికి పోయుడు వీని ముక్కునను జెవుల'' (3-151, 152)

విష్ణుదూతలైన సుశీల పుణ్య శీలురు శివశర్మ అనే వాడ్ని విమానంలో ఎక్కించుకొని పోతూ మార్గమధ్యంలో దిక్పాలకుల లోకాలను చూపించి అందలి విశేషాలను చెప్పే సందర్భమిది. యమరాజధాని సంయమనికి గొనిపోయి అక్కడనున్న దండధరుని ప్రచండత్వాన్ని వెల్లడిస్తున్నారు.

ఇందు నరకములనుభవించు పాపులు ఆలంబనము, వారి పాపకృత్యాలు ఉద్దీపనలు. కరతాళవదనము, రక్తాంతలోచనములు, పరిభ్రమద్ భ్రుకుటి మొదలగునవి అనుభావాలు. ఉగ్రత, అమర్షము అనేవి సంచారి భావాలు. ఇట యముని రౌద్ర స్వరూపము కన్నులకు కట్టుచున్నది.

5. **సత్యవీరము:-**

'మాట నిల్కడఁగాదె! మధుకైటభులు దొల్లి
హరి చేత జచ్చి రేకార్ణవమున
గరుడుండు మోమోటఁగాదెఁ వాహనమయి
వనజాక్షునెక్కించుకొని యెవీఁపు
సాకతంబునఁగాదె? చక్రాయుధుఁడడంప
బాతాళ బిలములో బలి యడంగె
విశ్వాసముఁగాదె వృత్రా సురేంద్రుండు
సమసెనంబు ధివేల శక్రుచేత
మెఱసి యుపకారమొనరింపమేలువచ్చుఁ
గీడువచ్చు మనంబులో నోడవలదు
వాఁడు చేసిన ధర్మంబు వానిఁగాచుఁ
గీర్తి యొకంటి సాలదే? కేవలంబ' (2-107)

వింధ్య పర్వత గర్వ నిర్వాపణానికై దేవేంద్రునకు వాగ్దానం చేసిన అగస్త్యుడు కాశీ వియోగానికి పరితపించు సందర్భంలోనిదీ పద్యం. ఒక ప్రక్క దేవకార్యం మరొక ప్రక్క వారణాసీ వియోగం. ఏది ఏమైనా ఇచ్చిన మాట నెగ్గించుకోక తప్పదు.

మధు కైటభులు, గరుత్మంతుడు, బలి చక్రవర్తి, వృత్తాసురుడు మున్నగు వారు సత్యవ్రతపాలనానికై ఎన్నియో కష్ట నష్టాలకు లోనైనారు. ఇక్కడ మధు కైటభాదుల సత్యవ్రత పరాయణత్వంచే అగస్త్యుని హొదయంలో రేకెత్తిన ఉత్సాహమే ఇందలి సత్య వీరమునకు స్థాయి భావమగుచున్నది.

6. **భయానక రసము:-**

'సిగ్గువడి విరియఁబాఱిరి
బగ్గనఁబోరి వుచ్చు వీరభద్రుని ధాటిన్
నుగ్గులయివుయవురు సపురయి
గగ్గులవికాడైకావికలయి యమర్త్యుల్' (7-88)

వీరభద్రుడు విలయ కాల రుద్రుని వలె విజృంభించి దక్షయజ్ఞ ధ్వంసమొనర్చిన సందర్భములోనిదీ పద్యం. యజ్ఞమున హవిర్భాగము లందు కొనుటకై విచ్చేసి వికావికలైన వియాచ్చరుల భయాందోళనలీ చిన్ని కంద పద్యంలో శ్రీనాథుడు అందంగా వర్ణించాడు.

7. **శాంత రసము:-**

"నానా శాస్త్రము లభ్యసింపఁగ ననంత ద్రవ్యమార్జింప సం
తానంబుంబడయంగఁ బుత్రులకు నర్థంబుల్ విభాగించి బూఁ
బౌనఃపున్యమునన్ సుఖంబను భవింపంబోయెఁగాలంబు గౌ
రీ నాథున్ భజియింప నేరనయితిన్ శ్రీ కాశికా వల్లభున్" (3-80)

"ఈ హర్మ్యము లీతురగము
లీహేమము లీభుజిష్యలీ ధాన్యము లీ
దేహము నాతో వచ్చునె?
యూహింపఁగ బుణ్య కర్మ మొక్కటి దక్కన్" (3-83)

శివశర్మ వేద వేదాంగ వేత్త. సమస్త శాస్త్రవేత్త. యుక్తాయుక్త వివేక సంపన్నుడు. సకల భోగాలను అనుభవించినవాడు. యౌవనంబు పోకకు వార్థక్యంబు రాకకు శోకించి వ్యాకుల చిత్తుడైనాడు. ఆ సందర్భంలోని పద్యములివి.

'కాలమంతా వ్యర్థంగా గడిచిపోయింది. ఈ మేడమిద్దెలు, వెండి, బంగారాలు, ధనధాన్యాలు, వస్తు వాహనాలు నా వెంట రావు. పుణ్య కర్మ మొక్కటే నన్నంటి వచ్చేది'. ఏవం విధ సంసార పరాఙ్ముఖరూపమైన వైరాగ్య భావము అతని అంతరంగము నాక్రమించి శాంతంగా రూపొందింది.

## 6.7 కాశీ ఖండము - అలంకార ప్రాముఖ్యము:-

శ్రీనాథుడు శబ్ద సౌందర్యం పట్ల చూపు కలవాడే కాని శబ్దాడంబర ప్రియుడు కాదు. శబ్దాలంకారాలను కూడా ఎచ్చటనో తప్ప వాడడు. ప్రకృతము "అశేష మనీషి హృదయంగమంబుగా శబ్దం బనుసరించియు, నభిప్రాయంబు గురించియు భావం బుపలక్షించియు, రసంబు పోషించియు <u>అలంకారంబు</u> భూషించియు" అన్న నైషధ కర్త నిర్ణయానికి నికషోపలంగా శ్రీనాథ కవితా సరస్వతి కైసేసిన అలంకారాలను ఆలోకిద్దాం.

1. **ఉపమాలంకారము:-** ఉపమానోపమేయములకు చక్కని సాదృశ్య సంపద ఎక్కడ ప్రకాశించునో అచ్చట ఉపమాలంకారము.

'ఇక్కడలేకుండినను నగ్ని మెట్లు గాల్చుఁ
దన్ను నంటిన వారినద్దాహశక్తి
నిచ్చలేక క్రుంకిననను దహించునట్లు
త్రైర్థికుని (బొందియున్న పాతకము గంగ' (5-46)

ఇష్టమున్నను లేకున్నను తన్ను తాకిక వారిని అగ్ని దహించు విధమున ఇష్టమున్నను లేకున్నను తనలో మునిగిన వాని పాపాలను గంగ భస్మమొనరించును. ఇందు గంగ, త్రైర్థికుని పాతకము ఉపమేయములు. అగ్ని అంటిన వారు ఉపమానములు, అట్లు ఉపమా వాచకము. దహించుట సమాన ధర్మము. ఇది రమ్యమైన ఔపమ్యము.

2. **అనన్వయాలంకారము:-** ఒకే వస్తువునకు ఉపమానత్వము ఉపమేయత్వము కూడ చెప్పబడినచో అచ్చట అనన్వయాలంకారము.

ఈశ్వరుని తోడననిసేయనెట్లు వచ్చు
నన్యులకు నెంత వారికి నాగ్రహమున?
నీశ్వరుని మూర్తిగావున నెదిరినిల్చి
యుద్ధమొనరించెఁగాక యనుష్ణకరుఁడు (4-218)

పరమశివుడు గురుద్రోహియైన చంద్రుని శిక్షించటానికై వచ్చాడు. హరసుధాకరుల మధ్య యుద్ధమారంభమైంది. చంద్రుడు ధైర్యంతో శంకరుని తలపడినాడు. ఈ సందర్భములోనిదీ పద్యం.

ఈశ్వరునితో యుద్ధం చేయటానికి ఈశ్వరుడే సమర్థుడు. అన్యులసమర్థులు. ఈశ్వరుని అష్టమూర్తులలోని వాడు కాబట్టి శశాంకునకు శంకరునితో సమరము శక్యమైంది. ఈ పద్యంలో ఈశ్వరుని వంటివాడు ఈశ్వరుడే అను అనన్వయాలంకారము స్ఫురించుచున్నది.

3. **ఉల్లేఖాలంకారము:-** ఒకే వస్తువు అనేకులచే అనేక విధాలుగా వర్ణింపబడితే ఉల్లేఖాలంకారమౌతుంది.

'ఎవ్వని నేని నీవు దయనించుకఁజూచిన వానిఁజాతుర
ప్పువ్విలుకాని గాసతులు, భూపతిగాఁబ్రజ, కల్పకంబుగా
నవ్విబుధాశ్రిత ప్రతతి, యంబుధిగాఁగుల గోత్ర గోత్రముల్
కవ్వడిఁగాఁబరద్విషులు గర్ణునిగాఁగవులెల్లశ్రీసతీ!' (3-46)

వింధ్య పర్వత గర్వనిర్వాపణానంతరము అగస్త్యుడు దక్షిణ కాశియైన దక్షారామాన్ని దర్శించి కొల్హాపురానికి వచ్చి అచ్చట విచ్చేసియున్న మహాలక్ష్మిని స్తుతించు సందర్భంలోని పద్యమిది.

"శ్రీదేవి! నీవు కనికరముతోకటాక్షించిన వానిని మానినీమణులు మన్మథుని గాను, ప్రజలు మహారాజు గాను, ఆశ్రితులు కల్పవృక్షము గాను, కులగోత్రముల వారు జలరాశి గాను, విరోధులు విజయుని గాను, కవులు కర్ణుని గాను వీక్షింతురు." ఇందు లక్ష్మీ కటాక్ష పాత్రుడైన మనుష్యుని అనేకులు అనేక విధాలుగా ఉల్లేఖించినట్లు చెప్పుటచే ఉల్లేఖము.

4. **ప్రతివస్తూపమాలంకారము:-** రెండు వాక్యాలకు ఒకే సమాన ధర్మముండి అది భిన్న శబ్దాలచే చెప్పబడితే ప్రతి వస్తూపమాలంకారము.

'మంత్రములలోను గాయత్రి మహిమఁగాంచు
నగరములలోన ఁగాశి యున్నతి వహించు
దైవతంబులలో సుధా ధామమౌళి
విశ్వనాథుండు ప్రాధాన్య విభవ మొందు' (3-182)

విష్ణు కింకరులైన సుశీల పుణ్య శీలురు శివశర్మకు గాయత్రి మహా మంత్ర ప్రభావము నెరిగించు సందర్భం లోనిదీ పద్యము.

సకల మంత్రములలో గాయత్రి మహిమ గాంచును. సమస్త నగరాల్లో కాశి ఉన్నతి వహించును. ఇచ్చట 'అతిశయించు' అను సమాన ధర్మం, 'మహిమగాంచు', 'ఉన్నతి వహించు' అని భిన్న శబ్దాలచే చెప్పబడింది. కాబట్టి ప్రతివస్తూపమాలంకారము.

5. **పరికరాలంకారము:-** విశేషణము సాభిప్రాయమగుట పరికరాలంకారము.

'అతివ! ఈ గర్భమెవ్వరి కైతి చెపుమ
చంద్రునికొ? నాకొ? యని రహస్యమున నడిగె
సిగ్గుపడి యెంత యడిగిన ( జెప్పదయ్యె
నాంగిరసునకు(దార <u>తారాధిపాస్య</u>' (4-226)

సుర గురువైన బృహస్పతి గర్భవతియైన తన సతి తారను ప్రశ్నించు సందర్భంలోనిదీ పద్యము.

ఇందు తారకు <u>'తారాధిపాస్య'</u> అన్నభిప్రాయ విశేషణము వాడబడింది. 'తారాధిపాస్య' అంటే చంద్రుని వంటి ముఖము కలదని అర్థము. ఈ విశేషణం చేత ఆమె గర్భము చంద్ర సంబంధమైనదేనని స్ఫురిస్తుంది.

బృహస్పతి ప్రశ్నకు తార సమాధానము చెప్పక మౌనము వహించినను <u>'తారాధిపాస్య'</u> అన్న సాభిప్రాయ విశేషణము సత్యము ప్రకటించిది. కనుక పరికరము.

6. **విశేషోక్తి అలంకారము:-** సమగ్రములగు కారణాలున్నా కార్యోత్పత్తి కాలేదని చెప్పుట విశేషోక్తి అలంకారము.

'అభవు(డిందు కళాధరు(డయ్యు నమర
వాహినీ ధరుడయ్యు దుర్వారమైన
కాశికా విప్రయోగాభి ఘాత జనిత
తాపభారంబు సైరింపనోపడయ్యె' (5-314)

సర్వ దేవతలను సాగనంపి స్వేచ్ఛగా కాశీ రాజ్యము నేలుచున్నాడు దివోదాసు. మందరాచలమున నున్న పరమేశ్వరుడు "కాశీ వియోగ వేదనా దూయమాన మనసుండై"యున్న విధమును వర్ణించు పద్యమిది.

తల పై చల్లని నెలవంక నెలకొని యున్నను జడలలో వియద్గంగ విరాజిల్లుచున్నను విశ్వనాథుడు కాశీ వియోగ సంతాపము సహించలేక పోయినాడు. తాపోపశమనానికి చంద్రుడు, గంగానది చక్కని సాధనాలు. కారణములు సమగ్రములై ఉన్నాయి. కాని సంతాప శాంతి రూపమైన కార్యోత్పత్తి కలుగలేదు. కనుక విశేషోక్తి.

7. **విషమాలంకారము:-** అననురూపములైన వానికి సంబంధ వర్ణనము విషమాలంకారము

"కాశీ నుండంగ నర్హుండుగా(డు వీ(డు
వెడలి పొమ్మను మాటలు వేయునేల?
క్రోధ నుండెట్లు? కైవల్య కుల గృహంబు
నానివాసంబు కాశికానగరమెట్లు?" (7-196)

కాశిలో భిక్ష లభింపలేదను కారణాన వ్యాసుడు కోపించి కాశీ వాసులను మూడు తరాల వరకు ధనము, మోక్షము, విద్య లేకుండెదురు గాక యని శపింపపోయినాడు. అప్పుడు విశాలాక్షీ దేవి పుణ్య పురంధ్రీ రూపంలో వచ్చి ఆతన్ని శిష్య సమేతంగా తన యింటికాహ్వానించి కడుపు నిండ కమ్మని భోజనము పెట్టింది. భోజనానంతరం భవాని వ్యాసుని తాను మందలించి భవుని ఆననము వీక్షించింది. అప్పుడు పరమ శివుడు ఈ విధంగా పలికినాడు.

"కాశిని శపింపనుంకించిన వ్యాసుడు కాశిలో నుండుటకు యోగ్యుడు కాడు వేయేల! వీనిని వెంటనే ఇట నుండి వెడలి పొమ్మనుము. ముక్కు మీద కోపం గల ఈ ముని ఎక్కడ? మోక్షముల రాశియైన కాశి ఎక్కడ?" అనను రూపములైన వానికి సంబంధము వర్ణించుటచే ఇది విషమాలంకారం.

8. **లాటానుప్రాసము:-** తాత్పర్య భేదము గల శబ్దార్థముల పౌనరుక్త్యము లాటానుప్రాసమని ఆలంకారికులంగీకరించినారు.

'కమలనయన! నీవు కల చోటు సరసంబు
నీవు లేని చోటు నీరసంబు,
కంబు కంఠి! నీవు కలవాఁడు కలవాఁడు
లేని వాడు నీవు లేనివాఁడు' (3-47)

అగస్త్యుడు కొల్హాపుర లక్ష్మిని సంస్తుతించు సందర్భంలోనిదీ పద్యం.

ఇందలి 'కలవాఁడు కలవాఁడు'లో మొదటి వాడు 'ఏదో కలవాడు', రెండవ వాడు నిజమైన కలవాడు.

9. **యమకము:-** సమానమైన వ్యంజన సముదాయమునకు పౌనరుక్త్యము యమకము.

'అఖిల కల్యాణ గుణగణా యత్త యత్త
మాయమౌదార్య తేజః క్షమా మహితుఁడు
మాతులుందు యశో మహిమాతులుండు
తనయ! యేలయ్య కైవోవు వినయ గరిమ?' (4-92)

తల్లి సుశీల కుమారుడైన గుణనిధిని ప్రబోధించు సందర్భంలోనిదీ పద్యం. మాతులుడు: మేనమామ; యశో మహిమాతులుడు: కీర్తి వైభవమున సాటి లేనివాడు.

## 6.8 కాశీ ఖండము - వర్ణనా వైశిష్ట్యము:-

శ్రీనాథుని స్వభావాన్ని గమనిస్తే కథ నిలిపి వర్ణన చేసే ప్రవృత్తి కలదని గుర్తించవచ్చు. శ్రీనాథుడు ప్రధానంగా వర్ణనాత్మకమైన ప్రతిభాశాలి. కావ్యంలో అష్టాదశ వర్ణనలుండాలని అంగీకరింపబడింది.

1. కర్పూరక దళికా కాంతార పవనంబుల
ధ్వనీన శ్రాంతి గపనయింప
మదురంగబండిన మాలూర ఫలములు
చెంచుకన్యల కుచశ్రీలఁజెనయ
నురగవల్లీ గాఢ పరిరంభణంబుల
బ్రోకమ్రుఁకుల కింపు పురువుకొనగ
బాటలీ వకుళ చంపక సౌరభము తోడ
విచికలామోదంబు వియ్య మంద
గరిమి నా మూల చండంబుగా ఫలించె
యంబరము మోచియున్న యుదుంబరములు
లీల బ్రహ్మాండ మాలికల భూషల
వధరించిన వృషభాంకుననుకరించె (1-91)

ఇందు వాయువులు బాటసారులకు పచార క్రియను, మాలూర ఫలములు కుచములతో పోలుటయు, సర్ప వేష్టనము పోక చెట్లకు శోభన క్రియను, మల్లె పూవుల వియ్యమును కవి వర్ణించాడు. ఇచ్చట వస్తువుల అందం కంటె అవికవకూడు చందము మనోహరంగా ఉంది.

2. శ్రీనాథుని వర్ణనములందు అచేతన వస్తువులలో ప్రాణిధర్మ మారోపించుట ఒక విశేషం. వస్తువుల యందలి అన్యోన్యముచే మూర్తి చిత్రణము గావించుట శ్రీనాథునికి పరిపాటి.

<u>వింధ్యాటవీవర్ణనమే</u> దీనికి ఉదాహరణ.

"వెండియు గర్కరేటు కదోర తార తర రటనంబును దాత్యూహ
మ్యాహ కహోకహారవ కోలాహలంబును .......................... బిసరుహ
బాంధవుని కిరణ విసరంబును" ...............వింధ్య వసుంధరాధర
ప్రాంతకాంతారంబు దరిని చనువాడు....................... (1-93)

3. కాశీ ఖండమందలి వైశ్వానర జన్మ వర్ణనము (<u>తనయోదయము</u>)

"నవ మాసంబులు నిండగా గురుడు కేంద్ర స్థాయియై యుండగా
శివలగ్నంబున నుద్భవించె సుతుఁడర్చిష్మంతు నంశంబునన్
ధవళాంభోరుహ పత్రనేత్రక విముక్త స్థాన విశ్వేశశం
భ్వవతారాంతర మప్రధృష్యతర దివ్యాకార దేజంబునన్" (4-9)

ఈ పురిటింటి ఆచారాలు పూర్వ కావ్యాల నుండి గ్రహించినవే. సత్పురుషులు జన్మించినపుడు సుశకునాలు, దుర్మార్గులు జన్మించినపుడు చెడ్డ శకునాలు ద్యోతకమవుతాయి. శ్రీనాథుడేకరువు పెట్టిన పురిటింటి సంప్రదాయాలు కాదంబరిలో కొన్ని ఉన్నాయి.

4. కాశీ ఖండమందలి <u>శరత్కాల</u> వర్ణనము (3-23)

5. అగస్త్యుడు కాశీ వియోగానికి పరితపించుట (2-109, 112)

6. కాశీ ఖండము నందలి దుర్గా మాహాత్మ్యమున శక్తి పరంపర రాక్షస శ్రేణితో తలపడిన విధము

"శక్తి రాక్షసు తోడ రాక్షసుడు శక్తి తోడ దలపడ సమధికాద్భుతము గాగ
ద్వంద్వ యుద్ధంబు సాగె వింద్యంబు మీద బ్రకట నిష్ఠుర బహు విధ ప్రహరణముల"
ఖరండును ద్రైలోక్య సుందరి తోడ సీర పాణియు .......................................(కాశీ 6.238)
తలపడినం బోరు మహా ఘోరంబయ్యె .............. (కాశీ 6.239)

7. కాశీ ఖండమందలి ఆరవ ఆశ్వాసంలో చర్మముండ, మహారుండయను శక్తులను కవి ఇట్లు వర్ణించెను.

"హాలాపాన మొనర్చి యిద్దఱునునన్యోన్యంబు మత్తిల్లికం
రేళీనృత్త వినోదకందుక మణి క్రీడా విహార క్రియా
లీలాహాస్య కళా ప్రసంగములనుల్లేఖించి వర్తింతురె
క్కాలంబునన్ ఘట జన్మఁకాశినడుమన్ గర్వించి యద్దేవతల్" (6-210)

వింధ్య పర్వత వర్ణనము, సూర్యోదయ వర్ణనము, శరద్వర్ణనము, కాశీపుర వర్ణనము మొదలైనవి కాశీ ఖండమందలి కొన్ని ముఖ్య వర్ణనలు.

సప్తమాశ్వాసంలో 'దుర్వాసోలింగ మహాత్మ్యంలో, దుర్వాసుడు కాశీ నగరానికి వచ్చినపుడు ఒక పెద్ద వచనంలో కాశీ నగర మంతయు వర్ణింపబడింది. మూలంలో ఇలాంటి వర్ణన లేదు. ఇదంతా శ్రీనాథుని భావనా విలసితము. మూలము నుండి తెచ్చినదొక్క అక్షరమైనను ఇందు లేదు. స్థూలంగా దాని తాత్పర్యమిది. (7.26)

కాశీ నగరం చుట్టూ గంగానదీ మాతృకలై ఏటి పొడుగునా పండేటి వరి చేలున్నాయి. అంకురం మొదలుకొని పండెడి వరకు వరి పైరు ఎన్ని పరిమాణాలను పొందిందో సూక్ష్మమైన పరిశీలనా దృష్టితో శ్రీనాథుడిందు వర్ణించాడు. ఆ పైన తోటలు, తోటలలోనికి నీరు ఘటీ యంత్రాల ద్వారా పాఱుచున్నవి. వివిధ ఫలకుసుమ వృక్షాలు వానిలో సమృద్ధిగా ఉన్నాయి. ఆ మీదట చెఱువులు, తేట నీటితో నిండిన ఆ చెఱువుల నిండా కలువలు, తామరలు తంపరగా ఉన్నవి. ఆ పైన ప్రాకారాలు, బురుజులు, మేడలు, గవాక్షాల నుండి వెల్వడుచున్న సుగంధి ధూపాలు, వృషభ పతాకాలు, వివిధ ప్రమథ ప్రతిష్ఠిత లింగాలు, మాతృకలు, భైరవులు, డుంఠి మొదలుగా గల ప్రతి సూక్ష్మాంశము శైవ మహః పరివేషంతో విస్పష్టంగా, అద్భుతంగా చిత్రించబడ్డాయి. ఇది శ్రీనాథుడు రచించిన వచన తాత్పర్యము.

8. <u>యుద్ధ వర్ణనము</u> (6-238 , 239)

## 6.9 ఉపసంహారము:-

అగస్త్యుడు కాశిని విడిచి పెట్టుట కాశీఖండ కావ్యారంభంలోనూ, వ్యాసుడు కాశిని వదిలి వెళ్ళుట కావ్యాంతంలోనూ ఉంది. ఆ ఇరువురు మహర్షుల వృత్తాంత కథనుంచే కాశీఖండము పావనారంభము, పావనాంతము అగుచున్నది. అంతేగాక మమతా శూన్యులును, నిస్పృహులును, బ్రహ్మ స్వరూపులును అయిన ఆ మహర్షులే కాశీ వియోగ బాధను సహించలేక వ్యధ నొందుట వల్ల తత్ క్షేత్ర మహిమ వర్ణనాతీతమని, స్ఫురింపచేయుటయే ఈ గ్రంథము యొక్క పరమ ప్రయోజనము. ఇందు ఉపాఖ్యాన భాగము చాల తక్కువగాను కాశీ మాహాత్మ్య వర్ణనము చాలా ఎక్కువగా ఉంది. కేవల కావ్య సౌందర్యమునే కాక, మానవ జీవితానికి అత్యంతావశ్యకమైన వివేక విస్తరమంతయూ కాశీ ఖండంలో ప్రతి పద ప్రతిఫలంగా చూడవచ్చు. జీవితానుభవం, లోకజ్ఞత, బ్రహ్మజ్ఞాన కళానిధిత్వము, ప్రకృతి పరిశీలనము ఇత్యాదులు కాశీఖండంలో ప్రతిబింబితములు. మొత్తము మీద కాశీఖండము అయః పిండమైనను ఆస్వాద యోగ్యమైనంది. ఈ గ్రంథం వల్ల కావ్యానందం కంటే విజ్ఞాన బోధ ఎక్కువ కల్గుతుంది. కవి సార్వభౌమిని ఉద్దండ శైలికి ఈ గ్రంథమే లక్ష్యభూతమైంది.

## 6.10 ప్రశ్నలు:-

1. కాశీఖండ అనువాద విధానాన్ని పేర్కొనుడు.
2. క్షేత్ర కావ్యాల్లో కాశీఖండ విశిష్టతను వివరించండి.
3. కాశీఖండములో కాననగు రస - అలంకార ప్రాముఖ్యాన్ని తెల్పండి.
4. కాశీఖండ వర్ణనా వైశిష్ట్యాన్ని తెలియజేయండి.

## 6.11 ఆధార గ్రంథాలు:-


*1. శ్రీనాథ మహాకవి - కావ్య కళ - డా॥ కూచి భాష్లుహరి*
*2. శ్రీనాథుని కాశీ ఖండం సమగ్ర సమీక్ష - డా॥ మల్లంపల్లి సీతాదేవి*
*3. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - డా॥ జె.జె. బాపూజీ*


**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 7

# శివరాత్రి మాహాత్మ్యము - కావ్యత్వము

**ముఖ్యాంశాలు:-**


- 7.0 లక్ష్యం
- 7.1 ఉపోద్ఘాతము
- 7.2 శివరాత్రి మాహాత్మ్యము - గ్రంథ పరిమాణము
- 7.3 ఆశ్వాస ఇతివృత్తము
  - 7.3.1 ప్రథమాశ్వాసం
  - 7.3.2 ద్వితియాశ్వాసం
  - 7.3.3 తృతీయాశ్వాసం
  - 7.3.4 చతుర్థాశ్వాసం
  - 7.3.5 పంచమాశ్వాసం
- 7.4 ఈశాన సంహితలోని కథకు, శివరాత్రి మాహాత్మ్యంలోని కథకు గల భేద సాదృశ్యాలు
- 7.5 కావ్య పరామర్శ
- 7.6 శివరాత్రి మాహాత్మ్యము - రసభావాలు
- 7.7 శివరాత్రి మాహాత్మ్యము - అలంకార వైభవము
- 7.8 శివరాత్రి మాహాత్మ్యము - వర్ణనా పటిమ
- 7.9 ప్రశ్నలు
- 7.10 ఆధార గ్రంథాలు


## 7.0 లక్ష్యం:-

స్కాంద పురాణాంతర్గతమగు ఈశాన సంహితలో 336 అనుష్టుప్పులు కల మూడధ్యాయాల ఇతివృత్తాన్ని సముచిత వర్ణనలతో పెంచి ఐదు ఆశ్వాసాలుగా శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యాన్ని రచించాడు. శివరాత్రి మాహాత్మ్యానికే సుకుమార చరిత్రమని నామాంతరం ఉంది. సంహితంలో 61 అనుష్టుప్పులలో వర్ణింపబడ్డ సుకుమార చరిత్రము శివరాత్రి మాహాత్మ్యంగా మూడాశ్వాసాల్లో 310 గద్య పద్యాల్లో విపులీకరింపబడింది. పిమ్మట ఇది పంచమాశ్వాస సంభరితంగా రచింపబడింది. దీనికి సంబంధించిన కావ్య పరామర్శ చేయటమే ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

## 7.1 ఉపోద్ఘాతము:-

శ్రీనాథుడు తాను రచించిన గ్రంథాలను కాశీ ఖండంలో ఒక సీస పద్యంలో ఇట్లా చెప్పాడు.

"చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగు మీసాల నూత్న యౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబున యందు
హర్ష నైషధకావ్యమాంధ్ర భాషఁ
బ్రౌఢ నిర్భరవయః పరిపాకమునఁగొని
యాడితి భీమనాయకుని మహిమ
ప్రాయమింతకు మిగులఁగైవ్రాలకుండఁ
గాశి ఖండమను మహాగ్రంథమేను
దెనుగుఁజేసెదఁగర్ణాట దేశకటక
పద్మ వనహేళి శ్రీనాథభట్ట సుకవి"

ఈ పద్యంలో శ్రీనాథుడు పేర్కొన్నవానిలో మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి ఇంత వరకు లభ్యం కాలేదు. పండితారాధ్య చరిత్ర, హర విలాసము శివరాత్రి మాహాత్మ్యం, పలనాటి వీర చరిత్ర అనే గ్రంథాలను ఈ పద్యంలో పేర్కొనలేదు. శ్రీనాథుడు ధనంజయ విజయం అనే పేరు గల గ్రంథాన్ని దంతలూరి గన్న భూపాలుని పేర రచించినట్లు దంతలూరి బాపిరాజు రచించిన మూర్తి త్రయోపాఖ్యాన ప్రబంధంలో ఉంది. అది కూడ లభ్యమగుట లేదు. ధనంజయ విజయమంటే కిరాతార్జునీయ కథ వర్ణితమై ఉండవచ్చు.

శివరాత్రి మాహాత్మ్యం శ్రీనాథుని బాల్య కలితయని శ్రీనాగపూడి కుప్పుసామయ్య గారనగా, హర విలాస, నైషధములకు పిదపను, భీమ ఖండానికి మునుపు రచించెనని శ్రీ వీరేశ పంతులుగారన్నారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు శ్రీనాథుని కృతుల్లో ఇది కనిష్ఠ మని నిర్ణయించారు. శ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రి గారు, శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఇది శ్రీనాథుని అంత్యకృతి అనియే నిర్ణయించారు. ఇది నిశ్చయమని నిరూపించటానికి తగిన ఆధారాలు తమకు లభింపలేదంటూ శ్రీ చాగంటి శేషయ్య గారు కూడా శ్రీ శాస్త్రుల వారితో ఏకీభవించి ఈ గ్రంథ రచనా కాలాన్ని క్రీ॥శ॥ **1440** ప్రాంతంగా భావించారు.

## 7.2 శివరాత్రి మాహాత్మ్యం - గ్రంథ పరిమాణము:-

శివరాత్రి మహాత్మ్యాన్ని ఆంధ్ర సాహిత్య పరిషత్తు (కాకినాడ) వారు మూడు సార్లు ప్రకటించారు. మొదటి రెండు ముద్రణలను విద్వాన్ శ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రి గారు పరిష్కరించారు. వానిలో వారు రచించిన పీఠికలు కూడా ఉన్నాయి. ఆ మూడు ముద్రణలలోనూ కావ్యం నాలుగాశ్వాసాల వరకే ఉంది. శ్రీనాథుడు మొదట ప్రతిజ్ఞ చేసిన విధంగా **(1.44)** 'ఉరులింగోద్భవంబును', 'శివరాత్రి మాహాత్మ్యంబు'నకు కథలు నాలుగవ ఆశ్వాసంతో ముగిసిపోయినవి కాబట్టి దానిని శ్రీనాథుడు అంతవరకే రచించి ఉంటాడని శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారభిప్రాయ పడ్డారు. కాని చతుర్థాశ్వాసాంతాన తన భటులు శివ భటులచే భంగపడుట చూచిన యముండేమి చేసెనని శౌనకాది మునులు సూతుని అడిగినట్లు ఉంది. 'భటులు ప్రమథాలచే భంగపడుట చూచి చిన్నవోయి యముడేమి చేసెఁబిదప?' **(4.93)** దీనిచే కావ్యమంతటితో ముగియక పంచమాశ్వాసమునకు ఆవశ్యకత ఏర్పడుతున్నను, శ్రీనాథుని

ప్రతిజ్ఞయగు శివరాత్రి మాహాత్మ్యం దీనితో ముగిసింది. అయినప్పటికి తన్మూలమగు ఈశాన సంహితాధ్యాయాంత్య పద్యానురోధమున ఆ మునుల ప్రశ్నను కూడ ఎవరో గ్రంథంలో చొప్పించి ఉంటారని, గ్రంథం అంతవరకే ఉండటానికి శ్రీనాథుని మృతి కూడ కారణమని శ్రీ శాస్త్రి గారి అభిప్రాయం.

కాని ఆచార్య బిరుదరాజు రామరాజు ధర్మమా అని శివరాత్రి మాహాత్మ్యం పంచమాశ్వాసంతో ప్రకటింపబడింది. నాలుగవ ఆశ్వాసము చివరనున్న మునుల ప్రశ్నకు సమాధానమేర్పడింది. కాబట్టి శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యం పంచ ఆశ్వాస సంభరితంగా రచించాడని సిద్ధాంతీకరింపబడింది.

పంచమాశ్వాసము శ్రీనాథునిది కాకపోతే అందలి పద్య గద్యాల శయ్య శ్రీనాథునిది అనడానికి భిన్నంగా ఉండవలయును. కాని ఆ ఆశ్వాసమునందలి రచనను పరిశీలించిన వారికి అది తప్పక శ్రీనాథునిదే అని తోస్తుంది. ఎట్లాంటే

"జూదంబులాడెను శుద్రాన్నము భుజించె
గలవారి గృహములు కన్న పెట్టె" (5.5)

"విడవరో యెందేని విహరింపఁజనుఁగాని
కరవాండి ముక్కుల కాకిపిండు" (5.8)

"ఎవ్వాని యందుండు నెల్ల భూతంబులు
సింధువు నందు వీచికలు వోలె" (5.24)

మున్నగు సీసములన్నిటను శ్రీనాథుని బాణీయే కొట్టవచ్చినట్లు కానవస్తున్నది.

## 7.3 ఆశ్వాస ఇతివృత్తం:-

**7.3.1 ప్రథమాశ్వాసం:-** శౌనకాది మహా మునులు శివరాత్రి మాహాత్మ్యాన్ని చెప్పమని సూతుని అడగ్గా అతడిట్లు చెప్ప ఆరంభించెను. శివుడు అష్టాదశ విద్యలను మొదట బ్రహ్మకు ఉపదేశించాడు. తర్వాత శంకర అజ్ఞా ప్రచోదితుడై కృష్ణద్వైపాయనుడు ఆవిర్భవించి సర్గ - ప్రతి సర్గాది పంచ లక్షణ లక్షితమైన అష్టాదశ పురాణాలను నాలుగు లక్షల పరిమితి కలవానిని రచించాడు. అందు స్కాందము లక్ష పరిమాణం కలది. శివరాత్రి మాహాత్మ్యం దానిలోనిదే. 'ఆ శివరాత్రి వ్రతమెవ్వరు ఆచరించారు? దానివల్ల కలిగిన ఫలితమేమిటి?' చెప్పమని మునులు అభ్యర్థింప సూతుడు మొదట ప్రళయాన్ని వర్ణించాడు. ప్రళయాంతంలో శ్రీ మహావిష్ణువు వరాహ రూపాన్ని ధరించి భూమిని ఉద్ధరించి గర్వంతో క్షీర సముద్రాన పాపసెజ్జ పై పవళించాడు. బ్రహ్మ నిద్ర మేల్కొని, సృష్టి చేయదలచి, తత్క్రమము ఎఱుగక చీకాకుపడి శివ ధ్యానంతో లబ్ధ ప్రజ్ఞకలవాడై చరాచరాత్మక ప్రపంచాన్నంతా సృష్టించి తానే జగత్కర్తనని గర్వించి, స్వనిర్మితమగు సృష్టిని ఆలోకించటానికి హంసను అధిరోహించి అన్ని లోకాల్నీ చూస్తూ వచ్చి క్షీరసాగరంలో పవ్వళించి ఉన్న విష్ణువును చూచి 'నీవెవ్వడవు?' జగత్కర్తనైన నన్ను చూచి కూడా ఏల లేచి గౌరవింపవని?' ప్రశ్నిస్తాడు. విష్ణువు తానే జగత్కర్తనని బ్రహ్మను తిరస్కరిస్తాడు. అంత వారిరువురును యుద్ధం చేసి పరస్పర విజిగీషువులై ఒకరి పై ఒకరు పాశుపతాస్త్రాలను ప్రయోగించుకొన్నారు. తదస్త్ర జ్వాలాదహ్యమానులగు లోకములను రక్షింపను బ్రహ్మ, విష్ణువుల గర్వాన్ని మాన్పటానికి అస్త్రాల నడుమ మాఘ కృష్ణ చతుర్దశి రాత్రి రోజున అనగా శివరాత్రి నాడు శివ లింగమనుష్టాశీతమగు అగ్ని స్తంభంగా ప్రాదుర్భవించింది. బ్రహ్మ, విష్ణువులు ఆ స్తంభము యొక్క ఆద్యంతములు కనుగొనజాలక శివుని స్తుతించారు. శివుడు వారికి శివరాత్రి వ్రతాన్ని ఉపదేశించాడు.

"పూర్వము ఒక బ్రాహ్మణుడు మహాపాపి అయ్యి శివరాత్రి వ్రత దర్శనమున శివలోకానికి వెళ్ళాడు", అని సూతుడు చెప్పగా ఆ కథ వినిపింపమని శౌనకాదులగు మునులు సూతుని అడిగారు.

**7.3.2 ద్వితీయాశ్వాసం:-** వింధ్య పర్వంత భూమి యందలి దండకారణ్యా మధ్యలో రత్నపురమనే ఒక పట్టణముంది. దానిని హేమాంగధరుడను శబర రాజు పాలిస్తున్నాడు. అతనికి యజ్ఞ దత్తుడనే మంత్రి ఉన్నాడు. ఆ మంత్రి భార్య సుశీల. పెక్కు వ్రతాలు ఆచరించగా చిరకాలానికి సుశీల గర్భవతియై సుకుమారుడనే పేరు గల కుమారుని కన్నది. ఆ బాలుడు పెరిగి యౌవనవంతుడై సిగ్గు విడిచి విచ్చలవిడిగా తిరుగుతుంటే తల్లిదండ్రులు అతనికి నీతులు చెప్తారు.

**7.3.3 తృతియాశ్వాసం:-** సుకుమారుని దుష్ట వర్తనము పెచ్చు పెరుగుతున్నది. ప్రజల విన్నపం మీద రాజు అతన్ని దేశ బహిష్కృతునిగావించాడు. సుకుమారుడు కీకట దేశంలో కొన్ని రోజులుండి హుణ దేశానికి పోతూ మార్గమధ్యంలో మిక్కిలి ఆకలి దప్పికలు కలవాడై యొక తటాకం దగ్గరికి వెళ్ళాడు. అక్కడ ఒక చండాల కన్యక స్నానం చేద్దామని వచ్చింది. అప్పుడు చండాలీ సుకుమారులు ఇరువురు అన్యోన్యం అనురక్తులయ్యారు. సుకుమారుడు భద్రకాళికాలయం నుండి చండాలితో రహస్యంగా కాపురం చేస్తున్నాడు. అచ్చట సుకుమారుని దుర్వర్తనం మితి మీఱిపోయి హూణ మండలమంతా తెలియవచ్చింది. ఆ కాముకులిరువురును మరియొక చోటికి పారిపోవ ప్రయత్నించారు.

**7.3.4 చతుర్థాశ్వాసం:-** సుకుమారుడు చండికి జాతర చేసి నాటి రాత్రి చండాలితో హూణ దేశాన్ని విడిచి కిరాత మండలంలోని వణిక్పథ పురానికి చేరి అందలి బ్రహ్మపురి వాడలో కాపురం పెట్టాడు. అతనికి చండాలియందిరువురు కూతురులు పుట్టారు. చండాలి కొంత కాలానికి మరణించింది. సుకుమారుడు కూతులతోనే కామ వ్యాపారం సాగించి వారి యందిరువురు కొడుకులను కూడా పొందాడు. ఈతని పాప కృత్యాలకు బ్రహ్మపురివాడలోని విప్రులు ఉత్తప్త కృఛ్ర చాంద్రాయణ వ్రతాది ప్రాయశ్చిత్తాలను ఆచరించారు. కొంత కాలానికి అతడచ్చటికి గవ్యూతి దూరంలో ఉన్న ఆది మధ్యాంత నాగేశమనెడి పుణ్యా తీర్థమందలి నాగేశ్వరాలయంలో శేష ప్రతిష్ఠితుడైన నాగేశ్వర లింగాన్ని చూచాడు. సుకుమారుడచట శివరాత్రి నాడు గాలికి తూలిన కేతకీ పుష్పధూళి శరీరానికి అంటుకొనగా పాశుపత దీక్షను తీసుకున్నాడా అన్నట్లు ఉంది. అతడు అట్లే అర్థరాత్రిదాకా జాగరం చేసి అచ్చటి శివరాత్రి ఉత్సవ వైభవాన్ని చూచి పోయిన కల్మషం కలవాడై నాటి నుండి తొల్లి చేసిన పనులన్నిటిని మానివేశాడు. కొంత కాలానికి అతడు ఘోర వ్యాధి పీడితుడై మరణించాడు. యమభటులు అతన్ని తీసికొనిపోవటానికి రాగా శంకర కింకరులు వారిని అడ్డగించారు. వారిరువుర మధ్య ఘోర యుద్ధం జరిగింది. అందు యమభటులు ఓడిపోయారు. ప్రమథులు సుకుమారుని కైలాసానికి తీసుకొని పోయారు. సుకుమారుడు శివుని స్తుతించి ప్రమథుడయ్యాడు.

**7.3.5 పంచమాశ్వాసం:-** యముడు తన భటుల ఓటమి విని చిత్రగుప్తునితో విచారించి తన వృథాధికారాన్ని శివునకే విన్నవించటానికి కైలాసానికి వెళ్ళాడు. యముడు శివుని స్తుతించి సుకుమారుని పాప కార్యాలన్నింటిని వినిపించాడు. శివుడు యమునకు శివరాత్రి మాహాత్మ్యాన్ని, శివ భక్తుల లక్షణాలను అభివర్ణించాడు. యముడు నిజ లోకానికి వెళ్ళి తన భటులకు శివరాత్రి మాహాత్మ్యాన్ని, శివభక్తులను గుర్తించేటట్టు చెప్పి వారి జోలికి ఇంక ఎన్నడును పోవద్దని హెచ్చరించాడు.

## 7.4 ఈశాన సంహితలోని కథకు - శివరాత్రి మాహాత్మ్యంలోని కథకు గల పోలికలు - భేదములు:-

1. **సంహిత యందు:-** 'మహా పాపాలు చేసిన ఎట్టి వారయినను లఘు ఉపాయం వల్ల శివలోకాన్ని పొందే అవకాశం ఉందా?' అని మునులు ప్రశ్నింపగా సూతుడు పార్వతి యీ అర్థాన్నే ప్రశ్నింప ఆమెకు శివుడు శివవ్రత విధానాన్ని ఉపదేశించాడు. ఆమె దాన్ని కుమార స్వామికి చెప్పిననియు, తాను కృష్ణ ద్వైపాయనుని వల్ల ఆ కథ విన్నాననియు చెప్పి వారికీ విధంగా వివరించింది. నాలుగు వేల యుగాలు బ్రహ్మకొక పగలును, అంతే కాలం రాత్రి అవుతుంది. విష్ణువు వరాహ రూపంలో భూమినుద్ధరించి పాల సముద్రం పై పరుండి విశ్రాంతి తీసుకొంటున్నాడు. యథాక్రమంగా సృష్టి చేసి బ్రహ్మ లోకమును ఆలోకిస్తూ వచ్చి నారాయణుని చూస్తాడు. వారిరువురు ఎవరికి వారే సృష్టికర్తలమని చెప్తూ ఒకర్ని ఒకరు అధిక్షేపించుకొని యుద్ధం చేశారు. వారొకరి పై నొకరు పాశుపతాస్త్రాలను ప్రయోగించుకొన్నారు.

ఆయస్త్ర సంపాతాన్ని వారించి వారిని రక్షింప శాంభవమగు స్తంభం వారి నడుమ ఆవిర్భవించింది. దానిని చూచి కోపాన్ని పోగొట్టుకొని ఆ స్తంభము యొక్క ఆద్యంతాలను చూడాలని బ్రహ్మ హంస రూపంలో పైకిని, విష్ణువు వరాహ రూపంలో క్రిందికి పోయి కనుగొన లేక వచ్చారు. అంత శివుడు లింగ మధ్యం నుండి వినిర్గతుడై వారికి ప్రత్యక్షం కాగా, వారు ఆతనిని స్తుతించారు. శివుడు ప్రసన్నుడై 'మీరస్త్రాలు ప్రయోగించటం వల్ల వాని తేజస్సుచే మీ తేజస్సులు దగ్ధములయినవి. కాబట్టి మీరు మీమీ పదవుల కనర్హులరు. మీరు శివరాత్రి వ్రతం చేస్తే మరల మీ మీ పదవుల్ని మీకిస్తాను' అని పలికి వారి ప్రార్థనమున శివరాత్రి కాల నిర్ణయము, తద్వ్రత విధానాన్ని వారికి ఆనతిచ్చాడు.

ఈ వృత్తాంతానికి సంహితలో శివరాత్రి ప్రాదుర్భవ తద్వ్రత విధానాలని నిర్దేశింపబడగా శివరాత్రి మాహాత్మ్యంలో 'ఉరులింగోద్భవమను' సంజ్ఞ నిర్ధేశింపబడింది.

రెండింటి యందు మునులు "శివరాత్రి వ్రతమే ఫలమునొసంగు" అని అడుగ సూతుడు వారికి తత్ఫలాలను చెప్పి అందుకు ఉదాహరణంగా సుకుమార చరిత్రను చెప్పినట్లు కలదు.

**2.** సంహితలో సుకుమారుని జన్మభూమి వింధ్యోత్తర దిగ్భాగాన నిరావతీ శత ద్రూవిపాటి వితస్తాగదులు ప్రవహిస్తూ రమణీయమైన దేశాన సింధూ నదీ తీరాన కుబ్జకాభిదానమనే నగరం ఉంది. ఆ పట్టణాన్ని ఏలేరాజు వ్యవహారార్థం నయకోవిదుడైన బ్రాహ్మణున్నొకణ్ణి స్థాపించాడు. అతనికి సుకుమారుడను పేరు గల కుమారుడున్నాడని చెప్పబడెనే కానీ తద్రాజామాత్యతద్భార్యలను గూర్చి ఇంకేమియు వర్ణింపబడలేదు. కాని శివరాత్రి మాహాత్మ్యాన వింధ్య పర్వంత భూవిపిన మధ్యంలో రత్న పురమనే రాజధాని కలదనియు, దాన్ని హేమాంగదుడను శబరరాజు పాలిస్తున్నాడనియు, అతనికి యజ్ఞ దత్తుడనే మంత్రి కలడనియు, ఆ మంత్రి భార్య సుశీల అనియు, ఆ దంపతలకు పెక్కు వ్రతాలు ఆచరింపగా సుకుమారుడు పుట్టాడనియు ఆ పట్టణం చుట్టూ ఇరావతీశతద్రు విపాటే సింధు నదీ మాతృకములగు జన పదాలు కలవనియు, ఆ పట్టణ ప్రాంతాన నర్మదానదీ తీర కాంతార భూమిని మట్టి అనే పేరు గల కల్పద్రుమము యొక్క నీడలో ఓంకారనాథుడు శంభుడు పాయక ఉంటాడనియు విపులంగా వర్ణింపబడింది.

సుకుమారుని విద్యాభ్యాసం, యౌవన మదోద్ధతుడై దుర్మార్గ గామియైన ఆతడు ప్రభు నిష్కాసేతుడై దేశాంతరం వెళ్ళటం రెండు కథల యందు సమానమే.

**3.** మొదట ఏదో ఒక దేశానికి తరువాత హూణమండలానికి వెళ్ళినట్లు సంహిత యందుండగా, మొదట కీకట దేశానికి, తరువాత హూణమండలానికి వెళ్ళినట్లు మాహాత్మ్యంలో ఉంది.

చండాలి సమాగమం మొదలుకొని ఆతడు ఆమెను కూడి నానా విధ మాంసాలను తింటూ, బాటసారులగు బ్రాహ్మణులను సంహరించి వారి ధనాన్ని అపహరిస్తూ దుష్కార్యాలు చేస్తున్నాడని సంహితలో ఉంది. ప్రథమ సమావేశానంతరం మాలెత నిర్దేశించిన భద్రకాళీనికేతనానికి వెళ్ళి అచట బ్రాహ్మణులతో నివసిస్తూ అనేక విధాలైన విద్యలచే వారిని మెప్పిస్తూ వంచన బయటపడకుండేటట్లు మాలెత మాలబాలకునిచే పంపిన విందులు ఆరగిస్తూ ప్రతిదినం రేపైన మాపైన తన వారిని ఎట్లో కనుబ్రామి వచ్చిన మాలెతతో సంభోగించేవాడు. ఈ విషయం బ్రాహ్మణులకు తెలియనీయకుండా పట్టణంలోని శబరులతో కలిసి మృగయా వినోదం సాగించేవాడు. ఒక్కరుగా వచ్చే బ్రాహ్మణులను కొట్టి వారి ద్రవ్యాన్ని అపహరించేవాడు. కొంత కాలం తన దుష్కృత్యాలు బయటపడకుండా ఉండేటట్లుగా శివరాత్రి మాహాత్మ్యంలో ఉంది.

**4.** హూణ మండలమందుండినపుడే సుకుమారుడు ఆ మాలెత యందు పంచపాత కాల వంటి కొడుకులను, ఇరువురు

కూతులనీ పొందినట్లును, మాలెత చనిపోయిన తరువాత అతడు తన కూతులనే రమిస్తూ ఇరువురు కొడుకులను కన్నాడు. ఒకనాడు రాజుచే బహు ధనాన్ని పొంది వస్తున్నటువంటి వంద మంది బ్రాహ్మణులను చంపేసి, వారి ధనాన్ని అపహరిస్తాడు. ఈ విషయాన్ని విన్న రాజు కోపించి అతన్ని చంపటానికి దూతలు పంపబడ్డారనీ, కూతును ఒక్కతెను తీసుకొని కిరాత దేశానికి వెళ్ళినట్లుంది. అక్కడ ఒక శివరాత్రి నాడు శివ పూజాదులను అవలోకించి పాపాలను పోగొట్టుకొన్నట్లు సంహితలో కలదు. హూణ మండలంలో తన దుర్వ్యాపారాలు అన్నీ అందరికీ తెలియడం వల్ల అక్కడ ఉండటానికి ఇష్టం లేక సుకుమారుడు ఆ చండాలితో కలిసి హూణ మండలాన్ని విడిచిపోయాడు. తరువాత ఇద్దరు కుమారులను, ఇరువురు కూతులను కనినట్లు చండాలీ మరణానంతరం కూతులను ఇరువురిని రమిస్తూ ఇరువురు కుమారులను పొందినట్లు శివరాత్రి మాహాత్మ్యంలో ఉంది.

మహా పాతగుడగు వీని దుశ్చర్యలకు హూణ మండల బ్రాహ్మణులు ఉత్తప్తకృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతాది ప్రాయశ్చిత్తములాచరించినట్లు శివరాత్రి మాహాత్మ్యంలో ఉంది. సంహితలో ఈ వృత్తాంతమే లేదు.

5. హూణ మండలాన్ని విడిచి సుకుమారుడు కిరాత దేశానికి వెళ్ళిన పిమ్మట, అక్కడ సమీప దూరంలోని నాగేశ్వరుడను పేరు గల శివాలయంలో శివరాత్రి వ్రతాదులను చూచినట్లుగా సంహితలో ఉంది. మాహాత్మ్యంలో దుర్గమమైన అరణ్యాన్ని దాటి, హూణ మండలము గడచి అక్కడక్కడ వణిక్పథానికి గవ్యూతి మాత్ర దూరంలో ఆది మధ్యాంత నాగేశ్వరాహ్వయ పుణ్య క్షేత్రంలో శేష ప్రతిష్ఠితుడై అనేక కల్పముల నుండి వెలసియున్న నాగేశ్వరాలయంలో శివరాత్రి నాడు శివపూజాదులను సుకుమారుడు చూచి పోయిన పాపాలు కలిగినట్లు కలదు.

6. సుకుమారుని మరణానంతరం యముని ఆనతిని పొంది యమ కింకురలు వచ్చి వాని లింగ శరీరాన్ని బంధించికొని పోతుంటే, శివ దూతలు శివాజ్ఞచోదితులై వచ్చి వారిని యుద్ధంలో ఓడించినట్లు చెప్పబడింది. తర్వాత అత్రగ్రన్థపాతః అని సంహితలో కలదు. మాహాత్మ్య మందు శివ దూతలు యమకింకరులు యుద్ధం చేస్తుండగా ఒక యమ భటుడు యముని దగ్గరకు వెళ్ళి యుద్ధ వృత్తాంతాన్ని విన్నవించాడు. అతడు లుంబరుడను సేనానిని, పెక్కు సైన్యాలను, నూఱు మృత్యువులను శివ గణాల పైకి పంపినట్లున్నది. వారంతా ప్రమథులచే భంగపడినట్లు వర్ణింపబడినది. 'భటులు ప్రమథులచే అట్లు భంగపడిన చిన్నవోయి యముడేమి చేసెంబిదప' అని మునులు సూతుని ప్రశ్నించటంతో చతుర్థాశ్వాసం ముగిసింది.

7. పంచమాశ్వాసం బయటపడక పూర్వం శివరాత్రి మాహాత్మ్యం దీనితో పరిసమాప్తమైందని తలంపబడింది. కాని ఇప్పుడు పంచమాశ్వాసం లభించింది. ఈ పంచమాశ్వాస వృత్తాంతం సంహిత యందలి 73 వ అధ్యాయంలోని వృత్తాంతంతో సమానంగా ఉంది.

## 7.5 కావ్య పరామర్శ:-

శ్రీనాథుడు ప్రాయము క్రైవాలిన పిమ్మట క్రీ॥శ॥ 1440 ప్రాంతంలో రచించిన కావ్యం శివరాత్రి మాహాత్మ్యం. దీనికే సుకుమార చరిత్రమని నామాంతరం. ఆంత్య దశలో దాతలు అడుగంటిపోయిన తర్వాత శ్రీనాథుడు చిత్త శాంతికై శ్రీశైలాన్ని సందర్శించాడు. శ్రీశైలమందలి శాంత భిక్షా వృత్తి మఠాధిపతికి మూల భృత్యుడైన ముమ్మడి శాంతయ్యకు శివరాత్రి మాహాత్మ్యాన్ని శ్రీనాథుడు అంకితమిచ్చాడు. ఇందలి అవతారిక అతిపేలవమై, దోష భూయిష్ఠమై, అప్రౌఢ కవితతో గ్రంథపాతాలతో ఒప్పుతున్నది. దీన్ని బట్టి కొందరు ఈకృతి ప్రదానమునే శంకించారు. కృతి ప్రదానం జరిగిన తర్వాత శ్రీనాథుని పరోక్షంలో శాంతయ్య గానీ, అతని పరోక్షంలో అతని వంశీయులు గానీ మొదట అనతి విస్తృతిగా నున్న అవతారికను పెంచి ఉంటారని శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయం.

కాశీ ఖండమందలి గుణనిధి కథకు సర్వదా సోదర ప్రాయుడే ఇందలి సుకుమారుడు. పాపకార్యాలను చేయటంలో అన్న కంటే అధికుడు సుకుమారుడు. అతడు జూదరియై భ్రష్టుడు కాగా ఇతడు దుష్కాముకుడై పరమభ్రష్టుడయ్యాడు. అతనికి ఇతనికి శివరాత్రి మాహాత్మ్యం వల్లనే శివలోక ప్రాప్తి కలిగింది. గుణనిధి తనకు తానుగా ఇంటి నుంచి పారిపోయాడు. సుకుమారుడు తన తండ్రి మంత్రిత్వం చేసే రాజు చేత రాజ్యం నుండి తరిమివేయబడ్డాడు.

శివరాత్రి మాహాత్మ్యంలో మొదటి ఆశ్వాసము ప్రధాన ఇతివృత్త కథా కథనానికి ప్రస్తావనప్రాయమైంది. చివరిదైన అయిదవ ఆశ్వాసంలోని ఇతివృత్తము పౌరాణిక పద్ధతితో మరికొంత పెంచబడింది. అయిదవ ఆశ్వాసం శివరాత్రి మాహాత్మ్యంలో శివభక్తుల లక్షణాలు వివరింపబడ్డాయి. ఈ ఉపసంహార భాగం లేకపోయినప్పటికీ ప్రధానమైన సుకుమార కథకుగాని, శివరాత్రి మాహాత్మ్య నిరూపణకు గాని ఏ విధమైన వెలితి ఉండేది కాదు.

శ్రీనాథునకు సంస్కృత కవులలో భట్టబాణుని యందు అత్యంత అభిమానం కలదు. బాణుని కాదంబరీ వచన శైలిని తెలుగున అవతరింప చేసినవాడు శ్రీనాథుడే. శివరాత్రి మాహాత్మ్యంలో శ్రీనాథుడు భట్టబాణుని కాదంబరిలోని రసవంతములగు భాగాలను అనేకం గ్రహించాడు. కాబట్టే పూర్వకవి స్తుతిలో అవతారికలో శ్రీనాథుడు మొదట "బాణునద్భుతశాస్త్ర బహుకళా పారీణుడు" అని స్తుతించాడు.

పొసగినపుడెల్ల బాణుని విరోధాభాసాలంకారాలను, ఉపమాగుచ్ఛాలను, అను ప్రాసాదిక శబ్దాలంకారాలను, అనుకరించడంలో శ్రీనాథునకు కుతూహలము మెండు. ఈ గ్రంథంలో అట్టి అనుకరణయే కాక కాదంబరిలోని కొన్ని వాక్యాలు యథాతథంగాను, ఈషద్భేదముతోను అనువదింపబడ్డాయి.

1. సుకుమారుని తండ్రి యజ్ఞదత్తుడను ఒక మంత్రి. అతనికి చిరకాలంగా సంతానం కలగలేదు. భార్య సుశీల తన అనపత్యతకు ఒక నాడు విచారించి, మిక్కిలి ఖిన్నురాలై ఉండగా ఆమెను భర్త ఎంతో సరసంగా ఓదార్చాడు. కాదంబరిలో తారాపీడ మహారాజు తన భార్యను ఓదార్చిన సందర్భం ఇట్టిదే కలదు. శ్రీనాథుడు బాణుని కాదంబరిలోని సంస్కృత వాక్యాలను ఈ సందర్భంలో తెనిగించాడు.

2. కాదంబరిలో శుకనాశుడను మంత్రి రాజకుమారునకు సత్ప్రవర్తనకు హేతు భూతమైన నీత్యుపదేశాన్ని చేస్తాడు. ఆ భాగానికి శుకనాశోపదేశమని పేరు. అట్లే శివరాత్రి మాహాత్మ్యంలో యజ్ఞదత్తుడు తన కుమారుని చెడ్డ త్రోవ నుండి మరలించటానికై కొన్ని నీతులను బోధిస్తాడు. ఈ నీతి బోధ కేవలం శుకనాశోపదేశానికి ప్రతిబింబంగా ఉంది.

   "యత్నేన ఆరాధితాః యథా సమీహిత ఫలానుమతి దుర్లభానామపి వరాణాందాతారో భవన్తి! శ్రూయతేహి పురా చండకౌశిక ప్రభావాన్మగధేషు బృహద్రథో నామరాజా జరాసంధం నామ తనయం లేభే! దశరథశ్చరాజా పరిణతవయా విభాండక మహాముని సుతస్య ఋష్య శృంగస్య ప్రసాదాదవాప చతురః పుత్రాన్! అన్యే చరాజర్షయః తపోధనా నారాధ్య పుత్ర దర్శనామృత సుఖభాజోబభూవుః!" అనే దానికి శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యంలో సర్వజగత్ప్రసిద్ధంబు గదా యితిహాసంబు. తొల్లి చండ కౌశికువర ప్రసాదంబున మగదాధిపతియగు జయద్రధుండు జనార్దనుని గెలువందగినట్టి శౌర్యనిధి జరాసంధుంగాంచె! దశరధుండు విభాండక తనయుండగు ఋష్యంగు నారాధించి దిగ్గజంబుల వోలిన కుమారుల సకలలోక హితంబుగానలుగురంబడసె. సమాధిత గురుదేవతానుగ్రహ వంశంబున నితర రాజులును పుత్ర దర్శ నామృత సుఖమనుభవించిరి. (శివ.రా. 2.35)

ఈ విధంగా భట్టబాణుని కాదంబరి నుండి శ్రీనాథుడు గ్రహించిన వర్ణనలు అనేకం కలవు.

శివరాత్రి మాహాత్మ్యంలోని 2-15, 17, 96, 97, 98, 3-21 గద్య పద్యాలకు మూలాలు కాదంబరిలో ఉన్నాయి. పాత్ర చిత్రణము గుణశీల స్వభావాల వర్ణనలు కూడా కాదంబరి నుండి గ్రహింపబడ్డాయి.

కాదంబరీ మహాకావ్య రసలోలుపతచే దానినే శివరాత్రి మాహాత్మ్య రచనా వ్యాజమున ఆంధ్రీకరింపనెంచనా అనిపించును. అందలి పెక్కు ఘట్టాలను, పలు ప్రాంతాలను వర్ణించటానికే అంతగా ఆవశ్యకత లేకున్నను, శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యంలో కల్పించుకొని యథాతథంగా వానిని ఆంధ్రీకరించెను అన్నట్లు తోస్తున్నది. వ్యాఖ్యానిస్తే ఆయా ఘట్టాలు ఎక్కడ వానినక్కడ ప్రదర్శించటం జరిగింది. కాదంబరిలోని వివిధ పాత్రములు శివరాత్రి మాహాత్మ్యంలో పరివర్తనము చెందిన విధానాన్ని పరిశీలిద్దాం.

కాదంబరిలోని శూద్రక తారా పీడులే శివరాత్రి మాహాత్మ్యంలో హేమాంగదుడు. తారాపీడుని పట్టమహిషి విలాసవతియు, శూద్రుకుని భార్యయు ఇందు యజ్ఞ దత్తామాత్యుని భార్యయైన సుశీలగా పరిణమించింది. కాదంబరిలోని శుకనాసుడే ఇందలి యజ్ఞదుత్తడు. అందలి చంద్రాపీడ వైశంపాయనులిందు విద్యాభ్యాస కాలపు సుకుమారులైరి. కాదంబరిలో శుకమును తీసికొని వచ్చిన చండాల దారికారూపిణియగు మహాలక్ష్మి యిందు కథానాయికయగు మాలెతగా అవతరించింది. అందలి పక్కణమే యిందలి పక్కణము. అందలి శబర సేనాపతియగు మాతంగుడిందు మాలెతతో కాపురముండినప్పటి సుకుమారుడయ్యాడు. అందలి శబర సైనికులు ఇందు వృద్ధ సుకుమారుని సహచరులు. కాదంబరిలోని తారాపీడుని మహిషి విలాసవతి సంతానరహితయై పరితపించుట, భర్త ఆమెనోదార్చుట, తాంబూలకరండ వాహిని తత్పరితాప కారణమును చెప్పుట, శివాలయ పురాణ శ్రవణము, దాన ధర్మాదిక మాచరించుట, గర్భప్రాప్తి, సూతికా గృహము, ప్రసవము, ప్రసూతి కాల బలి విధానము, కుమార సంరక్షణము, శైశవ క్రీడలు మున్నగునవి ఎల్ల దీనియందట్లే యజ్ఞదత్తుని భార్య సుశీల, తత్కుమారుడు సుకుమారుడు అను వారి విషయంలో వర్ణింపబడ్డాయి.

ఇట్లే నైషధ శ్లోకచ్ఛాయలు కొన్ని, కాశీ ఖండ పద్యచ్ఛాయలు కొన్ని ఈ గ్రంథములో కన్పడుతున్నాయి.

1. **శృంగార నైషధం లోని:-**

'వానిఁగలలోన గాననిఁ వనజముఖియు
వాని మార్పునఁబేర్కొని మానవతియు
వానిఁగా నాత్మ భావించి పురనిఁగవయ
న ప్పళింపని సతియు లేదయ్యెనచట' (శృ॥నై॥ 1.62)

ఈ పద్య భావాన్నే శివరాత్రి మాహాత్మ్యంలో రసవత్తరంగా విస్తరింపబడింది.

"హృదయముప్పిళ్ళూరనేకాంతముననుండి
వానిఁజింతింపని వనజ ముఖియు
నొక మాఱతనిఁజూచి యొండొక్క మఱి చూడ
నభిలషింపని విద్రు మాధరియును!
గలలోన వానిఁజికఁగఁగౌఁగిటను జేర్చి
ముకుళి తీక్షణ గాని ముద్దియయును
నతని రూపంబుఁగుడ్యములందు లిఖియించి
యందంబు ఁజూడని యంగనయును
జెలులచేతను, బ్రోది రాచిలుక చేత
వాని గుణములు విని కుచద్వంద్వసీమ
జాదుకొనఁబుల కింపని పైదలి యును
బన్నద ముద్రేసినను లేదు పట్టణమున" (శివ॥మా॥ 2.94)

2. కాశీ ఖండంలో గుణనిధి ఇల్లు విడిచి వెళ్ళిపోయిన పిమ్మట ఉదయ కాలంలో తనకు ప్రేమతో అన్నం పెట్టు తల్లిని స్మరించుకొని విలపించిన పద్య మొకటి కలదు.

" అరుణగ భక్తి బింబముద యాద్రిపయింబొడతేర గిన్నెలోఁ
బెరుఁగును వంటకంబు వడపింది యలుంగుడు వంగఁబెట్టుని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే
హరహర! యెవ్వరింక గడుపారసి పెట్టెదరీప్సితాన్నముల్" (కాశీ 4.114)

ఇదే పద్యం యథాతథంగా శివరాత్రి మాహాత్మ్యం తృతీయాశ్వాసం పందొమ్మిదవ పద్యం అయింది.

3. కాశీ ఖండంలో శివ దూతలకును, యమ దూతలకును జరిగిన సంవాదమునందలి పద్యంలోని కొన్ని మాటలు శివరాత్రి మాహాత్మ్యంలో చేరటం గమనింపవచ్చు.

"అభవు కింకరులార! మహాత్ములార!
తగవు ధర్మంబు పాడిపంతంబు దెలియు
మీకు గడ్డంబు గలదె ముల్లోకములను?
నెంతవారము మేము మీ యెదుర నిలువ?" (కాశీ 4.127)

'తగవు ధర్మంబు పాడి పంతంబు దెలిసి' (శివ॥మా॥ 4.73)

4. పుష్పదంత కృత శివ మహిమ్నస్తవమందలి

"అతీతః పన్థానం తవచ మహిమా వాఙ్మనసయో
రతద్వ్యా వృత్త్యాయంచకిత మభిదత్తే శ్రుతి రపి
నకస్యస్తోతవ్యః కతి విధగుణః కస్య విషయః
పదే త్వర్వాచీనే పతతి నమనః కస్య గవచః"

అను రెండవ శ్లోకము నందలి మాటలును, సనత్కుమార సంహితార్గత శివతత్త్వ సుధానిధి యందలి శివనామ స్మరణాధ్యాయమునందలి

"హర శమ్భో మహాదేవ విశ్వేశామర వల్లభ
శివ శఙ్కర సర్వాత్మన్ నీల కణ్ఠనమోస్తుతే"

అను శ్లోకమును శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యమందలి (5.21) సంస్కృత రగడలో స్వీకరించెను.

5. కాళిదాసు మహాకవి కుమార సంభవము నందలి కొన్ని శ్లోకముల అనుకరణము కూడ శివరాత్రి మాహాత్మ్యమున కనపడుచున్నది.

6. హితోపదేశమునందలి కొన్ని శ్లోకాల ఆంధ్రీకరణములును ఇందు చూడవచ్చును.

7. శ్రీనాథ కవి శివరాత్రి మహాత్మ్యాన్ని కాలరాత్రి వర్ణనతో ప్రారంభించాడు. మూలంలో కాలరాత్రి వర్ణనమే లేదు. ప్రళయ వర్ణనము చేయందే సృష్టి క్రమం నాటుకోదను ఉద్దేశంతో లయకాలాన్ని నైసర్గికంగా వర్ణించాడు. (1.67)

8. మూలంలో బ్రహ్మ గర్వాన్వితుడగుటను గూర్చి అల్పంగా ప్రశంస చేయబడింది. శ్రీనాథుడు మూలానికి మెఱుగులు పెడుతూ బ్రహ్మ యందలి అహంకారాన్ని విపులంగా చిత్రించాడు.

"ఏ నధి కుండ నాకుఁ బ్రతియెవ్వరు నిర్జర కోటిలోననే
గాని జగత్ర్పపంచ పరికల్పనసేయఁగలేఁడు తక్కొరుం
డే నఖిలేశ్వరుండనని యెవ్వరునుం బ్రతికోటి లేమిద్రాఁ
దానయహంకరించెను విధాత సదా శివుమాయ పెలపునన్" (1.76)

'నేను గొప్పవాడను, నాకు దేవతల్లో మాటెవ్వరు? నేను తప్ప తక్కిన వాడెవ్వడును లోక విస్తృతిని నిర్మింపజాలడు, నేను సర్వేశ్వరుడ'నని తనకెవ్వరును ఎదురులేకపోవుటచేత నీశ్వరుని మాయ పెంపుచే బ్రహ్మ తనకు తానే గర్వించాడు.

9. ఈశాన సంహిత యందు సుకుమారుడు చండాల కన్యా సంగమాన్ని పొందిన సంగతి చాల సంగ్రహంగా ఉంది. అనువాదంలో శ్రీనాథుడు విపులీకరించాడు. అంతేగాక వన్నె చిన్నెలుగా చిత్రించాడు.

10. చండాలికా బ్రాహ్మణుల సంభాషణమందు ఇంపైన ఊహాపోహాలు కనిపిస్తాయి. వారి చెలిమి, అన్యోన్యము, వారి కాపురము మొదలగు విషయాలన్నీ శ్రీనాథుడు కండ్లకు కట్టినట్లుగా వర్ణించాడు. (3.31)

"ధరణీ తలంబునఁ జరియింపనేర్చిన పురుహూంత మణి శిలా పుత్రి వోలె............"

11. శ్రీనాథుడు మూలానికి మెఱుగుగా అనేకములైన జాతీయాలను చేర్చాడు. ఆమాలెత బ్రాహ్మణునికేల్దోయి మడుస్తూ 'అయ్యగారికి నమస్కారం'బని పలుకుట ఆ కాలపు సంప్రదాయము.

12. చండాలీ బ్రాహ్మణ సంవాదాన్ని శ్రీనాథుడు ప్రబంధోచితంగా వర్ణించి మూలానికి వన్నె తెచ్చాడు.

13. బ్రాహ్మణ మాతంగీ సంభాషణము నందు శ్రీనాథుడు అనేక పురాణోక్తులను మేలవించాడు. వీని దాంపత్య సంభాషణముననే ఋతువుల యందలి మనోజ్ఞ ప్రకృతిని వర్ణించాడు.

14. 3.127, 128, 129, 130 పద్యాల్లోని ఆనీచ పాత్రమందలి ఊహాపోహాలు కాదంబరిలోని మతంగ కన్య పాత్రను తలపిస్తాయి.

15. అవతారికలో ఇష్టదేవతాభివందనము, పూర్వకుకవి స్తుతి, కుకవి నింద, కృతిపతి వంశాభివర్ణనము, షష్ఠ్యంతాలు ఉన్నాయి. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలో ఆ నాటి సాంఘికాచారాలెన్నియో ఉన్నాయి. నాటి సీమంతోత్సవ విధానము, కాపురుషుల వివిధ వినోదోపాయాలు, బ్రాహ్మణుల ఆచారాలు మున్నగునవెన్నియో ఇందు వర్ణింపబడి యీ కావ్యం నాటి సాంఘిక జీవనానికి అద్దంపడుతున్నది.

16. ఈ గ్రంథ ప్రథమాశ్వాసంలో శివుని సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము వర్ణింపబడింది. బ్రహ్మ, హరి ఇద్దరూ శివుని ఆద్యంతాలు తెలుసుకోలేక పోయారు.

"నీమహత్వంబు వర్ణింప నేరమేము
నిన్నుఁదెలియంగ నేరము నిజముగాగ
నభవ యాద్యుండ వాద్యుండవ గుదుగాన
నట్టి నీ కాచరింతుము పాస్తి యెపుడు" (1.109)

అని పశుపతి మాహాత్మ్యాన్ని వర్ణింపలేక హరి, బ్రహ్మలు శివుని ఆద్యంతాలు తెలిసికోలేకపోయి చివరకు పరీక్షింపతగమని తమ అసమర్థతను తెలిపి పై విధంగా స్తుతిస్తారు. వెంటనే ఆ స్తంభం నుండి విరూపాక్షుడు ప్రత్యక్షమైనాడు.

హరి బ్రహ్మాదులది <u>అర్చనారూపమైనభక్తి</u>. ఇందు స్తుతి ప్రాధాన్యం వహించింది.

17. సుకుమారుడు బ్రాహ్మణుడు. మహాపాపాలు చేసినా శివరాత్రి వ్రత దర్శనం చేసి శివపురానికి వెళ్ళాడు. శివునికి దండ ప్రణామాలు చేసి నమశ్శంకరాయ మొదలగు నామాల్తో స్తుతించాడు.

"జయజయ శంకర జయజయ పుర హర
జయజయ (కరుణా) గుణ వరుణాలయ
జయజయ తుహిన క్ష్మాధర కన్యా
సహచర శాక్వర వరశుభకేతన
జయజయ మంధర కుధరోల్లుఠనా
సంక్షుభిత మహాక్షీరోదన్వత్
జఠరక్రోడ ప్రభవద్గరళ
జ్వలన గిళన కల్మాషిత కందర" (4.91)

శంకరా! పురహరా! దయాసముద్రా! పార్వతీ సహచరుడా! వృభవధ్వజా! మందర పర్వతము తిరుగుటచే మిక్కిలి కలగిన క్షీర సముద్ర గర్భమున నుండి పుట్టిన విషాన్ని కబళనంచే కల్మషం కలదిగా కంఠం కలవాడా! జయము జయము.

సుకమారునిది <u>వందన భక్తి</u>. పాపాత్ముడైనా శివదర్శనానంతరము పాపాలు పటాపంచలైనవి. అ ప్రయత్నంగానే శివుని పై భక్తి కలిగింది. శివునికై పలికిన జయజయ నాద స్తోత్రంలో వందన భక్తి ఉంది.

18. భక్తికి సాధ్యమైన వాడు శివుడు. సకల సృష్టి, స్థితి, లయ కారుడు శివుడు. సర్వ పశువులకు పతి శివుడు. సర్వ జీవుల యందుండు వాడు శివుడు. శివుడొకడే అయినా సర్వభూతముల యందు ఉంటాడు. భిన్న నామాల్తో కొలిచినా, భిన్న రూపాలుగా కనిపించే వాడు శివుడు. యముని సేవకా రూప భక్తిని ప్రదర్శిస్తాడు. సేవ అంటే దాస్యము. దాసులలో జ్ఞాని చివరి విభాగానికి చెందిన వాడు యముడు. శివుడు భక్తుల యందు ప్రాణశక్తి లాగా కదులుతుంటాడు. భక్తులు భగవంతుని యందు సముద్రము నందలి అలలలాగా ఉంటారు అని వర్ణించి వాపోయిన యమునికి శివుడు శివరాత్రి మాహాత్మ్యమునుపదేశించి భక్తుల లక్షణాలను వివరించాడు.

"అఖిలాంగకముల భస్మాలేప మొనరించు
నతని నా భక్తుగానాత్మఁదలఁపు
భసితత్రి పుండ్రంబు భాలపట్టిక దీర్చు
నతని నాభక్తుగానాత్మఁదలఁపు
రుద్రాక్షమాలికల్ రూఢిగా ధరియించు
నతని నా భక్తుగా నాత్మఁదలఁపు
లింగ పూజా సక్తిలీనమానసుడైన
నతని నా భక్తుగా నాత్మఁదలఁపు
ప్రణత శతరుద్ర్యమును నధర్వంబు శిఖియుఁ
బసవనగీతియుఁద్వరితంబుఁబౌరుషంబు

నీల రుద్ర్యంబు బరియించు నియతినెవ్వఁ

డతని నా కూర్మి భక్తుగానాత్మఁదలపు" (5.46)

శరీరమంతటా భస్మ ధారణగావించటం శివభక్తుల లక్షణం. నుదుట మూడు రేఖలుగా విబూది ధారణ చేయుట శివభక్తుల లక్షణం. రుద్రాక్ష మాలికలు ధరించి శివలింగార్చన చేయుటం శతరుద్రీయము, అధర్వశిఖి ఆగమము పఠించటం శివ భక్తుల స్వభావం. వీరికి భక్తితో నమస్కరించి యముడు తొలగిపోవాలని శివుడానతిచ్చాడు.

"శివునెడ భక్తియునెప్పుడు

శివభక్తులఁజూచి నపుడు శివుడను తలపున్

శివ శివ కలిగిన వారల

శివ సాదృశ్యులను మీర చేరకు డెపుడున్" (5.53)

యముడు తన భటులను "శివ భక్తుల జోలికి వెళ్ళవద్దని" ఆజ్ఞాపించాడు. శివునకు, శివ భక్తునకు బేధము లేదు. "శివ భక్తుల సేవ సాక్షాత్ శివుని సేవగా భావించాలి" అని వివరించాడు.

ఎంతటి పాపాత్ముడైనా ఒక్కనాటి శివదర్శన, స్మరణాదుల వల్ల ఎంతటి పాపాలైనా పోగొట్టుకొనవచ్చున్నది శివరాత్రి మాహాత్మ్యంలో వివరించబడింది. ఒక్క రోజు శివ స్మరణ సుకుమారునికి శివలోక ప్రాప్తునిగా చేసింది. శాశ్వత శివ భక్తి మరింత శ్రేయస్కరమన్నది వివరించటం శివరాత్రి మాహాత్మ్య ధ్యేయం.

శ్రీనాథుని గ్రంథాలన్ని ప్రధానంగా శైవ భక్తి స్ఫోరకాలు. జ్ఞాన భక్తి, వైదీభక్తి, కామ్య భక్తి, అర్చాభక్తి, కీర్తన భక్తి, స్తుతి భక్తి, దాస్య భక్తి, ఆత్మ సమర్పణ భక్తి మొదలగు భక్తి విషయాలన్నింటినీ ఆయన గ్రంథాల్లో సమగ్రంగా వివరింపబడింది. ఈశ్వరార్చనా కళాశీలుడైన శ్రీనాథుడు ఈశ్వరార్చనా విధానాలు, భక్తి రీతులు తన గ్రంథాల్లో స్పష్టంగా వివరించాడు. సహజంగా భక్తుడైన శ్రీనాథ మహాకవి తన గ్రంథాల యందు పాత్రల యందేకాక, చివరకు ప్రకృతి వర్ణన లందు కూడ శివత్వం ప్రస్ఫుటింపచేశాడు. శివ స్వరూపాన్ని స్థావర జంగమములందు అంతటా భావించుటే ఈ వర్ణనలకు హేతువు. ఈ భక్తి శ్రీనాథుని గ్రంథములందన్నిటా గోచరిస్తుంది.

19. శివరాత్రి మాహాత్మ్యం యొక్క వస్తు రచనా విన్యాసం (arrangement of plot) సరళమైంది. మానవేతి వృత్తం యొక్క 'ఉచ్చ - నీచ - ఉదాత్తత'లను కవి వర్ణించాడు. కవి సుకుమారుని పాప నిశ్చయాన్ని ఇట్లా తెల్పుతున్నాడు.

"బరువై యీ పాపములలోనఁబాప మొకటి వరుస వేయింటి మీఁది జవ్వాది కొమ్ము" (3.62)

శివరాత్రి దర్శన మాత్రంచే "కలఁగఁగబారె అతని అఘంబులు పంచ హృషీక సంభవంబులు బహు కాల సంకలితముల్దవ వహ్ని చిటచ్చిట ధ్వనింగలఁగఁగఁబాటె పక్షుల ప్రకారమునన్" (4.42)

20. శ్రీనాథుని పాత్రలలో మానవత్వానికి (Humanism) ఎక్కువ స్థానం ఉన్నట్లు కనపడుతుంది. సుకుమారుని కథలో విదేశోన్ముఖుడైన బ్రాహ్మణునితో చండాలి ఇట్లుంటుంది.

"ఎట్టువేగింతు సంసారమిచట నుండి

యేల నినుఁబాసి యొంటి నాకిచట నుండఁ

గలుగనిమ్ము పెక్కుండ్రు బందులును నాకు

బంధువు గలండె నాకు నీ పాటి వాఁడు" (3.135)

ఇక్కడ నుండి సంసారాన్ని ఎట్లు చేస్తాను? నిన్ను విడిచి ఇక్కడ ఒంటరిగా ఉండనేల? నాకు బంధువులు పెక్కురు ఉండనిమ్ము. నీ యంతటి బంధువు కలడా? అని చండాలి ప్రశ్నిస్తుంది. ఇక్కడ ఆమె మనస్సు నందలి ఆర్ద్రత, వర్ణమత కక్ష్యలను దాటిపోయింది. ఆమె అందలి ఆస్థానపతితమైన రూప నిష్పత్తి వలెనే ఆమె ప్రేమ కూడా ఆస్థానపతితమైంది. చండాలీ బ్రాహ్మణుల ప్రేమ అసాంఘికమైనా శ్రీనాథుని మానవ హృదయము యొక్క సున్నితత్వాన్ని గుర్తించవచ్చు. అంత మాత్రం చేత శ్రీనాథుడు సుకుమారుని చపలత్వాన్ని ప్రోత్సహించినట్లనుకోరాదు. వారి అసాంఘికమైన సమాగమాన్ని హర్షించెనని అనుకోకూడదు.

"పాప కర్ముండు ................ అపహరించిన విత్తమ న్యాయ పరత నంత్యజ స్త్రీయుణు దాను మననుభవించు" (3.118)

పాపకర్ముండైన సుకుమారుడు అడవిలో త్రోవ కాచి అకస్మాత్తుగా ఒంటరిగా నున్న బ్రాహ్మణులను కొట్టి దొంగిలించిన ధనాన్ని అన్యాయపరుడై మాలెతయు తానును అనుభవిస్తాడు.

"ఇవ్విధంబున సుకుమారుఁడేలువుడిగి
మాలచి గురాకు బోఁడితో మనువు మనఁగ' (3.119)

ఈ విధంగా సుకుమారుడు కులాచారాన్ని విడిచి మాలతతో కాపురం చేస్తుండగా ............

శ్రీనాథుడు పాత్ర చిత్రణలో పాత్రలతో సమయానుకూలంగా సానుభూతి (sympathy) వహింటం, మరొక సన్నివేశంలో 'పాపకర్ముఁడు' అని స్వయంగానే నిందించటం కనబడుతుంది.

21. 'అరుణగభిస్తబింబ ముదయాద్రి పయింబొడతేర" (3.19)

ఈ పద్యం వల్ల శ్రీనాథుని యొక్క అంతర్వాణి పలుకుతున్నది. శ్రీనాథునికి మాతృదేవత పై గల మమకారం, ఆ తల్లి ఉపలాలనము పెరుగు తోడి చలిది ఉన్నము, వడి పిందెలతో కుడువ పెట్టుట మొదలైనవి కవి ఆత్మీయతా ముద్రగా (personal stamp) వ్యక్తములగుచున్నవి. శ్రీనాథుని మాతృవాత్సల్యం ఈ పద్యంలో తేటతెల్లమవుతున్నది.

పైన చేసిన పరామర్శను బట్టి శ్రీనాథుని స్వాభావికత ఏ పాత్ర యందు కలదో దృఢంగా చెప్పటం కష్టం.

## 7.6 శివరాత్రి మాహాత్మ్యం - రస భావాలు:-

### (ఎ) శృంగార రసము:-

"ఆ సారంగ విలోలలోచనను గాఢాలింగన క్రీడలన్
వాసాగారము కేళి తల్పము పయిన్మన్నించి మంత్రీశుఁడ
త్యాసక్తింజయి చూచు నెట్టుకొని మృత్స్నాస్వాదన ప్రక్రియా
వ్యాసంగం బునఁ గమ్మనైన యదసీయంబైన బింబోష్ఠమున్" (2.47)

యజ్ఞ దత్తామాత్యుడు గర్భవతియైన తన భార్య సుశీలను మిక్కిలి అనురాగంతో లాలిస్తున్నాడు. ఆ సందర్భమునందలి పద్యమిది. చిన్నారి లేడి కన్నుల వంటి కన్నులు గల ఆ అన్నుల మిన్నను అతడు శయన మందిరంలో హంసతూలికా తల్పమున బిగి కౌగిటమన్నించి మట్టిబెడ్డలు తినటం చేత మరింత కమ్మనైన ఆ కంబుకంఠి బింబాధరాన్ని అత్యంత కుతూహలంతో అతిశయించిన అనురాగంతో మాటి మాటికీ చవి చూడసాగాడు.

ఆలంబన విభావము యజ్ఞదుత్తని చిత్తాన్ని లోగొన్న సుశీల వాసాగారము, కేళితల్పము, మృత్స్నా స్వాదనము, కమ్మని బింబోష్ఠము మున్నగునవి ఉద్దీపన విభావాలు. గాఢా లింగనములు, ముద్దు పెట్టుకొనుట, తొందర పాటు, సారంగ విలోల

లోచనములు అనుభావాలు, వ్యభిచారి భావాలు. హర్షము, అవేగము మున్నగునవి యజ్ఞదత్తుని మనస్సులోని రతియను చిత్త వృత్తి విశేషము విభావాదుల సంయోగంచే శృంగార రసంగా రూపు దాల్చింది.

**(1) విరహ విప్రలంభము:-**

"ఇచ్చోటన్ మధుపాన గోష్ఠి సురతం బిచ్చోట, సంగీతకం
బిచ్చోటం, బరిపాటినీ కలకలం బిచ్చోట, మానోదయం
బిచ్చో, నంచు భవద్వియోగమునఁదానెవ్వారికిం బ్రీతిగాఁ
జచ్చున్ మన్మథ వేద నానలమునం జండాలి విప్రోత్తమా!" (3.136)

తన్ను వదలి దూర గ్రామానికి వెళ్తానన్న సుకుమారునితో చండాల కన్య అంటుంది. సంయోగం పొందిన నాయకీనాయకులు వారు. ఏ కారణం చేతనైనా వారికి కలుగు ఎడబాటును వారిరువురిలో ఎవ్వరును భరించలేరు. అందువల్ల ఆతని వియోగము ఎంత మాత్రమును సహింపనేరరని యిట్లు పలికింది మాతంగ లతాంగి.

ఓ బ్రాహ్మణోత్తమా! నీవే వెడలి పోతే నేను జీవించటం దుష్కరం. "ఇదిగో ఇచ్చట మధుపాన గోష్ఠి జరిపితిమి", "ఇదిగో ఇచ్చట సంభోగించితిమి", "ఇచ్చట సంగీతకమాచరించితిమి", "ఇచ్చోట ఆంతరంగికమైన అనేక విషయాలు మాట్లాడుకొన్నాం", "ఇచ్చట ప్రణయం కోపం పొందాం" అని ఈ మధుర స్మృతులతో తపించి తపించి అందరకు సంతసంగా మన్మథ వేదనానలంతో బడి ఈ చండాలి చచ్చిపోవటం సత్యం.

ఇందు మాతంగి విరహ విప్రలంభాన్ని మనోజ్ఞంగా వర్ణించాడు.

**(2)** సుకుమార వృత్తాంతం ధూర్త శృంగారయుతమైంది. కామలంపటత్వము ఆది నుండి అంతం వరకు కన్పిస్తుంది. చండాలి, సుకుమారుల పరిణయ జీవితము నిమ్నమునందు కొంత మెఱుగు. చండాలి తోడ సంసారమే గ్రుడ్డిలో మెల్లయైనది. సుకుమార చరిత్ర యందలి భావ రసాలు శివరాత్రి పూజా దర్శనంతో అతడందించిన భక్తి ముద్రకు లొంగిపోయాయి. శివరాత్రి ప్రదర్శన ఫలమట్టిది.

**(2) హాస్య రసము:-**

"అయ్య! నీవు చతుర్భుజావ తారుడ" వన్నఁ
దమభుజాదండ పార్శ్వములఁజూతు
"రయ్య! నీవు త్రిలోచనావతారుడ" వన్న
ఫాలమంటుదురుదోః పల్లవమున
"నయ్య! నీవు గజాననావతారుఁడ" వన్నఁ
గుంభ పీఠములంటి కొనఁదలంతు
"రయ్య! నీవు చతుర్ముఖావతారుఁడ" వన్న
నద్దంబుఁజూడంగ నభిలషింతు
రవసరంబిచ్చుట యను గ్రహంబుగాఁగ

మోముఁజూచుట యుపకారము గనుబలుకు

మైత్రిగానప్పుడధిక సమ్మానముగఁద

లంతు రైశ్వర్య వైభవంతు లుచ్చి (2.97)

స్తోత్ర పాఠాలకు ఉబ్బితబ్బిబ్బై యుక్తా యుక్తాలు తెలియక మైమరచి చరించు ధనమదాంధులను కవి ఇట్లా పరిహరిస్తున్నాడు. అయ్యా! నీవు చతుర్భుజుని అవతారమనగానే తమ రెండు చేతుల ప్రక్కన మరి రెండు చేతులున్నవేమో అని తడివి చూచుకొంటారు. అయ్యా! నీవు త్రినేత్రుడవు అనగానే చేతితో నుదురు తాకి చూచుకొంటారు. అయ్యా! నీవు గజాస్యునంతటి వాడవు అనగానే తలతడిమి చూచుకొంటారు. అయ్యా! నీవు సాక్షాత్ బ్రహ్మ దేవుని స్వరూపమని అనగానే నాలుగు ముఖాలు ఉన్నవా లేవా అని అద్దాన్ని చూచుకొని అభిలషిస్తారు. దర్శనమిచ్చుటే అనుగ్రహంగా, కన్నెత్తి చూచుటే ఉపకారంగా, పలుకే బహుకరించుటగా భావిస్తారు.

ఇట ధనవంతులు ఆలంబన విభావము. ఐశ్వర్యము ఉద్దీపన విభావము. చేతులకై వెదకుట, నుదురు తాకి చూచుకొనుట మున్నగునవి అనుభావాలు. గర్వము, ఔత్సుక్యము మున్నగునవి సంచారి భావాలు. "విత్తమద మత్తచిత్తు" లను మెత్తమెత్తగా ఎత్తి పొడిచిన ఈ సీసపద్యంలోని పరిహాసము సుకుమారమైన హాస్యాన్ని సృష్టించింది.

**(3) కరుణ రసము:-**

రవల యుంగరముల రత్నాంకురము లొత్త

గేల్దమ్మి చెక్కులఁగేలుకొల్పి

మొకరి తుమ్మెద మూతి ముట్ట గోడెడి వేఁడి

నిశ్వాస పవనంబు నివ్వటిలగ

నాకర్ణ దీర్ఘం బులగు క్రాలుగన్నులఁ

బరిపాటల చ్ఛాయ పల్లవింపఁ

కంఠగోళంబు గద్గది కానుబద్ధమై

బాష్ప భారంబు నిబ్బరముగాఁగ

బక్ష్మములు జాఱి గండ దర్పణము లొరసి

వ్రాలి పాలిండ్ల పై నశ్రువాః కణములు

హారలతలకునాతిథ్య మాచరింప

గుబ్బతిల నేడ్చెనొత్తిలి కువలయాక్షి (2.110)

'కానకకన్న' కన్న కొడుకు సుకుమారుడు దురాచారుడై చ్యుత సంస్కారుడై, నీతి దూరుడై, ధూర్తులతో కూడి వర్తించుచుండుటకు ఆర్తి చెందిన తల్లి దండ్రులు పలు విధాల సుతునకు హితబోధ చేసే సందర్భంలోని పద్యమిది.

కొడుకు దుందుడుకు తనానికి చింతాక్రాంత స్వాంతయైన సుశీలాదేవి శోక వ్యాకుల మాతృమూర్తి ఈ సీస పద్యంలో చిత్రింపబడింది.

భ్రష్టుడైన సుకుమారుడు ఆలంబన విభావము. వాని దుర్వర్తనము, దుశ్చేష్టలు ఉద్దీపనములు. చెక్కిట చేయి చేర్చుట, వేడి నిట్టూర్పులు పుచ్చుట అనుభావాలు. దైన్యము, చింత మున్నగునవి సంచారులు. గద్గదిక, భాష్పవాఃకణములు సాత్త్వికములు. వీనిచే మాతృ శోకము పరిపోషమును పొంది కరుణ రసాకృతి వహించింది.

**(4) రౌద్ర రసము:-**

ద్రాఘిష్ఠ కఠిన దంష్ట్రా దండ సంఘట్ట
కటుఘోర కిటకిటాత్కారమగుచుఁ
జటుల ఝుంఝామరు జంపా పరంపరా
సన్నిభ ఘ్రూణ నిశ్వాసమగుచు
నిటల తారకా చక్ర విభ్రాంతి భీషణ
స్ఫార చక్షుర్ద్వయీ భయదమగుచు,
నిటల వీథి విటంక నిర్భర భ్రుకుటీ
నటన క్రియాటోప పటహమగుచుఁ
గాల మృత్యువు శాణ చక్రమునఁబట్టి
చెకిలి చేసిన యడిదంబుఁజేతఁదాల్చి
జేగుఱించిన మొగముతోఁజిత్త జారి
ప్రమథ వర్గంబుఁదాఁకె నాగ్రహమెలర్ప (4.78)

సుకుమారుని తీసికొని పోవు ఘట్టంలో శివదూతలకు, యమదూతలకు సంఘర్షణ ప్రాయమై రణంగా పరిణమించింది. యముని పక్షంలో శివ దూతల పైకి ఎత్తి వచ్చు కాల మృత్యువు కరాళ స్వరూప వర్ణనమిది.

ప్రమథ వర్గము ఆలంబనము. కాల మృత్యువు, దంష్ట్రా దండ సంఘట్టనలు, ఝుంఝామరున్నిశ్వాసములు, భీషణ చక్షువులు, వికట భ్రుకుటి జేగురించిన ముఖము మొదలగు అనుభవాలు. దానిలోని నిర్నిరోధ క్రోథమునకు పరిపోషకాలై రౌద్ర రసాన్ని వెల్లడిస్తున్నది.

**(5) భయానక రసము:-** 'పంచవదన భటులు ..........కీనాశ కింకరుల ముసలభిండి వాల తోమర మండలాగ్ర త్రిశూల పట్టిసంబుల ఁబ్రహరించిన విచ్ఛిన్న బాహూరు చరణ వక్షః కటి కంఠలలాట కృకాటులై విచ్చియు నొచ్చియుఁ జచ్చియుఁ దెరలియు, బొరలియు, దోఁగియు, డాగియు, గొంచియుఁజలించియు, గ్రుస్సియు, డస్సియు, గందియు, గుందియు, దారియుఁదేరియు, మ్రొగ్గియు, డగ్గియు, నలసియు, సొలసియు, వికావికలై, దిక్కామొగంబులై, యొరుసొరులై, గురిగురియై, బందబందై, భండనంబు విడిచి వలియఁబాఱి వెళ్లఁబాఱుచు, వెల వెలంబోయి కృతాంతుని సన్నిధికింబోయిరి'' (4.87)

సుకుమారుని సూక్ష్మ శరీరాన్ని తీసికొని పోవు సందర్భంలో సంభవించిన సంగ్రామంలో శంకర కింకరులచే కృతాంత కింకరుల భయ పరాజయములీ గద్యంలో హృద్యంగా రూపొందింది.

**(6) భీభత్స రసము:-**

కుక్కలలో శబరులలో
గక్కెర చిమ్మటలలోనఁగార్కోళులలో

బక్కఁణము గుడిసె నడుమను
గుక్కి పయింజచ్చెనతఁడు ఘోర వ్యాధిన్ (4.50)

సచివ సత్తముడైన యజ్ఞ దత్తుని ముద్దుల కుమారుడు సుకుమారుడు దురాచారుడై తిరిగి తిరిగి భయంకరమైన రోగంతో కుక్కలలోను, కిరాతులలోను, కక్కెర పిట్టలలోను, చిమ్మట పురువులలోను, అడవి కోళ్లలోను, బోయపల్లెలోని పూరింటి నడుమ కుక్కి మంచంపై దిక్కు లేని చావు చచ్చినాడు. ఆ బీభత్స దృశ్యమిది.

**(7) యుద్ధ వీరము:-**

"ఇందిరా నాయకుండు శార్ఙ్ఞ మొక్కు వెట్టె
గాండీవము సజ్యముగం జేసెం గమ లభవుండు
శరము విద్దఱుంగాలాగ్ని సన్నిభవిబు
వేసి కొండరు పై శౌర్య మెసక" (1.89)
"అస్త్ర యుద్ధము మాన్ప హర్యజులఁగావఁ
దలఁచి యర్ధేందుమౌళి యత్యంత కరుణ
నస్త్రములు రెంటి నడుమనయ్యె వసరమున
సంభవించె మహానల స్తంభ మూర్తి" (1.101)

శివరాత్రి మాహాత్మ్యంలో ప్రథమా శ్వాసమున 'యుద్ధ వీరము' వర్ణింపబడింది. బ్రహ్మ విష్ణువులు ఆలంబనము. వారు చేసిన జగదవన వ్యాపారములు ఉద్దీపనములు. సురలు విష్ణువు మీద పువ్వులు చల్లుట, ఆ పువ్వుల సోన యందు విష్ణువు, ఖద్యోత గణము మెఱయ బప్పారు అంజనా చలము వలె ఉండుట ఇట్టివి అనుభావాలు మూర్తి ద్వయము మనస్సుల్లో పుట్టిన గర్వము, ఉగ్రత మొదలగునవి సంచారి భావాలు. ఇరువురు మూర్తుల యందును సమరోత్సాహము పెల్లు బికింది.

పరస్పర జయేచ్ఛ కలిగిన బ్రహ్మ విష్ణువులు శస్త్రాస్త్రాల సమర విహారం చేశారు. ఎట్లాగంటే విష్ణువు శార్ఙ్ఞమును ఎక్కు పెట్టాడు. బ్రహ్మ గాండీవాన్ని ఎక్కు పెట్టాడు. ఇద్దఱును పరాక్రమం అతిశయించగా ఒకరి పై నొకరు ప్రళయానల సదృశములైన బాణాలను ప్రయోగించుకున్నారు. ఇంతలో బ్రహ్మ విష్ణువుల మధ్య నుండి ప్రత్యక్షమైన ఈశ్వరునకు జోహారులర్పించారు.

**(8) అద్భుతాభాసము:-**

సదన వన వాటికా నికుంజముల యందు
నెలుకల ధరోష్ఠ సంపుటంబులు గదల్ప
శక్తి మంత్రాక్షరంబులు జపము సేయు
నవియువలెనున్న నద్భుతంబందె నతడు (3.112)

బ్రాహ్మణుడైన సుకుమారుడు చండాలాంగనా సంపర్కాన్ని అనుభవించాడు. ఆ మరునాడు కపట సంధ్యా వందనాన్ని కృతక జపాన్ని మిథ్యా సూర్యోపాస్తిని కావించి వెళ్తూ మధ్యలో మహోన్నతమగు కాళికాలయాన్ని చూచాడు. ఆ ఆలయ భవనాన్ని అంటుకొని ఉన్న వన వాటికా నికుంజాలలో నివసిస్తున్న ఎలుకలు అధరోష్ఠ సంపుటాలు కదిలిస్తుండగా అవి శక్తి మంత్రాక్షరాలను జపం చేస్తున్నట్లుగా సుకుమారున కనిపించినది. ఆతడు ఆశ్చర్యచకితుడైనాడు. ఇక్కడ ఎలుకలు

పెదవులు కదిలిస్తుండగా ఆ సామాన్య విషయాన్ని చూచి అవి మంత్రాలు జపిస్తున్నవని భావించిన సుకుమారుని విస్మయం అద్భుతాభాసానికి అవశ్యము ఉదహరింపదగి ఉన్నది.

**(9) శాంతా భాసము:-**

"కర వీర ప్రసవచ్ఛదారుణ పయః కాషాయ వస్త్రంబుతోఁ
శరతూలచ్ఛవి యజ్ఞ సూత్రములతో జాంబూనద స్ఫూర్తి త
స్కర మృత్స్నా నిటలోర్ధ్వ పుండ్రకముతో సాక్షాచ్ఛుక బ్రహ్మతోఁ
దరమౌ నిన్ను మహాత్మ! రేపకడ సందర్శించినం జాలదే!"

మహాత్మా! గన్నేఱు పూరేకుల వెల ఎఱ్ఱనైన నీర్కావి (3.137) ధోవతి తోను, బంగరు కాంతిని దొంగిలించు మట్టితో పెట్టుకొనిన నొసటి నిలువు బొట్టుతోను సాక్షాచ్ఛుక మహర్షితో సమానుడవైననిన్న ప్రొద్దున్నే చూస్తే సరిపోదు! అంటే సరిపోతుందని భావం. అయితే ఇందులోని శాంతా భాసమెట్టిదంటే

సుకుమారుని పరంగా చండాలి వర్ణించిన "కరవర ప్రసవచ్ఛదారుణ పయః కాషాయ వస్త్రము, శరతూలచ్ఛవి యజ్ఞ సూత్రములు, జాంబూనద స్ఫూర్తి తస్కర మృత్స్నా నిటలోర్ధ్వ పుండ్రకము'' ఇత్యాదులన్నీ జితేంద్రియ ప్రాగ సరుడైన శుక మహర్షితో జౌపమ్యాన్ని 'మహాత్మ' అను సంబోధనమును, ప్రతి ఉదయమునను నిన్ను సందర్శించినం జాలదే' అను మాటలును తత్వజ్ఞాన సంపన్నులైన యోగుల పట్లనే సార్థకములు గాని బ్రాహ్మణ బ్రువుడైన సుకుమారుని పట్ల వ్యర్థములు. ఇట శమము అనుచిత విభావమును ఆలంబముగా కలిగి యున్నది. కాబట్టి శాంతాభాసమైంది.

**(10) యజ్ఞ దత్తుని భార్య సంతతి లేకపోవటంతో చింతా పరాధీనమానస:-**

కోమలాంగుళ దళహస్త తామరసము
కర్ణపూరత్వ లీలకై కాలుసాప
గండతల దర్పణంబున గదియఁజేర్చి
తరుణిచింతించు సుతల బ్ధితడయుటకును (2.18)

మృదువైన వ్రేళ్లనెడు ఱేకులు గల హస్త పద్మము ఆమెకు కర్ణ పూరమగునట్లు సుశీల తన చెక్కుటద్దముల పై చెయ్యి చేర్చి పుత్రప్రాప్తి ఆలస్యమవటానికి చింతించింది.

మరొక సందర్భంలో ఆమె సంతతికై భక్తి భావాన్ని అవలంబించిందట.

"అభిషేకమొనరించు నలినీలకుంతల
శంభు సోమోద్భవాస లిలధార
నెలఁత యభ్యర్చించానీలోత్పలంబులఁ
దరుణ నిర్మల సుధా ధామమౌళి............... (2.21)

సుశీల నర్మదా నదీ జలాలచే ఆ ఊరి యందలి ఓంకారేశ్వరుని అభిషేకిస్తుంది. నల్లని కలువలతో ఆ దేవుని పూజిస్తుంది. ఆ దేవుని శరీరానికి గంధం పూస్తుంది. ఇందు భగవంతునకు చేయు షోడశోపచారాలను చేసినట్లు చెప్పబడింది. తద్వారా ఆమెకున్న భక్తి భావం వ్యక్తమౌతున్నది.

## 7.7 శివరాత్రి మాహాత్మ్యం - అలంకార వైభవం:-

1. **ఉపమాలంకారము:-** ఉపమానోపమేయములకు చక్కని సాదృశ్య సంపద ఎక్కడ ప్రకాశిస్తుందో అచ్చట ఉపమాలంకారం.

"కాంత సరోజనాళలతి కాతను పాండు శరీర యష్టినే
కాంత గృహాంతరస్థితఁబ్రియాంగనఁజేరగ వచ్చె మంత్రి, క
ల్పాంత మునన్ రసాతలగుహా కుహరంబున డాఁగియున్న భూ
కాంత వరాహమూర్తి హరిగ్రచ్చుటు డాయఁగ వచ్చుకైవడిన్" (2.23)

యజ్ఞదత్తుడు ఏకాంత గృహంలో సంతతి లేక పోవడం చేత బాధ పడుతున్న తన పత్నిని ఓదార్చటానికి వచ్చాడు. ఆ సందర్భంలోనిదీ పద్యం.

వరాహమూర్తి యైన వైకుంఠుడు కల్పాంత కాలంలో పాతాళ గుహా కుహరంలో దాగి ఉన్న భూకాంతను సమీపింప వచ్చినట్లు యజ్ఞదత్తుడు ఏకాంత గృహంలో ఉన్న ప్రియకాంతను చేర వచ్చినాడు. ఇందు మహా మంత్రి, ఆతని దేవి ఉపమేయములు, మహా విష్ణువు, భూదేవి ఉపమానములు.

చింతాక్రాంతయైన సుసీలా దేవికి రసాతల గుహాంతరమున నున్న భూదేవితో ఔపమ్యు చెప్పుట సరసము. ఆమెనోదార్చ వచ్చిన మహా మంత్రికి జలధి గర్భము నుండి అరుదెంచిన మహా విష్ణువుతో పోలిక చెప్పుట సమంజసంగా ఉంది.

2. **స్మృత్యలంకారము:-** ఒక దాన్ని చూచి తత్స దృశమగు మరియొక వస్తువును స్మరించిన యెడల స్మృత్యలంకారమగును.

"పైపయి గర్భగేహమునఁబన్నిక మీఱి వెలుంగు మాలికా
దీప శిఖా ప్రరోహములు దేఱగఁజూచి యనుస్మరించెలో
నా పృథివీ సురుండు మహిషా సురమస్తక శోణి తార్ద్ర దు
ర్గా పరమేశ్వరీ పదనఖంబుల రూపము సంవదించినన్" (3.111)

బ్రాహ్మణుడైన సుకుమారుడు కాళికా దేవిని సందర్శించిన సందర్భం లోనిదీ పద్యం. ఇందు కాళికా దేవి గర్భ గుడిలో దేదీప్యమానములై వెలుగులు వెదజల్లుతున్న దీపకళికలను కన్నుల విందుగా కనుగొన్న సుకుమారుడు రూప సాదృశ్యం చే మహిషాసుర మస్తక రక్త రంజితములైన దుర్గాదేవి చరణ నఖములను స్మరించుకొన్నాడు.

అచ్చటి అరుణకాంతులు విరజిమ్ము దీపకరళికలను చూచినంతనే రక్తారుణములైన దుర్గాదేవి చరణ నఖములు స్మృతికి వచ్చినవి కాబట్టి ఇది స్మృత్యాలంకారమైంది.

3. **ఉత్ప్రేక్షాలంకారము:-** ఉపమానము యొక్క తాదుత్మ్యాన్ని ఉపమేయము నందు సంభావించటాన్ని ఉత్ప్రేక్ష అంటారు. ఇది మూడు విధాలుగా ఉంటుంది. వస్తూత్ప్రేక్ష, హేతూత్ప్రేక్ష, ఫలోత్ప్రేక్ష. వీనిలో మొదటిది ఉక్త - అనుక్త బేధంచే రెండు విధాలు. మిగిలిన రెండునూ సిద్ధ - అసిద్ధ బేధంచే ఒక్కొక్కటి రెండు విధాలు.

"పరలోకస్తుఁబతిన్ ఋషాంకు బ్రతికింపంగోరి యోంకార శం
కరు మ్రోలన్ రతి ముక్త కంఠముగ నాక్రందించునానొప్పు న
ప్పుర బాహ్యోపవనాంత దీర్ఘికల రేపున్మాపు వీతెంచు పు
ష్కర కింజల్క భుజిక్రియాసుఖితహంస క్రేంక్రి యారావముల్" (2.8)

హేమాంగదుని రాజధానియైన రత్నపురమందలి ఓంకారేశ్వర స్వామి దేవాలయ ప్రాంతముననున్న దిగుడుబావుల వర్ణనమిది.

దేవాలయానికి చుట్టుకొని ఉద్యానమున్నది. ఆ పూలతోటలో దిగుడు బావులున్నాయి. ఆ దీర్ఘికలలో కలహంసలు విహరిస్తున్నాయి. అవి తామర పూలలోని కింజల్కాలను కడుపు నిండా భుజించి ఆనందంగా క్రేంకారాలు చేస్తున్నవి. ఆ రాయంచల క్రేంకార ధ్వనులు భస్మమైన తన పతిని బ్రతికింపుమని మన్మథపత్ని రతి పరమేశ్వరుని ప్రార్థిస్తున్నట్లున్నవి.

ఇందు హంసల క్రేంకార ధ్వనులు ఉపమేయము. రతిదేవి ఆక్రందనలు ఉపమానము. ఉపమేయము నందు ఉపమానతాదాత్మ్యము సంభావితమగుటచే ఇది ఉత్ప్రేక్ష. కలహంసల క్రేంకారములు కరుణ రసస్ఫోరకాలుగా ఉన్నాయి. అందువల్ల ఈ ఊహ పరమ రమణీయంగా ఉంది.

4. **సహోక్త్యలంకారము:-** సహభావము జన రంజకంగా చెప్పబడినచో అది సహోక్త్యలంకారమౌతుంది.

"పలుచఁబాఱెనుగండ దర్పణ యుగంబు
నవమధూక ప్రసూనంబునవ మధుకర
మానుగతిఁజూచుకంబులు నసితమయ్యె
సవతి పూఁబోండ్ల యాననాబ్జముల తోడ" (2.43)

అంతర్వత్నియగు యజ్ఞదత్తుని పత్ని సుశీలాదేవి వర్ణనమిది.

ఆమెకు చాగ్రములు సపత్నుల ముఖాబ్జములతోపాటు నల్లనైనవి. ఇచ్చట కవి సపత్నీముఖకమలముల నల్లదనాన్ని స్తనాగ్రముల నల్లదనమునకు సహభావాన్ని వర్ణించటం చేత సహోక్తి అయింది.

5. **విరోధాభాసాలంకారము:-** విరోధానికి ఆభాసత్వాని కలుగునట్లు చెప్పటాన్ని విరోధాభాసాలంకారమంటారు.

"ఆ నృపాలుండు నీతి విద్యా నిరూఢిఁ
జారదృష్టి యౌఁగాని విచార దృష్టి
సమధికై శ్వర్య వైభవోజ్జ్వలత నాతఁ
డష్టమూర్తి యౌఁగాని యనష్టమూర్తి" (2.14)

వింధ్యాచల దుర్గాన్ని పరిపాలిస్తున్న హేమాంగద మహారాజు వర్ణనమీ పద్యం.

ఆ 'రాజు' చారదృష్టియే గాని విచార దృష్టి అష్టమూర్తి అయ్యును అనష్టమూర్తి అని విరోధము. ఆయన చారచక్షువు దూరాలోచనము కలవాడు. ఐశ్వర్యము నందు అష్టమూర్తి యగు పరమశివునంతటివాడు. విరూపము కాని స్వరూపము కలవాడు. అని విరోధ పరిహారము.

ఇచట ముందు విరోధము స్ఫురించి అది ఆభాసమై పరిహృతమైంది. అందుచే ఇది విరోధాభాసమైంది.

6. **అసంభవాలంకారము:-** అర్థ సిద్ధికి అసంభావ్యత్వము చెప్పితే అది అసంభవాలంకారమవుతుంది.

"జల ధరంబుల నుండి స్రవించు జలధార
లెన్నవచ్చిననేని యెన్నవచ్చు
గగన మండలి దారకా చక్ర వాళంబు
లెన్నవచ్చిననేని యెన్నవచ్చు

భాగీరథీ మహాపగలోని సికతంబు
లెన్నవచ్చిననేని యెన్నవచ్చు
గలశపాథో రాశి కల్లోల మాలిక
లెన్నవచ్చిననేని యెన్నవచ్చుఁ
గాని నరునకు నెన్న శక్యంబు గావు
పాయకీతండు చేసిన పాతకములు
భర్గ! యేమని విన్న వింపంగనేర్తు
నిట్టి పాపాత్ముఁబొడఁగాన మెన్నఁడేని" (5.32)

యముడు త్రిపురాంతకుని సన్నిధిలో పరమ పాపాత్ముడగు సుకుమారుని పాతకాలను ప్రకటించు సందర్భములోనిదీ పద్యం.

మేఘముల నుండి స్రవించు జల ధారలు లెక్కింపవచ్చును. నభోంగణము నందలి నక్షత్రాలను గణింపవచ్చును. గంగా మహానదిలోని ఇసుక కణములను ఎన్నవచ్చును. పాల సముద్రములోని తరంగాలను పరిగణింపవచ్చును. కాని వాని పాపములను ఎన్నుట శక్యము కాదు. ఇందు జల ధారలు లెక్కించుట నక్షత్రాలను గణించుట సంభవము కానివి. ఇట్లు అర్థ సిద్ధికి అసంభావ్యత్వము చెప్పబడింది. కాబట్టి అసంభవాలంకారము.

7. **సముచ్ఛయాలంకారము:-** ఏక కాలమందు కాదగిన అనేక కార్యాల గుంభనము సముచ్ఛయాలంకారం.

"ఆది గర్భేశ్వరత్వంబు యౌవనంబు
జక్కఁదనమును నతిసాహసంబు ఁజనవు
నొక్కఁడొక్కండు చాలు దోషొత్కరమున
కన్నియు గూడియున్నవి యతని యందు" (2.86)

బాల్యం గడిచి నవ యౌవనమున అడుగుపెట్టిన సుకుమారునుద్దేశించి కవి చెప్పిన పద్యమిది. లోకంలో ఆది గర్భేశ్వరత్వము, యౌవనము, చక్కదనము, సాహసము, చనువు ఇవి ఒక్కొక్కటే నిఖిల అనిష్టాలకు కారణ భూతములు. ఇక ఒక్కచోట ఇవన్నీ కలిసి ఉంటే చెప్పాల్సిందేముంది?

ఇక్కడ ఆది గర్భేశ్వరత్వము (ఐశ్వర్యవంతుల ఇంట పుట్టుట) మొదలయినవి అహమహమికతో సుకుమారుని ఆశ్రయించి వానిని పథభ్రష్టుని చేస్తున్నట్లు వర్ణింపబడటంచే ఇది సముచ్ఛయాలంకారమగుచున్నది.

## 7.8 శివరాత్రి మాహాత్మ్యము వర్ణనా పటిమ:-

వర్ణనల గురించి ప్రాచీన ఆలంకారికులు అష్టాదశ వర్ణనలుండాలని అంగీకరించారు.

వన । జల కేళీ । రవి । శశి
తన యోదయ । మంత్రగతి । రత । క్షితి పరిణాం
బు నిధి । మధు । ఋతు । పురో ద్వా
హన । గ । విరహ । దూత్య । వర్ణనా ష్టాదశమున్ (నన్నె. కుమార. సం. 1.44)

ఈ వర్ణనలు అన్నీ ఉండాలనే నియమం లేదు. కవిప్రతిభనుబట్టి ఈ 18 వర్ణనలలో కొన్నింటినైన కావ్యంలో ఉండవచ్చు. ముఖ్యంగా శివరాత్రి మాహాత్మ్యంలో శ్రీనాథుడు వాడిన వర్ణనలను పరిశీలిద్దాం.

**1. ప్రకృతి రచన యందలి స్వభావ సౌహార్దాలను పరికింతము:-**

**(ఎ) మాఘమాసంలో కనిపించే ప్రకృతి దృశ్యాలను** ఈ క్రింది పద్యంలో వర్ణించాడు.

"పటివోయందుహినంబు, పండెవరి, యిప్పల్పూసె శైలంబునన్
గటి గట్టెన్ వలరాజు తేఁటి యెఱకం గాండ ప్రకారంబులం
జఱపించెన్ గ్రహరాజు మాఠరకునిం జక్రాద్రి కూటంబునం
దటిఁగౌ చేర దిగంత రిక్షపథయాత్రా జైత్రతుత్తుంభమున్" (4.33)

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించు <u>మాఘమాసంలో</u> మంచు తగ్గింది. వరి పండింది. కొండలలో ఇప్ప చెట్లు పుష్పించాయి. మన్మథుడు తుమ్మెద ఱెక్కతో తన శ్రేష్ఠములైన బాణాలకు ఱెక్క గట్టెను. ఆ సమయంలో సూర్యుడు తన అనుచరుడగు మాఠరుని చేత చక్రనాళ పర్వత శిఖరాన ఉత్తర దిక్కునందలి గగనమార్గ యాత్రలో జయభేరిని మ్రోగించాడు.

శ్రీనాథుని ప్రకృతి వర్ణనమందు సహజత్వం ఉంది. శబ్దాల ఆడంబరం ఉంది. అనన్యత (Identification) ఈ కవి గాంచినట్లు కనిపించదు.

<u>'పండెవరి ఇప్పల్పూసె'</u> అని ప్రకృతి సంపదకు క్రియా పద సమర్పణ చేతనే కవి ధన్యవాదము అర్పింప కలడా?

**(బి) <u>హేమంతర్తు విశేషాలు</u>** ఈ క్రింది పద్యంలో స్వభావ రమణీయంగా వర్ణించాడు.

"బలుసు ల్పండెను దొండ ముక్కు వడియెం బ్రాసంగుచే, ల్పోకమో
కల పూఁబాళల తావిఁగ్రోలి పొదలెం గౌబేర దిగ్వాయువుల్,
ఫలినీ విల్లమతల్లి వల్లరుల పైఁ బై పై నలి వ్రాతముల్
పొలసె, న్మంచులు రాలె రాత్రి కరిణీ పూత్కార వార్బిందువుల్" (4.23)

ఆ హేమంత సమయంలో బలుసు తుప్పలు పండాయి. ప్రాసంగు వరి చేలు పండబాఱిన దొండపండు లాగా ఎఱ్ఱని కొనలతో కూడిన గింజలతో నిండి ఉంది. పోకచెట్లు డిప్పతోడి పూలగుత్తుల పరిమళాన్ని త్రాగి ఉత్తర దిశ నుండి కొండ గాలులు వీస్తున్నాయి. తుమ్మెదల గుంపులు ప్రేంకణపు తీగల పై అధికంగా వ్రాలాయి. రాత్రి అనేటువంటి ఆడ ఏనుగు చేసే పూత్కారాల నీటి బిందువుల వంటి మంచు బిందువులు రాలాయి. ఈ విధంగా హేమంతమున్నది. ఇక్కడ కౌబేర దిగ్వాయువులకు, లతలకు గల సంబంధాన్ని వర్ణించాడు. ఈ పద్యంలో అప్రస్తుత శృంగార నాయక పరిస్ఫూర్తి కనిపిస్తున్నది. అవి కౌబేరదిగ్వాయులు పోక పూబాళల త్రావి క్రోలినవి. పిమ్మట ఫలినీ వల్లుల పైకి ఎగబడుచున్నవి. ముగ్ధలయిన యువతులనుండి తెరలి, ప్రౌఢ స్త్రీలను కవయుచున్నవి. ప్రకృతి యందు ఇంద్రియ ప్రవృత్తిని కొని తెచ్చుట పూర్వకవుల పరిపాటి.

**2. సుకుమారుడు చేసిన తటాక వర్ణనము:-**

"స్ఫటిక రత్న గృహంబు సర్పం సహాకాంత
కభిధాంతరంబు దుగ్ధాంబు నిధికి
మణి దర్పణము నభోమణి మార్గలక్ష్మికిఁ
జంద్రా తపమునకు జన్మభూమి
యర్ధేందు మకుటాట్టహాసంబునకు జోడు

పౌలస్త్యగిరికి సబ్రహ్మచారి
ప్రతిబింబ మభ్రము ప్రభువారణమునకు
ననుఁగుఁజుట్టము శారదాభ్రములకు
గమఠ తిమి నక్ర విక్రమ క్రమ విహార
చటులతర వీచికా ఘటా సమధి రూఢ
హంసకుల సన్నినాద సంవ్యాప్త దిగ్వి
భాగమీక్షించె నతడు తడాగ మెదుర" (3.21)

సుకుమారుడు తన ఎదుట ఒక సరస్సును చూచాడట. అది ఎట్లున్నదనగా: భూమి అనెడు స్త్రీ యొక్క స్ఫటికమయమైన గృహాల వలెను, క్షీర సముద్రానికి మాఱు పేరనునట్లు గను, ఆకాశమనెడి లక్ష్మికి మణిమయమైన అద్దంలాగాను, వెన్నలకు పుట్టినిల్లు అనేటట్లుగను, చంద్ర కళాకిరీటుడైన శివుని యొక్క పెద్దనవ్వు లాగాను, కైలాసానికి సహపాఠివలెను, అభ్రమువు భర్తయైన ఐరావత గజానికి ప్రతిబింబంలాగాను, శరత్కాల మేఘాలకు ప్రియ బంధువుగను, తాబేళ్ళు, తిములు, మొసళ్ళు అను జల జంతువుల బలమైన ఆక్రమణము గల సంచారంచే మిక్కిలి చలించు అలల సమూహంచే అధికమైన అంచల ధ్వనులతో వ్యాపించిన దిక్ ప్రదేశములు కలదిగను ఆ తటాకమున్నది. అంటే ఆ సరస్సు స్వచ్ఛమైన ఉదకం కల్గి తెల్లగా ప్రకాశిస్తున్నదన్నమాట. అందుచే దానికి తెల్లని వస్తువులచే పోలిక. స్ఫటిక శిలలు, క్షీర సముద్రము, మణి దర్పణము, వెన్నెల, అట్టహాసము, కైలాసము, ఐరావతము, శరన్మేఘములు అన్నియూ తెల్లనివే. హాసము తెలుపని కవి సమయం. అట్టహాసమింకను తెలుపు. అదియును తెల్లని శివునిది కాబట్టి చెప్పలేనంత తెలుపు. జోడు, సబ్రహ్మచారి, ప్రతిబింబము, అనుగుంజుట్టము అనేవి ఇక్కడ సమానార్థకాలు.

ఆ సరస్సులో తాబేళ్ళు, తిములు, పెద్ద చేపలు, మొసళ్ళు సంచరించటం చేత అందలి అలలు మిక్కిలి చలిస్తున్నాయి. వాని రొదచే అందలి అంచలగముల ధ్వనులు అధికమై దిక్కులంతటా వ్యాపిస్తున్నది.

ఈ సరోవర వర్ణనము కాదంబరీ మహాకావ్యము నందలి యచ్ఛోద నామక సరోవర వర్ణనమునకు ఎంతో సన్నిహితంగా శ్రీనాథుడు వర్ణించాడు. కాదంబరిలో "ప్రవిశ్య చతస్య తరుషండస్య మధ్య భాగే మణి దర్పణ మివ త్రైలోక్య లక్ష్మ్యాః స్ఫటిక భూమి గృహమివ వసుంధరాదేవ్యాః......... కైలాసమివ ద్రవతామాపన్నం, చంద్రా తపమివర్గస తాముపేతం, హారాట్టహాసమివ జలీభూతం, శరదభ్ర బృందమివ ద్రవీ భూయైె కత్ర నిష్యందితం...... అచ్ఛోద నామ సరోదృష్టమన్".

3. <u>శివరాత్రి మాహాత్మ్యంలో విష్ణు జలకేళి వర్ణనమిట్లున్నది</u>

(ఎ) క్రోడాకారముఁదాల్చి కంఠభవ ఘుర్ఘుర్ ధ్వాన విస్ఫూర్తిఁబా
తాళక్రోడ మహా కటాహమున సందారింపఁదత్కంధరా
గోళ స్థాయిని మైన భూమి పృథు వక్షోజ ప్రదేశంబున
న్లీలా సత్పుల కాంకురంబు వెగయ న్వెన్నుండు మున్నీటిలోన్ (1.65)

(బి) లోఁతు మున్నీటి లోపల నీఁతలాడెఁ
గూట కోలావతారుఁడై కైటభారి
చటుల వాల కశాఘాత సంప్రభూత
నీర మడ్డు స్వనంబున నింగి యద్రువ (1.66)

సామాన్యంగా వర్ణితమైన జల క్రీడా వర్ణనానికి శ్రీనాథకృతమైన యీ వర్ణనకు వ్యత్యాసముంది. జల క్రీడ అనంగానే నాయకుడు సుందరీమణులతో జల విహారం చేయటం జ్ఞాపకానికి వస్తుంది. అంతేకాక శ్రీకృష్ణుని రాస క్రీడలు తలపుకు వస్తాయి. మాఘ కావ్యంలో శ్రీ కృష్ణుని జలావగాహనము మనోజ్ఞంగా వర్ణింపబడింది. యజ్ఞ వరాహిరూపియైన విష్ణువును ఆ అవతారంలో జలక్రీడా పరాయణునిగా చిత్రించుట యందు ప్రత్యేకత కలదు. కాని ఇక్కడ విష్ణువు చేసిన జల కేళి వర్ణనం విచిత్రంగా ఉంది.

విష్ణువు వరాహ రూపాన్ని ధరించి, కంఠంలో పుట్టిన ఘుర్, ఘుర్ ధ్వనుల విజృంభణంతో పెద్ద కడవ లాంటి పాతాళ అంతర్భాగాన్ని చీల్చటం జరిగింది. 'ఘుర్ఘుర్' వరాహ ధ్వన్యనుకరణ శబ్దము. నేలను కుళ్ళగించుట వరాహము యొక్క పని. ఆదివరాహము భూమిని తన కోలపై పట్టుకొన్నట్లు పురాణాలు చెప్తున్నాయి. ఇందు కవి కంధరాగోళ స్థాయి అని చెప్తున్నాడు.

రెండో విషయమేమంటే: ఆ గోళము వంటి మెడ యందు నిలబడ్డ భూదేవి గురుకుచ మండలంలో విలాసవంతమైన గగుర్పాటు ఏర్పడిందట. ఇక్కడ వక్షోజాలు భూమివి కాబట్టి 'పృథు' శబ్దం సార్థకంగా కవి వాడాడు. విష్ణువు నాయకుడు. భూమి నాయిక. నాయకుని శృంగార చేష్టలకు నాయిక వక్షోజాదుల పై పులకలు కలుగుట సహజం. ఇక్కడిలోతు మున్నీట ఈతలాడటం చేత నాయకుని శృంగార చేష్టగా చెప్పవచ్చు.

అంతేగాక; విష్ణువు కపట వరాహావతారాన్ని దాల్చి లోతైన సముద్రంలో ఈదులాడాడు. దాని చంచలమైన తోక అనేటువంటి చబుకుతో నీటిలో కొట్టగా, అప్పుడు పుట్టిన ధ్వని సమ్మెట వాయించినట్లున్నది. ఆ ధ్వనికి ఆకాశం అదురుతున్నదట.

నీటిని కొరడాతో కొట్టినప్పటి ధ్వని సరిగా సమ్మెటను వాయించినప్పుడు పుట్టు ధ్వని లాగా ఉంటుంది. ఇక్కడ 'వాల'మునే 'కశ'యని చెప్పబడింది. 'మడ్డు' - అంటే 'A kind of drum' సముద్రపు నీటిని కొట్టినప్పుడు ఏర్పడు ధ్వనికి ఆకాశం అదిరిందంటే ఆ ధ్వని ఎంత పెద్దదో ఊహించవచ్చు.

మొత్తం మీద దీని భావమేమంటే: భూదేవి గళసీమగ్రాలు చుండగా ఉత్సాహంగా తోక త్రిప్పుతూ ఈదుతున్నట్లు ప్రత్యేకంగా వర్ణించాడు.

4. <u>తన యోదయ వర్ణనము:-</u>

నవమాసంబులు నిండిన
ధవళేక్షణ గాంచె సుతు సుధాకరతారా
రవి బుధ ధిషణ విధుంతద
కవులుచ్చగమును నమృత ఘటికలు నడువన్ (2.67)

తొమ్మిది నెలలు నిండగా సుశీల చంద్రుడు, నక్షత్రములును, సూర్యుడు, బుధుడు, బృహస్పతి, రాహువు, శుక్రుడు అను గ్రహాలు ఉచ్ఛస్థితి యందుండగా, అమృత ఘడియలు ప్రవర్తిల్లగా పుత్రున్ని కన్నది.

అన్ని గ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉంటే పుట్టిన సుకుమారుడు అట్టివాడు ఏల అయ్యెనో?

తలయంపి ధవళ ముద్రా కుంభమిడు వారు
రక్షాభసిత రేఖ వ్రాయువారు
గౌర సర్షప రాజికల యఁజల్లెడు వారు

బలి విధానంబులఁబరంగు వారు
లవణంబు నింబ పల్లవ ముద్రి ప్పెడు వారు
ప్రేము మంచంబుతోఁబెనచు వారు
గవల ధూపంబు సంఘటియించు వారును
మంచి ముట్టెడద యోజించువారు
గదిసి దీవించు వారును గంధ తైల
మలదుకొను వారు గాయంబు లందు వారు
బాడు వారును బరిహాస మాడు వారు
వైరి శుద్ధాంత సతులరిష్టాలయమున (2.70)

పురుటింటి యందు అంతఃపుర స్త్రీలు కొందఱు తలాపి దిక్కున ధవళ ముద్రలు కల కుంభాన్నుంచారు. కొందఱు రక్ష కొఱకు భస్మ రేఖ వ్రాశారు. కొందఱు తెల్లావాలను అంతటా చల్లారు. కొందఱు పూజోపహార విధానాలచే ఒప్పి ఉన్నారు. కొందఱు ఉప్పును వేప చిగ్రరును త్రిప్పారు. మఱికొందరు మంచానికి పేమును అల్లారు. మరి కొంత మంది మంచి ముట్టెద పై ఉంచుచున్నారు. కొందఱు దగ్గరకు వచ్చి దీవిస్తున్నారు. కొందరు గంధ తైలాలను పూస్తున్నారు. కొందఱు బాలెంత కాయము అందుచున్నారు. కొందఱు పాటలు పాడు చున్నారు. కొందఱు పరియాచికాలు చేస్తున్నారు.

ఈ ఆచారాలన్నీ శ్రీనాథుని నాడు సంఘంలో ఉండేవి. వీనిలో కొన్ని యిప్పటికిని పల్లెటూళ్ళలో పురిటిండ్లు కానవస్తాయి. ఈ సూతికా గృహ వర్ణన బాణ భట్టు విరచిత కాదంబరీ యందలి సూతికా గృహ వర్ణనను పోలి ఉన్నది. సత్పురుషులు జన్మించినపుడు సుశకునాలు, దుర్మార్గులు జన్మించినపుడు చెడ్డ శకునాలు కనబడుతుంటాయి.

**5. సుకుమారుడు మద్యాన్ని అన వద్యంగా ప్రశంసించిన విధము:-**

**(ఎ) <u>మాతంగీ పరమేశ్వరిం గొలిచెదన్, మద్యంబు సేవించెదన్</u> (3.7)**

మధుశాలిని యగు పార్వతీ దేవిని కొలుస్తాను. మద్యాన్ని సేవిస్తా నంటాడు సుకుమారుడు. మాతంగిని - పార్వతిని అమ్మవారి జాతరలలో అమ్మవారికి మద్యాన్ని వేద్యం చేయటం, జంతువులను బలి ఇవ్వటం మనం చూస్తున్నదే. 'మాతంగీ మధు శాలినీ' అని కలదు గదా!

**(బి)** కల్పద్రుమంబుతోఁగామ ధేనువు తోడ
నమృతాబ్ధి నవతార మయ్యె నెద్ది
బృందార వన మధ్యమందార తరులలో
హాలపాణి కెద్ది ప్రత్యక్ష మయ్యెఁ
ద్రిపురాంతకుని యర్థ దేహంబునకు నెద్ది
మదసముల్లాస సంపత్తి యయ్యె
<u>నవ సుధారూపమై</u> పవన భుగ్భువ నాధి
పతికెద్ది ప్రాణంబు ప్రాణమయ్యె

నట్టి భవ భేషజము నాసమమృతంబుఁ
గన్నుఁగానక శపియించెఁగాక యొకఁడు
తత్సమానములగు పదార్థములు గలవె
భూత భావి భవ త్కాలముల ధరిత్రి (3.10)

కల్పవృక్షంతోను, కామధేనువుతోను పాల సముద్రంలో ఆవిర్భవించినట్టియు, మనోహరమైన ఉద్యానము నడుమ గల మందార వృక్షాలలో బలరామునకు ఎట్ట ఎదుట తోచినట్టియు, త్రిపురహరుడైన ఈశ్వరుని అర్థాంగమగు పార్వతికి మత్తు వల్ల సంతోష సంపదయైనట్టియు, పాతాళ లోక ప్రభువునకు క్రొత్త అమృత రూపమై ప్రాణ సమానమైనట్టియు, సంసారానికి ఔషధం అయినట్టియు, అమృతం వంటి మద్యాన్ని కన్నుకానని వాడయి శుక్రుడు నిందిస్తే నిందించ వచ్చు గాక! కానీ భూమి యందు మద్యంతో సమానమైన పదార్థం జరిగిన, జరగనున్న, జరుగుచున్న కాలాల్లో ఉందా? అంటే లేదనుట.

ఇక్కడ మద్యం కల్పవృక్ష కామధేనువులతో పాటు క్షీర సముద్రంలో పుట్టిందనటం చేతను, దాని గొప్పతనం, సకల కామప్రదత్వం తెలుస్తున్నది. నిజానికి క్షీర సముద్రాన్ని మథించినప్పుడు అందుండి హాలాహలాదులు పుట్టినవే కాని మద్యం పుట్టలేదు. అయినప్పటకీ అది పుట్టినట్లు చెప్పటం దానికి మాహాత్మ్యాన్ని ఆపాదించటం కోసమే. బలరాముడు నాగలి ఆయుధంగా కలవాడు. అతడు మద్యపాన ప్రియుడు. మద్యపాయులు ఇంకను ఎందరో ఉండగా బలరామున్ని పేర్కొనటం మద్యానికున్న మహత్త్వ సిద్ధి కొఱకే. బలరాముడు అవతారపురుషుడు కదా! అట్లే పార్వతి అని అనక త్రిపురాంతకుని అర్థాంగమనటానికి మద్యమునకున్న ఘనతను ఆపాదించటానికే. పార్వతి మద్య ప్రియ అవటం వల్లనే జాతరలలో అమ్మవారికి భక్తులు మద్య నైవేద్యాన్ని చేస్తారు. 'నవ సుధా రూపమై......... మద్యము అపర సుధ అనుట' అట్లే ఆసవము అమృతమట. మద్యము 'భేదభేషజమట'. సంసారమనే వ్యాధికి మందు అనుట. ఆసవము అమృతమట. మద్య ప్రియుల దృష్టిలో అంతేమరి. 'కన్నుగానక' అంటే శుక్రాచార్యునకు ఒక కన్ను గ్రుడ్డిది. సుకుమారుడు మద్య పానాది కార్యాలు బ్రాహ్మణత్వానికి కొంచెం కూడా అడ్డుకాదని చెప్తున్నాడు. అందుకే తాను మద్యం సేవిస్తానని చెప్తున్నాడు.

**6. ద్యూత వర్ణనము:-**

శివరాత్రి మాహాత్మ్యంలో సుకుమారుని గూర్చి కేచిన్మాత్రకంగా ద్యూత విషయం చెప్పబడింది. శ్రీనాథుని కావ్య వర్ణనము లందు ద్యూత ప్రసక్తి అంతగా కనిపించదు.

"ద్యూత కేళియ వినోదోపాయమయ్యెను
బరదారగమనంబు ప్రౌఢియయ్యె" (2.95)

సుకుమారునకు జూదమాడటం కాలక్షేపోపాయమయింది. పర స్త్రీ సంభోగమే నేర్పయ్యెను. పంచ మహాపాతకాల్లోను వ్యసన సప్తకంలోను, జూదము ఒకటిగా పేర్కొనబడింది.

కావ్య సందర్భాన్ని బట్టి కొన్ని వర్ణనలు ఆవశ్యకాలవుతాయి. శోభను కలిగించేవి అవుతాయి. ఈ విధంగా వర్ణనము నందలి ఔచిత్యాన్ని గుర్తించినపుడే కావ్యం మహోదారమవుతుంది.

**7. పుర వర్ణన:-**

**రత్నపుర వర్ణన (2.7):-** "అప్పట్టణంబున కుంజుట్టును.................... వెండియు"

రత్నపురమనే ఆ పట్టనానికి చుట్టూ ఉన్న గ్రామాలు ఐరావతి, శతద్రువు. విపాశ అనెడి నదుల నీటి చేత పండేటి పైరులు

కలిగి ఉంటాయి. సమస్త భూమి అనేటటువంటి స్త్రీ యొక్క బొమముడిని అనుకరిస్తున్నటు వంటి ఆనకట్టల వరుసలు అలంకారాలుగా ఉన్నాయి. చెఱువు గట్టులందలి చెట్ల యొక్క పూల పుప్పొడుల నుండి వచ్చిన అధికమైన పూతేనె ప్రవాహాలచే ఏర్పడ్డ కాలవల యందలి అలలచే వద్ధి పొందుచున్న పందిరులు గల అనేక విధములైన ఉపవనులచే అకాలమైన కారుచీకట్లు కలిగి ఉంటుంది. తోటలలోని గున్న మామిడి చిగురులను తినటం చేత ఇంపైన గొంతుకల ఆడు కోయిలలు మృదువుగా కుహూ ధ్వనులను చేస్తూంటే కల కలంచే పుట్టిన పంచమ స్వరం కలవిగా ఉన్నాయి. రాజనములు, కలమములు, పౌష్టికములు, పతంగ ప్రియములు అను పెక్కు ధ్యానపు పైరులచే ప్రసిద్ధి కెక్కినవి. అందు తోటలు వృద్ధి పొందుతున్నాయి. తామరలు దట్టంగా ఉన్నాయి. ఉలవలు, పెసలు, శెనగలు, తెల్లావలు, చామలు, గోధుమలు, గంటెలు, నువ్వులు, అడవి నువ్వులు పండుతున్నాయి.

ఈ విధంగా ఆ పట్టణం దాశరధి చరిత్ర వలె సీతా వృత్తి చే సరళకంగా ఉంది. చంద్రోదయం లాగా కరసహస్ర సంవర్ధిత రత్నాలయమయి ఉంటుంది. యదు వంశం లాగా కులక్రమాగ్రత శూర పురుషోత్తమ బల రక్షితమై ఉంది.

శివరాత్రి మాహాత్మ్యంలో అనేక సందర్భాల్లో శ్రీనాథుని వర్ణనా పటిమ పరిశీలించవచ్చు. మచ్చుకు కొన్నింటిని మాత్రమే పేర్కొనడం జరిగింది.

## 7.9 ప్రశ్నలు:-

1. శివరాత్రి మాహాత్మ్య మాధారంగా కావ్య పరామర్శ చేయుడు.

## 7.10 ఆధార గ్రంథాలు:-

1. శివరాత్రి మాహాత్మ్యం - చంద్రికావ్యాఖ్యా సహితము - డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
2. శ్రీనాథ మహాకవి కావ్యకళ - డా॥ కూచిభొట్ల హరి

**ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 8

# క్రీడాభిరామము

## శ్రీనాథుడు

**ముఖ్యాంశాలు:-**


8.0 లక్ష్యం

8.1 క్రీడాభిరామం - కర్తృత్వం

8.2 క్రీడాభిరామం - ఇతివృత్తం

8.3 క్రీడాభిరామం - వీథి లక్షణ సమన్వయం

8.4 క్రీడాభిరామం - వ్యంగ్యరచన

8.5 క్రీడాభిరామం - సామాజిక పరిస్థితులు

8.6 సారాంశము

8.7 ప్రశ్నలు

8.8 ఆధారగ్రంథాలు


### 8.0 లక్ష్యం:-

క్రీడాభిరామం కర్తృత్వాన్ని తెలిపి, ఆ కావ్య ప్రక్రియా విధానాన్ని ఆ కావ్యంలోని వ్యంగ్య వైభవాన్ని, ఆ కావ్యంలో ప్రతిబింబించే సామాజిక పరిస్థితులను విశదీకరించడమే ఈ పాఠం లక్ష్యం.

### 8.1 క్రీడాభిరామం - కర్తృత్వం:-

ప్రాచీన తెలుగు సాహిత్యంలో కర్తృత్వ వివాదాలకు ఆస్కారమిచ్చిన కావ్యాలలో క్రీడాభిరామం ఒకటి. ఈ కావ్య కర్తృత్వం కవి సార్వభౌముడుగా ప్రసిద్ధుడైన శ్రీనాథునికి, అంతగా ప్రసిద్ధుడు కాని వినుకొండ వల్లభామాత్యునికి మధ్య నలుగుతున్నది. క్రీడాభిరామ కర్తృత్వాన్ని గురించి మూడు వాదాలు వినిపిస్తున్నాయి.

1. క్రీడాభిరామాన్ని శ్రీనాథుడే రచించాడు.
2. క్రీడాభిరామాన్ని వినుకొండ వల్లభామాత్యుడు రచించాడు.
3. వినుకొండ వల్లభామాత్యుడు రాసిన క్రీడాభిరామాన్ని శ్రీనాథుడు మెరుగులు దిద్ది సహకరించాడు.

ఈ మూడు వాదాలను అర్థం చేసుకుంటే వినుకొండ వల్లభామాత్యుడు రాసిన క్రీడాభిరామ కావ్యానికి శ్రీనాథుడు సహకారమందించాడు. అవతారిక, ఆశ్వాసాంత గద్యాలే రాసి, మధ్యలో కొన్ని పద్యాలు, పదబంధాలు ఉపయోగించుకునే అవకాశం కల్పించారని అర్థమౌతుంది.

క్రీడాభిరామ అవతారిక, ఆశ్వాసాంత గద్య. ఇది వినుకొండ వల్లభరాయుడు రాసిందేనని చెబుతున్నాయి.

"విశ్వ విశ్వంబు పాలించు విభుని చేత
బార్వతీ దేవి గారాబు బట్టి చేత
సాప్యతము గాంచు దిప్పమంత్రీతనయు
డార్యమణి వల్లభామాత్యు డహరహంబు"

"ఆ మంత్రి శేఖరుండు రావిపాటి త్రిపురాంతక దేవుండను కవీశ్వరుండానరించిన ప్రేమాభిరామ నాటకంబు ననుసరించి క్రీడాభిరామం అను రూపకంబు తెనుంగుబాస రచియించిన వారు" (క్రీడా 32, 33)

**ఆశ్వాసాంత గద్య:-** "ఇది శ్రీ మన్మహా మంత్రి శేఖర వినుకొండ తిప్పయామాత్య నందన చందమాంబా గర్భపుణ్యోదయ సుకవిజన విధేయ వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబను వీథి నాటకంబున సర్వంబు నౌకాశ్వాసంబు"

వీటిని బట్టి క్రీడాభిరామం వినుకొండ వల్లభరాయుని రచన అని తెలుస్తుంది. క్రీడాభిరామ కావ్యాన్ని 1909 లో మానవల్లి రామకృష్ణ కవి ప్రచురించారు. ఆయన పరిష్కర్తగా కావ్య కర్తృత్వ నిర్ణయం చేయలేదు. వేటూరి ప్రభాకర శాస్త్రి క్రీడాభిరామం శ్రీనాథుని రచన అని ప్రతిపాదించగా, కిళాంబి రాఘవాచార్యులు ఆయనను సమర్థించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి వాదనను వేమూరి విశ్వనాథ శర్మ వ్యతిరేకించారు. టేకుమళ్ళ అచ్యుతరావు, కందూరి ఈశ్వర దత్తు ఈయనను సమర్థించారు. వీళ్ళు వినుకొండ వల్లభామాత్యుడే క్రీడాభిరామ రచయిత అని వాదించారు. చిలుకూరి వీరభద్రరావు క్రీడాభిరామ కావ్యాన్ని శ్రీనాథుడే వల్లభామాత్యుని పేర క్రీడాభిరామాన్ని రాసినాడు అని ప్రతిపాదించారు. బండారు తిమ్మయ్య శ్రీనాథుని సహాయంతో వల్లభామాత్యుడే క్రీడాభిరామాన్ని రచించాడు అన్నారు. ఆరుద్ర మొదలైన వాళ్ళు ఈ వాదాన్ని సమర్థించారు. కందుకూరి వీరేశలింగం పంతులు కూడా ఈ కావ్య కర్త వల్లభామాత్యుడనే అభిప్రాయపడ్డారు. కొర్లపాటి శ్రీరామమూర్తి క్రీడాభిరామం శ్రీనాథుని రచన అనే వాదాన్ని సుదీర్ఘ చర్చానంతరం నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. బి.ఎన్. శాస్త్రి క్రీడాభిరామ కావ్య పీఠికలో అది శ్రీనాథుని రచన అని ప్రతిపాదించడానికి ఆయన చూపిన కారణాలివి.

1. క్రీడాభిరామ కావ్యావతారికలో కవిని గురించిన పొగడ్త ఆత్మోత్కర్ష స్థాయిని మించిపోయినది.
2. అప్పకవి, లింగమగుంట కవి వంటి లక్షణ గ్రంథకర్తలు శ్రీనాథుని వీథి నాటకంలోనివని ఉదాహరించిన పద్యాలు క్రీడాభిరామంలో ఉన్నాయి.
3. క్రీడాభిరామంలోని కొన్ని పద్యాలు, పద్య భాగాలు , పద్య ఛాయలు, పదాలు, పదబంధాలు శ్రీనాథుని కావ్యాలలో ఉన్నాయి.

**1) ఉదా:**

గార్గ్య సిద్ధాంత మత ముషః కాలకలన
శకున మూనుట యది బృహస్పతి మతమ్ము
వ్యాస మతము మనః ప్రసాదాతిశయము
విప్రజన వాస్య మరయగ విష్ణు మతము

అనే క్రీడాభిరామ పద్యం శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో మొదటి రెండు పాదాలలో యథాతథంగాను, క్రీడాభిరామంలోని నాల్గవ పాదం భీమేశ్వర పురాణంలో మూడో పాదంగాను ఉంటూ, చివరి పాదం ఇలా ఉంది.

2) 'సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు'

"గన్నేరు పూజాయ కరమొప్పనీర్కాలిమడుగుధోవతి పింజె విడిచికట్టి" (క్రీడాభిరామం)

"గన్నేరు పూజాయ గను పట్టుజిలుగైన సలిల కాషాయ వస్త్రంబు గట్టి" (శృంగార నైషధం)

"గొజ్జంగి పూనీరు గులికి మేడించిన గంగ మట్టిలలాట సమునదార్చి" (క్రీడాభిరామం)

"గొజ్జంగి పూనీరు గులికి మేదించిన కమ్మ కస్తురిమేన గలయనలదు" (కాశీ ఖండం)

ఇలాంటివి శ్రీనాథుని అనుమతితో వల్లభరాయుడు క్రీడాభిరామంలో చేర్చుకొని ఉంటారని వల్లభామాత్య కర్తృత్వాన్ని స్థిర పరిచే బండారు తమ్మయ్య వంటి వాళ్ళ వాదన.

చిలుకూరి వీరభద్రరావు ఆంధ్రుల చరిత్ర మూడవ భాగంలో క్రీడాభిరామంలోని పద సంవిధానం, వాగ్వైభవదాతృత్వాది వర్ణనలు, కారక ప్రయోగ వైచిత్రి, పద్యోపక్రమ నిర్వాహణలు శ్రీనాథుని తలపిస్తున్నాయి. 'వ్యామగ్రాహ్య', 'పంచారించు', 'పంచాస్త్రోపనిష ద్రహస్య పరమ బ్రహ్మ స్వరూపంబు', 'గంధర్వోపనిషద్రహస్యములు వక్కాణింతురు', 'సరివచ్చుననవచ్చు', 'ప్రతివచ్చుననవచ్చు' వంటి పద ప్రయోగాలు శ్రీనాథునివే. ఇవి క్రీడాభిరామంలో ఉన్నాయి. 'మీనవిలో చనంబులోను' వంటి పద్యాలు శ్రీనాథుని వీథి నాటకంలో ఉన్నాయి. క్రీడాభిరామంలోను ఉన్నాయి. క్రీడాభిరామంలో పల్నాటి వీర చరిత్ర ప్రసక్తి ఉంది. ఈ ఆధారాలతో క్రీడాభిరామం వల్లభరాయలు రచన కాదు, శ్రీనాథునిదేనని వాదించారు.

పింగళి లక్ష్మీకాంతం గాంభీర్యం గల కావ్యాలు రాసిన శ్రీనాథుడు క్షుద్రకావ్యమైన క్రీడాభిరామం రాసే అవకాశమే లేదన్నారు.

క్రీడాభిరామం ఒక ప్రయోగ వాద కావ్యం. అధిక్షేప కావ్యం. శ్రీనాథుని కావ్యాలలో ఎక్కడా ఈ లక్షణం కనిపించదు. కుందూరి ఈశ్వరదత్తు శృంగార వర్ణనలు మితిదప్పిన క్షుద్ర కావ్యమైన క్రీడాభిరామంలో శ్రీనాథుని ప్రమేయమే ఉండదన్నారు. అయితే శ్రీనాథుని చాటువుల్లో, కావ్యాల్లో అక్కడక్కడా గతి తప్పిన శృంగారముంది. వేమూరి విశ్వనాథ శర్మ క్రీడాభిరామ కావ్యావతారిక కవి ఆత్మ స్తుతితో నిండింది కాబట్టి అది వల్లభామాత్యుని రచనకాదనడాన్ని వ్యతిరేకించారు. ఎందుకంటే చాలా కావ్యావతారికలు మితంమాలిన కవి ఆత్మోత్కర్షలు. చిలుకూరి పాపయ్య శాస్త్రి 'శ్రీనాథ కవితా సమీక్ష'లో వల్లభామాత్యుని రచనకు శ్రీనాథుని దోహదముందని శ్రీనాథ, వల్లభామాత్య పద్యాలను విడదీసి చూపించారు.

ఆరుద్ర వల్లభామాత్యుని రచనకు శ్రీనాథుని సహకారముంటుందనే వాదాన్ని సమర్థించారు. "విజయ నగరానికి వేళ్ళే దారిలో శ్రీనాథుడు వినుకొండలోనో మోపూరులోనో ఒక పెద్ద మజిలీ చేశాడు. తన ప్రతిభను పాండిత్యాన్ని గుర్తించి సరైన వాళ్ళకు పరిచయం చేయదగిన స్నేహితుణ్ణి సంపాదించాలి.....అతను వినుకొండ వల్లభామాత్యుడు......శ్రీనాథుని రెండు పద్యాలలో వల్లభరాయుని ప్రశంసించాడు. ఉదా -

"హాటసగర్భవధూటీ - వీటీ కర్పూర శరల విస్ఫురసౌర
భ్యాటోపచాటు కవితా - పాటవ మరుదవని వల్లభన్న కమరున్"

ఈ వల్లభరాయుడు క్రీడాభిరామం అనే రూపకాన్ని వ్రాస్తున్నాడు. సరిగ్గా ఈ రూపక రచన జరుగుతున్నపుడే శ్రీనాథుడు వల్లభరాయుని కలుసుకున్నాడు కాబోలు. వల్లభరాయుడు వ్రాసిన ప్రతి పద్యాన్ని అతడు సంస్కరించినట్టు కనబడుతుంది. తన పద్యాలనెన్నింటినో ఇందులో కలిపాడు. రూపకానికి ప్రస్తావనగా కృతికర్త వంశ వర్ణన పూర్తిగా శ్రీనాథుడే రాశాడు. శ్రీనాథుడు కాక ఇంకెవరు ఈ రచనలో చెయ్యి వేసినా ఈ వీథి ఇంత పకడ్బందీగా పసందుగా ఉండేది కాదు.

వల్లభరాయుడు గాని, శ్రీనాథుడు గాని ఈ క్రీడాభిరామం మహాకావ్యం అని భావించి ఉండరు. ఇద్దరూ లోవేట చాటువులు చెప్పిన వాళ్ళు. వాటిలో రసవత్తరమైనవన్నీ చేర్చి ఒక చిన్న కథాసూత్రంలో జారుముడి వేశారు. మోపూరు భైరవస్వామి తిరునాళ్ళలో ఏదో నాటకం వేయటానికి ద్వారసముద్రం నుంచి నటులు వచ్చారు. వాళ్ళ చేత వల్లభరాయుడు శ్రీనాథుడు ఈ వీథి ఆడించి ఉంటారు. ఆశువుగా ఎన్నైనా పద్యాలు చెప్పుకుంటూ పోగలరు కాబట్టి రూపకంలో మూడు వంతులూ ముప్పాతిక శ్రీనాథుడే తడుముకోకుండా సాయం పట్టి ఉంటాడు. తాను ఆశించినది వల్లభరాయుని వల్ల వేరే ఉపకారమే గాని ఈ రూపక కర్తృత్వం కాదు. కాబట్టి గద్య విషయంలో శ్రీనాథుడు పట్టించుకొని ఉండడు" (సమగ్ర ఆంధ్ర సాహిత్యం - మూడవ సంపుటం).

సుదీర్ఘమైన ఆరుద్ర అభిప్రాయం క్రీడాభిరామ ద్వంద్వ కర్తృత్వాన్ని స్పష్టం చేస్తున్నది. అందువల్ల ఈ కావ్యంలో శ్రీనాథుని ప్రమేయముందని తేలుతున్నది. వల్లభరాయుని ప్రయత్నమూ ఉంది.

## 8.2 క్రీడాభిరామం - ఇతివృత్త పరిచయం:-

క్రీడాభిరామంలో ఓరుగల్లు నివాసి కాసలనాటి బ్రాహ్మణ యువకుడు గోవింద మంచన శర్మ, అతని స్నేహితుడు టిట్టిభ శెట్టి ఈ యిద్దరి మధ్య సంభాషణగా సాగుతుంది. మంచన శర్మ కాసల్నాటి నుంచి ఆంధ్ర విష్ణు నగరమైన శ్రీకాకుళంలో జరిగే కాకుళేశ్వరుని తిరునాళ్ళు చూడడానికి వెళ్ళాడు. అక్కడ అతనికి టిట్టిభ శెట్టి అనే వైశ్య యువకుడు పరిచయమయ్యాడు. మంచన శర్మ అతనిని ఓరుగల్లు నగరానికి తీసుకొని వచ్చాడు. ఒకరోజు ఉదయం వాళ్ళు ఓరుగల్లు నగరం చేరుకుంటారు. అక్కడి నగర వీధులలోని వింతలు విశేషాలు చూస్తూ వినోదిస్తూ రాత్రికల్లా మంచన శర్మ ప్రియురాలైన కామ మంజరి ఇంటికి చేరుకుంటారు. అలావాళ్ళు దారి పొడవునా చూచిన విశేషాల వర్ణనే క్రీడాభిరామ కావ్యంలో వస్తువు, ఇతివృత్తం.

మంచన శర్మ, టిట్టిభశెట్టి వేకువ జామున బయలుదేరి ఓరుగల్లు కోటకు వెలుపల ఉండే వెలిపాళెంలోనికి ప్రవేశిస్తారు. అక్కడ మేదరవాడ ఉంది. ఆ వాడను వర్ణించుకొని స్నానం కోసం వచ్చిన 'ఛండాలాంగన'ను చూస్తారు. అగడ్తలో నీరు తీసుకొని పోతున్న ఆమెను వర్ణిస్తారు. ఆ తర్వాత వాళ్ళు అంగడి వీధి గుండా నడుస్తారు. ఉదయాన్నే అక్కడ మైలసంత జరుగుతూ ఉంటుంది. అక్కడ అమ్మే వస్తువులన్నింటినీ చూస్తారు. వెలిపాళెం మధ్యలో ఉండే 'హాలికవాటి'ని చూస్తారు. అందులో రైతులు నివసిస్తున్నారు. 'లోపాళెం'లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, వేశ్యలు నివసిస్తున్నారు. ఈ మార్గంలో వాళ్ళు ఒక కర్ణాట వేశ్యను చూశారు. ఒక జూదరుల గుంపును చూస్తారు. సంపెంగ నూనె అమ్ముతున్న కరణ కాంతను చూస్తారు.

మోహరివాడలో (సైనికులుండే చోటు) ఒక కుట్రపువాడు (దర్జీ) రవికలు కుట్టుతూ ఉండటం చూస్తారు. అక్కడి నుండి ఉత్తరంగా ప్రయాణించి ఇండ్ల దగ్గర స్త్రీలు పసుపు నూరడం, ఈరు ఈర్చుకోవడం చూస్తారు. అక్కడి నుండి ఇద్దరూ పురంలోని ప్రవేశిస్తారు. అక్కడ లోతైన పరిఖ ఆకాశమంటి ప్రాకారం, స్వర్ణమయమైన తలుపులు గల పెద్ద గదిని, జనంతో నిండిన వంసల దారి కనిపించాయి. వాళ్ళు కోట లోపలికి వెళ్ళారు. ఆ మార్గం రథగజ అశ్వ శకటాలతో క్రిక్కిరిసి పోయి దుమ్ముతో నిండిపోయి ఉంది. అందువల్ల మంచన శర్మ టిట్టిభ శెట్టి రాజమార్గం వదిలి, క్రంత మార్గం (సందు దారి)లో పోతారు. అక్కడ పల్నాటి వీరుల ఆలయం కనిపించింది. పల్నాటి వీరుల ఆలయానికి ఎదురుగా ఏక వీరాదేవి ఆలయముంది. ఏకవీరాదేవి ఆలయాలను వర్ణిస్తూ పోతూ ఉండగా జక్కుల స్త్రీ కామవల్లీ మహాలక్ష్మీ వలపును పాడుతూ కనిపిస్తుంది. అక్కడ నుండి ముందుకు పోతే మైలారు భటులు కనిపిస్తారు. ఆ మిత్రులు ఇంకా ముందుకు పోగా భైరవుని గుడి, చాముండేశ్వరి ఆలయం, వీరభద్రేశ్వరాలయ మంటపం, బౌద్ధ విహారం, మాసానమ్మ, కొమరు సామయ్య, పాండవుల అడుగులు, మసీదు, మేరు శిఖరాల వలె బంగారు కలశాలతో మెరుస్తున్న కేశవ స్వయంభువుని ఆలయం కనిపిస్తాయి. అప్పటికి మధ్యాహ్నమయ్యింది. రాచనగరు మోసాల మీది గడియారం పదహారు గంటలు కొట్టింది.

భోజన సమయం కావడంతో ఇద్దరూ పూటకూటి యింటికి వెళతారు. ఒక రూకతో దివ్యమైన భోజనం చేసి బయలుదేరుతారు. ఒక పుష్పలాలికను చూస్తారు. ఆమెను వర్ణిస్తారు. తర్వాత "ప్రతాపరుద్ర ధరణీరోపాత్త గోష్ఠీ ప్రతిష్ఠా పారాణ" అయిన షచల్దేవి అనే వేశ్యా భవనాన్ని చూస్తారు. దానిని వర్ణించుకుంటూ పోయి మరో వేశ్య యింట్లో ముకుర రీక్షోత్సవాన్ని చూస్తారు. అక్కడి మదన రేఖ మంచన శర్మ ప్రియురాలైన కామమంజరి కూతురు. ఆమె మంచన శర్మ ద్వారా జన్మించింది. అక్కడ ఇద్దరు మిత్రులు కొంత సేపు సేదతీరుతారు. ప్రసంగంలో వాళ్ళు వైశాఖ శుద్ధ పున్నమి నాడు జరిగే శ్రీకాకుళాంధ్రస్వామి జాతరను గూర్చి ప్రస్తావిస్తారు. వాళ్ళు ఆ రోజంతా అక్కడే గడిపారు. సంపంగె నూనె, సుసుర భేత్తు మొదలైన వాటిని అమ్మేవాళ్ళను చూస్తారు. మేదర వాళ్ళు చాపలు, బుట్టలు అల్లడం చూస్తారు. వేశ్యావాటిలో పాముల వాని నాగస్వరం పాట, పాములాట, మేకపోతుల పోరాటం, కోళ్ళ యుద్ధం చూచి ముందుకు పోయి మధుమావతి అనే వేశ్య ఇంటిని చూస్తారు. ఈమె మంచన శర్మ తండ్రి మాధవ శర్మకు అనుపుగత్తె. ఈమె

చెల్లెలు మదాలస. ఈమెను మంచన శర్మ మేనమామ అయిన మీసాల అప్పయ్య ద్వివేదుల కొడుకు శ్రీధరుడు పరిగ్రహించాడు. మిత్రులిద్దరూ అక్కడి విశేషాలను వర్ణిస్తూ ఉండగా సూర్యుడస్తమించాడు. అప్పుడు ఆర్యవాటికలో ప్రవేశించి ఒక తమ్మడిసాని ఇంట్లో విడిది చేశారు. తమ రాకను మంచన శర్మ కామమంజరికి తెలియజేస్తాడు. ఆమె అక్కడికి వస్తుంది.

క్రీడాభిరామంలో ఒకనాటి ఓరుగల్లు నగర భౌగోళిక సాంస్కృతిక సామాజిక జీవితమే ఇతివృత్తం. ఇది సంభాషణాత్మక వర్ణనా ప్రధానమైన కావ్యం. దృశ్య శ్రవ్యాత్మకమైన కావ్యం. ఇద్దరు యువకులు విలాస పురుషులు తాము చూచిన, తమకు నచ్చిన జీవన దృశ్యాలను తమదైన తీరులో వర్ణించడమే క్రీడాభిరామంలో వస్తువు.

## 8.3 క్రీడాభిరామం - వీథి లక్షణ సమన్వయం:-

క్రీడాభిరామం 'వీథి' అనే దృశ్యరూపకం. ఇది సంస్కృతంలో రావిపాటి త్రిపురాంతకుడు రచించిన ప్రేమాభిరామం అనే వీథి నాటకాన్ని అనుసరించి తెలుగులో రాయబడిందని కవే స్వయంగా చెప్పుకున్నాడు. 'వీథి' అనేది దశ రూపకాలలో ఒకటిగా భారతీయాలంకారికులైన భరతుడు, ధనంజయుడు వంటి వాళ్ళు పేర్కొన్నారు. 'వీథి' అంటే పంక్తి అని అర్థం. అనేక ప్రవృత్తులు గల వ్యక్తులతో నిండిన పంక్తిలాగా, అనేక రసాలతో నిండిన ప్రక్రియను 'వీథి' అన్నట్లు విశ్వనాథుడు అభిప్రాయపడ్డాడు (సాహిత్య దర్పణం).

**వీథి లక్షణాలు:**

1. ఇతివృత్తం కల్పితం.
2. మధ్యమ, అధమ ప్రకృతి గల వాళ్ళలో ఎవరైనా నాయకులు కావచ్చు.
3. ఒకే అంకం ఉంటుంది.
4. పాత్రలు ఒకటిగాని, రెండుగాని ఉంటాయి.
5. శృంగార రసం ఉంటుంది.
6. ముఖ సంధి, నిర్వహణ సంధి ఉంటాయి.
7. కైశికీ వృత్తి ఉంటుంది.
8. పదమూడు సంధ్యంగాలుంటాయి.

**సమన్వయం:** "వీథి నాటకంబున సర్వంబునేకాశ్వాసంబు" ఆశ్వాసం శ్రవ్య కావ్యంలో విభాగం. అంకం దృశ్యకావ్యంలో విభాగం. క్రీడాభిరామంలో దృశ్య కావ్యంగానే ఉంది. కాని అది శ్రవ్య కావ్య రూపం సంతరించుకుంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో 'విద్ధసాలభంజిక', 'ప్రబోధ చంద్రోదయం' వంటి నాటకాలు శ్రవ్య కావ్యాలుగా అనువదింపబడ్డాయి. ఈ సంప్రదాయం కొనసాగింది క్రీడాభిరామంలో. అయినా నాటక లక్షణాలను గర్భీకరించుకున్నది. అందువల్ల ఈ కావ్యంలోని ఏకాశ్వాసాన్ని ఏకాంకంగా భావించాలి. కావ్యమంతా మంచన శర్మ టిట్టిభ శెట్టి సంభాషణలుగా సాగుతుంది. అయినా వర్ణన రూపం సంతరించుకుంది.

టిట్టిభశెట్టి, మంచన శర్మ - ఈ యిద్దరూ ఈ కావ్యంలో పాత్రలు. వాళ్ళు అంత గొప్ప ప్రకృతి గల వాళ్ళు కారు. వాళ్ళది 'గ్రామ్య ప్రవృత్తి' అని విమర్శకులు భావించారు. మనిషికి కామం నిషేధం కాదు గాని, అధమ కామం సమర్థనీయం కాదు. మంచన శర్మ టిట్టిభశెట్టి మధ్యమ నాయకులని, వాళ్ళది కామ శృంగారమని బి.ఎన్. శాస్త్రి అభిప్రాయపడ్డారు. ఈ యిద్దరూ తమకు కనిపించిన దృశ్యాలను, స్త్రీలను కామంతో ముడి పెట్టి వ్యాఖ్యానిస్తుంటారు. కోడి కూతను ప్రాచీన కవులు అనేక కావ్యాలలో వైతాళిక గొంతుకగా వర్ణించారు. క్రీడాభిరామంలో కోడికూతను విన్న టిట్టిభుడు మంచన శర్మతో ఇలా అన్నారు

మంచన వింటివో వినవో మన్మథు డేకశిలా పురంబులో
జంచలనేత్రలంబ తులశయ్యల పై రతికాలరాత్రి పో
రించి ప్రభాత కాలము పరిస్ఫుటమైనను ధర్మదార వ
ట్టించుచునున్న వాడదె కుటీగతకుక్కుట కంఠ కాహళిన్ (క్రీ.డా. 54)

ఇందుకు బదులుగా మంచన తన ప్రియురాలిని బసనారు అలుక తీర్చిన సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ,

ఎట్టకేలకు నలుక రేయెల్లదీర్చి
యువిద యధరామృతము గ్రోలుచున్ననాకు
బాన విఘ్నముగా మ్రోసె, బాపజాతి,
జాతి చండాలమైన వేసరీపు గోడి

అన్నాడు. ప్రతి విషయాన్ని వాళ్ళు ఇలాగే వ్యాఖ్యానిస్తూ ఉంటారు. ఈ యిద్దరితో పాటు ఈ కావ్యంలో కామమంజరి, మాచల్దేవి, మధుమావతి వంటి పాత్రలు కనిపిస్తున్నాయి. వీళ్ళ భూమికలన్నీ కామం చుట్టూ పరిభ్రమిస్తాయి. శృంగార రసం ప్రధానంగా ఈ కావ్యం రాయబడింది. దీనిని కామ్య శృంగారమని పండితులు పేర్కొన్నారు.

నాటకంలో అయిదు సంధులుంటాయి. 1. ముఖ సంధి, 2. ప్రతిముఖ సంధి, 3. గర్భ సంధి, 4. అవమర్శ సంధి, 5. నిర్వహణ సంధి. 'వీథి'లో మొదటి చివరి సంధులుంటాయి. రసానుకూలమైన బీజోత్పత్తి జరగడం ముఖ సంధి. కామమంజరిని చేరుకోవడమనే ఉద్దేశం మంచన శర్మకు కలగడం ఈ కావ్యంలో ప్రారంభం. శకునాలను చూడడం, వేగుచుక్క కనిపించడం, నెమలి షడ్జస్వరంతో కూయడం, కోడి కూత వేయడం - వంటి వాటి వర్ణన ముఖ సంధికి దోహదం చేశాయి. విప్రలంభం వంటి అవస్థలు దాటి మంచన శర్మ కామమంజరిని కలుసుకోవడం నిర్వహణ సంధి.

ఆలంకారికులు 'వీథి'లో కల్పిత వస్తువుండాలి అన్నారు. పురాణ ప్రసిద్ధం కానిది కల్పితమని వారి ఉద్దేశం. సాంఘికంగా ఉన్న వాస్తవాన్ని సమకాలీనమో, సమీప కాలీనమో అయిన దానిని కల్పితమని అనడం వాళ్ళకు పరిపాటి. క్రీడాభిరామం సంస్కృత ప్రేమాభిరామం అనే వీథి రూపకానికి అనుసరణ.

మంచన శర్మ, టిట్టిభ శెట్టి కామమంజరి వంటి వాళ్ళు సామాజిక వ్యక్తులు గనక భారతీయాలంకారికుల ప్రకారం క్రీడాభిరామంలోని వస్తువు కల్పితం.

శృంగార రస ప్రధానమైన కావ్యంలో కైశికావృత్తి ఉంటుందని ఆలంకారికులు పేర్కొన్నారు. ఇది కావ్య రచనాపరమైన లక్షణం. కైశికా వృత్తి అంటే కోమలమైన రచన. ఈషత్ప్రౌఢ కొంచెం ప్రౌఢ రచన గలది సాత్వతీవృత్తి. ఈ రెండూ శృంగార రస పోషణకు తగినవి. క్రీడాభిరామంలో ప్రధానంగా కైశికా వృత్తి, కొంతవరకు సాత్వతీ వృత్తి కనిపిస్తాయి. సుసర భేత్ అనే వేడుక మందును గురించిన పద్యం ఇది.

'ముసిముసి నవ్వుతో నతని మోముగనుంగొని వైశ్యు డిట్లనున్:
రసిక కలావతింసు డవు బ్రాహ్మణ! యింతకు మున్నెఱుంగవే?
యస మశరాలయంబునను హత్తిన వెంద్రుక కప్పువోవగా
విసరు సమీరణంబయిన వేడుకమందిది, కొందురంగనల్' (క్రీ.రా. 79)

క్రీడాభిరామం ఒకటి రెండు లక్షణాలు తక్కువయినా, ఉన్నంతలో సలక్షణమైన వీథి రూపకం. శ్రవ్య కావ్యంగా రాయబడిన వీథి రూపకం.

## 8.4 క్రీడాభిరామం - వ్యంగ్య రచన:-

క్రీడాభిరామంలో ఆద్యంతం విచ్చలవిడి కామం కనిపిస్తుంది. మంచన శర్మ, టిట్టిభ శెట్టి పొద్దుట్నుంచి సాయంకాలం దాకా ఎవర్ని చూచినా వాళ్ళ శరీర వర్ణనల్ని కామంతో నింపేశారు. స్త్రీలను చూస్తే వాళ్ళ అవయవాలే కనిపించాయి వాళ్ళకు. వాళ్ళ సొంత జీవిత రహస్యాలను వాళ్ళ శరీర వాలకం ద్వారా వాళ్ళు వ్యాఖ్యానిస్తారు. వీథిలో పోతున్న మంచన, టిట్టిభలకు ఒక కర్ణాంటాన కనిపించింది. ఆమెను టిట్టిభ శెట్టి ఇలా వర్ణించాడు.

"కుసుమం బెట్టిన చీర కొంగు వొలయం గ్రొవ్వారు పాలిండ్ల పై
ద్రిసరంబుల్ పొలుపార వేణియవటూ ద్దేశంబుతో రాయన
ప్పసమెవ్వాడొయొకండు రాత్రి సురత ప్రౌఢిందనుందేల్చినన్
వసివాళ్ వాడుచు వచ్చుచున్నయది కర్ణాటాంగనంజూచితే"
'వాహకుండెక్కి విడిచిన వారువంజ
గొదమయును లోలిరతి కాళిమదము డగ్గి
యలస భావంబుతోర గర్ణాట వేశ్య
వచ్చుచున్నది యదె విప్రవర్య కంటె' (క్రీ.రా. 86 & 87)

ఇలాంటి వ్యాఖ్య నాగరిక సమాజానికి అసహ్యం కలిగిస్తుంది. కావ్యమంతా మంచన టిట్టిభుల వ్యాఖ్యలు వర్ణనలు ఇలాగే ఉంటాయి. అయితే కవి ఈ కావ్యాన్ని ఈ రకంగా ఎందుకు రాశారు? అన్నది ప్రశ్న. ఈ కావ్యాన్ని క్షుద్ర కామ వర్ణనలతో నింపి కవి సమాజానికి ఏమి సందేశమివ్వాలనుకున్నారు? క్షుద్ర కామ భావనల్ని పాఠకుల్లో ప్రేరేపించడమే కవి ఉద్దేశమా? ఇదే నిజమైతే ఇలాంటి కావ్యం ఉత్తమ కావ్యమౌతుందా? ఈ కావ్యాన్ని పాఠకులు ఎందుకు ఆహ్వానించాలి? ఎందుకు ఆదరించాలి? అని ప్రశ్నలు దొరలుతాయి.

ఈ కావ్యాన్ని ఈ రకంగా రాయడంలో కవి ఉద్దేశం సమాజానికి దుష్ట సంకేతం ఇవ్వడం, సమాజంలోని అనాగరికాంశాలను ఎత్తిచూపి మంచి సమాజ నిర్మాణానికి పిలుపు నివ్వడమేనని విద్వాంసులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల క్రీడాభిరామం క్రీ॥శ॥ 15 వ శతాబ్దంనాటి సమాజ వాస్తవికతను యథాతథంగా ప్రదర్శించి పాఠకుల్ని ఆలోచనలకు పురికొల్పే వ్యంగ్య లేదా అధిక్షేప కావ్యమని పండితులు అభిప్రాయపడ్డారు.

సమాజం ఆయా కాలాల్లో విభిన్న సామాజిక వర్గాలకు విభిన్న ప్రవర్తనా విధానాలను రూపొందించుకుంటుంది. ఒక ఉపాధ్యాయుడు, ఒక నాయకుడు, ఒక తల్లి, ఒక తండ్రి, ఒక విద్వాంసుడు ఇలా విభిన్న రకాల వాళ్ళ నుంచి సమాజం ఒక నిర్దిష్టమైన ప్రవర్తనను ఆశిస్తుంది. వాళ్ళు అందుకు భిన్నంగా ప్రవర్తించినపుడు విస్తుపోవడం సమాజం వంతవుతుంది. కవులు, రచయితలు దానిని అధిక్షేపిస్తారు. ఒక కాలంలో ఒక రకంగా ఉండాలని నిర్దేశించుకున్న సమాజ జీవితం దానికి భిన్నంగా తయారయినప్పుడు దానిని వ్యంగ్యోక్తులతో ఎత్తిచూపే బాధ్యతను రచయితలు స్వీకరిస్తారు. ఇవాళ అనేక సామాజిక రంగాల మీద ఎన్నో రకాల వ్యంగ్య రచనలు వస్తున్నాయి. తెలిదేవర భానుమూర్తి, శంకర నారాయణ వంటి వాళ్ళు దినపత్రికలలో రాస్తున్న ఫీచర్లు చదివితే తెలుగు వ్యంగ్య రచనా వైభవం తెలుస్తుంది. 2004, అక్టోబర్ నాల్గవ తేది హైదరాబాద్ గాంధి ఆస్పత్రిలో జరిగిన దుర్ఘటనను గురించి "మూడోరోజూ 'గాంధీ' హాహాకారాలు" అని ఒక పత్రిక శీర్షిక పెట్టింది. ఆసుపత్రి మీద జరిగిన దౌర్జన్యాలకు నిరసనగా వైద్యులు వైద్యం చేయడం మాని సమ్మె చేశారు. రోగులు చాలా ఇబ్బంది పడ్డారు. పై శీర్షికకు వాచ్యార్థం ఇదే. అయితే శీర్షికలో 'గాంధీ' అనే మాటను సింగిల్ కొటేషన్లో పెట్టడం ఇందులోని వ్యంగ్యం. ఏమిటీ! వ్యంగ్యం? 'అహింస' ప్రబోధించిన గాంధి పేరు మీద స్థాపించిన గాంధీ ఆసుపత్రిలో హింసాత్మక సంఘటన, దాని విషాద పరిణామాల మీద వ్యాఖ్య ఆ శీర్షిక. క్రీడాభిరామం కావ్యం ఇలాంటి

వ్యంగ్య అధిక్షేప కావ్యమని విద్వాంసుల అభిప్రాయం. క్షీణ యుగం నాటి తెలుగు కవిత్వ పరిస్థితిని అధిక్షేపిస్తూ కందుకూరి వీరేశలింగం పంతులు "సరస్వతీ నారద విలాపం" అధిక్షేప కావ్యం రచించారు. క్రీడాభిరామం అలాంటి అధిక్షేప కావ్యమని విమర్శకుల అభిప్రాయం. నిటారుగా ఉండవలసిన సమాజం తలక్రిందులైనప్పుడు దానిని మళ్ళీ నిటారుగా నిలబెట్టడానికి జరిపే సాహిత్య ప్రయత్నం అధిక్షేప-వ్యంగ్య-రచన.

ప్రాచీన భారతీయ సమాజం వర్ణ సమాజం. ఆ సమాజం ప్రతి వర్ణానికే కొన్ని ధర్మాలను నిర్దేశించింది. ఆ ధర్మాలకు కాలం చెల్లడం వల్ల గాని, ఆ ధర్మాలకు అనుకూలంగా ప్రజలు బ్రతకలేకపోయినప్పుడు గాని, లేదా సమాజం లోని లోపాల వల్ల ఆ ధర్మాలకు విఘాతం కలిగినప్పుడు గాని ప్రజలు ఆ ధర్మాలకు దూరం కావడం సహజం. అయితే సమాజానికి ఆదర్శంగా ఉండవలసిన వాళ్ళు అందుకు విరుద్ధంగా తయారవడం విమర్శకు గురౌతుంది. ఉదాత్తంగా ఉండవలసిన వాళ్ళు అనుదాత్తంగా మారితే విమర్శకు గురౌతారు. ఈ అనుదాత్తతను యథాతథంగా ఎత్తిచూపడమే అధిక్షేప-వ్యంగ్య-రచనా లక్షణం. కన్యాశుల్క నాటకాన్ని రాయడానికి అప్పటి సమాజంలోని అనైతికతను ఎత్తిచూపాలన్నదే లక్ష్యమని గురజాడ అప్పారావు పేర్కొన్నారు. ఈ ఎత్తిచూపడాన్ని అధిక్షేపించడమంటారు. దీనికే సోల్లుంఠనమని కూడా పేరు.

క్రీడాభిరామంలో మంచన శర్మ బ్రాహ్మణుడు, టిట్టిభ శెట్టి వైశ్యుడు. ఈ యిద్దరూ యువకులు. కాకతీయ రాజుల రాజధాని ఓరుగల్లు నగరంలో సంచిరస్తూ కనబడిన స్త్రీలందరినీ భోగ దృష్టితో, కామ దృష్టితో వర్ణించి స్త్రీ శరీరాన్ని తప్ప ఇంక దేనినీ చూడలేని బలహీనులు వీళ్ళు. మంచనశర్మను "ధాత్రీసుర తిలకుడు", "కుసుమ శరాసనసముడు" అని, టిట్టిభశెట్టిని 'గారు' అని వర్ణించడం లోనే వాళ్ళ అనైతిక ప్రవర్తన పట్ల రచయిత అధిక్షేపం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. 'ధాత్రీసురులు' అంటే 'భూమి మీద దేవుళ్ళు - బ్రాహ్మణులు' అని అర్థం. బ్రాహ్మణ వర్ణానికే తిలకం వంటి వాడు మంచన శర్మ. అయితే ఆయన కావ్యంలో ప్రవేశించగానే కోడికూతను గురించి చేసిన వ్యాఖ్య ఆయన కుసుమశరాసన సమత్వాన్ని చాటుతుంది. టిట్టిభశెట్టి కోడికూతను వర్ణించిన తీరు, దాని మీద మంచన శర్మ ప్రతిస్పందన వాళ్ళ వర్గాల ధర్మాలకు వ్యతిరేకం. గనుక కవి అధిక్షేపించారు. ఇలాగా క్రీడాభిరామ కావ్యమంతా జీవితాన్ని జీవితంగా ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వాళ్ళ ద్వారా, పరిశీలిస్తున్న వాళ్ళ ద్వారా చెప్పించి, తానేమీ వ్యాఖ్యానం చెయ్యకుండా అధిక్షేపించాడు. ఈ కావ్యంలోని అధిక్షేపాన్ని వ్యంగ్యాన్ని పాఠకులే అర్థం చేసుకోవాలి.

శ్రీనాథుని భీమ ఖండంలో వ్యాసుడు కాశికి వెళ్ళేటపుడు శకునాలు చూస్తారు. సంప్రదాయ దృష్టిలో అది శుభకార్యం.

"గార్గ్య సిద్ధాంత మది ముషఃకాల కలన........" (క్రీ॥రా॥ 66)

మంచన శర్మ సంఘంలో గౌరవం పొందుతున్న వర్ణంలో పుట్టి తన కామకార్య కలాపాలకు బయలుదేరుతూ శకునాలు చూస్తారు. ఇలా చెప్పటమే కవి పరిహాసం. ఇదే ఆక్షేపం.

"దాసనపు పువ్వు భాయతో ఁద్రస్తరించు
చుదయమయ్యె డునదెచూడు మొదలిసంజ
సొబగు వీడికి గట్టెఱ్ఱ సోకినట్టి
కామమంజరి నెమ్మోము కాంతివోలె" (క్రీ॥రా॥ 62)

అని సూర్యునిలో తన వేశ్యను చూడగలిగే మంచన శర్మ స్వభావం మీద కవి వ్యాఖ్య చెయ్యకుండానే పాఠకుని ఆలోచించమంటారు.

మంచన టిట్టిభులు ఓరుగల్లులో దక్షిణ ముఖంగా పోతుంటారు. మధుమావతి అనే పద్మినీ జాతి స్త్రీ మందిరం కనిపిస్తుంది. మంచన ఆమె పూర్వ జన్మ వృత్తాంతం చెబుతాడు. దానిని ఒక యోగి చెప్పినట్లు చెబుతాడు. ఒక యోగి మధుమావతి దగ్గరికి

వచ్చి 'రోవట్టు' (వేశ్యకిచ్చే శుల్కం) చెల్లించి ఆ రాత్రి ఆమెతో గడిపి, గోడ మీద ఒక తెలుగు పద్యం రాసిపోయాడు. అందులో ఆమె పూర్వ జన్మ వృత్తాంతముంది.

పూర్వం ఆమె అలకాపురిలో అంగార వర్ముడనే గంధర్వుడి కూతురు. తర్వాత ఆమె దాక్షారామంలో 'చిన్నిపోతి' అనే జగన్మోహిని. ఆ పై జన్మలో వేంగీ దేశంలో చెంచుల కులంలో కమిడికత్తులమ్మిగా పుట్టింది. ఆ తర్వాత ఆమె మధుమావతిగా జన్మించింది. ఇదీ కథ. కుహనా యోగుల కాపట్యాన్ని కొల్లను అధిక్షేపించే కథ ఇది.

కోళ్ళకు, పొట్టేళ్ళకు, మేకపోతులకు మానవులు పెట్టే పందాలను వర్ణించి కవి మానవుల పాశవికానందాన్ని అధిక్షేపించారు. యుద్ధంలో మరణించిన వీరులు స్వర్గానికి పోయి అప్సరసలతో సుఖిస్తారనే భావనను తీసుకొని కోడి పందాలకు అన్వయించడం ఈ కావ్యంలోని వ్యంగ్య వైభవం.

హా! ఖగేంద్రంబులార! కయ్యమునవీల్గి
పోవుచున్నారె దేవతా భువనమునకు
మీరు రంభా తిలోత్తమా మేనకాది
భోగ కార్యార్థమై కోడి పుంజలార!

కోడి పందాలను చూచి మంచన శర్మ ఇలా వ్యాఖ్యానించడమే ఇందులోని వ్యంగ్యం.

మాచల్దేవి మంచన శర్మకు తనకు తాను "జగత్ప్రసిద్ధ సుమనో బాణాసనామ్నాయ విద్యోపాధ్యాయి, ప్రతాప రుద్ర ధరణీ ణోపాత్త గోష్ఠీ ప్రతిష్ఠా పారీణ, మాచల్దేవి వారాంగన" అని పరిచయం చేస్తుంది. ఇలాంటివి క్రీడాభిరామం నిండా ఉన్నాయి. వీటిని యథాతథంగా ప్రదర్శించి అప్పటి సమాజాన్ని దెప్పి పొడిచే వ్యంగ్య ప్రక్రియ ఈ కావ్యంలో రచయిత వేసుకున్న ప్రణాళిక.

## 8.5 క్రీడాభిరామం - సామాజిక పరిస్థితులు:-

ఇద్దరు యువకులైన విలాస పురుషుల విహార యాత్రా రూపంలో రచింపబడిన 'క్రీడాభిరామం' కావ్యంలో ఒకనాటి ఓరు ప్రాంత సామాజిక జీవితమే వస్తువు. అప్పటి ప్రజల జీవన వైవిధ్యం ఈ కావ్యంలో వర్ణింపబడింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రజల దైనందిన జీవితాన్ని వర్ణించే కావ్యాలు చాలా తక్కువ. క్రీడాభిరామం, ఆముక్తమాల్యద, శుకసప్తతి, హంసవింశతి వంటి గ్రంథాలలో ఆయా కాలాల సామాజిక జీవిత వాస్తవాలు తెలుస్తాయి. క్రీడాభిరామ రచన క్రీ॥శ॥ **1475** ప్రాంతాల్లో రాయబడినట్లు కొర్లపాటి శ్రీరామమూర్తి నిర్ణయించారు. అయితే ఈ కావ్యం చిత్రించిన జీవితం రెండవ ప్రతాప రుద్రుని కాలానికి చెందిన (క్రీ॥శ॥ **1395 - 1393**) ఓరుగల్లు ప్రాంతానికి చెందింది. అప్పటి సామాన్య జన విధానం, అప్పటి వేష విహారాలు, ఆహారపు అలవాట్లు, విభిన్న వృత్తులు, వినోదాలు, పండుగలు, విశ్వాసాలు, సంఘ మర్యాదలు క్రీడాభిరామంలో మనకు స్పష్టమౌతాయి.

కొర్లపాటి అన్నట్లు క్రీడాభిరామంలో ఏకశిలా నగర రేఖా చిత్రం కనిపిస్తుంది. వెలిపాళెం, మేదరవాడ, హట్ట మార్గం, మోహరివాడ, ప్రాకార రేఖ, వంకధార, పెద్దగవని, గడియారం, పూటకూటి ఇల్లు, వేశ్యావాటిక, ఏకవీర, కాకతమ్మ మాహురమ్మ గుడులు, భైరవాలయం, చాముండేశ్వరీ ఆలయం, బౌద్ధారామం, పాండవుల గుడి, మేదరకరణ వేశ్య, చండాలాంగన, కర్ణాటాంగన, కరణకాంత, మాలెత, కాపుటాలు, జక్కులపురంధ్రి, మాచల్దేవి, మధుమావతి, కామమంజరి, పూజారిసాని, వెలనాటి కోడె విధవలు, మైలారభటులు, పాముల మెంగడు, తుర్కల మసీదు, పలనాటి వీర చరిత్ర ప్రదర్శకులు - ఇలాంటి వివరాలు ఈ కావ్యంలో చిత్రింపబడ్డాయి. భౌగోళిక, ఆంతరంగిక వివరాలకు ఈ కావ్యం వర్ణన రూపకం.

ఓరుగల్లు నగరం వెలిపాళెం, హోలిక వాటి, లోపాళెం అని మూడు స్థూల విభాగాల కలిగుండేది. ఓరుగల్లుకు వెలుపల కోట అగడ్త చుట్టూ ఉన్న వెలిపాళెంలో దళితులు జీవించేవారు. అగడ్తకు ఒక వైపు మేదరవాడ, మరోవైపు చండాలవాటిక ఉండేవి.

వెలిపాళెం మధ్యలో హాలికవాటి ఉండేది. అందులో రైతులు నివసించేవారు. లోపాళెంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాల వాళ్ళు, వేశ్యలు నివసించేవారు.

ఈ నగరం ప్రాచీన భారతీయ సమాజానికి సహజమైన అంతరాలను పుణికి పుచ్చుకున్న సమాజమే క్రీడాభిరామంలో ప్రతిబింబిస్తుంది. మతం, కులం, దైవం, జన్మ వంటి విశేషాలు ఈ కావ్యంలోనూ దర్శనమిస్తాయి. స్త్రీలను భోగ దృష్టితో చూచే పురుష ప్రపంచం ఈ కావ్యంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. మంచన శర్మ, టిట్టిభ శెట్టిల సంభాషణల్లో ఈ భోగ దృష్టి విస్తృతంగా వ్యక్తమైంది. ఇదిలా ఉండగా నాటి జీవన విధానంలోని ఇతర విషయాలు ఈ కావ్యంలో ఎన్నో దర్శనమిస్తాయి.

**పూటకూటి ఇండ్ల - ఆహారం:-** అన్నాన్ని అమ్ముకునే విధానం అప్పటికే ఉందని క్రీడాభిరామం చెబుతున్నది.

కప్పురభోగి వంటకము కమ్మని గోధుమపిండి వంటయున్
గుప్పెడు పంచదారయును గ్రొత్తగ గాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్మునల్లనటి పండ్లును, నాలుగైదు నంజులున్
లప్పలతోడ గ్రొంబెరుగు లక్ష్మణ వజ్ఝలయింప రూకకన్ (క్రీ॥రా॥166)

లక్ష్మణ వజ్ఝల ఇంట్లో రూకకు మేలి రకం వరి అన్నం, రుచి గల గోధుమ పిండితో చేసిన పదార్థం, గుప్పెడు పంచదార, అప్పుడే కాచిన ఆవు నెయ్యి, పెసర పప్పు, అరటి పండ్లు, నాలుగు అయిదు నంజుళ్ళు పాత్ర నిండా కొత్త పెరుగు లభించేవి. ఇవి బహుశా మధ్య తరగతివాళ్ళ భోజనం. సామాన్యుల ఆహారం కూర, జొన్న, సజ్జ, అంబలి వంటివి. చలికాలంలో తినే తిండిని కవి ఇలా వర్ణించాడు.

శీతకాలంబు కడిమాడసేయు గుడుచు
భాగ్యవంతుండు తేపాదిడి వల్లెపట్ల
గ్రొత్త యోరెంబు నిగురావకూర తోడ
బిచ్చిలంబైన నేతితో బెరుగుతోడ (క్రీ॥రా॥ 56)

చలికాలంలో కూర్రన్నం తినేవారు. అన్నంలో ఇగురు ఆవకూర కలుపుకొని నెయ్యితో, పెరుగుతో భోంచేసేవాళ్ళు. మంచన శర్మ కాముక వ్యాఖ్యనలా ఉంచితే, పూటి కూటి ఇండ్ల దగ్గర శరీరాన్ని అమ్ముకునే స్త్రీలు చాలా కులాల వాళ్ళు ఉండటం వాళ్ళు వితంతువులు కావడం నాటి సామాజిక వాస్తవికత.

"అఱుగౌను గుబ్బచన్నులు
మెఱుగుం గన్నులును గలుగు మెచ్చుల నవలా
కుఱుబోడ ముండరత్నము
బఱివోవగ విడిచినట్టి బ్రహ్మకు జేజే" (క్రీ॥రా॥ 168)

**వస్త్రధారణ వైవిధ్యం:-** మానవ నాగరికతలో వస్త్రధారణ ఒక చారిత్రక దశ. అయితే సాంఘిక ఆర్థిక వైరుధ్యాలు వస్త్రధారణలోను ఏర్పడిన వైరుధ్యాలకు క్రీడాభిరామం అద్దం పట్టింది. మంచన శర్మ

"గన్నెరు బూజాయ కరెమొప్ప నీర్కాలి
మరుగు దోవతి పింజె విడిచి వైచి ...............
తళుకు బెంగాలి కోకయు" ధరించాడు (క్రీ॥రా॥ 42)

ఇతడు చలికాలం "స్థూల ద్విత్రిపటావ కుంఠనములు" ధరించగల స్తోమత గలవాడు. (క్రీ॥రా॥ 48) స్త్రీలు కూడా బెంగాలి వస్త్రాలను ధరించేవారు. కుసుమం బెట్టిన చీరలు ధరించేవారు. కరణకాంత వేషమిది

"జంగాళమున బింజె సవరించి కట్టిన
మడు గొంటి పొరను" (క్రీ॥రా॥ 101)

వేశ్యలు అనివార్యంగా పురుషుల్ని ఆకర్షించే దుస్తులు ధరించేవాళ్ళు. వితంతు మాసకమ్మ "చెలగి చెలగి పొత్తి చీరలు"గట్టేది (క్రీ॥రా॥ 214). కాపుటాలు "జటివోని గడి తరపు జిఋత చేకంబుల తొగరు బుట్టము కచ్చదొడిలి" కట్టేది (క్రీ॥రా॥ 134).

**ఇల్లు - వాకిలి:-** ఓరుగల్లున గల సౌధాలు కొన్నింటి మీద బంగారు కుంభాలుండేవి. ఉదయ సూర్య కాంతిలో అవి ప్రకాశించేవి. పామర భామలు ఇండ్ల ముందర 'గోమయ పిండం' పెట్టేవారు. వేశ్యా వాటికా నికట సౌందర్యం ఇలా ఉంది.

చందనంబున గలయంపి చల్లినారు
ముగ్గు అడినారు కాశ్మీర మదమున
వ్రాసినా రిందు రజమున రంగవల్లి
కంజముల దోరణంబులు గట్టినారు (క్రీ॥రా॥ 178)

మాచల్దేవి చిత్రశాల "చిత్రజుని శౌర్య మెరిగి"స్తున్నది (క్రీ॥రా॥ 191). మాధవ శర్మ కూతురు మధుమావతీ దేవి మందిరం "పైడి కుండల మొగసాల తోడిది" (237) కనిపిస్తున్నది. మేదర కరణ వేశ్య వంటి వాళ్ళు మాత్రం కటకుటీర విలాసినులుగానే మిగిలిపోయారు. (70). కామమంజరి వంటి వాళ్ళ ఇళ్ళు మాత్రం కామ మందిరాలే.

**వృత్తులు - వ్యాపకాలు:-** క్రీడాభిరామంలో అనేక వృత్తుల వాళ్ళు కనిపిస్తారు. అన్నం అమ్ముకొనే వాళ్ళు, శరీరాన్ని అమ్ముకునే వాళ్ళు ఉండగా, కంసాలి, కమ్మరి, కుమ్మరి, శిల్పి, సాలె - వాళ్ళను 'పంచాణం' అంటారు. వాళ్ళు సైన్యానికి కావలసిన ఆయుధాలను, యుద్ధభేరీలను, ఆటపాటల కవసరమైన వాద్య విశేషాలు, స్త్రీల కవసరమైన ఆభరణాలు, రంగులు తయారు చేసేవారు. ధనికుల్ని మోసుకుపోవడానికి కావలసిన పల్లకీలను వడ్రంగులు తయారుచేసేవారు. పల్లకీ శిల్పంలో వాళ్ళు ఆరితేరారు. ఓరుగల్లులో కంబళులు నేసేవాళ్ళున్నారు. రత్నకంబళుల్ని ఉత్పత్తి చేసే మహమ్మదీయులున్నారు. తివాసీ కళ అప్పటికే బాగా అభివృద్ధి చెందింది. కంబళ్ళు తయారుచేయడానికి గొర్రెల, పొట్టేళ్ళ ఉన్నిని వాడేవారు.

ఓరుగల్లులోని 'మొహరివాడ'లో సైనికుల దుస్తులు కుట్టే కుట్రపు వారు ఉండేవారు. వీళ్ళే వేశ్యలకు కూడా రవికలు కుట్టేవారు. గానుగ వృత్తి అప్పటికే బాగా ప్రాచుర్యం పొందింది. దీనిని స్త్రీలు పురుషులు కలిసి నిర్వహించేవారు. గానుగ ఆడుకొని బ్రతికే స్త్రీని "దీని గణికామణి జేయకనిర్దయాత్ముడై గానుల దాని జేసిన వికార విధిందల మొత్తగాదనున్" అని వ్యాఖ్యానించిన మంచన శర్మ సంస్కారం అటుంచితే ఆమె శ్రామిక సౌందర్యం గొప్పది. క్రీడాభిరామంలో 'సుసర భేత్' అనే మందును అమ్ముకొని బ్రతికే స్త్రీలున్నారు. భిక్షాటనమే వృత్తిగాగల వాళ్ళున్నారు. గాయక వృత్తిలో బ్రతికే దళిత మహిళలు కనిపిస్తారు. గుడిలోకి ప్రవేశం లేనందున గుడి బయట నిలబడి ఏకవీరను స్తుతించేవారు. 'గడిడు' అనబడే గారడీ వృత్తివాళ్ళు క్రీడాభిరామంలో తారసపడతారు. పాముల్ని ఆడించి బతికే 'పాముల మెంగడు'' ఎదురౌతాడు.

నున్నసైనలుపెక్కి నొసల చేరువ కంటి । కెకువ వైచిన చిన శిఖ పెసలు చూడ
గరసాన దిగిచిన కలివెగందపు బొట్టు । తిరికట్టు కొని మోము దిరిగి యుండ
తటపెట దిమికిట ధ్వనులోలి బుట్టింప । జాలుగుమ్మెట చంక వ్రేలు చూడ
నలుక నైమీ జేత నంటిన యాక్రొత్త । ముచ్చలత్తెము సారె ములుగు చుండ

నొసలు స్సుక్కించునావుర్న నోరు దెరచు - గ్రుడ్లు మిడికించు రాగంబు గుమ్మడించు

పాడుగతులకు దనుదానెపరగియాడు - నల్లయాతండువో తూర్పునాటి గడియ (క్రీ॥రా॥ 226)

సంతలో వస్తు వాణిజ్య వృత్తిని కూడా క్రీడాభిరామం గ్రంథస్థం చేసింది. మైల సంతలో ఆకులు, కూరగాయలు, టెంకాయలు, మామిడి పండ్లు, చింతపండు, నువ్వులు, గోధుమలు, పెసలు, వడ్లు, నూనె, నెయ్యి, ఉప్పు, బెల్లం, ఆవాలు, మిరియాలు, తగరం, రాగి, చందనం, కస్తూరి, ఉల్లి, అల్లం సర్వమూ అమ్మబడేవి. ఓరుగల్లులో 'హట్టమార్గం' ఒకటి ఉండేది.

**ఆటలు - వినోదాలు:-** పొట్టకూటి కోసం అనేక వృత్తులలో గడుపుకునే ప్రజలొక వైపుండగా, మానవుని వినోదాలకు మానవ పౌరుషాల నిరూపణకు పశువులకు పక్షులకు రక్తపాత రూప పందేలు పెట్టే వాళ్ళు మరో వైపు వున్నారు క్రీడాభిరామంలో. కావ్యంలోని మేష యుద్ధం (227 - 233) కోళ్ల పోరు (234 - 236) వర్ణనలు పరిశీలిస్తే అప్పటి వినోదాల స్వభావం తెలుస్తుంది. వీటిని మంచన శర్మ 'సజీవ ద్యూతము'లంటారు.

నిటలమ్ములవిసి నెత్తురు
సొటసొట వతియంగ నమర శూరోత్తములై
కటుకునను మెండు తగరులు
చటులాటోపమున రెండు సరిపడబోరెన్ (229)

"కారికేళ ఒక జాతీయంబు లై యీజగ జెట్టి గోడిపుంజులు మెదలు నిక్కిం
చుచు ఱెక్కలల్లార్చుచు 'గొక్కొక్కొ' యని కాల్రల్వి క్రొవ్వు మిగిలి
తరళ తారకో ద్వృత్తర క్రాంత లోచన మండలంబులై యొందొంటిం
గదిసి చుఱ చుఱజూచు యేచిన కోపాటోపంబున గుప్పించి యుప్పరం
బెగసి చరణాంగుళీ కుటిల నఖ శిఖా కోటి కుట్టనంబులం జిరు
దొగ డువెగయన్ వక్షస్థలంబులు వ్రచ్చి........................" (235)

క్రీడాభిరామంలో ఇంకా జూదం, బంతి ఆట, తోలు బొమ్మలాట వంటి వినోదాలు చిత్రింపబడ్డాయి. సప్త వ్యసనాలలో ఒకటిగా పరిగణింపబడే జూదాన్ని పాపద్యూతమని మంచన శర్మ పేర్కొనడం విశేషం. జూదరులు ఒకరినొకరు పరిహసించుకున్నారు. అశ్లీల పదాలతో సంభాషించుకున్నారు. ఉమ్మివేయడం, తిట్టుకోవడం, పొగడుకోవడం సరేసరి. ఇదంతా ఒక పస్యతో హర విద్య. ఈ జూదమాడాలన్న కోరిక కలగడమే అంత్యంత పాపబుద్ధి అని, జూదరులలో చివరికి మొలలో కేపీనాలు తప్ప ఇంకేవీ మిగలవని మంచన శర్మ పేర్కొంటాడు.

సంగాసంగ జయా జయంబు పరిహాస ప్రస్ఫుటా శ్లీల భా
షాంగం బాకలితాంతరా వలయ కక్ష్యాభాగము ద్రాలస
ద్ఘంనీ నిష్ఠిత కాష్ఠ శంకుకము పాపద్యూత మిాపన్నదం
బంగీ కారము సేయు వారి మొలలంబ్రాపించు గోపీనముల్ (98)

క్రీడాభిరామంలో మైలార వీర భటుల గొండ్లియాట తెలుసుకోదగింది. తొట్టి నీళ్ళలో మునిగిన ముంగరను ఒక స్త్రీ ఆ నీళ్ళలో మునిగి ముక్కుతో గుచ్చుకొని పైకి తెస్తుంది. నల్లపూసల దండను నాలుకతో గుచ్చి పైకి తెస్తుంది.

వెనుకకు మొగ్గవ్రాలి కడువిన్నను వొప్పగ దొట్టె నీళ్ళలో
మునిగి తదంతరస్థమగు ముంగర ముక్కున గ్రుచ్చి కొంచులే

చెను రసనాప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూస పే
రనుపమతాల నిప్పడు చుపాయము లిట్టివి యెట్టునేర్చెనో (144)

ఇది క్రీడాకారులకు ఉదర పోషణార్థం, చూపరులకు వినోదార్థం.

**అలంకారాలు - ఆభరణాలు:-** స్త్రీలు, పురుషులు ఇద్దరూ తమ స్తోమతను బట్టి ఆభరణాలు ధరించేవారని క్రీడాభిరామం చెబుతుంది. పురుషులు మలక, కిర్రు చెప్పులు తొడుక్కునే వారు. కొందరు మహిళలు చలికాలంలో కస్తూరిని పూసుకుంటారు. పురుషులు వేడుక సమయాల్లో ఉమ్మెత్త పువ్వుల్ని జుట్టు మీద ధరించేవారు. బంతియాటలాడే స్త్రీలు వక్షస్థలం మీద ముత్యాల దండలు, కాళ్ళకు బంగారు గజ్జెలు, చేతులకు గాజులు ధరించేవారు. ఉంగరాలు, ముక్కరలు, నల్లపూసల దండలు, మొలకు బంగారు ఒడ్డాణం, కుండలాలు, మూడు పేటల ముత్యాల సరాలు, గోళ్ళకు గోరింటాకు రంగు, ముత్యాల కమ్మలు, ఇత్తడి కడియాలు వంటి అనేక ఆభరణాలను అనేక సాంఘిక స్థాయిల్లోని మహిళలు ధరించేవారు. మేదరకరణ వేశ్య "ధవళ తాళ పలాశ తాటంకములు త్రిప్పు గలికి చూపుల జూపు గర్వ రేఖ". సంపెంగ నూనె రాసుకోవడం నాటి ప్రజలకు తెలుసు. తమ చెవి కమ్మల్లో తమ చెక్కిళ్ళ ప్రతిబింబాన్ని చూచి సంతోషించే మహిళ మనకు కనిపిస్తుంది. మట్టి గాజులు మొదలు బంగారు గాజుల దాకా, దర్భాలంకారాలు మొదలు కిరీటాలంకారాలు దాకా స్త్రీ, పురుషులు ఉత్సాహంగా ధరించేవారు.

**కన్నెరికం - ముకుర వీక్షణం:-** ఇవి వేశ్యా వృత్తిలోని రెండు ఆచారాలు. వేశ్యా వృత్తి పురుషస్వామ్య సమాజంలో ఏర్పడిన అదనపు వ్యవస్థ. సాంఘిక ఆర్థిక అసమానతల ఫలితమే ఈ వ్యవస్థ. ఈ వ్యవస్థలో రెండు ధోరణులు కనిపిస్తాయి. ఒకటి, మోసం. రెండవది, నిజాయితి. ఒక ముసలి వేశ్య తన కూతుర్ని ఒక తమిళ బ్రాహ్మణ విటునికి చూపించి అతని నుండి రోవట్టు తీసుకొని, తర్వాత ఆమెను తన ప్రియుని దగ్గరికి పంపించింది. ఒక దాసిని అలంకరించి తమిళుని దగ్గరికి పంపింది. ఉదయం నిజం గ్రహించిన అతడు తలవరులకు ఫిర్యాదు చేస్తాడు. దానికి శిక్ష తలగొరిగించడంగా చెబుతాడు మంచన. ఇలాంటి మోసాలకు అనేక రకాల శిక్షలున్నాయి. మంచన శర్మ " విట ధర్మం బెఱింగిన వాడు" ఆ శిక్షల్నిలా పేర్కొన్నాడు. ఇది మొదటి రకం.

కందర్ప శాస్త్రకారులు
నిందు కుషాణ్మాసచింత యేలానెఱపన్
సందేహింపక గొఱిగిం
పందగు నాజఱభిజుట్టుపట్టి రయమునన్
ముక్కు సోణంబుదాకను జెక్కు టొకటి
బోసినోరుగ బండ్లూడ బొడుచుటొకటి
గూబలంటగ జెవిదోయి గోయుటొకటి
లంజె తల్లియొనర్చు కల్లలకు శిక్ష (270, 271)

ఇక రెండవ రకం నీతి నిజాయితీతో కూడిన విధానం. కన్నెరికం ఒక రకంగా సంసార జీవితానికి సమీపంగా ఉంటుంది.

కన్నెఱికముడుప వేఱే
సొన్నాటంకములు రెండు చుట్టంబులలో
గన్ను మొఱంగెడు నేర్పును
విన్నాణము మాకు గలదు వెఱపేమిటిన్ (290)

అని, బొమల మీద వెంట్రుకలు వాలే పూజారి సాని తన బిడ్డను వెడ్డ పెట్టినది.

ముకుర దీక్షా విధానం వేశ్య విటునితో చేసుకునే ఒప్పందం వంటిది. ఒక నిబద్ధతకు సంకేతం.

ముకుర దీక్షావిధానంబు మొదలు లేక
వెలపడంతికి గారాదు విటునిగవయ
కేల గ్రొమ్మించు నొప్పారె మదన రేఖ
మంచి తొడమీద నొప్పారె మదన రేఖ
ముద్దు నెమ్మోము లావణ్యమున జయించి
కువలయాప్తుని జెఱవెట్టుకొన్న కరణి (199, 200)

ఈ రెండు ఆచారాల ద్వారా వేశ్యా వృత్తిలోఉండే స్త్రీలకు ఆర్థికంగా ఒక సౌకర్యం లభిస్తుంది. ఈ వ్యవస్థలో వచ్చే తగాదాలను తీర్చడానికి జార ధర్మాసనాలుండేవి. అయితే తర్వాతి కాలంలో ఈ వేశ్యా వృత్తి అనేక పరిణామాలలో కుటుంబ వ్యవస్థకు ప్రతిబంధకంగా తయారయింది. కన్యాశుల్క నాటకంలో ఈ ప్రసక్తి వస్తుంది. పురుషస్వామ్య సమాజ పరిణామాలతో అనేక రకాలుగా స్త్రీ భోగ వస్తువైన దశను క్రీడాభిరామం ప్రదర్శించింది.

**దేవుళ్ళు - దేవాలయాలు:-** పలనాటి వీరుల గుర్తులుగా ఓరుగల్లు నగరంలో గుళ్ళు వెలిశాయి. అవి వీర పూజా సంకేతాలు. పల్నాటి వీరుల చరిత్ర గానం ఓరుగల్లులో జరిగేదంటే ఆ వీరులకు అక్కడ గల ప్రాముఖ్యం తెలుస్తుంది.

పరశురాముని తల్లి - రేణుక ఓరుగల్లులో ఏకవీరా దేవి. ఏకవీరకే 'ఎల్లమ్మ' అని పేరు. ఈమెను మాత, మహురమ్మ అని కూడా పిలుస్తారు. ఈమె శైవ దేవత. కాకతమ్మకు సైదోడు. మాహురం అనే గ్రామంలో వెలసినందువల్ల మాహురమ్మ అయింది. ఈమెను గ్రామీణులు పూజిస్తారు. దళిత స్త్రీలు ఈమెను కీర్తించి అకలంకస్థితిని పొందుతారని క్రీడాభిరామం చెబుతుంది. శ్రావణ మంగళ వారాలలో ఉపవాసముండి ఈమెను పూజిస్తారు స్త్రీలు. ఊళ్ళో వ్యాధులు ప్రబలినప్పుడు ప్రజలు ఈమెను కొలుస్తారు.

అకలంక స్థితినొంది కొల్చెదరు బ్రహ్మానంద భావంబునన్
సకలానంద మమైకమాత యగుచున్ సంతోష చిత్తంబునన్
తకదుందుమ్ములు తాళముల్ జవనికల్ తందా నలమ్మయ్యకు
న్నేక వీరమ్మకు మాహురమ్మకు నధోహ్రింకార మద్యాత్మకున్ (132)

మైలాలు గ్రామంలోవెలసిన దేవుడు మైలార దేవుడు. "భైరవుని తోడు జోడు మైలార దేవుడు" మైలార భటులు భైరవుని భక్తులు. వీళ్ళ సాహస కృత్యాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. వీళ్ళు మొక్కుబడులు తీర్చుకొనే నెపంతో నెరపే సాహసకార్యాలు 'సిడి' వంటివి. వీళ్ళ ఆటలు గగుర్పాటు కలిగిస్తాయి.

అవఅవ మందు నెట్టని చంద్ర మల్లెల చోద్యంపు గుండాలు చొచ్చువారు
కరవాడి యలుగుల ననపపాతర్లలో - నుట్టి చేరులు గోసియుఱుకువారు
గాలంపు గొంకి గంకాళ చర్మము గ్రుచ్చి - యుడు వీథి నుయ్యెల లూగువారు
కటికి హోన్నాళశంబు గంత కత్తెర పట్టి - మిసె మింతులును గ్రాకమ్రింగు వారు
సందులను నారసంబులు సలుపు వారు - యెడమ కుడి చేత నారతులిచ్చు వారు
సాహసము మూర్తి గైకొన్న సరణివారు - ధీర హృదయులు మైలార వీర భటులు (142)

దేవుళ్ళు, తృప్తి పొందడానికి ప్రాణ త్యాగానికి కూడా వీళ్ళు వెనుకాడరు. ఇంకా కలని పోతులయ్య, గురిజాల గంగమ్మ, మాచర్ల చెన్న కేశవస్వామి వంటి వారు కూడా పూజలందుకునే వాళ్ళు.

కామవల్లీ మహాదేవి మరో దేవత. ఈమెనే కామేశ్వరీ అంటారు. ఈమె లక్ష్మీదేవి అంశంలో పుట్టగా ఈమె అంశంలోంచి రుక్మిణీ దేవి పుట్టిందని విశ్వాసం. గ్రామ దేవతలయిన ఏడు మంది అక్కా చెల్లెళ్ళలో ఈమె చిన్నామె. క్రీడాభిరామంలో ఇది అప్పటి గ్రామీణ నగర సాంస్కృతిక జీవిత దర్పణాలు.

**భాషా దృష్టి:-** క్రీడాభిరామం ప్రాచీన తెలుగు సాహిత్యంలో విలక్ష కావ్యం. వస్తుపరంగా రూపపరంగా ఈ కావ్యం తక్కిన కావ్యాల కన్నా భిన్నమైంది. సామాజిక సంబంధాలను స్పృశించే ప్రయత్నం చేసిన కావ్యం క్రీడాభిరామం.

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాష లందు తెలుగు లెస్స
జగతి దల్లి కంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలు గాదె

ఇందులో మొదటి పాదం ఆధునిక కాలంలో పూర్వ పక్షం చెయ్యబడింది. తెలుగు ద్రావిడ భాషా జన్యమని తేలింది. అయితే సంస్కృత భాషతో తెలుగు భాషా సాహిత్యాలకున్న సాన్నిహిత్యం విడదీయరానిది. అయినప్పటికీ తెలుగు భాషకు ఒక వ్యక్తిత్వమున్నదనే విషయాన్ని క్రీడాభిరామం మొదట గుర్తించింది. ఈ కాలంలోనో, మరి కొంత కాలం తర్వాతనో మొల్ల గుర్తించింది. ఈ కాలంలోనే శ్రీనాథుడు "నిజము నా కవిత్వంబు కర్ణాట'' భాష అనడం, పోతన "అందరిని మెప్పించెద నయ్యేయెడులన్'' అనడం క్రీడాభిరామం మాత్రం తెలుగు భాషను ఆడుబిడ్డగా భావించడం బాగుంది. దేశ భాషలలో ప్రతి భాషకూ దాని ప్రాధాన్యం, విశిష్టతా ఉంటాయి. శాస్త్రీయంగా ఆలోచిస్తే ఏ భాషా మరో భాష కన్నా ఏ విధంగాను తక్కువది కాదు, ఎక్కువదీ కాదు. అయితే సంస్కృత భాషాధిపత్యం అమలవుతున్న కాలంలో ప్రాంతీయ భాషల వ్యక్తిత్వాన్ని గుర్తించే ప్రయత్నాన్ని క్రీడాభిరామంలో కనిపిస్తుంది. భాష భావప్రకటనా సాధనం. దాని తీరు తెన్నుల్ని గ్రంథస్థం చెయ్యడం ఏ కవికైనా కర్తవ్యం. క్రీడాభిరామం ఆ పని చేసింది.

| | |
|---|---|
| గుమ్మడి మూట | - గుమ్మడి పండు ఆకారంలో కట్టిన మూట |
| ధర్మదార | - యుద్ధంలో గెలిచిన వాళ్ళు యుద్ధం పూర్తయినాక ఊదే బాకా. ఇది ఊదిన తర్వాత యుద్ధం చెయ్యకూడదు. |
| మోహరి వాడ | - సైనికులు నివసించే చోటు |
| అక్కల వాడ | - వంటలక్కలు ఉండే చోటు |
| యోల గంథం | - స్నాన సమయంలో పూసే పసుపు పూత |
| తాలబోయు | - తాలింపు బెట్టడం |
| తాడు | - వెదకు |
| బాడు | - బ్రాహ్మణుడు |
| అడిమాలం | - గుర్తు |
| కోడెవిధవలు | - యవ్వనంలో ఉండే వితంతువులు |
| అంశి వెట్టు | - తాకట్టు పెట్టడం |

ఇలాంటివి ఈ కావ్యంలో ఎక్కువగా ఉన్నాయి.

## 8.6 సారాంశం:-

క్రీడాభిరామ కర్తృత్వం, వ్యంగ్య వైభవం, సామాజిక పరిస్థితుల సుదీర్ఘ వికరణతో పాటు భాషా విశేషాలు కూడా ఈ పాఠంలో తెలియజేయబడినవి.

## 8.7 ప్రశ్నలు:-

1. క్రీడాభిరామ కావ్య కర్త విషయంలో గల విభిన్న వాదాలను సమీక్షించండి.
2. క్రీడాభిరామంలోని ఇతివృత్తాన్ని పరిచయం చెయ్యండి.
3. వీథి లక్షణాలను పేర్కొని క్రీడాభిరామానికి అన్వయించండి.
4. క్రీడాభిరామంలోని వ్యంగ్య ధోరణిని పరిశీలించండి.
5. క్రీడాభిరామంలోని అధిక్షేప లక్షణాలను పరిశీలించండి.
6. క్రీడాభిరామంలోని సాంస్కృతిక జీవితాన్ని గురించి రాయండి.
7. క్రీడాభిరామంలోని సాంఘిక ఆర్థిక జీవితాన్ని సమీక్షించండి.

## 8.8 ఆధార గ్రంథాలు:-


1. తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి భాగం) - నాగయ్య, జి.
2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (మూడవ సంపుటం) - ఆరుద్ర
3. తెలుగు సాహిత్య చరిత్ర (ద్వితీయ భాగం) - శ్రీరామమూర్తి కొర్లపాటి
4. క్రీడాభిరామము - బి.ఎన్. శాస్త్రి (సంపాదకుడు)
5. క్రీడాభిరామము - సామాజికత (అముద్రితం) - రామాంజనేయులు



ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
తెలుగు శాఖ
శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం
అనంత పురం

పాఠం - 9

# పలనాటి వీరచరిత్ర

## శ్రీనాథుడు

**ముఖ్యాంశాలు:-**

9.0 లక్ష్యం
9.1 పలనాటి వీరచరిత్ర - కర్తృత్వం
9.2 పలనాటి వీరచరిత్ర - ఇతివృత్తం - సామాజిక జీవితం
9.3 పలనాటి వీరచరిత్ర - రచనా వైశిష్ట్యం
9.4 పలనాటి వీరచరిత్ర - దేశభక్తి
9.5 ప్రాచీన తెలుగుసాహిత్యం - పలనాటి వీరచరిత్ర వైశిష్ట్యం
9.6 సారాంశము
9.7 ప్రశ్నలు
9.8 ఆధార గ్రంథాలు

## 9.0 లక్ష్యం:-

శ్రీనాథుడు రచించిన చారిత్రక కావ్యమైన 'పలనాటి వీరచరిత్ర' ద్వారా ఒకనాటి తెలుగు వారి సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక జీవితాన్ని సాహిత్యం ద్వారా దర్శించే విధానాన్ని విద్యార్థులకు తెలియజెయ్యడం, తద్వారా సమాజానికి సాహిత్యానికి మధ్య ఉండే అవినాభావ సంబంధాన్ని రుజువు చెయ్యడం ఈ పాఠం లక్ష్యం.

## 9.1 పలనాటి వీరచరిత్ర - కర్తృత్వం:-

ప్రాచీన తెలుగు సాహిత్యంలో కొన్ని కావ్యాలకు సంబంధించి కర్తృత్వ వివాదాలున్నాయి. నన్నెచోడుని 'కుమార సంభవం', శ్రీ కృష్ణదేవరాయల "ఆముక్తమాల్యద" వంటివి ఉదాహరణలు. ఈ వరుసలో శ్రీనాథుని 'పలనాటి వీరచరిత్ర' కూడా ఉంది. ఈ కావ్యాలు మనం పేర్కొన్న కావ్యాలుగానే స్థిరపడ్డాయి. అయితే సాహిత్య విద్యార్థులయిన మీకు ఈ కర్తృత్వ వివాదాలను పరిచయం చెయ్యడం ఉపయోగకరం. పలనాటి వీరచరిత్ర కర్తృత్వాన్ని గురించి పండితులు, పరిశోధకులు చేసిన వాదాలను స్థూలంగానైనా చూద్దాం.

పలనాటి వీరచరిత్ర కావ్యం శ్రీనాథుని రచన అని, కాదు అని రెండు వాదాలున్నాయి. అయితే కావ్యంలో శ్రీనాథుడు పలనాటి వీర చరిత్ర తన రచనేనని చెప్పుకున్నాడు.

"శ్రీ రఘునాయకు జిత్తమందెంచి
శ్రీకంఠు పరమేశు శివుత్మ దలంచి...........
కవిసార్వభౌముడ ఘనత గన్నట్టి

శ్రీనాథుడనువాడ శివభక్తి పరుడ
........ మాచెర్ల చెన్నకేశవుడు
నా కలలో వచ్చి నయమొప్ప బలికె...........
పలనాటి వీరుల భాగవతంబు
ప్రకటితంబుగ నీవు రచియించి మాకు
అంకితం బొనరింప ననుహొందు సూలె
అనుచును శ్రీకాంతుడరిగిన పిదప
మేల్కాంచి మనమున మేలయ్యెననుచు
విలసిల్లు పలనాటి వీరుల చరిత
జనులెల్ల భక్తిచే జరుపుట కొరకు
మంజరీ ద్విపదగా మన్నించి నేను
చెప్పబూని తివచః శ్రీ మెరయంగ"

అని కావ్య ప్రారంభంలో శ్రీనాథుడు మాచెర్ల చెన్నకేశవ స్వామి కలలోకి వచ్చి కోరినందు వల్ల తాను 'పలనాటి వీరచరిత్ర'ను రచింపబూనినట్లు చెప్పుకొన్నాడు. కాని పండితులలో ఈ కావ్య కర్తృత్వం మీద వాదాలు చెలరేగాయి. చిలుకూరి పాపయ్య శాస్త్రి, చిలుకూరి వీరభద్రరావు, శిష్టా రామకృష్ణ శాస్త్రి వంటి వాళ్ళు పలనాటి వీరచరిత్ర శ్రీనాథుని రచన కాదని వాదించగా, పింగళి లక్ష్మీకాంతం, వేటూరి ప్రభాకర శాస్త్రి, ఆరుద్ర, కొర్లపాటి శ్రీరామమూర్తి, పండిత ఉమాకాంత, విద్యాశేఖరులు, జి. నాగయ్య వంటి వాళ్ళు అది శ్రీనాథుని రచనే అని వాదించారు. చిలుకూరి పాపయ్య శాస్త్రి క్రీడాభిరామం కాలం నాటికే ఓరుగల్లు (వరంగల్లు)లో పలనాటి వీరులకు ఆలయం కట్టబడి ఉందని ఆ వీరుల చరిత్ర పలకల మీద చిత్రింపబడి ఉందని, అందువల్ల ఆ కథను శ్రీనాథుడే కొత్తగా రాశాడనటం కుదరదని వాదించారు. కాకుంటే శ్రీనాథుడు ప్రజలు పాడుకునే పాటను రాసి కృత్యాద్యంత పద్య రచనలు కలిపి ఉంటాడని భావించారు. పలనాడు మీద శ్రీనాథుని చాటువులుగా చెలామణిలో ఉన్న పద్యాలను చదివితే ఆ ప్రాంతం మీద ఆయనకు సదభిప్రాయం లేదని, అలాంటి ప్రాంత జీవితం మీద ఆయన కావ్యం రాయడం కుదరదని, బహుశా పల్నాటి వీరచరిత్రను మరొక శ్రీనాథుడెవరైనా రాసి ఉంటాడని అభిప్రాయపడ్డారు. (శ్రీనాథ కవితా సమీక్ష) పలనాటి వీరచరిత్రలో కవిత్వం ప్రౌఢంగా లేనందువల్ల కావ్యంలో వ్యాకరణ దోషాలున్నందు వల్ల అది శ్రీనాథుని రచన కాదని చిలుకూరి వీరభద్రరావు వాదం (ఆంధ్రుల చరిత్ర). అక్కరాజు ఉమాకాంత విద్యాశేఖరులు ప్రచురించిన భాగం మాత్రమే శ్రీనాథునిదని, తక్కినది ఆయనది కాదని చాగంటి శేషయ్య ప్రతిపాదించారు (ఆంధ్ర కవి తరంగిణి). చిలుకూరి పాపయ్య శాస్త్రిలాగే శిష్టా రామకృష్ణ శాస్త్రి కూడా పలనాటి వీరచరిత్ర రచయిత, కాశీఖండ రచయిత అయిన శ్రీనాథుడు కాదని, ఇంకెవరో అయ్యుంటాడని భావించారు. (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక. సంపుటి 54, సంచిక 1, 2)

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి భాష, ఛందస్సు, శైలి, భావం, భక్తి, కాలం అనే ఆరు అంశాలు ఆధారంగా పలనాటి వీర చరిత్ర శ్రీనాథుని రచన కాదని పండితులు చేసిన వాదనల్ని వ్యతిరేకించారు. మనకిప్పుడు లభిస్తున్న బాలచంద్రుని యుద్ధ భాగంలో వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలున్నాయని, శ్రీనాథుని తర్వాతి కాలం నాటి అన్యదేశ్య పదాలు ఉన్నాయని అందువల్ల పలనాటి వీరచరిత్ర శ్రీనాథునిది కాదని పండితుల అభిప్రాయం. ఈ కావ్యంలో పట్టుక, చూచుక వంటి వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు, తమాయీలు, ముష్టీలు వంటి శ్రీనాథుని తర్వాతి కాలం నాటి ప్రయోగాలున్న మాట నిజమే. అయితే అవి శ్రీనాథుని రచనను గాయకులు గ్రామాల్లో పాడేటప్పుడు కాలక్రమంలో చేరాయని కొర్లపాటి అభిప్రాయం. (తెలుగు సాహిత్య చరిత్ర : ద్వితీయ భాగము), శ్రీనాథునికి

పద కవిత పట్ల సదభిప్రాయం లేదు అలాంటప్పుడు ద్విపద కావ్యం ఎలా రాస్తాడన్నది మరో అభ్యంతరం. శ్రీనాథుని చాటువుగా ప్రచారంలో ఉన్న పద్యమిది.

ముదివిటులు విధవలంజలు
పదకవితలు మారుబాసబాపకవారల్
చదువని పండిత వర్యులు
కదనార్భటి వీరవరులు కతిదిపురమునన్

అయితే ఈ చాటువు శ్రీనాథునిదేనన్న మాట ఎంత వరకు సత్యమని కొర్లపాటి ప్రశ్న. అంతే శ్రీనాథునికి సుముఖ వైముఖ్య స్వభావం (Love hate relation) ఉందని, శృంగార నైషధంలో వైశ్యుని పరిహసించి, హరవిలాసాన్ని వైశ్యునికంకితమిచ్చాడు గాదా! అని కూడా కొర్లపాటి ప్రశ్నించారు. ప్రౌఢ శైలిలో అనేక కావ్యాలు రచించిన శ్రీనాథుడు పేలవమైన శైలిలో పల్నాటి వీర చరిత్ర రాయడం కుదరదని పండితుల వాదం. శ్రీనాథుడు గ్రామీణుల కోసం రాసిన కావ్యం గనక తన ప్రౌఢ శైలిని అణచి పెట్టి వ్యావహారిక శైలిలో గేయ శైలిలో రాశారని కొర్లపాటి ప్రతిపాదన. శైవుడైన శ్రీనాథుడు వైష్ణవ మత విజయాన్ని ప్రతిపాదించే పలనాటి వీరచరిత్రను రాయడం అసంభవమని పండిత వాదం. పలనాటి వీరచరిత్ర శైవ వైష్ణవ మత విభేదాలను చిత్రింపలేదని, పలనాటి యుద్ధం పురుషాధిపత్యం పై జరిగిన యుద్ధమని కొర్లపాటి అభిప్రాయం. శ్రీనాథుడు శివ భక్తుడే అయినా వీర శైవుడు కాదని, హరిహరా భేదభావం గల ఈశ్వరార్చన కళాశీలుడని కొర్లపాటి వాదం. భీమఖండంలో రాధా మాధవుని స్తుతించటమే ఇందుకు కారణం. అలాగే పలనాటి వీరచరిత్రలో మాచెర్ల చెన్నకేశవుని స్తుతించాడు. ఐతాంబ చెన్న కేశవునితో పాటు శివుని కూడా పూజిస్తుంది. అందువల్ల మతం ఆధారంగా శ్రీనాథుడు పలనాటి వీరచరిత్రరాయలేదనడానికి వీలుకాదు.

పింగళి లక్ష్మీకాంతం, జి. నాగయ్య, కొర్లపాటి శ్రీరామమూర్తి వంటి పండితుల వాదం ప్రకారం పలనాటి వీరచరిత్ర కర్తృత్వం ఇలా ఉంది. క్రీడాభిరామంలో పలనాటి వీరచరిత్ర ప్రసక్తి ఉంది.

ద్రుతతాళంబున వీరగుంభిత కధుంధుంధుం కటాత్కార సం
గత వాయింపుచు నాంత రాళికయతి గ్రామాభిరామంబుగా
యతిం గూడం ద్విపద ప్రబంధమున వీరశాఖ ముంబొందెనో
త్కత ప్రత్యక్షరముంగుమారకులు ఫీర్కూరంబునందూలగన్
గర్జించి యరసి జంఘాకాండ యుగళంబు వీరసం బెటకోల త్రాయునొకరు ..............
కొరపు దాటింపుచును బెద్ద గొలువులోన బదతి పల్నాటి వీరుల బారునపురు

క్రీడాభిరామంలోనే శ్రీనాథునికి పలనాటి వీరచరిత్ర పట్ల మమకారమున్నదనడానికి ఆధారాలున్నాయి. అందువల్ల ఈ కావ్య రచయిత శ్రీనాథుడే. అయితే కావ్యమంతా ఆయనే రాయలేదు. ఈ కావ్యంలోని పదకొండు ప్రకరణాలలోశ్రీనాథుడు చివరి ప్రకరణాలయిన కల్లు ప్రతిష్ఠ, బాల చంద్రుని యుద్ధము అన్నవి మాత్రమే రచించాడు. కోళ్ళపోరు, గోపన్న విరుగులను మల్లయ్య రాశాడు. కొమ్మరాజు యుద్ధాన్ని కొండయ్య రచించాడు. మిగిలిన పదు ప్రకరణాలను ఒక కవే రచించాడు. కాని అతడెవరో తెలియడం లేదని పింగళి లక్ష్మీకాంతం అభిప్రాయపడ్డాడు. కొర్లపాటి శ్రీరామమూర్తి "పలనాటి వీరచిర్త్ర శ్రీనాథ కృతమ్" అన్నారు. ఆయన ఉద్దేశంలో కావ్యమంతా శ్రీనాథుడే రాసినట్లు. అయితే ఆయన కృతి సమీక్ష అనే శీర్షిక క్రింద చర్చించినది మాత్రం కల్లు ప్రతిష్ఠ, బాల చంద్రుని యుద్ధ ఘట్టాలను మాత్రమే అందువల్ల ఆయన దృష్టిలో కూడా శ్రీనాథుడు ఈ రెండు భాగాలే రాసినట్లు భావించవచ్చు.

## 9.2 పలనాటి వీరచరిత్ర : ఇతివృత్తం - సామాజిక జీవితం:-

**ఇతివృత్తం:-** ఉత్తర భారతదేశంలోపాలమాబాపురి అనే పట్టణముంది. దానికే జంభనాపురి అని కూడా పేరు. దానిని అనుగు రాజు పాలించేవాడు. ఇతడు కార్త వీర్యార్జునినికి పదవ తరంవాడు. తన పూర్వీకులు చేసిన పాపాలు తనను బాధిస్తూ ఉండగా, అనుగురాజు జీడినూనె గుడ్డలు ధరించి తీర్థయాత్రకు బయలుదేరాడు. అందులో భాగంగా ఆంధ్ర దేశానికి వచ్చాడు. అమరావతి రేవులో కృష్ణానదిలో స్నానం చేస్తూ ఉండగా నల్లని జీడినూనెపోయి బట్టలు తెల్లగామారాయి. ఇలా జరుగుతుందని అతని ఇలవేల్పు చెన్నకేశవుడు ముందే బ్రాహ్మణుని రూపంలో వచ్చి చెప్పి ఉంటాడు. అప్పుడు అనుగు రాజు చందవోలు రాజుతో యుద్ధం చేసి అతనిని ఓడించి, అతని కూతురు మైలమదేవిని వివాహమాడాడు. పలనాటి సీమ ఆమెకు అరణంగా వచ్చింది. అనుగురాజు గురజాల రాజధానిగా పలనాడు పరిపాలిస్తూ ఉంటాడు. ఈయనకు మైలమదేవి గాక విద్యాదేవి, భూరమాదేవి అని మరో ఇద్దరు భార్యలున్నారు. విద్యాదేవికి పెదమల్ల దేవుడు, పినమల్ల దేవుడు, బలమల్ల దేవుడు అనే ముగ్గురు కొడుకులు ఉన్నారు. భూరమాదేవికి కామరాజు, నరసింగరాజు, ఝట్టిరాజు, పెరుమాళ్ళరాజు కొడుకులు కాగా, మైలమ దేవికి నలగాముడు కొడుకు. ఇతనే అనుగురాజు కొడుకులలో పెద్దవాడు. అనుగురాజు మంత్రి దొడ్డ నాయుడు. ఇతడు వెలమ. ఇతడు కుమారుడు బ్రహ్మనాయుడు. ఇతని కుమారుడు బాలచంద్రుడు. బ్రహ్మనాయునికి పలనాడు కృష్ణుడని పేరు.

ఒకసారి అనుగురాజు వేటకు పోయిన సందర్భంలో జిట్టగామాల పాడు అనే గ్రామంలో నాగమ్మ అనే ఆమె అతనిని మెప్పించి పలనాటి ప్రభువుల దగ్గర మంత్రి అయ్యే అవకాశం పొందింది. అనుగురాజు చనిపోయిన తరావ్త నలగామ రాజు ప్రభువయ్యాడు. బ్రహ్మనాయుడు ప్రధాని అయ్యాడు. నాగమ్మ, అతని తండ్రి మాటను గుర్తు చేసి మంత్రి అవుతుంది. ఈమె నాయకురాలు నాగమ్మగా పేరు పొందింది. బ్రహ్మనాయునికి నాగమ్మకు కుదిరేదికాదు. నాగమ్మ గొప్పరాజ్య తంత్రజ్ఞురాలు. గురజాల రాజులను తన చేతిలో కీలు బొమ్మలుగా చేసుకోగలిగిన సమర్థురాలు. క్రమంగా నలగాముడు బ్రహ్మనాయునికి దూరం కాసాగాడు. బ్రహ్మనాయుడు తన సవతి తమ్ముడు మలిదేవరాజుకు రాజ్యం కట్టబెట్టటానికి ప్రయత్నిస్తున్నాడన్న అనుమానంతో అతనిని, అతని తమ్ముళ్ళను చెరసాలలో పెడతారు. బ్రహ్మనాయుడు వాళ్ళను విడిపించి రాజ్యాన్ని రెండు భాగాలు చేయించి నలగామ మలిదేవులకు పంచి, తాను మలిదేవాదులతో ఉంటూ మాచర్ల రాజధానిగా రాజ్యాన్ని పాలిస్తూ ఉంటారు. అప్పటికి మలిదేవాదులు చిన్న వాళ్ళు.

కొంత కాలానికి బ్రహ్మనాయుడు మలిదేవుని పెళ్ళి ప్రయత్నం చేస్తాడు. కళ్యాణపురాధీశ్వరుడైన వీరసోముని కూతురు సిరాదేవితో పెళ్ళి చెయ్యాలని అనుకుంటారు. వీరశైవుడైన వీరసోముడు వైష్ణవులకు తన కూతురు నియ్యడానికి ఒప్పుకోడు. అయితే ఒక యుద్ధంలో బ్రహ్మనాయునితో సహాయం పొందిన వీరసోముడు మలిదేవునికి కూతురునిస్తాడు. తర్వాత బ్రహ్మనాయుడు నలగామ మలిదేవాదులకు సంధి కుదిర్చే ప్రయత్నం చేస్తాడు. ఆ పని మీద గురజాలపోతాడు. నాగమ్మ ఆ ప్రయత్నాన్ని భగ్నం చేసింది. రెండు కోడి పుంజులకు పందెం పెట్టి ఓడిపోయిన పుంజును బ్రహ్మనాయునిదని గేలి చేసింది. బ్రహ్మనాయుని స్పందనను పసిగట్టి నిజమైన కోడి పందానికి ఆహ్వానిస్తుంది. ఓడిపోయిన వాళ్ళు పదేళ్ళు అరణ్య వాసం చెయ్యాలని పందెం పెడుతుంది. బ్రహ్మనాయుడు మలిదేవుని అనుమతితో కోడి పందానికి దిగుతాడు. తొలి రోజు ఆయన గెలుస్తాడు. రెండో రోజు నాగమ్మ కుతంత్రంతో ఓడిపోతాడు. మలిదేవాదులు అడవిదారి పట్టవలసి వచ్చింది. వాళ్ళు మందాదికి పోతారు. నాగమ్మ వాళ్ళను అక్కడ కూడా సుఖంగా ఉండనివ్వదు. మలిదేవుని ఆవులను చంపిస్తుంది. వాళ్ళు అక్కడి నుండి మేతపి చేర్తారు. అరణ్య వాసం పూర్తయినాక అలరాజును రాయబారిగా పంపిస్తాడు బ్రహ్మనాయుడు. నాగమ్మ అలరాజును రాయబారి అని కూడా చూడకుండా చంపిస్తుంది. యుద్ధం అనివార్యమైంది.

మలిదేవాదులు తమ సైన్యంతో కార్యమపూడి చేరుకుంటారు. నలగాముడు కూడా సైన్యంతో యుద్ధ భూమికి వస్తాడు. ఆ సమయంలో నాగమ్మ సంధి కోసం ప్రయత్నిస్తుంది. అన్నమరాజు, కేతరాజు వంటి వాళ్ళకు రాయబారం పంపిస్తుంది. కాని

బ్రహ్మనాయుని కొడుకు బాలచంద్రుడు సంధి ప్రయత్నాలను తిప్పి కొడతాడు. యుద్ధం జరుగుతుంది. బాలచంద్రుడు మరణిస్తాడు. బ్రహ్మనాయుడు జయిస్తాడు. అనుగురాజు వంశంలో ఒక్క నలగాముడు మిగులుతాడు.

వాస్తవాల కల్పనలతో కూడిన ఈ కథ ప్రాచీన తెలుగు సాహిత్యంలో మరోభారతంగా ప్రసిద్ధి చెందింది. "రణ రంగం కాని చోటు గతమంతా వెదికిన దొరకదు" అంటారు శ్రీశ్రీ. ఈ యుద్ధం క్రీ॥శ॥ 81 - 82 సంవత్సరాల మధ్య జరిగినట్లు తెలుస్తుంది. దీనిని గురించి పలనాటి వీరచరిత్ర సమగ్ర గ్రంథ పరిష్కర్తలు పింగళి లక్ష్మీకాంతం ఇలా అన్నారు "వేంగీ దేశము ఎప్పటికప్పుడు శాంతి భద్రతలు లేక ఉప ప్లవములకు ఆటపట్టయి యుండెడిది. ఇట్టి సంక్షుభిత రాజకీయ వాతావరణములోనే వేంగీ దేశమున సంభవించిన అనేక యుద్ధములలో పల్నాటి యుద్ధమొకటి......... కేవలమిది ఆనాడు పలనాటిని పాలించుచుండిన హైహయ వంశీకులకు దాయ భాగమునకై పొడమిన కుటుంబ కలహము". (పీఠిక)

ఈ కావ్యంలో పదకొండు ప్రకరణాలున్నాయి.

1. అనుగురాజు పలాటి సంపాదనం
2. పలనాటి రాజ్య విభాగం
3. కోళ్ళ పోరు, గోపన్నవిరుగు
4. అరణ్య వాసం
5. మందపోరు - లంకన్న విరుగు
6. గురజాల యుద్ధం
7. అలరాజు రాయభారం
8. కల్లు ప్రతిష్ట
9. బాలచంద్రుని యుద్ధం
10. కొమ్మరాజు యుద్ధం
11. బ్రహ్మన్న విరుగు

వీటి కల్లు ప్రతిష్ట, బాలచంద్రుని యుద్ధం అనే రెండు ప్రకరణాలను శ్రీనాథుడు రచించినట్లు విమర్శక పరిశోధకుల అభిప్రాయాలు.

**కల్లు ప్రతిష్ట:-** యుద్ధంతో తప్ప రాజ్యము తమకు తిరిగి రాదని మలిదేవుడు గ్రహించాడు. తన కొడుకు బిరుదు రాజుకు పట్టం కట్టి బాలచంద్రునికి మంత్రిత్వమప్పగించాడు. పురోహితులను పిలిచి యుద్ధానికి ముహూర్తం పెట్టించాడు. మేతపి నుండి కార్యమపూడికి బయలుదేరారు. త్రిపురాంతకంలో బ్రహ్మన్న అంతకు ముందే శివపురి నుండి తెప్పించిన భూతరాట్కంబాన్ని యుద్ధరంగంలో ప్రతిష్టించడానికి బండ్ల కెత్తించాడు. అందరూ మేళ్ళ వాగు చేరారు. పొద్దుపోయింది. బ్రహ్మనాయుడు కన్నమనీరును పిలిచి యుద్ధరంగాన్ని సందర్శించి రమ్మన్నాడు. కన్నమకు అక్కడ ఒక ఎరుకలసాని కనిపించి బ్రహ్మనాయుని పాద స్పర్శతో కార్యమపూడి యుద్ధ భూమి పవిత్రమౌతుందని చెప్పి వెళ్ళిపోతుంది. కన్నమ చెప్పింది విన్న బ్రహ్మనాయుడు ఆ రాత్రే యుద్ధభూమికి పోతాడు. వర్షం కురుస్తుంది. అది వరకు జరిగిన యుద్ధాలలోమరణించిన వాళ్ళ పుర్రెలు నీళ్ళలో కొట్టుకొని పోతాయి. ఆయనకు యుద్ధాధిదేవత ప్రత్యక్షమౌతుంది. ఆమెను సాక్షిగా నిలిపి బ్రహ్మనాయుడు వెళ్ళిపోతాడు.

మలిదేవుడు మరునాడు కార్యమపూడిలో భూతరాట్కంబాన్ని ప్రతిష్ట చేస్తాడు. ఒక భట్టును నలగాముని దగ్గరకు సమరాహ్వానంతో పంపిస్తాడు. భట్ట మలిదేవుని శక్తి సామర్థ్యాలను వర్ణించి యుద్ధం నివారింపమని కోరతాడు. నలగాముడు,

నాగమ్మకు పితులౌతారు. అయినా భట్టుగనక వదిలేస్తారు. నలగాముడు సమీప రాజులందరినీ సమీకరించుకొంటాడు. కార్యమపూడికి బయలుదేరుతాడు. కొదమ గుంత్ల ప్రజలు యుద్ధం మానుకోమని చెబుతారు. నలగాముడు యుద్ధానికే వెళతాడు. బ్రహ్మనాయుడు కాలజ్ఞానులను పిలిచి యుద్ధ ముహూర్తం నిర్ణయించమంటాడు.

**బాలచంద్రుని యుద్ధం:-** మలిదేవుడు నలగాముడు కార్యమపూడిలో సమరోత్సాహంలో ఉన్న సమయంలో ఒకనాడు బ్రహ్మనాయుని కొడుకు బాలచంద్రుడు తన స్నేహితులతో కలిసి బొంగరాలాడడానికి పోతాడు. బాలచంద్రుడు విసిరిన బొంగరం అన్నమ్మ అనే వైశ్య స్త్రీకి తగిలి ఆమె మూర్ఛపోతుంది. మూర్ఛ నుండి మేల్కొని అన్నమ్మ "మీవాళ్ళు యుద్ధంలో ఉంటే, నువ్వు తిని బలిసి బొంగరాలాడుతున్నావు యుద్ధంలో మీ వాళ్ళకు తోడ్పడరాదా? అక్కడ పరరాజులు నీ పొగరు తగ్గిస్తారు'' అని అంటుంది. బాలచంద్రుడు వెంటనే ఇంటికి పోయి యుద్ధంలోకి పోవడానికి తల్లి ఐతాంబను అనుమతి అడుగుతాడు. ఆమె అనేక విధాలుగా వారిస్తుంది. సాధ్యంకాక భార్య దగ్గర దీవెన తీసుకొని రమ్మని చెబుతుంది. బాలచంద్రుడు ఇచ్చిన సొమ్మునంతా తీసుకొని భార్య మాంచాల దగ్గరికి పోకుండా తన ఉంపుడుగత్తె సబ్బాయికి ఇస్తాడు. అతని మిత్రుడు అనపోత రాజు మందలిస్తాడు. అప్పుడు భార్య మాంచాల దగ్గరికి పోతాడు. అప్పటికి దాదాపు పదేళ్ళ క్రితం పెళ్ళయినా ఆమె ముఖమే చూచి ఎరగడు. ఇప్పుడు భార్యను చేరుకొని యుద్ధం మాట మరచిపోతాడు. స్నేహితులు వచ్చి గుర్తు చేస్తే అప్పుడు మాంచాల దీవించి భర్తను యుద్ధానికి పంపిస్తుంది. బ్రాహ్మణుడైన అనపోతరాజును యుద్ధంలోకి తీసుకుపోవద్దని సూచిస్తుంది.

నాగమ్మ మాచెర్లను మలిదేవుని కివ్వడానికి సిద్ధంగా ఉన్నాడని యుద్ధం మానుకుందామని కేతరాజు, చింతపల్లి రెడ్డి వంటి వాళ్ళతో రాయబారం పంపుతుంది. మలిదేవుడు సంధికంగీకరిస్తాడు. ఈ లోపల బాల చంద్రుడు అక్కడికి చేరి సంధిని వ్యతిరేకిస్తాడు. అయితే కొమ్మరాజు బాలచంద్రుని ఓదార్చి సంధికి ఒప్పిస్తాడు. ఈ లోపల బాలచంద్రుడు తన భార్య కోరిక మేరకు అనపోతరాజును యుద్ధానికి దూరంగా ఉంచడానికి చేసిన ప్రయత్నం వికటించింది. అనపోత ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ విషయం మాదచి అనే ఒక స్త్రీ ద్వారా బాలచంద్రునికి తెలుస్తుంది. బాలచంద్రుడు నరసింగుని తల నరికి తెస్తానని ప్రతినబూని యుద్ధానికుపక్రమిస్తాడు. యుద్ధం మొదలైంది. బాలచంద్రుడు నరసింగుడు తలపడతారు. బాలచంద్రని దాటికి నిలవలేక నరసింగుడు మరికొంత సైన్యాన్ని తీసుకురావడానికి వెళతాడు. ఇంకొకరిని నరసింగుడనుకొని బాలచంద్రుడు అతని తలను నరికి తీసుకుపోయి తండ్రికి అప్పగిస్తాడు. అది నరసింగునిది కాదని తెలిసి తిరిగి యుద్ధంలోకి పోయి సామంత రాజులచే నరసింగుని పొడిచి అతని తలను తీసుకొని తండ్రి దగ్గరికి పోతాడు. అదిచూచి మలిదేవుడు దుఃఖితుడై బాలచంద్రుని నిందిస్తాడు. బాలచంద్రుని తండ్రి దుష్కృత్యాలను పేర్కొని తిరిగి యుద్ధంలోకి దూకి మరణిస్తాడు.

## 9.2 పలనాటి వీరచరిత్ర - సామాజిక జీవితం:-

పలనాడు గుంటూరు జిల్లాలో ఒకనాటి తాలూకా. దాని కేంద్రం గురజాల. కృష్ణానదీ తీర ప్రాంతం. 1050 చదరపు మైళ్ళ విస్తీర్ణం. నాగులేరు, చంద్రవంక అక్కడ ప్రవహించే నదులు. కార్యముపూడి, మాచెర్ల ఈ నదుల తీరాలలోనే ఉన్నాయి. పలనాడు అనేక భూగర్భ వనరులకు నిలయం. పలనాడుకు పల్లెనాడు, పలినాడు, పల్నాడు ఇలా అనేక రూపాలు వ్యవహారంలో ఉన్నాయి. పలనాడును పాలించిన అనుగు రాజుకు పుట్టిన సవతి కొడుకులు నలగామరాజు మలిదేవరాజుల మధ్య దాయ భాగ వివాదం కారణంగా జరిగిన యుద్ధ చరిత్ర పల్నాటి వీరచరిత్ర. ఇందులో రాజుల కన్నా మంత్రులైన నాగమ్మ బాలచంద్రులు ఏ కారణం చేతనో కులమో, మతమో, స్త్రీ పురుష వైరుధ్యమో, చేసిన దోహదం అధికంగా ఎక్కువగా కనిపిస్తుంది. పలనాటి వీరచరిత్ర కావ్యంలో దీనిని "కుల పగ'' అని అనేక పర్యాయాలు పేర్కొన్నాడు కవి. అందుకే మరో భారతమని, పలనాటి భారతమని పేరు పొందింది. శ్రీనాథుడు మాత్రం చెన్నకేశవ స్వామి కలలో కొచ్చి "పలనాటి వీరుల భాగవతంబు'' రచించమని కోరినట్లు చెప్పుకున్నాడు. ఇది "నరనాథ సింహంబు నలగామ రాజు - మహిత చారిత్రుడు మలిదేవరాజు - ధారుణి నేలుచు తమలోన బోరి''న చరిత్ర.

ఈ కావ్యంలో అప్పటి సమాజం ప్రతిబింబిస్తుంది. విభిన్న జీవిత విశేషాలు ప్రతిఫలిస్తున్నాయి. ఈ కావ్యంలో రాచరిక వ్యవస్థకు సహజమైన యుద్ధ ప్రీతితో పాటు, ఏ కాలంలోనైనా ఉండే ఎంతో కొంత శాంతి స్ఫూర్తి కూడా చిత్రింపబడింది. అయితే యుద్ధానిదే పై చేయి అయ్యింది. దీనికి భూస్వామ్య పౌరుషం కారణం. ఈ యుద్ధ జీవితాన్ని ఆవరించిన అనేక జీవితాంశాలు పల్నాటి వీరచరిత్రలో ప్రతిబింబించాయి.

**యుద్ధం - ముహూర్తం - విశ్వాసం:-** యుద్ధం రాజ్యాధికారం కోసం గనక, అదిరాజుల జీవిత సమస్య గనక, అతి ప్రాముఖ్యం గల పనికి బయలు దేరడానికి మూహూర్తాలు నిర్ణయించుకోవడం భూస్వామ్య సంప్రదాయ లక్షణం. పలనాటి వీరచరిత్రలోని రెండు పక్షాలు యుద్ధ ప్రయాణాలకు ముహూర్తాలు నిర్ణయించుకున్నాయి. మలిదేవాదులు "ఎలమి భూసురపురోహితులెల్లపూని - జయ ముహూర్తము పెట్టి'' బయలుదేరమంటే ప్రథమ ఏకాదశి నాడు బయలుదేరారు. నలగామరాజు కూడా "జోస్యుల పిలిపించి సుముహూర్తమడిగి'' బయలుదేరాడు.

**యుద్ధం - సైన్యాధీనం:-** రాజుల యుద్ధానికి ప్రాంతీయ, సామంత రాజుల బలం కూడా అవసరం. మద్దతుదారుల హంగామా అవసరం. భిన్న కులాల వంశాల బలం కూడా అవసరం. మలిదేవ నలగామ రాజులిద్దరూ అపారమైన సైన్య సమీకరణ చేసినట్లు కవి వర్ణించాడు. మలిదేవుని పక్షాన ఆవాల వారు, ఆణెం వారు, కొండవీడు వారు, గోవిందు వారు, ముతసాని వారు, ముయ్యూరు వారు, నర్మాల వారు, నాయని వారు, పైడి చుక్కల వారు, పాలపర్తి వారు, బలుమూది వారు, పాలెము వారు, రేవనూళ్ళ వారు, 'అనుమగంటి వారు, అల్లము వారు మొదలైన' గుర్రియైన నాయకులు రేచర్లవారు చేరారు. వీళ్ళందరూ మేళ్ళవాగు చేరగానే అక్కడ "మెరసిన మన్నలు మేటి నాయకులు'' ఎందరో జత చేరారు. నాగమ్మ వారిస్తున్నా, నలగామరాజు అపారమైన సైనిక బలాన్ని సమీకరించాడు. అనేక మందికి ఉత్తరాలు రాసి మద్దతుదారులను కూడగట్టుకున్నాడు. ఈయన వైపు చేరిన వాళ్ళలో ముఖ్యులు వీరు - 1. శ్రీ వీర భళ్యాణి - మూడు వేల మంది సైనికులు, ఏడు వందల గుర్రాలు, 2. పొన్నాడ భూపతి - పన్నెండు వేలమంది సైనికులు, వెయ్యి గుర్రాలు, 3. మాళవపతి - వెయ్యి అరిగెలు, ముప్పై వేల సైనికులు, మూడు వందల ఏనుగులు, 4. ప్రతాపరుద్రుడు - వెయ్యి గుర్రాలు, తొమ్మిది వేలు సైనికులను పంపించాడు.

ఇలాగే బాచి దేవుడు, బంగాళ విభుడు, బలదేవుడు, ధనరాసుడు, మహాదేవదాసుడు మొదలైన వారు. ద్రావిడ కేరళ రాజులు పదిల క్షల సైన్యంతో వచ్చారట. ఈ సైన్య సమీకరణ భారత యుద్ధ సైన్య సమీకరణను తలపిస్తుంది. కాని చరిత్రకారులు మాత్రం దీనిని అతి చిన్న సంఘటనగా చెబుతారు.

**పశు సంపద:-** ప్రాచీన సమాజానికి పశు సంపద గొప్ప సంపద. భారతంలో విరాటు రాజు సంపద ఇదే. పలనాటి వీరచరిత్రలోమలిదేవుడు ఎద్దుల సంపద అపారమైంది. ఆ యెద్దుల పేర్లను వాటి రంగులను రచయిత పట్టికగా ఇచ్చాడు. అందెల బసవన్న, గోగు బయ్యన్న, కరినంది బసవన్న, పెంజెల్లు పెద్ద, చెంచులయోబయ్య, చెన్న మల్లయ్య, కాముడు, సోముడు, రాముడు, భీముడు మొదలైనవి ఎద్దుల పేర్లు. అచ్చుగా కరి వన్నెలమరిన యెడ్లు, నుదుట చుక్కలు గల నునుపైన యెడ్లు, తెల్లని వన్నెల తెలివైన యెడ్లు, పచ్చని వన్నెల ప్రబలిన యెడ్లు, నెత్తురు కొమ్ముల నేటైన యెడ్లు, ఇవి ఇలాంటి ఆ యెడ్ల రంగులు, చిహ్నాలు, ఈ ఎడ్ల సంపద పలనాటి రైతాంగ సంపద.

**భూతబలి:-** యుద్ధానికి పోతూ బ్రహ్మనాయుడు శివపురి నుండి తెచ్చిన భూతరాట్కంభాన్ని త్రిపురాంతకం నుండి తరలించి కార్యమపూడిలో ప్రతిష్టించి దానిని బలి ఇవ్వటం అప్పటి యుద్ధ ప్రక్రియలోని కర్మ కాండను తెలియజేస్తుంది. భూతరాట్కంభాన్ని ప్రతిష్టించి దానికి గావునిచ్చాడు.

"అఖిల భూతముల కాచారముగను - ఘనమైన పోతుతో గావు చెల్లించి''

**సాంస్కృతిక జీవితం - నాట్య ప్రదర్శన:-** మలదేవరాజు యుద్ధానికి సిద్ధమౌతుంటే నలగాముడు నాట్య ప్రదర్శన చూస్తుంటాడు. ఈ నాట్య ప్రదర్శన అప్పటి సాంస్కృతిక జీవితానికి సంబంధించిన అంశం. నలగాముని కొలువు అందంగా అలంకరింపబడింది.

"కస్తూరి చేతను కలయంగనలికి - ముత్యాలతోడుత ముగ్గులు బెట్టి.................

శ్రీరామ కథలను శ్రీ కృష్ణ కథలు పన్నుగా వ్రాసిన పటములు దెచ్చి

కట్టిరి గోడలు నుపడకుండ" మంజుల వాణి అనే స్త్రీ "కంతు బాణంబు వలె వచ్చి నాట్యం చేసింది".

"కైముదికట్నముల్ కనుపింప జేసి - వెలయంగ తొమ్మిది విధములైనట్టి

భూ చారి నాట్యంబు పొందుగా సల్పి - పదహారు విధముల పరిగిన యట్టి

ఆకాశ చారియు నమరంగనాది - అంగహారాఖ్య చే నమరు నాట్యంబు

విదిత మౌ తొమ్మిది విధములనాది...............

సభవారలాశ్చర్య సంయుక్తులైరి"

ప్రాచీన కాలంలో సంగీత సాహిత్యాలు సంఘటితమైంది రాజాస్థానాలలోనన్న వాస్తవాన్ని పలనాటి వీరచరిత్ర ప్రతిబింబిస్తుంది.

**ఆటలు:-** పలనాటి వీరచరిత్రలో పాల్కురికి సోమన రచనలలో వలే దేశీయ విశేషాలు వర్ణింపబడ్డాయి. చిన్న పిల్లలు, యువకులు ఆడే ఆటల్లో బొంగరాలాట ప్రధానమైంది. ఐతమ్మ కోరికననుసరించి ఓజులు' పట్టెళ్ళు కార్లు, కమ్మచ్చులు, నీరు కార్లు, సుత్తెలు, పడియబ్బు కత్తెరలు, శ్రావణాల్ కోపులు, త్రాసు, మచ్చులు మొదలైన పనిముట్లు తీసుకొచ్చి బంగారు బొంగరాలు తయారు చేశారు. అప్పటి పిల్లలకు గుమ్మడి కాయలాట, చెరుకు పందెముల ఆట, పోకలాట, బంతిఆట, గుంతమా పలనము, రూక కుప్పల ఆట, గచ్చకాయలాట వంటివి తెలుసు. పొట్టేళ్ళు, కుక్కలు, బంతులు, పిట్టలు, పంజరాలు, డేగలు, పికిలి పిట్టలు మొదలైనవి వాళ్ళ ఆట వస్తువులు. కోడి పందెం పలనాటి యుద్ధానికి దారి తీసిన క్రీడ. అప్పట్లో ఇదొక బలహీనత. పెద్దల పౌరుషానికి కోడి పందెం ప్రకటన సాధనం. పల్నాటి వీరచరిత్రలో గంగిరెద్దులాట కూడా ప్రస్తావింపబడింది. "గంగిరెద్దుల వాడు కావరమణచి - ముకురాడు పొడిచిన పోటెద్దులట్లు"

**వేషధారణ - అలంకరణలు:-** పలనాటి వీరచరిత్రలో అనేకుల వేషధారణ వర్ణింపబడింది. కన్నమనాడు, నలగామ రాజు, మాంచాల వంటి వాళ్ళ వేష వర్ణనలు నాటి ఆహార్యక విశేషానికి సంకేతాలు. కార్యమపూడి కదనరంగాన్ని చూచి రావడానికి బయలుదేరిన కన్నమ వేషం ఇది -

"వాసిగా నురమున వనమాలకదల - కరముల గజ్జిది కడియముల్ మెరయ

నేటైన పిడి గంట నెమలి సోగలును - నల్లని దట్టని నయమొప్ప కట్టి

అర్ధనా రాజల్లులమర వీపునకు ఘోర భైరవ కత్తి కోరమీసములు

ఎగుభుజంబులు మించు నెరజారకండ్లు - ఘనమైన దేహంబు కాలి పెండెరము"

ఒక జానపదుని నిర్దిష్ట వేషాన్ని ఈ వర్ణన పాఠకుల ముందుంచున్నది.

నలగాముడు కొలువు కూటానికి పోయే సందర్భంలో అతని వేషధారణ సుదీర్ఘంగా వర్ణింపబడింది. ఇది కన్నమనాడు కన్నా భిన్నమైనది. రాచరిక భూస్వామ్య సంపన్న వర్గ వేషధారణ నీ వర్ణన ప్రతిబింబం

ఘన శుచి వస్త్రముల్ కటి యందుదాల్చి............

నిలువుటద్దము చూచి నేరుపు మీద - తిలకంబు నుదుటను తిన్నగా తీర్చి.............

తగటు కూసంబులు ధరియించి తలను - ఒక వింత యుష్టీషమొప్పగా బెట్టి

హారి రత్నపు బిళ్ళ ననువొంద కట్టి - కర్ణ సుంతలములు ఘనముగా మెరయ
అఖిల రత్నములలో నమరికైనట్టి - పతక చయమ్ములు పైడి మాలికలు...........
పది వేళ్ళ ముద్రికల్ బాగుగా పెట్టి - నవరత్న ఖచితంపునడికట్టు తేల్చి
గండ పెండేరంబు కాలికి తొడిగి - తగటుదుప్పటి కప్పి.............

ఈ రాచరిక వ్యవస్థకు స్త్రీ ప్రతినిధి బాల చంద్రుని భార్య మాంచాల. ఆమె తన భర్త తన దగ్గరికి వచ్చే సందర్భములో అలంకరించుకున్న తీరు శృంగారాత్మకంగా ఉంది.

"దీర్ఘమై నునుపులై తీరైన నెరులు - కూర్చినున్నగదువ్వి కొప్పుగీలించి
బంగారు పూబేర్లు బాగుగా జుట్ట - మదనుకుంతము సది మంచి పాపటను
మణిమమ మౌక్తిక మండితం బైన - చేర్చుకుగదియించి చిత్రంబు గాను.........
నవరత్న మౌక్తిక నవ మమయుక్త - తాటంక భూషణ ద్వయము గీలించి........."

**వైద్యం:-** బాలచంద్రుని బొంగరం తగిలి అన్నమ్మ మూర్చ వచ్చి కింద పడిపోయింది. వెంటనే తోటి మహిళలు వచ్చి సేవ చేసి ఉపశమనం కలిగించారు. ఆ వైద్య విధానమిది -

"కప్పిరి వలువలు కర్ణంబులందు - కర్పూర రజమును గలయంగనూరి
పదతలంబుల యందు పాణుల యందు - కస్తూరి గంధంబు కలయంగ పూసి
తులెల్ల శైత్యోపచారంబు" చేశారు. ఈ ప్రాథమిక చికిత్స విధానం అప్పటికున్న వైద్య విధానం.

**విశ్వాసాలు:-** సంతానం కోసం తాను చేసిన పూజలు, నోచిన నోములు ఐతమ్మ సుదీర్ఘంగా వివరించింది. భూస్వామ్య సంప్రదాయం జీవితంలోని ప్రతి అంశాన్ని మతం చుట్టూ తిప్పింది. కేవలం స్త్రీ, పురుషుల ఆరోగ్యపరమైన కలయిక వల్ల మాత్రనే కలిగే సంతానాన్ని కూడా అలాగే చేసింది. ఐతమ్మ సంతానం కోసం పేద విప్రులకు పెళ్ళిళ్ళు చేసింది. ప్రతి అమడ దూరానికి ఒక అన్నదాన సత్రాన్ని కట్టించింది. అటవీ మార్గాలలో చలివేంద్రాలు పెట్టించింది. శివ భక్తులకు కమండలాలు చెయ్యించింది. గుండుగుండుకు గుంట గుంటకు చెయ్యెత్తి మ్రొక్కింది. "పుత్ర కామ్యం బిచ్చు పాలపైన చీర - లద్దించి గట్టి"నది. ఇంకా అనేక విధాల పూజలు చేసింది. చెన్నకేశవ స్వామికి ఎన్నో రకాల పూజలు చేసింది. ఆయన నుండి ఎగిరి వచ్చి పడిన పండు తింటే ఆమెకు తాదాత్మ్యం కలిగింది. జానపద విశ్వాసాలు ఆర్యీకరణ పొంది విపరీతమైన కర్మకాండగా మారిన క్రమాన్ని ఐతాంబ వివరణ తెలియజేస్తుంది.

రాజకీయంగా రాయబారులను రాయబారులుగా చూడడం భూరాజనీతి విషయం. అయితే నలగాముడు మలిదేవుని నుండి రాయబారిగా వచ్చిన అలరాజును చంపడం, యుద్ధానికి రమ్మని మలిదేవరాజు తరపున పోయిన భట్టును కోపగించి వదలడం వంటివి భూస్వామ్య సృష్టించుకున్న నీతికి ఆ వ్యవస్థే ఒక్కోసారి తూట్లు పొడిచే విధానానికి నిదర్శనం. రాజ్యాధికారం కోసం మానవ శ్రేణులను సమీకరించి పౌరుషాలను నూరిపోసి రణరంగంలోకి దించి యుద్ధ క్రీడను కొనసాగించే భూస్వామ్య రాచరిక వ్యవస్థకు పలనాటి వీరచరిత్ర చారిత్రక సాక్ష్యం. కళాత్మక ప్రతిఫలనం.

## 9.3 పలనాటి వీరచరిత్ర - రచనా వైశిష్ట్యం:-

శ్రీనాథుడు వస్తు బలం కన్నా దూషబలమున్న కావ్యాలనే రాశాడు. పద్య రచనలో, భావుకతలో, భాషా ప్రయోగంలో శ్రీనాథుడు విజయవిహారి. రచనను చిక్కంలాగా అల్లడం శ్రీనాథుని విద్య. పద్య నిర్మాణంలో స్వైర విహారం చెయ్యడం శ్రీనాథుని క్రీడ. అలంకార ప్రయోగంలో అడుగడుగున అందాలు ప్రదర్శించడం శ్రీనాథుని అలవాటు. ప్రభావం చెబుతున్నా రచనను

మిరుమిట్లు గొలిపేట్లు చెయ్యడం ఆయన విధానం. ప్రౌఢికి, సరళతకు, సంక్షిప్తతకు, సంకీర్ణతకు, సరసతకు, సౌమ్యతకు అన్నిటికీ ఆటపట్టు శ్రీనాథుని కవిత్వం. అయితే క్రీడాభిరామంలో శ్రీనాథుడు తన సంప్రదాయ కవిత్వ రచనాయుధాలన్నిటినీ జమ్మి చెట్టెక్కించి సరికొత్త పనిముట్లను ఉపయోగించాడు. సరళమైన భాష, సరసమైన భావుకత, ద్విపదలో అణకువగా ప్రదర్శించాడు. వస్తువుకు ప్రాధాన్యమిచ్చి, అభివ్యక్తికి ప్రాధాన్యం తగ్గించాడు. సంస్కృత వృత్తాలలో గంభీరంగా దూరంగా అంగలు వేసిన శ్రీనాథుడు ద్విపదలో బుడిబుడి నడకల వంటి చిన్న అంగలు వెయ్యడంలోనూ సఫలీకృతుడయ్యాడు. అలంకారాల్లో దేశీయత ప్రదర్శించాడు.

**భావుకత:-** పల్నాటి వీరచరిత్రలో వస్తు పరంగానే గాక రూపపరంగా కూడా భారత రామాయాణాల ప్రభావం కనిపిస్తుంది. క్రీ॥శ॥ 15వ శతాబ్దం నాటికి భారత రామాయణాలు తెలుగు సాహిత్యంలో ఉపమానంగా ఉపయోగపడడం మొదలైంది. శ్రీనాథుని సాహిత్యంలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. "సమరఫల్గుణ" (హర విలాసం 5-61) సవిద్గాండీవ కోదంత (కాశీ ఖండం 1-14) పలనాటి వీరచరిత్రలో రచనాపరంగా భారత రామాయాణాలను కవి బాగా ఉపయోగించుకున్నాడు. యుద్ధంలోకి వెళ్తానని అడిగిన బాలచంద్రుని తల్లి ఐతమ్మ వారిస్తుంది. అప్పుడు బాలచంద్రుడామెతో తన ధైర్యాన్ని పౌరుషంగా చెబుతాడు.

"సైంధవ వధవేళ సాహసస్ఫూర్తి - విజయుడు రణములో విహరించునట్లు
కౌరవసేనలో గదబట్టి దూకి - వడము కిరణమున వ్రాలినయట్లు
వాయుపుత్రుడు లంక వడితోడ చొచ్చి - భస్మంబుగావించి ప్రబలిన భంగి
రాక్షసరణములో రామచంద్రుండు - వీరపరాక్రమ విధిజెందినట్లు..........."

అలాగే నరసింగరాజు, బాలచంద్రుడుల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని కవి "బలదానవుడు వజ్రపాణియు బోలె - రావణాసురుడును కత గతసాహిత్యాన్ని వర్తమాన సాహిత్యంలో అభివ్యక్తికి సాధనంగా ఉపయోగించుకునే మార్గానికి శ్రీనాథుడు కృషి చేశాడు.

క్రీ॥శ॥ 15వ శతాబ్దం నాటి సాహిత్యంలో రకరకాల పట్టికలు ఇవ్వడం ఒక ధోరణిగా అభివృద్ధి చెందింది. బ్రహ్మనాయుడు పంపిన కన్నమ కార్యమపూడి యుద్ధ క్షేత్రానికి వచ్చినప్పుడు అక్కడి భూతములకు ఎలా కనిపించాడో విశేషణాల పట్టికలో చెప్పాడు కవి.

"తలకడు మనకింత ధైర్యంబు మీది - ఎవ్వడే తెంచెనో యెరుగరాదితని
ఈశ్మశానములోన నెసగు రుద్రుండొ - బ్రహ్మయో విష్ణుడో పాక శాసనుడొ
అగ్ని హోత్రుడు లేక యమధర్మరాజు - అలనైదృతుడొ కాక అంబుధి పతియొ
పవనుడొ ధనదుడొ పాలనేత్రుండొ - ముని వితతకెల్ల ముఖ్యంయేయొ"

ఈ పట్టిక రచన ద్వారా కన్నమనేని స్వరూపంలోని ఆధిక్యతను వ్యక్తం చేశాడు. అనంత సద్గుణాల రాశి కన్నమనేదని చెప్పడానికి కవి అనుసరించిన పథకమిది. ఉపమానాల దొంతరలో ఒక వస్తువులోని ఉత్కృష్టతను చెప్పడం ఒక రచనా ధోరణి అయితే నిరలంకారికంగా ఒక వస్తు స్వరూపాన్ని చెప్పడం మరో ధోరణి. బ్రహ్మనాయుడు కార్యమపూడి యుద్ధ క్షేత్రాన్ని దర్శించినప్పుడు ఆయనకు కనిపించిన రుద్రభూమి ఇలా ఉందట

"కూడని శల్యముల్ కురుచ తుండములు - స్రక్కిన చర్మముల్ చుట్టవైయున్న
ప్రేవులు నరములు పెంటవై యున్న - ఎండు మాంసములు ఎముకలు పగిలి
రాలిన మూలుగరాసులు తరుచు - మురిగి దుర్గంధంబు మొనసిన మెదడు
గాలికి తూలెడు ఘన శిరోజములు - కాలి కుప్పలు వద్ద ఘనమైన బూది
చిమిడిన శవములు చెదరు కొర్వురులును"

ఈ స్వభావోక్తి కవి వస్తు పరిశీలన శక్తికి నిదర్శనం.

పలనాటి వీరచరిత్రలో పాత్రల సంభాషణలు వీరోచితంగా ఉంటాయి. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, పౌరుషం వంటి గుణాలు గల రాచరిక భూస్వామ్య పాత్రలు చెప్పే సంభాషణలు ఉద్రేకపూరితంగా ఉంటాయి. ఎదుట వ్యక్తిని చులకన చేయడం, ఆత్మోత్కర్ష ఉంటాయి. నలగాముని దగ్గరికి రాయబారిగా పోయిన భట్టు నలగామునితో చెప్పవలసినదంతా చెబుతాడు. నలగాముడు భట్టు మీద కోప్పడతాడు. బ్రహ్మనాయుని గొప్పదనాన్ని పేర్కొంటూ

"చిరునక్క క్రొవ్వున చీదర రేగి - చట్టు పై గంతులు సాగించినట్లు" ప్రవర్తింప వద్దని సూచిస్తాడు. అంతేగాక

"ఏనుగు సింగము కెదిరింపగలదె - స్వాతి కొక్కెర వెల్ల సాళ్వంబులో దూరె" అని పోలిక చెబుతాడు. "కరిచయంబు కొలను కలచిన రీతి - గురజాల పురమెల్ల కోటతో గూడ పెరికి వైతురు" అని బెదిరిస్తాడు. ఈ పోలికలన్నీ యుద్ధ వీర రసోచితంగా ఉంటూ పాటలు పాడేటపుడు శ్రోతలలో సైతం ఉద్రేకం కలిగిస్తాయి. ఈ ఉపమానాలన్నీ ప్రకృతిలోనివే. పల్లె ప్రజలకు తెలిసినవే.

బాలచంద్రుని బొంగరం దెబ్బ తగిలిన వైశ్య స్త్రీ "తరిగిన ఖర్జూర తరువు చందమున - తటకున మూర్ఛచే ధరమీద నొరిగె" అన్న కవి ఆమె తేరుకుని బాలచంద్రుని "పోతు సింహము వలె పొదలుచున్నావు - మలవరపు గిత్త వలె మలసి మేడపిని - ఉన్నావు కావరమురుగక నీవు" అని నిందించింది. కవిత్వాభివ్యక్తి లోని సున్నిత సహజత్వానికి ఈ పాదాలుదాహరణాలు. 'మలవరపు గిత్త' అన్న మాట బాలచంద్రుని యవ్వన స్థితిని తెలుపుతున్నది. గిత్తలకు పేరుమోసిన ప్రాంతపు వ్యక్తిని అలా పోల్చడం స్థానికతకు నిదర్శనం.

బాలచంద్రుని తన ప్రియురాలు 'సబ్బాయి' మాటలు విని కోప్పడతాడు. "ఇంటిలో భోజనం బిచ్చకు రాక - పరుల యెంగిలి కాసపడి తిననేను" అంటూ కసురుకొని వెళ్ళిపోబోతాడు. సబ్బాయి అతనిని ఆపి "పర్ణాగ్రముల యందు పట్టుకవ్రేలు - జలబిందు తతివలె చలనంబునొందు - మనసాకతీరు" అంటుంది. చిత్త చాంచల్యాన్ని నిర్వచించడానికి సల్యాయి వేసిన ఈ పోలిక భావస్ఫోరకంగా ఉంది. ఆకుల చివర్లలో వ్రేలాడే నీటి బిందువులతో చపల మనస్తత్వాన్ని పోల్చడం కవి పాత్రల హృదయావిష్కారానికి తార్కాణం. సబ్బాయి తల్లిని "ముదివానరము వంటి ముసలిది" అనడం కూడా స్వాభావికంగా ఉంది.

వీరరస పోషణకు శ్రీనాథునికి చిక్కిన గొప్ప అవకాశమే పలనాటి వీరచరిత్ర రచన. ఈ కావ్యంలో చివరి ఘట్టంలోబాలచంద్ర, నరసింగుల యుద్ధ వర్ణనలో కవికి తన వీర రసాభివ్యక్తీకరణ శక్తినంతా ప్రదర్శించారు. నరసింగుని ప్రోత్సాహంతో అతని సైన్యం బాలచంద్రుని వర్గం మీదికి ఉరికింది. అది వెనుదిరిగిపోయిన నరసింగుని సేనలు, అతని రోషపూరితమైన మాటలు విని కృత్రిమ పౌరుషంతో చేయబోతున్న యుద్ధం అందుకే కవి

"మిడుతలు మంట పై మిరిసి పడ్డట్లు
బాలుని దాకిడి భయదూరులనుచు"
"విక్రమాటోపత వెలసి బాలుండు
జలధిలో మందర శైలంబు తిరిగి
కలకనొందించిన కైవడి ఘోర
కాలాగ్నిలో కముల్ గాల్చినయట్లు
దావావహ్ని విపినంబు దార్కొన్న భంగి"

అని ఇరుపక్షాలను వర్ణించాడు. నరసింగుని సేనలను మిడుతలతోను, బాలచంద్రుని సేనను మంటతోను పోల్చడం వల్ల జయాపజయాలు సూచితమౌతున్నాయి. బాల చంద్రుడు తనకు ఒక నరసింగుని వైపు వీరుని ఏనుగు ఎదురుకాగా "కొదమ

సింహము మాద్కి కుంభిని పై దూమి"కాడు. దానిని తలను నరికాడు అది "కూలెను భూమి పై కొండ బడ్డట్లు" దానిపై నున్న వీరుని నరసింగడనుకొని అతని తలను నరికి తీసుకొని తండ్రి దగ్గరికిపోతాడు.

అప్పుడు ఆ యుద్ధరంగం ఎలా ఉందో కవి వర్ణించాడు.

"సమర రంగము చూడ చక్కనైయుండె
ఘనమైన నెత్తురు కాల్వలై నిలిచె
తెగిపడ్డ గజరులు దావులై యొప్పె
పొర్లాడు శిరములు బుద్బుదపటలి
టెక్కెముల్ గొడుగులు డిందేరవితతి
ఘనమైన యరిగెలు కచ్ఛపరాజి
మేటి నేత్రంబులు మీనవారంబు
ధీర్ఘ శిరోజముల్ తీరైన నాచు
మెదడును మాంసంబు మించిన బురద
తరచైన యీటెలు దర్వీకరాళి
పొడియైన భూషణ పుంజంబు లెల్ల
సైకత నిచయంబుబాత్తునెసగె"

యుద్ధాలను ఆనందంగా ఆవేశంగా వర్ణించే సాహిత్యరాతికిది గొప్ప ఉదాహరణ. యుద్ధంలో హతులైన వీరుల నెత్తురు కాల్వలు గట్టిగా ఇతర విశేషాలతో కలిసి అది రక్తకాసారమైందని కవి వర్ణించాడు. ఆ రక్తంలో తెగిపడిన ఏనుగులు దీవులట, గుర్రాలు మొసళ్ళట, వీరుల తలలు నాటి బుడగలట, విరిగిపడిన వీరుల రథాల టెక్కాలు, గొడుగులు నురుగులట, కత్తుల డాలులు తాబేళ్ళట, రాలిపడిన వీరుల మెదడు మాంసపు ముక్కలు బురదట, వీరుల ఈటెలు పాములట, యుద్ధసమయంలో రాలిపడిన వీరుల ఆభరణాల ముక్కలు సైకతాలట.

నరసింగుని సైన్యం బాలచంద్రుని పై బడటాన్ని కూడా కవి సమాన అభినివేశంతో వర్ణించాడు.

"మదగజంబుల పైకి మత్తసింహంబు
లరుదెంచు విధమున నాశ్చర్యలీల"
"కొక్కెరగుంపు పై కుప్పించి యురికి
సాళ్వంబు డీకొన్న చందంబుగాగ
కరుల పై సింహపు కందెగసినట్ల
వ్యాఘ్రంబు గోవుల వడిదాకినట్లు
సేనల పై కేగి తెండాడి రాపుడు"

పలనాటి వీర చరిత్ర చారిత్రక వీరుల చరిత్రాత్మక యుద్ధ కథనాత్మక కావ్యం.

చారిత్రక కావ్యంలో చరిత్రను కళాత్మకంగా వర్ణించడం కత్తమీద సాము. ఈ సామును కవి ప్రతిభా సంపన్నుడు గనక నిర్వహింపగలిగాడు. అలాగే చారిత్రక పురుషుల పాత్రలను వాస్తవిక భంగం కలగకుండా చిత్రించడం సులభమైన పనేం కాదు. పలనాటి వీరచరిత్రలో బ్రహ్మనాయుడు, నాగమ్మ, కన్నమనీరు, భట్టు అనబోతు వంటి పాత్రలు కవి చేతిలో కళాత్మకమూర్తులుగా రూపొందారు. మహిళల్లో ఐతమ్మ, వైశ్యస్త్రీ, మాంచాల, సబ్బాయి సజీవంగా మనముందు నిలుస్తారు.

**పాత్రలు:-** పలనాటి వీరచరిత్రలో శ్రీనాథుని రచనా భాగాలలో (కల్లు ప్రతిష్ఠ, బాలచంద్రుని యుద్ధం) బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు, భట్టు, నాగమ్మ, ఐతమ్మ, సబ్బాయి, మాంచాల, అన్నమ్మ, అనబోతు, కన్నమనీరు మొదలైనవి ముఖ్యపాత్రలు. పౌరాణిక సాహిత్యంలోకన్నా చారిత్రక సాహిత్యంలో పాత్రలు ఎక్కువ వాస్తవికంగా ఉండటానికి అవకాశముంది. తెలుగులో చారిత్రక పాత్రలకు కూడా కవులు పౌరాణిక పరిమళమద్దే సంప్రదాయముంది. పలనాటి వీరచరిత్రలోను ఈ లక్షణముంది. అయినప్పటికీ ఈ పాత్రలు తమ కాలపు రాజకీయ వ్యవస్థకు ప్రతినిధులుగా ఉంటూ తమ స్వస్వరూపంతో ఆవిష్కృతమౌతాయి. ప్రతి పాత్రలోనూ మధ్య యుగాల భూస్వామ్య సంప్రదాయ నిబద్ధతతో పాటు, తనదైన ప్రత్యేక రాగ ద్వేషపూరిత మానవ స్వభావం ప్రతిబింబిస్తుంది. ఈ కావ్యంలోని పాత్రలలో ఆదర్శమూ వాస్తవికతా కలగలిసిపోయి కనిపిస్తాయి.

**బాలచంద్రుడు:-** బ్రహ్మనాయుని కొడుకు బాలచంద్రుడు. ఇతనిని కవి ఎక్కడైనా 'బాలుడు' అనే పేర్కొంటాడు. శ్రీనాథుడు ఈ పాత్రను అత్యంత అభినివేశంతో చిత్రించినట్లు అర్థమౌతుంది. కల్లు ప్రతిష్ఠ కథా ప్రారంభంలోనే బాలచంద్రుని "భాస్కర సమతేజుడు" అని పరిచయం చేశాడు. పల్నాటి వీరచరిత్ర కావ్యం పొడుగునా ఈ భాస్కరతత్వమే చిత్రింపబడింది. బాలచంద్రుని యుద్ధ భాగంలో నీళ్ళకొచ్చిన విప్రవైశ్య యువతులకు బాలచంద్రుడు మార్తాండతేజుడు, ఉరుమనిపిడుగు, 'పెరెబాలుడు గాని బిరుదు మగడు'గా అనిపించాడు. వంశపారంపర్యంగా బాలచంద్రుడు మలిదేవుని పక్షాన యుద్ధంలో నలగాముని పక్షంతో పోరాడి మరణిస్తాడు. బాలచంద్రుని యుద్ధ ఘట్టం ప్రారంభమయ్యేటప్పటికి బాలచంద్రుడు బొంగరాలాడే పిల్లవాడుగా ఉన్నా పెళ్ళి అయ్యుంటుంది. మాంచాల అతని భార్య. పెళ్ళై పదేళ్ళు గడిచినా బాలచంద్రుడు ఆమెతోకాక, అన్నమ్మ అనే ప్రియురాలితో సంబంధం పెట్టుకొని ఉంటాడు.

బాలచంద్రుడు పుట్టుకకు రెండు నేపథ్యాలు చెప్పాడు కవి. 1. బాలచంద్రుడే చెప్పుకున్న తన వారసత్వం, 2. ఐతమ్మ చెప్పిన నోముల వ్రతాలు. యుద్ధ ఘట్టంలో తమ్ముళ్ళు యుద్ధంలోకి పోవద్దనికోరుతారు.

"వలదుబాలు పిన్నవాడవు నీవు - సన్నపు పనికాదు సమర కార్యంబు"

ఇందుకు బాలచంద్రుడు పురాణేతిహాసాలలోని యువ వీరుల వారసత్వానికి చెందినవాడనని వాళ్ళకెవరికీ లేని పిన్నవయసు తనకెందుకొచ్చిందని వాదిస్తాడు.

"బాలుడాతం డని పలుకుట తగదు - నాపూర్వమంతయు నయమొప్పనిపుడు......
వినరయ్య మీరెల్ల విశదంబు గాన - అయోధ్య నేలిన యాహరిశ్చంద్ర
మహారాజునకు చంద్రమతికిని బుట్టి - లోహితాస్యుడనైతి లోకంబు వెరశ
నాడు బాలుడగానె నాయకులార...........పాండవ పుత్రుడా ఫల్గునికాను
అభిమన్యు డనుపేర నమరబుట్టితిని..............కలియుగంబున నిపుడుకడసారి నేను
కుంతాల వారింట కూరి మిమీర - బ్రహ్మనాయునికి పడతియైతమకు
బాలుడన్ పేరనీ పల్నాటిలోన - జననంబు నొంది సమరశూరండ..........
పగవారి కొట్టని బాలత్వమేల............"

అని తాను లోహితాస్యుడు, ప్రహ్లాదుడు, చిరుతొండనంబి, సిరియాళుడు, అంగదుడు, కుశుడు, అభిమన్యుడు వంటి పురాణ యువ కిశోరాల వారసుడినని చెప్పుకుంటాడు. బాలచంద్రుని తల్లి ఐతామ్మ చాలా నోములు నోచి పుత్రుని పడసినట్లు చెబుతుంది.

"వినవోయి బాలుడ వీరేఖరుడ - సంతానమే లేక చాల కష్టించి
ఇలలోన నోములు ఎన్నెన్ని కలవొ - అన్నియు నోచితినవి చెప్పనేల"

అంటూ పుణ్యకార్యలు చేయటం వల్ల బాలచంద్రుడు పుట్టాడని చెప్పడం ఈ కావ్యంలోని పాత్రగతమైన జానపదాంశ.

బాలచంద్రునికి వర్ణ వ్యవస్థను గురించిన పౌరాణిక దృష్టి ప్రబలంగా ఉంది.

"ఆదికాలంబున నజుడు నిర్మించె - వర విప్రరాజన్య వైశ్య శూద్రులను
వేద విద్యలయందు విప్రులనుంచె - రణ కార్యముల యందు రాజుల నుంచె
క్రయవిక్రయాది కార్యంబులందు వైశ్యుల నియమించి వరలగాజేసె
సద్భక్తి నీమూడు జాతుల వారి - శుశ్రూషనొందంగ జేసె శూద్రులను
సరవినాలవ జాతి జననంబు మాకు - వెలమల మైతిమి వీర జీవనత
విప్రుల సేవింప విజ్ఞాన మొదవు - క్షత్రియ సేవచే శౌర్యంబుగలుగు
కడు వైశ్య సేవ చేగలుగు సంపత్తి - వేమురాజుల గొల్చిమెరయు చుండుదుము"

శూద్రులు పై వారితో మమేకమయ్యే క్రమం బాలచంద్రుని పాత్ర ద్వారా కవి చెప్పించాడు. నిజానికి మనువు చెప్పిన వర్ణ వ్యవస్థ స్థానంలో సరి కొత్త వర్ణ వ్యవస్థ రూపొందే క్రమానికి ఇలాంటి సంఘటనలు రుజువులు.

తన వర్ణ స్వభావం బాగా తెలిసిన బాలచంద్రునికి భూస్వామ్య సిద్ధాంతాలుకూడా బాగా వంటబట్టాయి. "చెడని పదార్థముల్ సీమలో లేవు అంటూనే" ధర బ్రహ్మ వ్రాతలు తప్పింపరాదు. "కాలమెవ్వరికైన గడువరాదు - ధరపద్మజోనివ్రాత తప్పింప రాదు" అని కూడా బాలచంద్రుడు నమ్ముతాడు. ఎంతో పౌరుషవంతుడైన బాలచంద్రుడు

"కలుములు నిత్యంబు కావు మాతల్లి - మెరుపుల రీతిని మేఘంబులట్లు
బుద్బుదంబుల భంగి పోవును చెదరి - ఇటువలె తలపోసి యెరుస చేవించి
సంపద వేళనే సకల భోగములు - పొంది ధర్మంబులు పూని చేయగను
భోగాను భవము చే పుట్టి సంతృప్తి - వేసట జనియించు వెగటుగా తోచు"

అనే చార్వాక సిద్ధాంతం వంటిది కూడా మాట్లాడతాడు.

బొంగారలాట సమయంలో బాలచంద్రుడు వైశ్య వనిత అన్నమ దగ్గర ప్రవర్తించిన తీరు ఆయన హూందా తనానికి నిదర్శనం. బాలచంద్రుని బొంగరం తగిలి అన్నమ్మ ఖర్జూరం చెట్టులాగా కిందపడి, తేరుకొని పైకి లేచి పెద్దవాళ్ళు యుద్ధంలో ఉంటే బాలచంద్రుడు "మలవరపు గిత్తవలె మలసి మేడపి"లో తిరుగుతున్నాడని తీవ్రంగా నిందిస్తుంది. అప్పుడు బాలచంద్రుని మిత్రుడు అనపోతు కోపించి ఆడవాళ్ళనందరిని తరిమి కొడతాడు. బాలచంద్రుడు అతనిని వారించి,

"వనితల నదలింప వచ్చునా మనకు - నింద శాపాతప మంటగాదె" అని అన్నమతో ఇలా అంటాడు.

"నొప్పి చెందుట చేత నోరాచ లేక - అనరాని మాటలనాడితి నీవు
నీ మీద పగ చేత నేవేయ లేదు........ నా తప్పు మన్నించు నయభావమునను"

శత్రువుతో యుద్ధం చేసేటప్పుడు తప్ప తక్కిన సమయాల్లో బాలచంద్రుడు ఎంతో సంయమనంతో ప్రవర్తిస్తాడు. బొంగారాలాడడానికి తన అమ్మ అనుమతి అడిగినపుడు ఆమె బొంగరాలాడవద్దు, అవి ఆడవాళ్ళ పడితే వాళ్ళు శపిస్తారంటుంది. దానికి బాలచంద్రుడు ఇలా బదులిచ్చాడు -

"అమ్మరో నావంటి యనుగు నందనులు - పుట్టిరా భూమిని పుణ్యాంగనలకు
వారేల శపియింత్రు వనితరోనన్ను"

ఇలాంటి మాటల్లో బాలచంద్రుని పరిపక్వ మనస్థితి వ్యక్తమౌతుంది.

తల్ల భార్య దగ్గరికి వెళ్ళమని ధనమిస్తే దానిని తీసుకొని బాలచంద్రుడు సాని ఇంటికి వెళ్తాడు. సాని అన్నమ సాని వలె ప్రవర్తిస్తుంది. అన్నమ్మను యుద్ధభూమికి పయనం కమ్మంటాడు బాలచంద్రుడు. ఆమె చాలా "ఇహ సౌఖ్యమొసగుటకేమి కర్తలము - పరసౌఖ్యమొసగ నీపడతియే కర్త" అని చెప్పింది. బాల చంద్రుడు కోప్పడతాడు. అన్నమ రకరకాలుగా మాట్లడి డబ్బునంతా గుంజుతుంది. అప్పుడనబోతు అతనిని వర్ణిస్తాడు.

"కామాంధకారంబు కన్ను లదొట్టి - కింద మీదెరుగక కేరుచున్నావు"

అనబోతు మాటలు విన్న బాలచంద్రుడు తన భార్య ఇంటికి వెళతాడు. అక్కడ యుద్ధం విషయం మరచి ఆనందంలో మునిగి తేలుతుంటాడు. తన భార్యను చూచి, ఇన్నాళ్ళు ఆమెను నిరాదరించినందుకు పశ్చాత్తాపపడతాడు.

"ఇటువంటి కాంత పై నిచ్చయు విడిచి - పశు బుద్ధివాతనై భావంబు మరచి
ఉంటినేనిన్నాళ్ళు భావంబు మరచి"

అని బాధపడతాడు. యుద్ధం మరచి భార్య దగ్గర గడుపుతున్న బాలచంద్రుని తమ్ములు వచ్చి గోల చేయగా యుద్ధానికి బయలుదేరుతాడు. ఈ వివరాలు బాల చంద్రుని ద్రవరూప శీలాన్ని రుజువు చేస్తున్నాయి. కన్నమనీని అనవసరంగా కొప్పడ్డ బాలచంద్రుడు తన తప్పును తెలుసుకొని "తప్పునాయెడనుండె తమ్ముడా" అనగల నిజాయితీ ఉంది బాలచంద్రునిలో.

బాలచంద్రునిలో ఒక యుద్ధ వీరుని కుండవలసిన పౌరుషం, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. తన పెద్దలు ఎక్కడ ఉన్నారో చెప్పకుండా తల్లి మభ్య పెడుతుంటే బాలచంద్రుడు "తల్లి నాకసాధ్యంబు ధర లోన లేదు - బ్రహ్మాండముల పట్టబంతులాడెదను" మృత్యు దేవతనైన మెదపి వేసెదను'' అనడంలో ఆయన ఆత్మ విశ్వాసం పరిమళిస్తుంది. యుద్ధంలోకి వెళ్ళ వద్దని తల్లి నిరుత్సాహపరుస్తుంటే బాలచంద్రుడాడిన మాటలు బాలచంద్రుని వీర స్వభావాన్ని రుజువు చేస్తున్నాయి.

"విజయుడురణములో విహరించునట్లు ............
పాలాక్షుడతి రౌద్రపటిమలీ రంగ - త్రిపురముల్ గాలిచి తీరిచినట్లు.........
నలగాము బలముల నలినలి జేసి............
దహనుని కడ్డంబె దట్ట మౌవనము - బడబాగ్ని నార్చునే పాథోధిమించి.........
చిన్నమిరియమునందు చెడునె కారంబు - బాలుడనని నన్ను భావింపవలదు''

యుద్ధ సన్ని వేశాలలో బాలచంద్రుని విజృంభణ, అతని సమరోత్సాహం, శక్తివంతంగా చిత్రించాడు కవి. బాలచంద్రుడు రాచరిక వ్యవస్థకు తగిన యువ వీరుడు. వ్యక్తిగా మానవ సహజ లక్షణాలున్నవాడు. శత్రువులతో తప్ప ఇంకెరితోనైనా సరైన తీరులో ప్రవర్తించడం, తప్పును తెలుసుకొని దిద్దుకోగల చిత్తశుద్ధి వంటి లక్షణాలు బాలచంద్రునిలో అంతర్లీనంగా ఉన్నాయి.

**బ్రహ్మన్న:-** బాలచంద్రుని తండ్రి బ్రహ్మనాయుడు. పలనాటి కృష్ణుడుగా పేరు చెందిన వీరుడు. ఈయనను గురించి పండితులలో

రెండు రకాల అభిప్రాయాలున్నాయి. ఈయన చాపకూడు ఏర్పాటు చేశాడు. కులతత్వాన్ని వ్యతిరేకించాడు. గనక గొప్ప సంస్కర్త అని ఎక్కువ మంది అభిప్రాయం. కాని కొర్లపాటి శ్రీరామమూర్తి మాత్రం బ్రహ్మనాయునికి నాగమ్మకు మధ్య గల బేధాలను చెబుతూ భిన్నమైన అంచనా కట్టారు. "అనుగురాజు భార్య మైలమ దేవికి అరణముగా ఇచ్చిన అల్ప రాజ్యము పలనాటి రాజ్యము. అది రెండు ముక్కలు చేసినది బ్రహ్మనాయుడు. ఆ రెండు ముక్కలను చేసినది నాగమ్మ. బ్రహ్మనాయుడు నారీ ద్వేషి. కుక్కుటద్యూసవ్యసని మత ప్రచారకుడు. నాగమ్మ మహా నీతిజ్ఞురాలు. బ్రహ్మనాయునికి అవిచారిత రమణీయముగ సంఘ సంస్కర్త అని ఈనాడు చరిత్ర పక్షమున ముద్రపడినది. చాపకూడు సర్వమత సర్వ వర్ణ సహ పంక్తి భోజనము కాదు సంఘ సంస్కరణార్థము కాదు. సంగర సంస్కరణార్థము (తెలుగు సాహిత్య చరిత్ర, ద్వితీయ భాగము).

మలిదేవరాయులును సంరక్షించిన వాడు బ్రహ్మనాయుడు. అలరాజును చంపిన తర్వాత శ్రీనాథుని 'కల్లు ప్రతిష్ఠ'' బాలచంద్రుని యుద్ధ భాగాలలో బ్రహ్మనాయుని పాత్రను ఉదాత్తంగా చిత్రించాడు. 'కల్లు ప్రతిష్ఠ' లో బ్రహ్మనాయుని వర మంత్రి అని, నీలవర్ణుడని, నియత చిత్తుడని వర్ణించాడు. త్రిపురాంతకంలో 'భూతరాట్కంబం' ప్రతిష్టించి, దానికి బలులనిచ్చి నాయకావళికెల్ల 'విడియంబు' లిచ్చి ఎద్దులను ఆయత్తం చెయ్యమని ప్రోత్సహించడంలో బ్రహ్మన యుద్ధ నాయకత్వం ప్రస్ఫుటమౌతుంది. కన్నమనీడు "ఆది విష్ణుండు'' అని, "కలియుగ కృష్ణు చేకారుణ్య మూర్తి'' అనిపించుకున్న నాయకుడు బ్రహ్మనాయుడు.

బ్రహ్మనాయుడు కార్యమపూడి యుద్ధ క్షేత్రాన్ని చూచి రావడానికి అర్థరాత్రిలో బయలుదేరినప్పుడు కవి "పంద్రెండు సూర్యులు ప్రబలిన రీతి'' ఉన్నట్లు వర్ణించాడు. బ్రహ్మనాయుని పాత్ర చిత్రణలో కవికున్న విశిష్ట దృష్టి ఇది. నలగాముని కొలువులో మలిదేవరాయల రాయబారి భట్టు బ్రహ్మనాయుని గురించి చెప్పిన మాటలు అతని వీరోచిత రాచరిక యుద్ధ ప్రావీణ్య చరిత్రను ప్రతిబింబిస్తాయి.

> కృష్ణనీడెడు వేళ కారుమకరంబు - చంపవచ్చిన చూచి జంకింత లేక
> ఖండించి వైచిన ఘనత శూరుడతడు - చుట్టు నిప్పుల యేరు శోభిల్లుచున్న
> నెట్టన శివ పురినీరుగా చేసి - భూత రాట్కంబంబు పుచ్చు కొన్నట్టి
> శూరుండు ధీరుండు సమహితుడెన్న''

భట్టు మాటలు విన్న కోపాద్రిక్తులైన వారు వెంటనే గురజాల మీద దాడి చేద్దామన్నప్పుడు బ్రహ్మన

"దండెత్తి వచ్చెడి ధరణీశు విడిచి - తగరు కోటకు నరువ ధర్మంబు గాదు

వీరధర్మము తప్పిపెనగుటయేల'' అని వారించాడు. నలగాముడు విడిదిలో ఉన్నాడని తెలిసి తన వీరులు ఉద్రేకపడినప్పుడు కూడా

"తమకింప వలదు తరియగు దాక - సహనంబు దొడ్డది సకల కార్యములు కూడివచ్చు'' అని పలికాడు. యుద్ధ నీతి రహస్యాలు తెలిసిన నాయకుడు బ్రహ్మనాయుడు. బాలచంద్రుడు యుద్ధంలోకి వచ్చినప్పుడు అతనిని నిరాశ పరిచే రూపంలోనే ప్రోత్సహించడం బ్రహ్మన ఎత్తుగడలకు నిదర్శనం.

"తలపడునపుడు తలకకుమన్న - వారణ ధ్వనివిని వణకకు మన్న'' వంటి హెచ్చరికలు చేశాడు. అంతటి పరాక్రమశాలి, యుద్ధవీరుడు, బ్రహ్మన నరసింహుని తలను బాలచంద్రుడు తెచ్చినపుడు దుఃఖితుడు కావటం అతనిలోని మనిషితనానికి గుర్తు.

భట్టు, కన్నమనీడు, అనబోతరాజు - ఈ ముగ్గురు పలనాటి వీరచరిత్రలో బ్రహ్మనాయుని తరపున, బాలచంద్రుని తరపున శ్రమించిన వాళ్ళు. తమ తమ పాత్రలను చక్కగా నిర్వహించిన వాళ్ళు. నలగామ రాజు దగ్గరికి పోయి యుద్ధానికి రమ్మని బ్రహ్మనాయుడు భట్టును పంపిస్తాడు. ఆ నలగాముని దగ్గర భట్టు పలికిన మాటలు అతని ధీరచిత్తతకు అద్దం పడతాయి. యుద్ధం చెడు చేస్తుందని - పోరు నష్టం పొందు లాభం అన్నట్లు మొదట హితవు పలుకుతాడు.

"పోరు మంచిది గాదు భూమినెక్కడను - పాడౌను దేశంబు పగమించెనేని
ప్రజలెల్ల నశియించి పారిపోవుదురు..................
ఉభయులు వారెల్ల నొక్కటైయున్న - సకల కార్యంబులు సమకూడి వచ్చు"

నలగాముడు, నాగమ్మ, భట్టు మాటల్ని అలరాజును బ్రహ్మనాయుని తక్కువ చేసి మాట్లాడతారు. అప్పుడు వాళ్ళు దుష్ట రాజనీతిని బయటపెట్టి దానికి వెనుకాడని ధైర్యం భట్టుది.

"సంధి కేతెంచిన సరసు డల్లుణ్ణి - చంపిన వారలు జగతిలో లేరు" అని దెప్పిపొడిచి బ్రహ్మనాయుని శౌర్యాన్ని ప్రస్తుతించి తిరిగి వస్తాడు. కన్నమదాసు బ్రహ్మనాయుని మానస పుత్రుడు. బ్రహ్మనాయుడు కార్యమపూడిలో వీరభూమిని పరీక్షించి రమ్మని పంపుతాడు. అక్కడెదురైన ఎరుకల సానికి మాచర్ల చెన్నునిమేన పెంపొందు శ్రీ తులసి పెదవనమాల వరమున" తాను పుట్టినట్లు తెలియజేస్తాడు. అప్పుడతని స్వరూపమిది ......

"......... నా ఘనవీరు వాసిగా నురమున వనమాలకదల
సరముల గజ్జది కడియముల్ మెరయ కాటైనపి డిగంటనెరుల సోగలును
నల్లని దిట్టని నయమొప్పకట్టి అర్థనారీ జల్లుల మర వీపునను
ఘోర భైరవ కత్తి కోర మీసములు ఎగు భుజంబులు మించి నెర జీర పండ్లు
ఘనమైన దేహంబు కాలిపెండరము"

ఈ స్వరూపంలో యుద్ధ భూమికి కన్నమనీడు బయలుదేరడం "కాటక కొండయు కదలినయట్లు - గిరి కొన్న చీకటి క్రిక్కిరిసినట్లు"న్నదని కవి వర్ణించాడు. యుద్ధ సమయంలో బాలచంద్రుడు బ్రహ్మన కొలువులోకి దూసుకొని పోయినప్పుడు కన్నమనీడు ప్రతిఘటించడం, రాచరిక వ్యవస్థలో సేవకుని నిబద్ధతను చాటుతున్నది. స్నేహ ధర్మానికి ప్రతీక అనబోతరాజు. మాంచాల మాట విని బాలచంద్రుడు అనబోతును యుద్ధంలోకి రాకుండా చేస్తాడు. అందుకు బాదపడి అనబోత ప్రాణ త్యాగం చేస్తాడు.

నలగాముడు గొప్ప రాజకీయ చతురుడు. నాగమ్మను మంత్రిగా చేసుకొని శత్రువులను ఢీకొంటాడు. మలిదేవుని పైకి పోవడానికి ఆవేశంతో తానొక్కడే చాలనుకోకుండా స్థానిక వీరులనందరినీ సేకరిస్తాడు. సమీకరణ అవసరం లేదని నాగమ్మ చెప్పగా "నీతి శాస్త్రంబుల నిర్ణయ రీతి - పగవారి కొద్దిగా భావించరాదు - కొంచెపు ఫణినైన కొట్టెడి కొరకు - ఘనమైన దండమె కావలెగాని" అన్న జ్ఞానం ప్రదర్శించిన రాజనీతి చతురుడు. నాగమ్మ గొప్ప రాజనీతిజ్ఞురాలు. భట్టు వచ్చి మలిదేవు బ్రహ్మనలను గురించి గొప్పగా చెప్పి నలగామరాజును చులకనగా మాట్లాడగా కోపం వచ్చినా భట్టు వాడవుగాన బ్రతకనిచ్చితిని. దైవంబునీపాల దయ చేసినాడు" అని హెచ్చరించి పంపి వేసింది. నలగామ రాజుకు ఆత్మస్థైర్యం కలిగించడంలో నాగమ్మ ప్రదర్శించిన మాట తీరు గొప్పది.

"నీ బల్మి కల్మలు నీవెరుగ లేవు - ఇంద్రుడైనను నిన్ను నెదిరించగలడె.............
నీవురాబని లేడు నిఖి లేశయిపుడు - నన్ను బలము పంపు నాయుని గెలిచి
మలిదేవరాజును మరల మేడపిన - పరువిడజేతు నాపంతంబు జూడు"

బ్రహ్మనాయుని మీద కోపంతో గాని, చిన్న రాజ్యం రెండు చీలికలైందన్న భావంతో గాని, భట్టు సంధికి పిలిచినప్పుడు నలగామునితో నాగమ్మ పలికిన మాటలు ఒక విషయన్ని నిశితంగా విశ్లేషించడంలో ఆమెకున్న నైపుణ్యాన్ని తెలుపుతాయి.

"ఇద్దరు రాజులు ఏర్పడి రేని అవని లోపల నాజ్ఞ కమరిక గాదు
సిరిపొత్తు చేయుట చెల్లు రాజులకు - ఆజ్ఞ పొత్తిచ్చుట అది నీతి గాదు"

ఇక్కడ సంధికి మాత్రం అవకాశమివ్వని నాగమ్మ రాయబారులను పంపి యుద్ధమే శరణ్యమనుకుంటున్న మలిదేవాదులను సంధికి ఒప్పించగలగడం ఆమె రాజనీతికి పరాకాష్ట. ఇలా శ్రీనాథుడు రచించిన పలనాటి వీరచరిత్ర కావ్య భాగంలో ప్రతి పాత్ర అప్పటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలోంచి పుట్టుకొచ్చినట్లు దర్శనమిస్తుంది.

**భాష - ఛందస్సు:-** వస్తువులోనే కాక భాష - ఛందస్సుల విషయంలోకూడా పలనాటి వీరచరిత్ర దేశీయతకు నిలయం. మార్గ పద్ధతిలోరాసిన కావ్యాలలో సంస్కృత సమాసాల దొంతరల మధ్య చినచిన్న ముంతల వంటి దేశీయ పదాలను కూర్చి చల్లని గాలి తగిలినప్పటి హాయిని కల్పించే శ్రీనాథుడు పలనాటి వీరచరిత్రలో దేశీయ పదాల దొంతరలను పేర్చాడు. సామెతలు, లోకోక్తులు, నానుళ్ళు, జాతీయాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. అవి పంటి కింద రాళ్ళలాగా కాకుండా వంటికి తగిలే మలయమారుతంలాగా పాఠకుల్ని ఆకర్షిస్తాయి. భట్టు మాటలు విన్న నలగామునికి కోపం వచ్చింది. సింహాసనం మీద కూర్చున్న రాజు, సింహాసనం ఆశించే నలగామ రాజు వైపు నుంచి వచ్చిన భట్టు తీవ్రంగా హెచ్చరిస్తే ఓదార్చుకోవటం ఎలా? అందుకే ఇలా హుంకరించాడు.

"........... కనులెర్ర జేసి............మగతనంబున బుట్టి మగకాసెకట్టి
మగటిమి విడనాడి మానంబు మాలి
వారున్న తావుకు వచ్చుట తగవె"

ఈ మకారాది పదాలు కేవలం ఆది ప్రాసకోసమో, యతుల కోసమో పడిన ఆరాటాలు కావు. రోషం లోంచి పొడుచుకొచ్చిన లయాత్మక విన్యాసాలు. తెలుగు కావ్యంలో తెలుగు మాటల్ని వెతుక్కునే శ్రమను పలనాటి వీరచరిత్ర చాలా వరకు తగ్గిస్తుంది. అయితే ఆ పదాలన్నీ ఇవాళ ప్రజా వ్యవహారంలో యథా తథంగా లేకపోవచ్చు.

| | | |
|---|---|---|
| మరియాద | ఆడుపాపలు | గలభకారులు |
| పరిగె | తలచెడు | గద్దనలు |
| మాలిమి | పడుచువాడు | వింతవేడుక |
| కులపగ | మగసిరి | తలకాయ పుఱ్ఱె |
| మగసిరి | పదిలుడు | బూడిద పెంట |
| ఎముకల పెంట | వాగువంకల నీరు | తలపుఱ్ఱె |
| పాలకి | పిండి వంటలు | గావు చెల్లించు |
| మురుగులు | మద్దెల | చేజీతగాండ్రు |
| పరుగు గుఱ్ఱాలు | కూలిచచ్చు | రాత వేసినట్లు |
| ఒడిసి పట్టు | తుస్కుబట్టిన కత్తి | తడితీర్చు |
| ప్రొద్దుపోవు | పనిముట్లు | ముద్దుపొట్టెళ్ళు |
| గచ్చకాయలు | పెంటిపోతులు | చెమటలు జారు |
| ఇల్లడ వెట్టు | కాటుకకాక | కాకి బలము |
| నిప్పుల యేరు | కన్నులమదమెక్కి | సరసల్లుణ్ణి |

రాతి మీద వేసి పగిల్చు, "ఒక యిల్లు రెండుగా నొప్పజేసితిరి"

"వేడి పెనమున నీళ్ళు విదలించినట్లు"

"చిరునక్క క్రొవ్వున చీదర రేగి - చట్టపై గంతలుసాగించునట్లు"

"మూకంత వరిమడి మూలకు లేదు"

"కూడి గుంపైనను గున్నయౌచింత
క్రిందికి లేడు"

ఇవి, ఇలాంటివి కావ్యమంతా పాఠకుల్ని పలకరిస్తాయి.

ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని మార్గదేశి భేదాలుగాను, ఆస్థాన ఆస్థానేతర సాహిత్యాలుగాను విభజించి అధ్యయనం చేయడం పరిపాటి. పలనాటి వీరచరిత్ర ఆస్థానేతర దేశి కావ్యం. దక్షిణ దేశీయాంధ్ర యుగంలో దేశి ప్రక్రియ కూడా రాజాస్థానాల్లోకి వెళ్లిపోయింది.

పాల్కురికి సోమన ద్విపదను మహాకావ్య రచననుపయోగించి ప్రత్యామ్నాయ సాహితీ సృష్టికి పునాది వేశాడు. పాల్కురికి సోమనాథుని కాలంలోనే పలనాటి వీరచరిత్ర జరిగింది. పాల్కురికి సోమన తరువాత గోనబుద్దా రెడ్డి, తాళ్ళపాక కవులు ద్విపదను మహోన్నత దశకు తీసుకుపోయారు. ద్విపద రెండు పాదాల పరిమాణం గల రచన. ప్రతి పాదంలోను మూడు ఇంద్ర గణాలు ఒక సూర్య గణం ఉంటాయి. నాలుగో గణం మొదటి అక్షరం యతిస్థానం. ప్రతి రెండు పాదాలకు ప్రాస మారుతుంది. అయితే ప్రతి రెండు పాదాలకు వాక్యం పూర్తి కావాలని లేదు. మాలికలాగా సాగుతుంది ద్విపద రచన. ద్విపదలో ప్రాసను తొలగిస్తే 'మంజరీ ద్విపద' అవుతుంది. ద్విపద - రెండు పాదాలని కలిపి ఉంచేది ప్రాస మాత్రమే. అది లేకపోతే ద్విపద అనే మాటకు అర్థం లేదు. ఏకపద అని కూడ అనవచ్చు. పల్నాటి వీరచరిత్ర మంజరీ ద్విపదలో రాయబడిన కావ్యం. ద్విపద పాదానికున్న గణ నియమాలు కూడా ఉల్లంఘింపబడిన సందర్భాలున్నాయి. ఇది ఆశు సంప్రదాయంలోపుట్టి లిఖిత సంప్రదాయంలోకి రూపాంతరం చెంది తిరిగి ఆశు సంప్రదాయంలో ప్రచారం పొందింది. కనుక ఈ పరిణామాలు సహజం.

పలనాటి వీరచరిత్రలో ద్విపద పాదాలు అనేక రకాలుగా వున్నాయి.

1. ఒక పాదం ఒక వ్యాసం : కలుములు నిత్యంబు కావు మాతల్లి.
2. రెండు పాదాలు - ఒక వ్యాసం : మెరుపుల రీతిని మేఘంబులట్లు బుద్బుదంబుల భంగి పోవును చెదరి.
3. రెండు పాదాల కన్నా మించిన వాక్యాలు : బ్రహ్మనాయుడు తన పరివారాన్ని పిలిచి బండ్లు కట్టమని చెప్పాడు. వాళ్ళు ఎద్దులను పిలిచారు.

అందెల బసవన్న ఆది నాథుండ - నందుల పిడి గంట నాగ వాసయ్య
గోవుల విటకాడ గోగులబయ్యన్న - వంటరిపుంజంక వరపెరుమాళ
..............................................................................................
ఇటువలెపెంచిన నేపు మీరంగ - వచ్చిన యెద్దుల వరుసతో జూచి
..............................................................................................
ఘనమైన యెద్దుల కాండ్ల గట్టించి - గంటలు గజ్జెలు గణగణమ్రోయ
మోకుల బంధించి ముందుగానపుడు - పంచవన్నెల కూడు పై బారదివిచి
కంబంబు తల్లించె కమల నాభుండు -

34 పాదాలలో బశ్వేస వాక్యం రాయబడింది. ఆశువుగా పాడే క్రమంలో గాయకుని కల్పనా శక్తిననుసరించి ఇది ఇంకా పొడుగవ్వడానికి అవకాశముంది.

పల్నాటి వీరచరిత్రకు ఛందస్సు సాధనమే కాని సాధ్యం కాదు. మార్గమే గాని, గమ్యం కాదు. సాధనాన్ని అవసరాన్ని బట్టి పునర్నిర్మాణం చేసుకుంది. మార్గాన్ని ఇష్టం వచ్చినట్లు మలుచుకుంది పల్నాటి వీరచరిత్ర.

అందుకే భాష ఛందస్సు విషయాలలో పలనాటి వీరచరిత్ర స్వేచ్ఛా మార్గ విహారిణి. రాజాజ్ఞ వంటి నిరంకుశ ఛందస్సులలో దీర్ఘ కాలం సంచరించిన శ్రీనాథుడు తన పలనాటి వీరచరిత్ర కావ్య భాగంలో కొలనులో మదపుటేనుగు లాగా స్వేచ్ఛా విహారం చేశాడు.

## 9.4 పలనాటి వీరచరిత్ర - దేశభక్తి:-

పలనాటి వీరచరిత్రను దేశభక్తి కావ్యంగా భావించడం విద్వాంసులకు ఇష్టంగా ఉంది. దేశభక్తి అనేది భారతీయులకు ఆధునిక భావన. జాతీయోద్యమ చైతన్యం ద్వారా కలిగిన భావన. వలస పాకులకు వ్యతిరేకంగా భారత ప్రజలు ఉద్యమించినప్పుడు కలిగిన భావన. వలస పాలకులకు ముందు విదేశీయులు భారత దేశాన్ని పాలించినా అప్పటికి దేశభక్తి భావన పెంపొందలేదు. ఇందుకు కారణాలు వేరే ఉన్నాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి 'కొత్తచూపు' అనే కథలో భారతీయులకు దేశభక్తి అనే భావం బ్రిటిషు పాలనకాలంలో కలిగిందని, అంతకు ముందు దైవభక్తి, రాజభక్తి మాత్రమే భారతీయులకు తెలుసని అనిపిస్తారు. బ్రిటీషు పాలకులు వ్యాపారానికంటూ వచ్చి పాలకులై భారతదేశాన్ని ఆర్థికంగా దోపిడి చేసి స్థానికుల జీవితాలకో ఉపద్రవంగా మారినప్పుడు భారతీయులు ఉద్యమించి తమ దేశభక్తిని చాటుకున్నారు. పల్నాటి వీరచరిత్రలో విదేశీ పాలకులెవరూ లేరు. మలిదేవుడు, నలగాముడు అన్నదమ్ములే. ఒక తండ్రి బిడ్డలే. ఆస్థి కోసం అధికారం కోసం రాజ్య భాగం కోసం యుద్ధం చేసుకున్నారు. దీనిని వర్ణించడం దేశభక్తి అవుతుందా? మలిదేవుడు నలగాముడు ఇద్దరూ ఒక దేశీయులే. పల్నాటి వీరులు, బ్రహ్మనాయుడు, నాగమ్మ చెరొక వైపు నిలబడ్డారు. బాలచంద్రుడు, నరసింగుడు చెరొక వైపు పోరాడారు. వీళ్ళలో ఎవరూ విదేశీయులు కారు. వాళ్ళ యుద్ధాన్ని గురించి రాసిన కావ్యం దేశభక్తి కావ్యమైతే పాఠకులు ఎవరి వైపు నిలబడాలి. దాయ భాగం అడగడం మలిదేవుని తప్పా? "ఇద్దరు రాజులు ఏర్పడి రేని" "అవని లోపల నాజ్ఞలమరిక కాదు" అని యుద్ధాన్ని అనివార్యం చేసిన నాగమ్మ వాదం కేవలం రాజకీయ ఎత్తుగడ కాదా? అప్పటికి మన దేశంలో చప్పన్నారు దేశాలున్నాయి కదా! వీళ్ళ యుద్ధానికి మద్దతునిచ్చిన రాజ్యాలెన్ని? వాటన్నిటిని ఏకం చెయ్యడానికి నాగమ్మ ప్రయత్నించిందా? పలనాటి వీరచరిత్రలో దేశభక్తులు ఎవరు? దేశద్రోహులు ఎవరు?

గాంధీ, అంబేద్కర్, భగత్‌సింగ్, సీతారామరాజు, రాజా రామమోహన రాయ్, మహాదేవ గోవిందరనడే, లాలాలజపతిరాయ్, వివేకానంద, కందుకూరి, గిడుగు, గురజాడ, ఉన్నవ, గరిమెళ్ళ వంటి వాళ్ళను మనం దేశ భక్తులుగా, సంస్కర్తలుగా గుర్తిస్తున్నాం. పలనాటి వీరచరిత్రలో ఇలాంటి వాళ్ళున్నారా? పైన పేర్కొన్న వాళ్ళను మనం దాయ భాగం కోసం పోరాడిన వాళ్ళుగా కాక, మొత్తం దేశం కోసం తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసిన వాళ్ళుగా చూస్తున్నాం. అందువల్ల పలనాటి వీరచరిత్ర దేశభక్తి అనే ఆధునిక భావనకు ఈ అర్థంలో దేశభక్తి కావ్యం కాదు.

ప్రాచీన సాహిత్య చరిత్రలో స్థానిక జీవితాన్ని పుష్కలంగా చిత్రించిన కావ్యాలు రెండు. 1. క్రీడాభిరామం, 2. పలనాటి వీరచరిత్ర. నన్నయ్య అర్జునుణ్ణి గోదావరి తీరానికి పిలుచుకొచ్చి స్నానం చేయించినా, గోనబుద్ధా రెడ్డి, జానపదులు పాడుకునే రామాయణ కథల్ని రంగనాథ రామాయణంలో చేర్చినా అవి ఆనుషంగికాలు తప్ప ప్రధానాలు కావు. ఆ కథలన్నీ ఉత్తర భారత దేశంలో జరిగిన కథలు. అనువాద సాహిత్యానికి ప్రత్యామ్నాయంగా మంచిదో చెడ్డదో స్థానిక జీవితాన్ని చిత్రించడం, దానిని స్థానిక సాహితీ రూపంలో రాయడం దేశభక్తిగా గుర్తిస్తే పలనాటి వీరచరిత్ర దేశభక్తి కావ్యం అవుతుంది. స్థానికులు గానం చేసే స్థానిక చరిత్రను కావ్యంగా రాసి, స్థానికేతర ఇతి వృత్తాలతో నిండిన సాహిత్యాన్ని మన సాహిత్యంగా భావిస్తున్న సందర్భంలో మెప్పించడం దేశభక్తిగా భావిస్తే పలనాటి వీరచరిత్ర దేశభక్తి కావ్యమే.

అనువాద సాహిత్యం రాస్తేనే మహాకవిగా చలామణి కావడం వల్ల స్థానిక జీవితం సాహిత్యానికి దూరమై పోయింది. ఎక్కడో ఆముక్తమాల్యదలోనో, శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోనో, స్థానిక జీవితం శకలాలుగా దొరుకుతుంది. పదకొండో శతాబ్దం నుండి పదహేడో శతాబ్దం దాకా తెలుగు ప్రజలు ఎంత వైవిధ్యభరితమైన జీవితం గడిపి ఉంటారు! ఆ జీవితం నాటి సాహిత్యంలో ప్రతిబింబించిందా? లేదూ ఈ నేపథ్యంలో పలనాటి వీరచరిత్ర ఒక వేగుచుక్క, ఒక ప్రొద్దు పొడుపు. అది తెలుగు చుక్క, తెలుగు సాహితీ సూరీడు. యుద్ధమో, రక్తపాతమో, పెండ్లో, చావో, పౌరుషమో, పిరికితనమో, రాజనీతో, కుట్రో, వినోదమో, విలాసమో ఇవి ఈ నేలలో జరిగాయి. వీటిని పలనాటి వీరచరిత్ర ప్రతిబింబించింది. ఈ దృష్ట్యా పలనాటి వీరచరిత్ర పలనాటి దేశ భక్తి కావ్యమే. అయినా స్థానికేతర జీవితాన్ని నమూనాగా పెట్టుకుని ఆర్యీకృత సంస్కృతి కృత రూపంలో స్థానిక జీవిత పరిమాణాలను వర్ణించిందన్న స్పృహను కోల్పోరాదు.

## 9.5 ప్రాచీన తెలుగు సాహిత్యం - పలనాటి వీరచరిత్ర వైశిష్ట్యం:-

"దేశికవితా శబ్దమును అన్నిట సార్థకము చేసిన కావ్యములలోపల్నాటి వీరచరిత్ర మొదటిది'' అన్నారు పింగళి లక్ష్మీకాంతం. (పల్నాటి వీరచరిత్ర పీఠిక). పండిత కవిగా ప్రసిద్ధుడైన శ్రీనాథునికి ప్రజా కవిగా పేరు సంపాదించి పెట్టిన ఏకైక కావ్యం 'పల్నాటి వీరచరిత్ర'. "పలనాటి వీరచరిత్రముచే శ్రీనాథుడు అచ్చముగా ప్రజాకవియైనాడు'' అన్నారు జి. నాగయ్య (ద్విపద వాఙ్మయము - పు.80). తెలుగు వాళ్ళ పౌరుషానికి, తెలుగు వాళ్ళ బలహీనతలకు, బలానికీ, నిలువుటద్దం కావడం పలనాటి వీరచరిత్ర వైశిష్ట్యం. తెలుగు వాళ్ళకున్న చారిత్రక సాహిత్యం తక్కువ. పలనాటి వీరచరిత్రకు ముందు కాసె సర్వప్ప కవి రచించిన సిద్దేశ్వర చరిత్ర, (క్రీ॥శ॥ 1400) అంతకుముందు ఏకామ్రనాథుని రచన ప్రతాప చరిత్ర (క్రీ॥శ॥ 1369) మాత్రమే వచ్చాయి. అయితే సృజన దృష్టిలో చూచినప్పుడు, కళాదృక్పథంతో చూచినప్పుడు ఇవి పలనాటి వీరచరిత్ర ముందు నిలవవు. దీని తర్వాత వచ్చిన అన్నమాచార్య చరిత్ర - చిన్నన్న (క్రీ॥శ॥ 16 శ.) రఘునాథ నాయికాభ్యుదయము - విజయ రాఘవ నాయకుడు (క్రీ॥శ॥ 17 శ) వంటి రచనలు కూడా పాఠకాదరణకు అంతగా నోచుకోలేదు. తెలుగువాళ్ళు చారిత్రక జీవితాన్ని తెలుగువాళ్ళ ఛందస్సులో రచించిన ఏకైక గ్రంథం ఈ కావ్యం. తెలుగు ప్రజలు పాడుకుంటున్న పాటకు కావ్యరూపమివ్వడం, తర్వాతి కాలంలో అనేకులు పాడుకోవడానికి ఆధారం కావడం పలనాటి వీరచరిత్ర కావ్య వైశిష్ట్యం. రంగనాథ రామాయణంలో ప్రజలు పాడుకునే రామాయణ పాటలు కావ్య గౌరవం పొందినా, అది అనువాద కావ్యమే. బసవ పురాణ పండితారాధ్య చరిత్రలు సమకాలిక శివ కవుల చరిత్రలకు మహిమల్ని ఆపాదించాయి. పలనాటి వీరచరిత్ర చారిత్రక స్వభావాన్ని చంపుకోకుండా కావ్య కల్పనా శక్తికి మచ్చుతునకగా నిలిచింది. చరిత్ర వీరగాథా రూపం సంతరించుకోవడం ఈ కావ్య వైశిష్ట్యం. "ఆంధ్ర దేశాన్ని గూర్చి అనేకానేక చారిత్ర కాంశాలను అందించిన తొలి కవి శ్రీనాథుడే'' అన్నాడు డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం (శ్రీనాథ కవితా వైజయంతి - పు. 183). ఇందుకు ప్రధాన నిదర్శనం పలనాటి వీరచరిత్ర.

వస్తుపరంగా స్వతంత్రంగా నిలవటం, ఛందస్సు పరంగా దేశి ఛందస్సైన ద్విపదలో కూడా ప్రాసను వదులుకోవడం, భాషలో స్థానిక పదాలను పొదువుకోవడం పలనాటి వీరచరిత్ర కావ్య విశేషం.

> "శ్రీనాథుడనువాడ శివభక్తి పరుడ
> శాశ్వతం బైనట్టి సద్గ్రంథ మొకటి..............
> ............పలనాటి వీరచరిత
> జనులెల్ల భక్తిచే చదువుట కొరకు
> మంజరీ ద్విపదగా మన్నించి నేను
> చెప్పబూనితి వచః శ్రీమెరయంగ''

అని పలనాటి వీరచరిత్రను శాశ్వతమైనదిగా పేర్కొన్నాడు శ్రీనాథుడు. ఇందుకు కారణం ఇది అనువాదం కాకపోవటమే.

పలనాటి భారతంగా పేరుపడ్డ ఈ కావ్యం తెలుగు పాలకుల వాస్తవ రాజనీతికి, వాస్తవ పౌరుషానికి దర్పణం. తెలుగులో అరుదుగా ఉండే వీర రస ప్రధాన కావ్యాలలో పలనాటి వీరచరిత్ర అగ్రగామి. యుద్ధాన్ని కీర్తిస్తున్నా ఈ కావ్యంలో యుద్ధ వైముఖ్యం, శాంతికాముకత్వం కూడా ఉండడం విశేషం.

పగవృద్ధి బొందించు భష్టులె కాని
అణగింప నేర్పరు లవనిలో నరుడు.........
పోరుమంచిది కాదు భూమికెక్కడను
పాడౌను దేశంబు పగమించెనేని
ప్రజలెల్ల నసింయించి పారిపోవుదురు
బండారమునకును పైకంబు లేమి
రాణువంతయు రహిచెడి యుందు
కలహించి వెనుసటి కారవు లెల్ల
కదనంబులో బడు కథ వెల్లవినమె
పగపెరిగించుట భావ్యంబు గాదు

సాహిత్యంలో వైవిధ్యం పరిపాటి. జానపదులలో పుట్టి జానపదులలోనే నిలిచి పోయే సాహిత్యం; జానపదులు పాడుకునే కథలు కావ్యాలుగా పుట్టగా, కావ్యాలు జానపదుల గానంగా మారిపోయే సాహిత్యం; పండితులలో పుట్టి పండితులలోనే మిగిలి పోయే సాహిత్యం ఇలా అనేక రకాల సాహిత్యముంది. జానపదులలో పుట్టిన కథ కావ్యంగా రూపుదిద్దుకొని, అటు జానపదులకు, ఇటు నాగరికులకు ఆరాధమయి గ్రంథంగా కావ్యంగా నిలిచిపోవటం పలనాటి వీరచరిత్ర విశిష్టతలలో కెల్ల విశిష్టత.

తెలుగు నేల మీద జరిగిన నిర్దిష్ట చారిత్రక సంఘటనలు కావ్య రూపం ధరించడం ఈ కావ్య విశిష్టతకు పరాకాష్ట.

**మహాభారతం - పలనాటి వీరచరిత్ర:-**

పలనాటి భారతంగా పలనాటి వీరచరిత్ర ప్రసిద్ధి చెందింది. కవి మాత్రం దీనిని పలనాటి భాగవతంగా పేర్కొన్నాడు. భారతంలో అన్నదమ్ముల సంతానం రాజ్య భాగం కోసం యుద్ధం చేసుకోగా, పలనాటి వీరచరిత్రలో సవతి తల్లుల సంతానం రాజ్య భాగం కోసం యుద్ధం చేసుకున్నారు. మహాభారత కథకు, పలనాటి వీరచరిత్రకు మధ్య గల పోలికలను పింగళి లక్ష్మీకాంతం, జి. నాగయ్య విశ్లేషించారు.

| | మహాభారతం | పలనాటి వీరచరిత్ర |
|---|---|---|
| 1. | కౌరవ పాండవులు అన్నదమ్ముల బిడ్డలు | నలగామ మలిదేవులు సవతుల బిడ్డలు |
| 2. | దాయ భాగం గురించి జరిగిన యుద్ధం | అలాంటిదే |
| 3. | పాచికలతో ఆడిన మాయాజూదం | కోళ్ళ పోరు - మాయాజాలం |
| 4. | అరణ్య, అజ్ఞాత వాసాలు | మందలాది వలస |
| 5. | ఘోష యాత్ర | మందపోటు |
| 6. | రాయబారం విఫలం. శ్రీకృష్ణుని మీద విష ప్రయోగం | రాయబారం విఫలం. రాయబారి అలరాజు హత్య |

| | | |
|---|---|---|
| 7. | పాండవులకు శ్రీకృష్ణుని అండ | మంత్రిగానే అయినా మలిరాజుకు బ్రహ్మనాయుని అండ |
| 8. | కౌరవులకు శకుని తోడు | నలగామునికి నాగమ్మ తోడు |
| 9. | కురుక్షేత్రం - రణరంగం | కార్యమపూడి - రణరంగం |
| 10. | అభిమన్యుడు - బాలవీరుడు | బాలచంద్రుడు - బాలవీరుడు |
| 11. | అభిమన్యుని దీవించి పంపిన ఉత్తర | బాలచంద్రునికి వీర ఖడ్గమిచ్చిన మాంచాల |
| 12. | పాంచాల రాజులు భారత యుద్ధంలో పాల్గొనడం | కల్యాణ రాజులు పలనాటి యుద్ధంలో పాల్గొనటం |
| 13. | కురు రాజ్యం ధర్మ రాజుకు యుద్ధ జయలబ్ధి | హతశేషుడైన నలగామునికి రాజ్యప్రాప్తి. |

(జి. నాగయ్య - ద్విపద వాఙ్మయము, పు. 326 & 327)

"పలనాటి చరిత్ర యంతయు భారత చరిత్రకు కొద్దిపాటి ప్రతిబింబముగా చెప్పుదురు'' అన్నాడు పింగళి లక్ష్మీకాంతం.

ఈ పోలికలతో పాటు పలనాటి వీరచరిత్రలో మహాభారత ప్రసక్తి అనేక పర్యాయాలు వస్తుంది. పలనాటి యోధులకు భారత యోధులు ఆదర్శ పురుషులైనట్లు అర్థమౌతుంది. కొన్ని ఉదాహరణలు -

బ్రహ్మనాయుని కవి 'నీల వర్ణుడు'గా చెప్పడంలో శ్రీకృష్ణుడు స్ఫురిస్తాడు. ఆయన చాలాచోట్ల కృష్ణావతారంగా కీర్తింపబడ్డాడు. భట్టు నలగామ రాజు కొలువులో బ్రహ్మనాయుని 'ఆదినారాయణుడవతారమతడు' అని కీర్తిస్తాడు.

నాగమ్మ దాయ భాగమీయవద్దని చెబుతూ "పాండవులకు భూమి పాలిచ్చి పిదప కౌరవులేమైరి'' అని గుర్తు చేస్తుంది నలగామునికి. నలగామునికి కొలిమిగుండ్ల ప్రజలు యుద్ధం చేయవద్దని చెబుతూ "కౌరవ పాండవుల్ కలహంబొనర్చి కూలి చచ్చినయట్టకురు భూమి రీతి''ని గుర్తు చేశారు. ఐతాంబ దగ్గర బాలచంద్రుడు తనను తాను అనేక మంది పురాణ బాలయోధులతో పోల్చుకునే క్రమంలో

"సైంధవ వధవేళ సాహస స్ఫూర్తి - విజయుడు రణములో విహరించునట్లు'' విహరిస్తానన్నాడు. బ్రహ్మనాయుడు బాలచంద్రునికి యుద్ధంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుపుతూ -

"అర్జునంతవాడని చేయునపుడు - కర్ణుని రాకదగని భీతి నొంది 'బ్రతికిన శుభములు బడయంగవచ్చు అరదంబు మరలింపుమయ్య శ్రీకృష్ణ' అని విన్నపము చేసె నాశ్చర్యముగను - ఇతరులు నిలువంగనెట్లు జాలుదురు'' అని గుర్తు చేశాడు.

ఇవన్నీ కలిసి పురాణం చరిత్రకు ఆదర్శమై, చరిత్ర ఆర్యీకరణ లేదా సంస్కృతీకరణకు దారితీసే విధానాన్ని తెలుపుతాయి. పలనాటి వీరచరిత్రలో యుద్ధ విముఖులందరూ కౌరవ పాండవ యుద్ధాన్ని వినాశకారిగా భావింపగా, యుద్ధ ప్రియులు కురుక్షేత్ర వీరులను ఆదర్శప్రాయులుగా భావించడం గమనార్హం.

## 9.6 సారాంశం:-

ఈ పాఠంలో పలనాటి వీరచరిత్ర కర్తృత్వం, ఇతివృత్తం, రచనా వైశిష్ట్యం, దేశభక్తి అనే అంశాల వివరణ మాత్రమే గాక పలనాటి వీరచరిత్ర విశిష్టతను, పలనాటి వీరచరిత్రకు మహాభారతం కథకు గల పోలికలను నిరూపించడం కానవస్తుంది.

## 9.7 ప్రశ్నలు:-

1. పలనాటి వీరచరిత్ర కర్తృత్వాన్ని గురించి చర్చించండి.
2. పలనాటి వీరచరిత్రలోని ఇతివృత్తాన్ని పరిచయం చెయ్యండి.

3. పలనాటి వీరచరిత్రలో శ్రీనాథుడు రచించినట్లు భావింపబడుతున్న భాగాల కథను పరిచయం చెయ్యండి.
4. పలనాటి వీరచరిత్రలో ప్రతిబింబిస్తున్న సామాజిక జీవితాన్ని విశ్లేషించండి.
5. పలనాటి వీరచరిత్రలోని భావుకతా సౌందర్యాన్ని వీక్షించండి.
6. పలనాటి వీరచరిత్రలోని పాత్ర చిత్రణను గురించి రాయండి.
7. పలనాటి వీరచరిత్రలోని భాషా ఛందస్సులను గురించి రాయండి.
8. పలనాటి వీరచరిత్రకు మహాభారతంతో గల సాదృశ్యాలను చూపండి.
9. పలనాటి వీరచరిత్రకు ప్రాచీన తెలుగు సాహిత్యంలో గల వైశిష్ట్యాన్ని తెలపండి.
10. పలనాటి వీరచరిత్రను దేశభక్తి కావ్యంగా ఎలా పరిగణింపవచ్చో చర్చించండి.

## 9.8 ఆధార గ్రంథాలు:-

1. పలనాటి వీరచరిత్ర - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి ప్రచురణ
పరిష్కర్త - పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగు సాహిత్య చరిత్ర - కొర్లపాటి శ్రీరామమూర్తి
3. శ్రీనాథుడు - కొర్లపాటి శ్రీరామమూర్తి
4. ద్విపద వాఙ్మయము - జి. నాగయ్య
5. తెలుగు సాహిత్య సమీక్ష మొదటి భాగం - జి. నాగయ్య
6. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటం - ఆరుద్ర
7. తెలుగు వీరగాథా కవిత్వము, మొదటి సంపుటం - తంగిరాల వెంకట సుబ్బారావు
8. పలనాటి వీరచరిత్ర, పీఠిక - అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరుడు
9. శ్రీనాథ కవితా వైజయంతి - పి. సుమతీ నరేంద్ర (సంపాదిక)

**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

పాఠం - 10.1

# శ్రీనాథుని చాటువుల విశిష్టత - అందువ్యక్తమగు సామాజిక, రాజకీయ విశేషాలు

**ముఖ్యాంశాలు:-**


**10.1.0 లక్ష్యం**

**10.1.1 ఉపోద్ఘాతం**

**10.1.2 చాటువుల పుట్టు పూర్వోత్తరాలు**

**10.1.3 సాంఘిక చరిత్ర (లేక) సామాజిక విషయాలు**

**10.1.4 కుల వ్యవస్థ - వర్ణ వ్యవస్థ**

**10.1.5 రాజరికానికి సంబంధించిన విశేషాలు**

**10.1.6 వైయక్తిక అభిరుచులు**

**10.1.7 స్త్రీల వర్ణన**

**10.1.8 మత విషయం**

**10.1.9 ఉపసంహారం**

**10.1.10 ప్రశ్నలు**

**10.1.11 ఆధార గ్రంథాలు**


## 10.1.0 లక్ష్యం:-

శ్రీనాథుని పేరుతో అనేక చాటువులు ప్రచారంలో ఉన్నాయి. 'శృంగార శ్రీనాథము' అనే గ్రంథంలో వేటూరి ప్రభాకర శాస్త్రి గారు శ్రీనాథుని చాటువుల్ని పేర్కొన్నారు. కానీ ఇందులో శ్రీనాథునివి ఏవో, కానివేవో శ్రీనాథకవితా సమీక్ష (చిలుకూరి పాపయ్య శాస్త్రి)లో నిష్కర్షగా చెప్పబడింది. లభ్యమైన శ్రీనాథుని చాటువుల్లోని విశిష్టతను పేర్కొంటూ, ఆ కాలం నాటి సామాజిక, రాజకీయ విషయాలు ఆ చాటువుల్లో ప్రతిబింబించిన విధానాన్ని తెల్పడమే ఈ వ్యాస లక్ష్యం.

## 10.1.1 ఉపోద్ఘాతము:-

ప్రాచీనాంధ్ర కవుల్లో శ్రీనాథుని కొక ప్రత్యేక స్థానం ఉంది. ఆ మహాకవికి సంస్కృతమంటే ఎంత గౌరవమో తెలుగంటే అంత ప్రాణం. ఆకవికి ప్రౌఢ ప్రబంధాలను వ్రాసి పండితుల్ని మెప్పించే సామర్థ్యం ఉన్నట్లే, సామాన్యుల్ని మరపించి మురిపించే రచనలు చేసే సామర్థ్యం ఉంది. అతడెంత రసికుడో అంతకు మించిన భక్తుడు. ఎన్నో పదవులు రుచులు చూచిన వాడైనా పామరులతో సమానంగా కష్ట సుఖాలు పంచుకున్నాడు శ్రీనాథుడు. జీవితాంతం విద్యార్థిగా, విద్వాంసుడుగా, విద్యాధికారిగా వెలిగిపోయిన

శ్రీనాథుడు అప్పుడప్పుడు వేళాకోళం కోసం, రసిక పోషకుల సంతృప్తి కోసం, మనో వికార విషాదాలను మరచిపోవడం కోసం అలవోకగా ఏవో కొన్ని చాటు పద్యాలు చెప్పాడు. వీరి చాటు పద్యాల్లో కనిపించినంత సాంఘిక, రాజకీయ చిత్రణ ఇతరుల చాటువుల్లో కన్పించదు.

## 10.1.2 చాటువుల పుట్టు పూర్వోత్తరాలు:-

ఒక భోగి చేత సత్కరింపబడినప్పుడో, ఒక లోభి చేత సీత్కరింపబడినపుడో, అందమైన దృశ్యం కనపడినపుడో, హృదయం గాయపడ్డప్పుడో, అనిష్టం తొంగి చూచినపుడో, హాస్యం, లాస్యం చేసినపుడో అనేక సందర్భాల్లో చిత్రమైన చిత్త వృత్తుల్లో ఛందో రూపంలో జుమ్మని చిమ్ముకొని వచ్చే కవితా రూపాలే ఈ చాటు పద్యాలు. చాటువుల్లో ప్రధానాంశం అప్రయత్న సిద్ధత. అందువల్లనే అందాన్ని యినుమడించిడెందాన్ని రసమయం చేస్తుంది.

తెలుగులో యీ చాటువెప్పుడు పుట్టిందో చెప్పటం కష్టం. ఊహించుకోవాల్సిందే. తెలుగు లిఖిత సాహిత్యంలోనే ఆది కవి ఎవరో, ఆదికావ్యం ఏదో నిర్ణయించటం దుష్కరం అవుతున్నప్పుడు ఇక చాటు కవిత్వంలో 'ఇది తొలి చాటువు' అని కాని, 'ఇతడు తొలి చాటు కవి' అని కాని నిర్ధారించటం అసంభవం.

మనకు లభ్యమవుతున్న సమాచారం ప్రకారం వేములవాడ భీమకవి తొలి చాటుకవిగా చెప్పవచ్చును. ఆయన ఉద్దండ చాటు కవిగా, శాపానుగ్రహ పటువుగా పేరు పొందాడు. భీమకవి యుగంలో శాపానుగ్రహ సాధనమై, ఆర్షశక్తి మహితమై, విశ్వ శ్రేయో దృష్టితో సాగిన తెలుగు చాటువు శ్రీనాథుని యుగంలో రాశిలోనూ, రూప సౌష్ఠవంలోనూ, వైవిధ్యంలోనూ కొంత పుష్టి సాధించినా ఒక మెట్టు క్రిందికి దిగి శృంగార, హాస్య, ప్రణవంగాను సంఘ జీవన చిత్రణ పరంగాను పరిణమించటం ప్రారంభమైనట్లు కన్పిస్తుంది. నన్నయ, తిక్కన, బద్దెన, మంచెన, సోమన మొదలగు అనేకానేకులను అధిగమించి ముందుకు సాగినపుడు శ్రీనాథుల వారొస్తారు.

## 10.1.3 సాంఘిక చరిత్ర (లేక) సామాజిక విషయాలు:-

సాంఘిక చరిత్ర అంటే ప్రధానంగా ప్రజల చరిత్ర. అది సామాన్యుల సొంత కథ. సాంఘిక చరిత్రలో ప్రధానంగా నాలుగంశాలుంటాయి. మొదటిది అందరికి అవసరమైన నీరు - కూడు - గుడ్డ - నివాసాలకు సంబంధించిన ప్రయాస. రెండవది ప్రజా జీవనం. సాఫీగా సాగడానికి ఏర్పరచుకున్న వర్ణ వ్యవస్థ - కుల వృత్తి వ్యవస్థ. ఇక మూడవది సంఘంలోని కొందరివ్యక్తుల ప్రవృత్తులు. నాల్గవది రాచరికానికి సంబంధించిన విశేషాలు.

1. మనిషి మనుగడకు 'నీరు' చాలా అవసరం. నీరే ప్రాణాధారము. నీటి పద్ధతి ఈ నాడు ఎలా ఉందో శ్రీనాథుని కాలంలోనూ అక్కడక్కడ అట్లాగే ఉండేది. ఆనాడు పలనాడును దర్శించి శ్రీనాథుడు అక్కడ నీరు లభించకపోయేటప్పటికి శ్రీనాథుడు చెప్పిన చాటువిది.

   "సిరిగలవానికి ఁజెల్లును
   దరుణులు పదియాఱు వేలఁదగఁబెండ్లాడన్
   దిరిపెమున కిద్దరాండ్రా
   పరమేశాక గంగవిడుము పార్వతి చాలున్" (చా॥మ॥ పుట.126)

   ఇందు 'సిరిగలవాడు' అనే పదానికి శ్రీమన్నారాయణుడనీ, భాగ్యవంతుడనీ రెండర్థాలు. అట్లే 'గంగ' అనే పదానికి గంగానది, జలము అను రెండర్థాలున్నాయి.

   శ్రీ మహా విష్ణువుకు పదియారు వేల మంది భార్యలు తగుదురు కానీ బిచ్చమెత్తుకొను నీకు ఇద్దరు భార్య లెందుకు స్వామి! పార్వతి చాలులే, ఆ గంగను వదిలిపెట్టు. భాగ్యవంతునికి ఎంత మంది భార్యలు ఉన్నా బాధ లేదు.

బిచ్చగానికి ఒక భార్యయే ఎక్కువ.

పరమేశ్వరా! నీవు గంగాధరుడవు. నీ జటాజూటంలోని గంగమ్మను (జలమును) కొంచెం వదిలి పెట్టి మా ప్రాణాలు కాపాడు స్వామీ! గొంతు ఎండి నాలుక పిడచ కట్టుకొని పోతున్నదని అర్థము. ఇది వెటకారం కాదు. అమాయకుల 'ఆస్తిక్యాన్ని' కాలరాచటం తప్పని కాలకంఠునికి హెచ్చరిక కూడా.

"అంగడి యూర లేదు" అనే చాటువులో కూడా 'నీటికై భంగపడంగ బాల్పడు కృపావరు లెవ్వరు లేరు' అని శ్రీనాథుడు వర్ణించాడు.

2. నీరు తర్వాత మనిషికి అవసరమైంది <u>ఆహారం</u>. ఈ ఆహారం ప్రాంతాన్ని బట్టి, ఆర్థికస్తోమత బట్టి, వ్యక్తి అభిరుచులను బట్టి మారుతూ ఉంటుంది. రాకపోకల సాధనాలు అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లో దొరికే వస్తువులతోనే అన్ని సర్దుకోవడం. అలనాడు పలనాటి సీమలో జొన్న ముఖ్యమైన పంట. అక్కడి వారికి

"జొన్నకలి కొన్న యంబలి
జొన్నన్నము జొన్న పిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగ పలనాటనున్న ప్రజలందరకున్"

"జొన్నకలి, జొన్నయంబలి, జొన్నన్నం, జొన్న పిసరు రోజూ ఉండే ఆహారం. చింత చిగురు, బచ్చలికూర కలిపిన కూడు వారికి విందు భోజనం లాంటిది. ఉన్నవారు, లేనివారు జొన్న కూడుతో తృప్తిపడటం చూసి శ్రీనాథుడు 'కుసుమాస్త్రుండైన జొన్న కూడే కుడుచున్' అని విసురు విసిరాడు.

3. శ్రీనాథుడు తన పర్యటనలో వరి అన్నానికి మొగం వాచిపోయాడు. ఇంక పలనాటి జన జీవనాన్ని విపులంగా, నిశితంగా పరిశీలించాడు. స్త్రీ, పురుషులిరువుర్ని వర్ణించాడు.

"రసికుడు పోవడు పల్నా
డె సగంగా రంభయైన నేకులెవడుకున్
వసుధేశుడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్న కూడె కుడుచున్"

అనే పద్యంలో నిజాన్ని ఒప్పుకున్నాడు. శ్రీనాథుని దృష్టిలోని రసికుడు పెద్దలు సంపాదించింది తింటూ, తగలేస్తూ సోమరిగా తిరిగే వాళ్లయి ఉండాలి. అంతా ఎవరి పని వారు చేసుకుంటుంటే ఈ రసికుణ్ణెవరు పల్కరిస్తారు? అందుకే పల్నాటికి రసికుడు పోవడన్నాడు. పాపం శ్రీనాథుని పర్యటనలో అన్నీ అడ్డంకులే.

4. అంగడి ఉన్న ఊరే కన్పించదు. నచ్చిన అన్నం దొరకదు. పరిశుభ్రత కన్పించదు. ఇంపైన స్త్రీలు లేరు. వనాలు లేవు సరే నీళ్లు దొరకనే దొరకవు. దాతలసలే కానరాలేదు. ఇదంతా తలచుకొని

"అంగడి యూరలేదు । వరియన్నములేదు । శుచిత్వమేమిలే
దంగనలింపు లేరు । ప్రియమైన వనంబులు లేవు । నీటికై
భంగపడంగ బాల్పడు కృపాపకులెవ్వరు లేరు । దాత లె
న్నంగను సున్న । పలినాటికి మాటికి పోవ । నేటికిన్" అని బాధపడతాడు. అంతే కాదు

5. 'ప్సల్ల సరోజ నేత్ర! యలవూ తనచన్నుల చేదుద్రావినాఁ

డల్లదవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెద వేల? తింత్రిణీ
పల్లవ యుక్త మౌనుడుకు బచ్చలి శాకము జొన్న కూటితో
మెల్లన నొక్క ముద్ద దిగమ్రింగుము నీపస కాననయ్యెడిన్" (చా॥మ॥ 127 పుట)

ఒక చోట శ్రీనాథునికి జొన్ననం పెట్టారు. అందులో చింత చిగురు కలిపి వండిన వేడి బచ్చలికూర పప్పు వడ్డించారు. అది చల్లార లేదు. "చేయిగాల నోరుగాల" - ముద్ద లోపలికి పోదు. గొంతు మండుతున్నది. ఆ సంధర్భంలో చెప్పిన పద్యమిది.

"ఓయి కృష్ణయ్యా! ఆనాడు పూతన స్తనములలోని కులకూట విషాన్ని త్రాగినావని గర్వపడవద్దు. కారుచిచ్చు మ్రింగానని పొంగి పోకు, ఇదిగో ఈ జొన్నన్నంలో ఉడుకు బచ్చలి శాకము కలుపుకొని ఒక్కముద్ద - ఒక్కముద్ద చాలును మ్రింగు. నీ బండారం బయట పడుతుంది. అంటూ శ్రీనాథుడు నిందా గర్భితంగా వ్యాజనింద చేశాడు.

6. పల్నాటి దృశ్యాలు ఈ నాటికీ కొన్ని చోట్ల మనకు కనబడుతుంటాయి. ఒక్క చుక్క కూడా నీరు దొరకక అలమటించే సమయంలో నాగులేటిని చూచి పొంగిపోయిన మన మహాకవి నోట ఈ పద్యం జాలువారింది.

"చిన్నచిన్న రాళ్లా చిల్లర దేవుళ్లా
నాగు లేటి నీళ్లా, నాపరాళ్లా
సజ్జ జొన్న కూళ్లా, సర్పంబులును తేళ్లా
పల్లెనాటి సీమ పల్లెటూళ్లా"

పాపం! ఇక్కడ కూడా ఆయనకు మళ్లీ జొన్నకూడే గుర్తుకు వచ్చింది. అవును మరి! "ద్రాక్షా పానక ఖండ శర్కరలతో రంభా ఫలశ్రేణితో గోక్షీరంబులతోడ మండె గలతో క్రొన్నేతితో పప్పుతో నక్షయ్యంబగు నేరుబ్రాల కలమాహారంబు" తిన్న రాజసం గదా శ్రీనాథునిది. ఆయనకు జొన్న కూటి రుచి ఎట్లా నచ్చుతుంది.

7. గుడ్డిలో మెల్ల అన్నట్లు ఏ పుణ్యాత్మురాలో ఆయనకింత సన్న బియ్యంతో వండిన అన్నం పెట్టినట్లుంది. ఆ మాత్రానికే

"సడి నూక లేని బియ్యము
వడబోసిన నెయ్యి బుడమనరువున్ బెరుగున్
గడుపేర్మి మాకు నొసగిన
అడిగొప్పుల నంబి చేడె నడిగితి ననుమీ!"

అని మరో సందర్భంలో, ఆనందంతో ఆమెను పరామర్శించాడు.

8. అరవలవంటా వార్పు ఆంధ్రుల్ని అదరగొడుతుంది. తెలుగు వారి వంటకంలో 'పప్పు' ప్రధానమైతే తమిళుల భోజనంలో 'చారు' ముఖ్యం. ఈ వంట వార్పుకు జడిసిపోయి

"తొలుతనే వడ్డింత్రు దొడ్డ మిర్యపుఁజారు
చెవులలోఁ బొగ వెళ్లి చిమ్మిరేఁగ
పలుదెఱంగుల తోడఁబచ్చళ్లు చవి గొన్న
బ్రహ్మరంధ్రము దాకఁబారు నావ
వేపాకు నెండించి వేసిన పొళ్ళను

గంచాన గాంచిన గ్రుక్కు వచ్చు"

అని నమస్కారం పెట్టటం ఒక సన్నివేశం.

9. "గ్రామము చేత నుండి పరికల్పిత ధాన్యము నింట నుండి శ్రీ
రామకటాక్ష వీక్షణ పరంపరచే ౘగడ తేటె౦గాక మా
రామయ మంత్రి భోజన పరాక్రమమేమని చెప్పవచ్చునా
స్వామి యెఱుంగు దక్కబళచాతురి తాళ ఫల ప్రమాణమున్" (చా॥మ॥ పుట. 137)

రామయ మంత్రి గ్రామ కరణం. మంచి తిండి పుష్టి కలవాడు. శ్రీనాథునికి బావ వరుసవాడు. ఆ సాపాటు రాయని భోజన పాండిత్యమిందు చమత్కార సహితంగా వర్ణితమైంది.

లోకంలో తిండిపోతులెందరో ఉండవచ్చు. దండిగా కడుపు నిండ పట్టింపవచ్చు. కాని తాటి పండంత ముద్దలు చేసి నోటి లోనికి జొప్పించుట చెప్పుకోదగిన గొప్పదనం. ఇచ్చట రామాయామాత్యుని భోజన పాండిత్య మంతా ఝటిత్యర్థ స్ఫోరకాలైన పదాలతో సవిశేషంగా సరస చమత్కార సమున్మేషంగా చెప్పబడింది.

శ్రీనాథుని పల్నాటి పర్యాటనానుభవాల వల్ల పల్నాటి భౌగోళిక చరిత్ర, నాటి సాంఘిక చరిత్ర తెలుసుకోవడానికి అవకాశం ఉంది. కారెంపూడి పుణ్య క్షేత్రంగా ఎట్లా విలసిల్లిందో తెలుస్తుంది. ప్రజల ఆహార విషయాలు, పనిపాట్లు వ్యవసాయ విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. చరిత్ర నిర్మాణానికి అనువైన ఇట్టి రచనలున్న తెలుగు సాహిత్యం ఎంతైనా పొగడదగింది.

10. ఇక కర్ణాట ప్రాంతాన్ని సందర్శించినప్పుడయితే వెల్లుల్లి, తిలపిష్టం, చల్లా అంబలి మొదలైనవి సామాన్య అహార నియమాలని శ్రీనాథుడు గుర్తించాడు.

"కుల్లాయుంచితిఁగోక సుట్టితి మహా కూర్పాసముందొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త విడ్డంపఁగాఁ
జల్లాయంబలిఁద్రావితిన్ రుచులు దోసంబంచు జోనాడితిన్
తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ! దయలేదా నేను శ్రీనాథుడన్" (చా॥మ॥ పుట.119)

శ్రీనాథ కవి సార్వభౌముడు కన్నడ దేశాన్ని సంచరిస్తూ అక్కడి భోజనాది సౌకర్యాలు తనకు సరిపడని సందర్భంలో చెప్పిన చాటు పద్యమిది.

ఇక్కడ 'నేను శ్రీనాథుడన్' అనుచో 'శ్రీనాథు'డను పదానికి నేను పుట్టు భోగిని, మహా రాజుల పంక్తిలో బంగారు పాత్రల్లో భుజించిన వాడను, మహా కావ్య నిర్మాతను, ముత్యాల పల్లకీల్లో ఊరేగినవాడను, ప్రభువుల సభల్లో సముచిత సత్కారాలను పొందినవాడను" - ఇత్యాది ఆత్మాభిమాన పూర్వకమైన అతిశయార్థం జ్యోతకమగుచున్నది. ఇది ఉత్కర్షకు ఉదాహరణం.

11. ఇక ఆర్థికస్థోమత బట్టి పరిశీలిస్తే శ్రీనాథుని చాటువుల్లో 'పేదవారి భోజనం' కూడా లేకపోలేదు.

"మూతిని ముట్టగా ముద్దకు ముద్దకు గూటి లోపలన్
బాతిక పాలు సైకతం పచ్చడి కొంచెము యూది నుండియు
చూత మటన్నలేదు"

కాని కలవారి ఇండ్లలో పప్పన్నం, పరమాన్నం, నేయి, పచ్చళ్లు, పానకాలు, బొబ్బట్లు, ఊరగాయలు వగైరాలున్నట్లు 'అపూ

పసూప సప్తాంగ భంజనులారా' పద్యం సాక్ష్యం పలుకుతుంది.

12. తిండి తర్వాత మనిషికి అవసరమయింది మాన సంరక్షణ కోసం వస్త్రం. ఈ వస్త్రధారణ కూడ ప్రాంతం బట్టి, ఆర్థికస్తోమత బట్టి, అభిరుచుల బట్టి మారుతూ ఉంటుంది. గొంగలి కప్పు, మేలు పచ్చడాలు, వంకర పాగాలు, మైల కోకలు, నడుమ వంగిన కత్తులు, మైసూరి వారి వేషాలు, కుళ్ళా పెట్టుకోవడం, కోక చుట్టడం, మహాకూర్పాసం తొడగడం వారి గాంభీర్యానికి వన్నె చేకూర్చే అంశాలు.

శ్రీనాథుడు పురుషుల వేషం కన్నా స్త్రీల వేషాన్ని విరివిగా చాటువుల్లో వర్ణించాడు. ఆనాటి స్త్రీలు మల్లియ చీర, చెంగాలి చీర, పాల వెల్లువ వంటి చీర, కుసుమంబద్దిన చీర, సన్నపు చీర, మడి చీరలు కట్టేవారు. ఇక ఆనాటి రవికలలో ఎఱరైక, యమునారైక, కావి రైక, కుట్టినీరైక, చందురు కాలి రైకలుండేవి. చీర, రైకలే కాకుండా ఆనాటి స్త్రీలు 'వన్నెలగాగరలు' అంటే రకరకాల రంగుల పావడాలు కూడా అందంగా ధరించే వారు. పైటల్లో కూడ నాచుపైట, దిగజారిన పైట, బిరుసు పయ్యెద చెంగు, ఓరపయ్యెద చెంగు, మైజాఱు కోయలున్నట్లే కుచ్చుళ్ళలో కూడ పటువారు సందెడు కుచ్చెళ్లు, జిగిమీఱు కుచ్చెళ్లు, మొగాళ్ళ జీరాడు చీర, దుంగులు జాఱెడు కుచ్చెళ్లు ఆనాటి అతివలు మెచ్చుకొనే అలంకరణలు బొట్టులలో కూడ అగిసాకు బొట్టు, కుంకమ చుక్కబొట్టు, విభూది బొట్టు, సింధూరపు బొట్టు, కస్తూరి సొగబొట్టు, భూతి రేఖలు, తిరుచూర్ణం ఉన్నాయి. ఆభరణాలలో గెలుకు మట్టెలు, మంజీరాలు, కనకపుటందియలు, మొలనూలు, పచ్చపూసలు, హారాలు, కమ్మలు, ముక్కుకనత్తు, అరవీసపు మంగళ సూత్రము వంటివి కూడా కనిపిస్తాయి.

13. కూడు గుడ్డల తరువాత మనిషికి 'నీడ' అవసరం. శ్రీనాథుని చాటువుల్లో 'ఆకాశహార్మ్య'ల వర్ణనలు లేవు. పడమటి ప్రాంతంలో సుద్దపైన పోసి కట్టిన వాటిని 'మిద్దె'లనడం పరిపాటి. ఇతరత్రా 'మిద్దె'లంటే 'భవంతు'లని ప్రసిద్ధి. ఈ సోద్యాన్ని చూసి శ్రీనాథుడు

"మిద్దెలు మిద్దెలన్న మన మేడల కంటెను సొంపు నించి బల్
నిద్దపు సౌధజాలముల లీల వెలుంగు నటంచు నెంచినే
నద్దిర! మోసపోతి సకలాభరణమ్ముల మర్చికస్తురిన్
దిద్ద కచంబు కోసిన సతింబురుడించును మిద్దెలిచ్చటన్"

పల్నాటి సీమలోని మిద్దెలు శ్రీనాథునికి అలంకారాలన్నీ అమర్చి కస్తూరి నుదుటన దిద్ది వేణిని కోసి వేసిన వనితల్లాగా కనిపించాయి. స్థావర జంగమాలు కూడా ఆయన కంటికి విలాసినులుగానే భాసించటం విశేషం.

14. పల్నాటి ప్రాంతానికి ఎవరైను పెద్దలు వస్తే, గ్రామాధికారులైనా, ఇతర భాగ్యవంతులైనా, శుచి, శుభ్రం కోసం అన్ని ఖర్చులు తాము భరిస్తూ గ్రామపురోహితునింట వసతి కల్పిస్తారు. శ్రీనాథుని పల్నాటి పర్యటనలో ఆయనకొక పురోహితుని యింట విడిది ఏర్పాటు చేశారు. కాని శ్రీనాథుడు ఆ యింటి పరిసరాలు, అపరిశుభ్రతను భరించలేకపోయాడు. తన మనస్సులోని భావాన్ని

"దోసెడు కొంపలోఁబసుల త్రొక్కిడి మంచము దూడరేణమున్
బాసిన వంటకంబు పసి బాలుర శౌచము విస్తరాకులున్
మాసిన గుడ్డలున్ దలకుమాసిన ముండలు వంటకుండలున్
రానెడు కట్టెలుందలపరాదు పురోహితులుంటి కొత్యంబుల్"

అని బయట పెట్టాడు. అసలే దోసెడు కొంప. అందులో ఒక ప్రక్క పాడిగేదెను కట్టివేశారు. అది త్రొక్కి త్రొక్కి ఇల్లంతా కట్టుమట్టు చేసింది. ఒక ప్రక్క కుక్కి మంచము. ఒక ప్రక్క దూడరేణము. ఇటు పళ్లాల్లో పాసిపోయిన అన్నపుకరుళ్ళు, అటు పసిపిల్లల మల మూత్రముల దుర్గంధం. ఈ మూల మాసిన గుడ్డలు. ఆ మూల తలకు మాసిన ముండలు. మరొక మూల పొయ్యి మీద వంటకుండలు. పొయ్యి క్రింద రుసెడు కట్టెలు. అవి మండవు. పచ్చివేమో! ఇట్లున్నది ఆ యింటి పరిస్థితి. రోత పుట్టించు ఈ వస్తు సముదాయమంతా ఆ దోసెడు కొంపలో ఏ విధంగా ఇమిడి ఉందో అటువంటి ఇంటిలో కాపురమెట్లు చేస్తున్నారో భగవంతునికే ఎరుక. ఇందు 'దోసెడు కొంప, మాసిన గుడ్డలు, తలకుమాసిన ముండలు, వంటకుండలు, రాసెడ కట్టెలు' మొదలగు పదాలలో చక్కని చమత్కారమున్నది. పద్యమందలి ప్రతి పదం జుగుప్సను కలిగిస్తూ ఆ యిల్లు నానా బీభత్సంగా ఉన్నదని స్ఫురింపచేస్తున్నది.

15. "గొంగడి మేలు పచ్చడము కుంపటి నల్లులు కుక్కి మంచమున్
జెంగట వాయు తైలముల జీర్ణపు మందులు నుల్లిపాయలున్
మ్రగిట వంట కట్టియల మోపులు దోమలు చీఁపోతులున్
రంగ! వివేకికీ మసరరాజ్యము కాపుర మెంత రోతరా" (చా॥మ॥ 128 పుట)

ఈ చాటు పద్యం మసర రాజ్యమందలి గృహాల వికృత స్వరూపాన్ని వెల్లడిస్తున్నది. ఇందలి కాపురమెంత రోతగా ఉంటుందో కవి స్వానుభవంతో చెప్పాడు.

## 10.1.4 కుల వ్యవస్థ - వర్ణ వ్యవస్థ:-

ప్రజా జీవనం సాఫీగా సాగడానికి ఏర్పరచిన కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ చాటువులెలా ఉన్నాయో చూద్దాం. శ్రీనాథుని చాటువుల్లో రాచ కన్యలు, బ్రాహ్మణుల లోని యోగి భామలు, వైశ్యులు, తదితరుల వర్ణాలున్నాయి. ఆయా కులాల కంటే వృత్తులకు ప్రాధాన్యాన్నిస్తూ కాలం గడుపుతున్న కాంతామణులే శ్రీనాథుని చాటువుల్లో ఎక్కువ కలవు. అంగడి వీధిలో రసికుల్ని వూరించే విధంగా పండ్లమ్మే జంగం వారి పిన్నది ఎల్లా ఉందంటే:

"అంగడి వీధి ఁబల్లవుల కాసగ మామిడి పండ్లు లమ్ముచున్
జంగము వారి చిన్నది పిసాళి తనంబున ఁజూచెఁబోనిశా
తాంగజ బాణ కైరవసి తాంబుజ మత్తచకోరబాలసా
రంగతటిన్నికాయముల రంతులు సేసెడు కాఁడి చూపులన్" (చా॥మ॥ పుట.123)

శ్రీనాథుడు అంగడిలో రసాల ఫలాన్ని అమ్ముతున్న రమణీలలామ రామణీయకున్ని వర్ణించే సందర్భంలోనిదీ పద్యం.

ఆ చిన్నది అంగడి పై కూర్చుండి సంగడి కాండ్రకు నోరూరునట్లు తియ్యని తియ్యని పండ్లమ్ముతూ ఒయ్యారంగా చూస్తున్నది. ఆ వగలాడి వాడి చూపులు, మన్మథ బాణాలను, కలువలను, కమలాలను, మత్త చకోరాలను, లేడి పిల్లలను, మెరపు తీగెలను తిరస్కరిస్తున్నవి.

అట్లాగే ఆవం దగ్గర కూర్చున్న "అందాల కుమ్మరి బాలిక, తమలపాకులమ్మే తరుణి, నూలు వడికే 'నూతన యౌవన' సాలె భామ, ఏకులు వడికే రంభ లాంటి రామ, మొలలోతు తటాకంలో నిలబడి బట్టలుతికే చాకలి 'పిన్నది' వృత్తి వ్యవస్థను నిలుపుకున్నవారే. ఈ వృత్తులే కాకుండా శ్రీనాథుని చాటువుల్లో చాలా చోట్ల 'వేశ్యా జీవనం' కనిపిస్తుంది. వారి సుఖ జీవనాన్ని చూసి శ్రీనాథుడంతటి వాడు కూడా

"కవితల్ సెప్పిన ఁబాడనేర్చిన వృథా కష్టంబెయీ భోగపుం
జవరాండ్రేకద భాగ్యశాలినులు" అన్నాడు.

## 10.1.5 రాజరికానికి సంబంధించిన విశేషాలు:-

శ్రీనాథుని చాటువుల్లో సామాన్య ప్రజానీకానికి రాజులకు సంబంధించిన ప్రత్యేక వృత్తాంతులేవీ కన్పించవు. కాని రాజులు పండిత ప్రియులు. కవిశేఖర మిత్రులు. బేషజాలకు పోకుండా కవి పండితులతో కలిసి తిరగడం, తినడం, విహరించటం వారికి అలవాటు. ఈ విషయాన్నే శ్రీనాథుడు

17. కాశికా విశ్వేశుఁగలిసె వీరారెడ్డి
 రాత్నంబరంబు లేరా యడిచ్చు
రంభ గూడెఁదెలుంగు రాయరాహుత్తుండు
 కస్తూరికే రాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సన్న మంత్రి మఱి హేమ
 పాత్రాన్నమెవ్వని పంక్తిఁగలదు
కైలాస గిరిఁబండె మైలార విభుఁడేఁసి
 దినవెచ్చ మేరాజు తేర్పఁగలఁ డు
భాస్కరుఁడు మున్నె దేవుని పాలికరిగెఁ
గలియుగంబుననిఁక నుండగ్రష్టమనుచు
దివిజ కవి వరుగుండియల్ దిగ్గురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁడమర పురికి (చా॥మ॥ పుట.138)

జీవిత చరమ సంధ్యాసమయాన శ్రీనాథుడు చెప్పిన పద్యమిది. 'వీరభద్రా రెడ్డి విశ్వేశ్వరునిలో కలిసినాడు, రత్నాంబరాల్ని నాకు ఇక ఏ రాజు బహుకరిస్తాడు. తెలుగు రాయుడు రంభతో కూడినాడు, కస్తూరికి ఏ రాజును ప్రస్తుతిస్తాను. భాస్కరాదులు కూడా దేవుని పాలికి వెళ్లిపోయారు. ఇక కలియుగంలో ఉండటం కష్టం. దివిజ కవి వరు గుండియలు దిగ్గురు మనగా ఇదిగో నేను స్వర్గానికి వెళ్తున్నాను. అని చెప్పుకోటానికి బదులు శ్రీనాథుడే అరుగుచున్నాడు శ్రీనాథుడు మరపురికి అని చెప్పుకున్నాడు. సమస్త రాజ భోగాలు అనుభవించి ఈ నాటికీ దరిద్ర దశ అనుభవిస్తున్న నేను అని పరమార్థం.

18. శ్రీనాథుని ఆదరించి, పోషించిన మహా సామ్రాజ్యాలు కూలిపోయాయి. రాజ భోగాలనుభవించిన శ్రీనాథుడు విధి విశాన జీవిత సంధ్యా సమయంలో దైన్యాన్ని అనుభవించాడు. అవసాన దశలో భూమీశ్వరులను గాక భూమిని నమ్ముకొన్నా ఫలితం దక్కలేదు. ఈ క్రింది చాటు పద్యం శ్రీనాథుని దైన్య స్థితిని చక్కగా వ్యక్తం చేస్తున్నది.

"కవి రాజు కంఠంబు కౌగిలించెను గదా
 పురవీధి నెదురెండ బొగడ దండ
ఆంధ్ర నైషధ కర్త యంఘ్రి యుగ్మంబున
 దగిలి యుండెను గదా నిగళ యుగము
వీరభద్రా రెడ్డి విద్వాంసు ముంజేత
 వియ్యమందెను గదా వెదురు గొడియ
సార్వభౌముని భుజా స్తంభ మెక్కెను గదా
 నగరి వాకిట నుండు నల్ల గుండు

కృష్ణవేణమ్మ గొని పోయె నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయె తిలలు పెసలు
బొడ్డు పల్లెను గొడ్డేతి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేడు నూర్లు"

శ్రీనాథుని జీవిత చరమ దశలో రెడ్డి రాజులు పోయి, ఒడ్డె రాజులు వచ్చారు. రాసిక్యం తెలియని వారు కవి పండితులంటే ఆదరణ లేని వారు కావటం వల్ల శ్రీనాథుడు ఆర్థిక యిబ్బందులకు లోనై, అమరావతి దగ్గర కృష్ణానదిలో ఉన్న బొడ్డుపల్లి లంకను కౌలుకు తీసుకున్నాడు. కృష్ణ వరదలు, పంటలు పండకపోవడం, పిట్టలు తినిపోవడం వల్ల ఏడు నూర్ల టంకాలు కౌలు చెల్లించ లేకపోయాడు. ఆ దశలో శిక్ష వేశారు. చేతికి వెదురు గొడియ తగిలించడం, నగరి వాకిట నుండే నల్ల గుండును భుజాలకెక్కించడం, పాదాలకు సంకెళ్ల బిగించడం, ఎదురెండలో పొగడ దండ వేయించడం చేశారు. అది ఆనాటి శిక్షావిధానం.

19. శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయలను (1423 - 46) సందర్శించడానికి విజయ నగరానికి వెళ్లిన కాలం (1428 - 38) ప్రాంతం. విజయనగరమని పేరు గాంచిన విద్యా నగరాన్ని శ్రీనాథుడు సందర్శించాడు. వినుకొండ వల్లభ రాయుని స్నేహితుడైన ముమ్మకవిని దర్శించాడు. విద్యా నగర పాలకుడైన ప్రౌఢ దేవరాయల దర్శనం చేయించమని అడిగాడు. ఆ అడగటంలో కూడా గడుసుదనమూ, లౌక్యము ఉంది. దక్షిణాధీశుడైన ప్రౌఢ దేవరాయల రాజ్య విస్తరణ వల్ల రాణ్మహేంద్ర వర పాలకులు వేమ, వీరభద్రారెడ్ల పాలనకు ప్రమాదం సంభవించింది. ఏదో రూపంలో వారిని నిలబెట్టెందుకు ప్రయాణం కట్టిన శ్రీనాథుల వారికి రాజ దర్శనం దుర్లభమైంది. కన్నడ రాజ్యలక్ష్మిని ఉద్దేశించి చదివే వారి మనసు ద్రవించేలా చాటువు చెప్పారు.

"పంపా విరూపాక్ష బహు జటా జూటికా
  రన్వధ ప్రసవ సౌరభ్యములకు,
తుంగభద్రా సముత్తుంగ వీచీ ఘటా
  గంభీర ఘుమఘుమారంభములకు,
కళసాపుర ప్రాంత కదళీ వనాంతర
  ద్రాక్షాలతా ఫల స్తబకములకు,
కర్ణాట కామినీ కర్ణహాటక రత్న
  తాటంక యుగ ధాళ ధళ్యములకు,
నిర్నిబంధ నిబంధమైనెనయు కవిత
తెలుగునను సంస్కృతంబున బలుక నేర్తు
ప్రౌఢ దేవేంద్ర రాయ భూపాలవరుని
సమ్ము ఖమ్మునదయజూడు ముమ్మకవి" (చా॥మ॥ పుట.108)

విజయనగర రాజధాని చుట్టుప్రక్కలున్న ప్రకృతి రామణీకత వలె మనోహరంగా తన కవిత్వముంటుందని 'ప్రౌఢ దేవేంద్ర రామ భూపాలవరుని సమ్ముఖమ్మునదయ చూడమని' ముమ్ము కవిని ప్రార్థిస్తాడు 'శ్రీనాథుడు'.

20. రెడ్డి రాజులకు ఆస్థాన కవియైన శ్రీనాథుడు రెడ్డి రాజులకు బద్ధవైరియైన పద్మనాయక రాజగు సింగ భూపాలుని ఇట్లా కీర్తిస్తాడు.

సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావు సింగ జనపాలునకే
యుర్విం జెల్లును, దక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే (చా॥మ॥ పుట.117)

'సర్వజ్ఞుడనే బిరుద నామం శివునికే చెల్లుతుంది. సింగ భూపాలునికి కూడా చెల్లుతుంది. వీరిరువురను గాక మరొకరిని సర్వజ్ఞుడనటం కుక్కను కుంజరమనుటయే.

21. ప్రౌఢరాయల ఆస్థానంలో ఉన్న అరుణ గిరినాథుడు కలిశాడు. ఈయనను గౌడ డిండిమ భట్టు అని పిలుస్తారు. కవి సార్వభౌమ బిరుదు ఉంది. ఈయనతోనే తన పోరాటం.

మింకేమి బిరుదులున్నాయని డిండిమ భట్టు శ్రీనాథుడ్ని అడిగాడు. మాటకారియైన శ్రీనాథుడు చమత్కారంగా సమాధానం చెప్పాడు.

"తరువున గాండివంబిడడె ధర్మరాజు నాన గిరీటి? యేనువా
క్సర సిజనేత్ర నానతి విచారము చొప్పున గర్వ హీనతన్
మరల తెనుంగు భూమి కసమానగతిన్ గొనిపోవువాడ, నే
బిరుదులు నొరివాగుకడ బెట్టితి, సత్కవి సార్వభౌముడన్"

ఈ చాటు పద్యం శ్రీనాథుల వారి మనోదర్పణం వంటిది. సౌమ్యంగా చెబుతూ, వినయంగా మాట్లాడుతూ, గడుసుగా భావాన్ని వక్తీకరించారు.

బిరుదులదేమున్నదిలే? అంటూనే తాను కూడా "సత్కవి సార్వభౌముడన్ అన్నారు".

22. ఎంత కాలానికీ రాజ దర్శనం దొరకలేదు. విసుగెత్తింది. చివరకు ధైర్యం చేసి, దక్షిణాధీశునకు లేఖ వ్రాశాడు. ఆ చాటువు సమర భేరీ నినాదం వంటిది. ఆంధ్రసాహిత్య పౌరుషానికో ఆయుధం వంటిది. మానసిక శాస్త్ర విశ్లేషణకో మచ్చు తునక వంటిది.

"డంబు సూపి ధరాతలంబు పై తిరుగాడు
కవి మీద గాని నాకవచమేయ
దుష్ప్ర యోగంబుల దొరకని చెప్పెడు
కవి శిరస్సు గాని కాలు చాప
సంగీత సాహిత్య సరస విద్యల నేర్పు
కవుల రొమ్ముల గాని కాల్చి విడువ
చదివి చెప్పగ నేర్చి సభ యందు విలసిల్లు
కవినోరుగాని వ్రక్కలు గదన్న
దంటకవులకు బలువైన యింటి మగడ
కవుల వాదంబు విన వేడ్కగల్గెనేని
నన్ను బిలిడింపు మాస్థాన సన్నిధికిని
లక్షణోపేంద్ర! ప్రౌఢ రాయక్షితీంద్ర!

తెలుగు కవి సవాలు దక్షిణాధీశుని గొంతులో పచ్చి వెలగకాయ అయింది. తప్పలేదు. ఆహ్వానించారు. వాదం జరిగింది. గౌడ డిండిమభట్టు ఓడిపోయాడు. శ్రీనాథుడు అతని కంచుఢక్క పగులగొట్టించారు. అతనికున్న కవి సార్వభౌమ బిరుదు తీసుకున్నారు. మాట వరుసకు సత్కవి సార్వభౌముడనని అన్న కవిరాజు, కవి సార్వభౌముడుగా బిరుదునందుకున్నాడు.

23. ప్రౌఢ దేవరాయల ఆస్థానం ఆశ్చర్యపోయింది. దిగ్భ్రాంతి చెందింది. కవి సార్వభౌమ శ్రీనాథుల వారు లౌకికంగా ఇట్లా అన్నారు.

"జననాథోత్తమా! దేవరాయనృపతీ! చక్రేశ! శ్రీవత్సలాం
చన సంకాశ! మహా ప్రభావ! హరి దక్షాదక్ష! నా బోటికిన్
కు నృపస్తోత్ర సముద్భవంబయిన వాగ్దోషంబు శాంతంబుగా
కనక స్నానము చేసి గాక పొగడంగా శక్యమే దేవరన్!"

తెలివిగా అడిగి ప్రౌఢ దేవరాయల ముత్యాల శాలలో కనకాభిషేకం చేయించుకున్నాడు.

ఇంతకు ముందు ఎందరినో క్షుద్ర భూపతులను స్తోత్రం చేసి నా వాణి దోష భూయిష్ఠమైంది. ఇప్పుడు కనకాభిషేకం సలిపిననేగాని పరిశుద్ధురాలు కాదు. అప్పుడు కాని "జననాథోత్తముడవు", "శ్రీమహా విష్ణు స్వరూపు"డవైన నిన్ను నేను స్తోత్రం చేయజాలను. ఈ విధంగా "కర్ణాటక్షితి పాల మౌక్తిక సభా గారాంతరా కల్పిత స్వర్ణ స్నాన" కుతూహలము భంగ్యంతరంగా ప్రకటింపబడటం రమణీయం.

24. శ్రీనాథుడు విజయ నగరం నుండి రాచకొండ వెళ్లారు. ఈ విధంగా వెలమ ప్రభువుల వద్దకు వెళ్లటం రెండవ పర్యాయం. రాచకొండలో సింగ భూపాలుడు రాజ్యం చేస్తున్నాడు. సింగ భూపాలుడు నిండు కొలువులో ఉండగా, కొలువు కూటమిలో కాలు పెట్టి, శ్రీనాథుడు ఈ క్రింది పద్యాన్ని చెప్పారు.

"దీనారటంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాల శాల
పగుల గొట్టించి తుద్భట వివాద ప్రౌఢి
గౌడ డిండిమ భట్టు కంచు ఢక్క
చంద్ర భూష క్రియా శక్తి రాయల యొద్ద
పాదుకొల్పితి సార్వభౌమ బిరుదు"

ఈ పద్యంలోని నాలుగు పాదాలలో మూడు పాదాలు దక్షిణాధీశు దర్బారులో తాను సాధించినవి చెప్పారు. అవన్నీ ఈ మధ్య కాలంలో జరిగినవి. నాలుగవ చరణంలో తన కృతులన్నిటిలోకి ప్రౌఢంగా ఉండే శృంగార నైషధాన్ని నిలిపారు. శ్రీహర్షుని నైషధానికి తాను శృంగారం అలది అలంకరించారు. పాండతీ ప్రకర్షకు ప్రతిబింబమైన యీ రచన సామాన్యమైంది కాదు. నైషధం విద్వదౌషధం కదా!

"పలుకు తోడై తాంధ్ర భాషా మహాకావ్య
నైషధ గ్రంథ సందర్భముననుు" - అన్నారు.

గొప్పగొప్ప వాళ్లే తనను గౌరవించారు. కాని సర్వజ్ఞ సింగ భూపాలుడ్ని మెప్పించటం సామాన్య విషయము కాదు.

ఓ సరస్వతీ! రావు సింగ మహీపాలుడు ధీవిశాలుడు. వారి కొలువులో నీవు నెలకొని ఉన్నావు. తల్లీ నన్నెలా కాపాడుతావో! అమ్మా! శారదాంబా! అంటూ సమ్మోహనంగా చెప్పాడు. ఆ పద్య భాగం చూడండి.

"ఎటుల మెప్పించెదో నన్ను నింక మీద
రావు సింగమహీపాలు ధీవిశాలు
నిండు కొలువున నెలకొని యుండి నీవు
సరస సద్గుణ నికురంబ శారదాంబ!"

ఈ పద్యంలో తన ఇతర గ్రంథాలను గాని, రెడ్డి రాజులను గాని చెప్పలేదు.

కాకతీయుల కాలం నుండి ఈనాటి వరకు రెడ్డి, వెలమల కక్షలు చల్లారలేదు. ఆ విషయం కూలంకషంగా తెలిసిన శ్రీనాథుడు కావాలనే చెప్పలేదు. రాజనీతి పారంగుతుడైన శ్రీనాథునకు ఇలాంటివన్నీ గోలీలాటలే. గోరుముద్దలే!

## 10.1.6 వైయక్తిక అభిరుచులు:-

ఈ అభిరుచుల విషయంలో పెద్దా చిన్నా అనే అంతరువు కలవారు లేనివారు అనే తేడాలుండవు. వేశ్యా ప్రియత్వమన్నది ఆనాటి వ్యవస్థలో గౌరవానికి చిహ్నం. రసికత్వానికి పరాకాష్ఠ. 'చేతిలో' చెయ్యేసి సంకేత స్థలం 'మరిమరి' గుర్తు చేసి అమావాస్య రాత్రి వేళల్లో మాట నిలుపుకోలేని మగువను శ్రీనాథుడు మనసారా

25. "హా సురత తండ్రి కళానిధీ! యెందువోయితే
రాజమహేంద్ర వీధి ‹గవిరాజు నగున్ గికురించి"

అని తిట్టుకున్నాడు. అంతేకాదు అవసరానికి దగ్గర చేరిన వేశ్యల్ని గుర్తుంచుకోవడం, కుశల ప్రశ్నలడగడం, ఔపచారికం కూడా. ఈ విషయాన్నే

26. "గుడిమీది క్రోతి తోడను
గుడిలోపల నంబి వారి కోడలితోడన్
నడి వీధి లంజ తోడన్
నడిగొప్పుల హోరుగాలి నడిగితిననుమీ" స్పష్టం చేస్తుంది.

వారకాంతల వ్యవహారం మాత్రం కాదు. వారి వల్ల వ్యవహరించే వ్యాధులు, వైద్యాల వర్ణన కూడా చాటువుల్లో కనిపిస్తాయి.

'నగముతోలె డుమేను సగము చేసెను గదా' అనే పద్యపాదం. ఉలివిరి చెక్కతో ఔషధం, పత్తెంగా రొట్టె, గాలి ఆడని ప్రదేశంలో మంచం మీద పడుకోవడం వంటివి సుఖ రోగాదుల వైద్యం కూడా.

కలవారి ఇళ్లల్లోను, హోదాతో కాలం గడిపేవారి ఇళ్లల్లో గుట్టు చప్పుడుగా సాగే వ్యవహారం కూడా శ్రీనాథుని చాటువుల్లో చోటు చేసుకుంది. అగ్గి కోసం వచ్చి అడియేన్ దాసోహమ్మంటు నమస్కరించిన పడతిపై ఒక జియ్యరుస్వామి చేసిన అత్యాచారం 'ఇంగల మంచు వచ్చి' అనే చాటువులో కనిపిస్తుంది.

27. శ్రీనాథునికి నచ్చిన ప్రదేశం 'కుందు గడ్డ'.

"మందరాద్రిసములు మానవులందరు
చందమామకూన అందుముకులు
కందులేని మౌక్తికంబులు జొన్నలు
కుందనపు చెడ్డ 'కుందుగడ్డ'"

ఇక ఆడపిల్లల తీరు తెన్నులు,

28. "మేత గరిపిల్ల పోరున మేకపిల్ల
పారుబోతు తనంబునన్ బందిపిల్ల
ఎల్ల పనులను జరుపంగఁ బల్లిపిల్ల
అందమున కోతి పిల్లయా అరవ పిల్ల"

అరవ దేశంలో తాను చూచిన ఒక అరవ పిల్లను బొమ్మ గీచినట్లు వర్ణించి, కడుపుబ్బనవ్వించాడు. వారి వ్యంగ్యానికిదో మచ్చుతునక.

29. శ్రీనాథుని ప్రయాణంలో అనుభవించిన కష్టాలను ఏకరువు పెట్టాడు. గురజాల సమీపంలోని పులిపాడు గ్రామంలో తనకు జరిగిన అనాదరానికి కోపించి

"ఊరువ్యాఘ్ర నగర మురగంబు కరణంబు
కాపు కపివరుండు, కసవు నేడు
గుంపుగాగని నిచట గురజాల సీమలో
నోగు లెల్ల గూడిరొక్కచోట"

## 10.1.7 స్త్రీల వర్ణన:-

ఆడవాళ్ల అందాలను అరమరికలు లేకుండా పరిశీలించి, వర్ణించటంలో శ్రీనాథుడు వెనుకాడలేదు. సంతత శివార్చనా శీలుడైన కవి రాజు యిలాంటి వర్ణనల వల్ల స్త్రీలోలుడనే మాట ఉంది. ఉదాహరణకు

వాలగు కన్నుదోయి, బిగివట్రువ గుబ్బలు, కారు చీకటిం
జాల హసించుకొప్పుజిగి, సారసము న్నగుమోము గల్గునా
బాలిక (గూరికమ్ము కొన బట్టలు నేసెడు వానికిచ్చె, హా
సాలెత గాదురా కుసుమ సాయకు పట్టపుదంతి! యింతియే! (చా॥మ॥ పుట.133)

వాల్గన్నులు, లికుచ కుచములు, వినీల కుంతలములు, సరోజ సదృశ వదనం కల ఈ లలనకు అనురూప భర్త లభించలేదు. ఇది యింతి కాదు. పంచ బాణుని పట్టపుదంతి ఈ విధంగా పద్యము నందు మాధుర్య సాకుమార్యాదులు వెల్లివిరుస్తున్నాయి.

"పొచ్చెంబింతయులేని హంస నడతోఁబొల్పొందు లే నవ్వుతోఁ
బచ్చల్దాపిన కుల్కు ముంగరలతో బాగైన కెమ్మోవితో
నచ్చంబైన ముసుంగు వెట్టి చెలితో నామంటలే యాడుచున్
వచ్చెంబో కుచ కుంభముల్ గదలఁగా మమాక్షితా నీళ్ళకున్" (చా॥మ॥ పుట. 124)

ఇది మృదు మధుర పద సంపదతో కూడిన ఒక చక్కని చాటువు. కలవరము లేని కలహంస గమనంతో మధురమైన మందహాసంతో పచ్చరముంగరతో పసందైన కెమ్మోవితో అచ్చమైన మేలి ముసుగు అల్లినాడగా కుచ కుంభములు కదలాడగా ఆ అందమైన కన్నుల అమ్మాయి నెచ్చలితో ఆ ముచ్చటలే చెప్తూ నీలాటి రేవునకు వచ్చింది. అచ్చమైన పల్లెటూరి పిల్ల నీళ్ళకు వచ్చినట్లే ఉంది.

32. శ్రీనాథుని చాటువుల్లో మోతాదు మించిన శృంగారం మాత్రమే కాదు, మురిపించే కుటుంబ చిత్రణం కూడా కనిపిస్తుంది. పల్నాటి సీమలో ఒక ఇల్లాలి ఇంటి వైనం -

"పువ్వులు కొప్పు నందుఱిమి ముందుగఁగొనసి యాడు చుండగా
జెవ్వనఁజంగసాఁచి యొక చేతను రోఁకలి పూని యొయ్యనన్
నవ్వు ముఖంబుతోడఁదను నందనుఁబాడు చునాథుఁజూచుచున్
సువ్వియ సువ్వి యంచు నొక సుందరి బియ్యముదం దంబె ముంగిటన్"

వంట వండితే ఢోకాలేదు గాని, ఆ ఏడు కరువు కాటకాలు. తిండి లేక కటకటలాడే రోజులు. ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. మగవారికి వ్యవసాయం పనుల్లేవు. మగడు ఊరు చుట్టివచ్చాడు. ఉస్సురుమని గోడకాని కూర్చున్నాడు. ముత్తైదురుకదా అంటూ పువ్వులిచ్చింది. ఇక ధాన్యందంచాలి. అంచేత పని తొందరగా తెమలడం కోసం చంటి పిల్లవాణ్ణి నేలమీద పడుకో పెట్టింది. నవ్వు మొగంతో భర్తని, పాటపాడుతూ పిల్లవాణ్ణి, అలసట తీరేలా 'సువ్వి సువ్వి' అంటూ ధాన్యం దంచిందట. భార్య వయ్యారానికి భర్త, పాటకు పిల్లవాడు మురిసిపోయారు. ఎవరికీ ఇబ్బంది లేక ధాన్యందంచడం పూర్తి అయింది. ఆ తరువాత 'వంట' చేసి బిడ్డను, భర్తను ఆ ఇల్లాలు మురిపించి ఉంటుంది.

## 10.1.8 మత విషయం:-

33. మత విషయం ఆలోచిస్తే శ్రీనాథుని చాటువుల్లో వైష్ణవులు, శైవులు, స్మార్తులు కనిపిస్తారు.

"ఇంగల మంచు" అనే పద్యంలో శఠగోప జియ్యరు.

"దుయాదాల్పలె" పద్యంలో విశ్వేశ్వరార్చనా వేళలో గిరిగిండ్లు వాయించే 'జంగమాంగన'.

"మిాగాళ్ల జీరాడు" పద్యంలో మడి చీరతో తిరుచూర్ణం ధరించిన సాతాని

34. శ్రీనాథుని చాటువుల్లో పలనాటి సీమలు, పలివెల, గురజాల, కడిదిపురం రాచవీడులు, రాజమహేంద్ర వరం, విద్యానగరం, సింహాద్రి, కడప మండలం 'కందు గడ్డ' ల ప్రస్తావన ఉంది. అలాగే 'కాసల నాటి' వారు వేసారి వారు, వెల్గోటి వారు కనిపిస్తారు.

35. తీయని తెలుగు మీద తెలుగు వారంతా పులకించే పద్యం చెప్పారు.

జనని సంస్కృతం బుసకల భాషలకును
దేశ భాషలందు తెనుగు లెస్స
జగతి తల్లి కంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె?

## 10.1.9 ఉపసంహారం:-

శ్రీనాథుని చాటు పద్యాలు దాదాపు 150 వరకున్నాయి. వీటిలో సగ భాగం స్త్రీలోలత్వాన్ని చూపుతుంటాయి. అయితే ఎన్నో చాటువులు వారు చెప్పి ఉంటారు. కాలగతిలో పోయినవి పోగా, రసికులు తమకు నచ్చిన వాటిని నాలుకల పై నిలుపుకొని ఉంటారు. కొన్ని తాటాకుల మీద కెక్కాయి. మరికొన్ని వారి పేరు మీద ఎవరైనా చెప్పి ఉంటారు.

నిజాయితీ గల కవి అవటం వల్ల శ్రీనాథుడు తన ఆస్తిక భావాన్ని ప్రకటించినంత నిబ్బరంతోనూ కొన్ని విపరీత పరిస్థితుల్లో పెల్లుబికిన తన నాస్తిక భావాల్ని వెల్లడించగలిగాడు.

ఏమయినా తెలుగు కవుల్లో శ్రీనాథునికి సాటిరాదగిన వారు లేరు. తన సుఖదుఃఖాల్ని, లాభనష్టాల్ని, మానవమానాల్ని తనకు తారసపడిన వారిని, తాను చూచిన దృశ్యాల్ని యథాతథంగా వర్ణించటంలో అతనికతడే సాటి.

## 10.1.10 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని చాటువుల్లో వ్యక్తమగు సామాజిక విశేషాలను వెల్లడించండి.
2. శ్రీనాథుని చాటువుల్లో కాననగు రాచరికానికి సంబంధించి వాటిని వివరించండి.

## 10.1.11 ఆధార గ్రంథాలు:-


1. శ్రీనాథుల వారి చాటువులు - పోలవరపు కోటేశ్వరరావు
2. వ్యాసకదంబం - ఆచార్య కె. సర్వోత్తమరావు


**ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 10.2

# శ్రీనాథుని ఉదంతము - వ్యక్తిత్వము (లేక) ఆత్మీయత

**ముఖ్యాంశాలు:-**

- **10.2.0** లక్ష్యం
- **10.2.1** ఉపోద్ఘాతం
- **10.2.2** శ్రీనాథుని ఉదంతము - శ్రీనాథుని జీవిత యాత్రాదర్శిని
- **10.2.3** శ్రీనాథునిలోని కొన్ని విలక్షణ లక్షణాలు
- **10.2.4** వ్యక్తిత్వము (లేక) ఆత్మీయత
- **10.2.5** ఉపసంహారము
- **10.2.6** ప్రశ్నలు
- **10.2.7** ఆధార గ్రంథాలు

## 10.2.0 లక్ష్యం:-

శ్రీనాథుని యుగాన్ని సంధి యుగమని అంటారు. అంటే కొన్ని ఉత్తమ లక్షణాలతో ఒక మహాయుగం కొంతకాలం నడిచి ఆగిపోయిన తర్వాత మరి కొంతకాలానికి మరికొన్ని ఉత్తమ భిన్న లక్షణాలతో ఇరొక మహాయుగం ఆవిర్భవింపనుండగా ఆ రెంటికి నడుమ చెప్పదగిన స్వతంత్ర లక్షణాలేవియూ లేక అవ్యవస్థితంగా, అప్రధానంగా ఉన్న కాల వ్యవధికి Age of Transition అని పేరు. భారత కవులు పురాణానువాదానికి దారి చూపిన గురువులు. శ్రీనాథుడు సంస్కృత కావ్యానువాదానికి దారి చూపిన గురువు. కాబట్టి సంస్కృత ఆంధ్రీకరణ చరిత్రలో భారత కవులకున్నంత ప్రాధాన్యము శ్రీనాథునకున్నది. అట్టి శ్రీనాథుని చరిత్ర ఏమిటో తెలుసుకొనటంతో పాటు, వాని వ్యక్తిత్వమెట్టిదో కూడా తెలుసుకోవడం ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

## 10.2.1 ఉపోద్ఘాతము:-

శ్రీనాథుడు అనవద్య హృద్య కవితా శ్రీనాథుడు. సమకాలిక సాహిత్య సామంత ప్రభువులకు సర్వజ్ఞ సార్వభౌముడు. '<u>ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులేరీ నాటి కాలంబునన్</u>' అని ప్రశంసలందు కొన్న సకల విద్యాసనాథుడు. శైవాగా మాటవుల్లో మరుగుపడియున్న శైవ సంప్రదాయలతలను కావ్య వనములందు అంటుద్రొక్కిన ఈశ్వరార్చన కళాశీలుడు. కర్ణాటక్షితి పాల మౌక్తిక సభాగారాంతరా కల్పిత స్వర్ణ స్నాన జగత్ప్రసిద్ధుడు.

ఈ బ్రాహ్మీదత్త వరప్రసాదుని లౌకిక జీవితములోని, సాహిత్య జీవితములోని అనేకాంశాలు సాహిత్యానుష్ఠాన నిష్ఠా గరిష్ఠుల గోష్ఠులలో పెత్తనాలు చేసినవి. శ్రీనాథుని జనన కాలమేది? జనన ప్రదేశమేది? శ్రీనాథుడు కన్నడుడా? శృంగారియా? క్రీడాభిరామ పలనాటి చరిత్రము లితని కృతులే అగునా? భీమ ఖండమాంధ్రీకరణమా? శ్రీనాథ పోతన బావ మరదులా? శ్రీనాథుని దీనారటంకాల తీర్థమాడించిన కర్ణాటక్షితి పాలుడెవడు? శ్రీనాథుడు దర్శించిన సర్వజ్ఞ సింగ భూపాలుడెవడు? మొదలైన విషయాలు పరిశోధకులను కూడా తికమక పెట్టి వాదోపవాదాలకు రంగ స్థలములైన కొన్ని ప్రధానాంశాలు. కాబట్టి ఈ విషయాలన్నీ కూలంకషంగా తెలియాలంటే శ్రీనాథుని ఉదంతం ముందుగా తెలుసుకోవాలి.

## 10.2.2 శ్రీనాథునియుదంతము:-

కవి సార్వభౌమునిది సుప్రసిద్ధ విద్వద్వంశం. ఆయన 'పుణ్యాచార'యైన భీమాంబకును, విద్యారాజీవభుడైన 'మారయ'కు గారామైన తనూజుడు. కమల నాభామాత్యునకు ముద్దుల మనుమడు. నాసికేతోపాఖ్యాన కర్త దగ్గుపల్లి దుగ్గన, అతని అన్నలగు తిప్పిన, పోతనలు ఆయన బావమరుదులు. భీమేశ్వర పురాణ కృతి పతి బెండపూడి అన్నమంత్రి ఆతని బంధువు.

(1) **జన్మ స్థానం:-** శ్రీనాథుని జన్మ స్థానం కాల్పట్టణం. బహుశ మచిలీ పట్టణానికి దగ్గర్లో ఉన్న కాళీ పట్టణం కావచ్చు. లేకపోతే దానికి సమీపంలో ఉన్న 'కలపటం' అవటానికి ఆస్కారం లేకపోలేదు. ఆయన భరద్వాజస గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు, అధ్వర్యు వేద శాఖాధీతి నిష్ణాతుడు.

(2) **బాల్యం:-** శ్రీనాథుని జనన కాలం 1360గా భావించవచ్చు. అతడు 8 సంవత్సరముల ప్రాయమున ఉపనయన సంస్కారమొంది 12 సంవత్సరాల వరకును తన 'అనుగుందాత', 'కవితా విద్యాధరుడు'ననగు కమలనాభుని యొద్ద విద్యాభ్యాసం చేశాడు. ఆ కవితా పితామహుడు బాల శ్రీనాథునికి కవితా ప్రథాతయైనాడు. "చిన్నారి పొన్నారి చిరుత కూకటి'' వయస్సులో శ్రీనాథుడు ఐతరేయ బ్రాహ్మణము, భారతాశ్వమేధ పర్వము, మార్కండేయ పురాణము, హరి వంశము వీనిలో నున్న మరుత్తరాట్చరిత్రము నందు మగ్నమానుడైనాడు. ఫలితంగా మరుత్తరాట్చరిత్ర కావ్యమావిర్భవించింది.

(3) **యౌవన దశ:-** సంస్కృత ప్రాకృత శౌర సేన్యాది భాషలను నేర్పు మీద నేర్చిన శ్రీనాథుడు 18 సంవత్సరాల నూనూగు మీసాల నూత్న యౌవనమున హాల చక్రవర్తి సమకూర్చిన శృంగార రస సమంచితమగు గాథా సప్తశతిని తెలుగునకు తెచ్చాడు. అటుపై పతంజలి మహాభాష్యాన్ని అభ్యసించి న్యాయ వైశేషిక దర్శనాలను అవలోకించి, చతుర్వేదాలను, స్మృతులను, అష్టాదశ పురాణాలను, ఆగమాలను, సాంఖ్య యోగ సిద్ధాంతాలను అవలోడించి 'పూర్వకవి ముఖ్య విరచితా పూర్వ కావ్య భావ రస సుధా చర్వణ ప్రౌఢత'ను పొందాడు.

(4) **రాజాశ్రయము:-** నిండు జవ్వనంలో ఉన్న శ్రీనాథుడు కొండవీటిని పరిపాలిస్తున్న పెదకోమటి వేమ భూపాలుని మంత్రి యగు మామిడి సింగన అంతరంగాన్ని ఎరిగిన వాడై భట్ట హర్షుని నైషధీయ చరితాన్ని ఆంధ్ర భాషలో సంతరించాడు. రసజ్ఞతా సూచకంగా తన గ్రంథానికి శృంగార నైషధమని పేరు పెట్టాడు. ఆ కాలమందే రాయని భాస్కరుడు కూడా శ్రీనాథుని ఆహ్వానించి ఘనంగా సత్కరించాడు.

కొంతకాలానికి శ్రీనాథుడు కాంచీ నగరానికేతెంచాడు. స్నేహితుడైన అవచి తిప్పయ్య శెట్టిని దర్శించాడు. ప్రియ మిత్రుని చూచి తిప్పయ్య హర్ష ప్రపుల్ల హృదయుడైనాడు. స్వాగతమొసగి సత్కరించాడు. విద్వత్ప్రియుడగుటచే శృంగార నైషధము నావించి ఆనంద విస్ఫారితనేత్రుడైనాడు. మామిడి సింగనామాత్యుని మహా భాగ్యానికి మురిసిపోయాడు. ఆ సకల విద్యా సనాథుని గ్రంథ మొకదాన్ని తాను కృతి పొందాలని ఉత్సాహపడ్డాడు.

ఆగమ జ్ఞాన నిధివి । తత్త్వార్థ ఖనివి
బహుపురాణజ్ఞుడవు । శుభ । భవ్యమతివి
బాల సఖుడవు । శైవ ప్రబంధమొకటి
అవధరింపుము నా పేర నంకితముగ (హర॥1.12)

అని శ్రీనాథుని అభ్యర్థించాడు. శ్రీనాథుడును తన విన్నపాన్ని మన్నించాడు. హర విలాసాన్ని రచించి ఆతని కంకితమొనరించాడు.

(5) **విద్యాధికారి:-** అనంతరం శ్రీనాథుడు పెదకోమటి వేముని అపార ఆదరాభిమానాలచే సత్కృతుడై అనన్య సామాన్యమైన

విద్యాధికారి పదమున సుప్రతిష్ఠితుడై లబ్ధ ప్రతిష్ఠుడైనాడు. గృహ రాజ సౌధంలో వేమ భూపాలునకు అఖిల పురాణ విద్యాగమములను వినిపించాడు. ప్రభువులు గావించిన వివిధ దాన ధర్మాలకు 'శాసన కృతి' కర్తగ నుండి "విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీ వేమభూపతేః" అని అవిరళ ప్రఖ్యాతి బడసినాడు. విద్యాధికారిగా నున్న శ్రీనాథుడు అనేక కర్తవ్యాలను నిర్వర్తించాడు.

1. పెదకోమటి వేముడు సలిపిన దానములకు శాసనాలు రచించుట
2. రాజాస్థానాల్లో విరామ సమయాల యందు విద్యాగోష్ఠులను జరిపించుట
3. రాజ సభకేతెంచెడి విద్వాంసుల విద్వత్త సత్తను పరీక్షించి యథోచితంగా బహుమతులనిప్పించుట
4. ప్రభువు పఠించు గ్రంథాలలోని కఠిన ఘట్టాలకు అర్థ విచారణ గావించి స్పష్టార్థ సమన్వయమొనరించుట
5. రాజ రచితములగు గ్రంథాలలోని దోషాలను పరిశీలించి అతనికి సహాయపడుట
6. ప్రభువొసగు సమస్యలను పూరించెడి కవుల పద్యాలలోని గుణ గణములు విదితము చేయుట
7. తానును స్వయంగా సమస్యా పూరణములనొనరించుట
8. ప్రాచీనాథునాతన గ్రంథసముదాయాలకు వ్రాయసగాండ్రచే ప్రత్యంతరములు వ్రాయించుట. వానిని పరీక్షించుట.
9. పుస్తక భాండాగార సంరక్షణ మొనరించుట
10. రాజునకు, పండితులకు ఆవశ్యకములగు గ్రంథాలను తెప్పించి, ఇప్పించు చుండుట.
11. రాజ పోషణమునందు గల పాఠశాలలను పరీక్షించి వానిలో పండితులను నియమించి వారికి తగిన వేతనములనిప్పించుట

**(6) కాశీ యాత్ర:-** 1409వ సంవత్సరంలో శ్రీనాథుడు తన ప్రభువగు వేమారెడ్డితో కలిసి కాశీ క్షేత్రాన్ని దర్శించాడు. ఈశ్వరార్చన కళాశీలుడుగ శ్రీనాథుడు ఆ కాశీ పుణ్యక్షేత్ర సమగ్ర సందర్శనం వల్ల సంతోష పులకితాంతరంగుడై, భక్తి పూరిత హృదయుడై కాశీఖండ మహాకావ్య రచనానికి ఆనాడే సంకల్పించాడు. కొండవీటిని చేరిన పిమ్మట 'ధనుంజయ విజయము'ను రచించి పెదకోమటి వేముని మామ యగు కృష్ణవేణ్ణా జలక్రీడా వినోదుడును, ధాన్య వాటీ పురాధిపతియగు దంతలూరి గన్నభూపాలునకు కృతినిచ్చాడు. శ్రీనాథుడు కొండవీటిలో విద్యాధికారిగా నున్న కాలంలోనే అతని 'కూరిమిసేయు మరది' దగ్గుపల్లి దుగ్గనయూతనికి శిష్యుడై 'శ్రీనాథ మహా కవీంద్ర ప్రసాద లబ్ధ కవితా విశేషుడైనాడు'. పెదకోమటి వేముని కోరికను మన్నించి దేవర కొండ రాజ్యాధిపతి మాదయ లింగవానేని ఆస్థానానికి వెళ్లి తన అద్వితీయ కవితా చాతుర్యం వల్ల అతని మెప్పుపడసి రెడ్డి రాజుల పౌరుష ప్రతీకమైన నంది కంత పోతరాజు కటారిని బహుకృతిగా గైకొనినాడు. శ్రీనాథుడు ఇది కవి రాజు రాజనీతిజ్ఞతకొక యుదాహరణము.

1420వ సంవత్సరంలో పెదకోమటి వేమారెడ్డి దివంగతుడైనాడు. అప్పటి నుండి 1424వ సంవత్సరం వరకును పెదకోమటి వేముని పుత్రుడు రాచవేమారెడ్డి రాజ్యాన్ని పాలించాడు. ఇతడు దుర్మార్గుడు, అసమర్థుడు. 1424వ సంవత్సరంలో రాచవేముని మరణంతో కొండవీటి రెడ్డి రాజ్య భాస్కరుడస్తంగతుడైనాడు. అటు పై శ్రీనాథుడు దేశాటనం గావించాడు. మార్గ మధ్యంలో పంట మైలారు రెడ్డి కడ దిన వెచ్చాన్ని పుచ్చుకొన్నాడు. విస్సన్న మంత్రి చెంత హేమపాత్రాన్నాన్ని భుజించాడు. విష్ణు భక్తుడైన మైలారు రెడ్డికి నంద నందన చరిత్రమునంకితమిచ్చాడు.

**(7) పల్నాటి యాత్ర:-** రాజాశ్రయానికై పల్నాడు ప్రాంతాన్ని దర్శించాడు. అట పల్నాటివీరులపై అనేక పద్యాలు అలవోకగా చెప్పాడు. అచటి స్థానికుల ఆచార విశేషాలను గురించి ఎన్నియో చాటువులను చెప్పాడు. అక్కడి నుండి దాక్షారామానికి వెళ్లాలని భావించాడు.

**(8) దాక్షారామ ప్రయాణం:-** దారిలో సాంపరాయని కుమారుడగు తెలుగు రాయని దర్శించాడు.

"అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగా ధీశ! కస్తూరికా
భిక్షాదానము సేయరా! సుకవి రాడ్బృందారక శ్రేణికిన్
దక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ కుంభి కుంభముల పై వాసించు నవ్వాసనల్ "

అని కోరి కస్తూరికాదానాన్ని గ్రహించాడు. అతనికి వల్లభాభ్యుదయాన్ని కృతి ఇచ్చి దాక్షారామాన్ని చేరాడు. బెండపూడి అన్న మంత్రి పాకనుటింటి వాడు. శ్రీనాథునకు బంధువు. రాజ మహేంద్రవర రాజ్య పాలకులగు అల్లాడవేమా, వీరభద్రారెడ్లకు అమాత్య శిఖామణి. 1428వ సంవత్సరంలో 'ప్రౌఢ నిర్భరవయః పరిపాక' కాలమున శ్రీనాథుడు భీమేశ్వర పురాణాన్ని రచించి అన్నమాత్యున కంకితమిచ్చాడు. అనంతరం ఆతని యేలిక యగు వీరభద్రా రెడ్డి ఆస్థానంలో ప్రవేశించాడు.

**(9) డిండిముని ఓడించుట:-** ఇట్లుండ కొంత కాలం కదిలింది. విజయనగర సామ్రాజ్యాస్థాన కవి సార్వభౌముడగు అరుణ గిరినాథ డిండిమ భట్టు ప్రఖ్యాతిని తాను విద్యాధికారిగా నున్న కాలంలోనే వివిధ దేశాగత కవి పండితులచే విశేషంగా విని ఉండటం మూలాన, విద్యా నగరమగు విజయనగర రాజ సంస్థానమున ఒక జయ పతాకము శాశ్వతంగా స్థాపించాలనే ఆకాంక్ష మూలంగా సమస్కంధుడగు డిండిము నోడించినప్పుడే తన ప్రతిభా పాండిత్యాలు సార్థకములగునను తలంపు మూలంగా మహాకవి శ్రీనాథుడు విజయనగర విజయానికి నిశ్చయించుకొన్నాడు. డిండిముని కంచు ఢక్క ప్రసక్తియు, అతని దురహంకార పటాటోపాన్ని శ్రీనాథుణ్ణి ఉద్రిక్తుని చేశాయి. వేమ వీర భద్రారెడ్లను తమ మహాకవిని ప్రోత్సహించారు. కర్ణాటక రాజ్య రాజధానికి ప్రయాణమైనాడు కానున్న కవి సార్వభౌముడు. మార్గ మధ్యంలో వినుకొండ వల్లభరాయలను కలసుకొని ఆతని సాయమెకింత ఆపేక్షించాడు. విజయనగరంలోని ప్రముఖులకు తనను పరిచయమొనరించుటయే ఆ సాయము. తనకు క్రొత్త చోటైన విజయనగరమున తనను తానే పరిచయము గావించుకొనుట సముచితంగా ఉంటుంది గదా! వల్లభరాయుడు మంచి కవి. అతడనేకములగు చాటు పద్యాలను చెప్పియున్నాడు. ఆతని అభీష్టానుసారంగా క్రీడాభిరామాన్ని తన పేరనే రచించి యిచ్చాడు. ఆపై ప్రౌఢ దేవరాయల సభాంగణమున అరుణ గిరినాథ డిండిము నోడించి, కంచుఢక్కకను పగులగొట్టించి, కవి సార్వభౌమ బిరుద విభ్రాజితుడై, కనకాభిషేకాన్ని పొంది దక్షిణాధీశుని ముత్యాలశాలలో దీనారటంకాలతో తీర్థమాడి 'కర్ణాటదేశకటక పద్మ వన హేళి'యైనాడు.

**(10) సర్వజ్ఞ సింగభూపాల దర్శనం:-** అటు పిమ్మట రాచకొండను పాలించు పద్మనాయక ప్రభువగు సర్వజ్ఞ సింగ భూపాలుని దర్శనానికై వెళ్లాడు. ఆ భూనాథుడు శ్రీనాథుని పాండిత్య శౌండీర్యమునకు కవితా వైభవానికి, ప్రతిభా పాటవాలకు ప్రముదిత చేతస్కుడై ఆ సుకవిని సకల విధముల సన్మానించాడు. ఈ విధముగా శ్రీనాథ కవి సార్వభౌముడు ఆనాడు ఆంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్న ప్రధాన రాజ్యములగు రెడ్డి రాజ్యము, విజయనగర సామ్రాజ్యము, పద్మక నాయక రాజ్యముల వల్ల సమస్త గౌరవ లాంఛనాలను అనుభవించి సుస్థిరయశస్కుడైనాడు.

**(11) కాశీఖండ రచన:-** అనంతరం శ్రీనాథుడు రాజమహేంద్ర వరానికి వచ్చి కాశీ ఖండ రచనకు పూనుకున్నాడు. అందు తాను పెదకోమటి వేమునితో తిలకించిన కాశీ క్షేత్ర విశేషాలను కన్నులకు కట్టినట్లుగా రమణీయంగా చిత్రించి ధన్యుడైనాడు. ఈ విషయాన్ని కర్ణాకర్ణిగా ఆలించిన అల్లాడ వేమారెడ్డి తన తమ్ముడగు వీర భద్రారెడ్డికి ఆ కావ్యాన్ని అంకితమొనర్చుమని అనురాగపురస్సరంగా ఆనతిచ్చాడు. ఆ ఆనతిని సమాదరించినాడు కవి సార్వభౌముడు. 'త్రైలోక్య విజయ' సభా మంటపంలో కాశీ ఖండ కృతి సమర్పణ మహోత్సవం సర్వాంగ సుందరంగా సహృదయం హృదయ గమంగా సంపన్నమైంది.

వేమ, వీరభద్ర భూపాలురను తన కవిత్వ శ్రీ చేత పలు విధాలుగా అలరింపచేసిన శ్రీనాథునకు **1445**వ సంవత్సరం నుండి కష్టపు దినాలు ప్రారంభమైనాయి. కటకాధిపతి కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవరం పై దండెత్తి వచ్చాడు. ఆ యుద్ధంలో వేమ, వీర భద్రులు నిహతులైనారు. రాజమహేంద్ర వరం కపిలేంద్ర గజపతి వశమైంది.

**(12) శ్రీనాథుని కష్టాలు:-** శ్రీనాథుడు మరల దేశ సంచారియైనాడు. శ్రీశైలానికి వెళ్లాడు. అట భిక్షావృత్తి మఠాధిపతియైన శాంత భిక్షా వృత్తి యతీశ్వరుని ఆదేశానుసారం ఆతని మూల భృత్యుడగు ముమ్మయ శాంతయ్యకు అంకితంగా 'శివరాత్రి మహాత్మ్యాన్ని' వ్రాశాడు. మరలి వస్తూ మార్గ మధ్యంలో ఉన్న పల్నాటి కేశవున్ని దర్శించి పల్నాటి వీర చరిత్రను రచించి ఆ స్వామి కంకితమిచ్చాడు.

అటు పై కృష్ణానదీ తీరాన 'బొడ్డుపల్లి' అనే గ్రామాన్ని గుత్తకు తీసుకొని వ్యవసాయాన్ని చేపట్టాడు. కాని విధి శ్రీనాథున్ని చిన్న చూపు చూసింది. తిలలు, పెసలు, చల్లగా ఆ పైరును మిడుతలు వచ్చి తినిపోయింది. ఏడునూర్ల టంకములు ప్రభుత్వానికి శిస్తు చెల్లించవలసి వచ్చింది. అవి చెల్లించలేనందుకు కర్కశ చిత్తులైన ఒడ్డెరాజోద్యోగులు కవి సార్వభౌముని కఠినంగా శిక్షించారు. కవిరాజు కంఠాన్ని పురవీధి నెదురెండలో పొగడ దండ కౌగలించింది. ఆంధ్ర నైషధ కర్త హస్తయుగళము నందు నిగళ యుగము తగిలింపబడింది. వీరభద్రారెడ్డి విద్వాంసుని ముంజేతి యందు వెదురు గొడియ వియ్యమందింది. నగర వాకిట నుండెడి నల్లరాతి గుండు కవిసార్వభౌముని భుజాస్తంభమెక్కింది. విధి చిన్న చూపు చూడటంతో ఇన్ని ఇక్కట్లకు లోనైనమన సుకవి చంద్రుడు దిగులు చెందక దీనత్వము నందక 'దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగా' **1450** సంవత్సర ప్రాంతాన అమరపురి కరిగాడు. అమృత భాండం వంటి తన సాహిత్యాన్ని మనకనుగ్రహించిన ఆ మహాకవి జగన్మోహినీ అవతారం. ఆయన పాంచ భౌతికమైన శరీరం పంచ భూతాల్లో కలిసిపోయినా ఆ కవి చక్రవర్తి కీర్తి శరీరం అజరామరమై తెలుగు భాష ఉన్నంత వరకూ విశాల విశ్వాసంతరాళాల్లో వెలుగులు విరజిమ్ముతూనే ఉంటుంది.

## శ్రీనాథ జీవిత యాత్రా దర్శిని:-

అనేక సాహిత్య ప్రతుల సిద్ధాంతాలను పరిశీలించి 'ఫలశ్రుతిగా ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు' తెలిపిన శ్రీనాథ కవిరాజ జీవిత ఘట్టముల క్రమమిది.

1. శ్రీనాథుని జనన కాలము.................................................... క్రీ॥శ॥ **1360**
2. 'మరుత్తరాట్చరిత్ర' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1372**
3. 'శాలివాహన సప్తశతి' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1376**
4. 'పండితారాధ్యచరిత్ర' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1382**
5. 'శృంగార నైషధ' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1395**
6. 'హరవిలాస' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1400**
7. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానమున విద్యాధికారియైన కాలము ........ క్రీ॥శ॥ **1404**
8. 'ధనంజయ విజయ' రచనా కాలము .............................................. క్రీ॥శ॥ **1412**
9. నందికంత పోతరాజు కథారి తెచ్చిన కాలము .................................. క్రీ॥శ॥ **1418**
10. కొండవీటి సామ్రాజ్య పతనకాలము .............................................. క్రీ॥శ॥ **1424**
11. పంట మైలారు రెడ్డి ప్రాప్రనందిన కాలము ...................................... క్రీ॥శ॥ **1424 - 29**

12. 'నందనందన చరిత్ర' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1426
13. తెలుంగు రాయలు కస్తూరి యొసగిన కాలము ............................ క్రీ॥శ॥ 1424 - 29
14. 'వల్లభాభ్యుదయ' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1428
15. 'భీమ ఖండ' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1430
16. కనకాభిషేక సత్కారమందిన కాలము ............................................ క్రీ॥శ॥ 1431
17. 'కాశీ ఖండ' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1433
18. వీరభద్రా రెడ్డి విద్వాంసుడైన కాలము ............................................ క్రీ॥శ॥ 1433 - 34
19. సర్వజ్ఞ సింగమ నాయుని సందర్శించిన కాలము ............................ క్రీ॥శ॥ 1435
20. రాజమహేంద్ర వర రాజ్యాంత కాలము ............................................ క్రీ॥శ॥ 1444
21. 'శివరాత్రి మాహాత్మ్య' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1445
22. 'పల్నాటి వీర చరిత్ర' రచనా కాలము ............................................ క్రీ॥శ॥ 1446
23. బొడ్డుపల్లి గుత్తగొన్నకాలము ............................................ క్రీ॥శ॥ 1448
24. శ్రీనాథుని అవసాన కాలము ............................................ క్రీ॥శ॥ 1450

## 10.2.3 శ్రీనాథునిలోని కొన్ని విలక్షణ లక్షణాలు:-

1. **పూర్వకవి స్తుతి:-** మన ప్రాచీనాంధ్ర గ్రంథాల్లో గ్రంథకర్తలు వారికి పూర్వులైన కవులను గురువులుగా భావించి స్తోత్రం చేయడం ఒక సత్సంప్రదాయం. అదే పూర్వకవి స్తుతి. ఈ పూర్వకవి స్తుతి, సంప్రదాయాన్ని శ్రీనాథుడు కూడా ఒక్క హర విలాసంలో తప్ప తన తక్కిన అన్ని గ్రంథాల యందు పాటించాడు. అంతేకాదు శ్రీనాథుడు స్తుతించినంతమంది ప్రాచీన కవులను మరియొక తెలుగు కవి స్తుతింపలేదు. ఇదియొక విలక్షణ లక్షణం.

   వ్యాసుడు, వాల్మీకి, భట్టబాణుడు, మయూరుడు, భారవి, ప్రవరసేనుడు, శివభద్రుడు, కాళిదాసు, రాజశేఖరుడు, హర్షుడు, బిల్హణుడు, మల్హణుడు, చోరుడు, క్షేమేంద్రుడు, భల్లుడు, భట్టి, దండి, చిత్తపకవి, భాసుడు, భవభూతి, సుబంధుడు, సోముడు, మాఘుడు మొదలైన సంస్కృత కవులనందరినీ స్తుతించాడు. అట్లే వేముల వాడ భీమన, నన్నపార్యుడు, తిక్కయజ్వ, ఎఱ్ఱా ప్రెగడ, నాచన సోమన మొదలైన తెలుగు కవులను స్మరించాడు.

   పూర్వ కవి స్తుతులలోని నామముల పట్టికలను బట్టి శ్రీనాథుడు సంస్కృత కవులనెక్కువ స్మరించినట్లు స్పష్టమవుతున్నది. పాల్కురికి సోమనాథుని కథను హర విలాసంలో గ్రహించియూ, అతని పండితారాధ్య చరిత్రను మరల ఒక గ్రంథంగా వ్రాసియు, శ్రీనాథుడు సోమనాథాదులను విస్మరించుట విస్మయా వహ విషయం.

2. **పూర్వ కవితా చర్వణ ప్రియత్వము:-** శ్రీనాథుని యందు కన్పించు మరొక విశేష లక్షణమేమంటే పూర్వ కవితా చర్వణ ప్రియత్వం. అర్వాచీన కవుల పై ప్రాచీన కవుల ప్రభావం పడటం ఆంధ్ర సాహిత్యానికి కొత్త విషయం కాదు. కొంచెమో గొప్పో ప్రతికవి యందూకన్పడు విషయమే, కానీ యీ ప్రభావం రెండు రకములు. 1. ప్రతిభావంతుడైన కవి ప్రతిభా శూన్యుడైతే అతని కృతి జీవకళ లేని అనుకృతి మాత్రమే అవుతుంది. 2. అతడు మహాప్రభావితుడైతే పూర్వ కవుల గ్రంథ పఠనం వల్ల కల్గిన సంస్కారం అతని సాహిత్య పేటికకు పీఠిక అవుతుంది. శ్రీనాథుడు పూర్వ సంస్కృతాంధ్ర సాహిత్య సముద్రాన్నంతా ఆపోశన పట్టిన మహనీయుడు. కాబట్టి ఆ సంస్కారం అతని గ్రంథాలయందు వద్దన్నను వదిలి పెట్టక మాటిమాటికీ ప్రత్యక్షమవుతుంది.

1. హర విలాసంలో : మురారి, కాళిదాసు
2. శివరాత్రి మహాత్మ్యంలో : బాణుడు
3. కాశీ ఖండంలో : మయూరుడు, భవభూతి, భట్టగోపాలుడు
4. భీమ ఖండమందు : మయూరుడు, అమరుకవి, వామన భట్టభాణుడు, కాళిదాసు, భట్టగోపాలుడు

తెలుగు గొంతుకలతో కన్పిస్తారు.

కవిత్రయ వాణి శ్రీనాథుని తిక్కన కృతులందకన్పడి, కన్పడకుండ దాగుడు మూతలాడినా కాశీ ఖండంలో వారి ప్రభావం బహిరంగంగా ప్రదర్శింపబడింది. ఇంతమాత్రాన శ్రీనాథుడు పూర్వకవి కృతులను దగ్గర పెట్టుకొని అనుకరించెనని చెప్పటం సాహసం. అతడే ఘట్టం వ్రాస్తున్నా అతనికంతకు ముందే కంఠస్థములైన శ్లోకాలు ఘట్టాలకు ఘట్టాలుగా స్మృతి పథంలో స్ఫురిస్తాయి. ఉస్ఫురించిన ఆ శ్లోకాలు వెంటనే తెలుగులోనికి పరకాయ ప్రవేశం చేస్తాయి. కాశీ ఖండమందలి "వచియింతు వేములవాడ భీమన భంగి

భాషింతు నన్నయ భట్టు మార్గంబున.............." అనే పద్యం కూడా శ్రీనాథుని రచనా సామర్థ్యాన్ని వ్యక్తం చేసేవే కాని, శ్రీనాథుడు అనుకరణ నిర్వహణదక్షుడని చెప్పేవి కావు.

3. **శ్రీనాథుని నానారాజ సందర్శనేచ్ఛ:-** శ్రీనాథుని యందు కన్పడు మరియొక మహాలక్షణము నానా రాజ సందర్శనేచ్ఛ. పూర్వాంధ్ర కవుల్లో శ్రీనాథుడు దర్శించినంత మంది ప్రముఖ వ్యక్తులను మరియొక కవి దర్శింప లేదు. నాటి సాహిత్య లోకమునందే కాక, రాజకీయ లోకమునందు కూడ శ్రీనాథునిది ప్రముఖ పాత్ర. క్రీ॥శ॥ చిలుకూరి వీరభద్రరావు గారు 'శ్రీనాథుని జీవిత చరిత్ర వ్రాయటం అంటే 15వ శతాబ్ది యందలి ఆంధ్ర దేశ చరిత్ర వ్రాయుట' అని అన్న వాక్యం యదార్థం. గ్రంథాలను అంకితం ఇవ్వటం వలననేమి, చాటు పద్యముల వలననేమి, లేక ఇతర ఆధారముల వలననేమి శ్రీనాథునకు నాటి రాజకీయ ప్రపంచమంతా పరిచితము.

మామిడి వేమానామాత్యుడు, మామిడి ప్రగ్గడయ్య, మామిడి సింగన, అవచి తిప్పయ సెట్టి, బెండపూడి అన్నమాత్యుడు, పెదకోమటి వేమారెడ్డి, అల్లాడ వేమారెడ్డి, వీరభద్రా రెడ్డి, సర్వజ్ఞ సింగ భూపాలుడు, వల్లభరాయలు, సాంపరాయని తెలుంగాధీశుడు, ప్రౌఢదేవరాయలు, దంతలూరిగన్న భూపాలుడు, భాస్కరుడు, విస్సన్న మంత్రి, శాంత భిక్షావృతియతీశ్వరుడు, ముమ్మడి శాంతయ్య, ముమ్మసుకవి ............ ఇంక ఎందరెందరితోడనో ప్రత్యక్ష సంబంధమున్న కవి శ్రీనాథుడు. ఒక పాదమున సాహిత్య ప్రపంచాన్ని వేరొక పాదమున రాజకీయ ప్రపంచాన్ని, ఒక పాదమున భోగ ప్రపంచాన్ని ఆక్రమించిన త్రివిక్రముడు శ్రీనాథుడు.

4. **శ్రీనాథుని మాతృ దేశాభిమానం:-** శ్రీనాథుని యందు జీర్ణించుకొనిన మరియొక అసామాన్య లక్షణము మాతృదేశాభిమానము. తెలుగు నేల పై బట్టకట్టిన ఆచార వ్యవహారాలను తన గ్రంథములందు, చాటువులందు తృప్తి తీర ఇంతగా వర్ణించిన పూర్వాంధ్ర కవి మరియొకడు లేడు. పలనాటి చరిత్ర కథ తెలుగు గడ్డ పై మొలచినదే. భీమేశ్వర పురాణమందలి తృతీయాశ్వాసమంతా ఉభయ గోదావరి మండలాల భౌగోళిక వర్ణనమే. శ్రీనాథుడు అగస్త్య వేషధారియై నేడు క్షేత్రములందు తటస్థపడు మార్గదర్శి (Guide) గోదావరి మండలమును వ్యాస మహర్షికి వర్ణించి చెప్పాడు. పీఠికాపురము, కుమారారామము, సర్పపురము, గోదావరి, కోటిపల్లి, పంచతీర్థములు, ద్వాదశ తీర్థములు మొదలగునవన్నియు శ్రీనాథుని అక్షరామృతంచే అక్షర సిద్ధిని పొందాయి. శివరాత్రి మహాత్మ్యము నందలి ద్వితీయాశ్వాసములోని ఆచారాలన్నియూ తెలుగు దేశంలోనివే. ఇక శ్రీనాథుని చాటు పద్యాలు ఆంధ్రదేశమందలి వివిధ జాతులను, వివిధ ప్రదేశాలను, వివిధాచారాలను, కనుల ఎదుట కన్పింపచేయు పద్య ప్రతిమలు. ఇక భోజన పదార్థాలన్నీ తెలుగు ప్రజల జిహ్వాలకు పాత చుట్టములే. శ్రీనాథుని రచన షడ్రసములకు సంగమ స్థలము. నవరసాలకు జనన స్థలము.

సంస్కృత వాఙ్మయాన్ని తనలో ఇముడ్చుకొనగల శక్తి తెలుగునకు కలదని ఋజువు చేసినవాడు నన్నయ్య. తెలుగునకున్న భావ ప్రకటన శక్తి సంస్కృతమునకున్న శక్తికి ఏమాత్రం తక్కువ కాదని ఋజువు చేసిన వాడు తిక్కన. ఒట్టి సంస్కృతానికున్న మాధుర్యం కన్న తెలుగుతో కూడిన సంస్కృత మాధుర్యము మిన్నయని ఋజువు చేసినవాడు శ్రీనాథుడు.

## 10.2.4 వ్యక్తిత్వము (లేక) ఆత్మీయత:-

శ్రీనాథుని ఆత్మీయత విషయములో భిన్న మతాలు ఉన్నాయి. ఆత్మీయతలో ఒక వ్యక్తి యొక్క స్వభావము సర్వమూ పుణికి పుచ్చుకుంటుంది. ఆంగ్లంలో Personality అన్న పదం ఏ అర్థంలో ఉపయోగించారో అదే అర్థంలో తెలుగున ఆత్మీయత అని ఉపయోగిస్తున్నారు. తక్కిన విషయాలన్నింటిలో శ్రీనాథుని విషయమున వాద ప్రతివాదాలు లేవు. కానీ ఒక నైతిక విషయం పట్లనే శ్రీనాథుని ప్రవర్తన మంచిదా? చెడ్డదా? అనే వాదం కలదు. అయితే శ్రీనాథుడు మంచివాడా? చెడ్డవాడా? అనేది సాహితీ సంబంధ విషయాలకు అనాదశ్యకం. వాని ప్రవర్తనకు సంబంధించిన గుణాలు వాని సమకాలికులకు సంబంధించిందే కాని మనకు కాదు.

అయితే కవి యొక్క ఆత్మీయత

1. The Personal Element
2. The National Element [దేశీయత, ఆచార వ్యవహారాలు]
3. The Universal Element [శాశ్వతములై, విశ్వజనీనము] లైనటు వంటి విషయతా ముద్ర.

అందులో ఆత్మీయతా ముద్ర తెలిసికోవాలంటే కవికి సంబంధించిన అభిరుచులు, జీవిత విశేషాలు అతనిలోని గుణదోషాలు, వాని అభిమానాలు మనకు సమగ్రంగా తెలియాలి. కావ్యాన్ని చదివే దృష్టి సాహితీ దృష్టితో చదివితే అప్పుడు పైన పేర్కొన్న విషయాలను గుర్తించాల్సి ఉంటుంది. ఎప్పుడు మూలాతిరిక్తమైన విషయాలు చెప్తాడో అప్పుడే ఆ కవి యొక్క ఆత్మీయత గోచరిస్తుంది.

శృంగార నైషధాది కావ్యాలు శ్రీనాథుని వ్యక్తిత్వము లేదా ఆత్మీయతకు దర్పణాలు.

రాజాస్థానమందలి ఆతని విద్యాధికారి పదము మహాక్షాయ వ్యవహర్తగా, ఉత్తమాధికార మర్యాదాభిజ్ఞునిగా చేసింది. ఆతని దేశ సంచారాదులు శాస్త్రజ్ఞానానికి లోకజ్ఞతను జోడించింది. కవిబ్రహ్మ బిరుదము తిక్కనకు సార్థకమైనట్లు కవిసార్వభౌమ బిరుదము శ్రీనాథునకు సార్థకమయింది. నాటికిని నేటికిని ఆ రెండు బిరుదులు తాల్చదగ్గి వారు ఆంధ్రకవుల్లో వారిరువురే.

శ్రీనాథుని జీవితమే వీర శృంగార కావ్యోచితమైన ఇతి వృత్తము. శ్రీనాథునకు ఇహపరాలు రెండింటి యందును రెండు కన్నులున్నాయి. హేమపాత్రాన్నమును, రత్నాంబరములను, కస్తూరిని స్మరించుకొంటూ స్వర్గ ప్రస్థానాన్ని సాగించాడు. శ్రీనాథుడు ఆజన్మ భోగియే కాని యోగి కాడు.

1. కాశీ ఖండంలో నారద వైశ్వా నర సంభాషణా సన్నివేశంలో జననీ జనకులను గురించి శ్రీనాథుడిట్లా చెప్పాడు.

"జననీ జనకుల గొలుచుట
తనయునకు ముఖ్యమైన ధర్మము జననీ
జనకుల గొల్చుట కంటెను
దనయున కభ్యధికమైన ధర్మము గలదే" (కాశీ 4.17)

మాతృ భక్తి మిక్కిలి గొప్పదని ఆ సందర్భంలో శ్రీనాథుడు చెప్పటం జరిగింది.

2. "సర్వతీ ర్థంబువుల కంటె సమధి కంబు
పావనంబైన జనయిత్రి పాద జలము
వర తనూజున కఖిల దేవతల కంటె
జనని యొక్కడు సన్నుతాచార నిరత" (కాశీ 4.20)

దీన్ని బట్టి శ్రీనాథుడు మాతాపితృ భక్తి కల మహనీయుడనుట తెల్లము.

3. శ్రీనాథుడు ఉదార గంభీరశీలుడు. తిరస్కారాలను పరిగణింపక తన ఉదాత్తతను వెల్లడిస్తాడు. భీమేశ్వర పురాణంలో శ్రీనాథుడు పండితం మన్యులైన వైతండికులను నిందించిన పద్ధతిని గమనింపుడు.

"బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరయు ఘనము
కూపమండూకములుఁబోలె ఁగొంచె మెఱిగి
పండితం మన్యులైన వైతండికులకు"

4. "నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడచి కాకులు బిట్టు పెద్ద ఱచినప్పు
డుడిగి రాయంచయుంటలెస్స నైప
రాకున్న నెందేని జనుట యొప్పు"

రాజ మహేంద్ర వరంలో రాజాశ్రయానికి శ్రీనాథుడు ప్రయత్నించినపుడు అచటి పండితులతో వైషమ్యమేర్పడి ఉండవచ్చు. అందువల్ల అప్పటి అరసిక పండితుల మాత్సర్యాన్ని నిరసిస్తూ పై విధంగా అవహేళన చేసి ఉండవచ్చు.

5. కాశీ ఖండంలో వింధ్యాద్రి మేరు పర్వతాన్ని నిర్జించటానికి ఊహించిన సందర్భంలో చింతాక్రాంతమైన మనస్సుతో తనలో తాను అనుకొన్న అమూలకములై ఈ మాటల్లో శ్రీనాథుని ఆత్మీయత, అభిమాన మానుషము వ్యక్తమవుతున్నది.

"శాస్త్రమాచార్య సన్నిధిఁ జదువడేని
నిద్ధబోధంబు మది సంగ్రహింపడేని
దెగువ మీఱ ప్రతిజ్ఞ సాధింపడేని
జ్ఞాతి జయమందడేని తజ్జనుడు జనుడె"

"కంటికి నిద్ర వచ్చునె సుఖంబగునే రతికేళి జిహ్వకున్
వంటకమిందునే యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె మానుషంబు గల యట్టి మనుష్యున కెట్టి వానికిన్
గంటకుడైన శాత్రవుడొకండు దనంతటి వాడు కల్గినన్"

తనంతటి వాడగు గౌడ డిండిమ భట్టును పాండితీపాటవమున ఓడించి ప్రౌఢ దేవరాయలు ఆస్థానంలో కనకాభిషేకాన్ని పొందిన కథ జ్ఞప్తికి వచ్చి శ్రీనాథుడు పై రీతిగా పలికి ఉంటాడు. ప్రత్యర్థి ఎంత పండితుడైననూ తన పాండిత్య ప్రజ్ఞచే ఓడించు జయశీలుడు శ్రీనాథుడని చెప్పవచ్చు.

6. (i) శృంగార నైషధం తప్ప శ్రీనాథుని కావ్యాలన్నియూ శివభక్తి బోధకాలే. నైషధమునందలి నాయకుడు నలుడు కూడా శైవుడే. భీమరాజు కూడా శ్రీనాథుని సృష్టిలో శైవుడే. శృంగార నైషధంలో శ్రీనాథుని ఈశ్వరార్చన

కళాశీలత్వానికి ఈక్రింది పద్యం దృష్టాంతరము.

"కుతుకమునం గురంగ మదకుంకుమ చర్చ వహించి నీలలో
హిత రుచులై స్వయంభు లయి యాప్సిత సౌఖ్య విధాయులైన య
య్యతివ పయోధరంబులకు నర్ధ నిశా సమయంబున న్సమం
చితన ఖకిం శుకార్చనము సేసెమహీపతి భక్తియేర్పడన్" (7.178)

నలుడు పద్మాసనస్థుడై శివుని ప్రార్థించాడు. అర్ధరాత్రి సమయమునందు ఈశ్వర లింగానికి కింశుక పుష్పాలతో అర్చన చేయటమనేది మంత్ర శాస్త్ర సమ్మతమై శ్రీనాథుని మంత్ర సంప్రదాయజ్ఞతను చాటుచున్నది.

(ii) హర విలాసంలో: పార్వతి "పాశుపత దివ్యదీక్ష చేపట్టి" దివ్య తేజో విశేషసం దీప్తమూర్తి అయింది. చిరుతొండనంబి దంపతులు 'లింగార్చనంబుల' కాలం గడిపిన వారే. అర్జునుడు కూడా 'పాశుపత దీక్షా ధురంధరుడే'.

(iii) కాశీ ఖండంలో అగస్త్యుడు పాశుపత దీక్షను, శాంభవీ వ్రతాన్ని ఆగమోక్త ప్రకారంగా ఆచరించాడు.

"దివిజముని నర్మదా నది తీర్థమాడి
విమల భస్మంబునిఖి లాంగములనలది
యఱుత రుద్రాక్ష మాలికల ననువు పఱచి
భవుని ఓంకార నాథుని భక్తి గొలిచి"

శ్రీనాథుడు వైష్ణవ నారదుని శైవనారదునిగా కావించాడు. ఇది శ్రీనాథుని రుద్రాక్షధారణ మహిమయే.

పైన పేర్కొని వివరించినట్లు శ్రీనాథుడు తన కావ్యములందు కథా నాయకులందును, వివిధ పాత్రలందును, చిత్రించిన ఈశ్వరాధనా విధానము ఆతని ఈశ్వరార్చన కళా శీలత్వమును స్పష్టం చేస్తున్నది.

ఇంతిట శివభక్తి తత్పరుడు శ్రీనాథుని శీలాన్ని గురించి శృంగార ప్రియత్వాన్ని గురించి పెక్కు మంది పెక్కు విధాలుగా తలంచారు. శ్రీనాథునికి విషయవాంఛలు అత్యున్నతములని భోగ పరాయణత మెండని వేటూరి ప్రభాకర శాస్త్రి గారి అభిప్రాయము. ఈ మహాకవి శీలాన్ని శంకించటానికి అతనివని చెప్పబడు చాటువులు ముఖ్య కారణం. భీమేశ్వర పురాణ గ్రంథ ఆద్యంతము లందు గంధర్వాప్సరో భామిని జనముల సౌందర్యాన్ని అతిమాత్రంగా స్మరించటంచే శ్రీనాథుడు వేశ్యాలోలుడని కొందరి అభిప్రాయపడ్డారు.

'స్మర సంహారక పాద పద్మయుగళీ సంసేవనోత్మత్తు'డైన శ్రీనాథుని వేశ్యాలోలుడనుట భావ్యం కాదు. ఇచ్చట శృంగారాన్ని పరమేశ్వరాలంబనంగా నిర్వహించినాడు. ఈ వేశ్యల స్వామి భక్త సంబంధము శ్రీకృష్ణ గోపికా సంబంధము వంటిది. భీమేశ్వర పురాణాన్ని బట్టి శ్రీనాథుడు అకుంఠిత భక్తుడు గానే కన్పట్టునని చిలుకూరి పాపయ్య శాస్త్రి గారి అభిప్రాయం.

శ్రీనాథుడు శృంగార రసాన్ని ఆరాధించాడు. రస స్రష్టయగు మహాకవికి ఆయా రసాలు భావనా సిద్ధములు. వాటి ప్రత్యక్షానుభూతి వాని కనవసరము. శృంగారమును వర్ణించిన కవి లౌకిక శృంగార పురుషుడని భావించటం అనుచితం. శ్రీనాథుని యందు ఉజ్జ్వలించిన శృంగార రసోత్తేజక శక్తికి ఆనాటి కవి పండితుల ఆమోదము, ప్రభువుల అభిరుచి, ప్రజల జీవిత విధానము నందలి భోగలాలసత, దోహదమిచ్చిందని చెప్పవచ్చును. శ్రీనాథుని కావ్యములందు భక్తి శృంగారముల భావ శబలత గోచరిస్తుంది.

శ్రీనాథుడు పుట్టుకచే సౌందర్య దిదృక్షువు. దానికి తోడు పరిహాస రసికుడు. చక్కని రూపము కంటపడినపుడు మనసార ఆనందించి, నోరారా వర్ణించుటయు, హాస్యరస పాత్రము కాదగిన వింత వస్తువునో, వింత రూపాన్నో చూచినపుడు తాను నవ్వి, మనలను నవ్వించుటయు శ్రీనాథుని స్వభావము.

శ్రీనాథుడు 'భోగి'.

"మొగి విరిసి కఱకు గూడక

పగులక వెడలు ప్రనునిడు ప్రపసిమియు గలలేఁ

జిగుర రటాకుల" - లోనో, హేమపాత్రలలోనో రాజోచితమైన షడ్రసోపేత భోజనాన్ని భుజించుట అతనికిష్టం.

7. **<u>శ్రీనాథుడు అనుభవ రసికుడైన కవి:</u>**

"ఆనందంబున నర్థ రాత్రముల జంద్రా లోకముల్ కాయగా
నానా సైకత వేది కాస్థలములన్ నల్దిక్కులన్ శంభుగా
శ్రీనాథుందరుణేందు శేఖరు శివున్ శ్రీకంఠునింబాడుచున్
మేనెల్లంబుల కాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్" (భీమ 2.91)

(ఎ) ఈ మిన్నేటి ఇసుక తిప్పల్లో పాటలు పాడింది శ్రీనాథుడే కాని అగస్త్యుడు కాదు.

(బి) శ్రీనాథుడు ఏదైన ఒక ఆస్థానము సంపాదింపదలచుకున్నప్పుడు తత్సంబంధులతో కృతి సంబంధాన్ని ఏర్పరచుకొంటాడు.

(సి) అవసాన దశ యందు కవి సార్వభౌముడు తన్నాదరించిన మిత్రులను, ప్రభువులను స్మరిస్తూనే 'దివిజ కవి వరుగుండియల్ దిగ్గురనగ అమరపురికి' అరిగినాడు. ఈ మైత్రీ ధర్మాభిజ్ఞతయే అతని లోకరంజకత్వమునకొక హేతువు. అంత్యదశ యందును శ్రీనాథుడు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోలేదు. ఆతని సర్వతంత్ర స్వతంత్రమగు వ్యక్తిత్వ ప్రభావము తరుగలేదు.

8. **చాటువుల ద్వారా నైతిక పతనము నిర్ణయించుట:** శ్రీనాథుని పేర చెల్లుచున్న చాటువుల్లో అతడు స్వయంగా వ్రాసినవెన్నో యాతని కంట గట్టబడిన వెన్నియో నిష్కర్షముగా చెప్పటం కష్టం. మొన్న మొన్నటి తురగా రామకవి మొదలైనవారు చెప్పిన చాటు పద్యాలను కొన్నింటిని లోకము శ్రీనాథుని కంట గట్టి పాపం చేసింది. ఇంత స్వల్ప కాలంలోనే నిష్కారణంగా ఇన్ని పద్యాలు శ్రీనాథుడు మోయవలసి వచ్చినపుడు ఈ 500 సంవత్సరాల వ్యవధిలో నెన్నియాతని కిట్లంటగట్టబడెనో ఎవరు చెప్పగలరు. ఈ చాటువులు శ్రీనాథుడు చెప్పటానికి కారణం ఆయన వివిధ రాజాస్థానాలు తిరిగినవాడు. వారి ఆనందానికై ఏవో కొన్ని పద్యాలు చెప్పి యుండవచ్చు. అట్లాంటి విషయాలలో నైతిక విషయాన్ని గూర్చి ప్రసక్తి చేయపని లేదు. మద్యాన్ని గూర్చి పద్యాన్ని చెప్పినంత మాత్రాన అతడు త్రాగినాడని చెప్పటానికి అధికారం లేదు కదా!

9. **హర విలాసం - లింగోద్భవ వర్ణన - అశ్లీలం :** హర విలాసంలో 'లింగోద్భవ వర్ణన' అశ్లీలమని - శైవులకు దారుకావన విహారం, లింగోత్పత్తి మొదలైనవన్నీ పరమ పవిత్రములు. ఆ గ్రంథ కృతి భర్త పరమ శైవుడు. అతని కొరకుగా రచింపబడింది. కృతి కర్త కూడా శైవుడే. వైష్ణవులకు రాచక్రీడలు మొదలగునవెట్లు పరమ పవిత్రములైనవో అట్లే ఈ వర్ణనలు కూడా శైవులకు పరమ పవిత్రములు. పూజనీయములు. శిరోధార్యములు. అశైవులయిన వారికిట్టి వర్ణనలు నచ్చవు. అదియును కాక కృతిభర్త, కృతికర్త శైవులే.

**10. దీనినను సరించి క్రీడాభిరామ రచన:** ప్రేమాభిరామమునకిది ఆంధ్రీకరణము. మూలంలో కూడా ఇట్లే ఉన్నదేమో తెలియదు. మూలము లభ్యమూ పేరులోనే మార్పు తెచ్చెను. దీనిని బట్టి గ్రంథంలో కూడా ఏవైనా మార్పులు తెచ్చెనేమో! ప్రేమాభిరామ కాలం నాటికి ఓరుగల్లు ప్రతిభ వెల్లివిరిసింది. ఇట్టి ప్రతిభను చూచి ఆనందించి వ్రాసిందే. శ్రీనాథుని కాలానికి కాకతీయ సామ్రాజ్యం పతనమైంది. అట్టి ప్రతిభ నశించింది. వీనిని బట్టి చూస్తే ఎంత వరకు మూలానుసారిగాను, మూలాతి రక్తంగానున్నది మనం నిర్ణయించలేము. మూలానుసారిగా ఉంటే గ్రంథకర్త దోషం కాదు. మూలాతిరక్తంగా ఉన్నా ఆ గ్రంథ స్వభావాన్ని బట్టి అది దోషమనిపించుకోదు. ఏతావతా ఆ మహాకవిని ఒకరు సమర్థింపవలసిన అవసరం లేదు. ఆతడిప్పుడనంత విశ్వంలో విశాలాంధ్ర ప్రజా హృదయాల్లో వెలుగుచున్న అమర సారస్వత జ్యోతి.

**11. శ్రీనాథుడు శృంగారి:** "తథాపితరుణేందుశేఖరే" అన్నట్లు సర్వరసాల్లోను శ్రీనాథుని చూపు శృంగారం వైపునకే ప్రచురంగా ప్రసరించింది.

> "శృంగారీ చేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్
> సఏవవీతరా గశ్చేన్నీ రసః సర్వమేవతత్"

కావ్యమందు కవి శృంగారి ఐతే జగత్తే రసమయమవుతుంది. ఆతడే వీతరాగుడైతే నిఖిల విశ్వము నీరసమైపోతుంది అనే ధ్వనికారుని అభిప్రాయము శ్రీనాథుని పట్ల ప్రత్యక్షర సత్యమైనది. శ్రీనాథుడెంతటి ఈశ్వరార్చన కళాశీలుడో అంతటి శృంగార కళానిధి. ఎంతటి మహాముముక్షువో అంతటి సౌందర్య రిరంసువు. అతడు అనురాగి - విరాగి - భోగి - యోగి. నైషదాంధ్రీకరణ సందర్భంలో తన గ్రంథానికి శృంగార నైషధమని పేరు పెట్టటంలోనే ఆతని సౌందర్య దిదృక్ష వ్యక్తమౌతున్నది. అంతేకాదు శృంగార రసాభిమానము వ్యక్తమగుచున్నది.

శ్రీనాథుడు శృంగారి. శృంగారియని నంతనే వట్టి వ్యభిచారం అనే అపోహ చాల మందికి కలగటం సహజం. అది అసమంజసం. అనాలోచితము, అనుచితము. ఆనందవర్ధనాచార్యుడు నుడివిన అర్థంలోనే ఈతడు 'శృంగారి'యని ఆతని కావ్య పఠనానంతరం రసజ్ఞులు గుర్తించగలరు.

లోక సృష్టి స్థితి లయ కారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల యందు క్రమంగా రజ స్సత్వ తమో గుణాలు ఆపాదింపబడ్డవి. సృష్టికర్తకు కావల్సింది రజో గుణము, శృంగారము రజః ప్రధానము. కాబట్టి రజో గుణ ప్రధానుడైనప్పుడే కవి మరింత స్ఫూర్తివంతంగా శృంగార రస నిర్వహణ చేయగలడు. శృంగారి అంటే రజో గుణ ప్రధానుడు. రజస్సు సృష్టికి మూలం. కవిబ్రహ్మము రజః ప్రధానుడు. అంటే సరాగుడు. కవి విరాగుడు కాక సరుగుడైనప్పుడే జగత్తురసమయమవుతుంది. రాగము, రక్తి ఉన్నప్పుడే కవి సృష్టి సార్థకమవుతుంది. కవి సృష్టికి కారణాలు ప్రతిభ - వ్యుత్పత్తి - అభ్యాసము. ప్రతిభావంతుడు రసికుడు ఐన కవియే సృష్టికర్త కాగలడని ధ్వనికారుని హృదయం.

సకల కళల యొక్క గమ్యం ఆనందం. ఆనందానికి ముఖ్య సాధనం సౌందర్యం. అట్టి సౌందర్యం శృంగార విషయంలో మరింత స్ఫూర్తివంతమై, అర్థవంతమై ఆ రస ప్రరోచనకు సద్యస్సహాయకమవుతుంది.

సంస్కృతంలో కాళిదాసు నందు వలె తెలుగులో శ్రీనాథుని యందు శృంగార రసోత్తేజకశక్తి సారస్వత వసంతమై ఉజ్జ్వలించింది. కాబట్టే శ్రీనాథుని కావ్యాలు ప్రధానంగా శృంగార రస రంజితములై వసంతోద్యానం వలె పరిమళిస్తుంటాయి. అయితే శ్రీనాథునకొక ప్రత్యేకత కలదు. ఎచ్చటెచ్చట రసధాతువును నిక్షేపించటానికి ఏపాటి అవకాశాలుంటాయో ఆ అవకాశాలనన్నింటిని విదగ్ధుడై వినియోగించుకొని శ్రీనాథుడు క్షేత్ర మహాత్మ్యాలను సైతం

కావ్యకళా కౌశల పేశలంగా దిద్ది తీరుస్తాడు. భక్తికి కూడ రసత్వసిద్ధిని కలిగించిన రస జగన్నాథుడు శ్రీనాథుడు. ఆతని చేతిలో రాయి కూడా రమణీయ రత్నమై ధగద్ధగితకాంతులతో ప్రకాశిస్తుంది.

## 10.2.5 ఉపసంహారం:-

శ్రీనాథుని మూర్తి బహు ముఖమైంది. ప్రజ్ఞా దురంధరుడైన యీ కవి సారస్వత ప్రపంచంలో ఒక యుగకర్త. శ్రీనాథుడొక పాండిత్యమూర్తి, వేద విజ్ఞాన ఖని. శ్రీనాథకవి ఆగమజ్ఞానాన్ని కూలంకషంగా కలిగినవాడు. అంతేకాదు ఇతడు బహు పురాణజ్ఞుడు. అతనికి జ్యోతిశ్శాస్త్ర పరిచయముంది. ఇంకా గాంధర్వ పరిజ్ఞానం కూడా ఉంది. ఈ విషయాలన్నీ ఆయన రచించిన కావ్యాల ద్వారా వ్యక్తమౌతుంది. ఇదే శ్రీనాథుని వ్యక్తిత్వం.

## 10.2.6 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని ఉదంతం ద్వారా వ్యక్తిత్వమెట్టిదో తెల్పుడు.

## 10.2.7 ఆధార గ్రంథాలు:-

1. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - డా॥ జె.జె. బాపూజీ
2. శ్రీనాథ భారతి - శ్రీనాథ పీఠము, గుంటూరు.

**ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 11

# శ్రీనాథుడు

**ముఖ్యాంశాలు:-**


11.0 లక్ష్యం

11.1 శ్రీనాథుని ఈశ్వరార్చన కళా శీలత్వము

11.2 శ్రీనాథుని సీస పద్య రచనా విధానము

11.3 శ్రీనాథుని కవితలోని వక్రోక్తి

11.4 సారాంశము

11.5 ప్రశ్నలు

11.6 ఆధారగ్రంథాలు


## 11.0 లక్ష్యం:-

శ్రీనాథునకు 'శృంగారి' అనే అపప్రధను తొలగించి, ఈశ్వరార్చన కళాశీలుడని స్పష్టం చేయడం, సీస పద్య రచనలో శ్రీనాథుడు సిద్ధహస్తుడనే ఆభాణకాన్ని సోదాహరణంగా సమన్వయించడం, శ్రీనాథుడు వక్రోక్తి ప్రియుడనడాన్ని సోదాహరణంగా నిరూపించడం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 1. శ్రీనాథుని ఈశ్వరార్చన కళా శీలత్వము:-

భారతీయ సాహిత్యంలో మతానికి ప్రాధాన్యమెక్కువ. ఆ కారణం వల్ల కవులకు మతానురక్తి, తదనుబంధమయిన దేవతోపాసనలు తప్పని సరి. తెలుగు సాహిత్యం పరిశీలిస్తే ప్రతి కవి ఏదో ఒక దేవతను ఆరాధించడం, ఉపాసించడం, అనుగ్రహం పొందడం కనిపిస్తుంది. ఈ ఆరాధన కొందరిలో తక్కువ, మరికొందరిలో ఎక్కువ. ఈ దృష్టితో పరిశీలిస్తే పాల్కురికి సోమన, శ్రీనాథ కవులలో ఈశ్వరార్చన ఎక్కువ అనిపిస్తుంది. ప్రత్యేకించి శృంగారాన్ని అతివేలంగా వర్ణించిన శ్రీనాథుడు ఎంతటి భక్తుడో అతని కావ్యాలబట్టి స్పష్టమవుతుంది. ఈ రంగంలో ప్రామాణికమయిన కృషి సల్పిన వారు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు శ్రీనాథుని ఈశ్వరార్చన నిరూపణకు ప్రధానంగా 'ఆరు' సాక్ష్యాలు కనిపిస్తున్నాయి.

**రచనలు:** శ్రీనాథుని తొలి రచన మరుత్తరాజు చరిత్ర శివ భక్తి మహిమను నిరూపించు కథ. పండితారాధ్య చరిత్ర పరమ శైవ ప్రామాణిక గ్రంథం. శృంగార ప్రధానమయిన నైషధంలోనే మామిడి సింగన శ్రీనాథుని "ఈశ్వరార్చన కళా శీలుండవు" అని ప్రశంసించాడు. ధనంజయ విజయము శివ సంబంధమగు కథ. భీమేశ్వర పురాణము, కాశీ ఖండము, శివరాత్రి మహాత్మ్యములు మూడును శ్రీనాథుని ఈశ్వరార్చన కళా శీలమునకు పట్టు కొమ్మలు. బాల్యమాదిగ శివునికి కావ్య పూజ చేసిన మహాకవి శ్రీనాథుడని సారాంశము.

**ఈశ్వరార్చన కళా శీలత్వం:** శ్రీనాథుని రచనలో కళా శబ్ద ప్రయోగాలు ఎన్నో కనిపిస్తాయి.

| | |
|---|---|
| పంచాంగ స్థిర మంత్ర రక్షణ కళా ప్రౌఢుండు | నై॥ 1.10 |
| రాజ్య విభవ కళా రక్షామణి | నై॥ 1.44 |

సత్క్రియా చార విధి కళాసరణి నై॥ 4.15

బ్రహ్మ జ్ఞాన కళా నిధనమవు నై॥ 1.13

ఈశ్వరార్చన కళాశీలుండవు నై॥ 1.13

ఆగమోక్త ప్రకారంగా శివ లింగార్చనం చేసేవాడు ఈశ్వరార్చన కళాశీలుడు. ఆగమములనేకమయినా శ్రీనాథుని పట్ల శైవా గమములకే ప్రాధాన్యం. ఈ ఆగమోక్త శివలింగార్చనం 'శాంభవ వ్రతం' పాశుపత వ్రతం.

**ఆగమ ప్రకారం:** శ్రీనాథునికున్న 'ఆగమానురక్తి' అతివేలం. కనుకనే శ్రీనాథుని పాత్రలలో 'పాశుపత వ్రతం' స్పష్టంగా కనిపిస్తున్నది.

ఆగమోక్త ప్రకారంబు ననుసరించి

శంభులింగంబు పూజించె జన విభుండు శృ॥నై॥ 8.184॥

అని నలుని కీర్తించాడు.

చంచరీ కాంగ । నాశరుచ్ఛాయ । నలరు

కుటిల । కోమల తర । దీర్ఘ । కుంతలములు

మడమ । లంటఁగ । నిడుపాటి । జడలు గట్టఁ

పాశుపత । మంత్ర । దీక్ష । చేపట్టె । గౌరి । హ॥వి॥ 4.10

పార్వతి పాశుపత దీక్ష వహించడమే కాదు అర్జునుడు కూడా 'పాశుపత దీక్షా ధురంధరుడు' (7ఆ.36. హరవిలాసం) అగస్త్యుడు కూడా పాశుపత । విద్యా । రాజ్య । పీఠస్థుడు (కాశీ 2.67) ఇవేగాక శివరాత్రి మహత్మ్యంలో కూడా 'పాశుపత వ్రతానికి' సంబంధించిన అనేకాంశములు చెప్పబడ్డాయి.

పాశుపతంలో 8 అంశాలున్నాయి. వీటినే అష్టావరణములంటారు. ఈ అష్టావరణంలో 'గురు' ప్రాధాన్యం ఎక్కువ. సిద్ధికి, దీక్షా సంస్కారానికి, మోక్షానికి గురువే మూల కారణం. ఈ అంశాన్ని శ్రీనాథుడు అర్జుని పట్ల 'సేవించు గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనావిధిన్' (హర॥వి॥ 7.35) అని పరమ గురూపదేశమున పార్థుడు (3.18) అని స్పష్టం చేశాడు. ఆలాగే సింగనామాత్యుని సంబోధిస్తూ 'శ్రీ గురు శంకర । మౌని । దయా గౌరవ । నిత్య । వర్ధితాన్వయ. అని గురు ప్రాభవాన్ని గుర్తింపజేశాడు.

శివలింగార్చనం శైవులకు పరమాచారం. శ్రీనాథుడు ఈ అంశాన్ని మరువలేదు. ఆ మహాకవి కావ్య పాత్రలు మరచిపోలేదు. నలుడు 'సైకత లింగం' కల్పించి పూజ చేసినవాడే. చిరుతొండనంబి దంపతులు సదా శివ లింగార్చన తత్పరులు. ప్రమథులు సరస్సమీపంలో లింగార్చనకు సంసిద్ధులైన వారే. అర్జునుడు మాయా కిరాతునితో 'మధ్యాహ్నమయింది శివార్చనకు ఏకాంతం కావాలి' అని అన్నవాడే. భీమ ఖండంలో వ్యాసుడు ఏడు రోజులు ఉపవాసంతో కృశించినా ఎనిమిదవ రోజు గంగానదీ తీరంలో 'వాలుకాలింగ' అర్చన చేసినవాడే. మరి అగస్త్యుడయితే నిజధామంలో శంభులింగం సమకూర్చుకొన్నవాడే.

దీక్షలో రెండు అంశాలున్నాయి. మొదటిది బాహ్యదీక్ష. వీటిలో 'విభూతి, రుద్రాక్ష ధారణం' ప్రధానమయినది. శ్రీనాథుని పాత్రలు చాల వరకు విభూతి రుద్రాక్షలతో కనిపించేవారే. అర్జునుడు 'భస్మోద్ధూళిత నిర్మలా వయవుడు', వ్యాసుడు రుద్రాక్షధారణం' చేసిన వాడే. 'భస్మత్రిపుండ్రాంక ఫాలదేశుడు' అగస్త్యుడు 'రుద్రాక్షభూతి ముద్రా ముద్రిత నిఖిల అవయవుడు నారదుడు 'విమలభస్మంబు నఖిలాంగకంబులనలది' రుద్రాక్ష మాలికలు వేసుకొన్నవాడే. విశ్వానరుడు 'విరజానల సంభవంబయిన భస్మంబున సర్వాగోద్ధూళనం' చేసుకొన్నవాడే. అర్జునుడు 'ముత్యాలతో । నెడవెట్టి । గ్రుచ్చిన । మంచి ।

రుద్రాక్ష దామములు' ధరించినవాడే. విశ్వేశ్వరుని దర్శించిన గృహస్థులు, భూతిరుద్రాక్షధారులు 18,555 మంది. ఇక అల్లాడ వేమారెడ్డి 108 ముత్తెములతో రుద్రాక్ష మాలికను మెడవేసుకొన్నవాడే.

పాశుపత వ్రతంలో మంత్రాలు అనేకం ఉన్నా ప్రధానమయింది 'పంచాక్షరి' శ్రీనాథుని పాత్రలకు ఈ మంత్రం కరతలామలకం. నలుడు 'పంచబ్రహ్మ పంచాక్షరంబుల పరమనియతి' జపించేవాడట. వ్యాసుడు ప్రణవ పంచాక్షరముల అర్చనం చేసేవాడట. నక్తంచరులు కూడా పంచబ్రహ్మ షడంగ మంత్రములనుం బ్రాసాద పంచాక్షరిని' మరవని వారు. అగస్త్యుడు 'పంచ బ్రహ్మంబును శ్రీ పంచాక్షరమును' జపము చేయు ఆదిమ శైవుడు. ఇక దేవతల సంగతి చెప్ప పని లేదు. పంచాక్షరీ మంత్ర పఠన తత్పరులు, వ్యక్తులే కాక శారికలు కూడా 'పంచాక్షరీ మంత్ర పారాయణం' జపిస్తుంటాయి.

శ్రీనాథుని కావ్య పాత్రలు 'శివ పూజ'లో సిద్ధ హస్తులు. షట్కాల శివ లింగార్చన చేయడంలో కుతూహలం ప్రకటించేవారు పూజలలో వారు కావించినది 'మహాపూజ'. అర్జునుడు ఇంద్ర కీలాద్రి పై చేసిన పూజ మహాపూజ. ఇది విజయ వాటిక కాదు. సంస్కృతాంధ్ర మహాభారత సాక్ష్యాల ప్రకారం హిమవంతమునకు ఆవలిది. మంచుమయమయిన ప్రదేశంలో బిల్వ ద్రుమం క్రింద వివిధ పుష్పాలతో చేసిన పూజ. అనవేమారెడ్డి షట్కాల శివ లింగార్చన తత్పరుడు.

**ఆత్మానుసంధానం:** ఆత్మలో శివుని అనుసంధానం చేయడం ఆత్మానుసంధానం. అంతరంగ జ్యోతిర్లింగ పరిష్వంగం, నలుడు పద్మాసనంలో కూర్చొని మానస కమల కర్ణికలో కాలకంఠుని భావించడం, అర్జునుడు బద్ధపద్మాసనుడై "మనో వీథీసదాధ్యాసితన్ సదాశివుని సేవించడం, మహాదేవుని ఉపదేశం. విశ్వానరుడు పుండరీక చర్మాసనంలో కూర్చొని అవిముక్త విశ్వేశ్వర శ్రీ మన్మహాదేవరను భావించడం, ఈశ్వరార్చన కళా శీలమే. వివిధ పాత్రల అఘమర్షణ స్నానం మొదలు ఆత్మానుసంధానం దాకా ఆగమోక్త ప్రకారమయిన ఆహ్నిక విధానం ద్వారా ఆత్మానుసంధానాన్ని శ్రీనాథుడు వర్ణించి తన ఈశ్వరార్చన కళాశీలత్వాన్ని స్పష్టం చేశాడు.

**భావ నీరాజనం:** మూలంలో లేకపోయినా శ్రీనాథుడు ఆయా సందర్భాలకు అనుగుణంగా వర్ణించిన వర్ణనలు, ప్రకటించిన సంబోధనలు, ప్రకృతిలో పరమేశ్వర దర్శనములు అన్న భావ నీరాజనంలోనే అంశాలు నైషధంలోని తారకా గణ వర్ణన

అభినవ । సంధ్యా । తాండవ
రభస । రయచ్ఛిన్న । హిమధరాధర కన్యా
ప్రభు । హారాస్థల । భంగిన్
నభస్థ లిం। దారకా గణంబులు । పొడిచెన్

తాండవ వేగంలో జారిపడిన శివుని హార అస్థికలు తారలట. అలాగే శ్రీనాథునికి దర్శనమిచ్చిన చంద్ర బింబము 'దంబైన పాన వట్టంబు, కాశ్మీర శంభులింగము, నవ కుంకుమా వేపనము పూజ చేసిన కల్వ పువ్వు, ఆసమశర సార్వభౌముని ముత్యాల గొడుగు, అలాగే కాశీ ఖండంలో మేడిచెట్టును శివరూపంగా వర్ణించాడు. శివరాత్రి మహాత్మ్యంలో హంసల రొందలు కూడా శివ పరంగా' పరలోకస్థు (బతిన్ ఋషాంకు బ్రతికింపంగోరి యోంకార శంకరు మ్రోలన్ ఆక్రందించే విధంగా ఉందని వర్ణించాడు. ఆలాగే పలనాటి వీరచరిత్రలో కూడా బాలచంద్రుని మరణానంతర దృశ్యాన్ని శ్రీనాథుడు

'శివుడేడి? కైలాస । శిఖరంబు । నేది
సోముఁడు । వృషభంబు । సురనది । యేడ
ఎక్కడి కేగెనో । యెఱుఁగ । రాదంచు
సంశయ స్వాంతయై । శైలజ । వెదకె

**రూప సాక్షాత్కారం:** శివ స్వరూపాన్ని మననంతో, ధ్యానంతో, తపంతో, జపంతో దర్శించిన వాడు శ్రీనాథుడు. అందువల్ల పాత్రల ముఖతః శివ స్వరూపాన్ని, అమ్మవారి అద్వితీయ సౌందర్యాన్ని అమిత భక్తితో వర్ణించాడు. ఈశ్వరార్చన కళాశీలత్వానికి ఇవి ప్రబల ఉదాహరణలు. హరవిలాసంలో చిరుతొండనంబి దంపతులకు సాక్షాత్కరించిన వైభవాన్ని రక్షాపాండురమైన దేహము (2.135) అనే పద్యంలో పెండ్లి కొడుకు రూపాన్ని భసితంబు కర్పూర పాళి కస్తూరికా (4.91) పద్యంలోను, ఆది భిక్షురూపాన్ని జమిలిపాములతోడి (5.5) పద్యంలోను శివుని కిరాత రూపాన్ని వికట పాటల జటా (7.41) పద్యంలోను, భీమేశ్వర పురాణంలో శివుని కళారూపాన్ని 'వేద వేదాంత విద్యావందిత' 5.9) అనే సుదీర్ఘ వచనంలోనూ పార్వతీ పరమేశ్వరుల యౌశ పద్య రూపాన్ని చంద్ర బింబానన పద్యంలోనూ వర్ణించాడు. ఇక కాశీ ఖండంలో శివుని గృహమేధి రూపాన్ని (7.187), సకల జగదిష్ఠా త్రిరూపాన్ని (4.150), అన్నపూర్ణా విశాలాక్షీ రూపాన్ని (7.148) భావుకతో వర్ణించినాడు. మచ్చుకు - అన్నపూర్ణ పెట్టిన భిక్ష ఆరగించిన వ్యాసుడు దర్శించిన పార్వతీ పరమేశ్వరుల వర్ణన

చంద్ర బింబానన । చంద్ర రేఖా మౌళి । నీలకుంతల భార । నీల గళుడు ధవలాయ తక్షణ । ధవళాఖిలాంగుఁడు । మదన సంజీవని । మదన హరుఁడు నాగేంద్ర నిభయాన । నాగకుండల ధారి । భువన మోహన గాత్ర । భువన కర్త గిరిరాజ కన్యక । గిరిరాజ నిలయుందు । సర్వాంగ సుందరి । సర్వ గురుడు గౌరి । శ్రీ విశ్వనాథుండు । కనకరత్న । పాదుకలు । మెట్టి । చెట్టలు । పట్టి । కొనుచు నేగుగెంచిరి । యొయ్యార । మెసక మెసంగ । విహరణ క్రీడ । మాయున్న । వేదికపుడు

**స్తోత్ర పారాయణం:** భక్తుడయిన వాని స్తోత్రాలు అన్వర్థాలు. బహు భావ సమన్వితాలు. హృద్గత అక్షర స్వరూపాలు. శ్రీనాథుని రచనలలో విశిష్ట స్తోత్ర వాఙ్మయముంది. ఆ మహాకవి శైవ సంబంధితమయిన శతరుద్రియం, నీలకంఠస్తవం, శంకర గీతాలు, మంద్రు మహా ప్రబంధాలను స్మరించాడు. హర విలాసంలో బ్రహ్మ విష్ణు మూర్తులు శివ స్తోత్ర పంచకం, తనకు సాక్షాత్కరించిన శివుని అర్జునుడు సాప్త విభక్తులతో చేసిన స్తోత్రం, భీమేశ్వర పురాణంలోవ్యాసుడు శివభక్తి ఆవేశంతో పాడిన వచనగీతం, లక్ష్మ్యాదులు భీమేశ్వరుని భక్తి వచనాలతో కీర్తించిన వైనం, కాశీ ఖండంలో బృహస్పతి కృత శివస్తవం, బ్రహ్మ కీర్తించిన దివ్య లింగ స్వరూప యధా తథ వర్ణన, సతీదేవి దక్షునికి హితబోధ చేస్తూ చేసిన శివుని వర్ణన శివరాత్రి మహాత్మ్యంలో సుకుమారుడు కైలాసేశ్వరుని కీర్తంచిన రీతి, యయకృత శివస్తుతులతో శ్రీనాథుని భక్త్యనురంజితమయిన ఈశ్వరార్చన కళా శీలత్వము సువ్యక్తం.

**మచ్చుకు:**

ముక్కంటీ! నీకు మొక్కెదను । శివా! నీకు నవాంజలి ।
భవా! నీకు నభివాదంనంబు । పాండురంగా! నీకుదండంబు ।
రాజశేఖరా! నీకు జేజే । హరా! నీకు జోహారు । గిరీశా నీకు వరివస్య ।
గౌరీ మనోహరా! నీకు నమస్కారంబు ।

సంస్కృతాంధ్ర భాషలలో మార్గదేశిగతులలో జాతి వృత్తములతో పద్య గద్యములలో శివభక్తి విన్యాసం స్పష్టంగా కనిపిస్తున్నది.

**హరిహరా భేదం:** శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడే కాని వీర శైవుల లాగా హరిద్వేషి కాడు. హరిహరా భేదం పాటించే స్మార్త శైవుడు. అందుకే ఈ కవి 'పాత్రలన్నీ స్మార్త రూపంలో కనిపిస్తాయి. నైషధంలో శ్రీనాథుడు నలునిచే హరికి పూజలు చేయించినాడు. భీమేశ్వర పురాణంలో వ్యాసుడు మహా విష్ణువును అష్టాక్షర, ద్వాదశాక్షర మంత్రాలతో కీర్తింపజేశాడు. యోగ నిద్ర నుండి మేల్కొనే మహా విష్ణువును వర్ణించాడు. కాశీఖండంలో విష్ణు పట్టాభిషేకాన్ని లక్ష్మీస్తోత్రాన్ని రమ్యాతిరమ్యంగా వర్ణించాడు. మచ్చుకు -

అభినవోన్మేష । జిహ్మం బైన । తొలుచూపు । కౌస్తుభా । లోక ।రేఖలకు । నలఁగ
సాంగ । భంగంబైన । ఆవులింతకు । వేల్పు । లంగుళి । స్ఫోటనం । బాచరింప
సౌఖ శాయనికులై । సంవర్త । భృగ్వాది । మునులు । హస్తాంభోజములు । మొగుడ్ప
ధృత చేతనంబులై । దివ్యాయుధంబులు । జయజయ । ధ్వనులతో । సంస్తుతింపఁ
కలువ । ఱేకులుఁ । బోలెఁ । బెంజిలువ ఱేని
యరటి । కుబుసంపుఁ । బొరలు । మై నంటి యుండ ।
నిదుర । మేల్కొంచి । కూర్చుండె । నుదధి । నడుమ ।
విష్ణుఁ । డఖిలశ్వరుఁడు । శరద్వేళ యందు । 4.22

అన్నిటి కన్నా మిన్నగా శివుడు

"విష్ణుండయేను ...... నేన విష్ణుండ .......... నాకు విష్ణునకు భేదంబు లేదు'. అని ప్రకటించడం శ్రీనాథునికున్న హరిహరా భేద తత్త్వాన్ని స్పష్టం చేస్తుంది.

**వివిధ ఆలయ సందర్శనం:** శ్రీనాథునికి హరిహరా భేదం లేదనడానికి ఆ కవి వర్ణించిన వైష్ణవ శైవ క్షేత్రాలు ప్రబల నిదర్శనాలు. శ్రీకూర్మం, సింహాచలం, పిఠాపురం, సామర్ల కోట, భీమ వరాల లోని వైష్ణవ మూర్తుల్ని కీర్తించడమే గాక కోటిపల్లి, కుండలేశ్వరం, వలివెల, ఏడిద, సంపర, రాజమండ్రి, తాళ్ళపూడి పట్టిసం, పాలకొల్లు, శునుపూడి, భీమవరం, అమరావతి, శ్రీశైలం, దాక్షారామం, వారణాసి లాంటి శైవ క్షేత్రాలను దర్శించి అక్కడి శివమూర్తులను నుతించాడు.

శ్రీనాథుడు శైవం గురించి ప్రత్యేకంగా శాస్త్ర గ్రంథాలు వ్రాయకున్నా శైవేతరులను అధిక్షేపించకున్నా అతనిది 'శివభక్తి' శ్రీనాథుని శీలానికి మూలం. 'ఈశ్వరార్చన కళాశీల'మే.

## 2. శ్రీనాథుని సీస పద్య రచనా విధానము :-

ఆహ్లాదాన్ని కలిగించేది ఛందస్సు. ఈ ఆహ్లాదం వర్ణ, యతి, ప్రాస, గణాదుల వల్ల కలుగుతుంది. ప్రత్యేకించి గణాదుల సంయోగం వల్ల వివిధ వృత్తాలు, జాతులు, ఉపజాతులు ఏర్పడతాయి. భావానికి తగిన ఛందోరీతిని ఎన్నుకొన్న కవి రచన పాఠకులకు ప్రీతి పాత్రమవుతుంది. అంతేగాక చర్విత చర్వణమైన ఛందోరీతుల్ని విభిన్న గతులతో నడిపి ఆహ్లాదగుణం పెంచిన కవులెందరో. వారిలో శ్రీనాథ మహాకవి ఒకరు. కందమునకు సోమయాజి ఘనుడందురు. అలాగే సీస పద్యాలనగానే శ్రీనాథుడు అనడం వాస్తవం.

సీస పద్యం దేశీయచ్ఛందస్సులలో విశిష్టం. దీనినే వర్ణనా ఛందంగా కూడా చెప్పవచ్చు. వర్ణించవలసిన అంశాల్ని విశేషంగా వర్ణించడానికి ఉపయుక్త ఛందం. అదీగాక 'సీసం' గేయానికి దగ్గరిది. అజగరం లాగా పడి వున్న సీసానికి నాట్య రీతులు నేర్పిన వాడు శ్రీనాథుడు. నన్నయ సీస పద్యాలలో పాదాంత విరతి పద్యాలు తక్కువ. శ్రీనాథునిలో ఎక్కువ. ఆచార్య కొర్లపాటి వారి మాటల్లో శ్రీనాథుని సీస పద్యము నవరత్న పదకము. ఆ పదకమునకు ఆంధ్రీకరణ పద్ధతి స్వర్ణ నైపథ్యము.

శ్రీనాథుని నైషధ ఆంధ్రీకరణం 'సీసం'తో మొదలై సీస పద్యంతో ముగిసింది. అంతేగాదు శ్రీనాథుని అవసాన కాలం నాటి పద్యం కూడా సీస పద్యమే. శ్రీనాథుని సీస పద్య రచనా విధానాన్ని ఆంధ్రీకరణం, ఛందస్సంబంధి ఇతరాంశాల దృష్టితో పరిశీలించవచ్చు.

**1:** శ్రీనాథుని అనువాదంలో వరుస శ్లోకాల వంతపాట లేదు. అటునిటు గల శ్లోకాల ఏక దేశానువాదం. కుమార సంభవంలో కాళిదాసు పరమేశ్వరుని కల్యాణ నేపథ్యాన్ని 7వ సర్గ 32, 33, 34, 35 శ్లోకాలలో వర్ణించాడు. దీనినే శ్రీనాథుడు

4వ ఆశ్వాసం 91వ పద్యంలో

"భసితంబు కర్పూర పాళికస్తూరికా భరితాంగరాగ సంపద వహించె
పచ్చి యేనుఁగు తోలు పసిడి కమ్మల తోడి పట్టు పచ్చడము విభ్రమముఁదాల్చె
భుజ మధ్యమునఁ గ్రాలు భోగి భోగంబులు తారహారముల చందంబు నొందె
చికిలించు నెఱగంటి చిగురుమోడుపు తెప్ప హరితాళితిలకంబు గరిమ వడసె
దినమునందును వెన్నెల దీటు కొనఁగ శైశవంబున విగతలాంఛనతఁ జెంది
చాల నొప్పారు సుకుమార చంద్రరేఖ తనకుఁ దాన చూడా మణిత్వము వహించె"

**2:** సమూలకంగా సీస పద్యాలను వ్రాయడం, కుమార సంభవంలో హిమవంతుడు సప్తర్షుల రాకతో ధన్యుడనయ్యాననే సందర్భంలోని శ్లోకాలను **(6-58, 59, 60, 61)** యథాతథంగా అనువదించాడు.

స్థావరంబగు మేను పావనత్వముఁజెందె భవదీయ పాద సంస్పర్శనమునఁ
గడగంటి నాజన్మ కల్మి కృతార్థతఁ గన్నులారఁగ మిమ్ము గానబడసి
యుష్మత్కృపాసమభ్యుదిత సంతోషంబు నిండి రై వాఱె నా నెమ్మనమున
మీ తేజమున నిండు మేనిలోఁ దహతహఁ గలుషాంబుపటలంబు గ్రాఁగి పోయె
ననుఁ గృతార్థునిఁ జేయఁ బావనునిఁ జేయఁబరమపుణ్యునిఁజేయ సంపన్నుఁ జేయఁ
దలఁచి యేతెంచుటది తక్కఁ దక్కఁగలుగు కార్య మానతియిండార్య వర్యులార! 59.ప. 4 ఆ

**3:** ఆంధ్రీకరణలో ఒక సీస పాదమయినా అమూలకం కావడం

పవడంబు మీఁది కోపముననో యీ కాంత సాగంబులత్రంత కోమలము -నైషధం 3.202
కలిత ముక్తా ఫల గ్రైవేయకంబుతో ఁదులదూగు గాక పెంజిలువ పేరు కుమార 4.28

**4:** సీసంలో రెండు పాదములు అమూలకంగా రచించడం

గ్రహణ వేళల యందు రాహువాహారించి తృప్తియై గఱ్ఱునఁ ద్రేచెనేని
విషమ నేత్రుఁడు చేతి విషమారగించుచోఁ బ్రతిపాకముగఁజేసి త్రావెనేని -నైషధం 2.123
ఆకాశ హర్మాగ్ర్య హస్త దీపంబులు ప్రాలేయ జలరాశి బాడబములు
రాజ మండల కాంతి రాజ యక్ష్మము లంధకార వేదండ కంఠీరములు - నైషధం 8.11

**5:** మూడు శ్లోకాలు గ్రహించి మూడు సీస పాదాలు అమూలకరచన

మధురాక్షరములు నీ మహిత భాషణములు కీర్తనీయంబు నీ వర్తనంబు
ప్రౌఢి యుక్తంబు నీ ప్రతిభావిశేషంబు కమనీయతరము నీకల్కితనము
శ్లాఘనీయంబు నీ సౌహార్ద గరిమంబ ప్రార్థనీయంబు నీ ప్రాభవంబు -నైషధం 2.62

**6:** మూల శ్లోకాలు మూడు నాలుగు సీస పాదాలుగా సంతరించి ఎత్తు గీతిని సమూలకంగా రచించడం. నలిన సంభవు వారు నంబులు **(2.49)** పద్యంలోని ఎత్తుగీతి

భారతీ దేవి ముంజేతి పలుకుఁజిలుక
సమదగజయాన సబ్రహ్మచారి మాకు

వేదశాస్త్ర పురాణాది విద్యలెల్లఁ

దరుణి ! నీయాన ఘంటాపథంబు మాకు

ఆలాగే కుమార సంభవంలో 'హస్తయుగ్మమ్ము మోడ్చి (4.49) పద్యంలోని

తేనెవెట్టుండు కస్తూరి దీర్చియచటఁ

జేర గొజ్జంగి పూనీట చెంబులిడుడు

నన్ను వలరాజుఁదలఁచి మన్ననఁదలిర్పఁ

దశ సమర్చన చేయుఁడు దంపతులకు

ఎత్తు గీతి అమూలకం

7: అమూలకమయిన నాలుగు సీస పాదాలు కాదా ఎత్తు గీతి మాత్రం ఏకదేశాత్మకం కావడం. నైషధం 1.70వ పద్యం

కోరి లీలా గేహ కుడ్యభాగంబుల వ్రాయుదు రమ్మహీశ్వరుని మూర్తి

వ్రాసి కన్యాత్వ గౌరవము వీసరవోవ దర్శింతు రనురాగ తరళ దృష్టి

దర్శించి యతని కేఁదగుదునొతగనొయంచించు కించుక సంశయింతురాత్మ

సంశయించి కరాంబుజములఁ గ్రొమ్మించుటద్దము నెత్తి చూతురు తమ్ముఁదారు

రాజకన్యలు జగతి నాక్రమమునందుఁ గందు వారల నిట్టూర్పు గాడ్పు వేఁడి

ముకురములు చారు మోహనమూర్తి మనఁగఁ బరఁగు దమయంతి చేతి దర్పణము దక్క 70 ప.1ఆ

8: రెండు శ్లోకాలను నిమిత్తమాత్రంగా స్వీకరించి, స్వతంత్ర కల్పనలతో ప్రపంచీకరించి సమగ్ర సుందరంగా రచించడం నైషధం 2.122.

విరహిణీ వధ మహాదురిత పంక కళంక కలుషితాత్మకుఁడైన ఖలుఁడు వీఁడె

కాలకూటక కఠోర కల్పాంత వహ్నికిఁ దోఁబుట్టువైన ఘాతకుఁడు వీఁడె

చండ దీధితికర జ్వాల మండలములోఁబ్రోదిఁబొందిన మహోగ్రుండు వీఁడె

బాడబంబును దాను బాథోధికుక్షిలో సరిపొత్తు మన్న దుర్జాతి వీఁడె

సైంహి కేయని శాత దంష్ట్రా విటంక విషరస ప్రతిపాకభావితుఁడు వీఁడె

గగన మను రుద్రభూమి నేకతఁదిరగు చదరు లుమిసెడి కొఱవిదయ్యంబు వీఁడె 122ప. 2ఆ.

9: ఒక శ్లోకాన్ని ప్రపంచీకరించి మొత్తం సీస పద్యం సంతరించడం

మదేకపుత్రా జననీ జరాతురా నవ ప్రసూతిర్వరటా తపస్వినీ

జనస్త మర్దయన్నహో విధే త్వాం కరుణారుణద్ధిన 1.135

తల్లి మదేక పుత్రక పెద్ద కన్నులు గాన దిప్పుడు మూడు కాళ్ల ముసలి

యిల్లాలు ఁగడు సాధ్వి యేమియు నెఱుఁగదు పరమ పాతివ్రత్య భవ్య చరిత

వెనుక ముందర లేరు నెవ్వరైన చుట్టాలు లేవడి యెంతేని జీవనంబు

గానక కన్న సంతానంబు శిశువులు జీవన స్థితి కేన తావలంబు

కృపఁదలంపఁగదయ్య యోనృపవరేణ్య అభయమీవయ్యయో తుహినాంశు వంశ
కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి! నిగ్రహింపకుమయ్యయో నిషధ రాజ నైషధం 1.109

ఛందస్సంబంధి అంశాలు.

సీస పద్యంలో ఆరు ఇంద్ర గణాలు రెండు ఇంద్ర గణాలుండడం నియమం. ఇంద్ర గణాలలో కొన్ని చతుర్మాత్రకాలు కొన్ని పంచమాత్రాత్మకాలు. అయిదు మాత్రల గణముల పాద గమనం మనోహరాత్మకం. అందువల్లనే శ్రీనాథుడు పంచమాత్రాత్మకాలకు ప్రాధాన్యమిచ్చాడు.

మాటుగా వైచిన మాంజిష్ఠ తెరయెత్తి
పంజు మంచము డిగ్గె మంజుఘోష హర.వి. 7.137
ఆంధ్రభూ భవన మధ్యము పుండరీకంబు
సప్త గోదావర జలము తేనె భీమ 3.50
ఎన్నఁడు చూతునో యింకొక్క మాటేను
ప్రకటకైవల్యాంబు రాశిఁగాశి కాశీ 2.158
యమునానదీ సైకతమున జాలరి కన్య
చనుదోయి నంటఁదే శక్తి సుతుఁడు శివ.రా.మా. 2.101

ఇక రెండవ అంశం సీస పద్యానికి ఆటవెలదిగాని తేటగీతి గాని కూర్చవచ్చు అనే నియమమున్నప్పటికిని శ్రీనాథుడు నైషధంలో ఒక్క చోట తప్ప ఇతరత్ర తేటగీతినే కూర్చడం విశేషాంశం.

లాక్షణికులు సీస పద్యాల్ని ఎత్తుగడ, యతి ప్రాస భేదాల్ని బట్టి అనేక రకాలుగా విడదీశారు. గణం బట్టి సల ఎత్తుగడ, తగణ ఎత్తుగడ, నగ గణం ఎత్తుగడ, నల గణ ఎత్తుగడ, భ గణం ఎత్తుగడ, ర గణం ఎత్తుగడ అని ఒక వర్గీకరణం.

ఇలాంటివి శ్రీనాథుని రచనలో ఎన్నో కనిపిస్తాయి. మచ్చుకు

**ర గణం ఎత్తుగడ:**

కాదుకాదుదయాద్రి కనకకూటుంబి ది
డంబైన పానవట్టంబు గాని భ.పు. 2.42

**భ గణం ఎత్తుగడ:**

ఎన్నఁడు చూతునో యింకొక్క మాటేను
బ్రతుకు కైవల్యాంబు రాశిఁగాశి కాశీ 2.158

మరికొన్ని అంశాలు

భాషా దృష్టితో పరిశీలిస్తే శ్రీనాథుని సీస పద్యాలు కొన్ని సంస్కృత సమాన భూయిష్టమై సంస్కృత ఛందంలో కనిపిస్తాయి.

దూర్దండ ఘట్టన త్రుటిత గ్రహ గ్రాహ
ధూళి పాళీ మిళ ద్యుస్థలములు కాశీ-
మరికొన్నిట తెలుగు పద జాల సమృద్ధి
సెలయేటి తెలినీటఁ జిఱుబంతి పసుపాడి

సేస క్రుమ్ముళ్ల (బిచ్చియలు తుఱుమి హర.వి. 5.38

సమాసంతో చ(రున సాగి చివర తెలుగు క్రియా విన్యాసం

గగన కల్లోలినీ కల్లోల మాలికా

హల్లీసకములతో నవఘుళించి కాశీ 1.37

మొదట సమాపకం వెంట అసమాపకంతో సాగేవి

ముడువంగ నేర్తురు మూల గమ్మని తావి

గలుగు క్రొవ్విరులులో (గందకుండ భీ.పు.

పుంఖానుపుంఖంగా రెండు సమాపకరాలతో ఒక క్రొత్త నడక

సరిపుచ్చు ననవచ్చు శతమన్యు వీటికి

వివిధ దేవాగార వి(శమమున భీ.ఖం.

చ(రున సాగి క్త్వార్థకంతో ఆగి ఒక్కచో రంగుల జల్లు

మలయాచలంబు పై (జిలువ యిల్లాం(డుల

ఫణ రత్నముల యందు ప్రతిఫలించి కా.ఖం.

ధాతుజ విశేషణంతో (తుంచి దానితోనే మరల పెంచి అచ్చెరువున ముంచే వైనం

దుర్భిక్ష దోషంబు దొరకొన్న (గడపని

కడపని గృహ సూతకమ్ము నందు కా.ఖం.

ఇవేగాక శ్రీనాథుని సీస పద్యాలలో శృంగార సీసాలు, వీర సీసాలు, కరుణ సీసాలు అనికూడా విభజించి పరిశీలించడానికి వీలుంది. మచ్చుకు

**కరుణ రసాత్మక సీసం:**

కల హంసి! రారాదె కదలి నాతో గూడి

నీవేల వత్తమ్మ నెమ్మి నుండి కా.ఖం.

**పాండిత్య వీరానికి:**

వచియింతు వేములవాడ భీమన భంగి

నుద్దండ లీల నొక్కొక్క మాటు కా.ఖం.

**మరికొన్ని సీసగతులు:**

సర్వనామం ఆదిలో ఉంచడం

అదె పట్టిస స్థానమందుండు వీరభద్రేశ్వర స్వామి అర్ధేందుమౌళి భీమ 3.55

పాద మంతా సంస్కృత సమాసంతో నడపతం

పతి పాణి పల్లవచ్యుత నీల బంధన

వ్యగ్ర బాలాహస్త వనరుహంబు నై. 7.177

పాదాన్ని రెండు భాగాలు చేసి ఏ పాదం ఆ పాదం విడిగా కూర్చుతం

పంజార గర్వార పాదంబులు దెచ్చె

జలనోంగి బంగారు మొలక దెచ్చె హర. 1.26

ఆలంకారికంగా సీస పద్యమంతా సాగించడం

ఆంధ్ర భూభువన మధ్యము పుండరీకంబు

సప్త గోదావర జలము తేనె

బ్రహ్మ సంవేద్యాది బహు తీర్థములు రేకు

లవరులు చారు దివ్య స్థలములు

నాళంబు లవణాబ్ధి వేలా విభాగంబు

కల్యాణ భోగ మోక్షములు తావి

దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక

హంసంబు భీమ నాయకుఁడు శివుఁడు

గౌతమీ సింధు కౌంతేయ కణ్వ నదులు

తుల్య భాగము నేలేఱు దుమ్మి కానలు భీమ

ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీనాథుని ప్రతి సీస పద్యము ప్రత్యేక శైలీ విన్యాస భరితమే.

## 3. శ్రీనాథుని కవితలోని వక్రోక్తి:

సాహిత్య ప్రస్థానంలో 7 సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో 'వక్రోక్తి' సంప్రదాయమొకటి. ఈ సంప్రదాయ ప్రవర్తకుడు 'కుంతకుడు'. ఇతని రచన 'వక్రోక్తి జీవితమ్'. కాని కుంతకుని ముందే ఇతర అలంకారికులు 'వక్రోక్తి'కి సంబంధించి కొన్ని అభిప్రాయాలు ప్రకటించి వున్నారు. భామహుడు వక్రోక్తిని ఒక ప్రత్యేక అలంకారంగా పరిగణించ లేదు గాని సర్వాలంకార వ్యాపకంగా, సర్వాలంకార బీజంగా భావించాడు. కావ్యానికి కావ్యత్వం 'వక్రోక్తి' వల్లనే సాధ్యమన్నాడు. 'అతిశయమే వక్రత' అని అతని అభిప్రాయము. దండి తన కావ్యాచర్మంలో శ్లేషాలంకారాన్ని వక్రోక్తికి పుష్టి కారణంగా భావించాడు. వామనుడు వక్రోక్తిని అలంకారంగా - అర్థాలంకారంగా పరిగణించాడు. అయితే రుద్రటుడు తన కావ్యాలంకారంలో 'వక్రోక్తిని' శబ్దాలంకారంగా గణించాడు. చంద్రాలోక కువలయానందకారులు రుద్రటుని సమర్థించినవారే. అభినవ గుప్తుడు 'శబ్దస్యహి వక్రతా అభిధేయస్య చ వక్రతా లోకోత్తీర్ణేణ రూపేణ అవస్థానమ్' అని వక్రత శబ్ద రూపంగా అర్థ రూపంగా ఉంటుందని చెప్పాడు. కుంతకుడు కవి వ్యాపారం అనిర్వచీయంగా కవి వ్యాపార వక్రత్వం బహు భంగులుగా భావించాడు. వక్రోక్తి అంటే ప్రసిద్ధ అభిధాన వ్యతిరేక విచిత్ర అభిధనం. ఒక విధమయిన విచ్ఛిత్తి, చారుత్వం, చమత్కారం, సౌందర్యం హృద్యత్వాన్ని ఆపాదిస్తుందని కుంతకుని అభిప్రాయం. ఈ వక్రోకిని 6 రకాలుగా విభజించాడు.

ఎ. వర్ణ విన్యాస వక్రత

బి. పదపూర్వార్థ వక్రత

సి. పదపరార్థ వక్రత

డి. వాక్య వక్రత

ఇ. ప్రకరణ వక్రత

ఎఫ్ . ప్రబంధ వక్రత

**ఎ) వర్ణ విన్యాస వక్రత:-** కుంతకుడు వర్ణ విన్యాస వక్రతా భేదాలుగా ఆరింటిని వివరించాడు. ఇవన్నీ శ్రీనాథుని రచనలో కనిపిస్తాయి. వాటిలో మొదటిది ఏకవర్ణ పునః పునరావృత్తి.

1. ఇంచుకంత వ్యవధానంతో కూడిన ఒక వర్ణం మాటిమాటికి ఉపనిబద్ధం కావడం. వర్ణమంటే వ్యంజనమని అభిప్రాయం.

తరిగొండఁ దరువఁ దరువం
దిరుగుడు వడు నుదధిలోనఁ దీవ్రముగా ది
ద్దరఁ దిరుగుచుఁ దరఁగల వడి
దరతరము సుపర్వ సురభి దరికిం జేరెన్ హర విలాసం 6.90

ఈ పద్యంలో సముద్ర మధన శబ్దం, అల్లకల్లోలం గిరగిర తిరగే తరగలతో తిరుగుతూ సముద్రం నుండి బయలు వెడలే కామధేనువు వర్ణన ఉన్నది 'ర' వర్ణం అనేక మార్లు ఆవృతం కావడం వల్ల ఇది ఏకవర్ణ పునః పునరావృత్తి.

2. **ద్వివర్ణ పునః పునరావృత్తి:-** కొంచెం కొంచెం వ్యవధానంతో కూడిన రెండు వర్ణాలు మరల మరల నిబర్థితమయితే అది ద్వివర్ణపునః పునరావృత్తి.

దేవ బ్రాహ్మణ భక్తి వర్ధిత ధరిత్రీ చక్ర సామ్రాజ్య ల
క్ష్మీ వాస్తోష్పతి సంస్తుతింపగ దగున్ శ్రీ వేమప్ప థ్వీశ్వరున్
లావణ్యా పరమత్స్యలాంఛనుని నాలం కాపురీ శంకర
శ్రీవాభ్యంతరకూల ముద్యహా యశః కల్లోలినీ వల్లభున్ భీమ ఖండం 1.39

ఈ పద్యంలో రేఫ యుక్త వ్యంజనాలు, ద్విత్వలకారాలు పునః పునః ఆవృత్తం కావడం వల్ల ద్వి వర్ణ పునః పునరావృత్తి వక్రోక్తి.

3. **బహు వర్ణ పునరావృత్తి:-** అనేక వర్ణాలు మాటిమాటికి ఆవృత్తి కావడం బహు వర్ణ పునరావృత్తి.

హేమంతము శరదాగమ
సామంతము తుహిన కణ విసర్పిత శబరీ
సీమంతము మదనబల
శ్రీమంతము డాసె భువన సీమంతంబై శివరాత్రి మాహాత్మ్యము 4.22

పై పద్యములో 'మంతము' అనేకసార్లు ఆవృత్తి కావడం వల్ల బహు వర్ణ పునరావృత్తి వక్రత.

4. **స్పర్శవర్ణాలు:-** తమ తమ వర్గాంత వర్ణాలతో కలిసి పునః పునరావృతం కావడం.

కాలకూట విషాగ్ని కబళహేలాగ్రాస
కల్మాషితాసిత కంఠు చేత,
గుంభినీధర సుతా కుచ కుంభ పరిరంభ
సంభావనాకేలి శాలిచేత
గగన కల్లోలినీ కల్లోల మాలికా
స్ఫారిత బాలేందు మౌళి చేతఁ
గుటిల కుండలి రాజ కుండలాలంకార
విలసిత గండమండలుని చేత

ఈ సీస పద్య పాదాలలో వర్ణాంత వర్ణాలతో కూడిన స్పర్శ వర్ణాల సంతరింపు స్పష్టంగా కనిపిస్తుంది.

5. ద్విరుక్తాలయిన క, త, ల, న వర్ణాలు పునః పునః ఆవృత్తం కావడం.

ఒక్క నిమేషము రాహువు
పుక్కిటిలో (దగులు వడక పోయెడు భానుం
డిక్కా(డ ప్రక్క( జిక్కెం
బెక్కేడులు విధివశంబు పెంపెట్టిదియో          కాశీ ఖండం 1.134

ఈ పద్యంలో ద్విరుక్త క వర్ణం పునరావృతమయింది. చిక్కువడిన ఆదిత్యుని అవస్థను స్పష్టం చేస్తున్నది.

6. రేఫాది సంయుక్త వర్ణాలు మరల మరల ఆవృత్తి కావడం.

కుక్షి ప్రోద్భవ నిష్ఠుర క్షుధిత దుస్ప్రోక్ష ధాంధకారంబునన్
జక్షుల్ రెండును జిమ్మ చీకటులుగా సంరంభశుంభద్గతిన్
బ్రేక్షప్ర్యాత్రులు భీతి(బొంద(గడు నుద్రేకించి హట్టంబునన్
భిక్షా పాత్రము రాతి మీద శతధా భిన్నంబుగా వైచితిన్          భీమేశ్వర పురాణం - 2.102

భిక్ష దొరకక క్రుంగి కృశించి దిగాలు పడిన వ్యాసుని క్రోధా వేశాన్ని 'క్ష' స్ఫురింపచేస్తున్నది.

**బి) పద పూర్వార్థ వక్రత:-** ప్రాతిపదిక లేదా ధాతువు యొక్క వైచిత్రీ విశేషకారణంగా ద్యోతకమయ్యే రామణీయకం పద పూర్వార్థ వక్రత. ఇది పది రకాలు. ఈ భేదాలన్నీ శ్రీనాథుని రచనలో కనిపిస్తాయి.

**1. రూఢి వైచిత్ర్య వక్రత:-** రూఢములయిన పదాల వైచిత్రి వల్ల కలిగిన వక్రత రూఢి వైచిత్ర్య వక్రత. పదార్థం వల్ల లోకోత్తర తిరస్కార ఉత్కర్షగాని, శ్లాఘు ఉత్కర్ష వివక్షగాని ప్రస్ఫుటమయితే అదే రూఢి వైచిత్రి.

శ్రీ భీమ నాయక । శివనామ । ధేయంబు
చింతింప । నేర్చిన । జిహ్వ । జిహ్వ
దక్ష వాటీ పురాధ్యక్ష । మోహన మూర్తి(
జూడంగ । నేర్చిన । చూపు । చూపు
దక్షిణాంబుధి । తటస్థాయి । పావన । కీర్తి
చేనింప । నేర్చిన । చెవులు । చెవులు ।
తారక బ్రహ్మ । విద్యాదాత । యౌదల ।
విరులు । కూర్పంగ । నేర్చు । కరము । కరము ।          భీమఖండం 3.198

ఈ సీస పద్యంలోని నాలుగు చరణాలలోని కడపటి పదాలలో మొదటిదయిన జిహ్వ, చూపు, చెవులు, కరము అను పదాలకు జాతి వాచకాలకున్న సామాన్య అర్థమే. కాని రెండవ జిహ్వ, చూపు, చెవులు, కరము పదాలకు విశేషార్థమున్నది. వాటికి ధర్మాంతర అతిశయత్వముంది. అలాగే కాశీ ఖండంలోని

'వాని కులంబునుం గులమె వాని తపంబులున్ తపంబులే' అనే పద్యంలోని రెండవ కులం, తపం అనేవి తాత్పర్య భేదం కారణంగా తిరస్కారాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**2. పర్యాయ వక్రత:-** ఏ పర్యాయ పదం వాచ్యాతిశయాన్ని పోషిస్తుందో అచట పర్యాయ వైచిత్రి ఉంది. ఉచితజ్ఞుడయిన కవి

సందర్భానికి తగిన పర్యాయ పదాన్ని ప్రయోగించడమే పర్యాయ వక్రత.

అద్భుతం । బయ్యేడిని । మాకు । నగ్ర జన్మ ।
డెట్టు । పాతకములు । సేయు । టెట్టు । లట్టి
పాపి । శివరాత్రి । వ్రత । మెట్టు । పరఁగఁజూచె
నంతయును । విస్తరింపుమా । యనినఁ । బ్రీతి శివరాత్రి మహాత్మ్యం 1.114

ఈ పద్యంలోని 'అగ్రజన్ముఁడు' సాభిప్రాయ యుక్తము. విప్ర శబ్దానికి అనేక పర్యాయ పదాలున్నా 'అగ్రజన్మ' ప్రయోగం చేసి ఆలాంటి కులంలోని వాడు పాపం చేయడంలో ఆశ్చర్యాన్ని ప్రకటింప చేశాడు.

3. **ఉపచార వక్రత:-** చేతన ధర్మాలను అచేతనములం దారోపించి ఆ రెండింటి సాదృశ్యం కప్పిపుచ్చడం. దీనినే ఆధునికులు మానవీకరణమంటారు. ఘన పదార్థాలలో ద్రవ పదార్థ ధర్మారోపం కూడా ఉపచారమే అవుతుంది.

ప్రాలేయ కిరణబింబంబు వెల్వెలఁబాఱు
యస్తా చలంబు పై నత్త మిల్ల
వరుసతో నోపధీ వల్లీమ తల్లుల
కాంతి వైభవ లక్ష్మి కచ్చు వదల
రవికాంత పాషాణ రత్నంబు లందుబ్బి
యగ్ని ప్రత్యుత్థాన మాచరింపఁ
బ్రబలాంధకార ధారాచ్ఛటా పటలంబు
పంచ బంగాళమై పాఱి పోవ
నుదయ పర్వత కటక గండో పలములఁ
బక్షమూలచ్ఛిదా వ్రణ ప్రభవమైన
నెత్తురని యెడు విచికిత్స నివ్వటిల్ల
భాను కిరణంబు లోక కొన్ని ప్రాఁకె నభము 1.122

వెల్వెల బాఱడం, ప్రత్యుత్థానం చేయడం, వెలవెల బారడం లాంటివి చేతన ధర్మాలు. వాటిని వరుసగా కిరణాలలో, అగ్నిలో అంధకారంలో ఆరోపించడం ఉపచార వక్రత.

4. **విశేషణ వక్రత:-** విశేషణ మాహాత్మ్యం చేత క్రియ లేదా కారకం యొక్క రామణీయకం ప్రకాశించడం విశేషణ వక్రత.

ధాతు తామ్రాధరుఁడు దేవదారు భుజుఁడు
సాను వక్షస్థ్సలుఁడు వటస్కంధుఁడైన
మంచు గుబ్బలిరాజు సంభ్రమము తోడ
ఋషి సమూహంబు నతిభక్తి నెదురుకొనియె హర విలాసం 4.55

మంచు గుబ్బలి రాజుకు 'ధాతుతామ్రాధరుడు' లాంటివి విశేషణాలు కొండలోని గైరికాది ధాతువులు అధరాలను, దేవదారు శాఖలు భుజాలను విశాలమయిన కొండ చరియలు వక్ష స్థలం లాగా ఉండడం సామ్యం. కొండలో చేతనత్వం ప్రదర్శించేలాగా వ్రాయడం ఒక ప్రత్యేకత.

**5. సంవృతి వక్రత:-** సంవృతి అంటే కప్పిపుచ్చడం. సర్వనామాదులచే కప్పిపుచ్చడం సంవృతి వక్రత.

నీ వెఱుంగుదు నీ లావు నిక్కువముగ
నెఱుఁగు దనలావు తానమ్మహీధరము దానె
తప్పకుండ మా యిద్దఱ తారతమ్య
మెంత వారును దెలియంగ నెంతవారు

క్రీ గీతలు గల పదాలలో విశేషార్థముంది. ఎదుటి వారిని ప్రశంసించినట్లు, కించపరచినట్లు, తారతమ్యం తెలుసుకోమన్నట్లుగా సంవాదం సాగింది.

**6. పద మధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత:-** పదమధ్యంలో ప్రయుక్తమయిన ముమాగమాదులు, కృదాది ప్రత్యయాలు విశేషార్థం స్ఫురింపజేస్తే అది పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత.

అమితోత్సాహముతోడ । నీవు । పటు । బాహాథక్క నొక్కొక్కమా
టు । మనః కంపము । నొందఁజేయఁ । దొలఁకాడున్ । వార్థి । వేలాలు ఠ
త్కమతరంబై । వలమాన మీనమయి । యుద్వన్నక్రయై । యుత్తర
త్తిమియై । యుల్లదంబుమగ్న ఘుళియై । ధీరా । మహా భైరవా క్రీడాభిరామం

పై పద్యంలో భైరవ దేవుని మహిమాతిశయం వర్ణితం. పై పద్యంలోని లుఠత్. ఉద్యత్, ఉత్తరత్, ఉల్లలత్ అనే శతృప్రత్యయాలు ఘోషించే సముద్రాన్ని తలపిస్తూ కఠోర కాల భైరవ ఢక్కారావ ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**7. వృత్తి వైచిత్ర్య వక్రత:-** ఎక్కడయితే అవ్యయీ భావ సమాసం ప్రధానమో ఎక్కడయితే వృత్తుల రామణీయకం ప్రకాశమానమవుతుందో అది వృత్తి వైచిత్ర్య వక్రత.

కమియ నామూల చూడంబుగా ఫలించి
యంబరము మోచియున్న యుదుంబరములు
లీల బ్రహ్మండ భాండమాలికల భూష
లవధరించిన వృషభాంకు ననుకరించె

మేడి చెట్లకు పరమ శివునికి పోలికె. కింద నుండి పై వరకు పండిన పండ్లు బ్రహ్మండ మాలికలనడం ప్రత్యేకత. 'ఆ మూలచూతము' అన్నది అవ్యయీ భావం.

**8. భావ వైచిత్ర్య వక్రత:-** సాధ్యమైన భావం సిద్ధమయినట్లు వర్ణించడం భావ వైచిత్ర్య వక్రత. సప్తర్షులు హిమగిరికి విచ్చేశారు. పరమేశ్వరునికి పార్వతి నిమ్మని అభ్యర్థించినారు. హిమవంతుడంగీకరించాడు. కుమార్తెను ఆహ్వానించి మొక్కించాడు. ఆ సందర్భంలోని 'రావమ్మ తల్లి' ఉదాత్త భావ గర్భితము

"అవధరింపుడు శివుని యర్థాంగ లక్ష్మి
ప్రణతి యొనరించె మీకని పల్కనగుచు" హర విలాసం 4.70

సప్తర్షుల సంకల్పము సఫలం కావడం. హిమవంతుడు సమ్మతించడం ఇక్కడి ప్రత్యేకాంశాలు. సాధ్యమైన పార్వతీ పరమేశ్వర కల్యాణం సిద్ధిమయినట్లు చెప్పడం ఈ వక్రతలోని విశేషాంశం.

**9. లింగ వైచిత్ర్య వక్రత:-** వేరు వేరు లింగములకు సామానాధికరణం చెప్పడం.

క్షితిపాలోత్తమ । వంశభూషణము । లక్ష్మీ భారతీ పార్వతీ
ప్రతిబింబంబు । సమగ్ర కాంతి మతి । లోపాముద్ర । నీక్షించి          కాశీ ఖండం 2.153

పై పద్యంలో లోపాముద్రకు మూడు విశేషణాలు చెప్పబడ్డాయి. వీటిలో క్షితిపాలోత్తమ వంశ భూషణము, లక్ష్మీ భారతీ పార్వతీ ప్రతిబింబము అనేవి స్త్రీ లింగంలో లేవు. అయినా ప్రస్తుతార్థానికి కొత్త శోభ కలగడం ఈ పద్యంలోని విశేషాంశం.

**10. క్రియా వైచిత్ర్య వక్రత:-** ఎక్కడయితే క్రియ కర్తకు అత్యంతమూ అంతరంగము - సన్నిహిత సంబంధం కలిగి సౌందర్య సంపాదకమై ఉంటుందో అదే క్రియా వైచిత్ర్య వక్రత. ఈ వక్రత అనేక రకాలు మచ్చుకు - ఉపచార మనోజ్ఞత. అమూర్త పదార్థంలో మూర్త పదార్థ ధర్మారోపం ఉపచారం. ఈ ఉపచారం వలన క్రియకు మనోజ్ఞత సిద్ధించినది.

గగన కల్లోలినీ కల్లోల మాలికా
హల్లీసకములతో నవ ఘళించి
చరమ సంధ్యాకాల సంపుల్ల మల్లికా
స్తబక పంక్తులతోడ సరసమాడి
శరదాగమారంభ సంపూర్ణ పూర్ణిమా
విమల చంద్రికలతో వియ్యమంది
బసరుహాసన వధూ పృథుపయోధర భార
హారమల్లరులతో ననఁగి పెనఁగి
వెలయు నెవ్వాని యభిరామ విమల కీర్తి
యతడు త్రిభువన రాయలేశ్యా భుజంగ
కదన గాండీవి జగనొబ్బగండ బిరుద
శాశ్వితుండొప్పు సింగన సబివ వరుడు          శృంగార నైషధం 1.37

పై పద్యంలోని అవఘళించి, సరసమాడి, వియ్యమంది, అనగి పెనగి అనే క్రియలు మూర్త పదార్థ ధర్మములయినా కీర్తిలో ఆపాదితలై మనోజ్ఞతను సంపాదించినది.

**సి) పదపదార్థ వక్రత:-** ఒక పదంలోని ఉత్తరార్థం పద పదార్థమవుతుంది. ఆ ఉత్తరార్థం అనుసరించి వచ్చిన వైచిత్రీ విశేషం పద పదార్థ వక్రత. ఈ వక్రతలో 6 ఉప భేదాలను కుంతకుడు విశదీకరించాడు. శ్రీనాథ కవిలో ఈ 6 రకాలు కనిపిస్తున్నాయి.

**1. కాల వైచిత్ర్య వక్రత:-** కాల వైచిత్రి కారణంగా ఉద్దిష్ట వస్తువు యొక్క అతిశయం ద్రోతకం కావడం.

దొరసెము నందుఁ జుట్టుకొని తోరణకట్టె నురోవిభాగమున్
నిరుడు పయోజకోశరమణీయతఁ దాల్చెను వర్తమానవ
త్సరమున నొప్పె హేమకలశంబుల బాగున ముందటేటికిన్
గరిని భయాన చన్నుగన కౌఁగిలి పట్టులు గాక యుండుఁనే          క్రీడాభిరామం - పుట - 97

ఈ పద్యంలో వక్షోజ క్రమాభివృద్ధి సూచితం. కిందటేడు, ఈయేడు, ముందటేడు అని కాలానుగుణ పరిణితిని రామణీయకతను వర్ణించడం ఈ పద్య సౌందర్యం.

**2. సంఖ్యా వక్రత:-** వచన పరివర్తనయే సంఖ్యా పరివర్తనం ఎక్కడ ఏక వచనానికి మారుగా బహువచనం చెప్పబడుతుందో భిన్న వచనాల ప్రయోగం కారణంగా ఎక్కడ చమత్కార మేర్పడుతుందో అక్కడే సంఖ్యా వక్రత.

ఓరి మదాంధ; యహల్యా

జార! త్రిలోకాధి రాజ్య జాతమగు నహం

కారంబా? యది మమ్ముం

జీరికిఁ గైకొనక యిట్లు సేయుట యెల్లన్ హరవిలాసం - 6

దుర్వాస మహాముని ఇంద్రుని చూచి కోపోద్రేకంతో 'మమ్ముం జీరికిఁగై కొనక' అని బహువచన ప్రయోగం చేయడం స్వాతిశయోత్కర్షతను నిరూపిస్తున్నది.

**3. నిపాత వక్రత:-** ప్ర. సు. ఉప మొదలయినవి ఉపసర్గలు. నిపాతములు అవ్యయములు. తెలుగులో అదిగో, ఇదిగో, చాలా, కూడా , వాడుగో లాంటివి నిపాతాలు.

ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులు <u>నేరీ</u> నేటికాలంబునన్

సరివేరీ జలరాశి వేష్టిత మహీచక్రంబునన్ విక్రమా

పరగాండీవికి

పై పద్యం పాదాలలోని ఏరీ, వేరీ అనేవి పాతాలకు శ్రీనాథుని లాంటి సత్కవీశ్వరులు అల్లాడభూవరుని లాంటి పరాక్రమవంతులు లేరని భావం.

**4. ఉపసర్గ వక్రత:-**

దివిజాధీశు సుధర్మయన్ సభ సముద్వీక్షింపు భూదేవ ! రెం

డవ కైలాసము వోలె నున్నయది కాశీ ఖండం 3.201

విష్ణుదూతలు శివశర్మ దేవేంద్రుని సభను దర్శించుమని చెప్పెడి సందర్భములోనిదీ పద్యం.

సమ్ + ఉద్ + వి + ఈక్షింపుము. ఒక 'ఈక్షింపుము' చాలును. కాని అనేక ఉపసర్గలు చేరి వర్ణ్య వస్తువు ఉత్కర్షతను పెంచింది.

**కారక వక్రత:-** ప్రధాన కారకములకు బదులుగా గౌణ కారకాన్ని ప్రయోగించడం.

చూర్ణాల కంబుల స్రుక్కుఁ జక్కఁగఁ దీర్చి

నలుపు నెమ్మనములోఁ మొలవఁ బెట్టుఁ

గర్వారహారంబు గదియించు నెపమునఁ

గుచకోరకంబుల గోళ్ళఁగముచు

దల్ప యంత్రణ నిరోధంబు నంకిలికోర్చి

యర్థాంకపాళిక నాదరించు

నిబిడ నీవీ బంధ నిర్మోక్షణమునకుఁ

బనిపూని భీతిఁ గంపంబు నొందు

నూరు సంవాహనమునకు నుత్సహించు
ఘనని తంబంబు పై నుండ మనసు లెట్టు
నిమ్మనాభికి డిగ్గంగ నెమ్మి సేయుఁ
బద్మలోచన మరగి భూపాలుకరము  శృ॥నై॥ 7.172

ఇందు నలుడు ప్రధానకారకము. కరము గౌణ కారకము. నలుడు కరముతో దమయంతి ముంగురులు చక్కదిద్దినాడని చెప్పక అతని కరము దిద్దినదని చెప్పుటలో ఒకానొక భంగీభణతి యున్నది.

**పురుష వక్రత:-** ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుషాలలో ఒకదానికొకటి ప్రయోగించి వైచిత్రిని సంపాదించి పెట్టడం పురుష వక్రత.

రాజరేఖా విభూషణ! రాజ సంపు
తప్పు దండువు లేకుంట తథ్యమయ్యె
నిట్టి పాపాత్ము సర్వలోకేశ్వరుండు
వెనుక నిడుకొన్న మాకు నేమఁగ వచ్చు  శివరాత్రి మహాత్మ్యం - 5.30

శివభటులు యమభటులను ప్రక్కకు నెట్టి సుకుమారుని శివుని సన్నిధికి వెంటబెట్టుకొని వచ్చినారు. ఆ సందర్భంలో యమధర్మరాజు తన వారికి తనకూ కలిగిన పరోక్ష, ప్రత్యక్ష అవమానాలను శివుడితో విన్నవించుకున్నాడు. పై పద్యంలో 'నీవూ' అనే మధ్యమ పురుష బదులుగా సర్వలోకేశ్వరుడు అని ప్రథమ పురుష ప్రయుక్తమయినది.

**ఉపగ్రహ వక్రత:-** 'ఆత్మ'నే పదం పరస్మై పదాలలో ఒకదానికొకటి ప్రయోగించడం.

గ్రుచ్చి కౌఁగిలించుకొని యమ్మహీధర
సార్వభౌముదేవి చతురభంగి
బుజ్జగించి కూర్మి పొంపిరి వో వంగ
హితమితో క్తిఁబుత్రి కిట్టులని యె  హరవిలాసం - 4.5

పై పద్యంలో తల్లి మేనక బిడ్డను కౌగిలించి తపస్సుకు వెళ్ళవలదని విశదీకరిస్తుంది. కవి కౌగిలించుకొని అనే ఆత్మనేపదాన్ని ప్రయోగించెను. తల్లికి బిడ్డ పట్ల గల అనురాగాన్ని తెలియజేస్తుంది.

**డి) వాక్య వక్రత:-** అర్థవంతములయిన పదాల సముదాయం వాక్యం. వాక్యాలలో పరస్పర పదాన్వయం ముఖ్యం. వాక్యాలకు సంబంధించిన వైచిత్రీ విశేషమే వాక్య వక్రత. ఒక చిత్ర పటంలోని రేఖలు వర్ణాలు, నిగనిగలు, తళుకు బెళుకుల కంటె చిత్రకారుని నైపుణ్యం ఎలా భిన్నమయిందో అలాగే కవి ప్రతిభాసమున్మేష సంపన్నములయిన స్వభావ చిత్రణం, శృంగారాది రస సమున్మీలనం, ఉపమాద్యలంకార విన్యాసం వాక్య వక్రతకు ప్రాణాలు. ఈ వక్రత శ్రీనాథుని రచనలో స్పష్టం. మచ్చుకు కాశీ ఖండ పద్యం

అక్ష ధూర్తులలోన నీ యనుఁగుఁగొడుకు
దొరయు నంతటి యక్ష ధూర్తుండు లేఁడు
క్షితి తలంబున యాగదీక్షితులలోనఁ
గీర్తి నీ యట్టి యాగదీక్షితుఁడు లేఁడు  4.101

ఈ పద్యం గుణనిధి కథలోనిది. 'నీ వెంత ఉత్తమోత్తముడవో అతడంత అధమాధముడు' అని వాక్య వక్రతలో కవి ఉద్దీపితం చేశాడు. ఇది ప్రతిభకు సంబంధించినది. మరొక ఉదాహరణం కలఁగఁగ బాటె నాతని యఘంబులు పంచ హృషీక సంభవంబులు బహుకాల సంకలితముల్ దవవహ్నిచిటచ్చిట ధ్వనింగలఁగఁగ బాఱు పక్షుల ప్రకారమునం దొలు జాము పూజకై బటపటహమ్ము ఠమ్మనుచు భర్గుని గేహము నందు మ్రోసినన్ శివ॥మా॥ **4.46**

సుకుమారుడు శివరాత్రి నాడు దర్శించిన శివాలయ వర్ణన ఇది. ఆలయంలోని భేరి 'ఢామ్ ఢామ్' మ్రోతలు సుకుమారుని పాపాల కార్చిచ్చు ఛటచ్ఛటలకు పక్షులు పారిపోయేలా వుందని కవి వర్ణన. ఆలయంలోని వాద్య ఘోషలకు ప్రకృత సన్నివేశానికి జత కుదరడం 'వాక్య వక్రత'కు నీరాజనం పట్టినట్లున్నది.

**ప్రకరణ వక్రత:-** అనేక వాక్యాల సముదాయమయిన సమగ్ర ప్రబంధంలో ఒక భాగాన్ని ప్రకరణ మనడం సహజం. ఈ ప్రకరణ భాగాన్ని సర్వాంగ సుందరంగా తీర్చడం ప్రకరణ వక్రత. ఈ వక్రత 7 రకాలు

(ఎ) కవి పురాతన ఇతివృత్తం స్వీకరించినా బుద్ధి కౌశలంతో మూలకథకు విచ్ఛేదం లేకుండా ప్రస్తుతార్థానికి సముచితమయ్యేలా నూతన కల్పనలు చేయడం ప్రకరణ వక్రత. సిరియాళుని కథ బసవపురాణంలో ఉంది. ఆ కథను హరవిలాసంలో భాగంగా కవి పెంచాడు. అనేక సన్నివేశాలను సంభాషణాదులతో పెంచాడు.

(బి) అమూలకమయిన కథను ప్రసావిస్తూ ప్రస్తుత కథకు ఉత్సుకత ఆపాదించడం. హరవిలాసంలోని చిరుతొండనంబి కథకు మూలకథ లేదు. కాని తుంబురుని కథను, దుర్వాసుని శాపాన్ని చేర్చడం శ్రీనాథుని ప్రత్యేకత.

(సి) ప్రబంధంలోని ప్రధాన ఫల సంసిద్ధి కోసం ఒక సన్నివేశాన్ని సమర్థవంతముగా ప్రతిభావంతంగా సృజించడం హరవిలాసంలోని ఒక సన్నివేశం. అప్సరాంగనల నాట్యం తిలకించే శివునికి చెమట పట్టింది. పార్వతికి శివుని మీద సందేహం కలిగింది. అప్సరసల నృత్య దర్శనం కారణంగా పారవశ్యంతో శివునికి మేను చెమర్చిందని భావించింది. కాని తాను ఆ సమయంలో భూలోకంలో కంచిలోని భక్తుని కోసం చెఱకు మోపు మోసానని ఆ కారణంగా చెమట పట్టిందని చెప్పుకొన్నాడు. ఈ కల్పన వల్ల శివుని భక్త వత్సలత స్పష్టమై హర విలాస స్థితి అద్దం పట్టింది.

(డి) ఒక పదార్థ స్వరూపాన్ని ప్రత్యేక ప్రకరణంలో నవరసాలంకార సముల్లసితంగా కల్పించడం. కాశీ ఖండంలోని సన్నివేశం - అగస్త్యుడు కాశిని వదలి తరలే వేళ పేరు పేరున దేవతలను స్మరించడం, ఆయా ప్రదేశాలను ఉల్లేఖించడం, ఇలాంటి వర్ణనల వల్ల కాశికి అగస్త్యునకున్న అనుబంధం, అదే సందర్భంలో కాశి పట్ల గౌరవం స్పష్టమవుతుంది.

పరమ కల్యాణి 'యో భాగీరథీ! గంగ
వార్థిభామిని' పోయి వత్తునమ్మ 2.139
కలహంసి! రారాదె! కదలి నాతో గూడి
నీవేల వత్తమ్మ నెమ్మి నుండి 2.140
ఎన్నడు చూతునో యింకొక్క మాటేను
ప్రకట కైవల్యంపు రాశి! గాశి 2.158

5. కావ్య సౌందర్య సంపాదనార్థం కథా వైచిత్రికి అనుకూలంగా మృగయా విహారం. జల క్రీడాదులను వర్ణించడం. కాశీ ఖండంలో వ్యాస మహర్షి ఆకుల చిత్తం వ్యక్తమయ్యే విధంగా సాగిన ప్రకృతి వర్ణనలు ఈ వక్రతలో భాగాలే.

6. ఇతర ప్రకరణాలలో కంటె ఒకానొక ప్రకరణంలో ప్రధాన రస పరిపోషణం చేయడం, కాశీ ఖండంలో అగస్త్యుని ఆశ్రమ వర్ణన, అగస్త్యుని శైవాచార వర్ణనలు వక్రతలో ఒక భాగమే.

7. ప్రధాన కథ సమగ్ర సౌందర్య ప్రదర్శనార్థం వైచిత్రితో కూడిన ఒక కొంగ్రొత్త ప్రకరణం చెప్పడం. భీమేశ్వర పురాణంలో మహా విష్ణువు శివుని సహస్ర కమలాలతో అర్చించు ప్రకరణమున్నది. శివుడు ఒక పద్మము దాచగా విష్ణువు లోచన పుష్పం సమర్పించాడు. శివుడు కరుణించి చక్ర ప్రధానంతో నేత్ర ప్రధానం చేయడం.

8. సామాజిక హృదయ ఆహ్లాద సంపాదనార్థం కవి నాటక మద్యంలో అంతర్నాటకం అనుసంధానించడం 'క్రీడాభిరామంలో పల్నాటి వీరచరిత్ర ప్రస్తావన' ఈ నియమానికి లక్ష్యప్రాయం.

ఉద్దిప్రకటింప నొక్కరుండోలవాడు
బయలు గుఱ్ఱంబు భంజల్లఁబఱపు నొకఁడు
కొడుము దాటింపుచును బెద్ద గొలువులోనఁ
బడతి పల్నాటి వీరులఁబాడునపుడు

9. ఒక కావ్యంలో ప్రధాన అంశాన్ని పదే పదే ఉగ్గడించడం భీమేశ్వర పురాణంలో అడుగడుగున భీమేశ్వర ప్రశస్తి, భీమనాథ స్వామి మాహాత్మ్యం, కాశీఖండంలో కాశీ క్షేత్ర ప్రభావము, విశ్వేశ్వర మహిమల కథనం మొదలయినవి. మచ్చుకు ఎక్కడఁజొచ్చినన్ సరసి........ భీమమండలం బెక్కడ 3.23

కాశి కల్యాణమున కాది కారణంబు
కాశి యణిమాది సిద్ధుల కాటపట్టు కాశీఖండం 2.50

**ప్రబంధ వక్రత:-** ప్రబంధం పురాణాదుల కంటె సహృదయ హృదయరంజకం. ఇది నాటకం కావచ్చు లేదా కావ్యం కావచ్చు. ఈలాంటి ప్రబంధాన్ని ఆద్యంత సుందరంగా నిపుణంగా తీర్చడమే ప్రబంధ వక్రత. ఈ వక్రత ఆరు రకాలు.

(ఎ) మూలకథలోని ప్రధాన రసాన్ని మార్పు చేసి సహృదయ హృదయ ఆహ్లాదకరంగా నూతన రసాన్ని నిబంధించడం. శివరాత్రి మాహాత్మ్యం శాంతరసాత్మకం. అయినా శ్రీనాథుడు భక్తికి ప్రాధాన్యమిచ్చాడు. నూతంగీ స్పంగారాన్ని 'అంశం' చేశాడు.

(బి) మూలకథలోని నీరస భాగాన్ని పరిత్యజించి అనౌచిత్యాన్ని పరిహరించి కావ్య ఉత్కర్షను సంపాదించడం. నైషధంలో నలుని సౌందర్యానికి త్రిమూర్తుల పత్నులు శచీ దేవి ఆకర్షితులయినట్లు హర్షుడు వర్ణిస్తే శ్రీనాథుడు పరిహరించాడు.

(సి) ప్రధాన కథా వస్తువుకు సంబంధించిన ఆధికారిక ఫల ప్రాప్తి సిద్ధించే వేళ కార్యాంతరం కల్పించి తుదకు దాని వల్లనే ప్రధాన ఫలసిద్ధి కలిగినట్లు వర్ణించడం. భీమేశ్వర పురాణంలో సప్తర్షులు దక్షారామంలో భీమేశ్వర లింగాన్ని ప్రతిష్ఠ చేసే సన్నివేశం ఉంది. సప్తర్షులు గోదావరిని తీసుకురావడానికి కదిలారు. ముహూర్తం ఆసన్నమయింది. స్వామి తనంత తాను ప్రతిష్ఠితుడయ్యాడు. దినకరుడు తొలిపూజ చేశాడు. సప్తర్షులు సంతసించారు. దినకరుడు తన తప్పిదం చెప్పగా సప్తర్షులు కిమ్మనలేదు. ప్రధానమయిన భీమేశ్వర ప్రతిష్ఠ జరిగిపోయింది.

(డి) ప్రధాన కథకు అవాంతర కథ తోడై కావ్య సౌందర్యం దీప్తం కావడం శివరాత్రి మాహాత్మ్యంలో ఎన్నో కథలున్నాయి. సుకుమారుని కథ, బ్రహ్మ విష్ణు మూర్తుల కలహ కథలు. సుకుమార కథ ప్రధానం. రెండవ కథ అవాంతర కథ. బ్రహ్మ విష్ణువులు తామే జగత్కర్తలమన్నారు, కలహించుకొన్నారు. అపుడు నడుమ పానక స్తంభం పొటమరించింది. వీరి అస్త్రాలు జ్వాలా స్తంభంలో లీనమయ్యాయి. విష్ణువు వరాహ రూపంలో బ్రహ్మ మరాళ రూపంలో ఆ స్తంభం ఆద్యంతాలు తెలుసుకోవాడినికి వెళ్ళి విఫలులయ్యారు. ఈ సన్నివేశం 'మాఘ మాసం కృష్ణ పక్షం చతుర్దశీ మధ్య రాత్రి' జరిగింది. పరమ శివుడు శివరాత్రి ప్రభావం చెబుతూ సుకుమారుని కథ చెప్పాడు.

(ఇ) కావ్యానికి సముచితమయిన నామకరణం చేయడం ప్రబంధ వక్రతలో భాగమే. శ్రీనాథుని 'హర విలాస' ప్రబంధ నామం ఆలాంటిదే. ఈ కావ్యంలో అంగి శివుడు. ఇందులోని 5 కథలు శివాత్మకమే. ఇవి లఘు కృతులు. హరుని విలాస కథలు కావడం వల్ల సార్థకం.

(ఎఫ్) ఒక కథను తన ప్రతిభా బలంతో భిన్నంగా తీర్చడం ప్రబంధ వక్రత. హర విలాసంలో, భీమేశ్వర పురాణంలో క్షీర సాగర మథనం ఉంది. ఈ రెండూ ఏకకవి కృతమే. ఆలాగే భీమేశ్వర పురాణంలో కాశీ ఖండంలో వ్యాస నిష్కాస గాథ ఉంది. అయినా స్వతంత్రంగా ఆయా ప్రబంధాలకు తగినట్లు శ్రీనాథుడు జతచేశాడు.

ఇవే గాక కాంతా సమ్మతమయిన ఉపదేశాన్ని ప్రతిపాదించడం ప్రబంధ వక్రత. ఆయా సందర్భాలలో చెప్పిన రీతులు, ఉపదేశాలు ఈ కోవలో చేరతాయి.

ఈవు పెట్టిన భిక్షమేమిందఱమును
బంచుకొని చేయు వారము ప్రాణరక్ష
నాతి యందఱియును బ్రాణములు కావె
నా యదియె ప్రాణమని వత్తువా భుజింప

అనడంలో వ్యాసుని శిష్యాభిమానం ద్యోతకం.

మీనకేతన దమన యీ మేక పిల్ల
ప్రాణసఖివోలె నా యొద్ద ఁబాయకుండు
శర్వ! యీ నోరు మాలిన జంతువునకు
మొదలు వరమిమ్ము వరమిమ్ము పిదప నాకు

ఈ పద్యం కాశీ ఖండంలోనిది. పరమ శివుడు వచ్చి వరం కోరుకొమ్మంటే భక్తురాలయిన సులక్షణ చెప్పిన మాటలలో భూతదయ స్పష్టం.

'హరచూడా హరిణాంక వక్రతయు' అని శ్రీనాథుడు వ్రాయడంలో పరోక్ష రూపంలో వక్రత. వక్రోక్తి తన రచనలలో కలదని స్పష్ట పరచినట్లున్నది.

## 11.4 సారాంశము:-

శ్రీనాథునిది ఆగమ శైవం. శ్రీనాథుని రచనలు చాల వరకు శివ సంబంధులు. పూజ, అర్చన, స్తోత్రాదులలో శ్రీనాథుని ఈశ్వరార్చన కళా శీలత్వం సుస్పష్టం. ఆంధ్రీకరణంలో సీస పద్య పాదాలకున్న నియత స్థానం, గణాల క్రమంలో సీస పద్య రచనలో విన్యాసము, భాషాగతంగా శ్రీనాథుని శైలీ విన్యాసములు ఇతరులకు మార్గదర్శకములయ్యాయి. కుంతకుడు విశదీకరించిన 6 రకాలయిన వక్రోక్తి భేదాలు శ్రీనాథుని రచనల్లో కానవస్తాయి.

## 11.5 ప్రశ్నలు :-

1. శ్రీనాథుని ఈశ్వరార్చన కళా శీలత్వం వివరించండి.
2. ఆంధ్రీకరణలో శ్రీనాథుడు సీస పద్య రచనలో చూపిన విశేషాంశాలు.
3. శ్రీనాథుని రచనలో వక్రోక్తి భేదాలను సమన్వయించండి.

## 11.6 ఆధార గ్రంథాలు:-


1. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
2. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - జంధ్యాల జయకృష్ణ బాపూజీ
3. తెలుగు సాహిత్య చరిత్ర (2వ భాగం) - కొర్లపాటి శ్రీరామమూర్తి
4. తెలుగులో దేశిచ్ఛందస్సు - ప్రారంభ వికాస దశలు - సంగన భట్ల నరసయ్య
5. ఈశ్వరార్చన కళాశీలుడు - కొర్లపాటి శ్రీరామమూర్తి



**రచయిత**

**ఆచార్య కె. సర్వోత్తమ రావు,**
**విశ్రాంతాంధ్రాచార్యులు**
**శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం**
**తిరుపతి**

పాఠం - 12.1

# శ్రీనాథుని కంటె పూర్వకవులైన సంస్కృతాంధ్ర కవుల ప్రభావము

**ముఖ్యాంశాలు:-**


12.1.0 లక్ష్యం
12.1.1 ఉపోద్ఘాతం
12.1.2 సంస్కృత కవుల ప్రభావము
- 12.1.2.1 కాళిదాసు
- 12.1.2.2 భవభూతి
- 12.1.2.3 భారవి
- 12.1.2.4 మయూరుడు
- 12.1.2.5 కాళిదాసు
- 12.1.2.6 పుష్పదంతుడు
- 12.1.2.7 బాణుడు
- 12.1.2.8 మురారి
- 12.1.2.9 సుబంధుడు
- 12.1.2.10 వ్యాసుడు
- 12.1.2.11 అమరుక కవి

12.1.3 ఆంధ్ర కవుల ప్రభావం
- 12.1.3.1 వేములవాడ భీమకవి
- 12.1.3.2 నన్నయ
- 12.1.3.3 తిక్కన
- 12.1.3.4 ఎఱ్ఱన
- 12.1.3.5 నాచన సోమన

12.1.4 ఉపసంహారము
12.1.5 ప్రశ్నలు
12.1.6 ఆధార గ్రంథాలు

## 12.1.0 లక్ష్యం:-

ఏ కవియైనా తమ కవితా సంపదకై పూర్వ కవులకు కొంచెమో గొప్పో ఋణపడి ఉంటాడు. వ్యుత్పత్తి కలిగిన కవి యందు ఈ విధమైన పూర్వ కవి ఋణము అనల్పము. ఈ వ్యుత్పన్నతకు ప్రతిభాశక్తి జోడైనప్పుడే మహాకవిత ఉదయిస్తుంది. శ్రీనాథ మహాకవికి పూర్వులైన గీర్వాణ కవులకు, పూర్వులైన తెలుగు కవులకు సాహితీ సంపద యందు ఎంత వరకు ఋణ పడ్డారో గమనించటమే ఈ వ్యాస పరమార్థం.

## 12.1.1 ఉపోద్ఘాతము:-

తాత ముత్తాతల స్వరూప స్వభావ గుణాలు తరువాతి తరాలలోని మనుమల సంతతి యందు ఛాయా మాత్రంగా గోచరించినట్లే పూర్వ కవుల కవితా రీతుల్లోని కొన్ని కొన్ని పోలికలు అనంతర కవుల కవితా రీతులందు పొడగట్టు చుండును. కాని, వారి వారి ఆత్మ లక్షణాలు మాత్రం వేర్వేరుగా ఉంటుంది. ప్రతిభావంతుడైన కవియును తన స్వభావానికనుగుణంగా సారస్వతపాథేయాన్ని పూర్వకవుల నుండి తన వెంట తెచ్చుకొనుచునే ఉంటాడు. అది ఆతని ఆత్మ లక్షణంతో మిళితమై కొంత వైలక్ష్యణ్యాన్ని పొంది మరల తరువాతి కవులకు పాథేయంగా మారుతుంది.

ఈవిధమైన ఆదాన ప్రదానాల వల్లనే సాహిత్య రుచుల యందు వైవిధ్యమేర్పడి వాఙ్మయం సుసంపన్నమౌతుంది. కవికుల గురువైన కాళిదాసు - వాల్మీకి - వ్యాసుల నుండి ఎంత తెచ్చికొనెనో తన తరువాతి కవులకు అంతకన్నా ఎక్కువగా ఇచ్చెను. సృజనాత్మక ప్రతిభకల కవుల యొద్దనే తరువాతి కవులు స్వీకరింపతగిన సామాగ్రి పుష్కలంగా ఉంటుంది. అనుకర్తలైన వారి యొద్ద పై తరం కవుల నుండి తాము తెచ్చుకున్నది మాత్రమే ఉంటుంది. తరువాతి కవుల కివ్వటానికి వారి యొద్ద ఏమీ మిగిలి ఉండదు.

తెలుగు వాఙ్మయంలో శ్రీనాథుడు ఒక పూర్వశైలీ నిర్మాణం చేత అనంతర వాఙ్మయ క్షేత్రం సుభిక్షమై సంపన్నమవటానికి ఆవశ్యకమైన పూర్వ నిర్మాణం చేశాడు. ఈ శైలీ నిర్మాణంలో శ్రీనాథుడు ఆలోచనామృతమైన సాహిత్యానికి ఆపాత మధురమైన సంగీత ప్రభావాన్ని మేళవించాడు. పూర్వ సమీకృతమైన కవిత్వ సంపదను, అపూర్వమైన ఆత్మీయ ప్రతిభావిశేషాలచే వెలిగించి ఆర్వాచీనాంధ్ర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

"పూర్వ కవి ముఖ్య విరచితా పూర్వ కావ్య
భావరస సుధా చర్వణ ప్రౌఢతయును" (నాసికేతోపాఖ్యానం 1.18)

అని దగ్గుపల్లి దుగ్గన చెప్పినాడు. అంటే శ్రీనాథుడు తనకు పూర్వమున గల సంస్కృతాంధ్ర కావ్యాలను ఆపోశనము పట్టినాడు. చర్వణ మనగా నమలుట అని అర్థం. పూర్వ కవుల పద్యాలు అతని నోట నివాసమున్నా, అందులోనూ సంస్కృత కవులనే శ్రీనాథుడెక్కువగా గ్రహించాడు.

## 12.1.2 పూర్వ సంస్కృత కవుల ప్రభావము:-

పూర్వకవి ఫణి తుల యందలి రసభావాలను అమృతంలాగా సర్వకాల సర్వావస్థల యందునూ చర్వణం చేస్తూ రసోన్మత్తుడగు చుండుట శ్రీనాథుని స్వభావము. ఏమయూరుడో, బాణుడో, భవభూతియో, కాళిదాసో భావుకమైన శ్రీనాథుని యంతఃకరణ వృత్తిని ఎప్పుడూ ఆవేశించి ఉంటారు. ఆ స్థితి స్వపర భేదాన్ని గమనింపనీయదు. స్వయంగా తాను కవియై ఉన్నందువల్ల తన కవితా రీతిలో అవశ్యముగా వారి పదబంధాలు, సమాసాలు, భావాలు, రసాలు పొరలివస్తూంటాయి. చిత్రమేమంటే వాని యందు శ్రీనాథుని ముద్రయే గోచరించునంతగా అవి శ్రీనాథుని కంఠమునందొదిగి పోతాయి.

శ్రీనాథుడు కృతజ్ఞతా పూర్వకంగా ఒక్క హరవిలాసము నందు తప్ప మిగిలిన గ్రంథముల యందు వ్యాస, వాల్మీక, కాళిదాసాదులను స్మరించినాడు.

1. "ప్రణుతింతు రస భావ భావనా మహనీయ కవితా సముల్లాసు కాళిదాసు" (భీమ 1.7)
2. "బాదరాయణు పాదపద్మంబులకు మ్రొక్కి ప్రాచేతసుని మనః పదవినినిపి" (కాశీ 1.19)
3. "వ్యాస, వాల్మీకి సంయమి వాక్సుధాంబోధిలో లోర్మి పంక్తుల నోలలాడి" (శృ॥నై॥ 1.7)
4. "బాణునద్భుత శాస్త్ర బహుకలా పారీణు ప్రకటవర కవితా భాసుభాసు" (శివ 1.12)

ఈ విధంగా పూర్వ సంస్కృత కవులను కావ్యాదిలో శ్రీనాథుడు ప్రస్తుతించాడు. అట్లే తెలుగు కవులలో నన్నయ - తిక్కన - ఎఱ్ఱనలను శ్రీనాథుడు పేర్కొనినాడు. శ్రీనాథుడు వీరిననుకరించుటలో తన నైపుణ్యాన్ని చూపాడు. ఇతడు వీరిననుకరించుటలో కొన్ని మార్గములను అవలంబించాడు.

1. మూలశ్లోకాన్ని యథాతథంగా అనువదించటం
2. భావాలకు మెరుగు పెట్టటం
3. భావార్థాలకు తోడు కొంత క్రొత్త భావాలను జోడించటం
4. కొన్ని చోట్ల పాదము యొక్క భావాన్ని గ్రహించటం
5. సంస్కృత కవుల మార్గచ్ఛాయలలో తెలుగు పద్యాలను నడపటం
6. సమాసాలను యథాతథంగా గ్రహించటం

శివరాత్రి మహాత్మ్యం పూర్తిగా బాణుని, సుబంధుని శ్రీనాథుడనుకరించినాడు. హర విలాసంలో గౌరీ కళ్యాణం, తారకాసుర వధ - కాళిదాసు కుమార సంభవంలోనివే. కిరాతార్జునీయం మాత్రం భారవికనుకరణకాదు. కాని శ్రీనాథుడు కొన్ని భావాలను గ్రహించాడు.

**12.1.2.1 కాళిదాసుని అనుకరణ:-** దిలీప మహారాజు గర్భవతిగా నున్న సుదక్షిణా దేవిని ఇట్లా భావించాడు.

"నిధాన గర్భామివ సాగరాంబరాం
శమీమి మభ్యంతర లీన పావకుం
నదీ మివాం తస్సరిలం సరస్వతీం
నృపస్య సత్వాం మహిషీ మమన్వత" (రఘు 3.9)

ఆ దిలీప మహారాజు గర్భవతిగా నున్న సుదక్షిణా దేవిని నిధిగర్భంలో ఉన్న భూమిలాగా, లోపల దాగి ఉన్న అగ్ని గల జమ్మి చెట్టులాగా, లోపల నీరు గల సరస్వతీ నది వలె ఉన్నట్లు భావించాడు.

ఇందులో గల రెండు విషయాలను గ్రహించి కొన్ని కొత్తవి చేర్చి శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యంలో సుశీల గర్భాన్ని ఈ విధంగా వర్ణించాడు.

"అభ్యంతరస్థాగ్ని యగు శమీలతవోలె
నిధి గర్భయగునబ్ధినేమివోలె" (శివ 2.42)

ఈ విధంగా శ్రీనాథుడు కాళిదాసు చెప్పిన భావాన్ని అనుసరించాడు.

**12.1.2.2 భవభూతి:-**

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసికోను విజ్ఞాతుమర్హతి" (ఉ.రా. 2. విష్క. 7శ్లో॥)

ఒక్కొక్కపుడు మహాత్ముల మనస్సులు వజ్రాల కంటె కఠినంగాను, పువ్వు కంటె మెత్తగా ఉంటాయి. వారి మనస్సు ఎవరూ ఇట్టిదని నిశ్చయింపలేరు.

దీన్నే శ్రీనాథుడు శృంగార నైషధములో పూర్వార్థమున:

"ఉపముల కంటె కఠినమ్ములొకవేళ
కుసుమముల కంటె నొకవేళ కోమలములు"

**ఉత్తరార్థమున:** 'పువ్వుబోడుల హృదయంబు లెవ్వడెరుగు' (శృ.నై. 7.162) మూలంలో నున్న వజ్రము ఉపలమైంది. 'లోకోత్తరాణాం' - పువ్వుబోడులుగా మారింది.

**12.1.2.3 భారవి:-**

"లేఖయా విమల విద్రుమ భాసా
సంతతం తిమిర మిందురు దాసే
దంష్ట్రయా కనకటంక విశం గ్యా
మండలం భావి ఇవాది వరాహః" (కిరా॥ 9.22)

చంద్రుడు విమల విద్రుమ వర్ణంబగు కళచే దట్టమైన అంధకారము, ఆదివరాహము, రాళ్ళను కూడ చీల్చు ఎట్టని కోరచే భూమండలము వలె పైకెత్తును.

ఈ విషయాన్నే శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో చంద్రోదయ వర్ణన సమయంలో అనుసరించాడు.

"ఆతత నీల గోమల నవాం శుకపాళి మహాంధకార సం
ఘాతము మీటె నద్భుతముగా శశి లాంఛనుఁడభ్ర వీధికిన్
శ్వేత వరాహ మూర్తియగు వెన్నుడు ప్రన్నని యొంటికోర ధా
త్రీ తలమెంత యంతయు ధరించిన యట్టి విజృంభణంబునన్" (భీ॥ఖ॥ 2.39)

**12.1.2.4 మయూరుడు:-** మయూరుని సూర్య శతకము సంస్కృత సాహిత్యంలో కీర్తి నందింది. శతకమైనను సూర్య శతకమంటే అందరికి గౌరవ భావం కలదు. అందుండి శ్రీనాథుడు దాదాపు 15 శ్లోకాలను తన సొంతం చేసుకున్నాడు.

కాశీ ఖండంలో ప్రథమాశ్వాసంలో సూర్యోదయాన్ని వర్ణించునపుడున్న పద్యాలన్నీ మయూరుని సూర్య శతక శ్లోకములకనువాదాలే. సూర్య శతకము ప్రభా, అనూరు, రథ, మండల, రవి వర్ణనలను ఐదు భాగాలుగా ఉంది. వీనిలో కొన్నింటిని సందర్భానుసారంగా కథా గమనాన్ని బట్టి శ్రీనాథుడనువదించాడు.

"న్యక్కుర్వన్నోషధీశే ముషితరుచి శుచే వౌషధీః ప్రోషితాభాః
భాస్వద్గ్రావోద్గతేన ప్రథమమివ కృతాభ్యుద్గతిః పావకేన
పక్షచ్ఛేదవ్రణా సృక్స్రుత ఇవ దృషదోదర్శయన్ ప్రాతరద్రేః
ఆ తామ్రాస్త్రీవ్ర భానో రనభిమత నుదేస్తాద్గభస్త్యు ద్గమోవః" (సూర్య. శ. శ్లో॥ 5)

సూర్యుడుదయిస్తున్నాడు. చంద్రుడస్తమిస్తున్నాడు. ఓషధుల స్తమయోన్ముఖుడైన తమ ప్రియునికై శోకిస్తూ ప్రోషిత భర్తృకల వలె కాంతిని వీడ్కొనుచున్నది. అప్పటి వరకు సూర్య కాంతమణుల్లో దాగికొని యున్న అగ్ని ప్రత్యుత్థానము చేస్తున్నది. సూర్య కిరణములు తమ మీద పడేటప్పటికి ఉదయ పర్వత శిలలు వజ్రాయుధంతో ఇంద్రుడు తమ రెక్కలు తెగ గొట్టగా ఆ గాయాల నుండి నెత్తురు చిమ్ముచున్నట్లున్నవి.

ఈ శ్లోకాన్ననుసరించి శ్రీనాథుడు:

"ప్రాలేయ కిరణ బింబంబు వెల్వెలఁబాఱి
    యస్తా చలంబు పైనత్తమిల్ల
వరుసతోనోషధీ వల్లీ మతల్లుల
    కాంతి వైభవ లక్ష్మి కచ్చు వదల
రవి కాంత పాషాణ రత్నంబులం దుబ్బి
    యగ్ని ప్రత్యుత్థాన మాచరింప
బ్రబలాంధకార ధారా చ్ఛటా పటలంబు
    పంచ బంగాళమై పాఱిపోవ
నదయ పర్వత కటక గండోపలముల,
బక్షమూలచ్ఛిదావ్రణ ప్రభవమైన
నెత్తురని యెడు విచికిత్స నివ్వటిల్ల
భానుకిరణంబు లొక కొన్ని ప్రాఁకెనభము" (కాశీ 1.122)

మూలంలో 'న్యక్కుర్వన్నోషధీశేముషిత రుచి శుచే వౌషధీః ప్రోషితా భాః" అంటే చంద్రుడు అపహరింపబడ్డ కాంతి కలవాడు కాగా దుఃఖము చేత ప్రోషిత భర్తృ కలవలె ఉన్న యోషధులను తిరస్కరిస్తాయని చంద్రునకు, ఓషధులకు గల సంబంధం, వాని కాంతి తగ్గటానికి గల కారణం చెప్పబడగా పద్యంలో

"ప్రాలేయ కిరణ బింబంబు వెల్వలఁబాఱి
    యస్తా చలంబైనత్తమిల్ల"
"వరుసతో నోషధీ వల్లీమ తల్లుల
    కాంతి వైభవ లక్ష్మి కచ్చువదల"

అని దేనికదిగా విడగొట్టబడింది.

"భాస్వద్గ్రావోద్గతేన ప్రథమమివ కృతాభ్యుద్గతిః "పావకేన" అనే దానికి

"రవి కాంత పాషాణ రత్నంబులందుబ్బి
యగ్ని ప్రత్యుత్థానమాచరింప"

అని తెనిగించబడింది.

"ఆదిత్యోవా౽స్తమయున్ అగ్నిమను ప్రవిశతి"
అని శ్రుతి ప్రమాణము.
"దినాంతే నిహితం తేజః సవిత్రేవ హుతాశనః" (రఘు 4.1)

అని కాళిదాసు ఇక -

"ప్రబలాంధకార ధారాచ్ఛటాపటలంబు
పంచ బంగాళమై పాటిపోవ"

అను మూడవ పాదము స్వతంత్రము. మిగిలిన దంతయూ సమానమే.

"శాతశ్శ్యామాల తాయాః పరశురివ తమో౽రణ్య వహ్నేరివార్చిః
ప్రాచ్యే వాగ్రే గ్రహీతుం గ్రహకు ముదవనంద్రా గుదస్తో౽గ్రహస్తః
ఐక్యంభిందన్ ద్యుభూ మ్యోరవధి రివ విధాతేవ విశ్వ ప్రబోధం
వాహానాం వో వినేతావ్యపనయతు విపన్నామధామాధిపస్య" (సూర్య శతకం - 54)

ఈ శ్లోకం అరుణ వర్ణంలోనిది. సూర్యునికి ముందే అరుణోదయమవుతున్నది. అది రాత్రి అనే తీగెను ఛేదించటానికి చిరు సానబట్టిన గండ్ర గొడ్డలి వలె, చీకటి అడవుల్లో రగుల్కొనిన కార్చిచ్చు వలె, తూర్పు దిక్కనెడు జవరాలు నక్షత్రకుముద వనమందుకోవటానికి చాచిన చేయిలాగా, ఏకీభూతమైన రోదసీ మండల మందలి సీమా విభాగ రేఖలాగా ఉంది.

ఈ శ్లోకాన్ననుసరించి శ్రీనాథుడు

"చిఱుసానఁబట్టించి చికిలి సేయించిన
గండ్ర గొడ్డలి నిశాగహనలతకుఁ
గార్కొన్న నిబిడాంధకార ధారాచ్ఛటా
సత్రవాటికి వీటి హోత్రజిహ్వ
నక్షత్ర కుముద కాననము గిల్లెడు పొంటె
ప్రాచియెత్తిన హస్త పల్లవాగ్ర
మరసి మింటికి మంటి కైక్య సందేహంబుఁ
బరిహరింపఁగఁబాల్పడ్డ యావధి
సృష్టి కందెఱ తొలుసంజ చెలిమి కాడు
కుంటు వినతా మహాదేవి కొడుకుఁగుఱ్ఱ
సవితృ సారధి కట్టెఱ్ఱ చాయ వేలు
వరుణుఁదయించెఁ బ్రాగ్దిశాభ్యంతరమున" (కాశీ॥ 1.21)

ఇందు 'తమోరణ్య వహ్నేరివార్చిః' అనే దానికి

'కార్కొన్న నిబిడాంధకార ధారాచ్ఛటా

సత్త్ర వాటికి వీతి హోత్రజిహ్వ' అని తెలుగు చేయబడింది.

మూలంలోని 'విధా తేవ విశ్వ ప్రబోధమ్' అనునది తెలుగులోనికి రాలేదు. శ్రీనాథుని సీస పద్యమందలి ఎత్తు గీతి సందర్భానుసారమైన స్వతంత్ర రచన.

కాశీ ఖండ గ్రంథారంభంలోని అవతారికలో శ్రీనాథుడిట్లు పేర్కొన్నాడు.

"బాద రాయణు పాద పద్మంబులకు మ్రొక్కి

ప్రాచేతసుని మనః పదవి నిలిపి

భట్టబాణ, మయూర, భవభూతి, శివభద్ర

కాళిదాసుల మహాకవులఁగొలిచి

రాజశేఖరుని, భారవి, మాఘుఁగీర్తించి

ప్రవరసేనుని, దండి, భాసుఁదలఁచి

హర్షు, బిల్హణుని, మల్హణుఁజోరుఁగొని యాడి

క్షేమేంద్రు వేడుకఁజిత్తగించి

శబ్ద శాసనునన్నపాచార్యుఁదలంచి

సత్కవిశ్రేష్ఠుఁదిక్కన యజ్వనుభజించి

సత్ప్రబంధ మహేశ్వరు శంభుదాసు

నధిక సద్భక్తి సంయుక్తి నాదరించి" (కాశీ 19)

అని వీరి నందరిని స్మరించినాడు. ఈ పూర్వ కవుల ప్రభావం అనేక విధాలుగా ఉంటుంది. భావంలో, సమాసాలలో, పదబంధాలను గ్రహించటంలో మొత్తమాయన వాక్కులను పరివేష్టించి గ్రంథ మందు పరివేష్టించి ఉంటాడు. ఏది ఎవరిదో పోల్చుకోలేనంతగా ఇవి కవి వాక్కులోఇమిడిపోయి ఉంటాయి. శ్రీనాథుడు రీతి ప్రధానమైన కవి. సంస్కృతంలో శ్రీ హర్షుడు, మయూరుడు, భట్టబాణుడు మొదలైన వారట్టివారు. కాళిదాసాదులు శిల్ప ప్రధానులైన కవులు. వీరి పద బంధ ముద్రలు కూడా మొత్తం మీద లేకపోలేదు. కాని మయూరాదులకు వలె కొట్టవచ్చినట్లు, ఏ శ్లోకానికా శ్లోకం విడివిడిగా కనిపించవు.

**12.1.2.5 కాళిదాసు:-** ద్వితీయాశ్వాసంలో అగస్త్యాశ్రమాన్ని వర్ణించు సందర్భంలో:

"ఎదుట లోపాముద్ర పాద పద్మముల ముద్ర

సికితలంబగు నేలఁజెలువు మిగుల

శ్యామాకముష్టి యాచ్ఛార్థంబు మృగములు

ఋషి కన్యకలరాక కెదురుచూడ

దేవార్చనా ధూప దివ్య గంధములచే

హోమధూమము తావి యుద్దివడయ

వటుజన స్వాధ్యాయ, వర్ణ సందోహంబు
శారీ శుకంబులు చర్చచేయ" (కాశీ 2.56)

అను పద్యంలో కాళిదాస, భవభూతి, బాణ, మయూరాది సంస్కృత కవుల పద బంధాలు భావాలు పడుగు పేకల వలె అల్లికపడి ఉంటుంది.

"ఎదుట లోపాముద్ర పద పద్మముల ముద్ర
సికతలంబగు నేలఁ జెలువు మిగుల" అనే యీ వాక్యం శాకుంతలంలోని తృతీయాశ్వాసంలోని

"అభ్యున్నతా పురస్తాదవ గాఢా జఘన గౌరవాత్పశ్చాత్
ద్వారేఽస్యపాండు సికతే పదపఙ్క్తిర్దృశ్యతేఽభినవా" (అభిజ్ఞాన 3.15)

అనే శ్లోకం యొక్క అడుగు జాడల్లోనిది. అట్లే

"శ్యామక ముష్టియాచ్ఛార్థంబు మృగములు
ఋషి కన్యకల రాకకెదురు చూడ" అనే వాక్యం

"యస్య త్వయా వ్రణ విరోపణ మింగుదీనాం
తైలం న్యషిచ్యత ముఖే కుశ సూచివిద్ధే
శ్యామక ముష్టి పరివర్థిత కోజహాతి
సోఽయం న పుత్ర కృతకః పదవీం మృగస్తే" (అభిజ్ఞాన 4.14)

అనే శాకుంతలంలోని శ్లోకాన్ననుసరించి ఉంది.

పెండిలినాడు భూ బృందారకులు కన్య
నప్పగించి రొలేదొ యధిపుఁ గూర్చి
సహచారిణివి గమ్ము సకల కాలమునందు
నిండుఁ జందురునిఁ జంద్రికయుఁబోలెఁ
దొలుకరి మొగులు విద్యుల్లేఖయును బోలె
ననుగమింపఁగ బాడి యతివ మగని
బిత్రు వనంబున దాఁక బతి విమానము వెంట
గైసేసి కొలనాడఁగదలు భంగి
బిఱికి కండ యొకింత లేకఱిమి వేడ్కఁ
జిచ్చుఱక బోవు వికచ రాజీవ నేత్ర
కశ్యమేధంబు ఫలము తథ్యంబు గలుగు
బద పదమ్మున కిది వేద భాషితంబు" (కాశీ 2.86)

ఇద ఒక లోకోత్తర పద్యం. బృహస్పతి లోపాముద్రతో ప్రాసంగికంగా పతివ్రతా ధర్మాలను గురించి ముచ్చటించిన సందర్భంలోనిది. పెండ్లి నాడు బ్రాహ్మణులు వరుని ఉద్దేశించి వధువుతో 'సకల కాలము నందు సహచారిణివికమ్ము. నిండు చంద్రుని వెన్నెల వలె, తొలకరి మబ్బును మెఱపు తీగ వలె మగనిని అనుగమింపుము'. అని అప్పగించారో లేదో

జలకమాడటానికి సరస్సుకు వెళ్ళిన విధంగా అలకరించుకొని శ్మశాన పర్యంతము ధైర్యంగా చొరవ చేసి చిచ్చులో పడిపోవటానికి వెళ్తున్న స్త్రీ వేస్తున్న ఒక్కొక్క అడుగులో ఒక్కొక్క అశ్వమేధ ఫలం ఇమిడి ఉందట. ఇది వేద వాక్కు.

ఈ పద్యం చదివిన వెంటనే ఆ స్త్రీ అడుగుల స్పర్శ చేత భూదేవి గజగజలాడిపోతున్నట్లు భావుక హృదయాలు కూడా కంపించి తీరుతాయి. అంతే, ఇక ఇది

"శశినా సహయాతి కౌముదీ, సహమేఘేన తటిత్ప్రలీయతే
ప్రమదాః పతి వర్మగా ఇతి, ప్రతి పన్నంహి విచేత నైరపి" (కుమార సంభవం 4.33)

అని కాళిదాసు శ్లోకార్థాన్ని అనుభవంలోకి తెస్తున్న బరువైన పద్యం. ఈ సందర్భంలోనే

"పెక్కు మాటల నిటు జాలి పెట్టనేల
సాధ్వి గర్వింప నొక డెట్టు చాలఁగలడు?
గంధ వాహంబు కెఱచు నక్కలు వకంటి
పసపు పయ్యెద పాలిండ్లఁబాయదట్ట" (కాశీ 2.88)

అనే ఈ పద్యాన్ని చదివిన వెంటనే

"వాతోపినా స్రంసయ దంశుకాని
కోలంబయే దాహరణాయ హస్తమ్"

అనే కాళిదాసు శ్లోకం గుర్తుకు రాకమానదు. ఈ విధంగా ప్రతి పద్యంలోనూ పూర్వ కవుల 'ఉక్తి సౌరభము' గుబుల్కొనుచునే ఉంటుంది.

"వాన కాలము నాఁడు వండ పట్టిన నీటి
కాలుష్య ముడిపెడు కతక ఫలము" (కాశీ 2.160)

శరత్కాలంలో అగస్త్య నక్షత్రముదయించిన వెంటనే కలకనీరు తేటపడుతుంది. సంస్కృతాంధ్ర కవులు 'శరద్వర్ణనలో' అగస్త్యోదయాన్ని వర్ణించటం పరిపాటి.

"ప్రససాదో దయాదంభః కుంభయానేర్మహౌ జన్మ" (రఘు 4.21)

అని కాళిదాసు రఘువంశము

**12.1.2.6 పుష్పదంతుడు:-** ఇతడు వ్రాసిన శివమహిమ్న స్తోత్రములందలి విషయాల్ని కూడా శ్రీనాథుడు హర విలాసంలో (5.21 రగడ) భీమ ఖండంలోనూ పొందుపరచినాడు.

**12.1.2.7 బాణుడు:-** శివరాత్రి మాహాత్మ్యం రెండు మూడాశ్వాసాలు బాణుని కాదంబరి అనుకరణయే. ఒక సమాసమేకాదు, పాత్ర పోషణ, సన్నివేశ కల్పన, తుదకు వాక్య ప్రణాళికా రచనసయితం భట్టబాణుని నుండి సంగ్రహించిన లక్షణాలే. బాణున్ని శ్రీనాథుడు అనుకరించినంత మరియే యితర కవియు అనుకరింపలేదని ధృడముగా చెప్పవచ్చును.

**12.1.2.8 మురారి:-** అనర్ఘరాఘవము ప్రౌఢమైన శైలితో కూడింది. అందులో

"ఉద్దామద్యామణి ద్యుతి వ్యతికర ప్రక్రీడ <u>దర్కోపల</u>
<u>జ్వాలాజాల జటాల జాంగల తటీ</u> నిష్కుజ <u>కోయష్టయః</u>

భౌమోష్మ ప్లవమాన సూర్యకిరణ క్రూర ప్రకాశాదృశో
రావిష్కుర్మ సమాపయంతి ధిగమూర్మాధ్యాశూన్యాదిశః'' (2.30)

ఉద్భృత సూర్యకిరణ సంపర్కం వల్ల ప్రకాశిస్తున్న సూర్య కాంతమణుల యొక్క జ్వాలా మాలలచే వ్యాపింపబడ్డ నిర్జల ప్రదేశాల్లో టిట్టిభ పక్షుల సమూహము నిశ్శబ్దంగా కూర్చున్నవి. భూమి యొక్క వేడి వల్ల ఎక్కువైన సూర్య కిరణాలచే క్రూర ప్రకాశంతో నిండిన దిశలు మిట్టమధ్యాహ్నమే శూన్యం వలె ప్రతీతమైన దృష్టిశక్తిని లోపింపచేస్తున్నది. దీనిలోని కొంత భాగాన్ని శ్రీనాథుడు హర విలాసంలో సంఘటించాడు.

"మౌళింగో హళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్నవేళన్ మహా
కాళంబైన నభోవిభాగమున వీకంగాసె బీరెండయు
ప్రాలే యాహిత సంప్రదీప్త కిరణ ప్రక్రీడ తర్కోపల
జ్వాలాజాల జటాల జాంగలతటీవాచాల కోయష్టియై (7.109)

**12.1.2.9 సుబంధుడు:-** తారకలను వర్ణించిన తీరు

"సంధ్యా తాండవాడం బరోచ్చలిత మహానట జటా జూటకూట
కుటిలస్ఖలన వివర్తిత జహ్ను కన్యావారి ధారాంబిందవ ఇవ వికీర్ణాః'' (వాస - 167 పు.)

సంధ్యా కాలంలో తాండవాడంబరమున చలించిన శివుని జుట్టు ముడి నుండి జారుట వల్ల తిరుగుడుబడిన గంగానది నీటి బిందువుల్లాగా

దీనికి శ్రీనాథుడు భీమఖండంలో -

'అభినవ సంధ్యా తాండవ
రభస రయచ్ఛిన్న మహినుధరాధర కన్యా
ప్రభు హా రాస్థుల భంగిన్
నభస్థ్సలిం దారకాగణంబులు నొడిచెన్' (భీమ 8.158)

**12.1.2.10 వ్యాసుడు:-** వ్యాసుని భారత కథలో అర్జునుని పరీక్షించిన శివుడిట్లనుచున్నాడు.

"ప్రీతిమానస్మితే పార్ధ భవాన్ సత్య పరాక్రమః
గృహాణ వరమస్మత్తః కాంక్షితం పురుషోత్తమ'' (30.4.6)
"నీ తపంబునకు పాశుపత వ్రత నిష్ఠా గరిష్ఠతకు భుజా
శౌర్యంబునకు సంతసిల్లితి వరంబు వేడుమనుటయు''
వరాన్ని కోరమన్న శివునితో కిరీటి ఇట్లంటున్నాడు.
"భగవన్ దాదుసిచేత్ మహ్యాం ప్రీత్యా వృషధ్వజః
కామయే దివ్య మస్త్రం తత్ ఘోరం పాశుపతం ప్రభో'' (3.40.8)

**దీనికి శ్రీనాథుడు:**

"అభవ! యీనాకు నీప్సితంబగు వరంబు
దయఁబ్రసాదించి రక్షింపదలచితేని

రౌద్రమై ఘోరమై లోక రక్షయైన
పాశుపత సంజ్ఞయగు దివ్య బాణమిమ్ము" (హర 7.102)

సంధ్యాకాలపు నాట్యము యొక్క హర్షముతోడ వేగంచే తెగిన శివుని యొక్క హారములోని ఎముకలో అనునట్లుగా నక్షత్ర సంఘాలుదయించాయి, అని శ్రీనాథుడు గంగానదిని శివుని హారంగా మార్చినాడు. హర విలాస కావ్యంలో నుండి శ్రీనాథుడు కాళిదాసుని అనుకరించటానికై ప్రయత్నించాడు. కుమార సంభవం, 'గిరిజాకళ్యాణాన్ని' తన హర విలాస కావ్యంలో ఒక ఘట్టంగా అనువదించాడు.

**12.1.2.11 అమరుక కవి:-**

"గాఢాలింగన వామనీ కృత కుచ ప్రోద్భూత రోమోద్గమా
సాంద్ర స్నేహ రసాతి రేక విగల చ్ఛ్రీమన్నితం బాంబరా
మామా మానద ముంచ మామితి క్రమక్షామాక్షరోల్లాపినీ
సుప్తాకింను! మృతానుకిం! మనసిమే వీనా! విలీనానుకిమ్!" (అమ 38)

అమరుకుని ఈ శ్లోకం శ్రీనాథుని పద బంధానికి మూలం.

"అమరుక కవేః ఏక శ్లోకః ప్రబంధ శతాయతే"

అను వాక్యం సుప్రసిద్ధము. ఈ అమరుక కవి వ్రాసిన ఒక్కొక్క శ్లోకమే ఒక్కొక్క ప్రబంధమట!

శ్రీనాథుడు తన కిష్టమైన పద బంధాలను సంస్కృత కవుల నుండి యధేచ్ఛగా తీసుకుంటాడు. కాశీ ఖండంలో

"నలి వింధ్యాచల కాననాంతరమున న్వారాణసీ త్యాగవి
హ్వల భావంబున నిల్చి నిల్చిహర! నీహారాంశు మూర్ధ్య ని
ర్మల! కాశీశ్వర! నీలకంఠ! యనుచున్ వ్రాఁగన్ను వాటిల్లఁద
త్కలశీ సూను ఁడు మూర్ఛ గైకొను క్రమాక్షామాక్షరోలాసియై" *(కాశీ 2.154)*

అగస్త్యుడు కాశీ నగరాన్ని విడిచి వెళ్ళే సందర్భంలోనిదీ పద్యం. *కాశిని వదలి వచ్చిన మనో వ్యధతో ఆయన అవయవాలు పట్టుదప్పుతున్నాయి. అందువల్ల అరణ్య మధ్యంలో అచ్చటచ్చట ఆయన నిలబడిపోతున్నాడు. ఆ రీతిగా నిలిచినప్పుడు హర! నీహారాంశు మూర్ధన్య! నిర్మల! కాశీశ్వర! నీలకంఠ! అనే శబ్దాలలోని అక్షరాలను క్రమంగా సన్నగిల్లుతున్న ధ్వనితో పలుకుచు సోలిక కన్ను వెట్టి మూర్ఛావస్థలోనికి ప్రవేశిస్తున్నాడు. ఇంద్రియ వ్యాపారాలు నిమీలితములవటమే మూర్ఛాస్థితి. ఈ పద్యంలో చివరనున్న 'క్రమక్షాముక్షరోల్లాసి'అనే పద బంధం అమరుక కావ్యంలోది.*

**12.1.2.12 మురారి:-** *మురారి రచించిన అనర్ఘరాఘవంలో ఒక సందర్భంలో 'వ్యామగ్రాహ్య పయోధరల్' అనే పదబంధాన్ని వాడాడు. దీన్ని శ్రీనాథుడు మక్కువతో*

*"అమిత్రా వరుణాంశ సంభవుని వింధ్యా టోప విధ్వంసిలో
పాముద్రా సహితుంగనుంగొనిరి సంతృప్త ప్రమోదంబునన్
వ్యామగ్రాహ్య పయోధరల్ కుటిల నీలాగ్రాలకల్ తథ్యమి
ధ్యామధ్యస్థి తమధ్యలాట విక సేనాధీశ సీమంతినుల్"* *(కాశీ 3.54)*

*అగస్త్యుడు శ్రీశైలానికి వచ్చిన సందర్భంలోనిదీ పద్యం. చెంచు జాతులకు నెలవైన శ్రీశైల మహారణ్య వీధుల్లో లోకోత్తర సౌందర్య నిధానమైన రాజనందన లోపాముద్రా దేవిని వెంటబెట్టుకొని నడచి వస్తున్న ఆ మహామునిని, వింధ్య గర్వాపహారిని, మిత్రా వరుణ దేవతాంశ సంభవుని, కుచకుంభవుని, చెంచెతలు కుతూహలంతో నివ్వెరపోయి చూస్తున్నారు. ఆ చెంచాసాను లెట్టి వారంటే బారలలో పట్టదగ్గ స్తన భారం కలవారు. నొక్కులు నొక్కులు తేరిన నల్లని ముంగురులు కలవారు. కలవా? లేవా? అన్న సందేహానికి నడుమనున్న నెన్నడుములు కలవారు. వారాయాటవిక సేనాధీశ్వరుల యొక్క రాణి వాసములు*

"తీర్త్వా భూతేశ మౌళి స్రజ మమరధునీ మాత్మనా౽సౌ తృతీయః
తస్మై సౌమిత్రి మైత్రీ మయముహ హృతవానాతరం నావికాయ
<u>వ్యామ గ్రాహ్యా స్తనీభిః శబర యువతిభిః</u> కౌతు కోదంచ దక్షమ్
కృచ్ఛ్రుదన్వీయమానః క్షణ మచలమధోచిత్ర కూటం ప్రతస్థే" (అనర్ఘ 5.2)

క్రీడాభిరామంలో దీన్ని బాహాటంగా ఉపయోగించాడు. తనకు మక్కువైన ఒక్కొక్క పదబంధాన్ని చొప్పించటానికి ఒక్కొక్క పద్యాన్ని వ్రాయటం ఈయన లక్షణం. శ్రీనాథునిలో పూర్వ సంస్కృత కవుల ప్రతిభలోని వైవిధ్యమంతా కనిపిస్తుంది. ప్రధానంగా ఈయన రచన పూర్వ సంస్కృత కవుల సంపన్న వాక్చిత్రాలతో అలంకరించిన ఒక వస్తు ప్రదర్శన శాలలాగా ఉంటుంది.

## 12.1.3 ఆంధ్ర కవుల ప్రభావము:-

"వచియింతు వేముల వాడ భీమన భంగి
    <u>నుద్దండలీల</u> నొక్కొక్క మాటు
భాషింతు నన్నయ్య భట్టు మార్గంబున
    <u>నుభయవాక్ప్రౌఢి</u> నొక్కక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము <u>రసా</u>
    <u>భ్యుచిత బంధముగ</u> నొక్కక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
    <u>సూక్తి వైచిత్రి నొక్క</u>క్క మాటు" (కాశీ పీ.13)

అని శ్రీనాథుడు తనను గురించి, తన కవితా లక్షణాలను గురించి చెప్పుకొన్నాడు. వేముల వాడ భీమ కవి గ్రంథాలేవియు ప్రస్తుతమలభ్యములు. నామమాత్రావశిష్టములు. ఏవియో కొన్ని చాటువులు మాత్రం దొరుకుతున్నాయి.

**12.1.3.1 వేములవాడ భీమన:-** ప్రధానంగా భీమన నుండి శ్రీనాథుడు గ్రహించిన లక్షణం '<u>ఉద్దండ లీల</u>'. వేములవాడ భీమ కవి నిగ్రహానుగ్రహ సమర్థుడుగను, పాండితీ శౌండిమ గలవాడుగను, మంచి కవిగను, చాటువులను బట్టి గ్రహింపగలము. తిట్టు కవిత్వానికి భీమన పెట్టింది పేరు. తిట్టటంలోనూ ఒక దిట్టతనం కావాలి. అందుచేతనే ఆతడాడింది ఆటగా, పాడింది పాటగా జరిగింది. ఇట్టి సామర్థ్యాన్ని శ్రీనాథుడు మరేమి అనలేక ఉద్దండత అని వ్యవహరించాడు.

"ఘనుడన్ వేములవాడ వంశజుడ దక్షారామ భీమేశనం
దనుఁడన్ దివ్య విషామృత ప్రకటనాను కావ్య గంధుండ భీ
మన నా పేరు నెఱుంగఁజెప్పితి తెనుంగాధీశ కస్తూరికా
ఘనసారాది సుగంధ వస్తువులు వేగన్ దెచ్చిలాలింపురా!" (చాటువు 124. ప్ర)

ఇందులో విషయం సామాన్యమే అయినా చెప్పిన పద్ధతి 'ఉద్దండంగా' ఉంది. చెప్పవలసిన విషయాన్ని ఎంతయో పై స్తాయి నుండి నిరాఘాటంగా, అడ్డంకి లేకుండా శాసిస్తున్నట్లు చెప్పటాన్ని ఉద్దండలీల అనవచ్చు. శ్రీనాథునిలో

"పాటిల్లెం ధరణీ సురోత్తమున కప్పాటన్ విదాహ జ్వరో
ష్మాటో పంబున నత్యు పద్రవము మైనా పాదమస్తంబుగాఁ
గోటీ వృశ్చిక కీట పుచ్ఛలతి కాకోటీ శిఖా కంటక
త్రోటీ కుట్టన సంప్రభూత విషదూర్దుర్వార దాహోద్ధతిన్" (కాశీ 3.129)

ఈ పద్యం శివశర్మోపాఖ్యానంలోనిది.

తీర్థ యాత్రలు చేస్తున్న శివ శర్మకు మాయా నగరంలో జ్వరం విజృంభించటం వల్ల కాళ్ళ నుండి తల వరకు ఒక కోటి సంఖ్య కల తేళ్ళు తమ కొండెపు పూసలలో చివరి పూస కొననున్న ముండ్లతో ఒకేసారిగా అంటబొడిచినట్లు శరీరమునందత్యధికమై ఓర్వజాలని ఉపద్రవం ఘటిల్లెను. ఈ పద్యంలో విషయ గౌరవం లేకపోయినా

"కోటి వృశ్చిక కీట పుచ్ఛలతికా కోటీ శిఖాకంటక
త్రోటీ కుట్టన సంప్రభూత విషధూర్దు ర్వారదాహోద్ధతిన్"

అని చెప్పిన పద్ధతి ఎంతయో ఉద్దండంగా ఉంది. అట్లని ఆ ఉద్దండత్వం కేవలం సమాసఘటనను మాత్రమే ఆశ్రయించుకొని ఉండదు. ఈ విధంగా దీర్ఘ సమాస ఘటనయందే కాక సామాన్యమైన రచన యందు కూడా ఈ ఉద్దండత శ్రీనాథునిలో కలదు.

"ధర్మంబు కాశికాస్థాన మధ్యంబున
నాల్గుపాదంబులనడచి యాడు
నర్థంబు కాశీ పురాంగణంబున యందు
నానా ప్రకారమైనటన మిగులుఁ
గామంబు కాశికా కటక ఘంటా వీధి
గిర్వంచు రాజలోకంబు దేవ
మోక్ష సంపదలు కాశీ క్షేత్రమున యందుఁ
ద్రవ్వి తండబులైనివ్వటిల్లుఁ
గాశి కళ్యాణముల కాది కారణంబు
కాశి యణి మాది సిద్ధుల కాటపట్టు
కాశి జనలోక సంకల్ప కల్పకంబు
కలుషపిశితంబు మెసపు రాకాసి కాశి" (కాశీ 2.50)

ఈ పద్యంలో సమాసాలేమీ లేవు. అన్నీ చిన్న చిన్న మాటలు. కాని చెప్పే పద్ధతి ఉద్దండంగా ఉంది. 'ధర్మంబు కాశికాస్థాన మధ్యంబున నాల్గు పాదంబుల నడచియాడు' అని చెప్పటం ఒక ఖచ్చితమైన ధోరణి. ఆ విధంగా చెప్పటాన్నే ఉద్దండలీల అంటారు. ఈ ఉద్దండత్వం వేముల వాడ భీమన దగ్గర నుండి శ్రీనాథుడు గ్రహించిన ఒక కవితా లక్షణం.

1. "కాంచెన్ గాంచన గర్భ సంభవుడు దగ్రగ్రావ కోటీ స్థల
   చ్ఛంచ నిర్ఝర వేణి కానివహ సంజాతాబ్ధి సంగత్యమున్" (కాశీ 1.87)
2. "కటి భాగమున గంధకరటి రాట్చర్మంబు
   కవటంపుఁజిమ్మచీఁకట్ల నీన" (కాశీ 5.101)
3. "ఢమఢమార్భటి డమడ్డమరుఢక్కా ధ్వని
   పది దిక్కులందును భ్రమరివార" (కాశీ 5.104)

మొదలైన ఈ పద్యాలన్నీ ఉద్దండలీలకు పరమోదాహరణాలు.

**12.1.3.2 నన్నయ్య:-** నన్నయ భట్టారకుని యందు శ్రీనాథ కవి ఉభయ వాక్ప్రౌఢిని గుర్తించాడు. ప్రౌఢి అంటే - వివక్షితార్థ నిర్వహణము. కవి, తానుద్దేశించిన అర్థాన్ని సంస్కృతాంధ్రముల యందు నిరర్గళంగా వ్రాయగల సామర్థ్యం. నన్నయ్యను శ్రీనాథుడు ఉపాధ్యాయ సార్వభౌముడని స్తుతించాడు. ఉదాహరణకు

"నీవును బ్రహ్మచారివి వినీతుడ వేనును గన్యకన్ మహీ
దేవ కులావతంస రవితేజ వివాహమునకు నీకు నాకుమున్
భావజశక్తి నైన యది పన్నుగ నన్ను పరిగ్రహింపు సం
జీవని తోడ శుక్రుదయజేయుము నాకు ప్రియంబు నావుడున్" (భారతం 1.3.129)

దేవయాని కచునితో అన్న సందర్భం.

హర విలాసంలో

ఏనును బ్రహ్మచారి! దరళేక్షణ! నీవును కన్యవెంతకా
లానకు నీకు బెండ్లియ ఫలంబగునేని వాచరమే లస
న్మానము తోడ నన్ను మునిమాన్య వివాహముగమ్ము లెమ్ము కా
దేని తపంబులోని సగమిచ్చెదమాను తపోభిమానమున్ (హర 4.25)

బ్రహ్మచారి పార్వతితో అన్న సందర్భము.

నన్నయ గారి కవితా లక్షణమైన పద్య నిర్మాణ పద్ధతి కాశీ ఖండంలో ఈ పద్యంలో కన్పిస్తుంది.

"రాజ శశాంక శేఖరుఁడు రాజ కిరీట వతంసమష్టది
గ్రాజ మనోభయం కరుఁడు రాజుల దేవర రాజరాజు శ్రీ
రాజ మహేంద్ర భూభువన రాజ్య రమా రమణీ మనోహరుం
డాజిఁగిరీటి కీర్తినిధి యల్లయ వీర నరేంద్రుఁడున్నతిన్" (కాశీ పీఠిక 42)

గ్రంథాదిలో వీర భద్రారెడ్డిని గురించి చెప్పిన పద్యం. ఈ పద్యాన్ని చదివిన వెంటనే మనకు

"రాజకులైక భూషణుడు రాజ మనోహరుఁడన్యరాజతే
జో జయశాలి శౌర్యుఁడు విశుద్ధ యశశ్శరదించు చంద్రికా
రాజిత సర్వలోకుఁడపరాజిత భూరి భుజా కృపాణ ధా
రాజల శాంత శాత్రవ పరాగుడు రాజ మహేంద్రుడున్నతిన్" (భారతం ఆది.3)

అను నన్నయ గారి పద్యం గుర్తుకు రాకమానదు.

**సంస్కృతాంధ్రాల నన్నయ కవితలోని ప్రౌఢి:-**

"కురు వృద్ధుల్ గురు వృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధరుడై ద్రౌపది నిట్లు చేసినఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపుల వక్ష శ్శైల రక్తౌఘుని
ర్ఝర ముర్వీపతి చూచుచుండనని నాస్వాదింతునుగ్రాకృతిన్" (భారతం. ఉద్యోగ)

*ఈ పద్యంలో భీముడు దుశ్శాసనుని రక్తపానం చేస్తాననటం వివక్షితార్థం. ఏతదర్థము సంస్కృత శబ్దాలచే సమంచితమైన పరిపాకంలో నిర్వహింపబడింది. సంస్కృత పదాలీ పద్యమందలి ప్రౌఢిని సంపాదించినవి. దీనికి అనురూపమైన ప్రౌఢినే శ్రీనాథుడు దిగువనుదహరించిన పద్యంలో సమకూర్చుకొన్నాడు.*

*"రణ కంఠనాభర దుస్సహంబయిన యారాజన్య దేవేంద్రు ద*
క్షిణ బాహా గ్రమునన్ జనించిన మహాకీర్తి ప్రవాహంబుగా
రణ సంక్రాంత గుణానుషంగముననో ప్రస్ఫీత దిఙ్మత్తవా
రణ గండ స్థల కుంభ కూలములతో రాయుంది వారాత్రముల్" (శృ॥నై॥ 2)

ఇట వివక్షితార్థము కీర్తి దిగంతాల వరకు వ్యాపించటం. ఇది క్రమంగా సంస్కృత శబ్దశక్తిలో చక్కని పరిపాకానికి తేబడింది.

**తెలుగులో నన్నయ యొక్క వాక్ప్రౌఢికీ దిగువ పద్యం ఉదాహరణము:**

నీవు కడు నేర్పు కాడవు, గావలదు వీని గొన్ని గఱచితి నేమున్
నీ విద్య లెల్ల, జూపుదు, మీ వీరులు సూచి మేలు మేలని పొగడన్" (భారతం 6.32)

ఈ పద్యంలో అస్త్ర విద్యా ప్రదర్శనంలో మత్సరుడైన కర్ణుడు అర్జునుని ఆక్షేపించటం వివక్షితార్థము. 'నీవ' అను పదంలోని ఏ వార్థము 'నీవే' నైపుణ్యం కలవాడననుకోబోకుము. నీ వంటి వారలు చాలమంది కలరని బోధిస్తూ వ్యంజకమైంది.

**శ్రీనాథుని హర విలాసంలోని కిరాతార్జునీయ సంవాదంలో:**

"తాటియంతటి విల్లు ధరియించినాడవు
జ్యాకిణాంకితంబు భుజ యుగంబు
గర్వరేఖ మిగులగానంగనయ్యెడు
దాంభికంబు నీదు తబిసితనము (హర 7.23)

ఇచ్చట వివక్షితమైన అర్థము అర్జునుని తపస్సును డంబాచారమని నిరూపిస్తున్నది. ఇయ్యది శ్రీనాథుని యొక్క ఉభయ వాక్ప్రౌఢికి నిదర్శనము.

**12.1.3.3 తిక్కన:-** *రసాభ్యుచిత బంధమంటే వీరరౌద్రాలైన ఉద్ధతరసాలకు, శృంగార, కరుణాదులైన సుకుమార రసాలకు పొంది పొసగి ఉన్న కట్టుబడితో హత్తుకొని పోవునట్లుగా చెప్పటం. అంటే రసానికి అనుగుణమైన పదాల కూర్పు అని అర్థం. ఇది శ్రీనాథుడు తిక్కన నుండి ప్రధానంగా తీసుకున్న లక్షణం.*

*"కనుగొని కోపవేగమున కన్నుల నిప్పులు రాలనంగముల్*
*దనరగ సాంద్రఘర్మ సవిలంబులు గ్రమ్మ, నితాంతదంపీ*
*డన రట దాస్య రంగ, వికటభ్రుకుటీ చటుల ప్రవృత్తన*
*ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధమూర్తియై"* (భారతం 4.2.133)

ద్రౌపదిని అవమానించిన కీచకుని పై భీమసేనుని రౌద్రము ఇందు వర్ణింపబడింది. కోపం క్షణక్షణానికి ఎట్లా అభివృద్ధి చెందిందో ఆ విధంగా ఇందులో పద ప్రయోగం జరిగింది.

శ్రీనాథుడు తిక్కన యందు దర్శించి తన కావ్యాలనలవరచుకున్నాడు.

"ఏమో నా హృదయంబు నిన్నుగని యిట్లే చాపమందాసమై
భామాసన్నిధి నుబ్బుచున్నయది నీ బాహా ప్రతాపంబుని
స్సీమంబేనొక యింత సేపిచటను జృంభించిరాఁజేయుమా
నామీదన్నిగిడింపుమా నిశితి నానా క్రూర నారాచముల్" (హర 7.63)

కిరాతార్జునీయంలో ఈశ్వరుడు అర్జునుని సమరానికి ఆహ్వానిస్తున్నాడు. 'ఏమో' అను పదమిచట సంవృత్తి వక్రోక్తి కలది. మాయాకిరాతుడు తన హృదయం అర్జునుణ్ని చూడగానే సమరోత్సాహపడటానికి హేతువేమో తెలియలేకున్నాడు. ఇచ్చట యుద్ధ వీరానికి అర్జునుడు ఆలంబనం. పార్వతి సన్నిద్ధి ఉద్దీపనం. రసానికి అనుగుణమైన పదబంధంతో తిక్కన వలె రసాభ్యాచిత బంధనమున రచించించాడు.

**12.1.3.4 ఎఱ్ఱన:-** 'పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని దేవసూక్తి వైచిత్రి నొక్కక్క మాటు' దయాధర్మ నీతిబోధకాలైన సూక్తులను ఎఱ్ఱన చాలా పొందికగా చెప్పాడు. ధర్మరాజు దుర్యోధనుని గంధర్వరాజైన చిత్రసేనుని నుండి తప్పించి అతనితో హితవు పలుకుతూ ఇట్లా అంటాడు.

"ఎన్నడు నిట్టి సాహసములింక నొనర్పకుమయ్య, దుర్జనుం
డన్నన సాహస క్రియల యందు గడంగినశించు గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలగైకొని యిమ్ముల బొమ్ము వీటికిన్
సన్నుత! దీని కొండొక విషాదము పొందకు మీమనంబునన్"

<u>'ఎన్నడు నిట్టి సాహసములింక</u>' అనేది సూక్తి. ధర్మరాజు దుర్యోధనునకు చేయు నీతి బోధలో ఎంతో ఓరిమి, నేరిమి కానవస్తున్నది. విడి పదాలతో అతని హృదయానికి విడమరచిన భావాన్ని విశదము చేస్తాడు. నీతి పంథాను ఇంత నవనీతము వలె హత్తుకున్నట్లున్న పద్యం. ఈ సూక్తి వైచిత్రిని శ్రీనాథుడు ఎఱ్ఱన నుండి గ్రహించాడు.

*"తగునయ్య! కవిరాజ! <u>తగవు ధర్మము దప్పి</u>*
*<u>యాడునెయట్లు నీయంతవాడు</u>*
మాకుఁజూడంగనిది యసమంజసంబు
మిన్నకరుగుము కాదు నీకన్న తెరగు,
సత్వరంబున బరుల కిచ్చువిఘాత
మాచరింపరుకృత బుద్ధులయినవారు"

ఇందులో 'తగవు ధర్మము దప్పియాడునె యట్లు నీయంతవాడు' అనేది సూక్తి.

**12.1.3.5 నాచన సోమన:-** శ్రీనాథుడు కాశీ ఖండావతారిక యందు నాచనసోముని పేర్కొనకపోయినప్పటికీ నాచనసోముని ప్రభావం మొత్తం శ్రీనాథుని గ్రంథముల యందంతటను వ్యాపించి ఉంది. ముఖ్యంగా కాశీ ఖండ మందలి వింధ్యా గర్వాపహరణము, సోమన ఉత్తర హరి వంశ మందలి హంస డిభకోపాఖ్యానము, పౌండ్రక వాసుదేవుని కథను పోలియున్నది. అందలి శిల్ప లక్షణాలను కొన్నింటిని శ్రీనాథుడు గ్రహించాడు. పద్య రచనా శిల్పంలో విశేషించి సీసపద్య నిర్మాణంలో నాచనసోముని అనుసరించిన పద్యాలు కొన్ని ఉన్నాయి. కాశీ ఖండంలో బుధలోకాన్ని వర్ణిస్తూ శ్రీనాథుడు

"ప్రతిబింబమో కాని రజని వల్లభునక
ధ్యాహారమో కాని యమృత రుచికి
వినిమయం బోకాని, విధున కన్వాదేశ
మోకాని, యత్రినేత్రోద్భవునకు
వీప్సయో కాని పూవిలు కాని సఖునకు
నామ్రేడితము కాని యబ్ధిజునకు
నభిధాంతంమొ కాని యరవింద వైరికి
సారూప్యమొ కాని చందురునకు
ద్రుమికి నూడ్చినవాడు భర్గుని కిరీట
కోటికాభరణంబైన కువలయుప్తు
మిగులఁజక్కని కొడుకండు మింటినడుమ
గ్రహములందీతఁడెవ్వండు? గుణములార?" (కాశీ 1)

ఇది నాచన సోముని సీసపద్యానికి కొంత పోలిక ఉంది.

"వెలిదమ్ములో లేఁత వెన్నెలో యమృతమో
కన్నులో చిఱునవ్వో కనికరంబో
గగనమో చుక్కలో గ్రహరాజ బింబమో
వక్షంబొ మౌక్తి కావలి యొమణియొ
తరఁగలో ఫేనమో తరణి మండలమోహ
స్తములో శంఖంబో సుదర్శనంబొ
తలిరులో కరికరంబులొ కుంకుమ ప్రభా
పదములొ యూరులో పచ్చపట్టో" (ఉత్తర హరి వంశం 4.138)

కాని, శ్రీనాథుని సీసపద్యంలో చెప్పిన అధ్యాహారము, అన్వాదేశము, వీప్స, ఆమ్రేడితము, సారూప్యము వంటి వ్యాకరణ శాస్త్ర పరిభాషలను తొలగిస్తే ఇందు నాచనసోముని అనుకరించెనని చెప్పటానికి వీలవుతుంది.

ప్రధానంగా సీసపద్యాలకు, వృత్తాలకు, నాచన సోమన క్రొత్త వరవళ్లు తీర్చాడు. కవిత్రయం వారి సీసపద్య రచన ఏ చరణానికి ఆచరణంగా ఉండదు. భావప్రధానమై చరణంలోకి చరణము పొదవలె అల్లుకొని పోయి ఉంటుంది. కత్తిరించినట్లు

చరణాలు నిలిపి వ్రాస్తే సీసపద్యానికి కొత్త అందం వస్తుంది. సోమన పలువిధాలైన ఎత్తుగడలతో సీసపద్య రచన యందు, వృత్త రచన యందును క్రొత్త శిల్పముల మూసలు కట్టాడు. శ్రీనాథుని మొదలు తరువాతి కవులందరును సోమన కట్టిన మూసలలోనే సీసపద్యాన్ని పోతపోశారు.

ఈ విధంగా శ్రీనాథుని పై సీసపద్య నిర్మాణము నాచనసోముని సీసపద్యానికి పూర్తిగా ప్రతిబింబమని చెప్పటానికి వీలుకాని వినిమయము వ్యక్తిత్వంతో కూడిన వినయ ప్రతిబింబం.

## 12.1.4 ఉపసంహారము:-

శ్రీనాథుని పై పూర్వ సంస్కృతాంధ్ర కవుల ప్రభావం దేనికదిగా విడదీసి చూస్తే ఇంక శ్రీనాథుడు "సున్నకు సున్న హళ్లికి హళ్లి" మాత్రమైపోడు! దీనివల్ల శ్రీనాథుడు పూర్వ సంస్కృతాంధ్ర కవుల 'వాక్ప్రయోగదక్షత' మాత్రమే తెలుస్తున్నది. గంగా ప్రవాహంలాగా ఉదగ్ర రమణీయమైన శ్రీనాథుని వాక్ప్రవాహంలో ఇవన్నీ కొట్టుకొని వస్తుంటాయని మాత్రమే గ్రహించాలి. వీటన్నింటినీ అంతర్భూతం చేసుకొని ఉన్న శ్రీనాథుని శైలి దానికది విడిగా ఉండనే ఉంది.

తెలుగు భాష తన వ్యక్తిత్వాన్ని చెడకుండా తనలో ఎంత సంస్కృత భాషా వైభవాన్ని ఇముడ్చుకోగలదో శ్రీనాథుడు నిరూపించాడు.

సంస్కృతంలోని ఓజస్సు, దీప్తి, మాధుర్యం మొదలైన లక్షణాలు శ్రీనాథుని కవితారీతి వాహికగా సరాసరి తెలుగు కవిత్వంలోకి ప్రవేశించింది. శ్రీనాథునిది సంపన్నమైన వాణి. ఆయన ఏ ఒక్క సంస్కృత కవినో అనుకరించెననటానికి వీలులేదు. సర్వ సంస్కృత కవులును ఆయన వాక్సత్రంలో ఆత్మీయులైన అతిథుల వలె మన్ననలు పొందారు. ఆయన స్వీకరించటం వల్ల వారి గౌరవం పెరిగింది. పూర్వ సంస్కృత కవుల నుండి ఒక పద బంధమో, ఒక సమాసమో, ఒక భావమో శ్రీనాథుని కవితారీతిలో ఒదిగి నడవగా నికషోపలమైన శ్రీనాథుని భావుకత పై ఒఱయిక నొంది అది నిలిచి మెఱసినదన్న మాట. అది సంపన్నమైన ఆయన భావుకతకు చర్వణా లక్షణానికి, రస ప్రలోభానికి నిదర్శన మాత్రమే నని గ్రహించాలి. కాని, అశక్తికృతమైన అనుకరణమని తలంపరాదు. ప్రలోభపడి పూర్వ కవులను అనుకరింబోయిన కవి అల్పశక్తి కలవాడైతే నిర్వహించుకొనలేక అణగారిపోతాడు. శ్రీనాథుని ప్రాణశక్తి అగాధమైంది. అందువల్ల ఆయన ఎక్కడా తేలిపోడు. అంతేకాదు, ఆయన రీతిలో నిబద్ధములైన ఆ పూర్వకవుల పద బంధాల యందు కూడా ఒక నూతన ప్రాణశక్తి ప్రసరిస్తుంది. దానికి కారణమేమంటే శ్రీనాథునకు తెలుగు భాష యొక్క జీవనాడి తెలుసు. ఉన్న బలమంతా ఆయన పలుకు నుడికారంలోనే ఉంది. సంస్కృత సమాసఘటనయందున్నట్లు పైకి గోచరిస్తుంది. క్రియావిన్యాసమందలి ఒకానొక విచ్ఛిత్తితో, ఒక జాతీయతతో ఎంతటి సంస్కృతమునందైనను తెలుగు ముద్రవేసి తెలుగనిపించ గల్గుటయే శ్రీనాథుని నైసర్గిక లక్షణం.

## 12.1.5 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని పై పూర్వ సంస్కృత కవుల ప్రభావమెట్టిదో వివరింపుము.
2. శ్రీనాథుని పై పూర్వాంధ్ర కవుల ప్రభావాన్ని సోదాహరణంగా నిరూపించండి.

## 12.1.6 ఆధార గ్రంథాలు:-


1. శ్రీనాథుడు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
2. శ్రీనాథుని కాశీఖండము సమగ్ర సమీక్ష - డా॥ మల్లంపల్లి సీతాదేవి


**-ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

**పాఠం - 12.2**

# అనంతర కవులపై శ్రీనాథుని ప్రభావము

**ముఖ్యాంశాలు:-**

**12.2.0 లక్ష్యం**

**12.2.1 ఉపోద్ఘాతం**

**12.2.2 సీసపద్యం - పెద్దన అనుకరణ**

**12.2.3 సీసపద్యం - రామరాజభూషణుడు**

**12.2.4 ధూర్జటి - శ్రీనాథుడు**

**12.2.5 తెనాలి రామకృష్ణుడు**

**12.2.6 కందుకూరి రుద్రయ**

**12.2.7 ఆముక్త మాల్యద**

**12.2.8 పలుకుబడుల్లో అనుకరణ**

**12.2.9 పింగళిసూరన**

**12.2.10 పిల్లల మఱ్ఱి పినవీరన**

**12.2.11 ఉపసంహారము**

**12.2.12 ప్రశ్నలు**

**12.2.13 ఆధార గ్రంథాలు**

## 12.2.0 లక్ష్యం:-

శ్రీనాథ కవిని గూర్చి పలువురు అనుయాయి కవులు బహుముఖాలుగా స్తుతించారు. వసుచరిత్రకారుడు కవిసార్వభౌముని ఆంధ్ర భాషకు రక్షకుడుగా కొనియాడాడు. "శ్రీనాథుండు ప్రోవన్ ................ పెంపు వాటించు నీ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచము తత్త్వాగల్భ్యనూమూంచెదన్" అని వసుచరిత్ర అవతారిక యందు స్తుతించాడు. నరస భూపాలీయంలో శ్రీనాథకవిని 'పద ప్రసిద్ధ ధారాధుని' అని ప్రశంసించాడు. అట్లే చింతలపూడి ఎల్లనార్యుడు (రాధా మాధవ కవి), ఇందుమతీ పరిణయ కర్త, కుమారధూర్జటి, బహుళాశ్వ చరిత్రకారుడు శ్రీనాథుని యందలి 'శబ్ద' , 'గుంభన కళా' వైఖరిని సంస్తుతించారు. మొల్ల శ్రీనాథుని 'రసికుడ'ని సన్నుతించింది. ఈ విధంగా శ్రీనాథుని సన్నుతించిన అనంతర కవులు ఏ విధంగా ప్రభావితులయ్యాలో పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

## 12.2.1 ఉపోద్ఘాతము:-

ఒక మహాకవిని అనుకరించాలంటే ఏతాదృశమైన ప్రతిభ గల మరియొక మహాకవి మాత్రుడే అందుకోగలడు. శ్రీనాథుని యొక్క పోలికలు అనుయాయి కవులందరిలోనూ ఏ కొంచమైనా కన్పిస్తూనే ఉంటుంది.

1. సీసపద్య నిర్మాణము నందు శ్రీనాథ కవి సాధించిన చతురత.
2. పూర్వ సంస్కృత కవుల పుడిసిలించి తన కవితలో మలచికొన్న రీతులు.
3. వ్యాకరణ విశిష్టమైన పజదాలాన్ని ఉపయోగించు నేర్పు.
4. జీవవంతములైన తెలుగు పదాల నాణెము చేయు నేర్పు.
5. కావ్య జీవితమైన వక్రోక్తి మధురిమను విన్యసించు శబ్దాల కూర్పు.
6. సంస్కృత కారకమర్యాదను తెలుగులో ఉపయోగించు కుతూహలము.
7. సంస్కృత శ్లోకాలను మక్కికిమక్కి తెలుగు పద్యబంధాలను పొందించు వేడుక.

ఇట్టి విలక్షణములచే విశేషించి ప్రకాశించిన శ్రీనాథుని ప్రభావం అనంతర కవుల పై ప్రతిబింబించిన తీరును గమనింపవలసి ఉంది.

## 12.2.2 సీసపద్యం - పెద్దన అనుకరణ:-

శ్రీనాథుని కవితా ప్రతిభ యందు సీసపద్య నిర్మాణమొక విలక్షణము. తిక్కన కంద పద్యంలాగా, కాళిదాసుని మందాక్రాంతంలాగా, మయూరుని స్రగ్ధర వలె, సీస పద్యం శ్రీనాథుని హస్తమున క్రొత్తదనాన్ని పొంది మెరుగులు దిద్దుకొంది. ఇతని కవితలో సీసపద్యం సర్వాంగ సుందరమైంది. ప్రతి పదాన్ని కవి తీర్చిదిద్దాడు. కవి సార్వభౌముని సీసపద్య పువాసి తరువాతి కవుల్లో ప్రతివానిపై కొంచెంగానో, గొప్పగానో ప్రసరితమయి ఉంది.

శ్రీనాథుని సీస పద్య భేషజాన్ని, సౌకుమార్యాన్ని వెన్నతో అనుపానంగా అభ్యసించిన పెద్దన

"చిన్ని వెన్నెల కందు వెన్నుదన్ని సుధాబ్ధిఁ
 బొడమిన చెలువతో బుట్టుమాకు
రహిపుట్టజంత్ర గాత్రముల రాల్గరగించు
 విమల గాంధర్వంబు విద్యమాకు" (మనుచరిత్ర 2.43)
"కలశ పాథోరాశి గర్భ వీచిమ తల్లి
 కడుపార నెవ్వానిఁగన్న తల్లి" (మనుచరిత్ర, పీఠిక - 18)

## 12.2.3 సీసపద్యం - రామరాజ భూషణుడు:-

ఈ సీస పద్యాన్ని సంగీతమనే అనుపానంతో ఆస్వాదించినవాడు రామరాజ భూషణుడు.

"లలనా జనాపాంగ వలనా వసదనంగ
 తులనాభికాభంగదోః ప్రసంగ
మలసా నిలవిలోల దళసాసవరసాల
 ఫలసాదర శుకాల పనవిశాల
మలినీ గరుదనీక, మలినీ కృతధునీక
 మలినీ సుషిత కోకకుల వధూక....................." (వసుచరిత్ర 3.20)

ఇది రామరాజ భూషణుని కవితా శిల్పమో, సంగీత శిల్పమో అన్నట్లుగా మెచ్చుకోదగిందీ సీసపద్యం.

కవిత్రయం తర్వాత శ్రీనాథుడు సీసపద్యాలకును, వృత్తాలకును, నిర్మాణ పద్ధతుల్లో వఱవడులను చెప్పదగ్గ సరిక్రొత్త మూసలు కొన్నింటిని నిర్మించాడు. శ్రీనాథుడు కట్టిన ఆ మూసల్లో శ్రీనాథుడు చూపిన 'రీతి'నే అనుసరించి పెద్దన తన జిలుగు పనితో తెలుగు భాష తీయదనాన్ని పోతపోశాడు. అంతేగాక పెద్దన శ్రీనాథుని 'పలుకునుడికారాన్ని' కూడా కొంత వరకు పుణికి పుచ్చుకొన్నాడు.

"చెట్టువ్రేసిన చేట్టెడక్షిణ పుణ్య!" (కాశీ 7.9)

"చెట్టడసిన చేట్టేదేమి చెప్పన్ బులుగుల్" (మను॥4ఆ)

"కరి నిభయానతో నిదె! పోకాలెద మిన్నులు షడ్డచోటికిన్" (కాశీ 2.156)

"పాటి వైచితి జన్ములు సడచో" (మను॥ ఆ-17)

"సనికల్ డాచిన పెండ్లి మాను నొకొ" (కాశీ 5.311)

"గుండ్రా డాచిన ఁబెండ్లియేమిటికిఁ జిక్కున్" (మను॥ 5.17)

వసుచరిత్ర కంటె మనుచరిత్రలో తెలుగు పలుకు నుడికారం కొంత ఎక్కువ. మనుచరిత్రము నందు కంటె వసుచరిత్రములో ఒక పాలు శయ్యా సౌభాగ్యమెక్కువ.

## 12.2.4 ధూర్జటి - శ్రీనాథుడు:-

కవితా మాధుర్యంలో రంగరింపబడ్డ శ్రీనాథ ధూర్జటుల జీవ లక్షణాలలోని శివభక్తి మాధుర్యము తెనుగు వాఙ్మయంలో పోతన భాగవతంలోని మందార మకరంద మాధుర్యానికి ప్రతిద్వంద్విగా నిలిచింది. కాశీ ఖండంలాగానే శ్రీకాళహస్తి మహాత్మ్యం కూడా శివక్షేత్ర మహిమతో కూడి ఉంది. శ్రీనాథుని శివభక్తి కంటే ధూర్జటి శివభక్తిలో ఆర్తిభరితమైన ఏకాంత లక్షము ఎక్కువే అయినప్పటికీ శ్రీనాథుని వారసత్వ లక్షణాలు గోచరిస్తూనే ఉంటాయి.

శ్రీనాథుని తరువాత ఆయన త్రోవలో క్షేత్ర మాహాత్మ్యాలను కావ్యాలుగా రచించిన ప్రబంధ కవులు ధూర్జటి, రామకృష్ణ కవులు. శ్రీనాథుని కవితా రీతిలోని శివభక్తి మాధుర్య లక్షణాలను ధూర్జటియు, రామకృష్ణ కవియు గ్రహించారు. ప్రౌఢి లక్షణాన్ని రామకృష్ణ కవి, ధూర్జటి చెరిసగం పంచుకొన్నట్లు కనిపిస్తారు.

## 12.2.5 తెనాలి రామకృష్ణుడు:-

పాండురంగ మాహాత్మ్యం విష్ణు క్షేత్ర మహిమ గలదైనా, ఆద్యంతం దాని యందు అంతర్లీనంగా శైవమే అనే భావం వ్యాపించి ఉంది.

పాండురంగ విభుని యందు విలువ గల శ్రీనాథుని సీసపద్యానుకరణములు కలవు. ఈ క్రింది పద్యం గుణనిధి ఉపాఖ్యానమందలి సీసపద్యాన్ని తలపిస్తున్నది.

"క్రీడించు నొకవేళఁదోడి బాలుర గూడియ క్షీణ గతి కుబేరాక్షకేళి
సవరించు నొకవేళ జల విహారము చాలఁ బ్రేమ భీమర ధీగ భీరవారి" (పాండు 4.124)

ఈ సీస పద్యమందలి క్రియా పదంతో కూడిన ఎత్తుగడలు శ్రీనాథుని సీసపద్యారంభములకు తగి ఉన్నాయి.

కాశీఖండము యొక్క ప్రభావం పాండురంగ మాహాత్మ్యం పై నున్నంత సాంద్రంగానే ఇతర ప్రబంధాల పైన లేదు. కథోపక్రమము మొదలు కాని పాత్రలు, సన్నివేశాలు, రచనా విధానం మొదలైన అన్ని అంశాలలోను పాండురంగ మాహాత్మ్యం కాశీఖండము నుండి ఊడిపడినట్లే ఉంటుంది.

పాండురంగ క్షేత్ర పుర వర్ణనతో మొదలు కావలసి ఉన్న యీ కావ్యం కాశీ క్షేత్ర పుర వర్ణనతో ప్రారంభమౌతుంది. పాఠకులకు కాశీలో ఉన్నట్లే అనిపిస్తుంది. రామకృష్ణ కవికి నైసర్గికమైన వక్రోక్తికి సంబంధించిన కొంత జిలుగుపని అట్లుండగా పాండురంగ మాహాత్మ్యము నందలి ప్రతి పద్యము మీద శ్రీనాథుని రచనా ముద్ర విస్పష్టముగా గోచరిస్తుంది.

"శీతాహార్య సుతాళినీ వికచరాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధ రత్న ఖని మోక్షాపాయ దుగ్ధాబ్ధివే
లాతీరావని డుంఠి నామక గజాలానంబు గంగామృత
స్రోతోని స్రుతి చంద్రగోళ మన మించున్ కాశి శ్రీరాశియై" (పాండురంగ॥ 1.99)

అనే పద్యంతో మొదలవుతున్న పాండురంగ మాహాత్మ్యంలోని కథా ప్రారంభంతో మధ్య వైష్ణవపు తెఱ తీసినట్లే యనిపిస్తుంది.

"ప్రాలే యాచల కన్యకావదన శుంభత్పద్మ సౌరభ్యమున్
గ్రోలంగల్గియుఁదృప్తి లేక ముని హృత్కోకాబ్జ సౌగంధ్యలీ
లాలిత్యము ఁగోరునొక్క సితరోలంబంబు నైజాకృతిన్
డాలొందించు బరాసులన్ భ్రమర కీటన్యాయరీతింబురిన్" (పాండురంగ॥ 1.100)

కాశీ క్షేత్ర వస్తు మహిమ అంతా సంక్షిప్తంగా శ్రీనాథుని మించిన సాహిత్య ప్రౌఢితో ఈ రెండవ పద్యమందు ప్రతిష్ఠింపబడి ఉంది.

"రేవాంతరంగ శ్రీకర
సేవాహేక పాకశిశిర మరుత్ ప్ర
స్రావ పరికంప్య మానజ
టావళి యగుచతడు వింధ్యమల్లన చేరెన్" (కాశీ 1.88)

"పంపాతరంగ రింఖణ
ఝంపా సంపాత్యమాన జలకణ రేఖా
సంపాత శీతలానిల
సంపద పొదలించె ఁబరమ శైవోత్తంసున్"

రామకృష్ణ కవి అగస్త్యు 'పరమ శైవోత్తం సున్' అనడంలో తాను వైష్ణవ స్వీకారం చేసి ఉన్నా శైవాభిమానం పోలేదనుట సూక్ష్మంగా వ్యంజితమౌతున్నది.

కాశీఖండ - పాండురంగ మాహాత్మ్యాలకు అనేక విషయాల్లో బింబ ప్రతిబింబ భావం ప్రత్యక్షంగా కనబడుతుంది. కాశీఖండం కుమారాగస్త్య సంవాద రూపమైంది. పాండురంగ క్షేత్ర మహిమ అగస్త్యుని వెంట బెట్టుకొని వచ్చిన కుమారస్వామికి శివుడు చెప్పినట్లు నిబంధింపబడింది. వారిరువురూ వింటుంటే నారదుడు వచ్చి తాను కూడా వింటాడు. ఇట్లా నారదుడు మధ్యలో వచ్చి వినడం విష్ణు భాగవతుడైన ఆ నారదుడు శివుని "వైష్ణవ సార్వభౌము"డనుట మొదలైనవన్నీ రామకృష్ణ కవి యొక్క మధ్య వైష్ణవాన్ని సమర్థిస్తున్నా

ఆతనికి గల శైవాభిమానాన్ని చెప్పక చెప్తూనే ఉంది. గుణనిధి పాత్ర ఆధారంగా నిగమ శర్మ పాత్ర మరింత విస్పష్ట రేఖలతో తీర్చబడి ఉంది.

## 12.2.6 కందుకూరి రుద్రయ:-

ఆర్వాచీన కవుల్లో శ్రీనాథుని కవితా ముద్రను ఆమేయంగా అందించిన కవి కందుకూరి రుద్రయ. శ్రీనాథుని పద గుంభనాన్ని, శయ్యా సౌభాగ్యాన్ని పొంకంగా అలవరచుకొన్నాడు. ప్రథమ పద్యమైన ప్రార్థన నుండి కావ్యాంత పద్యము వరకూ రుద్రయ కవిత శ్రీనాథుని కవితకు ధీటై నడిచింది.

నిరంకుశో పాఖ్యాన ప్రార్థన పద్యమందలి ఎత్తుగడ "శ్రీ భాషా రమణీ విమృష్ట పద రాజీవోత్తమాంగార్చ్యుడు" ఇది కవి సార్వభౌముని కావ్యారంభాన్ని తలపిస్తున్నది. ఒక పద్యంలో ఒక చరణ మందలి సమాసాలు మరొక చరణంలోకి చొరవ చేసికొని ప్రవేశిస్తుంది.

"భూషామౌక్తిక కాంత దేహ రుచితోఁబోరాటమాడన్ మరు
ద్యోషారత్నకిరీట ఝూట సుషమో యోయుజ్యమానుంఘ్రిని
శ్శేష శ్రీ విరిదమ్మిగద్దియ సమాశ్లేషింప గొల్వుండునా
భాషాదేవి ఁదలంచెదన్ రసలద్భాషా విశేషార్థినై'. (నిరం॥పాఖ్యా॥ 1.27)

శ్రీనాథుని వలె కందుకూరి రుద్రయకును శివానుభావము నందహ మహిమిక ఉంది. పరమేశ్వర వర్ణన యందు శ్రీనాథ రుద్రయలు ఒకే విశేషణంతో తనివి చెందుతారు.

"ప్రమథనాయకు నిష్ట సుఖ ప్రదాయకున్ సోమశరీరు -" <u>భక్తిస్రోత స్వినితో</u> అనే విశేషణాలు తరంగాల వలె వస్తుంటాయి.

## 12.2.7 ఆముక్తమాల్యద:-

శ్రీనాథుడు వాడిన పెక్కు నానాడులు, జాతీయాలు, పలుకుబడులు అముక్తమాల్యద నిండా సమృద్ధిగా ఉన్నాయి. పద్య రచనా శిల్పమందున్న ప్రౌఢి గుణాన్ని ఆముక్తమాల్యదాకారుడు పెంపొందించాడు.

"మోక్ష సంపదలు కాశీ క్షేత్రమున యందుఁ
ద్రవ్వితండంబులైనివ్వటిల్లు" (కాశీ 2.50)
"తమ తండ్రి శ్రీ శదత్తశ్రీలు గృహమున ద్రవ్వితండములయ్యె" (ఆముక్త॥ 5.38)
"కాంచెన్ గాంచన గర్భసంభవు ఁడగ్ర గ్రావకోటీ స్థల
చ్చంచ న్నిర్ఝర వేణి కా నివహ సంజాతాబ్ధి సాంగత్యమున్
బంచాస్య ప్రస్ఫుట కంఠనాద హత శుభత్కుంభి దర్పాంధ్యమున్
ప్రాంచద్ఘాటక భూమి భృచ్ఛిఖర గర్వావంధ్యము న్వింధ్యమున్" (కాశీ 1.87)
"కాంచెన్ వైష్ణవు ఁడర్ధ యోజన జటాఘూటోత్థ శాఖోపశా
ఖాంచజ్ఝాట చరన్మరుద్రయ దవీయ ప్రేషితో ద్యచ్ఛదో
దంచల్కోట కృత వ్రణ చ్ఛలన లిప్యాపాదితాధ్వన్యని
స్సంచారాత్త మహా ఫలోపమ ఫలస్ఫాయ ద్వటక్ష్మాజమున్" (ఆముక్త 6.5)

శ్రీనాథునిచే ఉపయోగింపబడిన పదాలను అనుయాయి కవులు మహా ప్రసాదంగా అనుసరించారు.

ఓరంత - (ఒర + అంత) = అహోరాత్రమంత

"అశన మబ్బక యున్ననైనను శివరాత్రి యోరంత ప్రొద్దు" (కాశీ 4.133)

హోర - అను సంస్కృత పదానికి 'ఒర' అనేది వికృతి. దీనికి అనియత పరిమాణార్థకమగు 'అంత' శబ్దాన్ని చేర్చి విశేషణంగా వాడటం శ్రీనాథుని చేకూర్పబడ్డ ప్రక్రియ. దీనిని తరువాతి కవులనుసరించారు.

పెద్దన శ్రీనాథ కవి నుండి ప్రబంధ లక్షణాలను గైకొని అనుయాయి కవులకు మార్గదర్శకుడయ్యాడు.

కాశీఖండములో మణికర్ణికా ఘట్టంలో శ్రీనాథ కవి రచించిన 'రగడ' అనుయాయి ప్రబంధ కారులకందరికీ ఆదర్శమైంది.

పాండురంగ మాహాత్మ్యము నందు

"తెల్లు శోభిల్లె మంకెనయిల్ల సిల్లె'. (పాండు॥ 4.37)

"తెల్లుల్ల సిల్లె కాకరగా చెదోసదో రగిలంబారె" (కాశీ)

ధళుధళుక్కున నింగి దాటించె (పాండు॥ 4.21)

ధళుధళుక్కున నింగి దాటించి (కాశీ)

కవిసార్వభౌముని భావాలను సైతం అలంకార యుక్తంగా ప్రబంధ కవులు అనుకరించిన జాడలు కలవు.

"కాయజ విక్రియంబడయఁగాని కులంబున సంభవించియు
న్యాయముసేయునే యిటు దురాత్ముఁడు వీడు త్రపాభిమానముల్
మాయగదట్టి యందు నతి మాత్రములజ్జితుఁడైన కైవడిం
దోయజ షండ బాంధవుఁడ ధోముఖుడయ్యెన భోంగణమ్ముననన్" (శివ॥రా॥ 3.27)

దీన్నే పెద్దన అనుకరిస్తూ పాత్రానుగుణమైన ప్రకృత్యున్మీలనాన్ని కావించాడు. పాత్రల మంచి చెడ్డలతో బాగోగులతో సంబంధమున్నట్లు చెప్పటం కవి చమత్కారం. దీన్నే ఆంగ్లంలో 'Pathetic Fallacy' అంటారు. మనుచరిత్రలో ప్రవర తిరస్కృతయైన వరూధినిని పురస్కరించుకొని కవి

"తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖ వ్యథా
భర విభవాంగి నంగభవు బారికి నగ్గము చేసి క్రూరుడై
యరిగె మహీ సురాధముడహం కృతితో ననిరోష భీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణిఁదాల్చె కషాయదీధితిన్" (మను॥ 1)

సంధ్యా సమయమందలి ఆదిత్యుని పాత్రానుబద్ధ భావోదయునిగా చిత్రించారు.

కాళహస్తి మాహాత్మ్యాన్ని రచించిన ధూర్జటి కవి శ్రీనాథుని శివభక్తికి వారసుడని చెప్పదగును. శ్రీనాథకవి భీమ ఖండమందలి చంద్రోదయ వర్ణనమున ఈ దిగువ సీసపద్యాన్ని వ్రాశాడు.

"కాదుకాదు దయాద్రి కనక కూటంబిది
డాగైన పానవట్టంబుగాని
కాదుకాదిది సుధాకర పూర్ణ బింబంబు
కాశ్మీర శంభులింగంబు గాని
కాదుకాదు దయరాగ ప్రకాశంబిది
నవకుకుమాలే పనంబుగాని" (భీమ॥ 2.42)

ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యంలో

"ఉదయ గ్రావము పానవట్ట, మభిషేకోద ప్రవాహంబు వా
ర్ధి ధరాధ్వాంతము, ధూపధూమము జ్వలద్దీప ప్రభారాజికౌ
ముది, తారా నివహంబులర్పిత సుమంబుల్ గాఁదమోదూరసౌ
ఖ్యదమై, శీతగభస్తి బింబ శివలింగం బొప్పె ప్రాబీదిశన్" (కాశీ 2.132)

కవితా సరణి యందును ధూర్జటి శ్రీనాథుననూనంగా అనుకరించాడు.

## 12.2.8 ఇక పలుకుబడుల్లో అనుకరణ:-

1. ఆయుర్వేద మోరంత ప్రొద్దుల జెప్పన్ (మను॥ 5.7)

ఓరంత ప్రొద్దు .................................... (ప్రభులింగలీల) రెండవ ప్రకరణము.

2. ఇట్లే 'ఓరాత్రి' అను పదం కూడా శ్రీనాథునిచే సృజింపబడింది.

3. గొడ్డేరు → గొడ్డు + ఏరు 'గుత్తకు తీసుకొను' అను అర్థాన్ని నిఘంటుకారువిచ్చారు. హర విలాసమందలి 'నీపడ్డ పాటు గొడ్డేటు గా జిడ్డుపఱపం గలవారమె' 'వ్యర్థము' అని అర్థము. పిడుపర్తి సోమనారాధ్యుడు ప్రభు లింగలీల 13 వ ప్రకరణంలో ఈ పదాన్ని ఉపయోగించాడు.

4. 'గ్రుక్కిళ్ మ్రింగుచు' - గ్రుక్కిళులు - గ్రుక్కిళ్లు - అను రెండు రూపాలు బహువచనంలో ఏర్పడతాయి. వీనికి మారుగా 'గ్రుక్కిళ్' అనుపదాన్ని వాడటం శ్రీనాథుని పద ప్రయోగ వైచిత్రి (ఇది ఏకవచనము, బహువచనము కాక ఉన్నది).

గ్రుక్కిళ్మింగుచునుండె నండనెవ సుక్షోణీ ధవత్రస్తమై (వసు॥ 2.155)

....................... నిశాత బాణములను జోదెసె భేతాళముల్ గ్రుక్కిళ్ళింగంగ (కాశీ 2.51)

5. అట్లే శ్రీనాథుడు ప్రయోగించిన పలుకుబడియైన 'మిన్నులు వడ్డచోటు' అను ప్రయోగాన్ని 'అకట! మిన్నులు వడ్డచో ననదవోలె' (కాశీ 3.124)

'గ్రక్కున మిన్నులు వడ్డకైవడిన్' (వసు॥ 2.148)

మనుచరిత్ర కారుడు శ్రీనాథుని అనుకరించిన సన్నివేశాలు చాలా కలవు.

6. "ఘనమైన రారాపు చనుదోయి రాయిడి నిఱుపేద నడిమికి వెఱపు చూప'' (కాశీ॥ 1.90) (నారదుని శిష్యురాలి వర్ణనము)

"ఘనమైన రారాపు చనుదోయి రాయిడి, దుంబీ ఫలంబు తుందుకు చెంద (మను॥ 1.5) సరస్వతీ వర్ణనము.

7. అట్లే (1) కాశీ 5.167 - మనుచరిత్ర 2.70

(2) శివరాత్రి 2.101 - మనుచరిత్ర 2.73

(3) శివరాత్రి 3.91 - మనుచరిత్ర 3.10

(4) శృంగార నైషధం 7.63, భీమఖండము 1- మనుచరిత్ర 4.73

ఇవన్నీ శ్రీనాథుణ్ని పెద్దన్న అనుకరించిన పద్యాలకు ఉదాహరణలు.

8. భీమ ఖండములోని (2.35) అంధకార వర్ణనము - మను చరిత్రలోని సంధ్యారాగ వర్ణనానికి బింబ ప్రతిబింబాలే.

9. పెద్దన శ్రీనాథుని అనుకరించటంలోని అనురక్తిచే '<u>గ్రహయాళు</u>' పదమందలి వ్యాకరణ దోషాన్ని సైతం లెక్కించక పెద్దన అటులనే ఉపయోగించాడు.

ఉదా- చకితైణాహుతి దావ .............. అద్రి <u>గ్రహయాళు</u> భల్లుకము (మను 4.33)

*వేమూరుంగలశీతనూ భవ వధూవేణీ భరాంతః* ప్రసూనామోద <u>గ్రహయాళువుల్</u> (భీమ 1)

10. *శ్రీనాథుడు ప్రయోగించిన "ప్రాతః కాలము వాయ సంబు* <u>పణి నాపత్యోక్త</u> శాస్త్రంబులో'' దానిననుసరించి పెద్దనయు <u>పణిన, సూను</u> కణాద బాదరాయణ సూత్ర భంగి విద్వాంసు లుపన్యసింప' అని '<u>పణినసూను</u>' శబ్దాన్ని పాణిని పరంగా ప్రయోగించి ఉన్నారు. పెద్దన '<u>ఫాణిని</u>' - <u>పణిన సూనుడ</u>ని వ్యవహరించుట ప్రామాదికము.

## 12.2.9 పింగళి సూరన:-

పెద్దనాదుల వలె పింగళి సూరన కూడ శ్రీనాథుని రీత్యనుసరణం ప్రస్ఫుటంగా గోచరింపకపోయినప్పటికిని శుచిముఖి పాత్ర చిత్రణానికి భావాలకు సంబంధించినంతవరకు శ్రీనాథుని ప్రభావం ఈతని యందును సూక్ష్మ పరిశీలనానికి గోచరించక మానదు.

"గుణాద్భుతంబైన పదార్థంబు వర్ణింపకునికి యసహ్యాశల్యం బైన వాగ్జన్మ వైఫల్యంబు'' (శృ॥నై॥ 4.12)

దీనికి

"అటుగాకద్భుత రామణీయక గుణాఢ్యంబైన సద్వ స్తువున్
బటువాచారసికుల్ ప్రసంగమయినన్ బారంబుముట్టన్ రసో
త్కటతం జెప్పక మానజాల రను పక్షం బొండు భావించినన్
ఘటియిల్లున్ వనితాంగ వర్ణనకు నిక్కంబన్యధాసిద్ధియున్'. (ప్రభావతీ ప్రద్యుమ్నము 3.7)

అని అనుకరణము.

## 12.2.10 పిల్లలమఱ్ఱి పినవీరన:-

శ్రీనాథునకు తర్వాత వచ్చిన ప్రబంధ కవులయందే గాక ఇంచు మించుగా సమకాలికులైన పిల్లల మఱ్ఱి పినవీరన మొదలైన వారి యందు కూడా శ్రీనాథుని కవితా ప్రభావం సమృద్ధిగా కన్పిస్తుంది.

"చరిమ రింఖా పుటాంచల టంక శిఖరంబు
ఉదయాద్రి చటిజాఱ కుండమోపి" (కాశీ 1.126)

దీనికి

"తురగ రింఖా ముఖోద్ధూత ధూళిపాళి
నభ్ర గంగానది నడచురేగ" (శృంగార శాకుంతలము 3.116)

అనేది అనుకరణ.

"కటి భాగమున గంధకరటిరాట్చర్మంబు
కపటంపు ఁజిమ్మ చీఁకట్లు నీన"
"జూట కూటము నందు సొబగులేఁజందురుఁ
డకఠోరసార చంద్రికలు కాయఁ" (కాశీ 5.101)

దీనికి పిల్లల మఱ్ఱి పినవీరన

"కర్పూర నవపరాగ విపాండు తనుకాంతి
యకఠోర చారు చంద్రికలు గాయ
వికటారకూట వల్లి కఠోరమగు పెద్ద
మకుటంబు లేయెండ చిగురు లీన" (శృంగార శాకుంతలం 4.137)

ప్రకృతి రూపిణియైన పాఁడపూఁబోఁడిక మహాదాది వికృతులు మలకలేడు మొగము వచ్చి సుషన్ను మూల రంధ్రముఁగప్పి వంశాస్థి సంబంధంవలన వీల నదిమీఁదు ప్రాఁకి మధ్యరు నాడితో ఁగూడి ద్రుహిణ రంధ్రముఁగప్పుదోఁక చివరఁజక్క చాయఁ జరింపసమకూరకుండుట నిడ బింగళను గాలి మెక్క డిగ్గు

గెలనివాఁకిళ్లు రెండు వేగిరము మూసి
నడిమి వాఁకిలి దెఱవ నెన్నండు నేర్చు
సాధకుడు నాఁడు గాని వశ్యంబు గాదు
పవన విజయంబు వానికి ఁబద్మనయమ (కాశీ ఖండం 2.121)
లీలన్ మధ్యమ నాడినా జమిలి గాలిన్ జాన్పులావెక్కియు
త్కీలంబై మెగఁబ్రాఁకి చిద్గగిన వీధింజెంది యందున్న యా
ప్రాలేయద్యుతి మండలంబు గరగింపం దత్సుధాసారముల్
మూలం గూర్కెడు పాపకన్నెదెలుపన్ మూర్ధాభిషేకంబునన్ (శృంగార శాకుంతలం 2.114)

## 12.2.11 ఉపసంహారము:-

శ్రీనాథుని కవిత యందలి అనుషంగిక సౌందర్యానికి ఆలంబనమైన వక్రోక్తిని సమగ్రంగా అనుసరించిన కవులు సకృత్తుగా ఉన్నారు. అది విసర్గ, సంయుక్తాక్షర, రేఫ, ద్విత్వాక్షరాల సమ్మేళనంచే మహోదారమైన అనుభూతి ముద్రను ప్రసాదిస్తున్నది. కవి సార్వభౌముని కవిత, పిల్లలమర్రి పినవీరన "శ్రీనాథభట్టు భాషా నిగుంభముల" నుబకింత సఫలీకృతుడయ్యాడు. దాదాపు సమకాలికులైన పోతన పోకయు శ్రీనాథుని మార్గమును భిన్నములైనవి. ప్రబంధ కవుల్లో అయ్యల రాజు రామభద్రుడు శ్రీనాథకవి ధారావేగాన్ని పదజటిలతను సంతరించుకొన్నారు. పాండురంగ విభుని వర్ణ విన్యాస వక్రత, మారుమూల పదాలను, వ్యాకరణ విశిష్టములైన పదాలను ఉపయోగించాలనే కుతూహలం తెలుగు పదాలకు చైతన్యాన్ని పోయటం మొదలైన గుణాలు శ్రీనాథుని కవితా ప్రభావానికి నిదర్శనములై ఉన్నాయి.

## 12.2.12 ప్రశ్నలు:-

1. ఆర్వాచీన కవుల పై శ్రీనాథుని ప్రభావమెట్టిదో వివరింపుము.

## 12.2.13 ఆధార గ్రంథాలు:-

1. శ్రీనాథ మహాకవి కావ్య కళ - డా॥ కూచిభాట్ల హరి

- ఆచార్య నేతి అనంత రామ శాస్త్రి

**పాఠం - 13.1**

# శ్రీనాథుని శైలి - సంస్కృత ప్రౌఢి

**ముఖ్యాంశాలు:-**

13.1.0 లక్ష్యం
13.1.1 ఉపోద్ఘాతము
13.1.2 శ్రీనాథుడనుసరించిన శైలీ పద్ధతులు
13.1.3 శ్రీనాథుడనుసరించిన సీసపద్య రచనాశైలి
13.1.4 ప్రశ్నలు
13.1.5 ఆధార గ్రంథాలు

## 13.1.0 లక్ష్యం:-

శైలి ఆంగ్లభాషలోని style అను దానికి పర్యాయపదంగా కల్పించుకొన్నదేకాని సంస్కృతాంధ్ర భాషల్లో అలంకారికులు కాని, కవులుగాని ఎవ్వరును దీనిని వాడలేదు. తెలుగులో మొదటి నుండీ అక్షరరమ్యత సాధించిన కవులు కొందరు, అర్థగౌరవాన్ని పాటించిన కవులు కొందరు రెండు భిన్న శాఖలున్నాయి. మొదటివారాసించింది శయ్యా సౌభాగ్యము. దానికి నన్నయ భట్టు ఆది గురువు. దాన్ని నాచనసోముడు కొంత పరిపోషించాడు. శ్రీనాథుని చేతిలో అది పరిణతి చెందింది. శ్రీనాథుని కావ్యాల ద్వారా అతని ప్రత్యేక శైలీ విధానమెట్లు పుష్టి చెందిందో పరిశీలించడమే ఈ వ్యాస లక్ష్యం.

## 13.1.1 ఉపోద్ఘాతము:-

శైలి కవి వ్యాపారం. ఈ శైలి సమకూర్చుపాటవం కవి ప్రతిభావ్యుత్పత్తులననుసరించి ఉంటుంది. సంస్కృతంలో నిరుమానశయ్యా వైచిత్రికి పేరుపడ్డ భట్ట బాణాదులను భక్తితో కొలుచుటయు, అనుకరించుటయు, ఆత్మ ధర్మాలుగా వర్తించిన శ్రీనాథుడు తెలుగులో నూత్న శైలీ విన్యాసాన్ని సంతరించాడనటంలో వింతకాదు. అంతేకాక తర్వాత రాబోవు ప్రబంధరీతికి శ్రీనాథుడే సూత్రధారుడు. సంస్కృత ఆలంకారికులలో వక్రోక్తి సంప్రదాయంలో మెలగిన కుంతకుడు (క్రీ॥శ॥ 11 శతాబ్ది మధ్య భాగము) వెల్లడించిన శైలీ విధానాన్ని శ్రీనాథుడు స్వీకరించాడు. అయితే కుంతకుడు సూచించిన శైలీ విధానమేమిటో ముందుగా తెలుసుకుందాం.

1. శబ్ద చమత్కారం, 2. అలంకార సహితము, 3. ఉక్తి వైచిత్యము, 4. వ్యంగ్యార్థ చమత్కారం, 5. వక్రోక్తి విన్యాసం.

సంస్కృత కవులైన భట్టబాణ, భవభూతి, రాజశేఖర కవులు ఈ శైలీ విధానాన్నే అనుసరించారు. ఈ విచిత్ర మార్గానికి వక్రోక్తియే ముఖ్య లక్షణం. కాబట్టి శ్రీనాథుడు కూడ ఇట్టి శైలీ విధానాన్నే అనుసరించాడనటానికి నిదర్శనాలున్నాయి.

## 13.1.2 శ్రీనాథుడనుసరిస్తున్న శైలీ పద్ధతులు :-

1. శ్రీనాథుని శైలి అనటానికి భీమేశ్వర పురాణంలో ఈ క్రింది పద్యమే ప్రబల నిదర్శనము.

"హర చూడా హరిణాంక వక్రతయు (గా లాంత స్ఫుర చ్చండికా
పరుషోద్గాఢ పయోధరస్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యము ల్దిక్కులం
జిరకాలంబు నటించు చుండుఁగవి రాజీ గేహరంగంబులన్" (భీమ 1.11)

పరమశివుని శిరసు పై గల చంద్రరేఖ వలె వక్రతము, ప్రళయకాల మందలి చండికాదేవి యొక్క విస్తారములై కఠినములై చోలువొందు స్తనములు కాఠిన్యమును, సరసత్వమును కల్గిన మంచి కావ్యాలు సమస్తమైన దిక్కులయందును, కవి సమూహముల గృహ రంగములందును చిరకాలము ప్రకాశించుచుండునని ఈ పద్య భావము. కాని ఇందులో శ్రీనాథుడు మూడు విశేషణములను చెప్పినాడు. 1. వక్రత, 2. కాఠిన్యము, 3. సరసత్వము.

1. వక్రత అంటే వక్రోక్తి. కుంతకుడు ఈ వక్రతను వర్ణ విన్యాస వక్రత, పద పూర్వార్థ వక్రత, ప్రత్యయ వక్రత, వాక్య వక్రత, ప్రకరణ వక్రత, ప్రబంధ వక్రత అని ఆరు విభాగాలుగా విభజించి సమన్వయించాడు.
2. కాఠిన్యము అంటే ఓజః ప్రసాదముల సమ్మిశ్రణచే కల్గుమార్దవ పూర్వక పౌరుష్యము. కొంచెము ప్రౌడార్థ సందర్భము గల భారతీ వృత్తి తోడి రచనము.
3. సరసత్వము అంటే ఆయా సన్నివేశాల చారుతతో దీపించు రసపోషణము వక్రోక్తి చమత్కారము. కాఠిన్యయుక్త పద సంయోజనము జతకూడి తన రచనకు సరస్వత్వాన్ని ఆపాదించునని శ్రీనాథుడు తన శైలీ విన్యాసాన్ని పై పద్యం ద్వారా తెల్పియున్నాడు. అంతేగాక ఈ మూడును సత్కావ్యానికి లక్షణాలని కూడా శ్రీనాథుడు భావించాడు.

2. శ్రీనాథుని కవిత్వంలో వక్రోక్తి, ప్రౌడోక్తి, సరసోక్తి అనే మూడు గుణాలు విచిత్రమార్గంలో ఉన్నాయి. కాశీఖండములో శ్రీనాథుని కవితా ప్రసక్తిని వర్ణిస్తూ ఈ క్రింది పద్యంలో ఈ లక్షణాలు పేర్కొనబడ్డవి.

"వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండ లీల నొక్కొక్క మాటు
భాషింతు నన్నయ భట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్క యజ్వ ప్రకారము రసా
భ్యాచిత బంధము గనొక్కక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని లేవ
సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు (కాశీ పీఠిక 13)

ఇందు ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యాచిత బంధము, సూక్తి వైచిత్రి అను లక్షణములు తెలుపబడ్డవి.

శ్రీనాథుడు బ్రాహ్మీ దత్త వర ప్రసాదుడు. సకలవిద్యానాథుడు. దగ్గుపల్లి దుగ్గన నాసికేతోపాఖ్యానంలో శ్రీనాథుని పాండిత్య ప్రభావాన్ని ఈ విధంగా ప్రశంసించాడు.

"సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య
భాషా పరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమ భాషిత మహా
భాష్య విద్యా సమభ్యాస బలము

అక్షపాద కణాద పక్షిలో దీరిత
న్యాయ కళా కౌశలాతిశయము
శ్రాతి పురాణాగమ స్మృతి సాంఖ్య సిద్ధాంత
కబళన వ్యుత్పత్తి గౌరవంబు
పూర్వకవి ముఖ్య విరచితా పూర్వకావ్య
భావ రస సుధా చర్వణ ప్రౌఢతయును
గందళింపంగఁగాశికా ఖండ నైష
ధ ప్రముఖ వివిధ ప్రబంధములొనర్చి" (నాసి 1.18)

దీనిని బట్టి శ్రీనాథుడు సంస్కృత సేన్యాది భాషా పరిజ్ఞాన పాటవము గల మేటి విద్వాంసుడనియు, వ్యాకరణ న్యాయ మీమాంసాది శాస్త్రముల యందు పాండిత్యాన్ని గడించిన ప్రజ్ఞాధురంధరుడనియు, శ్రుతి స్మృతి పురాణా గమ విజ్ఞాన సంపన్నుడనియు, పూర్వ కవుల అపూర్వ కావ్య కళారీతులను పెక్కింటిని పుక్కిటబట్టిన సుధీమణి అనియు వ్యక్తమౌతున్నది. ఇంతటి పాండిత్య ప్రాభవాలు కల్గిన శ్రీనాథుని రచనల్లో చోటు చేసుకున్న శైలీ పద్ధతులను పరిశీలిద్దాం.

3. శ్రీనాథుడు ఉద్దేశించిన కాఠిన్యము సంస్కృత గాఢ సమాస బంధురమైన కవితా ప్రాగల్భ్యమే. శ్రీనాథుని శబ్దార్థ చమత్కారానికి ఈ క్రింది పద్యము నిదర్శనము. ఇందు శ్రీనాథుని సంస్కృత ప్రౌఢిమను గుర్తించవచ్చు.

"ఆడెందాండవ మార్భటీ పటహ లీలాటోప నిస్ఫూర్జిత
క్రీడాడంబర ముల్లసిల్ల గరళ గ్రీవుండు జూటాటవీ
క్రోఢా <u>ఘూట కరోటి కోటర కుటీ</u> కోటీలుఠచ్ఛిందు వీ
చీదోలాపట లీ పరిస్ఫుట తరస్ఫీత ధ్వని ప్రౌఢిమన్" (భీమ 4.148)

శివుడు మహా తాండవం చేస్తున్నాడు. శిరస్సు పై జటాజూటమను అడవిలోనున్న గంగ ఆ తాండవ వేగానికి అటు నిటు కొట్టుకొంటున్నది. శివుని మెడలో నున్న కపాల మాలికలు కదుల్తూ ధ్వనిస్తున్నాయి. ఆ గంగా జలము ఎగిరి ఆ కపాలములలో పడి ధ్వనిస్తున్నాయి. ప్రమధులు బిగ్గరగ వాయించే తప్పెటలు సైతము పై మ్రోతలతో కలిసి విశేషనూత్న ధ్వనిని కలిగిస్తున్నాయి.

ఈ పద్యంలో '<u>ఘూట కరోటి కోటరకుటీ</u>' అను సమాసం శ్రీనాథునకు ఆశ్రయమిచ్చిన పెదకోమటి వేమారెడ్డి రచించిన 'సాహిత్య చింతామణి' లోని ఈ శ్లోకమునందుండుట గమనార్హము.

"ఆటోపాయనటన్మ హానట జటా సంఘాట శృంగాటక
<u>క్రీడాఘూట కరోటి కోటరకుటీ</u> వాచాట వీచీ ఘటా
అస్తుస్వ స్తటినీ విశంకితటతీ వాటీక వాటీ భవ
ల్లాటీ కోటి లలాట పాటల సటాపాటల్య పాటచ్చరీ"

ఇది గంగా స్తుతి. ఇందు పూర్వార్థమున శివతాండవ ప్రసక్తి కలదు. గంగానది, ఆటోపంతో నటిస్తున్న మహానటుని జటల సమూహము అను చతుష్పథము యొక్క తలమున ప్రతిబంధకమైన కపాలము యొక్క కోటరము అనెడి కుటీరము నందు మ్రోగుచున్న కెరటముల సముదాయము కలదని ఈ శ్లోక తాత్పర్యము.

4. కుంతకుడు పేర్కొనిన వర్ణ విన్యాసాది షడ్విధవక్రోక్తులు శ్రీనాథుని శైలి యందున్నాయి. వర్ణ వినాస వక్రతకా ఈ క్రింది పద్యముదాహరణము.

"దేవబ్రాహ్మణ భక్తి వర్ధిత ధరిత్రీ చక్ర సామ్రాజ్య ల
క్ష్మీ వాస్తోష్పతి సంస్తుతింపఁగదగుటన్ శ్రీ వేమ పృథ్వీశ్వరాన్
లావణ్యా పరిమత్స్య లాంఛనుని నాలంకా పురీ శంకర
గ్రావాభ్యంతరకూల ముద్వహ యశః కల్లోలినీ వల్లభున్" (భీమ 1.39)

(చుట్టపట్లగల రాజ్యాలను గెలిచి ఆయా రాజ్యముల రాజులను సామంతులుగా జేసికొనిన వేమారెడ్డి కీర్తి దక్షిణమున లంక నుండి ఉత్తరమున గల కైలాస పర్వతం వరకు గల సర్వ భారతదేశము నందును కులముద్వహ కల్లోవినిగా వ్యాపించింది. ఇందు అతిశయోక్తి అలంకారం కలదు)

ఇందు రేఫ యుక్తమగు వ్యంజనముల కూర్పు, ద్విత్వములైన లకార పద ప్రయోగములు ఈ పద్యమునందు చక్కగా కూర్పబడింది.

5. శ్రీనాథుని పద్యం చెవిని సోకగానే మనసును పులకరింపచేసి, ముఖాన్ని వికసింప చేస్తుంది. అది ఆతని శయ్యా సౌభాగ్యము. అనర్గళ ధారతో ఉదాత్త గమనంతో రొమ్ము విరచుకొని నడచు ఆ పోకడ అన్యులకు అసాధ్యం. ఆ పద్ధతి శ్రీనాథుని కావ్యాల నిండా మదించిన ఏనుగులాగా రాజవీధీ విహారం చేస్తుంది. ఉదాహరణకు

"కాంచెన్ గాంచన గర్భసంభవుఁడు దగ్రగ్రావ కోటీస్థల
చ్ఛంచన్నిర్ఝర వేణికా నివహ సంజాతాబ్ధి సాంగత్యమున్
బంచాస్య స్ఫుటకంఠ నాదహత శుంభ త్కుంభి దర్పాంధ్యమునన్
ప్రాంచద్ధాటక భూమి భృచ్ఛిఖర గర్వావంధ్యమువ్వింధ్యమున్" (కాశీ 1.87)

**ఇట్లే తెలుగు నడక తీరును గమనిస్తే:**

"కటకట! కాశికాపురినొకానొక నిద్దురఁగన్ను మోడ్చి య
ప్పటఁగను విచ్చునప్పుకుడి భాగమునఁగన్గొని చోద్యమందుదా
పటిదెసఁజూచి యచ్చెరువు పాటు వహించు మనస్సరో జసం
పుటమున నాడు లాఁగు మగ పోడిమి యుంగ లజంతు సతతుల్" (కాశీ 3.100)

పై పద్యాల ద్వారా శ్రీనాథుడు తెలుగు కవిత్వము యొక్క భవితవ్యాన్నే మార్చివేశాడు. తెనగు భాష తన వ్యక్తిత్వాన్ని నష్టపోకుండా ఎంత వరకు సంస్కృతాన్ని తనలో అంతర్భూతం చేసికోగలదో తన అపూర్వ శైలీ నిర్మాణ రూపమైన ప్రయోగాల ద్వారా శ్రీనాథుడు నిరూపించాడు.

6. శ్రీనాథునికి పూర్వం తెలుగులో అక్షర రమ్యత సాధించిన కవి వర్గమొకటి, అర్థగౌరవాన్ని పాటించిన కవి వర్గమొకటి వెలసి ఉన్నది. మొదటి వర్గానికి నన్నయ, రెండవ వర్గానికి తిక్కన ఆది గురువులు. మొదటి వర్గం వారాసించింది శయ్యా సౌభాగ్యము. నన్నయ సంకల్పించిన దానిని నాచన సోమనాథుడు కొనసాగించిన ఈ శయ్యా సౌభాగ్యం శ్రీనాథునిలో పరిణత చెందింది. పురాణ కవులకు ప్రబంధ కవులకు భేదము ఈ శైలి యందే కలదు. సంస్కృతంలో నిరుపమాన శయ్యా వైచిత్రికి పేరుబడ్డ భట్ట బాణాదులను శ్రీనాథుడు భక్తితో స్మరించి అనుకరించాడు. ఎఱ్ఱన ప్రబంధ కవుల కొసగిన భిక్ష వర్ణనాత్మకమగు శైలి మాత్రమే. ఆలంకారికమైన ప్రబంధరీతికి శ్రీనాథుడే సూత్రధారుడు. ప్రబంధ కవులు

శయ్యా సంపాదనార్థము శబ్దాన్ని ఆశ్రయించారు. శ్రీనాథుడు ప్రబంధ కర్తలకు మార్గదర్శకుడైనప్పటికీ శబ్దార్థాలను రెంటిని ఆరాధించాడు. శ్రీనాథుని శయ్యలో జిగి, బిగి రెండునూ కలవు. శ్రీనాథుని మక్కు మిక్కిలి భావభరితము.

7. శ్రీనాథుడు వాడిన శబ్దాలంకార ప్రయోగాలు కూడా అతని ప్రతిభను తెలియజేస్తాయి. సీసపద్యంలో ప్రతిపదము కూడ 'భ' అను అక్షరంతో ప్రారంభించి పద్యాన్ని చివరివరకు ఎంతో శ్రవణపేయంగా నడిపించిన తీరు హృద్యంగా ఉంది. ఉదాహరణకు

"భవు, భవానీ భర్త, భావ సంభవ వైరి
భవరోగ భంజను భాలనయను,
భోగ ప్రదుని, భోగి, భోగ రాజ విభూష
భూన భోౕ భి వ్యాప్తు, భువన వంద్యు
భగవంతు, భర్గుని, భసితాంగ రాగుని,
భానుకోటి ప్రభాభాసమాను.
భగీరథీమౌళి, భగదృగ్వి పాటను
భూరథాంగుని భద్ర భూతిధరుని
భూమినీ సువిశాలార్ధ వామభాగు,
భక్తితోడ భజింపరో భవ్యమతులు
భావనాభుజులకతండు ఫలములొసఁగు
భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవములు" (భీమ 3.83)

ఇందు భకారాది పదాలను కవి ఉపయోగించాడు. సమగ్రమగు ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, శ్రీజ్ఞానము, వైరాగ్యము అను ఆరును భగ సంజ్ఞితములు. అవి గలవాడు భగవంతుడు.

"భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవములు" అన్న తేటగీతి పాదము యథాతథంగా శృంగార నైషధము నందు (8.203), హర విలాసము నందు (1.3), కాశీ ఖండమున (3.187) కన్పడుచున్నది. ద్వాదశాదిత్యులలో భగుడొకడు.

8. శ్రీనాథుడు ఒక్కొక్కప్పుడు మృదు మధుర పదసమ్మేళనము వలననే సరసత్వము వచ్చేటట్లు రచిస్తాడు. ఉదాహరణకు

చంద్ర బింబానన చంద్ర రేఖా మౌళి
నీలకుంతల భారనీలగళుడు
ధవళాయ తేక్షణ ధవళాభిలాంగుండు
మదన సంజీవని మదన హరుడు
నాగేంద్ర నిభయాన నాగ కుండల ధారి
భువన మోహన గాత్ర భువన కర్త
గిరిరాజ కన్యక గిరిరాజ నిలయుండు
సర్వాంగ సుందరి సర్వగురుఁడు
గౌరి శ్రీ విశ్వనాథుండు కనకరత్న

పాదుకలు మెట్టిచట్టలు పట్టికొనుచు
నేఁగుదెంచిరి యొయ్యార మెసకమెసఁగ
విహరణ క్రీడ మాయున్న వేదికపుడు (భీమ 2.148)

ఈ పద్యంలో శబ్ద సారూప్యం వల్ల పార్వతీ పరమేశ్వరులకు సమానత్వాన్ని సూచింపబడింది. ఇక్కడ శ్రీనాథుడు పార్వతీ పరమేశ్వరులకు ఎనిమిది విశేషాలను ఉపయోగింపగా సంస్కృత భీమ ఖండంలో (7.2 నుండి 11) ఇరువది విశేషములు ఉపయోగింపబడ్డవి. ఇందు అర్థ భేదము కల ఒకే మాటలను శివపార్వతులకు విశేషణములుగా కూర్చి అనిర్వచనీయమగు సరసత్వాన్ని వెల్లివిరియ చేసినాడు.

9. శ్రీనాథుని శబ్దాలంకార ప్రియత్వం పరిమితమైంది. శబ్దార్థాలు పరస్పర సంబంధం కలవి. శబ్దము స్థూలము. శబ్దాంతర్నిహితమైన అర్థము సూక్ష్మము. అర్థ గోచరమైన భావము సున్నితము. భావాంతర్గతమైన రసము సుకుమారము. వీని అన్నింటిని బాహిరమైన స్వరూపము శబ్దము. మనస్వియైన కవి అర్థానికి ప్రాధాన్యమిస్తాడు. హృదయ ధర్మముగా మిగుల కల కవి శబ్దాయమానమైన కవితా గుణము కలిగి ఉంటాడు. మనో హృదయ ధర్మాల పాళ్ళను అనుసరించి శబ్దార్థములు మేలవించబడును.

ఉదా:

జంభారా తీవ । శోభా చక చక । నిభముల్, శాంభవీయాట్టహాసా
రంభావష్టంభ । రేఖా రభట । లటహముల్ । రాజరాజాద్రి తేజ
స్సంభార । భ్రాంతిదంబుల్; సకల భావన । వీక్షా కరంభంబు । లయ్యున్
జృంభించున్ । వీర భద్రక్షితిరమణ । యశశ్శ్రీరమా విభ్రమంబుల్ (కాశీ. పీఠిక 46)

ఈ పద్యంలో ఉపమా భ్రాతిమదాదులైన అర్థాలంకారాలతో కూడిన శబ్ద శక్తి విజృంభించి ఉన్నది. వీరభద్ర విభుని కీర్తి విభ్రమాన్ని ప్రదర్శించటానికై శ్రీనాథకవి శాబ్దికమైన ఆటోపాన్ని జోడించాడు. 'ంభ' యొక్క అనుప్రాసము, రేఫ, వర్గయుక్ సంయుక్తాక్షరాల సంయోజన చేత వర్ణ విన్యాస వక్రతను ఆరాధించి పద్యాన్ని హృద్యతరం చేశాడు. ఈ యర్థమే నిశ్శబ్దంగా అర్థ సుందరంగా చెప్పినప్పటికీ వీరభద్ర కీర్తి మూర్తి అంత శోభాయమానంగా ఉండదు. అందుకే శబ్దార్థాలకు గల ఆనుషంగిక సంబంధ మిట్టిదిగా యీ పద్యం ద్వారా నిరూపితమైంది.

10. "ఆదిమ భిల్లు నిత్య కరుణా మృత పూరము జల్లు పుండరీ
కోదర భల్లు నృత్తకరి యూధ పు మల్లుని కొండయల్లునిన్"

ఇందులో ద్విత్వలకార సహితమైన అంత్యాను ప్రాసము శ్రీనాథుని భక్తి ఉల్లాసానికి నిదర్శనము. ఇట్లే

"గౌతమీ గంగ నాలోల ఘన తరంగ" అను దానిలో పూర్ణ బిందు పూర్వక గకార రూపమైన అంత్యానుప్రాసము భాగీరథి యొక్క శుచిత్వ పావనత్వాలను ప్రకటిస్తున్నది.

ఇట్టివే "నిర్వంచితదాన వైభవ విరాజికి తిక్కన సోమయాజికిన్", "వసుమలే నూపురము దక్షవాటి పురము" - వీనిలో అంత్యానుప్రాస విన్యాసములు ఆయా అంశములందు కవికి గల ఆభిముఖ్యాన్ని, అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇట్టిది శ్రీనాథుని శబ్దాలంకార సౌభాగ్యం దీని ద్వారా శైలీ పద్ధతి తెలుస్తున్నది.

11. శ్రీనాథుడు తన శైలిని గూర్చి భీమేశ్వర పురాణమున, ఇట్లు చెప్పుకొన్నాడు.

"ప్రౌఢి బరికింప సంస్కృత భాష యంద్రు
పలుకునుడి కారమున నాంధ్ర భాష యందు

రెవ్వరేమన్న నండ్రు గాకేల కొఱంత
నాకవిత్వంబు నిజము కర్ణాట భాష''           (భీమ 1.15)

నా కవిత్వమునందలి దీర్ఘ సమాస రచనా ప్రౌఢిని చూచి సంస్కృత భాషయని కొందరంటారు. పలుకులలోని నుడికారపు సొగసులను చూచి స్వచ్ఛమైన తెలుగు భాషయని కొందరంటారు. ఎవరెట్లనుకొన్నను నాకేమి తక్కువ. నిజముగా నా కవిత్వము కర్ణాట భాష అని శ్రీనాథుడంటాడు.

ఇందలి కర్ణాట భాషకు సరియైన అర్థము, అంతరార్థము ఏమిటో ఇంతవరకు ఎవ్వరు చెప్పలేదు.

'కర్ణాటక భాష' అంటే ఆ భాషా మర్యాదలను పాటించు తెలుగు కవిత్వమని చిలుకూరి వీరభద్రరావు, కందుకూరి వీరేశలింగం పంతులు, వేదము వేంకటరాయ శాస్త్రి మొదలైన వారు చెప్పారు. కందుకూరి ఈశ్వరదత్తు మొదలగు వారు ఇది మాండలిక భేదములని సూచించుచున్నదనినారు. శ్రీనాథుడు ప్రౌఢి, పలుకునుడికారాలను వేరు వేరుగా చెప్పి తన భాష 'కర్ణాట భాష' అని చెప్పటంచే ఇది ఆ రెండింటి మిశ్రమమును సూచించు శైలీ భేదమనిపించుచున్నదని ఆరుద్ర గారు అభిప్రాయపడినారు. "ఒక కవి రచనను గురించి, వాని భాష కఠినముగా ఉంటుంది. వాని భాష రసవంతంగా ఉంటుంది" అని మనము చెప్పేటప్పుడు అచ్చటి ఆ కాఠిన్యము గాని, రసవత్తగాని భాషకు సంబంధించింది కాదు, శైలికి సంబంధించింది. కాబట్టి 'కర్ణాట భాష' అనగా 'కర్ణాట శైలి' అనియే అర్థమని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తెల్పినారు. కాబట్టి శ్రీనాథుడిచట భాషా శబ్దాన్ని లక్షణార్థంలోనే వాడాడు. వాచ్యార్థంలోకాదు.

శ్రీనాథుని రచనలో కన్నడ భాషా పదాలు కొన్ని చేరిన మాట వాస్తవం. దాన్ని అవకాశముగా తీసుకొని రాజ మహేంద్రవర విద్వాంసులు శ్రీనాథ మహాకవిని విమర్శింపగా వారిని దృష్టి యందుంచుకొని వారి మాటలను లెక్కచేయక ఆత్మ విశ్వాసముతో చెప్పిన పద్యమిది. అంతే కాని తన కవిత్వం కన్నడ భాషలో ఉన్నదనుట కాదు.

'కర్ణే అటతి ఇటి కర్ణాటః' - అను వ్యుత్పత్తిని బట్టి చెవులకింపయిన భాషయని శ్రీనాథుని అభిప్రాయమని కొందరి భావము.

శ్రీనాథుడు 'కర్ణ + అట' - అని విడదీసి యతి వేయుట గమనార్హము           (1.73)

తెనుగు భాషను కర్ణాట భాష అని వ్యవహరించటం కూడా కలదు. వీరాచార్యులు సంస్కృతంలో వ్రాసిన గణిత శాస్త్రాన్ని ఎలుగంటి పెద్దనాచార్యుడు తెలుగులోకి అనువదిస్తూ కర్ణాటకమున వ్రాస్తున్నట్లు చెప్పినాడు.

"హాటకమైన ప్రకీర్ణము
పాటించి గుణింపఁజేతు బహు పద్ధతులన్
గాటంబగు లెక్కలు <u>క</u>
<u>ర్ణాటకమున</u> వెలయు సూర్యనారాయణుడా''

(ఆంధ్ర కవి తరంగిణి 5వ సంపుటము పుట 11)

శ్రీ శాతకర్ణి, కుంతల శాతకర్ణి, సుందర శాతకర్ణి, చకోర శాతకర్ణి అని యీ విధంగా చాలా మందికి శాతకర్ణి పేరుండటం వల్ల వీరిని శాతవాహనులనే గాక కర్ణి రాజులనియు, వీరు పాలించిన దేశానికి కర్ణినాడనియు పేరు కల్గింది. కర్ణినాడే కర్నాడు. కర్నాట దేశము ఐనది. (శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము 23 పుట)

శ్రీనాథునకు పూర్వం తెలుగున శబ్ద ప్రాధాన్యము గల కవిత్వమొకటి, అర్థ ప్రాధాన్యం కల కవిత్వమింకొకటి రెండు పాయలుగా ప్రవహిస్తున్నదన్న విషయాన్ని ముందు చెప్పుకొన్నాం. దీన్ని బట్టి ఒక శైలి సంస్కృతమయమైన శబ్దాలతోను, వేరొకటి జాను తెలుగు శబ్దాలతోను విభిన్న శాఖలుగా విడివడి వర్థిల్లినవి. శబ్దాలకు సమప్రాధాన్యాన్ని, సాంస్కృతిక

దేశీయాలకు సమప్రాధాన్యాన్ని ఇచ్చి తన పేరు మీద ఒక శైలి సృష్టించిన కవి శ్రీనాథుడు. "నా కవిత్వము శుద్ధ సాంస్కృతమును కాదు, శుద్ధ దేశీయమును కాదు. ఉభయ ప్రాధాన్యం కలది" అని ఆయన చెప్పిన పద్యానికర్థం.

12. శ్రీనాథుడు తన కవితా రీతిని గూర్చి కొన్ని సూత్రప్రాయములైన నిర్దేశములను చేసియున్నాడు. వాస్తవానికది భాద్రపద మాసము నాటి అఖండ గోదావరి వంటిది. అప్రయత్న సిద్ధమైన ధారాళత ఆయన వాక్కులోని అనన్య సాధారణమైన ధర్మం. మచ్చునకు

(1) "కబరీ భారంబు కైపెక్కు విరులతో
నవటు భాగంబు పైనత్తమిల్ల" (కాశీ పీఠిక - 3)

(2) "పంచాక్షరీ మంత్ర పారాయణమునకు
నెవ్వాని మానసంబేడు గడయు" (కాశీ 2.40)

(3) "ఎవ్వాడు డా చేతి క్రొవ్వాడి నఖమున
జిదిమె భాషా దేవి చిగురు ముక్కు" (కాశీ 3.32)

మొదలైనవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

(1) "కటి భాగమున గంధకరటి రాట్చర్మంబు
కవటంపు చిమ్మ చీకట్ల నీన
వక్షః స్థలంబున చక్షుశ్శవో భర్త
తార హారము తేవ తళుకు సూప" (కాశీ 5.101)

(2) "ఢమఢమార్భటి డ్డమడ్డమరు ఢక్కాధ్వని
పది దిక్కులందును భ్రమరి పాఱ
గళమూల నిర్గళ త్కాల కూటచ్ఛవి
యర్కబింబంబు మాయంబు సేయు" (కాశీ 5.105)

ఇట్టి శ్రీనాథుని సంస్కృత నిగుంభనంచే పెద్దన, రామకృష్ణ, భట్టుమూర్తి, ధూర్జటి వంటి కవులు కొంత వరకు అందుకొన గల్గిరని చెప్పవచ్చును.

13. ఏనుగు అంగలో మిగిలిన జంతువుల అంగ ఇమిడి పోవునట్లు, బాణమయూరాదులైన ప్రౌఢ సంస్కృత కవుల పద విన్యాసాలు, శ్రీనాథుని పదవిన్యాసంలో సుఖంగా ఇమిడిపోతాయి. ఉదాహరణకు

"ధూర్దండ ఘట్టన త్రుటిత గ్రాహగ్రావ
ధూళీపాళీ మిళద్వ్యా స్థలములు" (కాశీ 1.127)

"విస్పుమర ధ్వాంతౌఘ విధ్వంసన క్రియా
పరమ దీక్షారంభగురుమ యూఖ" (కాశీ 1.132) ఇట్టివి కోకొల్లలు.

14. ఇవి అన్నీ ఇట్లుండగా శ్రీనాథుని తెలుగు పలుకుబడి, నుడికారములలోని యొయ్యారము, ఠీవి, జాతీయతా లక్షణము, మాధుర్యము, ప్రసన్నత అనన్య సులభములు.

అంబికకు పుట్టినిల్లు నీహార శిఖరి
యత్తవారిల్లు కాశీ మహాపురంబు
హిమకరోత్తంసునకు పుట్టినిల్లు కాశి
యత్తవారి గృహంబు నీహార శిఖరి (కాశీ 7.101)

15. ప్రధానంగా కాశీ ఖండ శైలి యందు సంస్కృత నిగుంఫనము కంటే ఉపర్యుక్త లక్షణాలే కనిపిస్తాయి.

"ఓ మునీశ్వర వినవయ్య యున్నయూరు
గన్నతల్లియు నొక్కరూపన్న రీతి
యటు విశేషించి శివుని యర్థాంగ లక్ష్మి
కాశి యిప్వీటి మీద నాగ్రహము దగునె" (కాశీ 7.164)
"పేరా ముద పాకునట్లు తన హస్తము విచ్చియ యుండు వానికిన్" (కాశీ 7.237)
"ఏ వేషము ధరియించిన
నా వేషము తనకు అందమై యాధాత్రీ
దేవుడు చెట్టునఁబుడికిన్
భావంబున నుండు రూపు ప్రాయము కలిమిన్" (కాశీ 7.235)

ఇట్టి వింకను ఎన్నియో గలవు. ప్రధానంగా ప్రతి రెండు పదాల కూర్పులో ఆయన ముద్ర నెలకొని యిది శ్రీనాథుని పలుకుబడియని విస్పష్టంగా తెలిసిపోవుచుండును.

16. సుకుమారములైన శృంగార, కరుణ, శాంత, హాస్య రసాలను అత్యంత సుఖంగా ఉచ్ఛ్వాస నిశ్వాసముల వలె, భావుక హృదయాలకు సమర్పింపగల లక్షణము శ్రీనాథుని తెలుగు నుడికారంలో ఉన్నది. ప్రౌఢ సంస్కృత భూయిష్ఠ రచన గల కవిని తెలుగు కవినిగా సుప్రతిష్ఠితుని చేసింది. ఆ తెలుగు నుడికారమే ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచిత బంధము, సూక్తి వైచిత్రి మొదలగు పూర్వాంధ్ర కవుల వాఙ్ముద్రలను అన్నింటిని తనలో ఇముడ్చుకొని సకలేంద్రియ తర్పణమైన ఒక పరిపుష్టిని శ్రీనాథుని వాణిలో నిండారి యున్నది.

17. నన్నయ వలె మార్గరీతిని భాషించుట శ్రీనాథుని కవిత్వంలో అనేక చోట్ల కన్పిస్తుంది. శ్రీనాథుని కాశీ ఖండంలో నన్నయ్య కవిత్వానుకరణములను చూద్దాం.

**నన్నయ ఆదిపర్వంలో**

'పాయక పాకశాసనికి భారత ఘోర రణంబునందు నా
రాయణునట్లు దానును ధరామర వంశ విభూషణుండు నా
రా యణు భట్టు వాఙ్మయ ధురంధరుడుందన కిష్టుడున్ సహా
ధ్యాయుడు నైన వాడ్ర భిమ తంబుగఁదోడయి నిర్వహింపగన్" (ఆది. 1.25)

**శ్రీనాథుని కాశీ ఖండంలో అనుకరణ**

"పాయక నిర్నిరోధ నిరపాయ సమగ్ర కృపాగుణైక పా
రాయణతా విలాసము తిరంబుగ నంబుజ సూతి వీర నా

రాయణు దాన వైభవ ధురంధరు గుంగర సవ్య సాచిదీ
ర్ఘాయురుపేతుఁ జేయుత నృపాగ్రణి నల్లయ వీరభద్రునిన్'' (కాశీ పీఠి 4)

18. తిక్కన వంటి పదబంధ విన్యాసంగా, రసాభ్యాచిత బంధంగా కూర్పు శైలికి ఉదాహరణాన్ని చూడుము. ఇరువురి సూర్యోదయ వర్ణనలివి.

"ఉర్వీధరంబుల నొప్పెడు జేవుఱుఁజఱుల
కాంతికి నును మెఱుఁగు వెట్టి
ధరణీ గుల్మలతావి తానము పల్లవము
లకుఁగట్టె ఱ్ఱవన్నె యొసఁగి
యరుణాంబు జంబుల యంతర్గళంబుల
తళతళలకు జిగిదళము కొల్పి
చక్రవాకద్వయ సంతతి యెఱకల
గొమరురు కెంజాయఁగ్రొత్త సేసి
తనదుబాల బింబమను పమేయ ప్రభా
పటల జటిల గగన భాగమగుచు,
నుల్లసిల్ల జగము లెల్లను విలస్లిఁబూర్వ
శిఖరిమీదఁ బొడిచెనినుడు'' (ఉద్యోగ - 2.114)

**శ్రీనాథుడు:**

చిఱుసానఁబట్టించి చికిలి నేయించిన
గంద్ర గొడ్డలి నిశాగహన లతకాఁ
గార్కొన్న నిబిడాంధకారధా రాచ్ఛటా
సత్ర్త వాటికి వీతి హోత్ర జిహ్వ
నక్షత్ర కుముద కాననము గిల్లెడు బోటి,
ప్రాచినెత్తిన హస్త పల్లవాగ్ర
మరసి మింటికి మంటి కైక్య సందేహంబుఁ,
బరి హరింపంగఁ బాల్పడ్డ యవధి
సృష్టి కట్టెఱ్ఱ తొలుసంజ చెలిమి కాడు
కుంటు వినతా మహాదేవి కొడుకు గుఱ్ఱ
సవిత్రు సారధి కట్టెఱ్ఱ చామఁదెలుప
నరుణుఁడు దయించెఁ బ్రాగ్ది శాభ్యంతరమున (కాశీ 1.121)

ఇందు తిక్కన 'కట్టెఱ్ఱ'ను శ్రీనాథుడు ఆమ్రేడితం చేసినాడు. కవిబ్రహ్మ కవితా విన్యాసపు శైలి యందు కవి సార్వభౌమునకు గల మక్కువను ఈ పద్యం వ్యక్తం చేస్తున్నది.

19. ఎఱ్ఱన రామాయణంలోని కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సార సంగ్రహంలో ఉదాహరించిన పద్యాల్లో లక్ష్మణ మూర్ఛ ఘట్టంలోని పద్యమిది.

"కందక గాజు వాఱిక మొగంబు వికాసముఁజెందెఁ జేతులీ
యందములైన కాళ్ళు నరుణాంబురుహంబుల లీలఁజూడఁజె
న్నొందెడు జీవ హీనులిటులుండరు ప్రాణము తోడనున్నవా
డిందు సహోదరుండు ధరణీశ్వరనకు విషాదమేటికిన్"

ఈ పద్యంలోని సూక్తి వైచిత్రి విధానపు శైలిని శ్రీనాథుడు ఈ క్రింది విధంగా అనుసరించాడు.

"కందుక గాజువాఱిక వికాసముడిందక మందహాస ని
ష్యందము చెక్కుటద్దముల నారక నెమ్మది నిద్రపోవున
ట్లందము నొందె ధాత్రి సిరియాల కుమారుని వక్త్ర చంద్రుడా
నందము నొందెనప్పుడెల నాగమనంబున భర్తత్తమున్" (హర 2.118)

20. పద్య శిల్పములో భాషా బంధంలో నాద సౌష్ఠవంలో శ్రీనాథుని నన్నయ పీఠమాకర్షించింది. ఒకే ఒక భావాన్ని పద్యంలో చెప్పే తీరును శ్రీనాథుడు సృష్టించాడు. ఉదాత్త సౌందర్యాన్ని చిత్రింపదలచినపుడు శ్రీనాథుడు సమాసాలతో పద్యాన్ని నడిపిస్తాడు. ఒక సత్యాన్ని గాని సందేశాన్ని గాని ప్రపంచింపదలచినపుడు స్థిమితంగా పద్యాన్ని నడిపిస్తాడు. ఇది శ్రీనాథుని తనము. శృంగార నైషధంలో ఉద్దండ శైలి, హర విలాస, భీమేశ్వర పురాణముల యందు కల్పనానైపుణి, కాశీ ఖండంలో అర్థపుష్టి, ప్రజాహిత దృష్టి గోచరిస్తాయి.

## 13.1.3 శ్రీనాథుడనుసరించిన సీసపద్య రచనా శైలి:-

1. చందః ప్రయోగంలో శ్రీనాథుని చేతి యందు సిద్ధి పొందింది సీసపద్యం. అందువల్లనే శ్రీనాథునకు సీసపద్య రచన యందొక విశిష్ట స్థానమున్నది. కంద పద్యానికి తిక్కన, ఆట వెలదికి వేమన సిద్ధహస్తులైనట్లు సీసపద్యానికి శ్రీనాథుడధిష్ఠాన దేవత. ఎంతటి క్లిష్టమైన అర్థాన్నైనా సీసపాదానికి తగినట్లుగా మలచుట శ్రీనాథునకు వెన్నతో పెట్టిన విద్య. ఉదాహరణకు పాషాణాల్లాంటి మయూరుని స్రగ్ధరలు ఈ సీసపద్యపు మూసలో మైనంలాగా కరిగి ఆతనికి ఇష్టమైన రూపాన్ని ధరించినవని చెప్పవచ్చు.

2. సీస పద్యానికుచితమైన ఇంద్ర గణములారింటిలో కొన్నింటికి ఐదు మాత్రలను, కొన్నింటికి నాల్గు మాత్రలును కలవు. ఛందశ్శాస్త్రాన్ని బట్టి అవన్నీ ఒకే వర్గానికి చేరినప్పటికీ వాని అంతరాన్ని మాత్రం శ్రవణేంద్రియం గ్రహిస్తూనే ఉంటుంది. ఆ గణాల పొత్తు సరిగాలేనపుడు ఛందస్సు తప్పకున్నను లయ తప్పుట మాత్రం నిజం. లయానుసారంగా ఆ గణాలకు పొత్తు కుదిర్చన మేటి కవి శ్రీనాథుడు. ఇంకా "యత్ర ల యస్తత్ర యతిః" అను శాస్త్రోక్తిని బట్టి యతి స్థానంలో పదం విరిగితే తప్ప, విశ్రాంతి అనే సార్థకత ఉండదు. అంతేగాక లయకు శుద్ధియు ఏర్పడదు. ధారాశుద్ధి అనే నెపాన తెలుగు కవులీ న్యాయాన్ని విస్మరించారు. శ్రీనాథుడు మాత్రం తన సీస పద్యంలో ఈ ధర్మాన్నీ సాధ్యమయినంత వరకు పాటించాడు. అంతేగాకుండా రాగల ప్రబంధాలలో కన్పించు సీసపద్యాలన్నీ శ్రీనాథుని యొక్క సీసపద్య ఛాయలే.

3. శ్రీనాథుని సీసపద్యాలు అప్రయత్నంగా ధారాగతితో అర్థవంతములై ఉంటాయి. సందర్భోచితికి ఎక్కడా లోపముండదు. సీసపద్య రచనా విధానము నందు ఏ పాదానికా పాదము నందె పదాలు తెగిపోయి భావ విభజనము కావించును. ఈ క్రింది పద్యము అందులకుదాహరణము.

"ధరియింపనేర్చిరి దర్భ వెట్టెడు వ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగ మట్టియ మీఁదఁ
గస్తూరికా పుండ్రములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల మ్రోలఁ
దారహారములు ముత్యాల సరులు
చేర్పంగ నేర్చిరి శిఖల నెన్నడు ములఁ
గమ్మని క్రొత్త చెంగల్వ విరులు
ధామముల వెండియును బైఁడి దడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమ భూపాలుడను జన్మ వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీ తటము నందు" (భీమ - 1.41)

ఈ పద్యము కూడా కాశీ ఖండంలో (1.37) యథాక్షరంగా కలదు.

4. శ్రీనాథుని సీసపద్య పాదాలలో గణమునకొక పదమును లేదా ఒక పదమే రెండేసి గణముల మించకుండగ సీస పద్య రచనమున మత్తేభ గమనంగా ఒనర్చి రసోదంచితంగా నడిపించాడు. ఈ క్రింది పద్యము అందుకు దృష్టాంతము.

"సెలయేటి తెలి నీటఁజిఱు బంతి పసుపాడి
సేస క్రుమ్ముళ్ల ఁబిల్చియలు తుఱిమి
గురువింద పేరులు గుబ్బ చన్నుల ఁదాల్చి
నెమలి పించెపు ఁఒంట్టములు గట్టి
పయ్యెద మాఱుగా ఁబాఱు టాకుల మర్చి
చాదున ఁదిలకంబు సంతరించి
కంకేళి చిగురాకు ఁగర్ణ పూరముఁజేసి
కుసుమ పూవుళ ధూళి ఁగురుల ఁజల్లి
బెంచు చిగురాకుఁబోఁణుల చేఁతలెల్ల
నభినయింతురు పర్ణశాలాంతరములఁ
దంద్రు లెందేని ఁజనునప్డు తల్లులెదుర
గారవమ్మునముని కన్యకా జనంబు" (హర 5.38)

5. ఒకే అర్థాన్ని ప్రకటించటానికై శ్రీనాథుడు సీసపద్యంలో అన్నియు క్రియలనే వాడి చమత్కారాన్ని శిల్పాన్ని చాటినాడు. ఈ క్రింది పద్యము ఉదాహరణప్రాయమైంది.

"అనువు దప్పిరి నొచ్చి రలసి రాపద నొంది
రాదవదలైరి చీకాకుపడిరి
యంగ లార్చిరి విచ్చి రాఱడిఁబొందిరి
బ్రమసిరి పాఱిరి పల్ల టిలిరి
బెగ్గడిలిరి పికాపికలైరి సొలసిరి
కులకుల కూసిరి కుతిల పడిరి
గగ్గుల కాఱైరి కలఁగి రోటాఱిరి
వెలవెల్లనైరి నివ్వెఱఁగు పడిరి
యసపు సవులైరి గుజగుజమైరి డస్సి
రొల్లఁబోయిరి వెగ్గిరి తల్లడిలిరి
సిగ్గువడి రొచ్చవడిరి యిస్సి స్సియైరి
తారకుని చేత మునులు బృందారకులును" (హర 3.10)

6. సప్తర్షులు భీమనాథుని అభిషేకింప గోదావరిని ప్రార్థించికొని తెచ్చునపుడు ఆ గోదావరిని గంగమ్మను చేసి నడిపించిన తీరు మధురంగా ఈ క్రింది సీసపద్యమున శ్రీనాథుడు చిత్రించాడు.

విచ్చేయ వమ్మ శ్రీ వృషభ వాహన ధర
సామజ కట మదాసార ధార!
పయనమ్ము గావమ్మ భర్గ జటాటవీ
కుటజ శాఖా శిఖా కోరకంబ!
రావమ్మ యాదిమ బ్రహ్మ దోః పల్లవ
స్థితక మండలు పుణ్య తీర్థ జలము!
లేవమ్మ విశ్వంభరా వధూటీ కంఠ
తార మౌక్తిక హారధామకంబ!
తెరులతో వీచికలతోడ దరుల తోడ
విమల డిండీర ఖండ దండముల తోడ
మురువు లీవియు నామోదమును జవంబు
వడుపు నొప్పంగ గంగమ్మ నడువవమ్మ!

ఈ పద్యాన్ని చదువుతున్నప్పుడు గోదావరి కదిలి ప్రవహిస్తున్నట్లే ఉంది.

7. శ్రీనాథుని కమనీయ శైలిని జక్కన, అల్లసాని పెద్దనాది కవులెందరో అనుకరించారు. క్రింది ఉదాహరణ పద్యాలను పరికింపుడు.

1. కుకురుకురు చోళ కేరళ
శకమరు కర్ణాట లాట సౌవీర నృప
ప్రకర సభాభరణ మహా
సుకవి జనానీక వినుత శుభచరి తునకున్ (శృ॥నై॥ 1.41)

జక్కన విక్రమార్క చరిత్రలో దీనిని అనుకరించిన విధానము

"కుకురు కురు చేర కేరళ
శకమరు కర్ణాట లాట సౌరాష్ట్ర మహీ
పకు మంత్రి జనమనీషా
ని కషోపలనయ కలాప నిగమాలాపా" (విక్రమార్క చరితము 6.146)

2. 'తన కీర్తి నర్తకి ఘనత బ్రహ్మాండ భవన భూముల గొండ్లి పరిఢవిల్ల' (శృ॥నై॥ 1.9)
'తనకీర్తి నర్తకి దశదిశా మండలీ రంగ మధ్యమున నర్తనము సేయ' (విక్రమ 1.102)

3. 'ముగురం గూర్చిన ముండ దైవమునకున్ మోమోట లేదో సుమీ' (భీమే॥ 3.6)
'ముగురం గూర్చిన ముండ దైవమునకున్ మ్రొక్కంచు జేజేయనున్' (విక్రమార్క 8.70)

4. శృంగార నైషధము నందలి '<u>నలిన సంభవు వాహనము వారువంబులు</u>' (శృ॥నై॥ 2.49)
పద్యాన్ని అల్లసాని పెద్దన
"చిన్న వెన్నెల కండు వెన్నుదన్ని సుధాబ్ధి (బొడమిన చెలువతో (బుట్టు మాకు" (మనుచరిత్ర 2.43)
అనుపద్యమునందనుకరించాడు.

5. "త్ర్యంబకాచల కన్యకాంబు పూరంబున న ఘమర్షణ స్నానమాచరించి........' (కాశీ 1.39)
"సచ్ఛాత్రుఁడగుచునిచ్చలు నేఁగి యయ్యేటన ఘమర్షణ స్నానమాచరించి' (మనుచరిత్ర 1.54)

మొత్తానికి శ్రీనాథుని కావ్యశైలి అసదృశమైన శయ్యా సౌభాగ్య సముపేతమై తదనంతర ఆంధ్ర కవులకనేకులకు ఆలంబనమైంది. అంతేగాక ప్రబంధ శయ్యకు శ్రీనాథుడే మార్గదర్శకుడయ్యాడు.

## 13.1.4 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని శైలీ వైవిధ్యాన్ని పేర్కొనండి?
2. శ్రీనాథుని సీసపద్య వైఖరి ఎట్టిదో తెల్పండి?

## 13.1.5 ఆధార గ్రంథాలు:-

1. తెలుగు సాహిత్య సమీక్ష (ప్రథమ) - డా॥ జి. నాగయ్య
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 13.2

# శ్రీనష్ట్రథా ా వైశిష్ట్యం

**ముఖ్యాంశాలు:-**


13.2.0 లక్ష్యం

13.2.1 ఉపోద్ఘాతం

13.2.2 భాష - వ్యాకరణాలు

13.2.3 భాషా విషయంలో శ్రీనాథ విశిష్టత

13.2.4 వర్ణ నిర్మాణ విజ్ఞానం

13.2.5 సంధి విజ్ఞానం

13.2.6 నామరూప విజ్ఞానం

  13.2.6.1 తత్సమ పద నిర్మాణం

  13.2.6.2 సర్వనామాలు

  13.2.6.3 సంఖ్యా వాచకాలు

  13.2.6.4 విశేషణములు

  13.2.6.5 విభక్తి - 'లు' ప్రత్యయం

13.2.7 క్రియారూప విజ్ఞానం

13.2.8 ఉపసంహారము

13.2.9 ప్రశ్నలు

13.2.10 ఆధార గ్రంథాలు


## 13.2.0 లక్ష్యం:-

ఆంధ్ర వాఙ్మయంలో కవిత్రయం వారి తర్వాత కొంచె మించుమించుగా సమానమైన స్థానాన్ని ఆక్రమించి, ఆంధ్రుల మన్ననలకు పాత్రుడై, కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథుడు బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాశీలుడు. అభ్యర్థిత బ్రంహ్మాండాది మహాపురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత బ్రహ్మజ్ఞాన కళానిధి. సకల విద్యా సనాధుడైన శ్రీనాథుడు పుంభావ సరస్వతి. ఆంధ్ర గీర్వాణ భాషలు అతని కనుసన్నల మెలగినవి. సంస్కృత వాఙ్మయ భాండాగారాన్ని కొల్లగొట్టి ఆంధ్ర వాఙ్మయానికి పుష్టిని, తుష్టిని చేకూర్చాడు. ఈయన రచించిన గ్రంథాలాధారంగా ఆ కాలం నాటి భాషా స్థితి ఎట్లున్నదో పరిశీలించడమే ఈ వ్యాస లక్ష్యం.

## 13.2.1 ఉపోద్ఘాతము:-

అభిప్రాయ ప్రకటన సాధనాల్లో భాష చాల గొప్పది. అందుక్కారణం అతి పటిష్ఠమైన యంత్రాంగం (System) భాషకు

ఉండటమే. ఈ యంత్రాంగంలో కొన్ని అంతరువులు ఆ అంతరువుల్లో పరస్పర నిర్థిష్ట సంబంధమున్న అంశికాలు (Units) ఉంటాయి. ఇదంతా కంటికి కన్పించేది కాదు. బుద్ధి కౌశల్యం చేత, పరిశీలన పాటవం వల్ల జిజ్ఞాసతో చేసే అన్వేషణ మూలంగా ఆ భాషా యంత్రాంగాన్ని బహు కోణాల నుంచి పరిశీలించవచ్చు.

భాషలో వర్ణ నిర్మాణం (Plureology), పదనిర్మాణం (Morphology), వాక్య నిర్మాణం (Syntax) వంటి వివిధ స్థాయిల్లో ఉన్న నియమాలను తెల్పేది వ్యాకరణం.

## 13.2.2 భాష - వ్యాకరణాలు:-

ఒక కాలపు భాషను, ఒక వ్యక్తి భాషను, స్వీకరించి పరిమితమైన భాషా యంత్రాగాన్ని వర్ణిస్తాం. దీనికే వర్ణనాత్మక వ్యాకరణం అని పేరు. (Descriptive Grammar) ప్రసిద్ధంగా ఉంది. పూర్వకాలంలోని వ్యాకరణాలన్నీ వర్ణనాత్మక వ్యాకరణాలే. ఇటీవల భాషా శాస్త్రం అభివృద్ధి చెందిన తరువాత తులనాత్మక వ్యాకరణం (Comparative Grammar) చారిత్రక వ్యాకరణం (Historical Grammar) అని మరిరెండు రకాల వ్యాకరణాలు కూడా వచ్చాయి.

ఒక భాషా కుటుంబంలో ఉన్న అన్ని భాషల్నీ పోల్చి పరిశీలించి, వాటి మూల భాషను వీలైనంత వరకు పునర్నిర్మించి, ఒక్కొక్క దుహిత్ర భాషలో ఏర్పడ్డ మార్పుల్ని తులనాత్మక వ్యాకరణం వివరిస్తుంది.

ఒక భాషలో లిఖితాధారాలు దొరికినప్పటి నుంచీ కాలక్రమంగా ఏర్పడ్డ మార్పుల్ని చారిత్రక వ్యాకరణం వివరిస్తుంది.

వర్ణనాత్మక వ్యాకరణ రచన పాశ్చాత్య దేశాల్లో గ్రీకుకీ మనదేశంలో సంస్కృతానికీ, తమిళానికీ క్రీస్తు పూర్వమే ప్రారంభమైంది. ఈ పద్ధతిలో తెలుగు భాషను అర్థం చేసుకోవడానికి ఇటీవల ప్రారంభమైనాయి.

తెలుగు భాషా చరిత్రకు ప్రధానమైన ఆధారాలు రెండు. 1. తెలుగు శాసనాలు, 2. తెలుగు గ్రంథాలు

దొరుకుతున్న తెలుగు శాసనాలకు కాలక్రమానుసారంగా విశ్లేషించి డా॥ బూదరాజు రాధాకృష్ణ, డా॥ ఎం. కందప్ప చెట్టి, ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల వారు లక్షణ ప్రదర్శన చేశారు. మరో ప్రక్క కావ్య భాషను కూడా విశ్లేషించడానికి మరికొందరు పరిశోధకులు ప్రారంభించారు. డా॥ కె. నాగభూషణరావు - నన్నయ భాషను, ఆచార్య లింగమనేని బసవ శంకరరావు - నన్నెచోడుని భాషను, డా॥ ఎం. సీత - తిక్కన భాషలోని నామ రూప విజ్ఞానాన్ని (Noun Morphology), డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం - తిక్కన భాషలోని క్రియారూప విజ్ఞానాన్ని, ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి - శ్రీనాథ భాషను, డా॥ ఆదెప్ప - పోతన భాషను, ఆచార్య పి. నరసింహా రెడ్డి - ఆముక్త మాల్యదలోని భాషను విశ్లేషించి భాషా పరిశోధక బృందంలో శాశ్వత స్థానాన్ని కల్పించుకున్నారు.

## 13.2.3 భాష విషయంలో శ్రీనాథుని విశిష్టత:-

ఆంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీనాథుడొక యుగ కర్త. తెలుగు భాషా చరిత్రలో కూడా శ్రీనాథుని స్థానం విశిష్టమైంది. దేశి పద ప్రయోగంలోను, తత్సమ పద ప్రదర్శనలోనూ శ్రీనాథ మహాకవిది తనదైన ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత ఎట్టిదో పరిశీలిద్దాం.

సంప్రదాయ సాహిత్యమైన మార్గ కవితా మార్గాన్ని అనుసరించిన స్వతంత్ర కవి శ్రీనాథుడే. కవిత్రయం వారి తర్వాత ఆంధ్ర భాషను సౌష్ఠవమప్పేటట్లు రచించిన కవి శ్రీనాథుడే. సంప్రదాయ సాహిత్యమైన మార్గ కవితా మార్గాన్ని అనుసరించిన స్వతంత్ర కవి శ్రీనాథుడు. కవిత్రయం వారి ఆంధ్ర భాషను సౌష్ఠవమొప్పేటట్లు రచించిన కవి శ్రీనాథుడే. అన్య దేశ్య పద ప్రయోగం, వైకృత పద నిర్మాణం, కారకాల్లోని వైచిత్రి, సమాస నిర్మాణం, క్రియల సొంపు, నూతన పదాల సృష్టి మొదలైన వాటిని ఉద్దండతతో నడిపాడు. కొన్ని శబ్దాలకు అర్థాలను తానే సృష్టించుకొన్నాడు. అట్టి పదాలకు అర్థాలు నిఘంటువుల్లో కూడా దొరకవు. పైన చెప్పిన

విషయాల్ని దృష్టిలో పెట్టుకొని శ్రీనాథుని భాషా వైశిష్ట్యాన్ని ఐదు విభాగాలుగా విభజింపవచ్చును.

1. వర్ణనిర్మాణము (Phonology)
2. సంధి నిర్మాణము (Morpho - Plurenius)
3. నామరూప విజ్ఞానము (Noun Morpleology)
4. క్రియారూప విజ్ఞానము (Verb Morpleology)
5. వాక్య విజ్ఞానం (Syntax)

పైన సూచించిన విభాగాలననుసరించి శ్రీనాథుని భాషలో గల వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

## 13.2.4 వర్ణ నిర్మాణ విజ్ఞానము (PHONOLOGY):-

శ్రీనాథుని కావ్య భాషననుసరించి వర్ణ నిర్మాణ రీతులను రెండు విభాగాలుగా విభజింపవచ్చు.

1. దేశ్యతద్భవ పద ఘటక వర్ణాలు
2. తత్సమ పద ఘటక వర్ణాలు

శ్రీనాథుని భాషలోని దేశ్య తద్భవ హల్వర్ణాల వ్యాప్తిని ఈ విధంగా గుర్తిస్తాం.

1. పదాదిలో ణ -, య -, ళ - వర్ణాలు తప్ప మిగిలిన హల్లులన్నీ వస్తాయి.
2. పదాది దీర్ఘాచ్చులకు పరంగా పూర్ణ బిందుయుత హల్వర్ణం లేదు.
3. పదాది దీర్ఘాచ్చుల్లో ।ఊ। కు తప్ప మిగిలిన వానికి పరంగా ద్విరుక్త హల్లులు లేవు.
4. శ్రీనాథునిలో సకారద్విత్వం తోడి రూపాలు అరుదుగా కన్పిస్తున్నాయి. అదీ ధ్వన్యనుకరణ శబ్దాల యందు సకార ద్విత్వరూపాలున్నాయి.

   **ఉదా:** ఉస్సురను (కాశీ 7.45) ఇస్సిస్సియగు (హర 3.10) బుస్సుమను (హర 4.87)

5. శ్రీనాథుని భాషలో ।ణ। వర్ణం తప్ప మిగిలిన హల్లులన్నీ పద మధ్యంలో ద్విత్వాన్ని పొందుతాయి.
6. శ్రీనాథునిలో ।ట।, ।హ।, ।ణ।, ।ఱ। - వర్ణాలతో హల్సం యోగం లేదు.
7. నన్నయలో రేఫ - శకట రేఫలు భిన్న వర్ణాలుగా ఉన్నాయి. రేఫ - శకట రేఫలు ప్రత్యేక వర్ణాలుగా నన్నయ, నన్నెచోడుల భాషలో యతిప్రాసల్లో కన్పిస్తున్నాయి. కాని తిక్కన ఈ రెంటికీ సంకరత్వం చేశాడు. శ్రీనాథుని కాలం నాటికి కొందరు పండితుల గ్రంథాలయందు, కవుల గ్రంథాల యందు కొలదిగా నిలిచింది.

   కాని సాధు రేఫ శకట రేఫలకు ప్రాసవేయటానికి కూడా శ్రీనాథునికి అభ్యంతరం లేదు.

   **ఉదా:** 'తరుణి విజ్ఞాన మీ సూక్ష్మ మెఱ్ఱిగి కొనుము (కాశీ 3.70)

   11-12 శతాబ్దాల కాలంలోని తెలుగు శాసన భాషలో శకట రేఫ 'ఱ' వర్ణం తన ప్రత్యేకోచ్చారణ భేదాన్ని పోగొట్టుకొన్నట్లు ఆధారాలున్నాయి.

8. నన్నయ ప్రాస స్థానంలో దీర్ఘం మీద పూర్ణ బిందువు కలిగిన దేశ్య తత్సమాలను వాడుకోవడం కన్పించదు. పూర్ణబిందువు

ఉచ్చారణలో భ్రష్టమైన కారనం చేత తిక్కనాదులు సార్థ బిందు, నిర్బిందు ప్రాస నుపయోగించారు. శ్రీనాథుని భాషలో కూడా ఇట్లాంటివి ఉన్నాయి.

**ఉదా:** తీఁగెసాఁగ (కాశీ 6.41), తీగ రసంబున (హర 1.18) ఇవి ప్రాసలోని ప్రయోగాలు.

9. 'ఏనిన్' ద్రుత ప్రకృతికంగా 'ఏనియున్' కళగా వ్యవహరించిన ప్రయోగాలు శ్రీనాథునిలో కన్పిస్తాయి.

**ఉదా:** 'సమ్మతించెదవే నినంబు ధీశ్వరు' (శృ॥నై॥ 4.75)

ఎంత యేనియుం జిత్తములోని (శృ॥నై॥ 7.36)

10. నన్నయ జ్ఞకారానికి అందలి మొదటి అంశమైన 'చ, ఛ, జ, ఝ'లతో యతిని గుర్తించాడు. తిక్కన, శ్రీనాథులు తద్భవ రూపాన్ని బట్టి 'జ్ఞ' కారానికి 'క' కారంతో యతి వేశారు.

**ఉదా:** జ్ఞానేంద్రియ జ్ఞాన కళా కాంతి సొరుగా (కాశీ 1.139)

11. శ్రీనాథుడు అఖండ యతిని నిస్సంశయంగా ఆదరించాడు.

**ఉదా:** ప్రతి వసించు గోవుల ఖురాగ్రములందు(కాశీ 2.18)

ప్ర - రా (ర + అ)

'కాశి యణి మాది సిద్ధుల కాట పట్టు' (కాశీ 2.50)

కా - కు (కు + అ)

ఇక్కడ సంధి వశాన ఏర్పడ్డప్పటికీ సిద్ధరూపంలో ఉన్న అక్షరానికే ఉచ్చారణ యందు బలముండటం చేత అఖండ యతి కూడా ఆదరింపబడింది.

12. ప్రాచీన భాషలో 'ము' విభక్తి స్థానంలో 'పు, బు, వు' మున్నగు రూపాలు కన్పిస్తాయి. ఆ సామంజస్యాన్ని బట్టి ము విభక్తికి 'పు, ఫు, బు, భు' లతో యతి సమంజసమే. నన్నయాదులట్లా పాటించారు. కాని శ్రీనాథుడు విభక్తి ఐనా కాకపోయినా 'ము' వర్ణంతోను, దానితో మైత్రి ఉన్న 'మొ', 'మో' లతో 'పు, ఫు, బు, భు' లకు యతిని పాటించాడు.

**ఉదా:** శాసనము శాసనబు, ధర్మము - ధర్మువు, కనకము - కనకపు

'పోక మ్రాకుల సొంపు మురువు కొనగ' (కాశీ 1.91)

భువన బీజంబు కైవల్య మోక్షదాయి (భీమ 5.50)

13. శ్రీనాథునికి బిందు పూర్వక సకార, శకారాలను ప్రాస వేయడం మిక్కిలి అభిమతం.

**ఉదా:** 'సంసార భ్రమ యించుకేనియున్ మత్స్వాంతంబునన్ లేదుమీ

వంశం బీపరి పాటిదే .......... (హర 2.11)

పై ప్రయోగాన్ని బట్టి నాటి వర్ణాల ఉచ్చారణాన్ని గ్రహించవచ్చు.

## 13.2.5 సంధి విజ్ఞానము (Morpho - Phonumies):-

సంధి అంటే కూడిక - ఒక పదానికి మరో పదాన్ని సన్నిహితంగా చేర్చి పలుకునపుడు భాషా సంప్రదాయాన్ని బట్టి కొన్ని మార్పులు జరుగుతాయి. సంధికార్యాలు జరుగు సందర్భాలు రెండు విధాలుగా మనం గుర్తించవచ్చు. (i) ప్రాతిపదికకు విభక్తి ప్రత్యయాలు పరమైనపుడు సంధి జరుగవచ్చును, (బి) విభక్తి సంబంధంలేని రెండు పదాలకు సంధి జరుగవచ్చు.

(I) ప్రాతిపదికకు ప్రత్యయాలకు మధ్య సంభవించు దాని పదమధ్య సంధి అంటారు (Internal Sandhi).

**ఉదా:** రెండవ తీర్థము (భీమ 3.66)

(II) స్వతంత్ర శబ్దాల మధ్య సంభవించు దాన్ని పదాంత సంధి (External Sandhi) అంటారు.

**ఉదా:** అడియాస (కాశీ 2.11), చదలేఱు (శృ॥ నై॥ 3.6)

సంధుల్లో వచ్చే మార్పులను నాలుగు విధాలుగా వర్గీకరింపవచ్చును.

1. అచ్చు + అచ్చు (Vowel + Vowel)
2. అచ్చు + హల్లు (Vowel + Consonant)
3. హల్లు + అచ్చు (Consonant + Vowel)
4. హల్లు + హల్లు (Consonant + Consonant)

దీన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీనాథుని భాషలో వచ్చిన విశిష్టమైన మార్పులను పరిశీలిద్దాం.

1. సంస్కృత సమాల యందలి అత్తునకు సంధి జరగటం శ్రీనాథుని భాషలోని ప్రత్యేకత.

సీమ + అటు = సీమటు (భీమ 5.77)

స్త్రీ వాచక, తత్సమ, సంబోధనాంతములకు సంధిలేదని సూరి వచనం.

2. అవ్వి, ఇవ్వి అను సర్వనామాలతో కూడి సంధి కావింపబడ్డ ప్రయోగాలు శ్రీనాథునిలో కానరావు.

3. మధ్యమ పురుషేకార సంధి వైకల్పికంగా జరుగుచున్న సన్నివేశాలు శ్రీనాథునిలో ఉన్నాయి.

ఏలితివి + అపుడు = ఏలితివపుడు - ఇక్కడ సంధి నిత్యము.

కూర్చుండిరి + ఒండొరుంగదిసి = కూర్చుండిరి యొండొరుంగదిసి (శృ॥నై॥ 3.78)

ఏగుదెంచిరి + ఇందు కళాధర = ఏగుదెంచిరి యిందు కళాధర (శివ 4.60)

సైరింప వైతి + ఈ శాపమునకు = సైరింపవైతి యీశాపమునకు (కాశీ 6.23)

పల్కితివి + ఐనను = పల్కితివియైనను (హర 4.33)

దీనిని బట్టి వైకల్పికత్వం శ్రీనాథుని కాలానికి సహజమని తెలుస్తున్నది.

4. క్త్వార్థేకార సంధి వైకల్పికం. క్త్వార్థేకారానికి సంధి లేదు.

శాసన భాషలో - 'వెల్చిచ్చిన' - (s 11. vi . 724 . viz Ag 1399 A.D)

**ఉదా:** అంది + ఈక (కాశీ 5.14) అందీక.

ఇట్టివి నన్నెచోడునిలో కూడా ఉన్నాయి. కాని నన్నయ్యలో లేవు.

**ఉదా:** పొంగి + ఎఱగెడు = పొంగెఱగెడు (కు॥సం॥ 11.172)

5. షష్ఠీ సమాసమునందలి 'ని' వర్ణము మీది అచ్చునకు అచ్చు పరమగునపుడు కొన్ని యెడల సంధియగును.

**ఉదా:** మగని + ఆలు = మగనాలు (కాశీ 2.83)

చిఱుతొండని + ఇంటికి = చిఱుతొండనింటికి (హర 1.15)

6. సామాన్యంగా తత్సమ నామాలలోని ఇత్తునకు సంధి రాదు. కాని తత్సమ శబ్దాలలోని ఇత్తునకు అచ్చుపరమైనపుడు శ్రీనాథుని భాషలో సంధి నిత్యం అవుతుంది.

**ఉదా:** భూతి + అలదు = భూతలదు (శివ 5.52)

ధూళి + అయ్యె = ధూళయ్యె (భీమ 4.143)

7. బహువచన శ్లిష్టమైన 'ళు' వర్ణం ఉత్వద్విత్వాలను కోల్పోవటం శ్రీనాథుని ప్రయోగాల్లో కన్పిస్తుంది.

**ఉదా:** (ళ్మి) గ్రుక్కిళ్ళు + మింగుచు = గ్రుక్కిళ్మింగుచు (కాశీ 4.123)

(ళ్వ) వసివాళ్ళు + వాడుచు = వసివాళ్వాడుచు (క్రీడా 86)

8. గసడ దవా దేశ సంధి యందు ట కారము డ కారముగా మారిన ప్రయోగాలు శ్రీనాథుని భాషలో కానవచ్చుట లేదు.

9. తెలుగుల మీద సాంస్కృతిక పరుషాలకు గసడ దవలు రావు అనే విషయంలో శ్రీనాథుని భాష యందు ప కారానికి వ కారమాదేశంగా వచ్చిన ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

**ఉదా:** ఎవ్వండు + పఠించును = ఎవ్వండు వఠించును (కాశీ 6.260)

పూర్వ కావ్యాల్లోను, శాసనాల్లోను ఈ మార్పు కన్పిస్తున్నది.

**ఉదా:** ఇందు + ప్రత్యక్షమై = ఇందువ్రత్యక్షమై (యుద్ధమల్లుని శాసనం)

ఏమి + చిత్రము = ఏమిసిత్రము (కు॥సం॥ 5.88)

నీవు + తపము = నీవుదపము (కు॥సం॥ 6.7)

ఇట్లు + తపము = ఇట్లుదపము (నిర్వ - 5.8)

వీరల్ + కోపించిన = వీరల్గోపించిన (ఉ॥ హరి 4.53)

10. ద్వంద్వంబున పదంబు పయి పరుషాలకు గ స డ ద వ లు రావాలి.

దీని కపవాదంగా

'అప్ప చెలియండ్రు' (క్రీడా॥ 2.44) అనే ప్రయోగాల్లో అట్లా రావడం లేదు.

11. సర్వార్థకమైన 'ఎల్ల' శబ్దం ద్రుతాంతమందుగల అవ్యయం ఈ 'ఎల్ల'అను దానికి సమాసం కానప్పుడు, విశేష్యానికి పూర్వములో ప్రయోగం లేదు. కానీ శ్రీనాథుడు 'ఎల్లన్ శిష్యులు' అని ద్రుతముతో విశేష్యానికి ముందు ప్రయోగించాడు. కాబట్టి దీన్ని అపవాదమనవచ్చు.

**ఉదా:** ఏ నొకడనే భిక్షానకున్ వత్తునో యెల్లన్ శిష్యుల

గొంచువత్తునో (భీమ 2.120)

12. ధ్వన్యనుకరణమున పూర్వాంగము తుది యచ్చునకు దీర్ఘము వచ్చిన రూపాలు కలవు.

**ఉదా:** వికావికలు (శివ 4.83) పికాపికలు (హర 3.10)

13. అనుకృతిలో ఔ కారం సంస్కృతంలో లాగానే 'ఆవ్' అని మారటం శ్రీనాథుని భాషలో కన్పిస్తుంది. భూ - భత్

**ఉదా:** దీప్తౌ + అనంగ =దిప్తావనంగ (కాశీ 5.10)

14. షష్ఠీ సమాసములో పదాంతమైన ఉత్తునకు అచ్చు పరమైనపుడు న కారం వస్తుంది.

**ఉదా:** నీదు + ఔదార్యంబు = నీదునౌదార్యంబు (కాశీ 2.69)

కానీ కొన్ని యెడల షష్ఠీ సమాసంలో పదాంతమైన ఉత్తునకు అచ్చుపరమైనా న కారం రాదు పై సూత్రానికి అపవాదం.

**ఉదా:** నిషధరాజు + అంతవాని = నిషధరాజంతవాని (శృ॥నై॥ 2.92)

బచ్చు + ఇల్లు = బచ్చింట (పా॥మా॥ 3.16)

15. కొన్ని యెడల పదాంతమైన ఉత్తునకు పరుషములు పరమైనను న కారము కలుగదు.

**ఉదా:** నిఱు + పేద = నిఱుపేద (శృ॥నై॥ 4.73)

తొలు + చూపు = తొలుచూపు (కాశీ 3.22)

16. అందు పరమగునపుడు అత్వము తోడి న కారము అదనముగా వచ్చును.

నిండు + జవ్వనంబు = నిండు జవ్వనంబున యందు (కాశీ 1.7)

కాని ఉదంతాలకు 'అందు' పరమైనపుడు 'న' కారం ఆగమంగా వస్తుంది.

**ఉదా:** విదర్భ దేశము + అందు = విదర్భ దేశము నందు (శృ॥నై॥ 2.18)

17. ద్విరుక్త టకార దేశంబులో 'కుఱు' తోడి ప్రయోగం శ్రీనాథుని రచనలో మృగ్యం.

'కుఱు. చిఱు, కడు, నడు, నిడు' అనే సూత్రానికి అపవాదంగా శ్రీనాథునిలో 'నిట్రుపాసము' (భీమ 2.100) అనే ప్రయోగం కన్పిస్తున్నది.

18. ద్విరుక్తి నొందిన శబ్ద పల్లవములలో పూర్వాంగము లోపించును.

**ఉదా:** వాదడచి + వాదడచి = వాదడచియడచి (కాశీ 5.33)

19. ఆమ్రేడితంబు పరంబగునపుడు విబిక్తి లోపంబు బహుళంబు గానగు.

అప్పటికిన్ + అప్పటికిన్ = అప్పటికప్పటికి (శృ॥నై॥ 1.94)

అప్పటప్పటికి (కాశీ 2.63)

20. కొన్ని యెడల అంతిమాక్షర లోపంబు వైకల్పికముగనగు

నాడు + నాటికిన్ = నానాఁటికిన్ (కాశీ 1.115)

నాఁడునాఁటికిన్ (కాశీ 3.213)

21. ఆమ్రేడితము పరమగుచో మధ్యమ పురుష ప్రత్యయములకు లోపము కావచ్చును. అట్టి యెడల కృత హ్రస్వమును దీర్ఘమగును.

లెమ్ము + లెమ్ము = లేలెమ్ము (శివ 1.80)

పొండు + పొండు = పోపొండు (భీమ 4.10)

## 13.2.6 నామరూప విజ్ఞానం (Noun Morphology):-

### 13.2.6.1 తత్సమ పద నిర్మాణం:-

1. తత్సమ శబ్దాలకు - 'ండు / - ఁడు' అనే లింగ బోధక ప్రత్యయం చేర్చకుండానే ప్రాతిపదికాంతమైన అకారం ఉత్వం పొందుతుంది.

   **ఉదా:** కాళిదాస - కాళిదాసు (భీమ 1.7) నన్నయభట్టు (కాశీ 1.13)

2. కొన్ని తిర్యక్కులును, జడ వాచకాలును మహద్వాచక ప్రత్యయాలు చేరి మానవీకరణ పొందుచున్నవి (Resocification).

   **ఉదా:** గరుడుండు (కాశీ 2.107), ద్విజముఖ్యుడు (శృ॥నై॥ 2.3), శీతాచలేంద్రుండు (హర 4.60)

3. ప్రాతిపదికకు మహద్వాచక ప్రత్యయము చేరియు, చేరకయు ఈ క్రింది రూపము ఏర్పడుచున్నది.

   **ఉదా:** పూషుండు (భీమ 3.212), పూష (కాశీ 3.93)

4. శ్రీనాథుని భాషలో ఈ క్రింది తత్సమ రూపాలు అపాణినీయాలు. మహాకవుల ప్రయోగంబుల సాధుత్వంబున "స్థితి స్యగతిశ్చింత నీయా' అనే మాట అనుసరణీయము.

   ఎ. గీష్పతిః గీః పతిః - గీర్పతిః - గీర్ పతి - పాణిని సమ్మతము

   **ఉదా:** గీష్పతి యేమి చ్ెపన్ (శృ॥నై॥ 4.28)

   బి. ముష్టాముష్టిః - ముష్టితో ముష్టిని గ్రహించి పోరాడుట

   ఇక్కడ ముష్టీముష్టి - అనుట సమ్మతము

   **ఉదా:** 'ముష్టాముష్టిన్ - బాహాబాహిఁగచకచి' (కాశీ 5.150)

   సి. బాహాబాహిః బాహువుతో బాహువును గ్రహించి పోరాడటం 'బాహూబాహవి' అనుట సాధువు.

   **ఉదా:** 'ముష్టాముష్టిన్ బాహా బాహిఁగ చాకచి' (కాశీ 5.150)

   డి. కానినేయుడుః కన్య సంతానము

'కన్యాయాః కనీనచ' - అని పాణినీయము' 'కానీనుడు' అనుట యుక్తము

'కాశికా పట్టణము మీద ఁగాని నేయ' (భీమ 2.114)

'కార్య సిద్ధి పొందెడు కానినేయ' (భీమ 3.214)

ఇ. గృహయాళువుః గ్రహించు స్వభావం కలవాడని అర్థం

గ్రహ్ + అప్ = గ్రహ + ణిచ్ + అలుచ్ - గ్రహ్ + అయ + అలుచ్ 'గ్రహయాలు' ఇతి ప్రకియా.

**ఉదా:** ఆమోద గ్రహయాళువుల్ పొలసె (భీమ 5.95)

ఎఫ్. పతయాళువుః పడెడు స్వభావం కలవాడని అర్థం.

'స్పృహి, గృహి, పతి, దయి, నిద్రా, తంద్రా శబ్దేభ్యః ఆళుచ్ [కౌముది - కృదంత 3.2.158] 'ఆద్యాస్త్రయః చురాదౌ అదంతాః' - వృత్తి

**ఉదా:** గ్రాహింపంబతయాళా నిష్ఠుర (భీమ 4.58)

జి. బాలకిః బాలిక యనుట సాధువు

**ఉదా:** 'బాలకి సదృశము వలె వలలఁబడు మత్స్యంబుల్ (క్రీడా 91)

హెచ్. ప్రౌఢిమః ప్రౌఢత్వము

సంస్కృత భాషలో 'ప్రౌఢి' శబ్దమే గాని ఈ ప్రయోగము కన్పించదు. 'ఇమనిచ్' ప్రత్యయం చేర్చి 'ప్రౌఢిమ' అనే రూపాన్ని శ్రీనాథుడు విలక్షణంగా ప్రయోగించాడు.

**ఉదా:** 'గంభీర వాక్ప్రౌఢిమన్' (శృ॥నై॥ 1.12)

ఐ. గాణపతముః గణపతికి సంబంధించినది.

'గాణాపత్యము' అని ఉండాలి. గణపతి శబ్దము అశ్వపత్యాది గణంలో నిపతింపబడటం చేత 'అణ్' ప్రత్యయం వచ్చి 'గాణపతమ్' అని కావాలి. దీని కంటె 'ణ్యత్' ప్రత్యయం రాదు.

'గాణపత్యో మంత్రః' - ఇతితు ప్రామాది కమేవ.

5. ఈ క్రింది తత్సమరూపాల యందెట్టి వ్యాకరణ దోషం లేకపోయినప్పటికీ శ్రీనాథుని అభీష్టమైన విశిష్ట ప్రయోగాలు. వీటిని మరే కవులు ప్రయోగించలేదు.

| | | | | |
|---|---|---|---|---|
| (i) | అక్షయ్యము | - | క్షమింప చేయుటకు శక్యము కానిది | (కాశీ 6.125) |
| (ii) | అదసీయము | - | దీని సంబంధము | (శివ 2.47) |
| (iii) | కలశీసుతుడు | - | కలశసుతుడనుట ప్రచారము | (కాశీ 4.304) |
| (iv) | కంఠేకాలుడు | - | కంఠము నందు నల్లదనము కలవాడు | (భీమ 4.202) |
| (v) | కార్తీకవేళ | - | కార్తిక మాసపు వేళ | (భీమ 3.25) |
| (vi) | పణినాపత్యము | - | పాణిని | (శృ॥నై॥ 8.19) |
| (vii) | పుష్పంధయము | - | భ్రమరము | (భీమ 1.106) |
| (viii) | పాణింధమము | - | కొలిమి తిత్తి | (భీమ 2.110) |
| (ix) | నందని | - | కుమార్తె 'నందన' అనుట ప్రసిద్ధము | (భీమ 4.27) |
| (x) | యాయజూకుడు | - | యజమానుడు | (కాశీ 4.7) |

(xi) వివాదము - వివాదమనుట ప్రచురము (హర 7.59)

(xii) సాత్కరించు - ఆధీనపఱచు (శృ॥నై॥ 8.108)

6. అమహద్వాచకాలకు, లింగబోధక ప్రత్యయమైన - ము వర్ణం లోపిస్తున్న విశిష్ట రూపాలు శ్రీనాథునిలో ఉన్నాయి.

1. ఊష్మ (ఊష్మము) - ఊష్మ జగత్రయంబునన్ (హర 6.63)
2. భీభత్స (భీభత్సము) - పొలసుకంపున భీభత్స పొడమజేయ (కాశీ 6.41)
3. కంఠకోణ చిహ్న (చిహ్నము) - గుఱుతయ్యెనీ కంఠ కోణ చిహ్న (భీమ 4.72)
4. లలామకున్ (లలామము) - మానవతీ జనతాలలామకున్ (శృ॥నై॥ 8.33)

7. పుంలింగ మహద్వాచకాలకు బహువచనం పరమైనపుడు 'వు' వర్ణం లోపిస్తుంది.

**ఉదా:** బంధులు (బంధువులు) (భీమ 1.50)

ఉదకబిందులు (బిందువులు) (భీమ 5.189)

పుండ్రేక్షులు (పుండ్రేక్షువులు) (భీమ 1.110)

8. కొన్ని రూపాలను శ్రీనాథుడు తన కాలం నాటి వ్యావహారిక భాష నుండి గ్రహించి ప్రయోగించాడు.

1. ఇరువైనాలుగు మూళ్ల మేర (కాశీ 1.53) ఇరువది నాలుగు మూరల మేర
2. ఎంత జడుడైన గానీ (శృ॥నై॥ 6.23) కానిమ్ము - అని అనాలి
3. ఏమి కొంకకపెట్టు (హర 2.29) ఏమియును అనాలి
4. మోహింపఁజేతురు (శృ॥నై॥ 2.88) చేయుదురు అని ఉండాలి
5. వినీవినని భంగి (శృ॥నై॥ 6.33) వినియును వినని అని ఉండాలి

**13.2.6.2 సర్వనామాలు (Pronouns):-** సర్వనామములను ప్రాథమికంగా నిర్మాణ క్రమాన్ననుసరించి ముఖ్యంగా విశేష్యములయందే అంతర్భవింప చేయవచ్చును.

1. పురుష వాచక సర్వనామాలు (Personal Pronouns)
2. ఆత్మార్థక సర్వనామాలు (Reflixive Pronouns)
3. నిర్దేశ సర్వనామాలు (Demonstrative Pronouns)
4. ప్రశ్నార్థక సర్వనామాలు (Interrogative Pronouns)

1. యుష్మదర్థక ప్రథమా బహువచనంలో 'ఈరు' అను రూపంతో ఒక ప్రయోగం శ్రీనాథునిలో కలదు.

'ఎందుండి వచ్చితిరీరు? కాసల్నాటనుండి' (క్రీడా 189)

2. మీరు । మీరలు, వారు । వారలు, వీరు । వీరలు, తాము । తమరు - అనునవి బహువచనములైనను పూజ్యార్థంలో ద్విగుణిత బహు వచనముతోడి ప్రయోగాలు శ్రీనాథునిలో కలవు.

3. గౌరవ వాచకమున ఏకవచనానికి బదులు బహువచనము వాడబడుచున్నవి.

**ఉదా:** మాకు: మాకు నాయంబె నీ తోడ మాటలాడ (శృ॥నై॥ 4.50)

మీకు: మీకు మేలయ్యెడుఁబోయి వచ్చెద (కాశీ 1.105)

4. ప్రథమ పురుష మహద్వాచక బహువచనంలో 'వాండ్రు' అను రూపము ఒకే పర్యాయము శ్రీనాథుడు ప్రయోగించెను.

**ఉదా:** ఏకార్థ క్రియనిర్మించు వాండ్రు భవార్చా రతినెంచ (భీమ 4.207)

5. ప్రశ్నార్థక సర్వనామమైన 'వేరు' అను రూపము 'ఎవరు' అను అర్థంలో శ్రీనాథునిలో కన్పిస్తుంది. ఇది యితర రూపాలతో సమత్వము పొందుచున్నది.

'వేరీ నిన్నెదిరింపగా జగమునన్ వీరలు' (హర 7.145)

6. కొన్ని యెడల మహద్వాచకంగా 'అది' అను సర్వనామముపయుక్తమై కన్పట్టుచున్నది.

'అదియెవ్వరని ప్రతీహారులెవ్వరి నన్నుఁదన్నుఁగాదఁలఁచి చిత్తమున నులుకు' (శృ॥నై॥ 3.84)

9. మధ్యవర్తి నిర్దేశించు సర్వనామమైన 'ఉల్ల' తోడి ప్రయోగము శ్రీనాథునిలో కలదు.

'మేలుగాకేమి టంకాల జాళెము లెవ్వి?

యుల్ల వెట్టియు నిండియున్న యవివె' (కాశీ 7.247)

**13.2.6.3 సంఖ్యావాచకాలు (Nunerals):-** ఇవి ప్రాథమిక సంఖ్యావాచకాలని (cardinals), సార్వనామిక విశేషణాలు (ordinals) అని రెండు రకాలు.

1. ప్రాథమిక సంఖ్యా వాచకాలన్నీ అమహత్తుల నుండి నిష్పన్నములైనవి.

2. సంకలనంచే (additions), గుణకారంచే (mulitiplications) సంయుక్త సంఖ్యా వాచకములేర్పడుచున్నవి.

**సంకలనానికి ఉదాహరణ:**

(i) ఇన్నూఱుమున్నూఱు నేనూఱు (200 + 300 + 500 = 1000) (శృ॥నై॥ 6.72)

(ii) వేయిన్నాఱున్నూఱు (1000 + 600 = 1600) (కాశీ 5.244)

(iii) రెండు వేల నిన్నూట రెండు (2000 + 202 = 2002) (కాశీ 1.135)

**గుణకారానికి ఉదాహరణ:**

(i) ఈరేడు (2 × 7 = 14) హర 3.25

(ii) ముయ్యేడు (3 × 7 = 21) హర 2.15

(iii) ముయ్యారు (3 × 6 = 18) కాశీ 7.19

(iv) ముప్పది (3 × 10 = 30) కాశీ 3.64

3. ఒకప్పుడు సంఖ్యా వాచక పదము మహన్మహత్యర్థక విశేష్యాలకు విశేషణము పరమగునపుడు మహతీతరమహ ద్వాచక రూపముననే ఉంటుంది.

1. మున్నూఱు శిష్యులు (భీమ 2.126)

2. అబ్జనాభులు నూఱు నైదు పదులు (100 + 50 = 150) కాశీ 6.131

**13.2.6.4 విశేషణములు:-** సంస్కృతము నందు విశేషణాలు లింగ విభక్తి వచనములందు విశేష్యాలతో సమానంగా ఉంటుంది. తెలుగులో విశేషణాలకు ప్రత్యేకంగా లింగ విభక్తి వచనాలు లేవు.

1. స్వతస్సిద్ధ విశేషణములు, 2. నిష్పన్న విశేషణములు. ఇవి గుణవాచక, నిర్దేశాత్మక, ప్రశ్నవాచక, సంఖ్యావాచక, పరిమాణాత్మక, ప్రకారార్థక, పరిగణనార్థక, అనిశ్చిత విశేషణాలని ఎనిమిది విధాలుగా ఉంటుంది.

2. అమహద్వాచ కాంతంలోని 'ము' వర్ణ స్థానంలో 'పు । - ంపు' ఆదేశంగా వస్తాయి. ఉదా - కప్పుర - పు - ముగ్గు.

   నన్నయలో - పు । -ంపు కంటె -బు వర్ణం తోడి వానినే విశేషణాలుగా వాడాడు. తిక్కన 'ము' వర్ణకాంత రూపాలను వాడాడు.

   **ఉదా:** 'లోకము సమరంబులు' - ఇట్టవి శ్రీనాథునిలో కూడా ఉన్నాయి

   **ఉదా:** పుట్టము చెఱంగు (శృ॥నై॥ అ. 131)

3. భవిష్యత్కాల విశేషణాలు

   కాగల యది (హర 7.27), రాగల భూమి పాలురున్ (భీమ 5.86), చేయగలవాడనేను (కాశీ 7.172).

4. నన్నెచోడునిలో భవిష్యత్కాల ధాతుజ విశేషణ ప్రయోగాలు లేవు.

   'కొల్వగలవాడన్' - అను సమాపక క్రియా నిర్మాణం కల రూపముంది.

**13.2.6.5 విభక్తి - 'లు' ప్రత్యయం:-**

1. 'దంపతి' అనేది సంస్కృతంలో ద్వివచనం. తెలుగులో సాధారణంగా 'లు' వర్ణం చేర్చి వాడుతారు. శ్రీనాథుడు సంస్కృత సంప్రదాయాన్ననుసరించి 'లు' వర్ణం చేర్చకయే ప్రయోగించాడు.

   **ఉదా:** దంపతికి దృక్కులు (కాశీ 4.169)

2. ద్విగుణిత బహువచన రూపాలు (Double Plurals) శ్రీనాథునిలో ఉన్నాయి.
   1. పేరటాండ్రు - రు (శృ॥నై॥ 6.82)
   2. పెక్కండ్రు - రు (కాశీ 6.226)
   3. ఇల్లాండ్రు - రు (కాశీ 1.30)

3. లోహ వాచకమైన 'బంగారం' నిత్యైక వచనాంతం అయినప్పటికీ శ్రీనాథుడు బహువచనంలో వాడాడు.

   'మలిపించె బంగారముల దేవ గృహముల' (భీమ 5.81)

4. శ్రీనాథునిలో క్రీడా విశేషమైన 'బొమ్మపెండిలి' ఏకవచనాంతంగా ప్రయుక్తము (హర 4.11).

5. 'సరులు లేని దృక్ఖంజన శాబకములు' (శృ॥నై॥ 3.90) అనే ప్రయోగాన్ని బట్టి 'సరి' శబ్దము ఏకవచనానంతం తఱచుగా నగుననియు, అరుదుగ బహువచనాంతమౌతుందని చెప్పవచ్చు.

6. ద్వితీయా విభక్తి - కూర్చి అనే ప్రత్యయం నన్నయ, నన్నెచోడులలో లేదు. తిక్కనలో ఒకే ప్రయోగం ఉండగా శ్రీనాథునిలో 57 సార్లు ప్రయోగింపబడింది.

7. 'పొంటెన్' ప్రత్యయం శ్రీనాథునిలో మూడు పర్యాయాలు మాత్రమే ప్రయోగం. నన్నెచోడునిలో లేవు.

8. కోసము - అను పదము చతుర్థీ విభక్త్యర్థ కావ్యయంగా ఉంది. కన్నడంలో 'ఓస్కర' శబ్దంతో సంబంధించిందని' చెప్పవచ్చు.

9. కన్న - కంటె వర్ణాంకానికి బదులుగా 'కన్న' వర్ణకం శ్రీనాథుని భాషలో ఉంది.

**ఉదా:** 'కాశి కన్ననునెక్కడ, గారవమున' (భీమ 2.5)

10. శ్రీనాథుని భాషలో 'యొక్క' అను విభక్తితో కూడిన ప్రయోగాలు లేవు.

11. నన్నయ, నన్నెచోడ, తిక్కన కాలాల్లో లేని అనుబంధ ప్రత్యయాలు శ్రీనాథుని కావ్యజాలంలో విరివిగా వాడుక చేశారు.

| | | | |
|---|---|---|---|
| 1. | అనుసరించి:- | 'ఋషుల ననుసరించి యేతెంచుచుండె' | (భీమ 4.179) |
| 2. | కూడ:- | 'అతి పరిశ్రాంతిఁబొంది కూడ రెండవ రతికి' | (శృ॥నై॥ 8.84) |
| 3. | క్రింద:- | 'ఏమి చెప్పనిట క్రింద బలారికి' | (శృ॥నై॥ 4.28) |
| 4. | తప్పు:- | చల్లని చోటుదప్పనడచుకొని' | (కాశీ 5.74) |
| 5. | దాక:- | కలయ వచ్చిన దాక గడియకాలంబు | (ప॥వీ॥ 83) |
| 6. | -పై:- | కనక స్యందనంబు పై | (శృ॥నై॥ 6.80) |
| 7. | -పయి:- | మోవిపయి | (భీమ 1.3) |
| 8. | -పయిన్:- | మోవిపయిన్ | (హర 4.19) |
| 9. | -పైన్:- | సుతపైన్ | (హర 4.45) |
| 10. | -పైన:- | భారతీదేవి పద్మజుపైన ఁజల్లె | (భీమ 5.121) |
| 11. | మాత్రంబ:- | కోపం చింత మాత్రంబ చాలునని పలికి | (శృ॥నై॥ 8.77) |
| 12. | -మీఁద:- | కెమ్మోవి మీఁద | (శృ॥నై॥ 2.26) |
| 13. | -మీఁదన్:- | ఇలమీఁదన్ | (శృ॥నై॥ 8.137) |
| 14. | -మీఁదట:- | కోటలమీఁదట | (భీమ 1.104) |
| 15. | -మీఁదటన్:- | అరుంగుమీఁదటన్ | (హర 2.41) |
| 16. | వద్ద: < యొద్ద:- | కుమారుని తనయొద్దకుంగొని వచ్చుటయు | (కాశీ 4.68) |

## 13.2.7 క్రియా రూప నిర్మాణం:-

1. సామాన్య ధాతువులను ఐదు తరగతులుగా విభజింపవచ్చును.

| | | |
|---|---|---|
| మొదటి తరగతి ధాతువులు | 478 | శ్రీనాథుడు ప్రయోగించిన ధాతువులు |
| రెండవ తరగతి ధాతువులు | 112 | |
| మూడవ తరగతి ధాతువులు | 103 | |
| నాలుగవ తరగతి ధాతువులు | 8 | |
| ఐదవ తరగతి ధాతువులు | 14 | |

2. సంశ్లిష్ట ధాతువులను రెండు తరగతులుగా విభజింపవచ్చును.

(ఎ) ఆచ్ఛిక సంశ్లిష్ట ధాతువులు - 494

(బి) తత్సమ సంశ్లిష్ట ధాతువులు - 571

3. సంయుక్త ధాతువులు

(ఎ) ఆచ్ఛిక సంయుక్త ధాతువులు - 149 అనుబంధ ధాతువులతో కూడి రెండంశములతో 928
12 అనుబంధాలతో కూడి మూడంశాలతో 59
1 అనుబంధ ధాతువుతో కూడి నాలుగంశాలతో 2

(బి) తత్సమ సంయుక్త ధాతువులు - 17 అనుబంధ ధాతువులతో కూడి రెండంశాలతో 31
2 అనుబంధ ధాతువులతో కూడి మూడంశాలతో 2.

1. **సామాన్య ధాతువులు:-**

1. చుకారాంత, యుకారాంత ధాతువులు రెండును ఏకకాలంలో శ్రీనాథునిలో ప్రయుక్తము.

**ఉదా:** త్రోచు - త్రోయు, మోచు - మోయు, రాచు - రాయు

2. క్రియా ప్రాతిపదిక రూపాలు శ్రీనాథునిలో వ్యతిరేకార్థము నందు మాత్రమే ప్రయోగింపబడినవి.

**ఉదా:** ఉఱక - ఉఱరు, కానక, మరక, పాయక, కొంకక, కొతకక, పాఱక.

3. 'ఉదిత' అను క్రియను ప్రాచీనులు 'కొను' చేర్చి సంయుక్త క్రియగా వాడారు. కాని శ్రీనాథుడు సామాన్య క్రియగా వాడాడు.

**ఉదా:** 'ఉరలె పాతాళ భువనంబుల్, ఉదిలెనభము' (భీమ 4.69)

4. 'మఱచు' ధాతువునకు వ్యతిరేక ప్రార్థనార్థకమున 'మఱవకుము' అనురూపమేర్పడవలెను. కాని శ్రీనాథునిలో 'వ'కారము లోపించినపుడు పూర్వ స్వరానికి దీర్ఘము వచ్చుట కలదు.

చిత్తమందున్మఱామది (హర 2.131)

తిక్కనలో 'మఱా'కుము (ఉద్యో 4.720)

వెఱచు ధాతువునకు 'వ'కారము లోపింప జేసి 'వెఱకుము' (కాశీ 5.71) అని కూడా శ్రీనాథుడు ప్రయోగించాడు.

5. 'వలచు' ధాతువు వ్యతిరేకార్థము నందు రూపద్వయాన్ని పొందుచున్నది.

వలదు (శృ॥నై॥ 2.57) వలవదు (శృ॥నై॥ 2.83)

6. 'పోవు' అను ధాతువు ఈ క్రింది అర్థాల్లో శ్రీనాథుడు ప్రయోగించాడు.

1. కాకయు అనునర్థంలో - నీకు చంపంగ వచ్చుఁబోనియ మనిష్ఠ
   దల్లి కోర్వంగ వచ్చుఁబో ధైర్యగరిమ (హర 2.62)
2. దొంగలింపబడు, అపహృతమగు - భిక్షాపాత్రము పోయెనంచు మదిలో
   బెగ్గిల్లగా నేటికిన్ (భీమ 4.100)
3. తీఱు, అడుగు అనునర్థంలో - సలిలంబు దిప్పవోఁద్రాగిన వారికి (శృ॥నై॥ 2.81)

2. **సంశ్లిష్ట ధాతువులు:-** ఒక క్రియా ప్రాతిపదికకు అనుబంధముగ అస్వతంత్రమైన ప్రత్యయం చేరటంచే ఈ సంశ్లిష్ట ధాతువులేర్పడును. క్రియా ప్రాతిపదికాంతమున చేరు ప్రత్యయాలననుసరించి క్రియలను మూడు విధములుగా విభజింపవచ్చును.

1. 'ఇంచు' ప్రత్యయాంతములు
2. 'ఇల్లు' ప్రత్యయాంతములు
3. తదితరములు

1. ధాతువులకు -ఇంచు / -ఇల్లు అనే ధాత్వీకరణ ప్రత్యయం గాని, సకర్మక, ప్రేరణార్థక ప్రత్యయాలు గాని చేరటం చేత శ్రీనాథుని భాషలో సంశ్లిష్ట ధాతువులేర్పడుతున్నాయి. వీనిని రెండు తరగతులుగా విభజించవచ్చు.

**ఉదా:** ప్రవర్తిల్లు, అతిశయిల్లు, అంకురించు, అంగీకరించు.

(ఎ) అచ్చిక సంశ్లిష్ట ధాతువులు, (బి) తత్సమ సంశ్లిష్ట ధాతువులు

శ్రీనాథుడు ప్రయోగించిన కొన్ని క్రియలకు సోదర భాషలైన తమిళ, కన్నడ పదములు సరూపములగ కన్పడుచున్నవి.

| | | | | |
|---|---|---|---|---|
| **ఉదా:** | అంగవించు | (కన్నడ . అంగవిసు) | యత్నించు | (శృ॥నై॥ 7.46) |
| | ఆరగించు | (కన్నడ . ఆరగిసు) | తిను | (హర 2.126) |
| | ఆలకించు | (కన్నడ . ఆలిసు) | విను | (శృ॥నై॥ 3.39) |
| | కత్తిరించు | (కన్నడ . కత్తిరిసు) | ఖండించు | (శృ॥నై॥ 7.93) |
| | కుప్పించు | (కన్నడ . కుప్పిసు) | దుముకు, దూకు | (కాశీ 1.112) |
| | జాడించు | (కన్నడ . జాడిసు) | విదల్చు, దులుపు | (శృ॥నై॥ 2.5) |
| | పరికించు | (కన్నడ . పరికిసు) | పరిశీలించు | (శృ॥నై॥ 5.43) |
| | ఆవలించు | (తమిళ . ఆవలి) | బద్దలగు | (ప॥వీ॥ 99) |
| | తులకించు | (తమిళ . తులంకు) | ప్రకాశించు | (కాశీ 4.145) |
| | ధట్టించు | (తమిళ . తట్టు) | అదలించు | (హర 6.17) |
| | గలబరించు | (కన్నడ . గలబరిసు) | తొలుచు, చిలుకరించు | (శివ 3.92) |

2. పూర్వ కవులు ప్రయోగించని '-ఇంచు' చేర్చిన కొన్ని ఆచ్ఛిక సంశ్లిష్ట ధాతువులను శ్రీనాథుడు విశిష్టంగా ప్రయోగించాడు.

| | | |
|---|---|---|
| ఇవతాళించు | (చల్లనగు) | (శృ॥నై॥ 3.34) |
| కలమరించు | (కలతచెంజు) | (శివ 3.92) |
| కులుకరించు | (శబ్దింపఁజేయు) | (కాశీ 7.185) |
| కుస్తరించు | (లాలించు) | (కాశీ 2.43) |
| గుమ్మడించు | (పూరించు) | (క్రీడా 226) |
| గోడగించు | (పోటీపడు) | (కాశీ 4.296) |
| తవళించు | (గల్లుగల్లుమను) | (కాశీ 3.241) |
| దిచ్చరించు | (ఉబికివచ్చు) | (క్రీడా 93) |
| పంచారించు | (అతిశయించు) | (కాశీ 6.127) |
| పచరించు | (ప్రకటించు) | (హర 4.11) |
| పటుతాళించు | (ఇటునటు బెళుకగజూచు) | (క్రీడా 75) |
| పుక్కిలించు | (గండూషించు) | (భీమ 1.98) |

3. కొన్ని తత్సమ ధాతువులు కాలక్రమాన కొన్ని మార్పులకు లోనై ఆచ్ఛిక ధాతువులగును.

అతకరించు ( < సం. అధఃకరించు) క్రింద పఱచు (హర 3.44)

అప్పళించు ( < సం. అప్పాల . కన్నడ . అపళిసు) ఉత్సహించు (శృ॥నై॥ 1.62)

4. ఈ క్రింది ప్రాతిపదిక తద్భవముగా కన్పించుచున్నది.

ఉప్పతిల్లు ( < ప్రా. . ఉప్పత > సం. ఉత్పత్) సంభవించు (భీమ 5.9)

**తత్సమ క్రియా ధాతువులు:**

1. మూడు సర్గలతో కూడిన తత్సమ ధాతువులును శ్రీనాథుని భాషలో కలవు.

సముద్వీక్షించు (< సమ్ + ఉత్ + వి + ఈక్ష్ + ఇంచు) (కాశీ 3.201)

సముపాశ్రయించు (< సమ్ + ఉప + ఆ + శ్రయ్ + ఇంచు) (హర 6.119)

2. ఈ క్రింది తత్సమ ధాతువులను శ్రీనాథుడు విశిష్టంగా ప్రయోగించాడు. ఇట్టివి ఇతర కవలలో విరళము.

i. **అభినిర్మించు:** (< అభి + నిర్మించు) నిర్మాణము చేయు (భీమ 2.75)

ii. **అభిమర్శించు:** (< అభి + మృశ్ + ఇంచు) తాఁకు, పొందు (కాశీ 3.26)

సాధారణంగా 'మృశ్' ధాతువునకు 'వి', 'పరా' అను ఉపసర్గలు చేర్చి ప్రయోగించుట ప్రసిద్ధము.

iii. **ఆలిఖించు:** (< ఆజ్ + లిఖించు) (చిత్తరువులు) వ్రాయు (శివ 2.53)

గుణాది మార్పులు లేక యిట్లు ప్రయోగించుట శ్రీనాథుని ప్రత్యేకత.

iv. **ఆస్ఫోటించు:** (అగ్నికణములు) మండు (భీమ 4.60)

v. **నిర్భర్త్సించు:** తిరస్కరించు (శృ॥నై॥ 8.72)

ఇట్లాంటి ధాతువులను శ్రీనాథుడు తప్ప తదితర కవులు ప్రయోగింపలేదు.

vi. **ఇలాంటివే:** ఉపస్తరించు - అభిఘరించు (భీమ 2.135)

ఉజ్జృంభించు - చెలరేగు (హర 7.63)

ఉద్దండించు - అతిశయించు (కాశీ 1.52)

vii. **ధర్షించు:** అవమానించు (హర 3.9) - ఇట్టి అప్రసిద్ధ తత్సమ ధాతువులను ఎవ్వరు సాధారణముగా ప్రయోగించరు.

ఉదా: మహర్షుల ధర్షించి పితరుల బ్రతి బంధించి (హర 3.9)

viii. **ఈ క్రింది ప్రయోగమున:** ఇంచు ప్రత్యయం చేరకుండానే పరిణామం చెందటం కన్పిస్తుంది.

'అవధారుదేవ' (అవధరించు అనటానికి) (శృ॥నై॥ 8.91)

ix. **'అచ్చు, కుమ్ము':** అను ధాతువులకు 'కాచు' అను ప్రయుక్తమై 'అచ్చికాచు' (పూచీపడు) 'కుమ్ముకాచు' (కుమ్ముదగ్గర చలిపోవుటకై శరీరాలను కాచుకొను) అనే అర్థంలో శ్రీనాథుడు విశిష్టంగా ప్రయోగించాడు.

x. 'చేరు' అను అకర్మక క్రియ సాధారణంగా సకర్మకం అయ్యేప్పుడు -పుగాగమం వస్తుంది.

'చేర్చంగ' - (కాశీ 1.37) అన్నది అపవాదం

xi. 'ప్రబలు' అను క్రియకు 'ఇంచు' చేర్చితే సంశ్లిష్ట ధాతువవుతుంది. కాని శ్రీనాథుడు సామాన్య ధాతువుగా గ్రహించి 'అంధకారంబు ప్రబలె' (భీమ 2.35). దీనిని అనేక పర్యాయాలు వాడాడు.

3. **సంయుక్త ధాతువులు:-** నామరూపమునకు గాని, క్రియా ప్రాతిపదిక రూపమునకు గాని, అన్నంతమునకు గాని, విశేషణ రూపమునకు గాని, క్త్వార్థక రూపమునకు గాని, రెండు గాని అనుబంధ క్రియలు చేరితే శ్రీనాథుని భాషలో సంయుక్త ధాతువులేర్పడుచున్నవి.

ఇట్టి సంయుక్త ధాతువులు తిరిగి రెండు విధములు.

1. ధాతు పల్లవములు, 2. శబ్ద పల్లవములు

1. **ధాతు పల్లవములు:** పూర్వావయవము క్రియా ప్రాతిపదికయై యుండి, తరువాతి అవయవములు కూడ ధాతువులై యుండి విలక్షణమైన అర్థాన్ని బోధించు శబ్దాల కూడిక ధాతు పల్లవమని యిట వ్యవహరింపబడినది.

**కొనియాడు:** పొగడు, స్తుతించు (శృ॥నై॥ 7.9)

(కొను: గ్రహించు, తీసికొను, ఆడు: నర్తించు)

**ఇచ్చిపుచ్చుకొను:** తిరిగి పుచ్చుకొను (శృ॥నై॥ 7.107)

(ఇచ్చు: ఒకనిది మరియొకనికి ఆధీనము చేయు)

(పుచ్చు: పంపు, కొను: గ్రహించు)

2. **శబ్దపల్లవములు:** పూర్వావయవము క్రియా ప్రాతిపదికయే కావలయునను నియమము లేదు. పారవయవము మాత్రము ధాతువే కావలెను.

**కలకూడు:** సిద్ధించు, నెఱవేఱు (కాశీ 7.124)

(తల: శిరస్సు, కూడు: చేరు)

**కాలూదు:** కాలుపెట్టు, కాలుమోపు (శృ॥నై॥ 5.127)

(కాలు: పాదము, ఊదు: గాలితో నిప్పును రే(గజేయు)

**నోరూరు:** ఆపేక్ష కలుగు (హర 3.88)

(నోరు: ఆస్యము, ఊరు: లోపలి నుండి ద్రవము పైకి వచ్చు)

## 13.2.8 ఉపసంహారము :-

శ్రీనాథుని భాషను పరిశీలించి అందలి వైశిష్ట్యాన్ని పేర్కొనుట అనంతం. ఇందు సార్వనామికానుబంధాలు, సామాన్య సమాపక క్రియలు, సంయుక్త సమాపక క్రియలు, నామిత క్రియలు, అకర్మక - సకర్మక - ప్రేరణార్థకాలు - అసమాపక క్రియలు భూతార్థక ధాతుజ విశేషణాలు, క్రియా విశేషణాలు, పద కల్పాలు మొదలైన వానిని ఇంకా పేర్కొనవలసి ఉంది. స్థలా భావంచే వివరించుట లేదు. ఆసక్తి కలవారు ఈ క్రింది పేర్కొనిన ఆధార గ్రంథం నుండి గ్రహించగలరు.

## 13.2.9 ప్రశ్నలు :-

1. శ్రీనాథుని భాషా వైశిష్ట్యాన్ని వివరించండి.

## 13.2.10 ఆధార గ్రంథాలు :-

శ్రీనాథ భాషా పరిశీలన - ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

**పాఠం - 14.1**

# శ్రీనాథుని భాషలో అన్యదేశ్యాలు

**ముఖ్యాంశాలు:-**

- **14.1.0 లక్ష్యం**
- **14.1.1 ఉపోద్ఘాతం**
- **14.1.2 శ్రీనాథ ప్రయుక్త అన్యదేశ్యములు**
- **14.1.3 అన్యదేశ్యములకు వ్యుత్పత్తి - వివరణము**
- **14.1.4 అన్యదేశ్యములు - ధ్వని పరిణామము**
- **14.1.5 సమాసాల్లో ఒక అంగము అన్యదేశముండుట**
- **14.1.6 కన్నడము నుండి వచ్చిన ఎరవు పదాలు**
- **14.1.7 తమిళము నుండి వచ్చిన ఎరవు పదాలు**
- **14.1.8 కొన్ని అన్యదేశ్యములకు ఆశ్రయములు మృగ్యము**
- **14.1.9 ప్రశ్నలు**
- **14.1.10 ఆధార గ్రంథాలు**

## 14.1.0 లక్ష్యం:-

శ్రీనాథుడు రచించిన కావ్యాలన్నింటిలో ప్రయోగించిన అన్యదేశ్యాలను పేర్కొని, ఇవి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గానీ ఏ భాష నుండి ఎరవు పదాలుగా గ్రహించిందీ వివరించటం. అంతేగాక అన్యదేశ్యాలలోని కొన్ని పదాలు ధ్వని పరిణామాన్ని పొందిన విషయం తెలుసుకోవడం. కన్నడ - తమిళ భాషల నుండి వచ్చిన ఎరవు పదాల వివరణ ఇందులో చర్చించటం జరుగుతుంది.

## 14.1.1 ఉపోద్ఘాతము:-

తెలుగు భాషను చారిత్రకంగా పరిశీలించిన ప్రాచీన దశలో తత్సమ - తద్భవ పదజాలం ఎక్కువగా చేరినటుల చెప్పవచ్చు. తిక్కనలో ఒకటో, రెండో అన్యదేశ్యాలు కన్పించినా, శ్రీనాథుని భాషలో అన్యదేశ్య పదజాలం ఎక్కువగా వాడుకలోనికి వచ్చింది. అన్యదేశ్యాలను ప్రయోగించడంలో శ్రీనాథుడు ప్రథముడు కాకపోయినప్పటికీ ప్రముఖుడు. మూల భాష నుండి సంక్రమించినవి దేశ్యములు తదితరములు అన్యదేశ్యములు. మహమ్మదీయుల పరిపాలనాకాలంలో అరబ్బీ, పారశీక భాషా పదాలు, తెలుగు వారి రాజకీయ, సాంఘిక రంగాల్లో వ్యవహారంలోకి వచ్చాయి.

13 వ శతాబ్దం వరకూ జన సామాన్యానికి అరబ్బీ, పారశీక శబ్దాలతో అంతగా పరిచయం కలగలేదనే చెప్పవచ్చు. మహమ్మదీయులు అల్లాయుద్దీన్ దండయాత్రతో పదుమూడవ శతాబ్దాంతమున దక్షిణ దేశంలో చొరబడ్డారు. అప్పటి నుండి వారి శబ్ద జాలం కొద్ది కొద్దిగా తెలుగులో ప్రవేశించడం మొదలైంది. ఆ మహమ్మదీయ పాలకులతో మంచి సంబంధం కలిగి ఉండటానికి కనీసం కొందరు ముఖ్యోద్యోగులు వారి రాజ భాష అయిన పర్షియను నేర్చుకోవలసి వచ్చింది. వీరభద్రా రెడ్డి మంత్రి అయిన

బెండపూడి అన్నయామాత్యులు (క్రీ॥శ॥ 1420) పర్షియను, అరబ్బీ, టర్కీ భాషలను నేర్చుకొన్నాడని శ్రీనాథుడు భీమ ఖండంలో చెప్పాడు (భీమ 1.73).

పారసీకాది అన్యదేశ భాషల నుండి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా మరాఠీ భాషా ముఖమునగానీ తెలుగులో చేరిన పదాలను, మరాఠీ భాషకు నిసర్గములయి సంసర్గ వశాస తెలుగులో ప్రవేశించిన పదాలను అన్యదేశ్యాలని ఈ వ్యాసంలో పరిమితార్థంలో ప్రయుక్తము. శ్రీనాథుని కాలం నాటికి ఉర్దూ ఆలూచూలూ లేని సోమలింగం.

మరత్వాడా - తెలుగు నాడులకు గల సంబంధ బాంధవ్యాలు ఇక్ష్వాకుల తాత ముత్తాతల నాటివి. తెలుగు - మరాఠీ భౌగోళికంగా పరిసర భాషలు. శాతవాహన చక్రవర్తులనాడు ఇంచు మించు నాలుగు వందల సంవత్సరాల పాటు మరత్వాడా, తెలుగునాడులు ఒక గొడుగు క్రింద కలిసిమెలిసి ఉన్న విషయం జగమెరిగిన చరిత్ర. మొదట్లో ఆదాన ప్రదానాలకు మహారాష్ట్రీ ప్రాకృతం ప్రముఖ పాత్ర వహించినట్లు చరిత్ర చెప్తున్నది. అనాది నుండి అవిచ్ఛిన్నంగా ఇటువంటి సమీప సంసర్గ సంబంధం వల్ల ఈ రెండు ప్రాంతాల్లోని వ్యవహార భాషలు పరస్పరం ప్రభావితమై ఉండటం నిర్వివాద విషయం. ఈ సంసర్గం కారణంగా తెలుగు పదాలెన్నో మరాఠీ నోళ్ళలో నలుగుడుపడి వ్యావహారిక రూపాలుగా నిఘంటువులకెక్కియు, పండిత సమ్మతిని పొంది, సాహిత్య స్థాయిని సంపాదించుకొని అక్షర రూపంలో చిర స్థాయిని పొందాయి.

## 14.1.2 శ్రీనాథ ప్రయుక్త అన్యదేశ్యములు :-

శ్రీనాథుడు 69 అన్యదేశ్యములను ప్రయోగించెను. వాని రూపాంతరాలు 7. మొత్తం 76.

| | | | |
|---|---|---|---|
| 1. అపరంజి | 2. అరబీ | 3. అసలు | 4. అసివారు |
| 5. కత్తలాని (ఖత్తులాణము) | 6. కప్పలి | 7. కమరు | 8. కాకితము |
| 9. కిచ్చడి | 10. కుందనము | 11. కుల్లా | 12. కోహళి |
| 13. ఖర్చు | 14. ఖుని | 15. గంజాయి | 16. గొంగడి |
| 17. గోవ | 18. గులాము | 19. గసగస | 20. గాగరా |
| 21. చబుకు | 22. చామలా | 23. చావడి | 24. చికిలి |
| 25. జబ్బు | 26. జరి | 27. జలపోసనము | 28. జోఁగు |
| 29. డమామి | 30. డేరా | 31. తరుణా సీరి | 32. తవాయి |
| 33. తాయెతు | 34. తేజీ | 35. త్రాసు | 36. తుర్కల |
| 37. దుకాణము | 38. పంజారి | 39. పంజు | 40. పండువా |
| 41. పరాకు | 42. పారసి | 43. పేషణి | 44. బరాబరి |
| 45. బాఁకు | 46. బాజారు | 47. బిబ్బీ | 48. బొందిలి |
| 49. మసీదు | 50. ముఖమల్లు (ముఖములు) | 51. మైజారు | 52. మోళము |
| 53. రమణా | 54. రావు | 55. రోజు | 56. లాహిరి |
| 57. బంగ | 58. వలికా | 59. వల్లి | 60. సన్నాయి |

61. సమ్మాను　62. సరిహద్దు　63. సహా　64. సురతాణి (సురతాణ, సుర(త్రాణ, సురధాణి, సురధాణ, సురధాని)

65. సొగటాలు　66. సేబాసు　67. హజారము　68. హద్దు

69. హురుముంజి

## 14.1.3 అన్యదేశ్యములకు వ్యుత్పత్తి - వివరణము :-

మరాఠీ, పారసీ, అరబీ భాషల్లో (ప్రవర్తింపబడి తెలుగులోకి (ప్రవేశించి శ్రీనాథ (ప్రయుక్తమైన అన్యదేశ్యాలకు వ్యుత్పత్తి, వివరణలు:

1. **అపరంజి :** పుటము పెట్టిన బంగారము.

'గురువైన <u>యపరంజి</u> ముత్తెపు నత్తు మోవి పై' ((క్రీ॥వీ॥ 62)

< పారశి : ఆఫ్రంజ్ - పడమటి సీమ వారు పరంగులు.

: ఆఫ్రంజ - ఈజిప్టు దేశంలోని ఒక పట్టణము.

: ఆఫ్రంజీ - పాశ్చాత్యుడు, వారి రాకపోకలతో ఎక్కువగా వాడుకకెక్కిన ఒక దినుసు మేలిమి బంగారము.

అపరంజి < అరబ్బీ : ఆవ్రంజియా - విలాతి సీమకు సంబంధించిన ((బౌణ్యము - పు. 1404)

2. **అరబీ :** అరబ్బీ దేశపు భాష.

'అరబీ తురుష్క భాష' .........(భీమ 1.73)

< పారసి, అరబ్ : కౌశల్యము, నేర్పు, ధార్మికత్వము, (ప్రతిభ, అక్కఱ.

3. **అసలు :** మూలము, మొదలు.

'అమ్మనీయల్లుని నేసలేనే నెరుంగ ........' (ప॥వీ॥ 73)

< మరాఠీ : అసల్, అస్సల్, పురాతనము, మూలము.

అసలీ = మౌలికము

< అరబీ : అస్ల్ = మూలము, వాస్తవము

< పారసీ : అస్ల్ = (ప్రాచీనము, అస్లాఫ్, పూర్వులు

పితృదేవతలు, ఇస్లాఫ్, సంచకరమిచ్చుట.

4. **అసివారు :** వాహ్యాళి, సవారీ మా(గము

'ఎవ్వాఁడు నలువ తీరెక్కి యష్టాదశ ద్వీపాళి యసి వారు దిరిగె లీల' (కాశీ 4.194)

'అస్వార్' అను పారసి పదము దీనికి అసలు మాతృక.

< మరాఠీ : అసివార = రౌతు, అశ్వారోహకుడు

5. **కత్తలాని :** ఖత్లాన దేశపు గుఱ్ఱము.

'అమర వల్లభు హరితోనుల్ల సమాడం జాలెడు' - తెల్లని యొకకత్తలాని తేజీ హయమున్ (శృ॥నై॥ 6.96)

< పారసి : ఖత్‌లాన్ : బదఖ్షాన్ దేశములోని 'ఖత్‌లాన్' అను మండలము. ఇది పద్మరాగాలకు ప్రసిద్ధి.

ఖత్‌లానీ = ఖత్‌లాన దేశ సంబంధి.

ఖతలాన దేశపు మేలి జాతి గుఱ్ఱము.

< అరబీ : ఖత్‌ల్ = కుటిల ప్రచారము.

6. **కమరు :** ఒడ్డాణము, మొలనూలు.

'కటి మండలము మీఁద వజ్రాల కమరుగర్వంబు సూప' (కాశీ 3.240, 7.148)

< మరాఠీ : కమర, కంబర, కమ్మర = నడుము, కటిస్థలము, కమ్మర్ బొంద్ = వడ్డాణము

< పారసి : కమర్ = నడుము; కమర్ బంద్ = వడ్డాణము

7. **కాకితము:** లేఖ, పత్రము

'కాకితమందలి వర్ణ పద్ధతుల్' (భీమ 1.74)

< మరాఠీ : కాగద్, కాకితము, పేపరు

< పారసి : కాఘజ్, కాఘజ్ = కాగితము, లేఖ, పత్రము

సంస్కృతమున 'కాఘజ్'

8. **కిచ్చడి :** నానా వస్తువులు చేర్చి వండు చిత్రాన్న విశేషము.

'చారులుఁ తియకూరలుఁ బుచ్చడులుంగిచ్చడులును' (కాశీ 7.85)

< మరాఠీ : ఖిచడీ, ఖిచిడీ

< పారశి : కిచ్‌రీ = పప్పు, బియ్యము, వెన్న - వీనితో తయారు చేయు భారతీయుల వంటకము.

9. **కుందనము :** మేలిమి బంగారు.

'కుందనపుఁబ్రైఁడి కంటకము బోలు?' (శృ॥నై॥ 6.106)

'పదియారు వన్నె కుందనపు ఁదగడు' (భీమ 2.55)

< మరాఠీ : కుందన

< పారసి : కుందన్ = పరిశుద్ధలోహము

< గుజరాతీ : కుందన్ = మేలిమి బంగారు

10. **కుల్లా :** పట రచిత మకుటము.

'కుల్లా వెట్టితిఁగోక సుట్టితి......' (శ్రీనా॥చాటువు)

< పారసి : కులాహ్ : నల్లగొఱ్ఱెపిల్ల తోలుతో కూచిగా చేసి ముస్లిము సాధువులు, దర్వేషులు ధరించెడి టోపీ.

కులాహ్ : రాజు, ప్రభువు

11. **కోహళి** : శీర్షాచ్ఛాదనము

'మౌళింగోహళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్న వేళన్' (హర 7.109)

< మరాఠీ : ఖోళ = ఆచ్ఛాదనము, పొది

< గుజరాతీ : ఖోళీ ; గౌసెన, పరుపు గలీబు

12. **ఖర్చు** : వ్యయము.

'అన్నపు ఖర్చున కాకు పోకులకు' (ప॥వీ॥ 69)

< మరాఠీ : ఖర్చ : వ్యయము, ఖర్చణేఁ= ఖర్చు చేయు

< పారసి : ఖర్చ్ = ఖర్చు, ఖర్చీ = ప్రయాణ సంబంధమైన వ్యయము, రోవెల < అరబ్బీ

13. **ఖుసి** : సంతోషము, విలాసము

'ఖుసిమిఱన్ సుర ధాణి నిండు కొలువై కూర్చున్నచో' (హర॥పీ 22)

< మరాఠీ : ఖుశీ, ఖుశ, ఖూశ (ష) : ఆనందము, సుఖము

< పారసి : ఖుసీ.

14. **గంజాయి**: గంజాయి ఆకుతో చేసిన మత్తు పదార్థము.

'గంజాయి దినఁగనుత్కంఠఁ జేసిన వాఁడు' (శివ రా॥ 3.62)

< మరాఠీ : గాంజా

15. **గసగస** : ఒక దినుసు మసాలా విత్తులు.

'గసగస యెసక మెసఁగె' (కాశీ 3.23)

గసగసలు (కాశీ 7.185)

< పారసి : ఖష్ఖాష్ = గసగసాలు

16. **గాగరు** : స్త్రీలు కట్టుకొనుపావడ.

'వెన్నెల గాగరాజిలుగువస్త్రమున కుచ్చెళులందు' (శ్రీనా॥ చాటువు)

< మరాఠీ : ఘాగ్రా : స్త్రీల పావడ

ఘాగ్రీ : పిల్లల మొలనూలి గంట

17. **గులాము** : సేవకుడు, సేవకురాలు, నీచురాలు

'లంజె తల్లియె యిదియు గుల్లాము గాక' (క్రీడా 265)

< మరాఠీ : గులామ : కొండెగాడు, నీచుడు, తొత్తు కొడుకు, బానిస.

< పారసి : గులామ్ < అరబ్బీ

**18.** **గొంగడి** : కంబళి

'గొంగడి మేలు పచ్చడము' (చా॥మం॥ 1.128)

< మరాఠీ : ఘోంగ = దుప్పటి, ఘొంగడీ.

**19.** **చబుక** : కొరడా, చేఱుకోల

'వాజిశవంబుల వడి మీద నెక్కి చబుకుల గొట్టుచు చనుమనువారు' (ప॥లీ॥ 119)

< మరాఠీ : చాబూక = కొరడా

< పారసి : చాబుక్ = కొరడా, చాబుక్ బాజి = చబుకుతో కొట్టుట

**20.** **చామలా** : ఒక రకమైన కడియములు

'చమలా కడియముల్' (ప॥వీ॥ 72)

< మరాఠీ : శామల = అబిసీనియా దేశపు సోనాలి.

**21.** **చావడి** : కొలువు కూటము, రచ్చ, కార్యస్థానము.

'పెద్ద సావళ్ళ - చేరి భాషింపుచు' (ప॥వీ॥ 28)

< మరాఠీ : చావడి = కొత్వాలు, చావడి, రచ్చబండ

< సం. చౌహాట (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము)

**22.** **చికిలి** : మెఱుఁగు, పదను.

'చిఱుసానఁబట్టించి చికిలి చేయించిన గంఁడ్రగొడ్డలి' (కాశీ 1.121)

'చికిలి చేసిన యడిదంబు' (శివ 4.74)

'చికిలి చేసిన తాఁమ్రంపుఁజెంబు ఁబూని' (వీధి 17)

< మరాఠీ : సికల = మెఱుఁగు

< పారసి : సక్కాల్ : మెరుగు పెట్టువాడు

< గుజరాతీ : సికల్ = మెఱుగు

< అరబ్బీ : సకల్ = మెఱుఁగు

**23.** **జబ్బు** : ఆలసము, మందము.

'జబ్బించుక లేని యొడలు' (శ్రీనాథుని చాటువు)

< మరాఠీ : జబూన = పేదవడిన

< పారసి జబ్బ్ : కృశించుట, చిక్కిపోవుట, వట్టిపోవుట, శుష్కించుట.

< అరబ్బీ : దేశ్యమని కిట్టెల్ (కన్నడ నిఘంటువు)

**24.** **జరి** : వెండి బంగారముల మొలాము.

'జరిగొన్న వెలిపట్టు జన్నిదంబుల తోడ
రత్నాల తారహారము ధరించి' (శివ 2.90)

'జరిగొన్న వెలిపట్టు జన్ని దంబుల'(క్రీడా 42)

< పారసి : జర్, జరీన్ = బంగారు, ధనము,

జర్‌తార్ : బంగారు పోఁగుతో చేయబడిన

జర్ (బంగారు) + తార్ (దారము)

తెలుగున 'జరతారు' - 'జలతారు' గా పరిణమించుట వర్ణవిభేదనము.

25. **జలపోసనము** : బంగారు పై పూత.

'బంగారు జల పోసనము తోడి ప్రన్నని పట్టు తోరము ధరించి' (క్రీడా॥ 1.42)

'పైఁడి జలపోసనపు కనీసంబు పట్టుబంతి' (కాశీ 6.161)

'పసిఁడి జలపోసనము తోడనెసక మెసఁగు' (హర 5.55)

< పారసి : జర్‌పోష్ = బంగారు లేసుపని. జర్ (=బంగారు) + పోష్ (=ఆచ్ఛాదనము, పూఁత)

26. **డమామి (యీ)** : డిండిమము, డంకా కంటె చిన్నదియయిన చర్మ వాద్యము.

'డమాయీలు' (ప॥వీ॥ 4)

< మరాఠీ : ఢమామి

27. **డేరా** : గుడారము.

'జగడంపు డేరాలు' (ప॥వీ॥ 36)

< మరాఠీ : డేరా = గుడారము

28. **తాయెతు** : దండనో మెడనో మొలనో కట్టుకొను రక్షా భూష.

'మేనికి రక్షయై మించు తాయెతలు' (ప॥వీ॥ 17)

'దంటతాయెతులు' (ప॥వీ॥ 72)

< మరాఠీ : తావీజ = రక్షాభూష

< పారసి : తవీజ్ = తాయెతు, రక్షాబంధము

< అరబ్బీ : తఆవీజ్ = శరణుకోరుట, రక్షాణార్థము, సర్వేశ్వరుని ప్రార్థించుట.

29. **తుర్క** : ఇస్లాము మతానుయాయి.

'తుర్కల మశీదు. (క్రీ॥డా॥ 149)

< మరాఠీ : తుర్క = మ్లేచ్ఛుడు, తురుష్క జాతీయుడు

< పారసి : తుర్క్ = ఒక జాతి, 'తురుష్క' పదము క్రీ॥పూ॥ మున్నూ బేండ్ల నాటి ప్రాకృత భాషా గ్రంథాల యందు కనపడటం వల్లనూ, తెలుగు నందలి 'తుర్క'కు సమీప మాతృకను నిర్ధారించుట కష్టము.

30. **తేజి(జీ)** : మేలుజాతి గుఱ్ఱము.

'హురుముంజి బలుతేజిహరులు దెచ్చె' (హర॥ పీ॥ 26)

'తెల్లని యొక కత్తలాని తేజీహయమున్' (శృ॥నై॥ 6.96)

'పడివాగె తేజీలు పల్లకీ జోళ్ళు' (ప॥వి॥ 4)

< మరాఠీ : తేజీ : అరబ్బీ దేశపు గుఱ్ఱము

< పారసి : తార్ఘీ, తేర్ఘ్, తాజి = అరబ్బీ దేశపు గుఱ్ఱము, తాజియాన్ = అరబ్బీ గుఱ్ఱములు

31. **త్రాసు** : తక్కెడ.

'ఎవ్వాడు త్రాసుపై ఁగట్లె చందమున వంచె' (భీమ 2.77)

< మరాఠీ : తరాజూ = త్రాసు

< పారసి : తరాజు = తుల, తూకము, సమానత, న్యాయము

32. **దుకాణము** : అంగడి.

'దుకాణము మీఁదనున్న ' (శ్రీనా॥ చాటువు)

'దుకాణము పై బొందిలి దోర్తునిల్చె' (శ్రీనా॥ చాటువు)

< మరాఠీ : దుకాణ (న)

< పారసి : దుకాన్, దుక్కాన్

< అరబ్బీ : దుక్కాన్, దుకానీ = దుకాణదారుడు.

33. **పంజు** : ప్రకాశించు, రత్నములు చెక్కిన ప్రకాశము.

'పంజు మంచము డిగ్గి మంజు ఘోష' (హర 7.132)

< పారసి : పంజ్ = జ్యోతి ప్రకాశము పంజః ఐదు వ్రేళ్ళను పోలినకాగడా

34. **పరాకు** : ఉపేక్ష, నిర్లక్ష్యము.

'దమయంతి ........... పరాకు వహించి' (శృ॥నై॥ 5.106)

'రాకుమారుని చూచు పరాకుకతన' (శృ॥నై॥ 6.63)

'ఒక్క కోమలి పరాకున నుండఁగ' (శృ॥నై॥ 6.113)

'పరాకయ్యేనేనిఁ బ్రాణ వల్లభ' (శృ॥నై॥ 7.16)

< మరాఠీ : పరాఖ్, పరీఖ్ = శోధన, ఏకాగ్రత, పర్యవేక్షణ.

35. **పారసి** : ఇరేనియము భాషా కుటుంబమునకు చెంది, పారసీక దేశమున ప్రచుర వ్యవహారమున గల ఒక భాష.

'పారసి భాష వ్రాసినన్' (భీమ 1.74)

< మరాఠీ : ఫారశీ (సీ) = పారసి భాష, పారసి వాడు, పారసీకము సంస్కృతీకరణ రూపమని మరాఠీ వ్యుత్పత్తి పదకోశము.

< అరబ్బీ : ఫర్స్ = పశుపాలన

36. **పేషణి** : దూత

'పేషణి హనుమంత బిరుదాంకులగు రాచవారికి' (శృ॥నై॥ 1.32)

< మరాఠీ : పేషణ = నియోగించుట, పేషణి = రాయబారి

< సంస్కృత - ప్రేషణ = పంపుట, ఆదేశము

< ప్రాకృత - పేషణ = నియోజనము, ఆజ్ఞ, ఆదేశము

**37. పౌజు** : సేన, పటాలము.

'పౌజు పై నడిచిరి' (ప॥వీ॥ 114)

< మరాఠీ : పౌజ్ : దండు, సేన

< పారసి : పౌజ్ = సేన ; సర్ పౌజ్ : దళవాయి, సేనాపతి

< అరబ్బీ : పౌజ్ = తెలుగున 'పౌజు' ను సబిందుకముగన కొందరు పఠించుటకు హేతువు. ఇది పుంజ శబ్దభవముగా భావింపబడుట. నిర్బిందుకముగా స్వీకరించుట యుక్తి యుక్తము.

**38. బరాబరి** : ప్రభు దర్శనము నిమిత్తము గుమిగూడు ప్రజలను బగళము చేసి ఎచ్చటిక తెలుపుట.

'పటు వేత్రకుల్ బరాబరి యొనరించి' (ప॥వీ॥ 18)

'చెలగి బరాబరుల్ జేసిరి' (ప॥వీ॥ 46)

< మరాఠీ : బరోబర = సదృశము, సమానము

< పారసి : బర్ - ఆ - బర్ = సమత, సదృశము, స్పర్థ, బర్ - ఆ - బరీ = సమత్వము, సాదృశ్యము.

**39. బాఁకు** : మొలనుదోపుకొను వంకీ కత్తి.

'అలరాజు బాఁకున కవతారమొంది' (ప॥వీ॥ 2)

'పరశువుల్ బల్లెముల్ బాఁకు కాటార్లు' (పైదే)

'బాఁకుల రొమ్ములు పరియలు చేసి' (పైదే 111)

< మరాఠీ : బాఁక, బాక = వంకర, వంపు

**40. బాజారు** : విపణి వీధి యందలి జనము.

'బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్' (శ్రీనా॥ చాటువు)

< మరాఠీ : బాజా (ఝా)ర = అంగడి వీధి, సంత, సంతరోజు, బేరము,

బాజారీ = బజారునకు సంబంధించిన వర్తకుడు

**41. బిబ్బీ** : తురుష్కుల యంతఃపుర స్త్రీ.

'బిబ్బీలకుఁగాక కలవె పృథివీస్థల పై' (శ్రీనా॥ చాటవు)

< మరాఠీ : బిబి : ముస్లిము స్త్రీ యవన కన్య

< పారసి : బీబీ సత్కుల ప్రసూత యగు స్త్రీ < తుర్కీ

**42. బొందిలి** : బొందిలీ జాతి.

'బొందిలి భామ గోమునన్' (శ్రీనా॥ చాటువు)

'దుకాణము పై బొందిలి దోర్తునిల్చె ముఖ చంద్ర స్ఫూర్తి శోభిల్లగన్' (శ్రీనా॥ చాటువు)

< మరాఠీ : బుందేల్ . వింధ్య పర్వత పరిసరాలందలి ఒక దేశం

43. **మసీదు** : ముస్లిముల ప్రార్థన మందిరం.
'కర్తారుడుండు తుర్కల మసీదు' (క్రీడా 149)
< పారసి : మస్‌జిద్ = ప్రార్థన మందిరము, మసాజిద్ = మసీదులు, ప్రణిపాతము నందలి సప్తావయవములు, చేతులు, కాళ్లు, మోకాళ్లు, నుదురు.
< అరబ్బీ : మస్‌జిద్ = పూజా స్థలము ; మజూద్ = సర్వాంగా లింగిత నమస్కారము

44. **ముఖమల్లు । ముఖమాలు:** ఒత్తుగా మెత్తగా నుండు ఒక తరహా పట్టుగుడ్డ, దేశాంతర వస్త్ర విశేషము.
'ముఖముల్ల గుడ్డలు మునుగొని తెచ్చి. (ప॥వీ॥ 17)
'పై గప్పి ముఖమాలు పరుపులు వేసి' (ప॥వీ॥ 30)
< పారసి : ముఖమల్, మిఖ్‌మల్ = వెల్వెట్‌తో చేసిన, వెల్వెట్ వంటి

45. **మైజారు** : పైటకొంగు.
'మైజారుకొంగు దడిసిన బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్' (శ్రీనా॥ చాటువు)
< పారసి : మిఁజర్ = మొలకు కట్టుకొను వస్త్రము
మై (=మేను) + జాఱు = ఒడలి నుండి జాఱెడు నది కాఁబోలను భ్రాంతితో మన నిఘంటువులు చేసిన విఱుపు.

46. **మోళము** : వెండి, బంగారములోనగు వాని పై పూఁత.
'క్రొత్త పైడి మోళము గటారి భమన్నపుడిచ్చె' (శృ॥నై॥ 6.94)
< మరాఠీ : ములామా = ధాతువుల పై పూఁత, ములమ్మా = పై పూత
< పారసి : ములమ్మా = మోలామ ; మల్, ఆమ్, పూఁతలమ్మా = ప్రకాశించుట
< అరబ్బీ : మూలమ్మ ఆ

47. **రావు** : నాఁటి వెలమ దొరల పట్టపు పేరు. పేరు చివర చేర్చు గౌరవ సూచకమగు పదము. నేడు సర్వ వర్ణముల వారి నామముల చివర చేర్చబడుచున్నది.
'రావు సింగమహీ పాలు ధీవి శాలు' (శ్రీనా॥ చాటువు)
'రావు సింగవ సుధావరుడు' (శ్రీనా॥ చాటువు)
< మరాఠీ : రాఓ . రావో = ప్రభువు, రాజు

48. **రోజు** : దినము
'అయిదు రోజుల దాక' (ప॥వీ॥ 42)
< మరాఠీ : రోజ
< పారసి : రోజ్ = దినము, పగలు, సూర్యుడు.
రోజన్ = రోజులు, రోజన = ప్రతిదినము, రోజ్‌రోజు = దినదినము

ప్రాచీన పారసి : రౌచ = ఒక రోజు

49. **లాహిరి** : మాదక ద్రవ్య సేవనము వల్ల కలుగు మత్తు, మైకము.
'లాహిరి పట్టిన భాతి మదంబెక్కిన మాడ్కి' (కాశీ 2.138)
< పారసి : లహ్‌ర్, లహర్ = సారాయి మొదలైన నిషా వస్తువులు అమ్మెడికొట్టు, సానికొంప,
లహ్ = ద్రాక్ష సారాయము.

50. **లుంగ** : వస్త్ర భారము, బట్టల మోంపు.
'వెలిపట్టు జన్నిదంబుల లుంగ యంటులు వాయంగ' (క్రీడా 42)
< మరాఠీ : లుంగి = మొలను కట్టుకొను వస్త్రము
< పారసి : లుంగ ; లుంగీ = గళ్ల గళ్ల వస్త్రము ; లుంగ్ = వస్త్రపు మడత

51. **సన్నాయి** : నాగ సరము.
'శంఖ సమూహంబు సన్నాయి జోళ్ళు' (ప॥వీ॥ 4)
< పారసి : షాహ్‌నాయ్ = జయకాహళ, యుద్ధకాహళ
షాహ్‌నాయ్ = ఒక విధమైన వాద్యము, సంగీత సాధనము

52. **సమ్మాను** : చీనా దేశముల పద్ధతిలో నిర్మించిన ముక్కొయ్య పడవ.
'శరధింగప్పలి జోఁగువల్లి వలికాసమ్మాన్లఁదెప్పించు' (హర॥పీ॥ 28)
< మరాఠీ : సామాన = పరికరములు, పనిముట్లు
< పారసి : సామాన్ = వస్తువు, సాధనము
< మలయా: సమ్మన్ = మూడు పలకల పడవ
< చీనీ : సంపగ్ = మూడు పలకలతో అమర్చిన పడవ. పెద్ద ఓడను అంటి పెట్టుకొని యుండు చిన్న పడవ,
సన్ = మూడు, పన్ = పలక, పూ - పన్ = ఐదు పలకల పడవ, 'సంపన్'
అనునది సమీకరణము నొంది 'సమ్మన్' అయి 'సమ్మాను'గా పరిణమించింది.

53. **సరిహద్దు** : పరిమితి, మేర, పొలిమేర, సీమ.
'చక్కగా మిరియాల సరిహద్దు దాటి' (ప॥వీ॥ 33)
< మరాఠీ : సర్‌హద్ద = మేర, పొలిమేర
< పారసి : సర్‌హద్ = అవధి, మేర, సీమ

54. **సహా** : చక్రవర్తి, సార్వభౌముడు.
'హరిహరరాయ ఫేరోజ సహ సురధాణ గజాధిపాది భూవరులు' (హర॥ పీ॥ 24)
< మరాఠీ : శహా = రాజు, సుల్తాను
< పారసి : షహ్ . షాహ్ = అధిపతి, ప్రభువు

షాహి = రాజసంబంధి, రాజ్యము, రాచరీవి.

55. **సురతాణ** : రూ. సురతాణి, సురత్రాణ, సురధాణ, సురధాణి, సురధాని, పాలకుడు, ఏలిక.

1. "ధారా 'సురతాణ' దర్ప ధరణీ ధ్రసవీ" (కాశీ 6.309)
2. "పండువా 'సురతాణి' పావడంబిచ్చిన" (భీమ 1.38)
3. "ధారా 'సురత్రాణ' ధాటీ సమారంభ" (భీమ 1.29)
4. "ధారా 'సురత్రాణ' కటక కుంభి కుంభ కలహకారి'(క్రీడా॥ 243)
5. "ప్రబల ధారా 'సురత్రాణ' భద్రజాతి" (కాశీ॥పీ॥ 58)
6. "ఫేరోజసహా 'సురధాణ' గజాధిపాది భూవరులు" (హర॥పీ॥ 24)
7. "ఖుసిమీఅన్ 'సురధాణి' నిండుకొలువై కూర్చున్నచో" (హర॥పీ॥ 22)
8. "పండువా 'సురధాని' పావడంబంపిన భద్రేభములు" (కాశీ 1.5)

ఒక భాష వేరొక భాష నుండి పదాలను ఎరవు తెచ్చుకొనేటప్పుడు స్వభాషా వర్ణ నిర్మాణానికి అనుకూలమైన పద్ధతిలో పదాలను మార్చుకొని తమలో ఇముడ్చుకొంటుంది. పర్షియను 'సుల్తాను' పదాలకు రూపాంతరాలైన 'సురతాణ, సురతాణి, సురత్రాణ, సురధాణి, సురధాణ, సురధాని' మొదలైన ప్రయోగాలకు సరియైన వివరణలివ్వడం కష్టం.

< పారసి : సుల్తాన్ = సార్వభౌముడు, చక్రవర్తి, సర్వాధికారి

సుల్తాన = చక్రవర్తిని, రాణి

సుల్తానీ = సామ్రాజ్యము, చక్రవర్తికి సంబంధించిన

< అరబ్బీ : సుల్‌తాన్

56. **సేబాసు** : మెచ్చికోలును తెలుపు మాట.

'మెప్పించెద నేనపుడు నిన్ను సేబాసందున్' (హర 7.64)

< మరాఠీ : శాబాస = ప్రశంసార్థక పదము

< పారసి : షహ్ - బాష్ = స్తుతి, మేలు మేలని ఎలుగెత్తి కొనియాడటం

57. **సొగటాలు** : జూదం ఆడటానికి ఉపయోగించే సారెలు

'జూదమాడుటకయి సొగటాలు కొన్ని..............' (ప॥పీ॥ 45)

< మరాఠీ : సొగడే, సొగడా = శకట సంబంధమైన

58. **హజారము** : ఆస్థానము, మొగసాల

'ఇంద్రుని హజారపు మేడకుఁబ్రేఁడి కుండయై' (కాశీ 1.125)

< పారసి : హాజిరాన్ = సభాస్తారులు

హాజిర్ = సన్నిధి నుండు, సేవకు సిద్ధముగా నుండు

హాజిరీ = సభ్యులు

హుజ్రా = కొలువుకూటము, సభాస్థానము

**59. హద్దు** : అవధి, మేర.

'చక్కగా మిరియాల సరిహద్దు దాటి' (ప॥వీ॥ 33)

'దక్షిణ దేశ హద్దు తగ వివరింతు' (ప॥ఇవీ॥ 87)

< మరాఠీ : హద్ద = అవధి, మేర

< పారసి : హద్ = మేర, పొలిమేర, అవధి

< అరబ్బీ : హద్ = మితి, మేర

< గుజరాతీ : హద, హద్ద = మేర, అవధి

**60. హురుముంజి** : పారసీక జల సంధి చేరువ తీరమున గల పెద్ద రేవు పట్టణము. క్రీస్తు పూర్వము నాలుగవ శతాబ్ది నుండియు ముత్యాల గుజ్జముల ఎగుమతికి ప్రసిద్ధి. క్రిందటి దినములలో వాణిజ్య విషయకంగా ప్రాచ్య పాశ్చాత్య ప్రపంచాలకు కూడలి. ఇది పర్షియా సముద్ర తీరమందలి 'ఆర్మోజా' అను నగరము.

'చీని సింహాళ తవాయి హురుముంజి చోణంగి' (హర పీ॥ 7)

'హురుముంజి బలుతేజి హరులు దెచ్చె. (హర పీ॥ 26)

'ముక్కున హురుముంజి ముత్యాల ముంగర' (శ్రీనా॥ చాటువు)

< పారసి : హుర్‌ముజ్ = హుర్మొజ్, హుర్మాజ్. ఒక రేవు పట్టణము. ఉర్మజ్ = ప్రతి వద్దివసాదిష్ఠాన దేవత, బృహస్పతి గ్రహము. మధ్య యుగపు ప్రభుత్వాలు యుద్ధాశ్వాసాలను విస్తారంగా ఇక్కడి నుండి దిగుమతి చేసుకునే వారు. దక్షిణ భారతంలో ఉత్తమ జాతి అశ్వాలు లభింపవు. వారిని అరేబియా మొదలగు తురుష్క దేశాల నుండి తెప్పించుకొనేవారు.

అవచి సోదరులు సుగంధ ద్రవ్యాలను దిగుమతి చేసిన దేశాలు, దీవులు ఎక్కువ భాగం ఆంధ్ర దేశానికి తూర్పున ఉన్నాయి. ప్రాక్యముద్ర దేశాలు, దీవులు, కొన్ని పశ్చిమ దేశాలు ఉన్నాయి. అందు కప్పలి, జోఁగు, వల్లి వలికా నౌకల పేర్లు. వల్లి వలికా చిల్లర నైకలు.

**ఈ క్రింది అన్యదేశ్యాలకు వ్యుత్పత్తి వివరణములీయబడ్డాయి.**

**61. కప్పలి** : సరకుల రవాణాకు ఉపకరించే ఒక దినుసు. విలాతి ఓడ (హర॥పీ॥ 29)

< మలయా - కప్పల్ = (ఓడ)

స్వదేశీ ఓడ - ఈ పదము తమిళ పదవికారము. దీనికి నాలుగైదు తెరచాపలుంటాయి. దీని అడుగు భాగం తుఫానులకు నిలవటానికై ముప్పేటగా కట్టైతో నిర్మించేవారని వర్ణింపబడింది.

**62. గోవ** : భారతదేశపు పశ్చిమ తీరపు రేవు పట్టణం. ఇది ఒక గొప్ప వర్తక స్థానము. పశ్చిమ ఖండాల నుండి వచ్చే సరుకులన్నీ ఈ రేవు గుండా దేశంలోకి వస్తాయి. యుద్ధాశ్వాలు, జవ్వాది వంటి సుగంధ ద్రవ్యాలు, ఈ రేవు మూలాన దిగుమతి అవుతాయి. పూర్వనామము గోమంతమట.

'తరుణా సీరి తవాయి గోవ రవణా స్థానంబులం' (హర॥వి॥ 28)

< మరాఠీ : గోవేఁ = గోవా పట్టణం

63. **జలనోంగి:** మలయా ద్వీప కల్పమునందలి ఒక ప్రదేశం. ఆఫ్రికా తూర్పు తీరమందలి 'జీలాన్' రేవు పట్టణం కావచ్చు. జలనోంగియను ప్రదేశం నుండీ బంగారపు మొలకలు (పలుకు బంగారం) మనదేశానికి వచ్చేది.

'జలనోంగి బంగారు మొలకదెచ్చె' (హర॥వి॥ 26)

64. **జాళువా :** మేలిమి బంగారు.

'కమ్మ విలుకాని జాళువా బొమ్మ యనగ' (శ్రీనా॥ చాటువు)

'చెలగుచు జాళువా చీర ధరించి' (ప॥వీ॥ 65)

దీని మూలం అవిజ్ఞేయం. బ్రౌనుదొర ఊహించినట్లు జాళువా అనేది ఏదో ఒక స్థల వాచక సంబంధి కావచ్చును, ఇంకను విచారించవలసి ఉన్నది.

65. **జోఁగు :** వెదురు బద్దలను, వేప బెత్తాలను పేర్చి అల్లిన తెర చాపలు. మూడు నుండి పంద్రెండు దాకా అమర్చేటువంటి పెద్ద ఓడ.

'కప్పురపు జోఁగుఁగంటిమి కంటి మనుచు' (శృ॥నై॥ 3.101)

'సుడివడ్డ ముత్యాల జోఁగు వోలె' (కాశీ 1.138)

'వడి చిక్కిన జోఁగు నుంబోలె' (కాశీ 2.98)

'శరధిన్ గప్పలి జోఁగు వల్లివలికా' (హర॥పీ॥ 28)

ఈ 'జోంగ్' జాపనీ భాషలోనిది. ఈ ఓడల తయారీకి చీనీ వారు కారకులట. వీని తెరచాపలను అక్కర లేకపోతే దింపి వేయకుండా చుట్టగా చుట్టి ఓడ స్తంభాలకు కట్టివేస్తారు. నాటు పడవలు, ఓడలు కొయ్య చీలలో తోను, కొబ్బెర పీచు పురులతోను, బిగింపబడు చుండగా 'జోంగు' ల కొయ్య పలకలు ఇనుప చీలలతో బిగింపబడి బలిష్ఠంగా నిర్మింపబడుచుండేవి. పదునాల్గవ శతాబ్దపు వారైన 'ఇబన్ - బతూతా' 'రషీద్ - ఉద్ - దీన్' మొదలగు విదేశపర్యాటకులు 'జోంగ్'లను గూర్చి విస్తరించి వ్రాశారు. మలక్కా మొదలైన ప్రాచ్య ద్వీపాలలో భారతీయ వర్తకులు ముఖ్యంగా చోళ మండల తీరం వారైన 'జెంతూ' (=తెలుగు) సేట్లు చాలా మంది నివసిస్తుండేవారనీ కోటికి పడగలెత్తిన వీరు 'జోంగు'లనే పేరున్న పెద్ద పెద్ద సొంత ఓడలను సరుకుల రవాణాకు వాడుచుండే వారనీ బార్బోజా వ్రాతలు. ఈ తెలుగు సేట్లలో నెల్లూరు వారు, అవచి తిప్పయ్య సోదరులు, చామసెట్టి ప్రభృతులు ఉండవచ్చు. వ్యుత్పత్తిపరంగా చూస్తే సబిందుకము సాధు పాఠము. నిర్బిందుకంగా కొందరు ఉదాహరించటం పొరపాటు. పంద్రెండు తెర చాపల వరకూ గల ఓడలుండేవి. చీనా - ఇండియా నడుమ మహా సముద్రం మీద వెళ్ళటానికనువైనవి ఈ భారీ నౌకలు.

66. **ఢిల్లి :** (హిం. ఢిల్లీ)ఢిల్లీ పట్టణం, భారత రాజధాని.

'పండువా ఢిల్లి రాఢాది పట్టణములు' (హర॥పీ॥ 28)

'ఢిల్లి సుల్తానునకు లేదు పల్లకోష్ఠి' (క్రీడా॥ 185)

67. **తరుణాసిరి :** బర్మా దేశానికి దక్షిణ భాగాన తన్నా సరి రాష్ట్రాన, తన్నా సరి నది ఒడ్డున ఉన్న ఒక రేవు పట్టణమిది. 'తర్నాసరి' మలయా ద్వీపకల్పాన ఒక రాష్ట్ర ప్రధాన నగరమని వేటూరి వారి నిర్ణయం. మలయా భాషలో 'తనాసరి' అని వాడుక.

'తనాహ్ సరి' అంటే 'ఆనంద సీమ' అని అర్థం. బర్మీలో 'త - నెన్ - ధారి', 'తనంగ్ - సరి' అని

వ్యవహారం. 'తన్నాస్సరి, తర్నస్సరి, థెనాస్సరిమ్, దహ్నసరి' అనే రూపాలు ఉదాహరణలు.

'తరుణా సీరి తవాయి గోవ ..................' (హర॥పీ॥ 28)

68. **తవాయి** : బర్మా దేశం యొక్క దక్షిణ భాగమందలి తన్నా సరి రాష్ట్రంలో తవాయి నది తూర్పు ఒడ్డున ఉన్న ఒక రేవు పట్టణం. తవాయి జిల్లాకు ముఖ్య పట్టణం. మలయా ద్వీప కల్పమున గల రేవు పట్టణమని వేటూరి వారి అభిప్రాయము. బర్మీ భాషలో ఇది 'థ - వే', 'థ - వాయ్' అని వ్యవహారం. బర్మీ పండితులు దీనికి అనేక రకాల వ్యుత్పత్తిని చెప్పారు. 'థ - వాయ్' అంటే ఖడ్గాలను కొనేచోటు.

'చీని సింహళ తవాయి హురుముంజి చోణంగి' (హర॥పీ॥ 7)

'తరుణాసీరి తవాయి గోవ రమణా' (హర॥పీ॥ 28)

మలయా భాషలో 'తవాయ్' మూలరూపంలో 'సయామీ' భాషలోనిదని పండితుల అభిప్రాయం.

నేటి 'తావాయి' పట్టణపు జనాభా 36 వేలకు పైబడి కలదు.

69. **పంజార** : 'సుమిత్రా' ద్వీరంలో 'పజ్జార్' అనే పేరు గలది. బండే, బోర్నియో ద్వీపాన 'పంజార్ మానీన్' అనే పేరు గలది. ఈ రెండు దేశాలు కర్పూర వృక్షాలకు ప్రసిద్ధములైనవి. ఇక్కడ నుండే కర్పూరం దిగుమతి అవుతున్నది.

'పంజారఁగర్పూర పాద పంబులు దెచ్చె' (హర॥పీ॥ 8)

70. **పండువా** : పదునాలుగు పదునైదు శతాబ్దాల్లో పశ్చిమ బంగాళాన్ని పాలించిన సుల్తానుల రాజధానియైన 'ఫాండువా' పట్టణము.

నేటి బంగాళమున మాల్దా జిల్లాలోని ఇంగ్లీషు (< ఆంగ్రేజాబాద్) బజారునకు నాలుగున్నర కోసుల దూరంలో పట్టణముంది. దీనికి ఫెరూజాబాద్ అని కూడా నామాంతరమున్నది.

'పండువా సురతాణి పావడంబిచ్చిన' (భీమ 1.38)

'పండువా సురధాని పావడంబంపిన' (కాశీ 1.35)

'పండువా ఢిల్లి రాఢాది పట్టణముల యధిపతులు' (హర॥పీ॥ 29)

71. **భోట** : భూటానుగా తెలియవస్తున్నది. ఇది కస్తూరికి ఆకరము.

'భోటఁగస్తురికా పుట కోశములు దెచ్చె' (హర॥పీ॥ 26)

72. **యాంప** : సింహళ ద్వీపమందలి జాఫ్నాగా గుర్తించారు. కట్టాణిది ముత్యాలిచ్చుట లభిస్తాయి.

'యాంప గట్టాణి ముత్యాలు దెచ్చె' (హర॥పీ॥ 26)

73. **రమణా** : బర్మాలోని ఇరావతీనది ముఖ ద్వారంలో ఉన్న ప్రాంతం. 'రమన్యా' అని ప్రాచీన వ్యవహారం. పెసుదేశ మందలి నగరము. కస్తూరి ఇక్కడి నుండి దిగుమతి చేసేవారు.

'గోవ రమణా స్థానంబులం జందనాగరు కర్పూర. (హర॥పీ॥ 28)

74. **వలికా** : సరుకుల రవాణాకు పనికి వచ్చే ఒక దినుసు విలాతి పడవ.

'శరధింగప్పలి జోఁగు వల్లివలికా సమ్మాన్లఁ దెప్పించు' (హర॥పీ॥ 28)

**75. వల్లి** : సరుకుల రవాణాకు ఉపకరించే ఒక దినుసు విలాతి పడవ.

'శరధింగప్పలి జోఁగు వల్లివలికా సమ్మాన్లఁదెప్పించు' (హర॥పీ॥ 28)

## 14.1.4 అన్యదేశ్యాలు - ధ్వని పరిణామం:-

అన్యదేశ్యాల్లో కొన్ని పదాల్లో ఏర్పడ్డ ధ్వని పరిణామాన్ని పరిశీలిద్దాం.

1. **స్వర విశ్లేషము (Anoptyxis):-** కొన్ని రకాల హల్సంయోజనాలు భాషా స్థితికి విరుద్ధమైతే ఎరవు తెచ్చుకొన్న పదాల్లో ఉన్నట్టి సంయోజనాలను ఒక అచ్చుచేత విడదీయటాన్ని స్వర విశ్లేషము లేక స్వరభక్తి అంటారు.

   **ఉదా:** అసివారు < అస్వార్

   కత్తలాని < ఖత్లాన్

   కిచ్చడి < కిచ్‌రీ

2. **మధ్యమ స్వర లోపము:-**

   **ఉదా:** త్రాసు < తరాజు

3. **మూర్ధన్యీకరణము (Retroflexiow):-**

   **ఉదా:** 1. మోళము < ములమ్మా

   2. సురధాణి < సుల్తాన్

## 14.1.5 సమాసాల్లో ఒక అంగము అన్యదేశ్యముండుట :-

1. **అన్యదేశ్యము + తత్సమము:-**

   **ఉదా:** తేజీ - హయము (శృ॥నై॥ 6.96)

   పేషణి - హనుమంత (శృ॥నై॥ 1.32)

2. **అన్యదేశ్యము + తద్భవము:-**

   **ఉదా:** పంజు - మంచము (హర 7.137)

   (పైఁడి) మోళము - కటారి (శృ॥నై॥ 6.94)

3. **తత్సమము + అన్యదేశ్యము:-**

   **ఉదా:** వజ్రాల - కమరు (శివ 2.26)

4. **దేశ్యము + అన్యదేశ్యము:-**

   **ఉదా:** పసిడి - జలపోసనము (హర 5.56)

   పైఁడి - మోళము (శృ॥నై॥ 6.94)

5. **తమిళము + తత్సమము:-**

**ఉదా:** తిరు - నామము (శ్రీనా॥చాటువు 132)

తిరు - పతి (కాశీ 5.288)

## 14.1.6 కన్నడం నుంచి వచ్చిన ఎరవు పదాలు:-

సజాతీయ సోదర భాషలైన కన్నడ, తమిళాల నుండి ఎరవు తెచ్చిన పదాలు శ్రీనాథుని భాషలో ఉన్నాయి. అందు హకారాది పదాల్లో అనేకం కన్నడం నుండి ఎరవు తీసికొని రాబడ్డవి. హకారాది క్రియావాచక పదాలు తెలుగులో రెండే రెండు ఉన్నాయి. 1. హత్తు, 2. హెచ్చు. ఈ రెండూ కన్నడం నుండి ఎరవు తెచ్చిన పదాలు. ఇవి తప్ప పదాది హకార ఘటిత క్రియా వాచక పదాలు తెలుగులో లేవు.

1. **హజ్జ** : పాదము, అడుగు.

'శర్వరీ సార్వభౌమునొక్క హజ్జున గుజ్జు రూపంబున' (భీమ 3.212)

< కన్నడ : హజ్జె ; పజ్జె

< ప్రాకృత : పజ్జ - < సంస్కృత : పాద్య = పాద సంబంధి

2. **హత్తు** : జత చేయు, చేర్చు, కలుపు.

'హత్తెనొకచో విశాఖ వింధ్యాద్రి యందు' (కాశీ 1.138)

'పీఠంబుల్ హత్తి' (శివ 4.23)

'హత్తిన ముత్తియంబుల తోడ' (భీమ 5.9)

'కరంబు హత్తిన ముత్తియంబు' (శృ॥నై॥ 8.14)

'కొత్త లత్తుక హత్తించె' (శృ॥నై॥ 6.44)

< కన్నడ : హత్తు < పత్తు = జోడించు, జతకలుపు (Dravidian Etymological dictionary - D.E.D 3220)

3. **హదను** : యుక్త సమయము.

'హదనున మేలు సేఁత చతురానన సంభవ' (శృ॥నై॥ 3.14)

< కన్నడ : హదను, పదను = యుక్తము, తగినది కార్యానుకూలము (D.E.D 3228)

< ప్రాకృత : సజ్జ - < సంస్కృత , పాద్య = పాద సంబంధి

4. **హుళక్కి** : అసత్యము, వ్యర్థము.

'ధనము నిష్పచ్చరము విద్యయు హుళక్కి' (కాశీ 4.114)

< కన్నడ : హొళ్ళు, పొళ్ల

హొళ్ళు + అక్కి (బియ్యము) (D.E.D 3726)

5. **హెచ్చు** : అతిశయము, వర్ధిల్లు.

'హెచ్చు గుందాడఁబని లేదా' (హర 4.22)

'ఎల్ల సంసారులకుఁగుందు హెచ్చు' (శివ॥ 3.5)

< కన్నడ : హెచ్చు, పెచ్చు, పెర్చు = అతిశయించు, వృద్ధియగు (D.E.D 3615)

6. **హేరాళము** : ఆధిక్యము, సమృద్ధి

'పెక్కు దినములు హేరాళమై వర్షములో' (హర 2.26)

'ఇంద్రాణితోఁ గూడ హేరాళము గఁదీర్చె' (హర 4.90)

'ధనము హేరాలమబ్బె' (కాశీ 7.254)

'హేరాళము గఁజల్లె నెలనాఁగ యొక్కర్తు' (భీమ 5.115)

'వసియించున్ హేరాళ క్రీడా సంచారిణి' (భీమ 1.101)

< కన్నడ : హేరాళ, పేరాళ = ధారాళము, వెగ్గలము, విస్తారము (D.E.D 3613)

సంస్కృతేతర పదాలు సంస్కృత సమాసాల్లో ప్రయుక్తమవటం శ్రీనాథ రచనల్లో కనిపించే లక్షణం. శుద్ధదేశ్యములైన పదాలను సైతం సంస్కృత సమస్త పదాలలో ప్రయోగించటం శ్రీనాథుని వచో విలాసాలలో ఒక దినుసు. శ్రీనాథునకు సంస్కృత సమాసంలో సంస్కృతేతర పదాలను చేర్చు అలవాటు ఉంది. ఇదే విధంగా హేరాళ పదాన్ని కూడా ప్రయోగించాడు.

7. **హొన్ను** : బంగారము, బంగారు నాణెము.

'హొన్నాళంపు గరాచూరి చాయల' (శివ 4.87)

'హొన్నాళంబు గండగత్తెర' (క్రీడా 142)

'హొంబట్టురవిక' (ప॥వీ॥ 65)

< కన్నడ : హొన్, హెన్ను, హొం, పొన్, ఫొన్ను, ఫొం = బంగారు, బంగారపు (D.E.D 3723)

8. **కైవారము** : ఈ పదం స్తుతిపరంగానే తమిళ, కన్నడాల యందు ప్రయోగింపబడుతున్నది. ఇది దేశ్యమే కాని తద్భవం కాదు.

'కవి భూపాలుని యొద్ది పాఠకుల మీకైవార

దుర్భాషణంబులకుం గాని యతండు మెచ్చుండు' (శృ॥నై॥ 7.89)

'ఆవేళను గంధర్వులు కైవార పదాను సార కమనీయముగా' (హర 6.9)

< కన్నడ : 'కమ్‌పాట్, కైపాట్, కైవార! పదాలున్నాయి. చేయెత్తి మంగళా శాసనం పలకటం దీని అర్థం.

< తమిళ : 'కైవారమ్' అను పదమిదే అర్థంలో దేశ్యంగా ప్రయోగింపబడింది. 'కైవారిగళ్' అంటే నిలిచి చేయెత్తి రాజులను పొగటానికి నియమితులయినవారని అర్థం.

9. **కెడ్డెరసు** : సంకీర్ణము, కలసినది.

'నానా మృగంబుల యెలుంగుల తోడఁగెడ్బెరసి' (కాశీ 1.93)

'రాజనందనుల యందియల మొరపంబు తోడఁగెడబెరసి' (శృ॥నై॥ 6.29)

< కన్నడ : కెడబెరసు = కూడిక , కలయిక

## 14.1.7 తమిళము నుండి వచ్చిన ఎరవు పదాలు:-

1. **తిరిపెము :** భిక్షము, భిక్షక వృత్తి.
   'ఇది కట్టడ తిరిపెములకు'(కాశీ 7.52)
   'తిరిపమున కిద్ద ఱాండ్రా' (శ్రీనా॥ చాటువు)
   < తమిళము : తిరుప్పమ్ = తిరుగుచు (D.E.D 2655)

2. **తిరుచుట్టు :** దేవాలయ ప్రాంగణము.
   'ప్రదక్షిణంబు జేయునప్పుడు తిరుచుట్టు మాలిక యందు' (భీమ 3.183)
   < తమిళము : తిరుచుట్టు = దేవాలయ ప్రాంగణము

3. **తిరుచుట్టుమాలె :** దేవాలయమున చిన్న దేవతల నుంచుటకై ఆవరణము చుట్టును కట్టిన కట్టడములు.
   'తిరు చుట్టుమాలెలోఁదిరమైన గణపతి' (భీమ 3.31)
   'మదన విధ్వంసి తిరుచుట్టు మాలె యందు' (భీమ 6.71)
   < తమిళము : తిరుచుట్టు - మాళికై

4. **తిరునాళ్లు :** దేవోత్సవము.
   'అసమబాణుండు తిరునాళ్ల సన్నినాళ్లే' (క్రీడా॥ 212)
   'బంజియ లేమియలేమిటికిఁగాకుళంపు తిరునాళ్ళ' (క్రీడా॥ 211)
   < తమిళము : తిరునాళ్ = శుభదినము, దేవోత్సవ దినము

5. **తిరుమల :** వేంకటాచలము.
   'కోయిలఁ దిరుమలఁ బెరుమా కోయిల' (కాశీ 5.288)
   'తిరుమల విభు చామాధీశ్వరైకాగ్ర జన్మ' (హర 1.31)
   < తమిళము : తిరుమలై

6. **తిరువళ్లూరు :** శైవ క్షేత్రము.
   'దీర్ఘ తర తటాకాంబోధి తిరువళూరఁగావేరి గట్టించె' (హర॥పీ॥ 10)
   < తమిళము : తిరువళ్లూర్ = తంజావూరు జిల్లాలోని శైవ క్షేత్రము.

## 14.1.8 ఈ క్రిందివి అన్యదేశ్యములని చిలుకూరి నారాయణరావు గారి అభిప్రాయం. కానీ వీనికి ఆశ్రయములు మృగ్యములు:-

1. **దీనారము :** ఇది బహుశః పారశీకపు నాణం కావచ్చు.
   'దీనార టంకాల తీర్థమాడించు' (శ్రీనా॥ వీధి)
   దీనికి ల్యాటిను భాష మూలమని చిలుకూరి వారి అభిప్రాయం.

2. **దివాణము :** 'నికుంభు దివాణమున భృంగి కులపతి కాఁగా' (హర 5.9)

3. **పోటి** : లోలార్కునకు నీకులోలోన నేమేని పోటి పుట్టదు గదా' (భీమ 2.88)

4. **దేహరము :** 'ధీనిధి నంబి సెట్టి తన దేహరమింటి విభూతి' (హర 2.37, కాశీ 1.48)

ఇది హిందీ నుండి గ్రహింపబడినది కావచ్చు. దేవ + ఘర్.

## 14.1.9 ప్రశ్నలు :-

1. శ్రీనాథుని భాషలోని అన్యదేశ్యాలను పేర్కొని, వాని వ్యుత్పత్తిని వివరించండి.
2. శ్రీనాథుని భాషలో కన్నడ, తమిళముల నుండి వచ్చిన ఎరవు పదాలను పేర్కొని, వాని ఆశ్రయములను తెల్పండి.

## 14.1.10 ఆధార గ్రంథాలు:-

1. శ్రీనాథ భాషా పరిశీలన - ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి
2. శ్రీనాథ యుగమందలి అన్యదేశ్యాలు - ఆచార్య తూమాటి దొణప్ప

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 14.2

# శ్రీనాథుని వాక్య నిర్మాణ వైచిత్రి

**ముఖ్యాంశాలు:-**


14.2.0 లక్ష్యం

14.2.1 ఉపోద్ఘాతం

14.2.2 ఆంగ్ల ప్రక్రియననుసరించిన వాక్యం

14.2.3 పదక్రమము (Word Order)

14.2.4 సమానాధికరణ నిర్మాణము (Appositional Construction)

14.2.5 ప్రత్యక్షకథిత వాక్యము (Direct Speech), పరోక్షకథిత వాక్యము (Indirect Speech)

14.2.6 సంబంధ బోధక సర్వనామము (Relative Pronoun)

14.2.7 కర్మణ్యర్థకము (Passive Voice)

14.2.8 వాక్య నిర్మాణంలో శ్రీనాథునిలో కానవగు విశేషాలు

14.2.9 ప్రశ్నలు

14.2.10 ఆధార గ్రంథాలు


## 14.2.0 లక్ష్యం:-

భాష యందు మిక్కిలి ప్రధానమైంది వాక్యం. వాక్యం వల్లనే మన భావాలను స్పష్టంగా ఒకరికి తెలియ చెప్పటానికీ, ఇంకొకరి భావాలను మనం తెలుసుకోవటానికి అవకాశం కలుగుతున్నది. కేవలం అర్థాల వల్ల గాని, శబ్దాల వల్ల గాని భావ బోధ జరగదు. వాక్యం వల్లనే సమగ్ర భావ బోధకు అవకాశం కలదు. కాబట్టి వాక్యం భాషా శాస్త్రము నందు పరమ ప్రమాణంగా గ్రహిస్తారు. శ్రీనాథుని భాషలో కన్పిస్తున్న వాక్య నిర్మాణ పద్ధతులెలాగున్నాయో వివరించటమే ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

## 14.2.1 ఉపోద్ఘాతము:-

తెలుగు వ్యాకరణాలు వాక్య నిర్మాణానికి కావలసిన అంశాలనన్నింటిని విడివిడిగా పేర్కొన్నవి. కాని వాక్య స్వరూపాన్ని నిరూపించటానికి పూనుకొనలేదు. ప్రౌఢ వ్యాకరణం 'వాక్య పరిచ్ఛేదం' అను పేర ఒక ప్రకరణాన్ని చేర్చుకొన్నది.

ప్రతి భాషకు ఒక సంప్రదాయముంటుంది. ఆ సంప్రదాయానన్ననుసరించి వాక్య నిర్మాణం సాగుతుంటుంది. మాతృభాష యందు మాటాడేవారు అప్రయత్న సిద్ధంగానే ఆయా రీతులను గ్రహింపగల్గుతారు. విషయ ప్రధానమైనది వాక్యం. విషయము ఉద్దేశ్యము, విధేయమునని రెండు విధములు. విధేయము కొన్ని యెడల నామ మాత్రమై ఉంటుంది. కొన్ని యెడల సమాపక క్రియాత్మకమై ఉంటుంది. "వాక్యమున్నా యోగ్యతా కాంక్షా సహితంబగు నర్థము గలయుసత్తియుక్త పద సముదాంబు" అని ప్రౌఢ వ్యాకర్త నిర్వచనము.

## 14.2.2 ఆంగ్ల ప్రక్రియననుసరించి వాక్యం:-

ఆంగ్ల ప్రక్రియననుసరించి వాక్యాన్ని మూడు విధాలుగా పరిగణింపవచ్చు.

1. సామాన్యము (Simple), 2. సంశ్లిష్టము (Complex), 3. సంయుక్తము (compound)

1. **సామాన్య వాక్యం** (Simple Sentence):- ఒక సమాపక క్రియను మాత్రమే కలిగి ఉండి అసమాపక క్రియలకు అవకాశం లేని వాక్యాన్ని సామాన్య వాక్యం అనవచ్చు. సామాన్య వాక్యాల్లో ఒకే ఆఖ్యాతం (predicate) ఉంటుంది.

శ్రీనాథుని భాష యందు గల సామాన్య వాక్యాలు ఈ క్రింద ఉదహరింపబడ్డవి.

'నీవు తుంబురుండవు. శిరియాలుండు కుమార స్వామి తిరువెంగనాంచి యచ్చుర' (హర 2.138)

'అవ్వీర మహేశ్వరు నాకుంజూడవలయు'(హర 2.14)

2. **సంశ్లిష్ట వాక్యం** (Complex Sentence):- ఒక వాక్యంలో నిర్దిష్టమైన స్థానంలో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంశ్లిష్ట వాక్యమేర్పడుతుంది. లేదా ఒక సామాన్య వాక్యానికి అసమాపక క్రియా రూపాలున్న ఉప వాక్యాల్ని చేర్చటం వల్ల సంశ్లిష్ట వాక్యాలేర్పడతాయి. కొన్నింటిలో క్రియ భావార్థక నామం గానీ, క్రియా జన్య విశేషణం గానీయై ఉంటుంది. కాల బోధ ప్రధాన క్రియననుసరించి ఉంటుంది. క్రియాజన్య విశేషణంలో కాల బోధ ఉండదు. ప్రధాన వాక్యాన్ని గర్భి వాక్యం గాను, ఉప వాక్యాలు గర్భ వాక్యాలు గాను భాషా శాస్త్రంలో వ్యవహరిస్తారు.

**ఉదా:** 1. 'జీవన్ భద్రాణి పశ్యతి' యను వేద వచనం . బవలంబించి' (హర 2.77)

2. 'భూ భువనంబు భరియింపని నాఁడు భుజంగమ
శేఖరుండు మృణాల పేశలంబగు ఫణా మండలంబున
నిడి భరింప సమర్థుండగునే' (హర 4.63)

3. **సంయుక్త వాక్యం** (Compound Sentence):- రెండు కాని, అంత కంటె ఎక్కువ కాని వాక్యాలు సంబద్ధములై ఏకాన్వయాన్ని కలిగి ఉంటే ఆ వాక్యాల సముదాయాన్ని సంయుక్త వాక్య మంటారు. లేదా కొన్ని సమాన ప్రతిపత్తి గల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే సంయుక్త వాక్యమవుతుంది. 'లేకున్న', 'కావున' మున్నగు సముచ్చయములు పూర్వ పర వాక్యాలను సన్నిహితం చేస్తాయి. కొన్ని యెడల అట్లాంటివి లేకుండగనే అన్వయం కలుగుతాయి.

**ఉదా:** 'నామై సెమర్చుటకుం గారణంబు సెప్పెద
నాకర్ణింపుము' (హర 1.28)

## 14.2.3 పద క్రమము (Word Order):-

1. తెలుగు వాక్యంలో సాధారణంగా ఉండు పదక్రమము కర్త - కర్మ - క్రియ.

**ఉదా:** 'పారాశర్యుండు వాతాపి దమనుని కిట్లనియె' (భీమ 2.90)

2. క్రియా పదం లింగ విభక్తి వచనములయందు కర్తకు అనురూపమై ఉంటుంది.

'తరికొనియెం జగత్త్రయము, తల్లడమందిరి నెమ్మనంబులన్
సురగరుడోరగామరులు, స్రుక్కెఁబితామహుడంబు జాక్షుఁడా
తురత వహించె, దిక్పతులు తూలిరి, ఘూర్ణిల్లె నేడు వారులున్' (హర 6.65)

3. కర్మార్థక వాక్యము నందు క్రియా పదము కర్తతో కాక కర్మతో అన్వయాన్ని పొందుతుంది. కాబట్టి దానికనురూపంగా ఉంటుంది.

'త్వదంఘ్రి నఖ చంద్ర మండల జ్యోత్స్నా సమున్మేషణంబునం
దమః కాండంబును ఖండింపబడియె' (కాశీ 1.100)

4. కొన్నియెడల పదక్రమమునందలి మార్పు వల్ల అర్థంలోనూ మార్పు వస్తుంది. పదక్రమం నియతంగా లేకుంటే పదాల క్రమాన్ని మార్చటం వల్ల ఊనిక ఒక చోట నుండి మరొక చోటికి మార్చటం వల్ల భావ భేదం కలుగుతుంది.

"మాటలు వేయునేమిటికి మంగళ లక్షణ లక్ష్మియైన యీ
బోటికి భర్త కాఁగలఁడు సోమకి రీటుఁడు సర్వ దేవతా
కోటి కిరీట కోటి పరికుంచిత దివ్యమణి ద్యుతిచ్ఛటా
పాటల పాద పీఠుఁడగు నట్టి కృతార్థుఁడ వైతి భూధరా' (హర 3.26)

వాక్య నిర్మాణం పద్యంలోనూ, గద్యంలోనూ రెంటిలోనూ ఉంటుంది. ప్రధానాంశాలలో పద్య గద్యాలకు భేధముండదు. గణానుకూలమైన పదక్రమాలోనూ, కొన్ని ప్రత్యయాదుల లోపం వల్లను పద్యంలో భేదం అధికంగా ఉంటుంది. వాక్యాలలో వివిధ పదాల మధ్య నున్న వ్యాకరణ సంబంధాలలో గద్య పద్యాలు భేదించవు. అందువల్ల వాక్య నిర్మాణానికి ప్రధానంగా గద్యాన్నే లక్ష్యంగా గ్రహించి విశేషాలను విశ్లేషించుట జరిగింది.

## 14.2.4 సమానాధిక నిర్మాణం (Appositional Constructions):-

1. ఇట్టి వాక్య నిర్మాణం ప్రాఙ్నన్నయ యుగపు శాసన భాషలో విరివిగాను, నన్నయ రచనలో క్వాచిత్కం గాను, తదనంతర సాహిత్యమున సహజంగా కలదు.

'వీరె సిద్ధ సాధ్యమరుత్కిన్నర కింపురుష గంధర్వ విద్యాధరులగు దేవ యోనులు' (కాశీ 2.93)

'కుపుత్త్రత్వంబు కంటె నపుత్త్రత్వంబు మేలు' (కాశీ 4.110)

2. శ్రీనాథుని భాషలో కాననగు క్రియారహిత వాక్యాలు ఈ క్రింద ఉదహరింపబడినవి. వీనిని సమీకరణ వాక్యాలంటారు. (Equative Sentences) ఈ రకమైన వాక్యాలు అన్ని భాషల్లోను ఉన్నా తెలుగులో క్రియా రహితంగా ప్రయోగించుట విశేషం.

'ఇది చంద్ర లోక మహాత్మ్యంబు' (కాశీ 4.185)

'ఇది తారకాలోక వృత్తాంతంబు' (కాశీ 4.190)

'వీరె మునులు' (కాశీ 2.98)

'సవిలపూరంబు హితవొ? యాజ్యంబు హితవో?' (శృ॥నై॥ 4.52)

3. విశేషణాలు విశేష్యంతో ఆనుపూర్వి కలిగి ఉంటాయి.

'విశ్వ భర్తకు (గాశి కాధీశ్వరునకు
నిందు మౌళికి నినుఁగా చుటెంత భరము' (కాశీ 4.40)

4. విశేషణ విశేష్యాలకు 'ఐన' తోడి సంబంధము.

'అవినయ నిదానంబైన స్వాతంత్ర్యంబునను,
గుతూహల బహుళంబైన స్వభావంబునను ధైర్య
ప్రతి పక్షంబైన యౌవనారంభమునను' (కాశీ 4.201)

5. 'అగు'తో విశేషణ, విశేష్యములకు అన్వయముండుట. ఇట్టి యెడల విశేషణము ప్రథమా విభక్తి యందుండును.

'కటుక మగు విషము విషధర
కటకంబగు కేలఁబూని కౌతూహలియై' (హర 6.70)
'వీరె సిద్ధ సాధ్య మరుత్కిన్నర కింపురుష గంధర్వ
విద్యాధరులగు యోనులు' (కాశీ 2.98)

6. మొత్తం వాక్యమంతా కర్మ గానే ప్రయోగించుట శ్రీనాథునిలో కలదు.

"ఇలు వరుసఁజంద్రశేఖరు
నిలయంబున దీపకళిక నిలుపని వారిన్" (కాశీ 4.136)

7. పెక్కు విశేషణాలను ఒక్క సమాసంలో కూర్చుచు, అర్థానికి పుష్టి కలిగించే వాక్య నిర్మాణం శ్రీనాథుని భాష యందు కలదు.

'ప్రతి దినంబును ప్రాత రాంభ వేళ
నిర్గిబంధన నిరుపాధి నిరవగాధ
నిర్నిరోధ నిరాఘాట నిరుపమాన
భక్తి సంభజి యొంతురీ పద్మబంధు' (కాశీ 3.175)

8. ప్రస్ఫుట భావ వ్యక్తీకరణానికై వాక్యారంభంలోనే సమాపక క్రియ వస్తుంది.

'కాంచెన్ గాంచన గర్భ సంభవుడు' (కాశీ 1.87)
ఆలోకించె మహాము నీంద్రుడు గుమారా రామమున్ (భీమ 2.61)

## 14.2.5 ప్రత్యక్ష కథిత వాక్యము (Direct Speech) - పరోక్ష కథిత వాక్యం (Indirect Speech):-

ఉన్నవి ఉన్నట్లుగా అనుకరించి చెప్పిన ప్రత్యక్ష కథితమంటారు. విషయాన్ని అనుకృతాంశంలో మాత్రమే అనుకరించి చెప్పేది పరోక్ష కథిత వాక్యమంటారు. ఇది సర్వ భాషా సామాన్య లక్షణం. అనుకృతిని శబ్దానికి మాత్రమే పరిమితం చేస్తే ప్రత్యక్ష కథితమును శబ్ద ప్రధానమని (Code Centred), పరోక్ష కథితమును అర్థ ప్రధానమని (Information Centred) చెప్పుకొనవచ్చును. దేశ కాల, శబ్ద, భాషా నిరవధికత ప్రత్యక్ష కథితానికి వర్తిస్తుంది. తెలుగులోను ఇతర భాషల్లోనూ వచ్యర్థ ధాతునిష్పన్నమైన ఒక అవ్యయాన్ని అనుకారకంగా ప్రయోగిస్తారు. తెలుగులో ప్రత్యక్ష, పరోక్ష కథితములు రెండింటిలోను 'అని' అను రూపం ప్రయుక్తమవుతుంది. ఇది అను ధాతువు నుండి నిష్పన్నమైన క్త్వార్థక క్రియతో సమానము. కానీ ప్రయోగాల్లో రెండింటిని వేరు చేయవచ్చు.

1. **ప్రత్యక్ష కథిత వాక్యం** (Direct Speech):-

   1. **ఉదా:** "అంతకమున్న గుణనిధి తండ్రి కోపం బెటింగి యింటికింబోవక యెందేని యుంజనువాడనని మనంబున నిట్లనివిత్కరించె' (కాశీ 4.110)

   2. "అని యంతఃపుర చరుల" దీని నభ్యంతరంబునకుంగొనిపొం'డని పలికినం గళవళింపక కాళరాత్రి రాత్రించరే శ్వరున కిట్లనియె" (కాశీ 6.222)

2. **పరోక్ష కథిత వాక్యం** (Indirect Speech):-

   'తల్లిబడి కొల్లి చట్టంచునుల్లసంబు
   లాడుదురు నన్ను గూర్చి నిన్నహరహంబు
   దుర్లయంబెల్ల నామీఁదఁద్రోచి జనులు
   డబ్బఱలు పల్కువారి కడ్డంబు గలదె?' (కాశీ 4.96)

## 14.2.6 సంబంధ బోధక సర్వనామము (Relative Pronoun):-

యత్త దర్థక శబ్దాలును సంబంధ బోధక సర్వనామమును తెలుగులో యద్యదర్థక శబ్దాలు ప్రత్యేకంగా లేవు. కాబట్టి ప్రశ్నార్థక సర్వనామాన్నే సంబంధ బోధక సర్వనామాలుగా శ్రీనాథుని భాషలో కన్పిస్తున్నవి. ఇవి సంస్కృతానుకరణం కావచ్చు.

(1) **ఎవ్వఁడు - అతడు:-** 'ఎవ్వండేని మత్కులంబున గుహూ యోగంబున ఁజంద్రోదయ వారి నభిషిక్తుండై అన్నరుండు పితృ ప్రసాదంబు పడయు' (కాశీ 4.183).

(2) **ఎప్పుడు - అప్పుడు:-** 'ఎప్పుడు పెండ్లి యాడు పరమేశ్వరుఁడద్రి తనూజ వేడ్కతో నప్పుడు లబ్ధ సాఖ్యుండయి యంబిక' (హర 3.96).

(3) **ఎవ్వాఁడు - వాఁడు:-** 'ఎవ్వాని చిత్తంబున నీవు వర్తింతువు వాడు కృతార్థుండు గదా' (హర 4.46)

(4) **ఎచ్చోట - అచ్చోట:-** 'ఎచ్చోట నుండు నిందిర, యచ్చోటనె యుండు' (హర 6.23)

(5) **ఎన్ని - అన్ని:-** 'శివ లింగ స్థానంబు లెన్ని గల వన్నియు దర్శించిన' (భీమ 3.173)

(6) **ఎంత - అంత:-** 'క్లేశ పంచకం బెంత కాలంబను వర్తించునంత కాలంబునకు' (కాశీ 2.143)

(7) **ఏ - ఆ:-** 'కన్నులు కల్గియేనినేమానవుఁడమ్మనుష్యునకు మాసము లాఱు' (కాశీ 5.250)

(8) **ఎట్లు - అట్లు:-** 'నాతో నీవిపుడెట్టులాడితి ........ నాతో నట్లన యాడె' (కాశీ 1.103)

## 14.2.7 కర్మణ్యర్థకము (Passive Voice):-

అన్నంతము పై - పడుచేరి ప్రయోగింపబడు పదబంధము ప్రాఙ్నన్నయ యుగపు భాష యందు విరళము. అందు మనకు రెండు ఉదాహరణలు మాత్రమే లభ్యము. నన్నయ యందు కర్మణ్యర్థక ప్రయోగాలు చాలా ఉన్నాయి. అవియు అనువాదంలో సంస్కృత రూపాన్ని అనుకరించటాన్ని స్పష్టపరుస్తుంది. సాధారణంగా తెలుగు కర్త్రర్థక (Active Voice) వాక్య నిర్మాణం కలిగి ఉంటుంది. శ్రీనాథుని కృతుల్లో కర్మణ్యర్థక ప్రయోగాలు మచ్చునకు కొన్ని ఉదాహరణలు.

1. 'పుష్కర ద్వీప పతి యాస్య పుష్కర మునఁ ..................... కార్ష్ణ్యధూమ మీక్షింపబడియె' (శృ॥నై॥ 5.39)
2. పరిపాలింపంబడిరి। (కాశీ 6.89)
3. 'సిద్ధుల చేతఁబ్రతిష్ఠింపబడి' (భీమ 3.111)
4. 'జ్యోత్స్నా సమున్మేషణంబునం దమః కాండంబును ఖండింపఁబడియె' (కాశీ 1.100)

## 14.2.8 వాక్య నిర్మాణంలో శ్రీనాథునిలో కానవగు కొన్ని విశేషాలు:-

1. సంబుద్ధి యందు ఆరగా గమంలోపించుట
   'వినుఁడీ నాదు ప్రతిజ్ఞ మీరు హృదయోద్వేగంబు వర్జించియో జనయిత్రీ జనకుల్! గురుల్' (కాశీ 4.38)
2. అన్నంతము పై - వలయునను న్యూనక్రియతో కూడిన వాక్యం
   'ఈ పుణ్య - శ్లోకునిఁగరుణార్ద్రఁదృష్టిఁజుడఁగవలయున్' (కాశీ 4.155)
3. ప్రార్థనాద్యర్థమున ఈ కారము వచ్చుట
   'భిక్షకఅవయ్యెం జూడు మీకుంభజా' (భీమ 2.98)
4. వికల్పార్థమున 'కాని' ప్రయుక్తము
   'ప్రతి బింబమో కాని రజని వల్లభునక
   ధ్యాహారమో కాని యమృత రుచికి ........' (కాశీ 4.191)
5. నిర్లక్ష్యమున 'కాకేమి' అను వాడుక కలదు.
   'ఏమన్న ననియెఁగాకేమి మీ యేలిక
   సాని వచ్చితి వీవ చాలు మాకు' (కాశీ 4.221)

## 14.2.9 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని వాక్య నిర్మాణ వైచిత్రి ఎట్టిదో వివరింపుము.

## 14.2.10 ఆధార గ్రంథాలు:-

1. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
2. శ్రీనాథ భాషా పరిశీలన - నేతి అనంతరామ శాస్త్రి

- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి

పాఠం - 15.1

# శ్రీనాథుని భాషలో కానవగు కారకనిర్మాణము

**ముఖ్యాంశాలు:-**

- **15.1.0 లక్ష్యం**
- **15.1.1 ఉపోద్ఘాతము**
- **15.1.2 ద్వితీయాది విభక్తుల నిర్మాణము (Formation of oblique cases)**
  - **15.1.2.1 ద్వితీయా విభక్తి**
  - **15.1.2.2 తృతీయా విభక్తి**
  - **15.1.2.3 చతుర్థీ విభక్తి**
  - **15.1.2.4 పంచమీ విభక్తి**
  - **15.1.2.5 షష్ఠీ విభక్తి**
  - **15.1.2.6 సప్తమీ విభక్తి**
  - **15.1.2.7 సంబోధనా విభక్తి**
- **15.1.3 విభక్తి విపర్యయము (Functional Syncretism)**
- **15.1.4 శ్రీనాథుడు ప్రత్యేకంగా వాడిన అనుబంధ ప్రత్యయాలు**
- **15.1.5 ఔప విభక్తికములు (Inflexional Increments)**
- **15.1.6 ప్రశ్నలు**
- **15.1.7 ఆధార గ్రంథాలు**

## 15.1.0 లక్ష్యం:-

క్రియతో అన్వయం ఉండటాన్ని కారకమంటారు. శ్రీనాథుని భాషలో క్రియతో అన్వయం కలిగి లేక సంబంధం కలిగిన విభక్తులను గూర్చి వివరించటమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం. ఇంకా శ్రీనాథుని భాషలో ద్వితీయాది విభక్త్యంగ నిర్మాణాన్ని గూర్చి చర్చించటం జరుగుతుంది. అంతేగాక విభక్తి విపర్యయం ఎట్లా శ్రీనాథుడు తన భాషలో పేర్కొన్నాడో సోదాహరణంగా విశ్లేషించడాన్ని వివరిస్తాను.

## 15.1.1 ఉపోద్ఘాతము:-

క్రియతో అన్వయాన్ని కలిగించటాన్ని కారకమంటారు. వాక్యంలో క్రియకు నామవాచకాలకు గల సంబంధాన్ని తెలిపేది

కారకం. అంటే ఈ సంబంధాన్ని తెలిపేది విభక్తి. కాబట్టి కారకమంటే 'విభక్తి' అని చెప్పవచ్చు. నామవాచకాలు, సర్వనామాలు, కొన్ని విశేషణాలను ఇతర పదాలతో చేరినపుడు వాని సంబంధాన్ని బోధించటాన్ని విభక్తి అంటారు. ప్రథమా విభక్తి మొదలగు విభక్తులకన్నింటికిని క్రియతో సంబంధముంటుంది. విభక్తుల యొక్క అర్థాలను చెప్పటాన్ని కారకాలని చెప్పవచ్చు. శ్రీనాథుడు తన భాషలో వాడిన విభక్తుల అర్థాలకు సంబంధించిన విశేషాలను సోదాహరణంగా వివరిస్తే అదే కారక నిర్మాణమౌతుంది.

## 15.1.2 ద్వితీయాది విభక్తుల నిర్మాణం (Formation of oblique cases):-

ప్రత్యక్షంగా ప్రాతిపదికలకు విభక్తి ప్రత్యయాలు అదనంగా చేరటం వల్ల గానీ, ప్రత్యయాత్మక ఔప విభక్తికాల చేరికచే గానీ, ద్వితీయాది విభక్తులు ఏర్పడుతున్నాయి. అవి ప్రాతిపదికతో తాదాత్మ్యాన్ని పొందుతాయి. ప్రథమా విభక్తి రూపమే మరొక నామానికి పూర్వం ఎలాంటి వికృతిని పొందక, దాని స్థానాన్ననుసరించి ద్వితీయాది విభక్తిగా రూపొందుతుంది.

ప్రథమేతర విభక్తులు చేరునపుడు ఔప విభక్తిక నామాలకు ఔప విభక్తిక ప్రత్యయాలు చేరుతాయి. ద్వితీయాది విభక్త్యంగ మవుతుంది.

నామము + ఔప విభక్తికము (+ ప్రత్యయము)

**15.1.2.1 ద్వితీయా విభక్తి:-**శ్రీనాథుని భాషలో ద్వితీయా విభక్తి యందు కనిపించే ప్రత్యయాలు

-ను । -ని । -నిన్ । -న్, - గుఱించి । - గుఱిచి - గుఱియించి ; -కూర్చి

**ఏకవచనము:-**

**మహద్వాచకము:** తిక్కయజ్వ - ను (కాశీ 1.19), అల్లు - ని (భీమ 4..108)
తండ్రి - నిన్ (కాశీ 6.273), తమ్ము - న్ (శృ॥నై॥ 4.118)

**మహతీ వాచకము:** నెలత - ను (ప॥వీ॥ 68), ఆవి - ని (శివ 1.3)
తల్లి - నిన్ (కాశీ 6.273), ఇంతి - న్ (శృ॥నై॥ 5.185)

**మహతీతరా మహద్వాచకము:** అద్దము - ను (శృ॥నై॥ 3.187), అంగద - న్ (శృ॥నై॥ 8.173)

**<u>బహువచనము:-</u>**

**మహద్వాచకము:** తమ్ముల - ను (ప॥వీ॥ 147), తండ్రుల - న్ (శివ 3.2)

**మహతీ వాచకము:** అతివ - ల - న్ (ప॥వీ॥ 46)

**మహతీతరా మహద్వాచకము:** చన్నుల - న్ (హర 5.38)

**- గుఱించి / - గుఱిచి / - గుఱియించి:-** చిన్నయసూరి 'కూర్చి, గుఱించి' అను ప్రత్యయాల ప్రస్తావన చేయలేదు. నన్నెచోడుని భాషలో ఈ ప్రత్యయాల తోడి ప్రయోగాలు లేవు. కాని నన్నయ భాష యందు '<u>గుఱించి</u>' తోడి ప్రయోగాలు ముద్రిత గ్రంథాల్లో ఉన్నాయి. కాని వ్రాత ప్రతుల్లో '<u>గుఱిచి</u>' అనే ప్రయోగం కన్పిస్తున్నది. తిక్కన భాష యందు రెండు ప్రయోగాలున్నాయి. శ్రీనాథుని రచనల్లో:

| | | | |
|---|---|---|---|
| - గుఱించి | : | ఒక గంధగజంబు - గుఱించి | (శృ॥నై॥ 5.133) |
| | | పశుపతి - గుఱించి తపంబు సేయుము | (హర 7.27) |
| | | విశ్వేశ్వరు - గుఱించి | (హర 3.49) |

- గుఱిచి : నియతి - గుఱిచి (శృ॥నై॥ 3.138)

- గుఱియించి : రమేశ్వరుఁగాని - గురియించి యెవ్వరట (కాశీ 2.9)

- కూర్చి : నన్నయ నన్నెచోడుల యందీ ప్రత్యయం కన్పించదు. తిక్కన భాషలో ఒక్క ప్రయోగం మాత్రమే కలదు. కానీ శ్రీనాథుని భాషలో 57 సన్నివేశాల్లో 'కూర్చి'తో కూడిన ప్రయోగాలున్నాయి.

గాయత్రి ఁగూర్చి యర్ఘ్యమెత్తిన (కాశీ 3.179)

**15.1.2.2 తృతీయా విభక్తి:-** ఈ విభక్తి యందు వచ్చు ప్రత్యయాలు.

- చే । - చేన్ । - చేత । - చేతన్ । - చేతను (చేయి యొక్క సప్తమి)

- చేసి (చేయి యొక్క క్త్వార్థకము)

- తో । - తోన్ । - తోడ । - తోడన్

- తోడి । - తోడు । త - న్ । - తోడుతను । - తోన (తోడు) (సాహాయ్యము యొక్క సప్తమీ)

- మై । - మైన్ । -మెయి । - మెయిన్ (మెయి:) (శరీరము యొక్త సప్తమి)

శ్రీనాథుని భాషలో - చే (111) పర్యాయాలు, ప్రత్యేకపదంగా 10 పర్యాయాలు వచ్చినవి. - చేన్ (69) పర్యాయాలు, ప్రత్యేకపదంగా 5 పర్యాయాలు వచ్చినవి. - చేత (83) పర్యాయాలు, ప్రత్యేక పదంగా 8 పర్యాయాలు వచ్చాయి. - చేతన్ (72) పర్యాయాలు, ప్రత్యేకపదంగా 13 పర్యాయాలు వచ్చాయి. - చేతను (18) పర్యాయాలు, ప్రత్యేక పదంగా ఒక పర్యాయం వచ్చింది. అట్లే - చేసి (69), - తో 268, - తోన్ 233, - తోడ 237 పర్యాయాలు ప్రయోగాలు కన్పిస్తున్నాయి. - తోడ ప్రత్యేక పదంగా ఒక పర్యాయము మాత్రమే ప్రయోగం కలదు.

**ఉదా:** మనముల్ నిండగఁదోడ - రాఁద్రి జగతీమాన్యుండు (హర 4.93)

- తోడన్ 186, - తోడి 48, - తోడుత 5, - తోడుతన్ 5, -తోడుతను 1 పర్యాయం శ్రీనాథుని భాషలో ప్రయోగాలు కన్పిస్తుండగా, - తోడుత । - తోడుతన్ । - తో కూడిన ప్రయోగాలు నన్నయ, తిక్కనల భాషల యందు లేవు. కాని నన్నెచోడుని యందొక ప్రయోగం మాత్రమే కలదు.

**ఉదా:** వేళ్ల - తోడుతన్ - కల్పవృక్షముల్ పెఱికించి (కూ॥సం॥ 4.11) - మై 28, ప్రత్యేక పదంగా 9 పర్యాయాలు, - మైన్ 32, ప్రత్యేకపదంగా 7 పర్యాయాలు, -మెయి 2, ప్రత్యేకపదంగా 6 పర్యాయాలు, - మెయిన్ 9 పర్యాయాలు ప్రత్యేక పదంగా 6 పర్యాయాలు శ్రీనాథుని భాషలో ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

-నన్ అను ప్రత్యయం పై 'చేసి' అదనంగా చేరి తృతీయార్థకమగును.

**ఉదా:** మదనోన్మాదంబునం - జేసి (శృ॥నై॥ 2.84)

నన్నయ భాషలో 'వలన' అను అనుబంధ ప్రత్యయంతో కూడి

- చేసి తృతీయార్థంలో వాడబడింది.

**ఉదా:** క్రోధంబు వలన ఁజేసి లజ్జయు, వృత్తంబు నుంజెడు (భార 3.2.315)

- చేతన్, - చేన్, - చేసి, - మెయిన్ ప్రత్యయాలు తృతీయార్థంలో - తోడన్, - తోన్ ప్రత్యయాలు తృతీయార్థంలో

సహార్థంలో (Sociative) వస్తున్నాయి శ్రీనాథునిలో.

తృతీయా విభక్తి శ్రీనాథుని భాషలో ఈ క్రింది అర్థాల్లో ప్రయుక్తము.

1. **గ్రహణార్థము** : (బాల - కారక 4)
బ్రాహ్మణుల చేత దీవెనల్ వడసి (శృ॥నై॥ 3.107)

2. **కరణార్థము** : (బాల - కారక 5)
దంభోళితోడ సంస్తంభించితి (భీమ 3.212)

3. **తుల్యార్థము** : (బాల - కారక 5)
పువ్విలు కాని తోడ సరిపోలెడు చక్కని వాడు (శృ॥నై॥ 1.77)

4. **సహార్థము** : (బాల - కారక 5)
కుంభ సంభవు డబ్ధితో ౘగూడ ౘగ్రోలి (శృ॥నై॥ 2.123)

5. **వచ్యర్థాముఖ్య కర్మమునకు** : (బాల - కారక - 6)
ఆమానాధికు తోడనిట్లనియె (హర 2.57)

6. **హేత్వర్థకము** : (బాల - కారక - 4)
దానాదుల చేత సంచితంబులైన దురితంబులు నిరసింపబడుట (కాశీ 3.50)

**15.1.2.3 చతుర్థీ విభక్తి:-** ఈ విభక్తి యందు వచ్చు ప్రత్యయాలు

- కై / కయి, - పొంటెన్, - కొఱకు

1. **- కై / కయి** : షష్ఠీ ప్రత్యయమైన కు + అయి / కు + ఐ (అగుధాతువు యొక్క క్త్వార్థకము) అను వాని చేరికవల్ల కలిగిందని పరిశీలకుల నిర్ణయం. ఉదంత ప్రాతిపదికలకు నవర్ణము - కై / - కయి ప్రత్యయాలు పరంగా వస్తాయి.
ఉదా: చక్రలాభమున - కై (భీమ 6.62)
ఏ కార్యమున - కయి యే చోటి కరిగెదరు (శివ 4.54)

2. **- పొంటెన్** : శ్రీనాథుని భాషలో ఈ ప్రత్యయం మూడు పర్యాయాలు మాత్రమే ప్రయుక్తము.
ప్రథమా విభక్తి రూపం పై 2 పర్యాయాలు
ఉదా: ఎద్ది రచియంచె బుధ లోక హితము పొంటెనట్టి (శృ॥నై॥ 1.16)
అట్టి నెయ్యము పొంటెనలుని పాత్రుండవై (శృ॥నై॥ 8.129)
తద్ధర్మార్థక ధాతుజ విశేషం పై పర్యాయం
ఉదా: శిశిరోపచారముల్ సేయు పొంటె బ్రోవు (శృ॥నై॥ 2.116)
- పొంటెన్ తోడి ప్రయోగాలు నన్నెచోడుని యందు లేవు. నన్నయ, తిక్కనలు వాడారు.

3. **- కొఱకున్** : (కొఱ + కు) కొఱ - ప్రయోజనము 'కొఱ' అను శబ్దము 'కు' అను ప్రత్యయమునెగసి 'కొఱకు' అయినది.

- కొఱకున్ ప్రత్యయము నన్నయ, నన్నెచోడుల యందు గానీ, పదునొకండవ శతాబ్దపు శాసనాల యందు గాని, తత్పూర్వపు శాసనాల యందు గానీ కన్పించదు. తిక్కన భాషలో 4 ప్రయోగాలు ఉన్నాయి.

- కోసము అను పదము చతుర్థీ విభక్త్యర్థ కావ్యముగ శ్రీనాథుని పలనాటి వీరచరిత్రలో కలదు. ఇది కన్నడమందలి 'ఓస్కర' శబ్దంతో సంబంధించినదందురు. తెలుగు మాండలికాల్లో 'కోసరము' సైతం కన్పిస్తున్నది.

**ఉదా:** కలిమి కోసము వచ్చి కలియుట లేదు (ప॥వీ॥ 97)

సంప్రదానార్థమున చతుర్థి వస్తున్నది

వానికై యభీతి దాన మొసగు (శృ॥నై॥ 4.101)

15.1.2.4 **పంచమీ విభక్తి:-** ఈ విభక్తి యందు శ్రీనాథుని భాషలో కనిపిస్తున్న ప్రత్యయాలు.

1. **ఉండి** : (ఉండు ధాతువు యొక్క క్వార్థకము)

**ఉదా:** గద్దియ - నుండి (శృ॥నై॥ 7.160) కాశి - నుండి (కాశీ 3.101)

2. **వలనన్** : (దిగర్థకమగు 'వలను' పదానికి సప్తమ్యేకవచనము) అది - వల్ల అనియు వికారాన్ని పొందింది. ఇది ప్రత్యేక పదంగా 5 పర్యాయాలు వచ్చింది.

**ఉదా:** ఆ వలనన నిర్గమించి కదా (కాశీ 3.120)

వల్లతోడి ప్రయోగాలు పలనాటి వీరచరిత్ర యందే కలవు.

**ఉదా:** వల్ల - వలన: కదలిన నీ వల్ల గాకున్న నేమి (ప॥వీ॥ 50)

నేటి వ్యవహారంలో 'వల్ల' ప్రచురంగా కలదు.

వలన ప్రత్యయం భిన్నార్థాలలో శ్రీనాథుడు వాడాడు.

1. **అపాయార్థము** : అపరాధంబు వలన విముక్తుడగుటయున్ (కాశీ 4.68)
2. **భయార్థము** : మూడు కోట్లు వారల వలనం గలంగెడు(హర 7.148)
3. **గ్రహణార్థము** : గుణంబులు జన పరంపర వలన వినియె (శృ॥నై॥ 1.78)
4. **భవ నార్థము** : భువనేశ్వరి మహేశ్వరుని తేహంబు వలన నిర్ముక్తమయ్యెన్ (భీమ 2.15)
5. **త్రాణార్థము** : మృత్యుదేవత వలన నిజ ప్రాణంబులకు బరిత్రాణంబు గావింపను (శృ॥నై॥ 4.40)

3. **కంటెన్** : (షష్ఠి + - కు + అంటెన్ : అంటి వేని అనుధాతు చేదర్భక పరిణత రూపము)

**ఉదా:** నీ - కంటెన్ (హర 7.23)

చిఱు తొండ నంబి - కంటెన్ (హర 2.81)

4. **కంటె** : తరుణి - కంటె (భీమ 5.64) ముక్కంటి - కంటె (కాశీ 7.123)

1. అమహద్వాచకమైన ఉదంత ప్రాతిపదిక తరువాత 'న' వర్ణమాగమముగ వచ్చును.

**ఉదా:** ఎలమి తూము - న - కంటె హెచ్చు గొలిచి (ప॥వీ॥ 42)

2. భావార్థక స్ఫూర్తి కలిగి తద్ధర్మార్థకము పై - కంటెన్ ప్రత్యయము వచ్చుట కలదు.
   **ఉదా:** కడువేడుక వచ్చు కంటెఁ ప్రీతి (భీమ 5.62)
3. - కంటె వర్ణక మవ్యయముల మీదను చేరును. అంత - కంటెను (కాశీ 3.78). ఇంత కంటెను (కాశీ 4.133)
4. - కంటె వర్ణకమునకు మాఱుగ 'కన్న' వర్ణకము శ్రీనాథుని భాషలో కలదు.
   **ఉదా:** కాశి - కన్నను నెక్కడు గౌరవమున (భీమ 2.5)
   కోలెన్: (కొలు -చు : సేవించు, తూకము చేయు)
   కోలె / - కోలెను: కాల వాచక శబ్దముల పై క్రియాజన్య విసేషణముల పై కనబడుచున్నది.
   కాల వాచక శబ్దముల పై: పుట్టిన నాఁటన్ - గోలె (హర 4.26)
   క్రియా జన్య విశేషణములపై: తరుణేందుధరున్ వీక్షించిన
5. **కతమున:** (కృతము యొక్క కోలెను (కాశీ 3.25) తద్భవ రూపము)
   - కతంబున / - కతమున:
   **ఉదా:** నీ - కతంబున ఁగాదె కాకోల విషవహ్ని (కాశీ 5.86)
   గర్భ భారము కతమున (శివ 2.51)
   - కతన: నీ చరిత్రంబు - కతన (హర 4.21)
   - కతాన: పెల్లాకొన్న - కతాన (భీమ 2.120)
6. **- పట్టి:** (పట్టు ధాతువునకు క్త్వార్థకము: గ్రహించి)
   1. ఇది పదముల ద్వితీయా విభక్త రూపముల మీద చేరుచుండును.
      **ఉదా:** భుజంగ ప్రతానము ఁబట్టి బాధింతురు (హర 5.16)
   2. అన్నంత రూపముల మీదను పట్టి ప్రయుక్తమై హేత్వర్థమగును
      **ఉదా:** సురలునసురులు సంప్రీతి ఁదరువం బట్టి (కాశీ 5.283)
      సేవింపఁ బట్టి (కాశీ 6.18)
   3. భావార్థకము పై 'పట్టి' ప్రయుక్తమై హేత్వర్థకమగును.
      **ఉదా:** నీ బోఁటి పుణ్య వతులు కొందఱు గలుగంబట్టి (కాశీ 2.93)
   4. పట్టి' ని హేత్వర్థముననే కాక యితరార్థము లందును వాడవచ్చును.
      'పెద్ద గాలంబునం బట్టి' (కాశీ 5.275)
      'మానుమిటఁబట్టి యేనీకుమాన్య నేని' (శృ॥నై॥ 4.82)

   - ఉండి, - కోలెన్ అనునవి నామముల యొక్క సప్తమీ రూపముల పై ప్రయోగింపబడ్డవి. మిగిలినవి నియత పద్ధతిలో ద్వితీయా విభక్త్యంగ రూపాలు.

**15.1.2.5 షష్ఠీ విభక్తి:-** షష్ఠీ విభక్తి సామాన్యంగా సంబందార్థంలో వస్తుంది. దీన్నే శేష షష్ఠి అంటారు. ఈ శేష షష్ఠి యందు 'యొక్క' అనుదానిని కూడా వ్యాకరణ కర్తలు చెప్పారు. కాని ఇది శ్రీనాథుని కావ్యాల యందు లేదు.

షష్ఠీ విభక్తి యందు వచ్చు ప్రత్యయాలు.

- కున్, - కిన్.

**-కున్:** దీనిని తెలుగు వైయాకరణులు షష్ఠీ విభక్తి ప్రత్యయంగ పరిగణించారు. కేతన దీన్ని చతుర్థీ, షష్ఠీ విభక్తి ప్రత్యయంగా గుర్తించాడు. తర్వాతి వ్యాకరణ వేత్తలు దీనిని షష్ఠీ విభక్తి ప్రత్యయమని నిర్ధారించారు. ఇట్టి భిన్నాభిప్రాయాలు కలగటానికి కారణమేమంటే చారిత్రకంగా తెలుగు నందలి ప్రత్యేకమైన ప్రత్యయం చతుర్థ్యర్థాన్ని ఇస్తున్నది. - కై (కు + అయి), కొఱకు (కొఱ + కు) ఇందలి -కు వర్ణమే షష్ఠీ విభక్తి ప్రత్యయం. అయినప్పటికీ సాధారణంగా ఈ ప్రత్యయం సంబందార్థము నందు కంటె సంప్రదానార్థమైన చతుర్థ్యర్థముననే వాడబడుచున్నది.

1. అదంత - ఉదంత - ఎదంత ప్రాతిపదికల పై - కున్ ప్రత్యయము వచ్చును.

   **ఉదా:** అన్న - కున్ (హర॥పీ॥ 30), కన్నె - కున్ (శృ॥నై॥ 8.121)

2. -కు ప్రత్యయము పరమగుచో ఉదంతములకు 'న' వర్ణమాగమమగును.

   **ఉదా:** అంతి పురంబు - న - కు (శృ॥నై॥ 7.145)

   కొడుకు - న - కున్ (కాశీ 4.11)

3. ఈ క్రింది ప్రయోగాల్లో నగాగమ ప్రాప్తి లేదు.

   బచ్చు - కున్ (శృ॥నై॥ 6.115) ఎదురు - కు (భీమ 4.12)

   పదునాల్గవ శతాబ్దం నుండీ కవులు యథేచ్ఛగా నగాగమం లేని రూపాలు వాడుచూ వచ్చారు. అయినప్పటికీ ఇట్టివి క్వాచిత్కంగా పూర్వ కవుల్లో కలవు.

   నన్నయలో : తాకు - కు (భార 3.4 - 12)

   నన్నెచోడునిలో : నభము - కు (కు॥సం॥ 1.168)

   పాల్కురికి సోమనలో : కొలువు - కు (బసవ 7.218)

   తిక్కనలో : ఆకసంబు - కు (ఆను 5.468)

   నాచన సోమనలో : దిక్కు - కు (ఉ॥హ॥ 2.40)

4. సంబందార్థమున - కున్ ప్రత్యయము ఈ క్రింది ప్రయోగాల్లో శ్రీనాథుడు వాడాడు.

   నీకున్ - కోడలు (హర 1.8) ఈతండు మగడు నీకున్ (శృ॥నై॥ 4.109)

   **-కిన్:** 1. ఇదంత ప్రాతిపదికల పై -కిన్ ప్రత్యయము వస్తుంది.

   గుడి - కిన్ (భీమ 3.59) తల్లి - కిన్ (హర 2.58)

   2. మహద్వాచకములకు నిగాగమము మీద - కిన్ అను ప్రత్యయము వస్తుంది.

   అల్లు - ని - కిన్ (శృ॥నై॥ 6.97)

**శేష షష్ఠీకి:** 1. ఉకారాంత జడ వాచక పదములలో : ఎదుర్కట్టున (కాశీ 6.262)

2. కొన్ని యెడల నామమున కెట్టి ప్రస్ఫుటమైన సంకేతమును లేకయే యుండును. అట్టి యెడల శబ్ద క్రమము (word order) ప్రాధాన్యము వహించును.

   **ఉదా:** మృత్యు దేవత ముని పండ్లు (కాశీ 2.47) పులితోలు (హర 4.11)

3. ప్రథమైన ప్రత్యయమైన - ండు వర్ణము లోపించటంచే షష్ఠ్యర్థము వస్తుంది.

   **ఉదా:** అభవు - మ్రోల (హర 3.70) దైత్యు చిత్తంబు (హర 3.4)

తెలుగు వైయాకరణలు - లోన్, - లోపలన్ అనేవి షష్ఠీ విభక్తి ప్రత్యయాలుగా పరిగణించారు. దీనికి కారణము సంస్కృత విభక్తి విధానానుసరణమే. కాని అవి వాస్తవంగా సప్తమీ విభక్తి యొక్క అనుబంధ ప్రత్యయాలు.

**15.1.2.6 సప్తమీ విభక్తి:-** ఈ విభక్తి యందు వచ్చు ప్రత్యయాలు.

1. -అన్ / -నన్ 2. - అందు 3. -లో / - లోన్ । -లోన । -లోనన్ 4. -లోపల / -లోపలన్

స్థల వాచకమైన - ఆల్ అను పదం నుండి - ఆన్ అను ప్రత్యయం నిష్పన్నమైనటుల కొందరు పండితుల అభిప్రాయం (కన్న . అల్లి . తె . అల్ల)

- లోన్, - లోపలన్ అనేవి నిర్ధారణార్థంలో తర్వాత ఏర్పడ్డ షష్ఠీ విభక్తి ప్రత్యయాలు. కాని అవి సప్తమ్యర్థాన్నిస్తున్నవని సంప్రదాయ వ్యాకరణ వేత్తల అభిప్రాయం.

- ఆన్: నోరన్ (హర 2.83) ఇంటన్ (శివ 3.15) (బహు) కెలంకులన్ (శృ॥నై॥ 1.74) నలుదెస - లన్ (శృ॥నై॥ 1.64)

- నన్: ముక్కు - నన్ (కాశీ 4.227) పేరురము - నన్ (శృ॥నై॥ 8.113)

- అందు: 693 పర్యాయాలు ప్రత్యయంగా, 72 పర్యాయాలు ప్రత్యేక పదంగా ప్రయోగింపబడింది.

ప్రత్యేక పదము: అందగ్రజుండు (శృ॥నై॥ 1.54)

1. ఉదంత శబ్దముల ఏకవచనమునకు అందు వర్ణకము పరమగునపుడు నగాగమము వచ్చును.
   పద్మమునందు (శృ॥నై॥ 6.77) బహు । సప్తర్షులందు (శృ॥నై॥ 1.19)
2. నిర్ధారణార్థమున అందు వర్ణకము
   దీవులందెల్ల నేరేటి దీవి లెస్స (హర 2.3)
3. అధికరణమున అందు వర్ణకము
   కాశి పురంబు నందు భిక్షాన్నము లేదు (కాశీ 7.180)
4. కొన్ని యెడల సప్తమీ విభక్తి ప్రత్యయము పై 'అందు' ప్రయోగించుట కలదు.
   కాశికా స్థానము - న - యందు (కాశీ 1.174)

- లో - ప్రత్యయంగా 122 పర్యాయాలు
- లోన్ - ప్రత్యయంగా 150 పర్యాయాలు, ప్రత్యేక పదంగా 5 పర్యాయాలు
- లోన - ప్రత్యయంగా 104 పర్యాయాలు
- లోనన్ - ప్రత్యయంగా 38 పర్యాయాలు, ప్రత్యేక పదంగా 6 పర్యాయాలు
- లోపల - ప్రత్యయంగా 7 పర్యాయాలు
- లోపలన్ - ప్రత్యయంగా 13 పర్యాయాలు, ప్రత్యేక పదంగా 2 పర్యాయాలు

శ్రీనాథుని భాషలో కన్పిస్తున్నవి.

**15.1.2.7 సంబోధనా విభక్తి:-** సంబోధనమును తెలియజేసే విభక్తిని సంబోధన ప్రథమా విభక్తి అంటారు.

1. మహద్వాచక శబ్దాల చివరి అచ్చు సంబోధనలో దీర్ఘాన్ని పొందుతుంది.
   **ఉదా:** తత్సమాలలో - కుంభ సంభవా (కాశీ 5.175)

దేశ్య శబ్దాలలో - అన్నా! (హర 2.75)

2. కొన్ని యెడల తుది అచ్చుకు దీర్ఘము వైకల్పికము

**ఉదా:** భూదేవ (కాశీ 3.202) కలశ సంభవ (కాశీ 7.127)

3. ఇదంత ప్రాతిపదికలు దీర్ఘాన్ని పొందటం వైకల్పికము

**ఉదా:** తల్లీ (భీమ 2.120) కల్యాణీ (భీమ 5.85)

4. సంబోధనమున ప్రాతిపదిక మీద లింగవచన ప్రత్యయమునకు అకారము కలిగి దీర్ఘము కలుగుతున్నది

**ఉదా:** తమ్ముడా (హర 3.94), చెలువుడా (ప॥వీ॥ 99)

5. సంబోధనమున బహు వచన నామాలకు - ఆర ప్రత్యయం వస్తుంది

**ఉదా:** దేవతలార (శృ॥నై॥ 4.113), సఖులార (శృ॥నై॥ 1.110)

6. 'ఓ' శబ్దము సంబోధ్య వాచకానికి ముందే వాడబడుతుంది.

(ఏక) ఓకంసారి (శృ॥నై॥ 8.146), ఓ తండ్రి (కాశీ 4.37), (బహు) ఓ వెఱ్ఱులార (భీమ 4.52)

7. ఓ శబ్దానికి చివర పురుష సంబోధనమున 'యి' వర్ణమును, నీచ పురుష సంబోధనమున 'రి' వర్ణమును వికల్పముగ ఆగమములగును.

| | | |
|---|---|---|
| ఓయి | : ఓయి : జనమే జయిండ | (భీమ 3.216) |
| క్రియల పై | : వినవోయి | (ప॥వీ॥ 2) |
| ఓరి | : ఓరి దురాత్మ | (భీమ 2.153) |
| రపై ఓరి | : ఎవ్వడవురోరి | (హర 7.50) |

8. స్త్రీ వాచక పదాలకు పరంగా - రో ప్రత్యయం కేవలం పల్నాటి వీర చరిత్రయందే వస్తున్నది.

**ఉదా:** ఇంతి - రో (ప॥వీ॥ 39), తల్లి - రో (ప॥వీ॥ 38)

9. దేశ్యములందు కొన్ని చోట్ల స్త్రీ వాచకములగు సంబోధ్య వాచకాల మీద ఏక వచనమున 'కాన' శబ్దం చేరుతుంది.

**ఉదా:** ధర్మమే మరకుండుమీ తల్లి - కాన (శృ॥నై॥ 7.9)

చిలకల కొలికి - కాన (శృ॥నై॥ 8.50)

10. సంబుద్ధి యందు మహతీ వాచక పదములతో 'ఓమె - ఏమె' ప్రయోగింపబడుతున్నది.

**ఉదా:** ఓమె, యేమె, యిదే మేమె లేమయేమె

మేఘ పుష్పంబు (దేవంచు మేలమాడ (శృ॥నై॥ 6.114)

## 15.1.3 విభక్తి విపర్యయము (Functional Syncretism):-

వైయాకరణులు వివరించిన ప్రత్యయాలు, వారు విధించిన విభక్తుల యందే కాక యితర విభక్తుల యర్థము నందును వచ్చుచుండుట గోచరించును. ఈ విషయాన్నే ఆంధ్ర శబ్ద చింతామణి కారుడు "అన్యస్యాః క్వచిద్భవే చ్ఛాన్యా" అని సూత్రించెను. ఈ సంస్కృత సూత్రానికి అనువాదమే అనదగినచ్చు 'ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియునగు' (బాల - కారక - 21) అని సూరి సూత్రీకరించెను. వ్యాకరణ నియమాన్ననుసరించి ఒక విభక్తి ప్రత్యయం రావలసి ఉండగా అదిరాక దాని స్థానము నందు మఱియొక ప్రత్యయం వస్తుందని అర్థం.

ఆధునిక పద్ధతిలో దీనినిట్లా వివరించవచ్చును. ఒక విభక్తి ప్రత్యయానికి ఒక కారక సంబంధ వ్యక్తీకరణము ప్రధాన కార్యం గుర్తించి, అట్టి కార్యం మరికొన్ని విభక్తులచే జరిగితే అది విభక్తి విపర్యయమని అంటారు. దీనిని బట్టి ఒక విభక్తికి ప్రధాన కారక సంబంధాన్ని గౌణ కారక సంబంధాలను ఏర్పరింపవచ్చును. ఆధునిక వ్యాకర్తలు కారక సంబంధాలను గుప్త నిర్మాణము నందు గుర్తిస్తారు. విభక్తి సంధానాన్ని వాని మార్పులను పరివర్తన సూత్రాల ద్వారా సాధిస్తారు. అంటే విభక్తి విపర్యయాలను సాధించు సూత్రాలను పరివర్తన నిర్మాణములుగా గ్రహింపదగును.

శ్రీనాథుని కావ్యాల యందు ఒక విభక్తి మఱియొక విభక్తి వచ్చిన ఉదాహరణాలు క్రింద పొందు పరుపబడుచున్నవి.

i. **ద్వితీయకు ప్రథమ:** జడ వాచక నామముల పై వచ్చును.

నీ వరంబేదియొ వేడుమనుటయు (వరంబును) (హర 7.101)

ఇది యన్యాయముగా నీ చిత్తంబున (దీనిని) (హర 2.12)

దలఁపకుము

**తృతీయకు ప్రథమ:**

కనుగొందు సుఖమున్న వారలిందు (సుఖముతో) (కాశీ 2.11)

వరుణ లోకంబునందు నిండు వేడుక సుఖియించు చుండువారు (వేడుకతో) (కాశీ 4.66)

**చతుర్థికి ప్రథమ:**

ధర్మ శీలత యర్థించి నిర్మలత్వమాసపడి (ధర్మశీలత కొఱకు) (నిర్మలత్వము కొఱకు) (శృ॥నై॥ 4.78)

పనిపూని కాశికా నగరంబు కరిగి (పనికై పూని) (కాశీ 6.57)

**పంచమికి ప్రథమ:**

ఇట్లు గగనంబు డిగ్గి (గగనంబు నుండి) (శృ॥నై॥ 3.39)

నిజ గృహంబు వెలువడి (గృహంబు నుండి) (హర 2.43)

**షష్ఠికి ప్రథమ:**

అది గర్భమై (దానికి) (కాశీ 6.107)

కురియు నెలమూఁడు వానలు (నెలకు) (కాశీ 4.301)

**సప్తమికి ప్రథమ:**

పేరోలగంబుండి (పేరోలగంబునందు) (హర 3.37)

ఇల్లు సొచ్చి (ఇంటి యందు) (కాశీ 5.66)

ii. **తృతీయకు ద్వితీయ:**

తన భక్తి భజింపగ (భక్తితో) (హర 5.3)

మొలచిన కూర్మిఁగన్నుఁగవ మోడ్చిన (కూర్మితో) (శృ॥నై॥ 1.69)

**చతుర్థికి ద్వితీయ:**

వానిఁగొనపోవఁబనిఁబూని వచ్చిరపుడు (పనికై) (కాశీ 4.125)

**పంచమికి ద్వితీయ:**

ప్రమదంబు లాత్మ లంజిప్పిలు చుండ (ఆత్మల నుండి పైకుబుకగా) (శృ॥నై॥ 1.67)

పరికల్పనఁబుట్టెడు నంత రాయముల్ (పరికల్పనమున) (శృ॥నై॥ 1.69)

**షష్ఠికి ద్వితీయ:**

తమ్ముని వీరభద్ర వసుధాధి ప్రవిక్రమ వీరభద్రుని స్సమ్మదలీల

రాజ్యభరణ స్థితిఁబట్టముఁగట్టి (తమ్మునకు, వీరభద్రునకు) (భీమ 1.34)

**సప్తమికి ద్వితీయ:**

పూజనీయుండు కావున బుద్ధిఁదలఁచి (బుద్ధి యందు) (హర 6.52)

నలుదెసలఁగరుల గండస్థల ఫలకములన్ (నలుదెసల యందు) (శృ॥నై॥ 1.64)

iii. **పంచమికి తృతీయ:**

దాక్షాయణితోఁబాసి (దాక్షాయణి వలన) (కాశి 4.243)

బ్రాహ్మణుల చేత దీవనల్ వడసి (బ్రాహ్మణుల వలన) (శృ॥నై॥ 3.107)

**షష్ఠికి తృతీయ:**

పువ్విలు కాని తోడ సరిపోలెడు చక్కని వాడు (పువ్విలుకానికి) (శృ॥నై॥ 1.77)

iv. **ప్రథమకు షష్ఠి:** క్రియకు 'వలయు' అన్న అనుబంధంతో కూడి వస్తే సాధారణంగా షష్ఠీ విభక్తే వస్తుంది. వీనికి తెలుగులో ప్రాచీన ప్రయోగాలున్నాయి.

(i) అవ్వీర మహేశ్వరు నాకుం జూడవలయు (నేను) (హర 2.14)

నాకుంబంక జాసనునకుంబరి చర్య

సేయంబోవ వలయునని (నేను) (శృ॥నై॥ 2.106)

(ii) నీ పెంచిన లత (నీవు) (హర 4.19)

మీకు సాధింపని కార్యంబు (మీరు) (శృ॥నై॥ 3.64)

**ద్వితీయకు షష్ఠి:**

నిరోధంబునంకిలి కోర్చి (నిరోధంబు చేతనైన విలంబమును) (శృ॥నై॥ 7.172)

నానేర్చిన భంగికాశికా మాహాత్మ్యంబు (నేను) (కాశీ 5.4)

**తృతీయకు షష్ఠి:**

అతివ ఈ గర్భ మెవ్వరి కైతి (ఎవ్వరి చేత) (కాశీ 4.226)

కంతుని కిట్లనియె (కంతునితో) (హర 3.48)

**చతుర్థికి షష్ఠి:**

ఇక్షురసము మాకునిపుడు తెమ్ము (మాకొఱకు) (హర 1.17)

మాకుం గృప సేసిన యీ సంస్మరణాను (మాకొఱకు) (హర 4.46)

**పంచమికి షష్ఠి:**

గాలికి దూలెడు ఘన శిరోజములు (గాలి వలన) (ప॥వీ॥ 11)

గోప్రదాతలకు మిగిలిన పుణ్యవంతులు లేరు (దాతలకంటె) (కాశీ 3.29)

v. **ద్వితీయకు సప్తమి:**

మహీధవుండు కిల్బిషంబునఁబొందదండని (కిల్బిషంబును) (శృ॥నై॥ 2.8)

వైశ్య కులమూర్జిత్యంబునంబొందఁగా (ఔర్జిత్యంబును) (హర 1.11)

**తృతీయకు సప్తమి:**

ఆశాపాశంబులఁగట్టు వడినారు (ఆశాపాశములతో) (శృ॥నై॥ 4.79)

తద్గుణాకర్ణనంబున ఁదదనిరీక్షణమున (ఆకర్ణనంబుతో) (శృ॥నై॥ 1.68)

**పంచమికి సప్తమి:**

నేఁడాదిగ దీనఁబాయఁబడెనో మనకున్ (దీనివలన) (కాశీ 5.43)

ప్రీతి వాసను వశంబున ఁబ్రతిదిన ప్రవర్ధమానంబగు (వశంబు వలన) (శృ॥నై॥ 1.73)

**షష్ఠికి సప్తమి:**

చిరకాలంబుననుపార్జింప బడ్డ (చిరకాలమునకు) (శృ॥నై॥ 3.68)

ఎక్కడ నేనియుంజనువాడు (ఎక్కడకు) (కాశీ 4.107)

పై ప్రయోగానురూపవైఖరిని అనుసరించి చూస్తే కొన్ని భాషకు సహజమైనవిగా, మఱికొన్ని సంప్రదాయానుసారమైన నుడికారముతో కూడినవిగా గోచరిస్తున్నవి. ఉదాహరణకు, ద్వితీయకు ప్రథమ వచ్చిన సందర్భాలను పరిశీలిస్తే, అవి కేవలం జడవాచక నామాల యందే వస్తున్నవి. చతుర్థికి ద్వితీయ, షష్ఠీకి తృతీయ కొన్ని యెడల తరచుగా కన్పిస్తున్నవి. మరికొన్ని రూపాలు సంస్కృత ప్రభావానికి లోనైనవి కలవు.

**ఉదా:** వానికిం బ్రసాదింపు (శృ॥నై॥ 2.12) (తదర్థము)

నాకు రచియింపు (కాశీ 7.40) (మదర్థము)

ఇట్టి సందర్భంలో సాధారణంగా తెలుగున - పై , - మీఁద, అను అనుబంధ ప్రత్యయాలు వాడబడుచుండును.

## 15.1.4 శ్రీనాథుడు ప్రత్యేకంగా వాడిన అనుబంధ ప్రత్యయాలు:-

నన్నయ, నన్నెచోడుడు, తిక్కనల కాలానికి లేని అనుబంధ ప్రత్యయాలు శ్రీనాథుడు తన కావ్య జాలంలో విరివిగా వాడుక చేశాడు. ఈ క్రింద అవి పొందుపఱుపబడుచున్నవి. కుండలీకరణము నందలి సంఖ్యలు పౌనఃపున్యమును నిరూపించును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | **అనుసరించి** | : | (3) | ఋషులననుసరించి యేతెంచుచుండి | (భీమ 4.179) |
| 2. | **కూడ** | : | (21) | అతి పరిశ్రాంతిఁబొంది కూడ రెండవ రతికి | (శృ॥నై॥ 8.84) |
| 3. | **క్రింద** | : | (6) | ఏమి చెప్పనిట క్రింద బలారికి | (శృ॥నై॥ 4.28) |
| 4. | **తప్ప** | : | (4) | చల్లని చోటు దప్ప నడచుకొని | (కాశీ 5.74) |
| 5. | **దాక** | : | (7) | కలియ వచ్చిన దాక గడియ కాలంబు | (ప॥వీ॥ 83) |

6. సం(ప్రదాయ వైయాకరణలు పేర్కొనిన సప్త వ్యార్థకానుబంధ (ప్రత్యయాలు శ్రీనాథునిలో కలవు - పై । - పయి । - పైన్ । - పయిన్ । - పైన.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **- పై** : | (142) | బొజ్జ పై | (కాశీ 7.187), | సెజ్జ పై | (శివ 1.66) |
| **- పయి** : | (8) | మోవిపయు | (భీమ 1.3) | | |
| **- పయిన్** : | (17) | మోవిపయిన్ | (హర 4.19) | | |
| **- పైన్** : | (50) | సుతపైన్ | (హర 4.45) | | |
| | | కొప్పుపైన్ | (కాశీ 7.224) | | |
| **- పైన** : | (5) | భారతీదేవి పద్మజు పైన ఁజల్లె (భీమ 5.121) | | | |

7. **మా(త్రంబు:**(1) కోపించింత మా(త్రంబ చాలునని పలికి (శృ॥నై॥ 8.77)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 8. **- మీఁద** : | (95) | పొన్పు మీఁద | (హ 7.123) | కెమ్మోవి మీఁద | (శృ॥నై॥ 2.26) |
| **- మీఁదన్** : | (32) | అడుగుల మీఁదన్ | (హర 3.73) | ఇల మీఁదన్ | (శృ॥నై॥ 8.137) |
| **- మీఁదట** : | (1) | కోటల మీఁదట | (భీమ 1.109) | | |
| **- మీఁదటన్:** | (2) | అరుంగు మీఁదటన్ | (హర 2.41) | | |

9. **వద్ద:** (8) < **యొద్ద:**

(బహ్మనాయుని వద్ద బలువైన కుంతమున్నది (ప॥వీ॥ 26)

కుమారుని తన యొద్దకుం గొని వచ్చుటయు (కాశీ 4.68)

## 15.1.5 ఔప విభక్తికములు (Inflexional Increments):-

సాం(ప్రదాయక వైయాకరణులు -ఇ-, -తి-, -టి-, -ంటి- అనే వాటిని ఔప విభక్తికాలుగా గుర్తించారు. కాని వీనికి తోడు -అ- వర్ణం కూడా చేరుతుంది. -ఇ- వర్ణం సాధారణంగా ఏక వచనముల పైన, -అ- వర్ణం ఎక్కువగా బహువచన రూపాలలో ఔప విభక్తికంగా వాడటం కలదు. ఇవి చేరటం చేత ద్వితీయాద్యంగం ఏర్పడుతున్నది. సమాసాలేర్పడేటప్పుడు నడుమ ఇవే ఆగమా దేశాలుగా వస్తవి.

-ఇ-, -అ- అంత్యాచ్చునకు ఆదేశమగును. -తి-, -టి-, -ంటి- కొన్ని యెడల అంత్య వర్ణానికి ఆదేశాలుగాను, కొన్ని యెడల ఆగమాలుగాను వస్తవి. -అ- వర్ణము యొక్క ఉపస్థితి **(occurrence)**, ఆత్మార్థక సర్వనామ ద్వితీయాది విభ్యక్త్యైక వచనరూపాన్ని పొందుతున్నది.

తన - కు (హర 2.63) దీని (ప్రథమైక వచనము 'తాను'

**ఏక వచనము:**

| | | | |
|---|---|---|---|
| -ఇ- : | ఆలి - ని | (< (ప్రథమ : ఆలు) | (శివ 1.3) |
| | ఊరి - కి | (< (ప్రథమ : ఊరు) | (కాశీ 192) |

-తి- : ఆలనేతి - తో (< ప్రథమ : నేయి) (హర 5.47)

జాతి - మీద (< ప్రథమ : జాయి) (భీమ 2.102)

-టి- : ఏటి - లో (< ప్రథమ : ఏఱు) (హర 6.10)

తాటి - యంత (< ప్రథమ : తాడు) (హర7.62)

-ంటి- : ఇంటి - లో (< ప్రథమ : ఇల్లు) (హర 2.70)

పగలింటి - నిద్రలు (< ప్రథమ : పగలు) (శృ॥నై॥ 7.61)

**బహువచనము:**

**సార్వనామిక రూపములందు:**

-ఇ-: వారి - యందును (< ప్రథమ : వారు) (శృ॥నై॥ 4.18)

వారి - వలన (< ప్రథమ : వారు) (శృ॥నై॥ 3.64)

-అ-: చేడియల చేత (శృ॥నై॥ 3.37) దేవతల - కంటె (కాశీ 4.20)

1. చారిత్రికంగా ప్రయోగ రూపాల యందు మార్పు గోచరిస్తున్నది. శ్రీనాథునిచే ప్రయోగింపబడ్డ ఔపవిభక్తి శబ్దము లోక విధంగా ఉండగా, కొందరు వానిని భిన్న రూపాలలో ప్రయోగించినట్లు కనబడుతున్నది.

**ఉదా:** మొదలి (కాశీ 2.132) మొదలింటి (శివ 1.49)

ఆఁకటికి (కాశీ 7.168) ఆ ఁకలికి (కాశీ 6.78)

2. నన్నెచోడ, తిక్కనల కాలంలో గల ఈ క్రింది రూపాలు శ్రీనాథుని కాలంలో ఔప విభక్తిక ప్రత్యయాలుగాను మార్చుకొన్నవి.

**ఉదా:** నీరిలో (కు॥సం॥ 1.95) నీరఁగలిపి(కు॥సం॥ 5.137)

నీరిలో (ఉద్యో॥ 3.368) - నీటిలో

నోరికి వచ్చినట్లు (కర్ణ 3.80) - నోటికి

3. ద్వితీయాద్యేక వచనము పరమగునపుడు డుమంతమునకు 'ని' అను ఆగమం పాక్షికంగా వస్తుంది.

**ఉదా:** భర్గు - వలన (కాశీ 4.233) జము - ని - కంటె (కాశీ 2.89)

కృష్ణు - చేత (కాశీ 6.13) కాము - ని - చేతన్ (కాశీ 6.10)

4. అనుదంతమగు నచ్చ తెనుగు డుమంతమునకు ద్వితీయాద్యేక వచనము పరమగునపుడు నిగాగమము నిత్యముగా నగును (బాల తత్సమ 24)

మగ - ని - చేత (శృ॥నై॥ 8.72) మగ - ని - తోడ (హర 3.25)

5. తెలుగు శబ్దములైనప్పటికి ఉదంతములైనచో నిగాగమము పాక్షికంగా వస్తుంది.

అల్లు - ని - న్ (భీమ 2.73) అల్లు - ని -కి (హర 5.47)

చారిత్రకంగా - ఇ - వర్ణము ద్వితీయాది విభక్త్యంగముగను, - న్ ప్రాచీన మహద్వాచన రూపముగను చెప్పవచ్చును.

6. 'కూతురు' అను మహతీ వాచకమునకు ద్వితీయాది విభక్త్యేకవచనము 'కూఁతు'.

**ఉదా:** కూఁతున్ (శృ॥నై॥ 7.10) కూఁతు వలన (హర 3.22)

(బహు) కూఁతులు (శివ 4.12)

## 15.1.6 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని భాషలో కానవగు ద్వితీయాది విభక్తుల నిర్మాణాన్ని సోదాహరణంగా వివరింపుడు.
2. శ్రీనాథుని రచనలోని విభక్తి విపర్యయాన్ని తెల్పుడు.
3. శ్రీనాథునిలో కానవగు ఔప విభక్తిక నిర్మాణాన్ని వివరింపుడు.

## 15.1.7 ఆధార గ్రంథాలు:-

1. బాల వ్యాకరణము : ఆచార్య పరవస్తు చిన్నయసూరి
2. శ్రీనాథ భాషా పరిశీలన : ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 15.2

# శ్రీనాథుని రచనలో సమాస నిర్మాణం
# (Formation of Compounds)

**ముఖ్యాంశాలు:-**


15.2.0 లక్ష్యం

15.2.1 ఉపోద్ఘాతం

15.2.2 సమాసముల విభజన

15.2.3 శ్రీనాథునిలోని ఆచ్ఛిక సమాసాలు

15.2.4 శ్రీనాథునిలోని మిశ్ర సమాసాలు

15.2.5 శ్రీనాథునిలోని వైరి సమాసాలు

15.2.6 కారక సంబంధ మాధారంగా సమాసాల విభజన

15.2.7 శ్రీనాథునిలోని విశిష్ట సమాసాలు

15.2.8 అవయవ నిర్మాణాన్ననుసరించి శ్రీనాథుని భాషలో సమాసాలు

15.2.9 ప్రశ్నలు

15.2.10 ఆధార గ్రంథాలు


## 15.2.0 లక్ష్యం:-

శ్రీనాథుని సమాసాలను స్థూలంగా విభజించటం. 1. సాంస్కృతికములు, 2. ఆచ్ఛికాలు, 3. మిశ్రమాలు. అవయవ నిర్మాణాన్ననుసరించి విభజించటం. వైరి సమాసాల నిరూపణ - తత్పురుష - కర్మధారయము - ద్విగువు - ద్వంద్వ సమాసాల విశ్లేషణ చేయడం - విశిష్ట సమాసాలను పేర్కొనడం మొదటి - రెండు - మూడు - నాల్గు - ఐదు అంశాల సమాసాలను పేర్కొనటం ఈ వ్యాసంలో నిరూపింపబడతాయి.

## 15.2.1 ఉపోద్ఘాతము:-

కేవల ధాతువులతో ఏర్పడు పద నిర్మాణం సమాసమౌతుంది. ప్రాచీనులు విధించిన సమర్థ పద విధి కూడ దీన్నే సూచిస్తుంది. ఈ సమాసాలలో స్వతంత్ర పదాలుగా ఉన్న వానికి వాక్యార్థ బోధ ఉంటుంది. సాంప్రదాయికమైన విగ్రహవాక్య నిర్మాణం కూడా ఈ విషయాన్నే సూచిస్తుంది. కొన్ని యెడల సమాసాలు భిన్నార్థ బోధకాలవుతాయి. వాని అర్థాలు భాషా వ్యవహర్తల సాంస్కృతికమైన అలవాట్లను బట్టి గ్రహింపదగి ఉంటుంది. అట్టి వానిని సందర్భాన్ననుసరించి తెలిసికొనవచ్చు. ఉదాహరణకు 'ఇంటి పని' అన్నప్పుడు 'ఇంటిలో చేయు పని', 'ఇంటికి చేయు పని', 'ఇంటి నిర్మాణమునకు చేయు పని'. ఈ ప్రకారం రకరకాల

అర్థాలు చెప్పటానికి వీలుంది. క్రియా విభక్తులు, నామ విభక్తులు లోపించటం వల్ల ఈ స్థితి ఏర్పడుతుంది. ఆధునిక భాషా శాస్త్రంలోనైనా సమాస నిర్మాణంలో గర్భితంగా ఉన్న సూత్రాలు పూర్తిగా వెలికి తీయు పద్ధతులు లేవు. కొంతలో కొంత ప్రాచీన వ్యాకర్తల సమాస నిర్మాణ వివరణ పద్ధతియే పనికి వస్తుంది. అదైనా సమాస నిర్మాణంలో భాగస్వాములైన పదాలకున్న పరస్పర సంబంధాన్ని మాత్రమే తెలియజేస్తుంది. కానీ వానికి మూలమైన వాక్య నిర్మాణంలోని పదాల సంబంధాన్ని సంపూర్ణంగా సూచింప సమర్థం కాదు.

సమాస నిర్మాణంలో అంతర్గత సూత్రాలను కనిపెట్టుట ఆవశ్యకమను విషయాలను గుర్తిస్తూ, పటిష్ఠమైన విధాన లోపం వల్ల (సాధన లోపం వల్ల) ప్రస్తుతానికి సమాసములో పదాల స్థితి మాత్రమే ఇక్కడ పరిశీలింపబడింది.

భిన్న చారిత్రక కాలాల్లో అప్పటి భాషా పద్ధతిని బట్టి ఏర్పడ్డ పదాలు తర్వాతి కాలంలో స్థిర రూపాన్ని పొంది ఆ పద్ధతి అంతటితో ఆగిపోవచ్చు. అందువల్ల పద నిర్మాణంలో అన్నింటిని కలిపి ఏక సూత్ర బద్ధం చేయటం కష్టం. సమాసాలకు కూడా ఈ స్థితి తప్పదు. సమాసమంటే భిన్న పదాలు ఏక పదాలుగా భాసించటం. ఏక పద స్థితి పొందిన కొన్ని సమాసాలు భిన్న పదస్ఫూర్తిని నిలబెట్టుకోవచ్చు. లేక నిలబెట్టుకోలేకపోవచ్చు. భిన్న పద స్ఫూర్తి ఉన్నప్పటికి వానిలో ఒక దానికి గాని, కొన్నిటికి గాని, అన్నిటికి గాని విడివిడిగా అర్థస్ఫూర్తి ఉండకపోవచ్చు. అప్పుడు ఏక పదంతో అధికసామ్యాన్ని పొంది ఉంటుంది. శ్రీనాథుని కృతుల్లో ఈ పద్ధతులన్నీ కన్పిస్తాయి. ప్రాచీన వ్యాకర్తలు సూచించిన భిన్న సమాస కార్యాలకు ఉదాహరణ ప్రాయములైనవి ఒక వైపు కన్పిస్తున్నా ఇంకొక వైపు అట్టివానికి లొంగనివి కూడా కన్పిస్తూనే ఉన్నాయి. అవి కూడా ఈ ప్రకరణంలో పేర్కొనబడుతుంది. మొదట చెప్పినట్లు ఏక సూత్ర నిర్మాణం కష్టం కాబట్టి ప్రస్తుతానికి సాధ్యం కాదు. కాబట్టి ఈ పరిశీలన కొంత వరకు అనివార్యంగా చాలా చోటుల పట్టికా పద్ధతిలోనే ఉంటుంది.

### 15.2.2 సమాసముల విభజన:-

తెలుగు సమాసాలను స్థూలంగా మూడు విధాలుగా విభజింపవచ్చు. 1. సాంస్కృతికములు, 2. ఆచ్ఛికములు, 3. మిశ్రములు.

సంస్కృత సమాసాలను తెలుగులోనికి కొన్ని మార్పులు చేసి తెచ్చుకొనిన వానిని సాంస్కృతిక సమాసాలంటారు. కేవల తెలుగు శబ్దాలచే నిర్మాణం చేయబడ్డవి ఆచ్ఛిక సమాసాలు. సంస్కృత సమ పదాలతో, ఆచ్ఛిక పదాలు చేరగా ఏర్పడేవి మిశ్ర సమాసాలు.

ఇందు సాంస్కృతిక సమాసాలు సిద్ధములని, సాధ్యములని రెండు విధాలు. సంస్కృతమునందేర్పడ్డ సమాసాలకే తెలుగులో తత్త్రప్రత్యయాలు చేరగా కలిగినవి సిద్ధ సాంస్కృతిక సమాసాలంటారు.

**దీర్ఘ సమాసాలకు శ్రీనాథుని రచనల్లో ఉదాహరణలు:**

'కింకుర్వాణ పురందరాదిక మహా గీర్వాణ కోటీ కిరీటాంక

స్థాపిత నూత్న రత్న రుచి ధారా శ్లేష కిమ్మీర పత్సం కేజుండు - హరుండు........' (కాశీ 3.96)

'అష్టాశీతి సహస్ర సంయమి జన వ్యాకీర్ణ తీర ద్వయం జుష్టోదంబిత

సప్త సింధు సలిల స్రోతోవ గాహ క్రియాతుష్ట స్వాతుఁడనై భజింతు...........' (భీమ 3.201)

సంస్కృత పదాలు తత్సమములై సమసించిన యెడల అట్టి సమాసాలు సాధ్య సాంస్కృతిక సమాసాలు అనబడును.

(1) **తత్సమ + తత్సమ:** దైత్యు - చిత్తంబు (హర 3.4), ధవుని - వంశంబు (కాశీ 2.92), అశ్వమేథంబు - ఫలంబు (కాశీ 2.86), మిహిరు - రథము (కాశీ 1.126), ధవు - నాజ్ఞ (కాశీ 4.286).

## 15.2.3 శ్రీనాథునిలోని ఆచ్ఛిక సమాసాలు:-

తద్భవ దేశ్య పదాలలో ఏవైనా కలిసి ఏర్పడ్డ సమాసాలు ఆచ్ఛిక సమాసాలనబడతాయి. అవయవ నిర్మాణాన్ననుసరించి ఆచ్ఛిక సమాసాలు ఈ క్రింది విధంగా విభజింపవచ్చు.

1. **దేశ్య + దేశ్య:**

అలంతి - నవ్వు (శృ॥నై॥ 4.67) అనుంగుంగొడుకు (కాశీ 4.101)
ఊర్పు - గాలులు (భీమ 4.151) ఎడ - కేలు (శివ 4.38)
కొదమ - ఎండ (కాశీ 1.123) చీకంటి - తప్పు (హర 5.57)
పొడుపు - కొండ (కాశీ 1.125) మూ - న్నాళ్ల (కాశీ 2.72)

2. **దేశ్య + తద్భవ:**

అనుగుం - బాసెము (భీమ 2.67) తొలు - సంద (కాశీ 1.121)
నిండు - చందురుండు (శృ॥నై॥ 1.50) పసిండి - యంచ (శృ॥నై॥ 1.102)
పసిండి - చాయ (భీమ 2.54)

3. **తద్భవ + దేశ్య:**

అచ్చ - వెన్నెల (కాశీ 3.23) అడవి - పిల్లి (కాశీ 2.43)
కప్పురపు - ంగ్రోలి (భీమ 5.89) జముని - మెడ (కాశీ 7.96)

4. **తద్భవ + తద్భవ:**

అచ్చర - లేమ (భీమ 6.93) అడి - యాస (కాశీ 2.111)
కప్పుర - వీడెము (శృ॥నై॥ 6.141) మోము - దమ్మి (హర 3.62)
రా - యంచ (శృ॥నై॥ 1.5)

## 15.2.4 శ్రీనాథునిలో మిశ్ర సమాసాలు:-

అవయవ నిర్మాణాన్నినుసరించి మిశ్రమ సమాసాలను ఈ క్రింది విధంగా వింగడింపవచ్చు.

1. **సంస్కృత సమ + దేశ్య:**

కనకంపు - గొడుగు (శృ॥నై॥ 8.103) కుంకుమ - పువ్వు (శృ॥నై॥ 7.11)
దక్షు - తల (కాశీ 7.69) భాను - పొడుపు (కాశీ 1.119)
రవి - తేరు (కాశీ 1.132) వృక్షము - కొమ్మ (కాశీ 1.138)

2. **దేశ్యము + సంస్కృత సమము:**

| | | | |
|---|---|---|---|
| అన్నమాంబ | (కాశీ 1.24) | తండ్రి - వంశంబు | (కాశీ 2.92) |
| తల్లి - యనుజ్ఞ | (కాశీ 4.282) | నిండు - చంద్రుండు | (భీమ 2.43) |
| నడి - వీధి | (హర 5.55) | పొలిమేర - సీమ | (కాశీ 3.118) |

3. **సంస్కృత సమము + తద్భవము:**

అంగన - మోము (హర 3.22) కమలగర్భుని - యానతి(కాశీ 2.69)

నాగ - సొరము (క్రీడా 219) ప్రియ - సుద్ది (శృ॥నై॥ 1.76)

భర్త- యానతి (కాశీ 2.75)

4. **తద్భవము + సంస్కృత సమము:**

అంతి - పురంబు (శృ॥నై॥ 7.145) ఇంగాల - తేజము (భీమ 4.107)

కపుర - దీపములు (హర॥పీ॥ 10) చుక్కల - రాజు (భీమ 2.44)

జము - గదాదండంబు (భీమ 4.107)

## 15.2.5 శ్రీనాథునిలోని వైరి సమాసాలు:-

తెలుగు వైయాకరణులు కొన్ని సమాసాలను వైరి సమాసాలుగా విభాగించారు. తెలుగు పదము కలియునపుడు ఏర్పడు వానిని వైరి సమాసాలంటారు. వీనిని తెలుగు వైయాకరణులు నిషేధించారు. మహాకవులు వాన్ని ఉపయోగించి ఉండటంచే అట్టి వానిని అనింద్య గ్రామ్యాలన వలెననియు, అట్టి వాని సాదృశ్యమున ఇతరములను కల్పింపరాదనియు, కల్పించినచో అవి గ్రామ్యాలవుతాయని వైయాకరణులు స్పష్టపరచారు. కాని ఇట్టి సమాసాలు నన్నయ కాలం నుండియు గ్రంథాలందును, వ్యవహారికమైన భాషలోను అధికమైన ప్రచారాన్ని అందుకొన్నవి.

ఈ క్రింద సూచించిన వైరి సమాసాలు శ్రీనాథుని గ్రంథాల యందు కన్పిస్తున్నవి.

1. **దేశ్యము + తత్సమము:**

కఱ - కంఠుడు (భీమ 3.156) కైవార - దుర్భాషణంబు (శృ॥నై॥ 7.89)

హేరాళ - క్రీడా సంచారిణి (భీమ 1.100)

2. **సంస్కృత శబ్దము + దేశ్యము:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| కంకాళ | - | తండము | (కాశీ 3.138) | కనక | - | తప్పెటలు | (ప॥వీ॥ 8) |
| కుల | - | పగ | (ప॥వీ॥ 4) | గరుడ | - | పచ్చ | (శృ॥నై॥ 6.124) |
| జీవ | - | గఱ్ఱ | (క్రీడా 136) | దిన | - | గోరు | (శృ॥నై॥ 7.81) |
| దిన | - | వెచ్చము | (వీధి 49) | పంచకర | - | పొట్లు | (కాశీ 4.18) |
| పంచ | - | వన్నియ | (భీమ 1.111) | ప్రాణ | - | గొడ్డము | (శృ॥నై॥ 7.53) |
| మూల | - | దుంప | (భీమ 5.157) | లింగ | - | కాయ | (శ్రీ॥శ్యం॥ 38) |
| వీర | - | ముద్దియలు | (శృ॥నై॥ 6.44) | విమలడిండీర | - | | తండము |

బిరుదాదులు సంస్కృత శబ్దానుకరణమున సిద్ధ సమాసాలవుతున్నాయి.

(మరాఠి) ఫేషణి హనుమంత బిరుదాంకులు (శృ॥నై॥ 1.32)

(కన్నడ) రాయవేశ్యాభుజంగ (భీమ 1.38)

కొన్ని బిరుద వాచకాలు భాషాంతర శబ్దాలుగా కానబడుతున్నవి.

(కన్నడ) జగనొబ్బ - గండ బిరుద (శృ॥నై॥ 1.37)

(కన్నడ) మూరురాయరగండ (చారు॥ 1.118)

## 15.1.6 కారక సంబంధమాధారంగా సమాసాలు:-

ఈ క్రింది విధంగా విభజింపబడును.

1. తత్పురుష, కర్మధారయము, ద్విగువు - అని నిర్ధారక సమాసాలు (Determinative). ఇవి సాధ్య సామాసాలలోని మూడింటిలో నేదోయొక జాతిలోనికి చేరును.
2. బహువ్రీహి (సంబంధ తత్పురుష సమాసము) (Possessive).
3. ద్వంద్వము (సంయోజక సమాసము) (Copulative).

సహజంగా ద్వంద్వ - బహువ్రీహి సమాసాలు ఆచ్ఛికములలో కూడియే ఉంటాయి.

**1. తత్పురుషము:**

(ఎ) ఇది తరచుగా ఉత్తర పదార్థ ప్రధానమై ఉంటుంది.

అందియల - రవళి (భీమ 2.110) ఆట - తమకము (కాశీ 6.4)

ఏనిక - మోము (భీమ 1.2) పెండిలి - పాట (హర 4.11)

(బి) కొన్ని యెడల తత్పురషమున పూర్వ పదము ఏకాక్షరమై కనుపట్టును.

చి - చిట్ట (హర 1.4) చే - దోయి (శృ॥నై॥ 2.5)

పూ - రేకు (కాశీ 6.126) పూ - నీరు (హర 3.118)

(సి) కొన్ని సమాసాలలో పూర్వ పదము అదంతము, ఇదంతమునై ఉంటుంది. అది పూర్వ పర పదాలకు సంబంధాన్ని స్థాపిస్తుంది.

అ. పాల - కడలి (శృ॥నై॥ 2.92) పాల - బుగ్గలు (కాశీ 3.241)

పాల - సముద్రము (శివ 1.74)

ఇ. ఆతని - పుత్రుండు (కాశీ 4.78) వారి - యొడలు (కాశీ 3.113)

**2. కర్మధారయము:**

(ఎ) సాధారణంగా కర్మధారయ సమాసంలో విశేష్యానికి ముందు విశేషణం వస్తుంది.

అనుఁగు - బెద్దన (భీమ 1.2) ఉడుకు - నీరు (హర 6.60)

కలికి - నవ్వు (కాశీ 1.34) మెఱుఁగు - ఁబండ్లు (శివ 3.66)

(బి) కొన్ని యెడల పూర్వపదాంతమందలి ము వర్ణం లోపిస్తుంది.

కప్పుర - విడెము (శృ॥నై॥ 6.141)

(సి) ధాతుజ విశేషణాలతో సమాసాలు ఏర్పడతాయి.

పుట్టినిల్లు (హర 4.24) ఉన్నరూపు (కాశీ 4.100)

(డి) కొన్ని యెడల పూర్వ పదం పై 'ట' వర్ణమాగమంగా వస్తుంది.

బుజ్జుటకొమ్మ (భీమ 5.111) పిన్నటనాడు (హర॥పీ॥ 30)

3. **ద్విగువు:**

(ఏ) ఈ సమాసములో సంఖ్యా విశేషణం పూర్వమందు వస్తుంది.

ఇరు - కేలు (కాశీ 5.195) ఏను - కోసులు (భీమ 2.88)

నల్గడలు (హర 7.170) నాలుగు - మోములు (శివ 1.3)

(బి) కొన్ని యెడల పర పదాది న వర్ణము పూర్వ పదాలత్య హల్లుతో కలిసి దానికి వికారాన్ని కలిగిస్తుంది.

మున్నూటు (శృ॥నై॥ 6.72) నన్నూటు(కాశీ 5.192)

(సి) ఒక, ఒక్క అను సంఖ్యలు విశేషణాలుగాను, ఒక్కడు, ఒక్కటి అనేవి నామ రూపాలుగాను ప్రయోగింపబడుతున్నవి.

ఒక, ఒక్క అనేవి మొదటి అవయవంగా గల సమాసాలు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఒక | - | కుత్తుక | (హర 2.60) | ఒక్క | - | తాత | (హర॥పీ॥ 10) |
| ఒక | - | చాయ | (శివ 3.73) | ఒక్క | - | కుందేలు | (శృ॥నై॥ 8.183) |
| ఒక | - | జాడ | (శృ॥నై॥ 7.73) | ఒక్క | - | తలఁపు | (హర 3.33) |
| ఒక | - | తల | (కాశీ 3.217) | ఒక్క | - | చోద్యంబు | (కాశీ 3.113) |

4. రెండు అను రూపమునకు విశేషణము'ఇరు'

**ఏకవచనమున:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఇరు | - | గేలు | (కాశీ 5.195) | ఇరు | - | చక్కియ | (హర 7.40) |
| ఇరు | - | చెవి | (భీమ 4.50) | ఇరు | - | దెస | (ప॥వీ॥ 64) |

**బహువచన ప్రత్యయం కలిసి:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఇరు | - | పూటలు | (శృ॥నై॥ 5.74) | ఇరు | - | గెలఁకులు | (కాశీ 5.286) |

5. 'ఇరు' నకు 'నమ'లు పరమైనపుడు 'ఇను' ఆదేశంగా వస్తుంది.

ఇనుమడి (శృ॥నై॥ 5.23) ఇమ్మడి (హర 7.144)

ఇనుమాటు (హర 4.60) ఇన్నూటు(శృ॥నై॥ 6.72)

6. మూఁడు అను రూపమునకు విశేషణము 'ము'

**ఏకవచనము:**

ముచ్చిచ్చు (భీమ 3.37) ముప్పొద్దు (శృ॥నై॥ 6.142)

7. నాలుగు అనురూపమునకు విశేషణము 'నలు'

**ఏకవచనము:**

నల్దిక్కు (శృ॥నై॥ 7.88) నల్గడ (కాశీ 3.105)

8. కొన్ని - అను దానికి 'కొన్' అను రూపాంతరం కలదు.

కొన్నాళ్లకు (ప॥వీ॥ 41)

4. **బహువ్రీహి:** ఇది అన్య పదార్థ ప్రధానం. తారతమ్య పరిశీలన చేస్తే బహువ్రీహి సమాసాలు శ్రీనాథుని భాషలో తక్కువ. వానిలో కొన్ని సంస్కృత రూపాలను పోలి ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| అలరుఁబోఁడి | (హర 4.85) | ఇగురుఁబోఁడి | (కాశీ 3.41) |
| ఎలదీఁగఁబోణి | (శృ॥నై॥ 3.178) | ఏనిక మోము తాల్పు | (భీమ 1.2) |
| కొండవిల్లు | (భీమ 6.46) | కొండ రాచూలి | (హర 4.17) |
| క్రొన్నెల పువ్వు తాల్పు | (భీమ 2.117) | చిగురుఁబోఁడి | (కాశీ 6.265) |
| తలిరుఁబోఁడి | (కాశీ 2.117) | తమ్మి పూచూలి | (శృ॥నై॥ 2.138) |
| తీఁగఁబోఁడి | (కాశీ 7.137) | నలువ | (భీమ 3.136) |
| ననవిల్తుడు | (భీమ 3.212) | పూఁబోఁడి | (శృ॥నై॥ 8.40) |
| ముక్కంటి | (శృ॥నై॥ 8.201) | మచ్చకంటి | (హర 7.127) |
| మెఱుంగుఁబోఁడి | (కాశీ 3.23) | | |

1. 'పోఁడి' అను పదం రెండవ అవయవంగా కల సమాసాలు నన్నయ భాషలో లేవు. నన్నెచోడునిలో 'తలిరు - ఁబోఁడి' (కు॥సం॥ 5.135) అని ఒకే ఒక ప్రయోగం కలదు.

2. ఈ క్రింది సమాసాల్ల ఉత్తర పదములందు వికారం కలిగింది.

| | | | |
|---|---|---|---|
| ముక్కంటి | (కాశీ 2.44) | నలువ | (భీమ 3.136) |
| తొలకరి | (హర 4.47) | కొండరాచూలి | (హర 4.17) |

5. **ద్వంద్వము:**

ఎ. ఉభయ పదార్థ ప్రధానం ద్వంద్వము. సహజముగా ఇది బహువచనాంత ప్రత్యయాన్ని కలిగి ఉంటుంది.

| | | | |
|---|---|---|---|
| అన్నదమ్ములు | (భీమ 1.33) | అత్త - మామలు | (శృ॥నై॥ 7.9) |
| తల్లి - దండ్రులు | (కాశీ 3.330) | పాలు పెరుగోగిరంబులు | (హర 6.56) |

బి. ద్వంద్వ సమాసంలో రెండవ అవయమైన 'పా' కు 'వా' రాకుండుట ఈ క్రింది ప్రయోగంలో కలదు.

ఆట - పాటలు (భీమ 5.41)

సి. క్త్వార్థక శబ్దము తోడను కొన్ని యెడల ద్వంద్వ సమాసములు కలుగవచ్చును.

వినీవినని భంగి (శృ॥నై॥ 6.33)

డి. సముచ్ఛయార్థకానికి బదులుగా దీర్ఘం వచ్చిన ప్రయోగం ఒకటి శ్రీనాథుని రచనయందున్నది

చల్లాయంబలి ద్రావితిన్ (చా॥మం॥ 1.119)

1. శ్రీనాథుని రచనల్లో ఈ క్రింది సమాసాల యందలి ఉత్తర పదం అవ్యయ ప్రతిరూపక విశేష్యంగా ఉంది.

తలక్రిందు (కాశీ 3.152) ఉరువడి (కాశీ 6.227) వెంబడి (భీమ 4.60)

2. ఈ క్రింది వాని యందుత్తర పదం క్త్వార్థక రూపమై విశేష్యార్థాన్ని కలిగిస్తున్నది.

రేపాడి (కాశీ 2.83) ఎల్లుండి (కాశీ 7.74)

3. ఈ క్రింది వాని యందుత్తర పదం క్త్వార్థక రూపమై అవ్యయాల్ని కల్పిస్తున్నది.

ఇటఁబట్టి (శృ॥నై॥ 3.144) కాఁబట్టి (హర 1.15)

కనుకని (కాశీ 2.17) పదంపడి (శృ॥నై॥ 4.80)

4. ఈ క్రింది వాని యందుత్తర పదం తుమున్నర్థకమై అవ్యయాలను కల్పిస్తున్నవి.

ఎడపఁదడప (కాశీ 4.85) క్రచ్చలు (కాశీ 6.236)

5. ఈ క్రింది ఆమ్రేడిత సమాసాలు ఒక వ్యాపారానికి పునఃపునరాగతమును, ఆధిక్యాన్ని సూచిస్తున్నవి. ఇవి కేవలం నామములే కాక, విశేషణ, క్రియా విశేషణ, అవ్యయాలుగా వస్తాయి.

తరువందరువ (హర 6.62) ఎదురుకెదురు (భీమ 4.12)

అచటనచట (శృ॥నై॥ 7.125) అల్లనల్లన (శివ 4.40)

అంచెలంచెలు (కాశీ 1.132)

6. ధ్వన్యనుకరణ నిర్మాణంలో పునరుక్తి సహజం.

| | | | |
|---|---|---|---|
| కలకల | (శృ॥నై॥ 7.156) | గనగన | (హర 4.14) |
| జవజవ | (కాశీ 5.119) | తొకతొక | (హర 6.60) |
| నిగనిగ | (హర 6.80) | పలపల | (కాశీ 5.144) |
| పుటపుట | (భీమ 3.222) | పురపుర | (శృ॥నై॥ 1.110) |
| పెళపెళ | (భీమ 4.130) | బుగబుగ | (హర 6.62) |
| మిలమిల | (భీమ 1.118) | వడవడ | (శృ॥నై॥ 2.35) |

| | | | |
|---|---|---|---|
| వికవిక | (హర 4.28) | విసవిస | (శృ॥నై॥ 1.72) |
| పాటపాట | (క్రీడా 229) | | |

7. విలక్షణార్థమై ఒకే పదం పునరుక్తమై సమాసముగా నగుటయు కనుపట్టును.

బండొంప (కాశీ 3.235)

## 15.2.7 శ్రీనాథునిలోని విశిష్ట సమాసాలు:-

శ్రీనాథుని భాషలో ఈ క్రింది సమాసాలు విశిష్టములగుటచే వేరుగా ప్రదర్శింపబడుతున్నవి.

**అర - మొదటి అవయవముగా గల సమాసాలు:**

| | | | |
|---|---|---|---|
| అర గొను | (శివ 2.21) | అర కన్ను | (కాశీ 7.70) |
| అర వీసము | (హర 3.62) | అర సంజ | (కాశీ 5.275) |
| అర వాడిన | (హర 3.2) | అర / ఱ / చేతులు | (కాశీ 5.226) |

**-ఆకు- మొదటి అవయవముగా గల సమాసాలు:**

| | | | |
|---|---|---|---|
| ఆకుంబోఁడి | (శృ॥నై॥ 3.165) | ఆకు - మోవి | (శృ॥నై॥ 5.28) |
| ఆకు గొడుగు | (హర 3.38) | ఆకు పోకలు | (ప॥వీ॥ 69) |

**ఎల - మొదటి అంశముగా గల సమాసాలు:**

| | | | |
|---|---|---|---|
| ఎలగోలు | (కాశీ 2.51) | ఎలఁదీగ | (శృ॥నై॥ 3.173) |
| ఎలఁదోఁట | (భీమ 3.36) | ఎలనుఁగ | (శృ॥నై॥ 6.44) |
| ఎలప్రాసఁగుఁటడ్కులు | (హర 2.91) | | |

**- ఎదురు - మొదటి అంశముగా గల సమాసాలు:**

| | | | |
|---|---|---|---|
| ఎదురు గద్దియు | (శృ॥నై॥ 4.97) | ఎదుర్కట్టు | (కాశీ 6.262) |
| ఎదురు వేలంబులు | (భీమ 4.47) | ఎదుర్చుక్క | (కాశీ 2.17) |
| ఎదురు రొమ్ము | (ప॥వీ॥ 109) | | |

**కడ - మొదటి అంశముగా గల సమాసాలు:**

| | | | |
|---|---|---|---|
| కడగన్ను | (శృ॥నై॥ 7.41) | కడగోరు | (భీమ 3.22) |
| కడకొంగు | (హర 5.16) | కడకొమ్ము | (భీమ 4.134) |
| కడదాఁక | (కాశీ 2.160) | కడతెక్క | (శృ॥నై॥ 8.5) |
| కడతెప్పలు | (శృ॥నై॥ 5.9) | కడవీను | (శృ॥నై॥ 6.53) |

**కన్నె - మొదటి అవయవముగా గల సమాసాలు:**

కన్నెకూర్మి (శృ॥నై॥ 1.86) కన్నెపువ్వు (శృ॥నై॥ 1.92)

కన్నెకయ్యము (ప॥వీ॥ 107)

**జమిలి - మొదటి అంశంగా గల సమాసాలు:**

జమిలిపాములు (హర 5.5) జమిలి మండెగలు (శృ॥నై॥ 6.120)

**తండము - రెండవ అంశంగా గల సమాసాలు:**

త్రవ్వితండము (క్రీడా 256) కంకాళ తండము (కాశీ 3.138)

**తరఁగ - మొదటి అంశంగా గల సమాసాలు:**

తరఁగదండు (హర 7.80) తరఁగలవడి (హర 6.90)

**తరి - మొదటి అంశంగా గల సమాసాలు:**

తరి కొండ (హర 6.76) తరి చోటు (భీమ 3.51)

తరి త్రాడు (శృ॥నై॥ 5.63) తరి తీపు (ప॥వీ॥ 96)

**తల - మొదటి అంశంగా గల సమాసాలు:**

తల గడ (శివ 3.25) తల చీక (కాశీ 1.139)

తల చుట్టు (శృ॥నై॥ 3.167) తల పుట్టె (ప॥వీ॥ 13)

తల పువ్వు (శృ॥నై॥ 8.201) తల యంపి (శివ 2.70)

తల వాకిలి (భీమ 5.6) తల వెంట్రుకలు (శృ॥నై॥ 1.64)

తల వరి (కాశీ 4.124)

**నడు - మొదటి అంశంగా గల సమాసాలు:**

నడు కందు (శృ॥నై॥ 8.180) నడు చక్కి (హర 1.3)

నడు త్రోవ (భీమ 4.181) నడు నట్టు (భీమ 3.19)

నడు నీరు (హర 6.78) నడు పుట్టు (శృ॥నై॥ 8.16)

నడు నెత్తి (క్రీడా॥ 235) నడు ప్రొద్దు (క్రీడా॥ 278)

**వెడఁద - మొదటి అంశంగా గల సమాసాలు:**

వెడఁద కన్ను (భీమ 6.69) వెడఁద నోళ్ళు (చా॥మ॥ 1.131)

2. సిద్ధ సమాసం సంపూర్ణ రూపము వైకృతమయినపుడు సమాసమందలి పూర్వ పదానికి తెలుగులో వ్యస్త ప్రయోగం లేదు.

అడియాస (కాశీ 2.111) అంతిపురము (శృ॥నై॥ 7.145)

గండకత్తెర (క్రీడా॥ 142) గండ్రగొడ్డలి (శివ 4.29)

పరుసవేది (భీమ 2.144)

3. పూర్వ పదమౌప విభక్తికమైతే దాని ఔప విభక్తిక రూపం నిలుచును.

మునికోల (కాశీ 3.235) చెలియలికట్ట (ప॥వి॥ 88)

వింటి జోదు (శివ 3.53)

## 15.2.8 అవయవ నిర్మాణాన్ననుసరించి శ్రీనాథుని భాషలో సమాసాలు:-

తెలుగులో రెండు మూడు పదాల కలయికచే ఏర్పడు సమాసాలే ఎక్కువ. అంతకంటె ఎక్కువ పదాలతో ఏర్పడటం అసహజం. కాని సంస్కృతంలో అట్టివి చాలా ఎక్కువ. శ్రీనాథుని భాషలో అవయవ నిర్మాణాన్ననుసరించి సమాసాలను అయిదు విధాలుగా విభాగించటమైంది. అందు రెండంశాల సమాసాలు 2135, మూడంశాల సమాసాలు 549, నాలుగంశాల సమాసాలు 127, ఐదంశాల సమాసాలు 28, ఆఱంశాల సమాసాలు 3, మొత్తం 2842 సమాసాలను శ్రీనాథుడు ప్రయోగించాడు. అందు ఆఱు అవయవముల సమాసం పెద్దది.

**ఉదా:** జగ - జెట్టి - పాప - ఱేని - యౌదల (భీమ 5.9)

బొమ్మంచుంగెంజిగురాకు మోవి (క్రీడా॥ 90)

వడఁకు - గుబ్బరి - రాచ - వారి - కూరిమి - కన్య (కాశీ 4.140)

దీన్ని బట్టి అంశాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సమాసాల సంఖ్య తరగటం మనం గమనించవచ్చు.

## 15.1.9 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని రచనల్లో కాననగు సమాస నిర్మాణ వైశిష్ట్యాన్ని సోదాహరణంగా వివరించండి.
2. కారక సంబంధమాధారంగా శ్రీనాథుడు వాడిన సమాసాల విభజన ఎట్టిదో వివరింపుడు.

## 15.1.10 ఆధార గ్రంథాలు:-


1. బాల వ్యాకరణము : ఆచార్య పరవస్తు చిన్నయసూరి
2. శ్రీనాథ భాషా పరిశీలన : ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి


**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

పాఠం - 16.1

# శ్రీనాథుని రచనల్లో కృదంత - తద్ధిత నిర్మాణము

**ముఖ్యాంశాలు:-**


**A.** కృదంత నిర్మాణం

**16.1.0** లక్ష్యం

**16.1.1** ఉపోద్ఘాతము

**16.1.2** నిష్పన్న నామములు **(Secondary Nouns)**

**16.1.3** సంధిగతమైన మార్పులు

**16.1.4** నిష్పాదక ప్రత్యయాలు **(Derivative Seffixes)**

**B.** తద్ధిత నిర్మాణం

**16.1.5** ఇతర నామముల నుండి నిష్పన్నమైన నామవాచకాలే తద్ధితాలు - వాటి నిర్మాణ పద్ధతులు

**16.1.6** భావార్థకములు **(Verbal Nouns)**

**16.1.7** ప్రశ్నలు

**16.1.8** ఆధార గ్రంథాలు


## A. కృదంత నిర్మాణం:

### 16.1.0 లక్ష్యం:-

శ్రీనాథుని రచనల్లో క్రియాధాతువుల నుండి నిష్పన్నమైన నామాలైన కృదంతాలు ఏర్పడే విధానాన్ని తెల్పడం. అట్లే అవి సంధిగతంగా పొందిన మార్పులను, నిష్పాదక ప్రత్యయాల చేరికచే ఏర్పడ్డ కృత్తులను వివరించడం. ఇంకా ఇతర నామాల నుండి నిష్పన్నమై నామ వాచకాలైన తద్ధితాలను గుర్తించడం ఈ ప్రకరణంలో ముఖ్యంగా వ్యక్తీకరించే విషయాలు.

### 16.1.1 ఉపోద్ఘాతము:-

తెలుగులో నామ ప్రాతిపదికలను దేశ్యాలు, అన్యదేశ్యాలు అని రెండు విధాలుగా విభజింపవచ్చు. దేశ్య నామ ప్రాతిపదికలకు సాధారణంగా స్వాభావికమైన ప్రత్యయం ఏదియూ అంతంలో చేరదు. అయినప్పటికీ కొన్ని నామ ప్రాతిపదికలకు లింగ వచన సూచక ప్రత్యయాలు చేరుతాయి.

ప్రాథమిక (Primary), నిష్పన్న (Derivative) నామాలని దేశ్య ప్రాతిపదికలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. ప్రాథమిక నామాల యందు ధాతు ప్రత్యయాలను ప్రత్యేకంగా విశ్లేషించడానికి వీలులేదు. క్రియాధాతువుల నుండి గానీ, నామధాతువుల నుండి గానీ నిష్పన్ననామాలు కలుగుతాయి.

ఏ భాషయందైనా కొన్ని నామాలు సహజ సిద్ధంగా ఉంటాయి. మరికొన్ని నామాలు క్రియాది ధాతువుల నుండి నిష్పన్నములవుతాయి. తెలుగు భాషలో సహజ సిద్ధమగు నామాలకు ప్రకృతి ప్రత్యయ విభాగం చేయటం కుదరదు. ఆ విధంగా చేయటానికి వీలైనవి కొన్ని ఉన్నాయి. కాని వాని సంఖ్య అత్యల్పము.

**ఉదా:** అల్లుడు - తమ్ముడు - వంటి నామాలకు బహువచనంలో అల్లురు - తమ్ములు అని ఏర్పడడం చేత ఏకవచన రూపములందలి చివరి - డు అను భాగం సాంప్రదాయక వ్యాకర్తలు'డుజ్' వర్ణకంగా విభజించారు. ఇట్టి పదాలకు కొన్నింటికి మాత్రమే వర్తింప చేయగలిగిన ఈ ప్రక్రియకు తెలుగు భాష యందు విస్తృతి లేదు. లింగభేదాన్ని తెలుసుకోవడానికి అర్థాన్ని గ్రహించడం తప్ప వేరొక ఆధారం లేదు. ఇట్టి నామాలను ప్రాథమిక (Primary) నామాలని వ్యవహరిస్తారు.

## 16.1.2 నిష్పన్న నామములు (Secondary Nouns):-

క్రియా ధాతువుల నుండి నిష్పన్నమైన నామాలను సాంప్రదాయికంగా <u>కృదంతాలని వ్యవహరిస్తారు.</u>

తెలుగు భాషలో పెక్కు క్రియలు ఎట్టి ప్రత్యయాలు చేరకుండానే నామవాచకాలుగా వ్యవహృతములగుచున్నవి. అందువల్ల శ్రీనాథుని కృతుల్లోని పదాలు క్రియార్థంలోను, నామార్థంలోనూ ఏ విధంగా ప్రయోగింపబడ్డదో పరిశీలిద్దాం. ఇందు 52 పదాలున్నాయి. అందులో కొన్నింటిని పేర్కొంటాను.

| | పదము | | క్రియార్థము | | నామార్థము | |
|---|---|---|---|---|---|---|
| 1. | అంటు | : | కలియు | (కాశీ 3.22) | ముటికి | (క్రీడా 42) |
| 2. | అదరు | : | చలించు | (కాశీ 4.110) | బాధ | (హర 6.131) |
| 3. | ఉడుకు | : | తాపమునొందించు | (హర 7.85) | వేడి | (హర 6.60) |
| 4. | ఎత్తు | : | సమర్పించు | (కాశీ 3.179) | పర్యాయము | (భీమ 4.28) |
| 5. | కందు | : | మలినమగు | (శృ॥నై॥ 1.70) | కళంకము | (శృ॥నై॥ 7.103) |
| 6. | చదువు | : | పఠించు | (కాశీ 4.199) | విద్య | (హర 5.32) |
| 7. | చల్లు | : | విక్షేపించు | (శృ॥నై॥ 4.123) | జలక్రీడా విశేషము | (హర 5.37) |
| 8. | చినుకు | : | చిందు | (కాశీ 2.147) | వర్షబిందువు | (హర 2.21) |
| 9. | జంకు | : | భయపడు | (హర 4.20) | సంకోచము | (హర 2.101) |
| 10. | తగులు | : | ఆసక్తినొందు | (కాశీ 4.81) | ప్రేమ | (కాశీ 1.133) |
| 11. | తుఱుము | : | గ్రుచ్చు | (కాశీ 4.5) | స్త్రీధమ్మిల్లము | (శృ॥నై॥ 6.44) |
| 12. | పోరు | : | యుద్ధము చేయు | (శివ 1.97) | యుద్ధము | (కాశీ 6.239) |
| 13. | బెగడు | : | భయపడు | (ప॥వీ॥ 91) | భయము | (హర 7.79) |
| 14. | ముట్టు | : | పూర్ణమగు | (భీమ 6.61) | సాధనము | (శివ 2.70) |
| 15. | మొత్తు | : | కొట్టు | (భీమ 2.157) | దెబ్బ | (శివ 4.60) |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 16. | మ్రొక్కు | : | నమస్కరించు | (శృ॥నై॥ 8.13) | నమస్కారము | (హర 4.41) |
| 17. | వెలుగు | : | ప్రకాశించు | (హర 4.52) | ప్రకాశము | (శృ॥నై॥ 7.169) |

## 16.1.3 సంధిగతమైన మార్పులు:-

1. క్రియాధాతువుల నుండి ఏర్పడ్డ నామవాచకాల రూప నిష్పత్తిలో కొన్ని సంధిగతమైన మార్పులు గోచరిస్తున్నాయి. కృత్ప్రత్యయం చేరటానికి ముందు తరచుగా ధాతువుల యందలి అంత్యాక్షరాలు లోపించటాన్ని గమనిస్తాము. నామవాచకాలు ప్రాథమిక ధాతువుల నుండి పరిణామం పొందినట్లు భావించవచ్చు. (రూప) నిష్పాదక ప్రత్యయాలు (Formative Suffixes) చేరటంచే ఏర్పడ్డవి కావు.

2. ధాతుగతుచ్చు దీర్ఘకరణం పొందినపుడు అంత్య హల్వర్ణం లోపిస్తుంది. కొన్ని యెడల ధాతువు నందలి హ్రస్వము కృదంతమైనపుడు దీర్ఘాన్ని పొందుతుంది. కొన్ని ప్రాథమిక ధాతువులు ద్వితీయావస్థ యందు హ్రస్వాన్ని పొంది కృదంతము నందు మరల దీర్ఘాన్ని పొందుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| **ఉదా:** కుడు | > | కుడు(చు) | > | కూడు |
| చా | > | చ (చ్చు) | > | చా (వు) |
| నో | > | నొ (చ్చు) | > | నోపి, నొప్పి, నోవు |
| విడు | > | విడి (యు) | > | వీడు |

3. ధాతుగతాచ్చు దీర్ఘమవటంతో పాటు అంత్య హల్వర్ణం అఘోషీకరణాన్ని (devoicing) పొందుతుంది.

| | | | |
|---|---|---|---|
| **ఉదా:** చెడు | > | చేటు | (కాశీ 7.92) |
| పొడు | > | పోటు | (శృ॥నై॥ 3.10) |
| పడు | > | పాటు | (శృ॥నై॥ 3.84) |
| ముడు | > | మూట | (కాశీ 5.62) |
| మఱు | > | మాటు | (శృ॥నై॥ 2.35) |

## 16.1.4 నిష్పాదక ప్రత్యయాలు:- (Derivative Suffixes)

**కృత్ప్రత్యయాలు:** సాధారణంగా కృత్తులు ఈ క్రింద సూచించు ప్రత్యయాల కలయికచే ఏర్పడుతుంటాయి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | -అ | : | అలుక | (< అలుగు) | (శృ॥నై॥ 8.72) |
| | | | ఎఱుక | (< ఎఱుగు) | (హర 2.79) |
| | | | పాట | (< పాడు) | (హర 4.11) |
| | | | వంట | (< వండు) | (శివ 4.8) |
| 2. | -అకము | : | ఎసకము | (< ఎసగు) | (హర 5.50) |
| | | | వంటకము | (< వండు) | (కాశీ 1.108) |
| 3. | -అడ | : | కట్టడ | (< కట్టు) | (భీమ 5.77) |
| 4. | -అటము | : | ఇఱుకటము | (< ఇఱుకు) | (శృ॥నై॥ 4.124) |

5. -అడము : ముట్టడము (< ముట్టు) (కాశీ 5.301)

6. - అమి : ఓటమి (< ఓడు) (హర 7.52)

: కూటమి (< కూడు) (క్రీ॥పీ॥ 67)

- అమి ప్రత్యయము వ్యతిరేకార్థంలో కూడా వస్తుంది.

: నేరమి (< నేర్పు) (కాశీ 4.267)

: వినమి (< విను) (శివ 2.104)

7. - అము : కూటము (< కూడు) (హర 2.33)

: చుట్టము (< చుట్టు) (శృ॥నై॥ 7.105)

8. -అరము : ఉబ్బరము (< ఉబ్బు) (భీమ 3.57)

: దెప్పరము (< దెప్పు) (హర 1.21)

9. - అవు : ఉఱవు (< ఉఱు) (కాశీ 6.55)

: తగవు (< తగు) (శృ॥నై॥ 8.55)

10. - ఇ : చేయి (< చేయు) (శృ॥నై॥ 1.28)

అంత్య హల్వర్ణమైన - య్ / - చ్ ఇద్విరుక్తినొందినపుడు -ప్ వర్ణంగా మార్పునొందుచున్నది.

: దప్పి (< దయ్యు) (శృ॥నై॥ 4.32)

: నొప్పి (< నొచ్చు) (శృ॥నై॥ 3.182)

11. - ఇక : అల్లిక (< అల్లు) (హర 2.108)

: అరయిక (< అరయు) (శృ॥నై॥ 1.52)

: ఆడిక (< ఆడు) (శివ 3.99)

: ఎన్నిక (< ఎన్ను) (కాశీ 2.91)

: ఏలిక (< ఏలు) (శృ॥నై॥ 2.65)

: కినుక (< కినియు) (శృ॥నై॥1.92)

: కోరిక (< కోరు) (కాశీ 3.113)

: నమ్మిక (< నమ్ము) (హర 2.117)

: పూనిక (< పూను) (శివ 1.85)

: పోలిక (< పోలు) (శృ॥నై॥ 5.56)

12. -ఇకి / - కి : ఉనికి / ఉన్కి (< ఉన్) (శృ॥నై॥ 8.126)

: కూరికి / కూర్కి (< కూరు) (శృ॥నై॥ 3.116)

: కోర్కి (< కోరు) (హర 2.63)

: చూడ్కి (< చూచు) (శృ॥నై॥ 6.6)

: పూన్కి (< పూను) (హర7.119)

: పోల్కి (< పోలు) (హర 4.89)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 13. | - ఇతము | : | పోరితంబు | (< పోరు) | (కాశీ 3.124) |
| 14. | - ఇడి | : | రాయిడి | (< రాయు) | (శృ॥నై॥ 3.149) |
| | | : | రాపిడి | (< రాయు) | (హర6.61) |
| 15. | - ఇదము | : | ఒప్పిదము | (< ఒప్పు) | (కాశీ 4.158) |
| | | : | పన్నిదము | (< పన్ను) | (శివ 2.94) |
| 16. | - ఇమి / - మి | : | కలిమి / కల్మి | (< కలుగు) | (శృ॥నై॥ 1.49) |
| | | : | కూరిమి / కూర్మి | (< కూర్చు) | (శృ॥నై॥ 7.4) |
| | | : | తాలిమి / తాల్మి | (< తాల్చు) | (భీమ 5.163) |
| | | : | నేరిమి | (< నేర్చు) | (శృ॥నై॥ 7.166) |
| 17. | - ఉక | : | తునుక | (< తునియు) | (ప॥వీ॥ 109) |
| 18. | - క | : | ధాత్వంతమందలి -గు, -చు, -వు లను తొలగించి -క ప్రత్యయము వచ్చును. | | |
| | | : | అలుక | (< అలుక) | (శృ॥నై॥ 8.46) |
| | | : | ఎఱుక | (< ఎఱుఁగు) | (కాశీ 6.10) |
| | | : | కడఁక | (< కడఁగు) | (హర 6.59) |
| | | : | కణఁక | (< కణఁగు) | (భీమ 3.134) |
| | | : | కలఁక | (< కలఁగు) | (క్రీడా॥ 248) |
| | | : | కాఁక | (< కాఁగు) | (శివ 4.67) |
| | | : | నడక | (< నడచు) | (భీమ 3.46) |
| | | : | పోక | (< పోవు) | (శృ॥నై॥ 7.42) |
| | | : | మలఁక | (< మలఁగు) | (శృ॥నై॥ 5.63) |
| | | : | మూక | (< మూఁగు) | (భీమ 4.60) |
| | | : | మొలక | (< మొలచు) | (శృ॥నై॥ 6.82) |
| | | : | రాక | (< వచ్చు) | (శృ॥నై॥ 5.142) |
| | | : | వంక | (< వంగు) | (భీమ 3.216) |
| | | : | వీఁక | (< వీఁగు) | (కాశీ 7.173) |
| 19. | -కడ / -గడ | : | చేరుగడ | (< చేరు) | (శృ॥నై॥ 7.102) |
| | | : | నిలుకడ | (< నిలుచు) | (కాశీ 2.107) |
| | | : | పోకడ | (< పోవు) | (కాశీ 5.48) |
| 20. | - కలి | : | వినుకలి | (< విను) | (శృ॥నై॥ 4.18) |
| 21. | - కువ | : | అడఁకువ | (< అడుఁగు) | (శివ 4.52) |
| | | : | తక్కువ | (< తగ్గు) | (భీమ 1.118) |

| | | | | |
|---|---|---|---|---|
| | : | తేఁకువ | (< తెగు) | (క్రీడా॥ 134) |
| | : | పెక్కువ | (< పెరుగు) | (భీమ 1.118) |
| | : | పెనకువ | (< పెనగు) | (హర 7.179) |
| | : | వేకువ | (< వేగు) | (శృ॥నై॥ 6.20) |
| 22. - గర | : | విడుగర | (< విడుచు) | (కాశీ 6.125) |
| 23. - ట | : | టపరమగుచో అంత్య వర్ణ లోపము. | | |
| | | అలమట | (< అలమరు) | (హర 2.102) |
| | | ఆట | (< ఆడు) | (భీమ 5.41) |
| | | ఊట | (< ఊఱు) | (కాశీ 3.225) |
| | | చెమట | (< చెమరు) | (హర 1.21) |
| | | తివుట | (< తివురు) | (శృ॥నై॥ 2.5) |
| | | పంట | (< పండు) | (శృ॥నై॥ 8.201) |
| | | పాట | (< పాడు) | (శృ॥నై॥ 2.113) |
| | | మంట | (< మండు) | (శివ 4.65) |
| | | వంట | (< వండు) | (కాశీ 6.221) |
| | | వేసట | (< వేసరు) | (శృ॥నై॥ 5.163) |
| 24. - టు | : | టు పరమగుచో ఆద్యక్షరం శేషించి దీర్ఘాన్ని పొందుతుంది. | | |
| | | ఏటు | (< ఏయు) | (భీమ 3.212) |
| | | కాటు | (< కఱచు) | (శృ॥నై॥ 8.47) |
| | | చేటు | (< చెడు) | (కాశీ 7.92) |
| | | చోటు | (< చొచ్చు) | (భీమ 3.44) |
| | | పాటు | (< పడు) | (శృ॥నై॥ 3.84) |
| | | పోటు | (< పొడుచు) | (భీమ 2.88) |
| | | వ్రేటు | (< వ్రేయు) | (హర 1.26) |
| 25. - డు | : | అమ్ముడు | (< అమ్ము) | (హర 4.37) |
| | | ఎక్కుడు | (< ఎక్కు) | (భీమ 2.5) |
| | | మాపుడు | (< మాయు) | (శృ॥నై॥ 7.141) |
| 26. - త | : | పొగడ్త | (< పొగడు) | (శివ 1.45) |
| | | ఆవులింత | (< ఆవులించు) | (కాశీ 3.22) |
| | | గిలిగింత | (< గిలిగించు) | (హర 2.95) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 27. | - ఁత | : | అలఁత | (< అలయు) | (శివ 3.25) |
| | | | ఈఁత | (< ఈఁదు) | (కాశీ 1.60) |
| | | | ఊఁత | (< ఊఁదు) | (కాశీ 4.211) |
| | | | కూఁత | (< కూయు) | (కాశీ 4.64) |
| | | | చేఁత | (< చేయు) | (శృ॥నై॥ 2.80) |
| | | | మ్రోఁత | (< మ్రోయు) | (ప॥వీ॥ 5) |
| | | | రోఁత | (< రోయు) | (కాశీ 5.207) |
| | | | వ్రాఁత | (< వ్రాయు) | (భీమ 2.8) |
| 28. | - న | : | దీవన | (< దీవించు) | (కాశీ 2.85) |
| | | | మన్నన | (< మన్నించు) | (హర 3.94) |
| 29. | -పము/-పెము | : | తిరిపెము | (< తిరియు) | (కాశీ 7.52) |
| | | | పొలపము | (< పొలయు) | (శృ॥నై॥ 6.80) |
| | | | మురిపెంబు | (< మురియు) | (శృ॥నై॥ 2.56) |
| | | | వలిపెము | (< వలియు) | (భీమ 1.118) |
| 30. | -పు | : | అదల్పు | (< అదల్చు) | (భీమ 4.60) |
| | | | ఓర్పు | (< ఓర్చు) | (కాశీ 2.83) |
| | | | చూపు | (< చూచు) | (హర 3.82) |
| | | | మఱపు | (< మఱచు) | (కాశీ 7.44) |
| 31. | - పురము | : | కాపురము | (< కాచు) | (హర 2.88) |
| 32. | - బడి | : | చెల్లుబడి | (< చెల్లు) | (హర 4.8) |
| 33. | - వ | : | చేరువ | (< చేరు) | (శృ॥నై॥ 6.113) |
| | | | తెగువ | (< తెగు) | (భీమ 2.88) |
| | | | దిగువ | (< దిగు) | (భీమ 1.114) |
| | | | విలువ | (< విలుచు) | (హర 3.83) |
| 34. | - వడి | : | నడవడి | (< నడచు) | (ప॥వీ॥ 63) |
| | | | లేవడి | (< కలుఁగు) | (శృ॥నై॥ 1.109) |
| 35. | - వి | : | ఈవి | (< ఇచ్చు) | (ప॥వీ॥ 25) |
| | | | తనివి | (< తనియు) | (శృ॥నై॥ 7.190) |
| | | | తెలివి | (< తెలియు) | (భీమ 5.182) |
| | | | విరివి | (< విరియు) | (కాశీ 4.296) |

| | | | | |
|---|---|---|---|---|
| 36. - వు | : | ఉలిపు | (< ఉలియు) | (భీమ 2.110) |
| | | కొలువు | (< కొలుచు) | (హర 6.73) |
| | | చావు | (< చచ్చు) | (హర 2.62) |
| | | నోవు | (< నొచ్చు) | (క్రీడా॥ 88) |
| | | తడవు | (< తడయు) | (శృ॥నై॥ 1.78) |
| | | నగవు | (< నగు) | (హర 4.19) |
| | | ననువు | (< ననుచు) | (భీమ 1.114) |
| | | నిలువు | (< నిలుచు) | (భీమ 3.185) |

పైన పేర్కొన్న ముప్పది ఆఱింటిలో -ఇకి, -క, -టు, -త, -పు, -వి, -వు అనే ప్రత్యయాలు ఆదేశాలుగాను, మిగిలినవి ఆగమాలుగాను వచ్చినవి. నన్నెచోడునిలో విశేషంగా -ఇకె, -వడ, -వలి అను ప్రత్యయాలును, తిక్కన భాషలో -అనము, -అపి, -అఱ/అఱు, -ఇగ, -ఇకము, -ఇయ, -ది, -దము, -దల, -పి అను ప్రత్యయాలు అంతంగా కల కృదంత రూపాలున్నాయి.

శబ్ద పల్లవము నందలి -కొనునకు అమూర్త నామమైన -కోలు, -పడునకు, -పాటు వచ్చును.

| | | |
|---|---|---|
| ఎత్తికోలు | (<ఎత్తికొను) | (శృ॥నై॥1.83) |
| తడబాటు | (<తడబడు) | (శివ 4.60) |
| తత్తఱపాటు | (<తత్తఱపడు) | (కాశీ 2.49) |
| సిగ్గుపాటు | (<సిగ్గుపడు) | (శృ॥నై॥ 3.84) |
| పొరపాటు | (<పొరపడు) | (ప॥వీ॥ 31) |
| వీడుకోలు | (<వీడుకొను) | (శృ॥నై॥ 2.106) |

## B. తద్ధిత నిర్మాణం:

## 16.1.5 ఇతర నామాల నుండి నిష్పన్నమైన నామవాచకాలు:-

ఇతర నామ వాచకాల నుండి నిష్పన్నమైన నామవాచకాలనే తద్ధితాలంటారు. ఈ క్రింది ప్రత్యయాలు చేరి శ్రీనాథుని భాషలో తద్ధితాలవుతున్నాయి. ఇవి ప్రత్యేకమైన అర్థాన్నిస్తున్నవి. అంటే త్వార్థ, స్వార్థ, భావార్థ, పరిమాణార్థ, మతుబర్థ, దఘ్నార్థము లందు వచ్చును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | -అ | : | చెలువ | (శృ॥నై॥ 2.113) | <u>మతుబర్థము</u> |
| 2. | -అడ | : | ఇల్లడ | (కాశీ 4.267) | |
| 3. | -ఆడి | : | ఆఱడి | (హర 3.10) | <u>స్వార్థము</u> |
| 4. | -అటము | : | ఇఱుకటము | (శృ॥నై॥ 4.124) | <u>స్వార్థము</u> |
| 5. | -అము | : | చెలువము | (శృ॥నై॥ 6.39) | <u>స్వార్థము</u> |
| 6. | -అరి | : | | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| జాలరి | (శివ 2.101) | జూదరి | (కాశీ 4.99) | టక్కరి | (హర 2.47) |

తక్కరి (హర 6.125) తిరివరి (కాశీ 7.52) తెరువరి (కాశీ 1.92)
నేర్పరి (శివ 1.22) మతకరి (కాశీ 7.92) ఇవి మతుబర్థములు

7. -అలు : చెలియలు (క్రీడా 244)

8. -ఆఁడు : కఱదలాడు (కాశీ 2.160) గజ్జులాడు (హర 7.61)
బిరుదులాడు (భీమ 2.7) ఇవి <u>మతుబర్థములు</u>

9. -ఆలు : ఇల్లాలు (హర 7.125)

10. -ఆడి : వన్నెఁలాడి (చా॥మ॥ 1.122) <u>మతబర్థము</u> <u>(స్త్రీ)</u>

11. -ఇ : కడలి (భీమ 4.110) బిత్తరి (శివ4.59) మిటారి (క్రీడా॥పీ॥ 66)
కొన్ని యెడలకు ల వాచకము గాను వచ్చుచున్నది. కుమ్మరి (ప॥వీ॥ 69), కమ్మరి (ప॥వీ॥ 44) <u>మతుబర్థములు</u>.

12. -ఇక : నాడిక (కాశీ 2.128) వాలిక (కాశీ 6.70) <u>స్వార్థము</u>

13. -ఇఁడి : కట్టిఁడి (శివ 2.98) బలువిఁడి (ప॥వీ॥ 28)

14. -ఇమి : కడిమి (హర 7.83) చెలిమి (శృ॥నై॥ 3.159)
పోఁడిమి (కాశీ 3.99) మగఁటిమి (భీమ 5.112)
వేఁడిమి (శివ 3.28) <u>భావార్థములు</u>

15. -ఇదము : ఒప్పిదము (కాశీ 4.158) <u>స్వార్థము</u>

16. -ఈఁడు : అటమటీఁడు (కాశీ 7.60) ఆగడీఁడు (హర 5.10)
ఉక్కడీఁడు (శృ॥నై॥ 7.41) బానసీఁడు (ప॥వీ॥ 100)
మిండగీఁడు (క్రీడా 243) వెగ్గలీఁడు (కాశీ 5.116)
సంగడీఁడు (కాశీ 4.68) <u>మతుబర్థములు</u>

17. -ఉక : ఎమ్ముక (కాశీ 5.73) నెలఁతుక (భీమ 2.126)
పొలఁతుక (శృ॥నై॥ 5.40) స్వార్థము

18. -ఉడు : చెవుడు (భీమ 4.59) <u>అభావార్థము</u>

19. -ఎడు : చిప్పెడు (హర 6.128) తూమెడు (హర 1.17)
పట్టెఁడు (కాశీ 7.136) <u>పరిమాణార్థము</u>
ఈ క్రింది వానిలో -ఎడు పరమగుచో 'లి' వర్ణలోపమగుతున్నది.
గుప్పెఁడు (గుప్పెలి) (క్రీ॥డా॥ 146) దోసెడు (దోసిలి) (చా॥మ॥ 1.126)
పిడికెడు (పిడికిలి) (భీమ 6.15) పుడిసెఁడు(పుడిసిలి)(హర 6.128)

20. -ఏసి : అంతలేసి (శృ॥నై॥ 6.135) ఇంతలేసి (కాశీ 2.104)
ఏడేసి (భీమ 3.37) పదేసి/పదియేసి (కాశీ 3.187)

21. -కత్తియ/-కత్తె : కటారికత్తియ (క్రీడా॥ 92)
కుంటెనకత్తియ (క్రీడా॥ 274) <u>మతుబర్థము</u>

కొన్ని యెడల -కత్తె ప్రత్యయము సంస్కృతంబుల మీద కనబడుచున్నవి.

కోపగత్తె (క్రీడా॥ 129) మిశ్రసమాసము. కత్తియలోని 'క' వర్ణమునకు 'గ' వర్ణము వచ్చినది.

నెచ్చెలి కత్తె (శృ॥నై॥ 8.68) వేడుకకత్తె (కాశీ 3.107)

పొందుకత్తె (ప॥వీ॥ 97) రట్టుకత్తె (క్రీడా॥ 171)

చెలికత్తియ (శృ॥నై॥ 4.99) చెలియలి కత్తియ (కాశీ 5.336)

బోటికత్తియ (శృ॥నై॥ 3.136) <u>స్వార్థము (స్త్రీ)</u>

22. -కాఁడు : కసవు కాఁడు (కాశీ 6.262) గగ్గులకాఁడు (కాశీ 7.88)

గుఱికాఁడు (హర 679) చెలికాఁడు (శృ॥నై॥ 3.46)

పందె-కాఁడు (క్రీడా॥ 99) విలుకాఁడు (శృ॥నై॥ 2.135)

వేటకాఁడు (శృ॥నై॥ 3.90) వేడుకకాఁడు (శృ॥నై॥ 6.5) <u>స్వార్థము</u> <u>(పుం)</u>

తద్ధిత రూపం పై మరొక ప్రత్యయము ఈ క్రింది రూపంలో కన్పిచటం విశేషం.

చెలిమికాఁడు (కాశీ 1.121)

కాఁడు లోని - కా ప్రత్యయానికి - గా వచ్చుట.

23. -గాఁడు : జీతగాఁడు (ప॥వీ॥ 30) <u>స్వార్థము</u>

పందెగాండ్రు (క్రీ॥డా॥ 227) <u>స్వార్థము</u>

కొన్ని యెడల -గాడు ప్రత్యయం సంస్కృత సమములందు కనిపిస్తున్నది.

కోపఁగాడు (భీమ 4.13) మిశ్ర సమాసము <u>మతబర్థము - పుం</u>

24. -కారము : చెలికారము (శృ॥నై॥ 2.50) చపలకారము (కాశీ 7.37) **<u>భావార్థము</u>**

నుడికారము (భీమ 1.15) <u>స్వార్థము</u>

25. -టి : బంటి (శివ 3.125) <u>భావార్థము</u>

బండు -అంత్యవర్ణము లోపించును.

26. -త : స్త్రీ వాచ్యమగునపుడు కుల వాచకమునకు వచ్చును.

సాలెత (చా॥మం॥ 1.133) అఱవత (కాశీ 3.110)

-త పరమగునపుడు ఎత్వము వచ్చును.

చెంచెత (<చెంచు) (హర 7.52)

జోగెత (<జోగు) (హర 2.94)

మాలెత (<మాల) (శివ 3.39)

కులవాచకము కాని నామములకును - త ప్రత్యయము వచ్చును.

అప్పుడును ఎత్వము వచ్చుచున్నది. గుబ్బెత (<గుబ్బ) (క్రీడా॥ 124).

27. -తనము :

| | | | |
|---|---|---|---|
| బజ్జిఁదనము | (శృ॥నై॥ 6.130) | కటికితనము | (శృ॥నై॥ 3.54) |
| కలితనము | (భీమ 1.89) | కలికితనము | (శృ॥నై॥ 7.160) |
| కల్లతనము | (కాశీ 4.90) | కుంటెనతనము | (శృ॥నై॥ 3.66) |
| కాయ్యతనము | (కాశీ 4.94) | గబ్బితనము | (భీమ 2.57) |
| గోరతనము | (కాశీ 4.91) | చక్కఁదనము | (భీమ 2.55) |
| తబిసితనము | (హర 7.62) | తియఁదనము | (శృ॥నై॥ 2.81) |
| పెద్దతనంబు | (శృ॥నై॥ 8.79) | జాఁగతనము | (భీమ 4.98) |
| వెఱ్ఱితనము | (ప॥వీ॥ 59,100) | వ్రేఁగుఁదనము | (భీమ 2.110) |

గయాళితనము (చా॥మం॥ 1.130) తద్ధితము పై తిరిగి ప్రత్యయము చేరినది.

ఈ క్రింది రూపంలో 'తన' వర్ణము పరమగునపుడు సార్వ నామిక రూపానికి లోపం కలుగుతున్నది.

పెల్లాకొన్నతనాన (భీమ 2.120) మంచితనము (శివ 3.78)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 28. -న | : బయ్యన | (శృ॥నై॥ 3.205) | కమ్మన | (శివ 2.47) | |
| | చామన | (కాశీ 3.133) | తెల్లన | (శృ॥నై॥ 8.129) | |
| | నల్లన | (కాశీ 4.3) | ప్రన్నన | (హర 3.78) | **- భావార్థము** |
| | మెత్తన | (కాశీ 2.44) | వ్రేకన | (కాశీ 6.199) | |
| | అల్లన | (శృ॥నై॥ 2.122) | విన్నన | (భీమ 6.62) | **- భావార్థము** |
| 29. -పోతు | : సోమరిపోతు | (శృ॥నై॥ 1.17) | తాచ్ఛీల్యార్థము | | |
| 30. -బంటి | : కుత్తుక బంటి | (శృ॥నై॥ 3.32) | | | |
| | చంకల బంటి | (క్రీడా॥ 171) | పుక్కిటబంటి | (హర 4.14) | **-దఘ్నార్థము** |

31. మాత్రము : ఈ ప్రత్యయము సాంస్కృతికము. ఇది దేశ్య శబ్దములకును వ్యాపించుటకానవచ్చును.

- మాత్రము : అంతమాత్ర (శృ॥నై॥ 3.182)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 32. -మి | : పేర్మి | (శివ 3.128) | వేడిమి | (శివ 3.28) |
| | తాల్మి | (భీమ 5.163) | కూరిమి | (శృ॥నై॥ 7.166) |
| 33. -ఱికము | : కన్నెఱికము | (భీమ 2.62) | పెద్దఱికము | (కాశీ 5.89) |
| | రాచఱికము | (శివ 2.90) | **- భావార్థము** | |

34. -వాడు : కులవాచకముల నుండి నిష్పన్నమైన మహద్వాచకనామములు.

రాచవాఁడు (శృ॥నై॥ 6.65) వెలివాడవాఁడు (కాశీ 7.242)

అన్య విశేషణములకును -వాఁడు చేరును.

బడుగువాఁడు (శృ॥నై॥ 8.148)

35. -అది : మహతీ వాచకరూపములందు

కాఁపుది : (చా॥మం॥ 1.134)

అగసాలిది : (శ్రీ॥శృం॥ 29)

ఈ విధంగా శ్రీనాథ భాషలో 35 ప్రత్యయాలు చేరి తద్ధిత రూపాలు ఏర్పడుచున్నవి.

## 16.1.6 భావార్థకములు:- (Verbal Nouns)

స్వార్థము నందు ధాతువునకు -ట వర్ణకం చేర్చగా భావార్థకమేర్పడుతున్నది. వ్యతిరేక భావార్థకమునందు ధాతువునకు -అమి అను ప్రత్యయం చేరుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| -ట : | అగుట (<అగు) | (శృ॥నై॥ 1.87) | ఆడుట (<ఆడు) | (కాశీ 7.166) |
| | చేయుట (<చేయు) | (హర 2.47) | | |
| | ఉంట (<ఉండు) | (శృ॥నై॥ 4.67) | | |

నన్నయలో కొలదిగా కన్పించు -డు వర్ణంతోడి భావార్థక ప్రయోగాలు శ్రీనాథుని కాలం నాటికి పూర్తిగా అంతరించినవని చెప్పవచ్చును. ఆధునిక భాషలో -డు అంతమున వచ్చు రూపములు వ్యవహార విదూరములు -ట వర్ణాంతములు సహజములు.

**వ్యతిరేక భావార్థకాలు:-**

| | |
|---|---|
| -అమి : | అబ్బమి (క్రీడా॥ 175) |
| | ఓర్వమి (భీమ 5.148) |
| | ఓపమి (శృ॥నై॥ 3.41) |
| | చూడమి (క్రీడా॥ 286) |

## 16.1.7 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని భాషలో కృత్ప్రత్యయ నిర్మాణమెట్టిదో వివరింపుడు.
2. శ్రీనాథుని రచనల్లో కాననగు తద్ధిత ప్రత్యయ నిర్మాణాన్ని గురించి వ్రాయుడు.

## 16.1.8 ఆధార గ్రంథాలు:-

1. శ్రీనాథ భాషా పరిశీలన : ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి
2. బాల వ్యాకరణము : ఆచార్య పరవస్తు చిన్నయసూరి

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**

**పాఠం - 16.2**

# శ్రీనాథుని రచనల్లో నుడికారము (Idions &Usage Proverbs) జాతీయము మరియు లోకోక్తులు

**ముఖ్యాంశాలు:-**

16.2.0 లక్ష్యం

16.2.1 ఉపోద్ఘాతము - నుడికార నిర్వచనము

16.2.2 శ్రీనాథుని కావ్యాల్లోని ముఖ్యమైన నుడికారములను సోదాహరణ వివరణ పూర్వకంగా వివరించడం

16.2.3 వివరణాపేక్ష లేని నుడికారాలు

16.2.4 లోకోక్తులు నిర్వచనము

16.2.5 శ్రీనాథుని కావ్యాల్లోని ముఖ్యమైన లోకోక్తులకు సోదాహరణ పూర్వక వివరణ

16.2.6 సంస్కృత లోకోక్తులకు వివరణ

16.2.7 ప్రశ్నలు

16.2.8 ఆధార గ్రంథాలు

## 16.2.0 లక్ష్యం:-

శ్రీనాథుని భాషలో ప్రతిబింబించే నుడికారాలను సోదాహరణంగా నిరూపించడం - నుడికారం - జాతీయం - పదబంధం సమానార్థాలుగా వ్యవహారంలో కల విషయాన్ని వివరించటం ఈ వ్యాస ప్రధానోద్దేశం.

## 16.2.1 ఉపోద్ఘాతము - నుడికార నిర్వచనము:-

నుడికారాన్నే పలుకుబడి - జాతీయం - పద బంధం అనే పర్యాయపదాల్తో పేర్కొనటం జరుగుతున్నది. నుడికారానికీ పలుకుబడికీ భేదం పదాల అర్థమందైనా లేదు. జాతీయం భాషా సంప్రదాయ సిద్ధమని అర్థం. పదబంధం అంటే పదాల విశిష్ట బంధమనే అర్థాన్నే ఇస్తుంది. కానీ దాన్ని కూడా నుడికారానికి తుల్యంగా నేడు వాడుతున్నారు. నుడికారం భాషా సంప్రదాయాన్నే కాదు, జాతి యొక్క సంప్రదాయాన్ని కూడా తెలియపరుస్తుంది. లోకోక్తులలాగా నుడికారాలునూ భాషకు ప్రవాహశీలాన్ని ప్రసాదిస్తాయి. సాంప్రదాయికమైన సముజ్జ్వలత్వాన్ని సమకూరుస్తాయి.

ప్రతి మానవుడు తన మనో భావాలనన్నింటిని ఎదుటి వారికి చెప్పటానికి ప్రయత్నిస్తాడు. ఆ సమయంలో తన భాష చేవ గలదైనప్పుడు క్రొత్త మాటలు, క్రొత్త భావచ్ఛాయలు ఏర్పడుతుంటాయి. విడిగా పొడి మాటల్లాగా ఉన్నవే అపూర్వ సమ్మేళనంలో అపూర్వ భావ వ్యక్తీకరణానికి మూలములై విశిష్ట పద బంధాలుగా భాషలో నిలిచిపోతాయి. వానినే పదబంధాలనీ, నుడికారాలనీ,

పలుకుబడులనీ, జాతీయాలని పేర్కొంటున్నాం. శ్రీనాథుని కావ్యాల్లో సంతరించబడ్డ నుడికారాలను వివరించటానికి ఒక ప్రత్యేక గ్రంథం చాలదు. కాబట్టి ముఖ్యమైన కొన్ని నుడికారాలను గూర్చి ఇక్కడ వివరిస్తాను.

## 16.2.2 శ్రీనాథుని కావ్యాల్లోని ముఖ్యమైన నుడికారాలు:-

1. **అందని ప్రాఁకుల పండ్లు గోయఁదలఁచుట : (శృ॥నై॥ 2.63)**

   వృధా ప్రయాసపడుట యని యర్థము, నిష్ప్రయోజనం.

2. **అడుసులోపల దాటి పండదుముట : (కాశీ 1.114)**

   తడిమట్టి యందు తాటి పండు నదిమి త్రొక్కుట యెంత తేలికయో, యంత తేలికగా అణగద్రొక్కుట.

3. **అఱ్ఱు కడుపును జల్లగా నభిలషించుట : (భీమ 4.87)**

   దీవించుట యని యర్థం. అభ్యంగ స్నాన సమయంలో తల పై నూనె పెట్టూ 'నీయమ్మ కడుపు చల్లఁగా నీయత్త కడుపు చల్లఁగా.........' అని శుభము నభిలషించు ఆచారాన్ని బట్టి ఏర్పడింది. ఇక్కడ 'కాలకూటాగ్ని సంహార కారి యభవు' నుద్దేశించి పరమేశ్వరుని కడుపు చల్లగా అభిలషించటం జరిగింది. అనగా 'లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు' అని స్వస్తి పలుకుట.

4. **ఆవగింజలు తాటి కాయలుగ నాడుట : (శృ॥నై॥ 7.119)**

   లేనిపోనివి కల్పించి అతిశయంగా చెప్పటం అని అర్థం. ఆవగింజంత చిన్న విషయమైనా దానికెన్నో రెట్లు కల్పించి పెద్దదైన తాటికాయ వలె పెంచి చెప్పుట. గోరంతలు కొండంతలు చేయుట.

5. **ఇరు చెవి యెఱుఁగ కుండ : (భీమ 4.50)**

   అత్యంత రహస్యంగా అని అర్థం. రెండవ కంటి వానికి తెలియకుండనని నేటి వాడుక.

6. **ఈఁగకేనీవియిడని : (శృ॥నై॥ 7.53)**

   చాలా లోభి అని అర్థం. ఈవియిడు - అనగా ఎంగిలి మెతుకులు విదలించటం. ఈఁగను దాని పైననైనను వ్రాలనీనంతటి లోభియని పై నుడికారానికి అర్థం.

7. **ఈఁగకు బోఁకయిడినట్లు : (క్రీ॥డా॥ 246)**

   ఆసక్తి లేకుండుట, ఈఁగలు పోఁకల పై ముసరవు. కారణం పోఁక యీఁగకు కొరుకుడు పడదు కావున.

8. **ఈలగ్రద్ద : (శృ॥నై॥ 1.107)**

   ఈలగ్రద్ద అంటే క్రూరుడు. ఒకసారి ఇచ్చియు, లోభం వల్ల దానిని తిరిగి క్రూరంగా లాగుకొనువాడు. ఈలగ్రద్ద అంటే ఈల వేసెడి యొక జాతి గ్రద్ద. గ్రద్దలకు క్రౌర్యం ప్రధాన గుణం. ఆ గ్రద్ద వలె క్రూరుడు. లోభియని సూర్యరాయాంధ్ర నిఘంటువు, పద బంధ పారిజాతములో పేర్కొనబడింది. కాని గ్రద్దలకు, డేగలకు క్రౌర్యము ప్రధాన గుణం. ఆ క్రౌర్యం తగుల్కొనుటకు కారణం నిస్సంశయంగా లోభమే. కాబట్టి లోభం వల్ల క్రూరంగా లాగిగొనుట అని అర్థం చెప్పవచ్చు.

9. **ఉదురు మిడుకు : (హర 5.10)**

అదిరిపడేవాడు, ఒక తిట్టు అని పద బంధ పారిజాతంలో చెప్పబడింది. దుర్మార్గుడు, భయపెట్టూ మిడుకుచుండువాడు. లేదా మిడుకుచూ భయపెట్టేవాడు. దుశ్చర్యలచే భయాన్ని కలగజేసేవాడు.

10. **ఎముకలేఱుట : (శృ॥నై॥ 7.81)**

చంపుట, శవదహనం తర్వాత అస్థిసంచమానికి సంబంధించినది.

11. **ఏమొగమున : (కాశీ 5.324)**

సిగ్గుపడుట. తానుకూడని పని చేసిన గాని, చేయదగునది చేయకపోయిన గానీ, తన మొగాన్ని కావలసిన వారికి చూపెట్టకుండటం జరుగుతుంది. అప్పుడు ఎదుటి వారు ఏమంటారో అని మొగాన్ని చాటు చేసుకొని, ఓ మొగంతో వారి దగ్గరకు పోగలను అని అనగా ఈ ముఖాన్ని చూపించజాలనని భావం.

12. **ఒక కుత్తుకయగు : (హర 2.60)**

'ఏకగ్రీవము' అనే దానికి అనువాదం కావచ్చు ఏకాభిప్రాయానికి వచ్చుట. ఒకే మాట పై ఉండటం అని అర్థము.

13. **ఒట్టుపెట్టినయట్లు :**

ఒట్టనగా ప్రమాణం. సాధారణమైన పలుకుగాక, దానికి కొంత ఎక్కువ విలువనిచ్చుట. ప్రమాణాన్ని సమకూర్చేది సామాన్యపు శక్తి గాక ఆసాధారణ శక్తి.

14. **ఓంకారమాచరించుట : (శృ॥నై॥ 2.69)**

అంగీకరించుట. సంస్కృత భాషలో అంగీకారాన్ని సూచించటానికి 'ఓ'మ్మని అనటం సంప్రదాయం.

15. **కడుపారసి పెట్టు : (శివ 3.19)**

కడుపు చూచి పెట్టుట. ఆకలి తీరేంత వరకు ఆదరంతో భోజనం పెట్టటం.

16. **కనుఁగాపు : (హర 3.11)**

దాసానుదాసుడు. కనుసైగను గ్రహించి పనిచేయు సేవకుడు.

17. **కన్ను మొఱఁగు : (భీమ 1.111)**

మోసగించు. కనుచాటు చేసికొని కనిపించకుండా మోసం చేయటం.

18. **కాటఁగలియుట : (హర 2.99)**

నాశనమగుట. 'కాడు' అనగా స్మశాసనము, అడవి అని రెండర్థాలున్నాయి. కనుక కాటి యందు కలియుట అంటే మరణించుట అని భావం.

19. **కానకకన్న సంతానము : (శృ॥నై॥ 1.108)**

లేకలేక పుట్టిన బిడ్డ.

**20. కుక్కలుంబడని పాటులు : (హర 3.15)**

చాల అగచాట్లుపడుట. కుక్కలను నీచంగా చూచే పద్ధతి పై ఏర్పడ్డ పలుకుబడి కావచ్చును.

**21. కూపమండూకము : (భీమ 1.13)**

ప్రపంచం తెలియని వాడు. నూతిలోని కప్పకి, తానున్న బావి, పై ఉన్న ఆకాశం కాక ఇతరములు ఎట్లా తెలియవో అట్లే అని భావం. ఆ కప్ప ప్రపంచమంతా ఇంతే అనుకొంటుంది. అట్లే అల్ప పరిజ్ఞానం కలవాడును తెలియక ఇట్లే అనుకుంటుంటాడు. కూపస్థ మండూకమని వాడుక. 'బావిలో కప్ప' అని కూడా అంటారు.

**22. కొంగు బంగారము : (క్రీడా॥ 52)**

సులభసాధ్యమైంది. మిక్కిలి అందుబాటులో కలది.

**23. కొండ పట్టుట : (కాశీ 6.24)**

దేశాంతర గతుడగుట. తలదాచుకొనుటకై తిప్పలుపడుట.

**24. కొయ్యతనము : (కాశీ 4.94)**

దుడుకు పనులు చేయుట. దయలేక దుడుకుగా ప్రవర్తించి ధూర్తతతో పనులు చేయుట.

**25. గర్భయాచకులు : (హర 3.15)**

పుట్టిన నాటి నుండి బిచ్చగాండ్రు. ఆ గర్భ శ్రీమంతుడు, గర్భ దరిద్రుడు. గర్భ శత్రువు మొదలగు వానివలె ఈ పలుకుబడి కూడా ఏర్పడింది.

**26. గుమ్మడిమూటకట్టుట : (క్రీడా॥ 45)**

గుమ్మడి పండు ఆకారంలో ఉన్న మూట. గుండ్రంగా ఉన్న మూట.

**27. గొడ్డువీగుఁట : (కాశీ 4.87)**

సంతానము కలుగుట. వంధ్యాత్వం పోయినదనటం.

**28. చంకదుడ్డు శరణార్థి : (హర 7.17)**

అననురూప ప్రవర్తన. పైకి అభయాన్ని కోరుతూ వచ్చి నటుల నటిస్తున్ననూ వీలు చిక్కితే కొట్టటానికి చంకలో కఱ్ఱను దాచుకొని వచ్చినటుల ప్రవర్తించటం.

**29. చంకల బంటిగా మెసవుట : (క్రీడా॥ 56)**

ఎక్కువగా తినడం. ఉదరము బాహుమూలాల వరకు వచ్చునట్లుగా తినడం. గొంతు వరకు తినటం అనే పలుకుబడి వాడుకలో ఉంది.

**30. చందమామఘుటిక : (శివ 2.135)**

ఆలస్యమవ్వటం అని అర్థం. చందమామను చూపుతూ వట్టి వ్రేళ్ళు నోటిలో పెట్టగా వారు చప్పరించెదరని అర్థం. చందమామనే గుళికగా భావించి దానిని మ్రింగటానికి ప్రయత్నించే వారికది లభించకపోవుట. అట్టి వాడుగుటకలు మ్రింగవలసిందే.

**31. చచ్చిబ్రతుకు : (శృ॥నై॥ 2.138)**

చచ్చునంతటి ప్రమాదం వచ్చినప్పటికీ గండం గడచి జీవించటం. పునర్జన్మ సదృశమగుట. 'ఈ జబ్బుతో వాడు చచ్చిబ్రతికినాడు' అని వాడుక.

**32. చిఱుబంతిపసుపాడు : (భీమ 2.28)**

స్నానం చేయడం. గాఢమైన చాయ కల చిఱుతరకపు బంతి పూల చాయ పసుపని యర్థము. స్త్రీలు స్నాన సమయంలో పూసికొనే పసుపు పూత.

**33. చివ్వకుఁజేయి సాఁచుట : (కాశీ 6.180)**

యుద్ధాన్ని కోరటం. కలహాన్ని ఆహ్వానిస్తూ చేయి సాచటం కయ్యానికి కాలు ద్రవ్వట వంటిది.

**34. చెట్టునఁబుడికినట్లుండుట : (కాశీ 7.234)**

అచ్చంగా ఉండటం. చెట్టునఁగోసిన దెట్లు మార్పులు లేకుండా అచ్చమై ఉంటుందో అట్లే ఉండటం. కృత్రిమ వేషమైనప్పటికీ సహజంగా ఉన్నదా అన్నట్లుండటం. చెట్టును చెక్కినట్లుండటం అని పదబంధ పారిజాతం.

**35. చెడ్డయింటి చెదారము : (కాశీ 4.91)**

ఎవరి పోషణ లేకుండా తనకు తానుగా పెరిగే వ్యక్తి.

**36. జలంబు పాలగుట : (శృ॥నై॥ 8.79)**

నశించుట, వరద పాలగుట.

**37. డస్సిరట్టమగు : (కాశీ 6.44)**

చచ్చినంత పని యగు. పూర్తిగా అలసిపోవు. చర్మకారులు పశువుల చర్మాన్ని దట్టమగువని వ్యవహరిస్తారు. జీవములు లేక వట్టితోలు మాత్రం మిగిలినది అనడం.

**38. తిలలు పైకెత్తి చల్లిన దిగువబడనయంత సందడి : (శృ॥నై॥ 4.123)**

జనము చాలా క్రిక్కిరి ఉన్నారు అని చెప్పటం. 'ఇసుక చల్లిన రాలని' అని వాడుక.

**39. త్రాడు వడుట : (భీమ 4.107)**

నిస్సత్త్వాన్ని పొందటం. వివశత వల్ల నిస్సత్త్వాన్ని పొందటం. త్రాడులాగా సన్నబడి, బలహీనపడి చైతన్యాన్ని తరగుట.

**40. దర్శనమిచ్చుట : (కాశీ 4.66)**

కానుక సమర్పించటం. రాజులు మొదలగు పెద్దలను కానీ, పసి బాలురను గానీ చూడటానికి పోయేటప్పుడు వట్టి చేతుల్తో పోకూడదు. కాబట్టి వారికేదైనా బహుమానాన్ని తీసుకొని పోవటాన్ని బట్టి దర్శనానికి కానుక అని అర్థం ఏర్పడి ఉంటుంది.

**41. నట్టేటముంచుట : (ప॥వి॥ 110)**

నాశనం చేయటం. నట్టేటిలోనికి తీసుకొనిపోయి అచట ముంచితే చావటం యదార్థం. అట్లే ఏదేని వ్యవహారంలో మధ్యలో మోసగించటం.

**42. నీడతోఁచుట : (హర 4.52)**

నిర్మలంగా ఉండటం. ప్రతిబింబం కనుపించేటంతగా తేటి యుండటం.

**43. నెత్తిఁజేతు లిడుట : (కాశీ 2.156)**

చాలా దుఃఖించటం. నెత్తి మీద ఁజేతులిడుకొనుట దుఃఖ సూచన నేడు నెత్తిన జేతులిడుట అంటే మోసం వల్ల నాశనాన్ని చేయటానికి వాడుతున్నాం.

**44. నోరుమాలిన జంతువు : (కాశీ 5.335)**

మూగ జీవము అని అనుట. మానవేతరములగు జీవులు మాటాడలేవు. దానినే యొత్తి చెప్పటం ఇక్కడ జరిగింది.

**45. పండ్లు గొఱుకుట : (శృ॥నై॥ 7.130)**

కోపోద్రేకం కలగటం. కోపాతిరేకమున పండ్లు కొఱకుటను బట్టి ఏర్పడ్డ నుడికారం.

**46. పాఱెడు నీళ్లకుఁ గట్టుపెట్టుట : (కాశీ 7.122)**

ప్రయోజనకారి కాదనటం. అట్లాంటి పని చేయడం అవివేకం.

**47. పులియుట : (కాశీ 7.133)**

విఱ్ఱవీఁగుట. పులిసిన వస్తువెట్లు మత్తును కలిగిస్తుందో అట్లే మదించి విఱ్ఱవీఁగుట.

**48. మాయలేడిని బట్టికట్టుట : (హర 3.145)**

దుర్ఘట కార్యము. రామాయణంలోని మాయలేడి నుండి ఏర్పడ్డ నుడికారం.

**49. ముక్కు మొగము చూచుట : (భీమ 3.8)**

మోమోటపడుట.

**50. మూడు కాళ్ల ముసలి : (శృ॥నై॥ 1.108)**

చాలా ముసలి అనడం. ఊతకోల లేనిదే అడుగిడలేని స్థితి. ఆలంబన యష్టియే మూడవకాలు.

**51. మగవాడో మ్రానో : (హర 2.100)**

మొరటు స్వభావం కలవాడని అర్థం. మ్రాని వలె ఎట్టి సుఖ దుఃఖాలు కలుగక ఉండునని అనడం. వట్టి మొద్దు అని భావం.

**52. విభూతి యొసఁగుట : (హర॥పీ॥ 14)**

భోజనానికి లెమ్మనుట. గంధాక్షతలు భోజన సందర్భంలో ఇచ్చినట్లే శైవులు విభూతిని ఇస్తారు.

53. **విస్తరి బండికన్నగుట : (ప॥వీ॥ 91)**

పెద్దదిగా కన్పించటం. విస్తరి వంటి చిన్న వస్తువైనా బండి చక్రంలాగా పెద్దదియైనట్లు కనిపించటం. భయంకరంగా ఉండటం.

54. **శివార్చన చేయుట : (హర 2.47)**

భోజనం చేయటం. దేవతార్చనయైన తరువాత భోజనం చేయటం శిష్టుల పద్ధతి. ఇక్కడ శైవులు కాబట్టి స్పష్టార్థ ప్రతిపత్తికై శివార్చన చేయటం.

55. **శివశివా : (భీమ 3.126)**

ఎంతో అదృష్టం కలిగెనని అభినందించటం. నేటి కాలంలో 'శివశివా', 'రామరామ!' అని పలకటం కష్ట సమయాల్లోనే.

56. **సంచకరము : (శివ 3.68)**

వెల నిర్ణయింపబడ్డ తర్వాత, వ్యవహారాన్ని గట్టి చేసుకోవడానికి యిచ్చి, పుచ్చుకొనే సొమ్ము (advance).

ఇలాంటి నుడికారాలు శ్రీనాథుని కవిత్వంలో అసంఖ్యాకాలుగా ఉన్నాయి.

## 16.2.3 వివరణాపేక్ష లేని నుడికారాలు:-

1. 'పేలగింజయుం బెద్దయయ్యెనే' (శృ॥నై॥ 1.110)
2. 'కన్నులు చల్లగా' (శృ॥నై॥ 2.86)
3. 'ఒడలెల్లఁగన్నులై' (శృ॥నై॥ 6.66)
4. 'దరహాసము ఔప్పలఁదొంగలింపగాన్' (శృ॥నై॥ 6.102)
5. 'మిండ తుమ్మెద పదువులు' (శృ॥నై॥ 2.54)
6. 'పూటకాపు' (శృ॥నై॥ 2.86)
7. 'వినుకలిఁగూర్మి' (శృ॥నై॥ 2.54)
8. 'వాలికమించుగ్రన్గొనలు' (శృ॥నై॥ 2.112)

తామర తంపర లాగా ఉన్న ఈ తెలుగు పలుకుబడి నుడికారాలన్నీ శ్రీనాథుని కావ్యోద్యానంలో పూల జొంపములై కుసుమించి గుబాళిస్తుంటాయి. శ్రీనాథుడంటే ప్రతిభా వ్యుత్పత్తులు రెండూ కరగబోసిన రూపం. కవితా బాహ్య రూపమైన పద్యరచనలు, పద గుంఫనము, నుడికారపు సొంపు, భావ శిల్పములలో ఈతని మార్గమొక అన్య సాధారణమైంది.

## 16.2.4 లోకోక్తులు - నిర్వచనము:-

జన వ్యవహారంలో ఒకానొక సందర్భానికి అనువుగా అవతరించి తరువాత ఆ నోట ఆ నోట బడి నలిగి ప్రచారంలో ఉండే సూక్తిని లోకోక్తి అనవచ్చును. ఏ లోకోక్తిని, ఏ సందర్భంలో, ఎవరు రూపొందించారో చెప్పటం సాహస కార్యమే. కొన్ని సూక్తులుగ, కొన్ని దృష్టాంతాలుగ, కొన్ని సాదృశ్యాలుగ, కొన్ని నిదర్శనాలుగ, కొన్ని అర్థాంతరన్యాసాలుగ, కొన్ని ఏ గాథనో, జానపద గేయాన్నో, సన్నివేశాన్నో పురస్కరించుకొని ప్రచారంలోకి వచ్చి ఉండవచ్చును.

'ఒక సంగతికి దృష్టాంతంగా లోకులు వాడుకగా చెప్పేమాట లోకోక్తి' అని బ్రౌణ్యంలో ఉంది. సంస్కృతంలో లోకోక్తులు, న్యాయాలు అనే వానిని తెలుగులో సామెతలు అంటారు. 'లోక ప్రవాదాను కృతిర్లోకోక్తి రితికథ్యతే' విశేష లోకానుభవం గల పెద్దల మాట యని లోకోక్తి నిర్వచనం. సామెత అనేది ఈ లోకోక్తికి పర్యాయమైన అచ్చ తెలుగు పదం. సమతా శబ్దభవం సామెతయని బ్రౌణ్యం, నానుడి అను మాట సైతం కలదు. నానుడి అంటే అందరి నోటను నానెడి వాక్యము లేక జనశ్రుతి అని కొందర వ్యాఖ్యానము. దేశీయములైన పలుకుబడి అనే అర్థంలో 'నాను + నుడి' యే 'నాణ్ + నుడి' యై నానుడిగా మారింది. కన్నడంలో 'నాణ్ణుడి' అంటారు.

భాషను జీవన ప్రవంతి లాగా ప్రవహింప చేసేవి అందులో అంతర్గర్భితములైనవి లోకోక్తులు. మాటల శక్తి నుడికారపు సొంపులు, సంఘస్థితి, భావనా సంపద మొదలయిన సంస్కృతి విశేషము లెక్కువగా వీని యందు గోచరిస్తుంటాయి. మన జాతికి, మతానికి, సంప్రదాయానికి, సాహిత్యానికి, చరిత్రకు, సంస్కృతికి, సాంఘిక వ్యవస్థలోని సమస్త అంతర్భాగాలకు ఈ లోకోక్తులు దర్పణం వంటివి. శ్రీనాథుని కావ్యాల్లోని లోకోక్తులు సాంప్రదాయికాలు. వానిలో ముఖ్యమైన కొన్నింటికి వివరణ.

## 16.2.5 శ్రీనాథుని కావ్యాల్లోని ముఖ్యమైన లోకోక్తులు - వివరణ:-

1. **'ఆడఁగ బోవు తీర్థమెదురైన విధంబున నెల్లియేను' (హర 7.124):-** ఏ పుణ్య తీర్థమున స్నాన మాడి పుణ్యాన్ని సంపాదించాలనుకుంటామో ఆ తీర్థమే ఎదురు వచ్చిన అంతకన్న కావలసిందేమున్నది? తామేది కోరితే అదే అప్రయత్నంగా లభించిన సందర్భంలో దీనిని వాడతారు.

2. **'ఆవగింజంత భూతి మైనలదికొనిన వెలఁది గుమ్మడికాయంత వెఱ్ఱిపుట్టు' (హర 2.99):-** ఇది మతపరమైందిగా గోచరిస్తుంది. శైవ సంప్రదాయానికి సంబంధించింది. కొంచెం విభూతి శరీరానికి రాసుకొన్నా ఎక్కువగా వెఱ్ఱియెత్తునని అర్థం. అంటే శివమెత్తుట. ఒడలు తెలియని ఆవేశం కలుగుతుంది.

3. **'ఇంటిలో భోజన నంబిచ్చకురాక పరుల యెంగిలి కాసపడితిని గాదె' (ప॥వీ॥ 67):-** ఇంటి పట్టున పంచ భక్ష్య పరమాన్నములున్నా వానిని కాదని పొరుగింటి ఎంగిలి కూటికాసపడువాడు మూర్ఖుడు మాత్రమే కాదు దుర్మార్గుడును. అట్లే స్వీయను కాదని పెడదారులు త్రొక్కు వాడును, ఎంగిలి కాశపడుటనగా అన్యుల యందు గానీ, సామాన్యుల యందు గాని ఆసక్తుడగుట.

4. **'ఉడుము నడికిన నడు ఁకునే ఒడియపెట్టు!' (కాశీ 2.144):-** ఉడుము కంపించిన దుడ్డు కఱ్ఱ దెబ్బ కంపించునా? అని భావం. సామర్థ్యము నందలి తారతమ్యమే దీనికి కారణము. అట్లే బలవంతులదే ఎల్లప్పుడును మేలు చేయి అవుతుందని భావం.

5. **'ఉన్న యూరు ఁగన్నతల్లియు నొక్క రూపన్న రీతి?' (కాశీ 7.164):-** కన్నతల్లి ఏ విధంగా వాత్సల్యంతో చూస్తుందో అట్లే ఉన్న ఊరు కాపాడునని అర్థం. కన్నతల్లిని ఏ విధంగా గౌరవిస్తామో అట్లే ఉన్నఊరును మన్నింపవలెనను సందర్భమున వాడుక. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అని కదా సూక్తి.

6. **ఏవ్వాని సొమ్ము జయాపజయములు?' (శృ॥నై॥ 7.168)ఁ:-** జయాపజయాలు దైవాధీనాలు. అవి ఎవరి సొత్తును గావు. మానవునకు జయాపజయాల పై అధికారం లేదు. దైవ నిర్ణయాన్ని బట్టి అవి నిర్ణయింపబడతాయి. కాబట్టి విఱ్ఱవీగుట తగదని భావం.

7. **కుట్టియాచూడగ దోసకాయలె విశుద్ధయశోధన యన్య చిత్తముల్ (హర 2.63):-** పదబంధ పారిజాతంలో "కుట్టిచూచుటకు దోసకాయలా?" అని పదబంధాన్నిచ్చి 'తెలిసికో లేము' అని ఆంతర్యం అని వివరణ చేయబడింది. ఇక్కడ 'కుట్టి

ఆచూచుట' కు బదులు 'కుట్టి మూచూచుటకు' అని ఒక పాఠాంతరం కలదు. కుట్టిమూచూచుట అంటే కోసిన దాన్ని ముక్కుతో వాసన చూచుట యని అర్థం. ఇతరుల మనస్సులలో ఏమేమి కోర్కెలుండునో తెలిసి కొనుట కష్టమని పైలోకోక్తి భావము. అదెట్లన్న భౌతికమైన రూపము మనస్సునకు లేదు. ఆలోచనలకును లేదు. మనస్సు దోసకాయ వంటి వుస్తువు కాదు గదా! దానిని కోసి దానిలో నేవేని తలపులున్నచో తెలిసికోవడానికి.

8. **'కాసర కాఁబోతు నాఁబోతు క్రుమ్ములాడ నడిమిలేఁబెయ్యగతి వచ్చె నాకు నిపుడు' (కాశీ 2.104):-** ఆబోతు లాబోతులు కుమ్మలాడి లేగల కాళ్ళు విరుగ ద్రొక్కినట్లు అని లోకోక్తి.

ఆవులు గాని, ఆబోతులు గాని కుమ్మలాడితే ఆ త్రొక్కిసలాటలో నలిగి విరిగేవి లేగల కాళ్లు. లేగలంటే లేత దూడలు. అప్పుడు వానికి ప్రాణాపాయ స్థితి వస్తుంది. అట్లే పెద్దలు పోట్లాడుకుంటే వారికి వచ్చు నష్టం తక్కువ. కాని వారి మధ్యనున్న పిన్నలు ఆయా ఘాతాలకు తట్టుకోలేక నష్టపడతారు.

9. **'గుడిలో నుండియు గుడి ఱాళ్లను దీయుట' (క్రీడా॥ 246):-** పవిత్రమగు గుడి లోపల ఉండియు, గుడి ఱాళ్లను క్రమంగా తీసి ఆ ఱాళ్లను తనకై ఉపయోగించుకొనువాడు గుడిని ధ్వంసము చేయు భక్తుడు. కృతఘ్నుడనుట. తిన్న యింటి వాసము లెక్క పెట్టటం వంటిది. ఆశ్రయమిచ్చిన వారికి హాని తల పెట్టుట యిట్టిదే.

10. **'గొఱ్ఱె క్రొవ్వియు సెలగట్టెగొఱికినట్లు' (భీమ 4.53):-** మదించిన గొఱ్ఱె సెలకోలనే కొఱక ప్రయత్నిస్తుంది. అట్లే మూర్ఖులు తమ శక్తిని ఎదిరి శక్తిని ఎఱుగక ఎదుటి వాన్ని ఎదిరిస్తారు. యుక్తాయుక్త వివేచనం గొఱ్ఱె కుండదు అందును మదించిన వానికి మునుపే ఉండదు.

11. **'చెర్వుఁజూడఁగాఁబోయిన తూడు తీఁగె క్రియ' (కాశీ 6.29):-** ఇందు 'తూఁటి తీఁగె. అంటే నీటిలో ఉండే ఒక తీగ. తూఁటి తీఁగె చెఱువును చూడటానికి పోయిందంటే తన నివాసానికి అత్యంత యోగ్యమైన నీటిని చూడగానే దాని యందే ఉండటానికి నిశ్చియిస్తుంది. కాని తిరిగి రాదు. పుట్టింటికి పోయి అచటనే సుఖంగా ఉండిపోవటం వంటిది. శివుడు బ్రహ్మను కాశికి పంపు సందర్భంలోనిది.

12. **'చేల పంటులఁ గొయ్యలు చెప్పు గాదె' (కాశీ 7.144):-** పంట ఎంత పండిందో చేనిలోని కొయ్యల్ని చూస్తే తెలుస్తుంది. వరి మొదలగు పంటలను కోస్తే మిగిలిన మ్రోళ్ళు కొయ్యలు. వీని ఏపును చూస్తే పంటచేలో లేకపోయినప్పటికీ పంట విషయం తెలుస్తుంది. కాబట్టి తక్కువ ఏపుగా ఉంటే తక్కువ పంటయు, ఎక్కువ ఏపుగా ఉంటే ఎక్కువ పంటయు పండినట్లు తెలిసి కొనగలం. ప్రస్తుత సందర్భంలో శిష్యుల ముఖాల కవళికలను బట్టి వ్యాసుడు వారికి భిక్షాన్నము లభ్యమైందీ లేనిదియు తెలిసికోగలమని భావం.

13. **'డబ్బఱలు పల్కు వారి కడ్డంబు గలదె?' (కాశీ 4.96):-** చెడును మాటాడు వారి కడ్డమేమి కలదని అర్థం. వారి నోటికి వచ్చినట్లెల్ల మాటాడుతారే కాని సత్యా సత్యాలను పరికించరు. ఇది లోక సహజం. లోకం చెడును మాట్లాడినంతగా మంచిని గూర్చి మాట్లాడదు. లోకులు పలుగాకులని వాడుక.

14. **'తల్లి బడి కొల్లి చట్టంచునుల్లసంబు లాడుదురు' (కాశీ 4.96):-** తల్లివలెనే కొల్లి చెట్టూ ఉంటుంది. అంటే మొదటి పుట్టిన చెట్టు ఏ రూపంలో ఉంటుందో, దాని నుండి పుట్టిన చెట్టునూ అట్లే ఉంటుంది. లోకంలో ప్రాయికంగా తల్లిపోలికలు గల బిడ్డలకు, తల్లి యొక్క గుణాలే వస్తాయని భావం. తల్లి బడి అంటే తల్లి విధంగా కొల్లి చట్టు అంటే కొల్లి బండ. కొల్లి చెట్టుకు సంబంధించిన బండ మారదని అర్థం. ప్రస్తుత సందర్భంలో గుణనిధి దుర్గుణాలను బట్టి ఆతని 'తల్లిని బట్టి కొడుకని' తన్ను కూడా అంటారని వాపోతుంది.

15. **'తాత కట్టిన చెఱువంచు(దగు నెమును(గ' (కాశీ 6.294):-** తాతలు కట్టిన చెఱువైనా దాంట్లో మునిగితే చావటం యదార్థం. చచ్చినా చెఱువు మాదేయని దాంట్లోనే మునుగు తాననే వాడు ఒట్టి మూర్ఖుడు. కాబట్టి స్వజనుల నుండి వచ్చిన కీడు కీడు కాదనటం తగదు.

'తాతస్య కూపోయమితి బ్రువాణాః
క్షారం జలం కాపురుషాః పిబంతి' అనేది పై దానికి సరైన సంస్కృత లోకోక్తి.

16. **తారు గల్గిన (బదివేలు దమకు(గలవు' (శృ॥నై॥ 7.81):-** తమ క్షేమమే తమకు కావల్సిందని కొందరు భావిస్తారు. తన కొరకే లోకం అనుకునే వారున్నారు. తామున్ననే లోకం గాని తమకు గాని లోకం నాశనమైనను చలింపరు. వారిది స్వార్ధ బుద్ధి. తమ పనే తమకు పదివేలు. తాము బతికి ఉంటే వెయ్యి విధాలుగా కీర్తిని సంపాదించుకోవచ్చు.

17. **'దేశ భాషలందు తెలుగు లెస్స' (క్రీడా॥ 37):-** సర్వ భారతీయ భాషల యందూ తెలుగే శ్రేష్ఠమగు భాష అని చెప్పటం. తెలుగు అజంత భాష అవటంచే ఎక్కువ మధురంగా ఉండటం సర్వజనులకు తెలిసిందే. అన్ని భాషల వారికిని తమ భాష చక్కని భాష అనిపించును. ఎవరి బిడ్డ వారికి ముద్దు గదా!

18. **'ధర్మ సాధనములందు నాద్యమగు సాధనంబు దేహంబు కాదె' (హర 4.18):-** 'శరీర మాద్యంఖలు ధర్మ సాధనమ్' - అనే సంస్కృత లోకోక్తి మూలం. శరీరముండటం వల్ల సర్వధర్మ కార్యాలను నెఱవేరుస్తున్నాం. అది లేనిదే ధర్మ కార్య నిర్వహణ యొక్క ప్రసక్తియే రాదు. కాబట్ట ధర్మ సాధనానికి నిశ్చయంగా శరీరమే మొదటి సాధనమవుతుందని అర్థం.

19. **'నరికితే జలములు నడిమికి తెగవు' (ప॥వి॥ 68):-** నీటిని మధ్యకు కత్తితో నరికినా అది వెంటనే కలిసిపోతుంది. అట్లే సంబంధ బాంధవ్యాలు త్రెంచుకోవడం కష్టం. నీళ్ళను నరికిన నడిమికి తెగవు గదా!

20. **'నిండు బండికింజేట భరంబే' (శృ॥నై॥ 7.76):-** పూర్తిగా నిండిన బండికి నొక చేట అధిక భారం కానేరదు. అట్లాగే ఎన్నిటినో అనుభవించే వాడు మరొక్క దాన్ని అనుభవింపగలడు. చాల బాధ్యతలున్న వారికి మరొక్క బాధ్యత వచ్చుట కష్టమనిపించదు. కాని సామాన్యంగా ఈ అర్థంలో వాడుకలో లేదు. నిండు బండికి చేట బరువా? అనేది గాక నిండిన బండికి చేట బరువు అనియే భావం. బరువుచే కృంగిపోతున్న వానికి చిన్నదైనను ఒక్కొక్క బరువు పూర్తిగా క్రుంగదీయగలదని అర్థం.

21. **'నిఱుపేదయభాగ్యత(దలు**

**పిలియు(గ నిడుగాక చొర(గనిచ్చునెదానిన్' (శృ॥నై॥ 4.72):-** భాగ్య దేవత తన ఇంటికి వచ్చినా నిర్భాగ్యుడు తన ఇంటి తలుపు లోనికి పోవటానికి వీలులేకుండా ఇఱుకగునట్లుగా గట్టిగా మూసి ఉంచునే గాని ఆహ్వానింపలేడు. అది యాతని దౌర్భాగ్యం. అట్టి అతన్ని బాగు చేయగల వారు లేరు. సిరిరా మోకాలొడ్డు వాడు అని వాడుక.

22. **'పాణి యాహార కబళంబు(బాఱవైచి**

**కూర్పరము నాకు పిసవెఱ్ఱికూళవోలె' (కాశీ 2.110):-** చేతిలోని ఆహారాన్ని బుద్ధి పూర్వకంగా పారవైచి, మోచేతిని నాకే వాడు వెఱ్ఱివాడని అర్థం. తనకు లభ్యమైన ఆహారాన్ని విసర్జించి దానికై ప్రాకులాడు వాడు వట్టి అవివేకి. కాబట్టి స్వయం కృతాపరాధానికి వగచి ప్రయోజనం లేదని భావం.

23. **పువ్వు ముడిచిన పురవీథి భూమి యందు**

**గట్టె మోవంగ వలసిన కారణమున' (భీమ 2.10):-** పువ్వులు ముడిచి, విలాసంగా సంచరించిన వీథులందే కట్టెలమ్ముకొను నికృష్ట జీవనాన్ని వహించటం కష్టాన్ని కల్గిస్తుంది. జీవితం తారుమారైన కారణాన ఇలాంటివి సంభవిస్తాయి. ఉచ్చ జీవనాన్ని గడిపిన చోటనే నీచంగా జీవించటం కష్టం.

24. **పెసర గింజకుఁ దక్కువే పెసర గింజ' (కాశీ 6.296):-** స్థూలంగా చూస్తే సజాతీయులొకరి కొకరు తీసిపోరని భావం. పెసరగింజ చిన్నది. పై పెచ్చు విలువ తక్కువ. అన్నిట ఆ పెసర గింజ తత్తుల్యమైన మరొక పెసర గింజకు తీసిపోవదు. అట్లే యొక జాతి వారిలో నున్న తరతమ భేదాలు గణింపరాదు. పెసర గింజ పోలిక వల్ల 'కొఱగాని' అనే అర్థాన్ని స్ఫురింప చేస్తున్నది.

25. **'బొంది తోడ కైలాసమున కరిగెదవు' (కాశీ 6.90):-** బొంది తోడన కైలాసానికి వెళ్ళటం దుస్సాధ్యము. తనువు త్యజిస్తేనే కైలాసానికి వెళ్ళటం సాధ్యం కావచ్చు. కాని అట్టి కార్యమునైనను చేయగల్గెదవనుట. శైవులకు కైలాసం పరమ లోకం ఇక్కడ సందర్భం కుదిరింది. కాని దుస్సాధ్యమును సాధ్యం చేయ ప్రయత్నించటం అవివేకం.

26. **'మనుజుడొక్కటిఁ దలంప దైవ మొక్కటి తలఁచు' (కాశీ 2.103):-** మానవుని ఊహను బట్టే సర్వమూ జరగదని భావం. అనాగత విషయములనన్నింటినూహింప గల శక్తి గాని, నిర్ణయింప గల శక్త గాని మానవునకు లేదని దీని యర్థం. మానవుని తలఁపు కంటె దైవ నిర్ణయం వేఱనుటను సూచిస్తున్నది. తానొకటి తలిస్తే దైవ మొకటి తలుస్తాడు. అని లోక వ్యవహారంలో ప్రచారం కలదు.

27. **'ముగురం గూర్చిన ముండ దైవమునకు నోమ్మోట లేదో సుమీ' (భీమ 3.6):-** దౌర్భాగ్యం కలవారు ఒకే చోట కలిస్తే ఇట్టి లోకోక్తినే ప్రయోగిస్తారు. దైవ వైపరీత్యమున, మనమిక్కడకు చేరాం అనే విషయాన్ని చెప్పేటప్పుడు విశేషంగా దీన్ని వాడతారు. ముగ్గురే కాక అనేకులు చేరిన చోటైనను వాడుక. దీనికి సజాతీయమైన సంస్కృతంలో 'మూడో మూర్ఖోగార్థభశ్చైక రాశిః' అనే సూక్తి ఇంది.

28. **'రత్నం బొరునిచే నన్వేషింపఁబడుఁగాని యొరునన్వేషించునే' (హర 4.24):-** రత్నాన్ని వెదుక్కుంటూ, రత్నం కావలసిన వారు రావాలే గానీ, రత్నం వారికై వెతుకుతూ పోదు. అట్లే శ్రేష్ఠులను వెదుకుతూ సామాన్యులు రావాలే గానీ, శ్రేష్ఠులే తమను గూర్చి చెప్పుకుంటూ ఇతరుల వద్దకు పోరు. 'నరత్నమ న్విష్యతి మృగ్యతే హితత్' అనే సంస్కృత సూక్తి పై లోకోక్తికి మూలమై ఉంది. కవి స్వతంత్రంగా నిర్మించిందే కానీ జన వ్యవహారం నుండి కావ్యంలోకి వచ్చినట్లు లేదు.

29. **'సంబంధంబు సాప్తప దీనంబు' (హర 4.22):-** 'సఖ్యం సాప్తపదీనమ్' అనే సంస్కృత లోకోక్తి దీనికి మూలం. శ్రీనాథుడు సంస్కృతంలో ప్రయోగించిన దాన్ని యథాతథంగా అనువదించాడు. ఏడు మాటలు కలిసి మాట్లాడినా, ఏడడుగులు కలిసి నడిచినా స్నేహం కలుగుతుందని భావం. కొంచెం సేపు మాట్లాడినా, నడచినా ఒకరి నొకరు అర్థం చేసికొని స్నిగ్ధులవుతారు. ఏడడుగులు కలిసి వేయు వైవాహిక కర్మ సప్తపదిని బట్టియు నిది ఏర్పడి ఉండవచ్చును.

30. **సన్నెకల్దాఁచిన పెండ్లి మానునొక' (కాశీ 5.31):-** అప్రధానమైన విషయాలకై ప్రధాన విషయాలు ఆగిపోవు అని భావం. వివాహంలో సన్నెకంటిని త్రొక్కించు ఆచారాన్ని బట్టి ఈ లోకోక్తి ఏర్పడింది. కాని సన్నెకంటిని త్రొక్కించటం లేకపోయినా వివాహం ఆగదు. అది వైదిక కర్మ కాదు.

ఇలాంటి లోకోక్తులు శ్రీనాథుని కావ్యాల నిండా ఉన్నాయి. అందు వివరణాపేక్షలేని కొన్నింటిని ఉదాహరిస్తాను.

1. అడుసు లోపలఁదాటి పండదిమినట్టుల దుముదునే (కాశీ 1.114)
2. పగ వారి పగ వారు చుట్టలగుట (కాశీ 5.293)
3. దయ్యము నెత్తి కోలుతుది దాఁకఁగ (హర 2.26)
4. పుల్కడు గంబడ్డ నిశాతఖడ్గము క్రియంగన్పెట్టె (హర 2.26)
5. అవంతియే కంచి నీకు నడుగామడయే (హర 2.64)

6. పాలలోఁబడిన బల్లుల కైవడి (హర 3.15)
7. విష వృక్షమేనియు వృద్ధి బొందగాఁజేసి
తనకు తాఁబెఱుకుట తగవు కాదు (హర 3.18)
8. వధ్యాది వియంగఁబాతిన వాఁడి కొఱ్ఱు
యూపస త్క్రియకర్హమైయున్న చెపుమ (హర 4.131)
9. నీరుడప్పికి నేయునుంబోలె (హర 7.127)
10. వారకాంతా జనములకు వావిగలదె (హర 7.128)

## 16.2.6 సంస్కృత లోకోక్తులకు వివరణ:-

శ్రీనాథుడు తెలుగు లోకోక్తులనే కాక సంస్కృత లోకోక్తులను కూడ తన రచనల్లో యథాతథంగా స్వీకరించాడు. మచ్చునకు కొన్నింటిని ఇక్కడ వివరిస్తాను.

1. **'ఆత్మవత్సర్వ భూతాని' (శృ॥నై॥ 4.33):-** తన్ను చూచుకొన్నట్లే సర్వ జీవులను చూచుకొనుట శ్రేష్ఠమను నీతిని సూచిస్తున్నది. తనలాగానే సర్వభూతాలు అని భావం.
2. **'జీవన్ భద్రాణి పశ్యతి' (హర 2.78):-** బ్రతికి ఉన్నా శుభాలను పొందవచ్చని దీని అర్థం. శుభాలను పొందుట జీవించు వారికే గాని, చనిపోయిన వారికి కలుగనేరవు గదా!
3. **'పరోపకారార్థమిదం శరీరమ్' (హర 2.79):-** నీ శరీరం ఇతరుల ఉపయోగార్థమే కాని స్వార్థం కొరకు కాదు. నిస్వార్థ సేవ యందు సర్వస్వాన్ని సమర్పణ చేయాలనే నీతిని వెల్లడిస్తున్నది.

మొత్తం పైన శ్రీనాథుడు తన కాలంలో మరుగునబడి, జన వ్యవహారంలో నున్న లోకోక్తులను కొన్నింటిని సంస్కృతం లోకోక్తులను యథాతథంగా గ్రహించి మరికొన్నింటిని సేకరించి తీయని తెలుగు పలుకుబడితో కూడి యర్థ స్ఫూర్తి కలిగి సందర్భానికి అతికినటుల సరిపోయేటట్లుగా వాడి తన మెలకువను చూపినాడు.

## 16.2.7 ప్రశ్నలు:-

1. శ్రీనాథుని భాషలో కాననగు నుడికారాన్ని సోదాహరణంగా వివరించండి?
2. శ్రీనాథుడు ప్రయోగించిన లోకోక్తులను సోదాహరణంగా వివరించండి?

## 16.2.8 ఆధార గ్రంథాలు:-

1. తెలుగు సామెతలు - విశ్వనాథ సత్యనారాయణ
2. వ్యాస పూర్ణిమ - ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి
3. తెలుగు సాహిత్యము నందలి లోకోక్తులు - ఆచార్య చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి
4. పదబంధ పారిజాతము - ప్రసం॥ నార్ల వెంకటేశ్వరరావు

**- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి**